# శ్రీరామానుజ దివ్య వైభవము

(జీవిత చరిత్ర - విశిష్టాద్వైత దర్శనము)

గ్రంథకర్త

**తిరువాయిపాటి రాఘవయ్య**

ప్రచురణ

**కార్యనిర్వహణాధికారి**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2007**

# SRI RAMANUJA DIVYA VAIBHAVAMU

By
TIRUVAYIPATI RAGHAVAIAH

Edited By
E.A. SINGARACHARYULU

T.T.D. Religious Publications Series No. 637

© All Rights Reserved

First Edition : 2004
Re-print : 2007

Copies : 5,000

*Published by*
**Sri K.V.RAMANACHARI, I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanam
Tirupati — 517 507.

Art:
G. Chandrasekhar

**Printed at**
**Tirumala Tirupati Devasthanams Press,**
**Tirupati - 517 507.**

# ముందుమాట

హైందవ సమాజ పునరుద్ధరణకు, విశిష్టాద్వైత సిద్ధాంతవ్యాప్తికి ఇతోధికంగా కృషిచేసిన వారిలో అగ్రగణ్యులు భగవద్రామానుజాచార్యులవారు. సంఘంలో వేళ్లూనుకున్న అస్పృశ్యత వంటి దురాచారాలను నిర్మూలించారు. సంఘ సంస్కర్తగా, మతప్రవక్తగా నిలిచి ప్రజలకు సన్మార్గాన్ని బోధించి సమాజాన్ని చైతన్యవంతం చేశారు. భగవంతుని సేవించేందుకు కుల మత వర్గ రహితంగా సర్వులు సరిసమానులని చాటిన మహనీయులువారు.

శ్రీరంగంలోని శ్రీరంగనాథుని ఆలయంతోను, కాంచీపురంలోని శ్రీవరదరాజ స్వామి ఆలయాలతో, తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంతోను రామానుజులవారి చరిత్ర ముడిపడి వుందనటంలో ఏ మాత్రం అతిశయోక్తిలేదు. ముఖ్యంగా శ్రీరామానుజులు తిరుమలను దర్శించినపుడు ఆనాటి శైవ వైష్ణవ ఘర్షణలను పరిష్కరించడమేగాక చారిత్రకాధారపూర్వకంగా తిరుమలేశుడు విష్ణుమూర్తి అని రుజువుచేసి స్వయంగా శ్రీ వేంకటేశ్వరుని విగ్రహానికి శంఖచక్రాదులను అలంకరించి సాక్షాత్తు తిరుమలేశునికే గురుస్థానం అలంకరించడమేగాక, శ్రీవారి ఆలయ వ్యవస్థలోనే శాశ్వతమైన ప్రధాన స్థానాన్ని పొందారు. అలాగే తిరుపతి గోవిందరాజస్వామి దేవాలయాన్ని పునరుద్ధరించి స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

ప్రస్తుత గ్రంథమునందు రామానుజాచార్యులవారి జీవితంలో జరిగిన వివిధ ఘట్టాలను, సందర్భానుగుణంగా వివరించడంతోబాటు చక్కని ఉపదేశాలను సందేశాలను ఇంకా మరెన్నో విశేషాలు తెలుసుకోదగినవి వున్నాయి.

తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆధ్యాత్మిక గ్రంథ పరంపరలో భాగంగా వెలువడుతున్న శ్రీరామానుజుల దివ్య వైభవాన్ని అందరూ గుర్తించాలనీ, సమాజశ్రేయస్సుకోసం పాటుబడిన ఈ మహనీయుని చరిత్రను ప్రతి ఒక్కరు పఠించాలనీ మా ఆకాంక్ష. అనతి కాలంలోనే ఈ గ్రంథ ప్రతులు చెల్లిపోయినందున పునర్ముద్రిస్తున్నాం.

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

# ఉపోద్ఘాతము

"శ్రీరామానుజ దివ్యవైభవము" అను గ్రంథమున, శ్రీమద్రామానుజాచార్యుల వారి జీవిత చరిత్రలో సమ్మేళన పరుపబడి, వారు ప్రబోధించిన విశిష్టాద్వైత సిద్ధాంత సౌరభమును, వారి సంఘ సంస్కరణ తత్త్వమును, వర్ణింపబడినవి. భక్తులు, సామాన్య ప్రజానీకము ఈ ప్రవక్త గావించిన బోధామృతమును గ్రోలి, సత్య మార్గము నన్వేషింప వలయుననెడి ఆకాంక్షతోనే, నేను ఈ గ్రంథమును వ్రాసితిని. అందువలన ఇది ఒక జీవిత చరిత్ర, ఒక దర్శనము అగును.

దక్షిణ భారతమున జన్మించి, ప్రపంచ ఖ్యాతి నార్జించిన ఆచార్య త్రయములో శ్రీమద్రామానుజాచార్యులొకరు. వీరు కేవలము మత ప్రవక్తలేగాక, ప్రబల సంఘ సంస్కర్తయు, దయాసింధుడును అయి ప్రవర్తిల్లెను.

హిందూసంఘం మహావృక్షమున కంటియున్న కులతత్త్వమను చీడపురుగును శ్రీరామానుజుడు తుదముట్టింప దలచెను. వారు వర్ణభేదములను, అస్పృశ్యత దురాచారమును ఎంతగానో నిరసించిరి. విశిష్టాద్వైత దర్శనము ద్వారా ప్రజలకు సత్యమును బోధింపదలచిరి. పంచము లనబడు వారితో సహా సర్వమానవులు - భగవచ్ఛక్తి సర్వ వ్యాపితమయినదని విశ్వసించి ప్రవర్తించు వారెల్లరును - శ్రీ వైష్ణవులని రామానుజుడు వక్కాణించెను; బహిరంగముగా బాహాటముగా ప్రకటించెను. మానవులందరు సోదరభావమున, జీవకారుణ్య భావమున సానుభూతితో జీవింపవలయునని రామానుజాచార్యులు బోధించిరి.

శ్రీమద్రామానుజాచార్యుల వారిని గూర్చి అనేక గ్రంథరాజములు ఇప్పటికి వెలువడియున్నవి. వారి దివ్య సందేశమును వారి జీవిత చరిత్రము ద్వారా వెల్లడింప దలచి, ఈ గ్రంథమును రచించినాడను. రామానుజుని ప్రబోధించి ఉత్తేజపరచిన ద్వాదశాళ్వారుల దివ్య చరిత్రమును గూడా క్లుప్తముగా ఇందు పొందుపరచినాను.

అవసరమైన గీతా ప్రబోధవిషయములకుగాను, భగవద్గీత నుండి కొన్ని శ్లోకములను, నిత్యాను సంధానము నుండి కొన్ని శ్లోకములను గ్రహించి, యిందు ఉచిత స్థలములందు బేర్కొనియున్నాను ఇక్కతమున నీ గ్రంథము ఆధ్యాత్మిక విశిష్టాద్వైత సిద్ధాంత సౌరభమును సూక్ష్మముగా సూటిగా వెదజల్లుచుండును.

పుణ్యక్షేత్రములను, భగవదాలయములను దర్శించు భక్తులు ఇట్టి గ్రంథముల జదివి, సత్యమార్గము నన్వేషించి, సత్యమును గ్రహింపవలయునని నా కోరిక.

ఈ గ్రంథమున వర్ణింపబడిన ఘట్టములన్నియు చరిత్రకు సంబంధించినవి; మూఢవిశ్వాసములకు, మూఢాచారములకు ఈ గ్రంథమున తావివ్వలేదు. ప్రజానీకము రామానుజమత సత్యము నెరుంగ వలయునని యీ రచన యొక్క ఉద్దేశము.

విషయగ్రాహ్యమే ప్రధానమని భావించినవాడనై, యీ గ్రంథ రచనమునందు సాధ్యమైనంతవరకు సులభపదజాలమునే వాడితిని; దార్శనిక విషయ రచనము గావున, కొన్నియెడల సాంకేతిక, సంస్కృత పారిభాషిక పదముల నుపయోగించుట అనివార్యమైనది; పద సంధులను, శకట లఘురేఫ భేదములను పాటింపలేదు; పాఠకులు ఈ భాషా విషయముల గమనింప ప్రార్థన.

శ్రీరామానుజాచార్యులవారి జీవిత చరిత్రము కాంచీపుర శ్రీ వరదరాజస్వామితో, శ్రీరంగనాథుడు శ్రీరంగనాయకిలతో, తిరుమలేశ్వరుడు శ్రీ వేంకటేశ్వరునితో ముడివడి యున్నది. ప్రసుత్త మిచట శ్రీరామానుజునకు తిరుమల తిరుపతులకును గల సంబంధమును గుర్తుకు దెచ్చుట అవసరము. శ్రీరామానుజుని మేనమామగారు శ్రీశైలపూర్ణుడు తిరుమలనంబి యను తిరునామమున తిరుమలపై వాసము చేయుకాలమున, రామానుజుడు తన యౌవన దశయందు మేనమామ వద్ద విశిష్టాద్వైత సిద్ధాంతపరముగా శ్రీమద్వాల్మీకి రామాయణము పఠించెను; తరువాత కొలది

సంవత్సరములకు శ్రీరంగ విశిష్టాద్వైత మఠాధిపత్యమును స్వీకరించి దిగ్విజయయాత్రగావించి, తిరిగి శ్రీరంగము చేరు సందర్భమున శ్రీరామానుజుడు తిరుమలను దర్శించి, అప్పుడు నారాయణవన ప్రభువయిన యాదవరాయల సమక్షమున, శైవుల వైష్ణవుల మధ్య చెలరేగియున్న మతకలహములను పరిష్కరించి, చారిత్రికాధారముల ప్రకారము తిరుమలేశుడు విష్ణుమూర్తి యని ఋజువుజేసి, అందర మెప్పించి, రామానుజుడాపై తిరుమలేశునకు శంఖచక్రముల నొసంగి, స్వామి విగ్రహమునకు ఊర్ధ్వపుండ్రముల నలంకరింపజేసి, తిరుమలేశుడయిన శ్రీ వేంకటేశ్వరుని ఉపాయ అభయ హస్తములతో చరమ శ్లోకార్థ ప్రదాతగా (తిరుమంత్రార్థ - ద్వయమంత్రార్థ ప్రదాతగా) నేర్పరచిరి. మూడవ పర్యాయముగా కులోత్తుంగచోళుని (క్రిమికంఠ చోళుని, వైష్ణవ దేవాలయ విధ్వంసకుని) మరణానంతరము రామానుజుడు తిరుపతికేతెంచి, చోళరాజుచే శిథిలము గావింపబడిన గోవిందరాజస్వామి దేవాలయమును పునరుద్ధరింపజేసి స్వామి విగ్రహమును ప్రతిష్ఠించి, దానికి తిల్య గోవిందరాజస్వామి అను నామకరణము గావించినాడు.

ఈ కారణత్రయముచే శ్రీరామానుజాచార్యులవారు ప్రబోధించిన విశిష్టాద్వైత సిద్ధాంతమునకును, తిరుమలేశుడైన శ్రీ వేంకటేశ్వరునకును గల సంబంధమును భక్తులు తెలిసికొనగలందులకై నేనీ గ్రంథమును రచింపబూనితిని.

మా తల్లిదండ్రులు తిరువాయిపాటి లక్ష్మమ్మ, తిరువేంగళయ్య గారలు విశిష్టాద్వైత మతావలంబకులు, శ్రీ వైష్ణవులై యుండి, శ్రీ వేంకటేశ్వరుని యెడ భక్తిప్రపత్తులు గలవారై యుండి జీవయాత్ర గావించిన వారుగాన, వారి ప్రీత్యర్థము, మాతాపితలపై నాకున్న సహజ ప్రేమ భక్తి భావములను పురస్కరించుకొని, యీ గ్రంథమును, విశ్వప్రభువును, మా యిలువేల్పును, అయిన తిరుమలేశుడు శ్రీ వేంకటేశ్వరునకు భక్తిప్రపత్తులతో అంకితము గావించి, కృతకృత్యుడ నైతినని వినయపూర్వకముగా భావించుచున్నాను.

విశిష్టాద్వైత సిద్ధాంతసారము సత్యజ్ఞాన జనితములైన భక్తి ప్రపత్తులు గావునను, గీతా చరమ శ్లోకమైన తిరుమంత్రమును (ద్వయ మంత్రమును) శరణాగతి తత్త్వమును ప్రబోధించును గావునను, ఈ తిరుమంత్ర ప్రబోధమునకు సాంకేతికముగా శ్రీ వేంకటేశ విగ్రహము భక్తులకు సాక్షాత్కరించి యున్నందునను, ఈ గ్రంథమును శ్రీ వేంకటేశ్వర స్వామికి అంకితమొనర్చుట యుచితమని నేను భక్తితో భావించితిని.

ఈ గ్రంథమును స్వామివారి ముద్రణాలయమున ముద్రింపించి, భక్తజనుల హస్తముల నీ పుస్తక ప్రతులు చేరునట్లొనర్చి, గ్రంథప్రతులు స్వామివారి గ్రంథ విక్రయశాలయందు విక్రయింపబడగా, లభ్యమగు మూల్యధనము శ్రీస్వామివారి నిధికి (ధనాగారమునకు) సంక్రమింప వలయుననెడిది నా వాంఛ.

నేనిదవరకే "ఆళ్వారుల దివ్య వైభవము" అను గ్రంథమును రచించి, స్వామికి అంకిత మొనర్చి, దాని సర్వస్వామ్యమును స్వామి వారికి భక్తితో అర్పించి యున్నాడను.

ఇట్లు

నెల్లూరు — భక్తాంఘ్రిరేణువు, భక్తజన విధేయుడు,

7-5-1977 — **టి. రాఘవయ్య**, ఎం.ఏ., బి.ఇడి.

రిటైర్డ్ ప్రిన్సిపాల్

15-212, బృందావనము

నెల్లూరు

# అనుక్రమణిక


పేజీ

1. శ్రీరామానుజాచార్య దివ్యజ్ఞానము ... 1
2. జననము - విద్యాభ్యాసము ... 8
3. ఆళ్వారుల - దివ్యవైభవము ... 23
4. తిరుమళిశైయాళ్వారు ... 31
5. కులశేఖరాళ్వారు ... 36
6. తొండరడిప్పొడి ఆళ్వారు ... 41
7. తిరుప్పాణ్ ఆళ్వారు ... 47
8. తిరుమంగై ఆళ్వారు ... 51
9. పెరియాళ్వారు, ఆండాళ్ ... 60
10. మధురకవి ఆళ్వారు, నమ్మాళ్వారు ... 71
11. శ్రీనాథముని, యామునాచార్యులు ... 81
12. కాంచీపురవాసము, యాదవప్రకాశునొద్ద విద్యాభ్యాసము ... 115
13. రామానుజుడు యామునాచార్యుని మార్గమునకు అంకితుడగుట ... 144
14. తిరుక్కచ్చినంబి, పెరియనంబి - ఉపదేశములు ... 154
15. సన్న్యాస స్వీకారము ... 169
16. రామానుజుడు ఆచార్యుడగుట ... 177
17. శ్రీరంగపురవాసము, తిరుమంత్రోపదేశము ... 183
18. తిరుమంత్ర వైభవము ... 199
19. వైష్ణవ విశిష్టాద్వైత మఠాధిపత్యము ... 205
20. గోవిందుని వృత్తాంతము ... 211

21. యజ్ఞమూర్తి వృత్తాంతము ... 220

22. దాశరథి వృత్తాంతము ... 228

23. ఉరంగావిల్లి వృత్తాంతము ... 235

24. శ్రీ వైష్ణవ జీవితాదర్శములు ... 242

25. తిరుపతి యాత్ర ... 263

26. తిల్య ... 281

27. శ్రీభాష్య రచనము ... 287

28. దిగ్విజయ యాత్ర - వివిధ సంఘటనలు ... 297

29. పరాశర, వ్యాసుల జననము ... 327

30. దక్షిణదేశ యాత్ర ... 331

31. కూరేశుని త్యాగము ... 339

32. సీమాంతరవాసము ... 353

33. కులోత్తుంగుని పశ్చాత్తాపము ... 367

34. పునరాగమనము ... 372

35. గోదాగ్రజుడు ... 381

36. రామానుజ జీవిత చరమాధ్యాయము ... 383

37. సర్వసంగ పరిత్యాగము ... 391

38. నిర్యాణము ... 396

39. శ్రీరామానుజ దివ్యసౌరభము ... 401

40. సింహావలోకనము ... 407

41. పరిసమాప్తము ... 412

# 1. శ్రీరామానుజాచార్య దివ్య జ్ఞానము

యతిరాజు శ్రీమద్రామానుజాచార్యుల దివ్య జీవితచరిత్ర, వారి ప్రతిభ ప్రతిజ్ఞలను గూర్చి విపులముగాను, సక్రమముగాను, సంపూర్ణముగాను తెలిసికొనుటకు ముందుగా ద్వాదశాళ్వారుల దివ్య వైభవ భక్తిప్రపత్తి భావముల గూర్చి ఉపోద్ఘాతముగా తెలిసికొనుట అవసరము. ఈ విషయము రామానుజ బాల్య జీవిత విద్యాభ్యాస సందర్భమున ఈ గ్రంథమున పేర్కొనబడియున్నది. అట్లే శ్రీరామానుజ సిద్ధాంత సౌరభము నాఘ్రాణించుటకు పూర్వము విశిష్టాద్వైత సిద్ధాంతమును గూర్చి శాస్త్రోక్తమ`గా గమనింపవలసి యున్నది.

వేదాంత దర్శనములో విశిష్టాద్వైతమొకటి. శ్రీరామానుజునకు పూర్వము శ్రీ శంకరాచార్యుల వారు వేదాంతము అద్వైతమును ప్రతిపాదించు చున్నదని వాదించెను. ఇందులకు ఆధారము "తత్త్వమసి" అను బ్రహ్మసూత్రము - తత్త్వమసి = అది నీవు, ఆ పరబ్రహ్మవే నీవు అని భావము - "అహం బ్రహ్మాస్మి = ఆ బ్రహ్మనే నేను - ఈ సిద్ధాంతమును వెల్లడించుచూ, శంకరుడు మాయా వాదమును స్వీకరించెను; పరబ్రహ్మ తప్ప తక్కినదంతయు మాయ, మిథ్య, అని బోధింప ప్రయత్నించెను. "కంటి కగపడు ప్రకృతి యంతయు మాయ" అని బోధించెను.

ఈ మాయావాదమున గమ్యస్థానము అవాఙ్మానసగోచర మయినది. కొందరికి అహంభావము హెచ్చినది. దీని ఫలితమున నైతిక భావము దెబ్బతినినది; వినయము అడుగంటు చుండెను; పండితుల మని చెప్పుకొనువారు మరింత గర్వపడజొచ్చిరి. మానవాళి శాంతియుత అభ్యుదయమునకు వినయము అను సుగుణము అవసరమని కొందరు తత్త్వవేత్తలు భావించిరి.

సర్వాంతర్యామి యగు ఈశ్వరశక్తి (వైష్ణవశక్తి) యొక్క అంశమే జీవము అయినను, ప్రమాణ ప్రభావములందు రెండును

సమానములు గావు; సారూప్యములయితే కావచ్చును. మహా సముద్రములో జలమున్నది; అదే నీరు మరియొక చిన్న గుంటలో నున్నది. జలము యొక్క గుణమున సామ్యతను చూడగలమేగాని, ఆ రెండును అనగా సముద్రము, గుంట, ప్రభావమున సమాన మెట్లవుతవి? వానికి విశిష్టగుణములున్నవి. అట్లే జీవాత్మ పరమాత్మ యొక్క అంశమయినను ఆ రెండును పరిమాణమున, ప్రభావమున సమానములు కావు. వారియొక్క అద్వైతమున్నను, వారి వారికి విశిష్ట గుణము లున్నవి. కావున విశిష్టాద్వైత సిద్ధాంతమును "జీవాత్మ పరమాత్మకు శరణాగతి కావలసిన స్థితి యున్నది" అని తెలుపబడినది.

శంకరుని తరువాత చాల కాలమునకు వెలసిన నాథముని, యామానాచార్యుల వంటి వైష్ణవమత స్థాపకులు అద్వైత సిద్ధాంతమును స్థూలముగా నంగీకరించిరేగాని, మాయావాదమును, బ్రహ్మ పరిణామ వాదమును ఖండించిరి.

"ఏకమే వాద్వితీయ" అను బ్రహ్మసూత్రము విశిష్టాద్వైత సిద్ధాంతమునకు మూలమయినది-ఏకమేవ+అద్వితీయం - అద్వితీయ మైనట్టియు, ఒక్కటే అయినట్టియు ఈశ్వరశక్తి సర్వాంతర్యామి శక్తి (అనగా వైష్ణవశక్తి) అని విశిష్టాద్వైతం వెల్లడి చేయుచున్నది. ఇట్టి సర్వాంతర్యామి అయిన ఈశ్వరశక్తికి మానవుడు శరణాగతుడై ఉండవలయునని ఈ విశిష్టాద్వైత సిద్ధాంతము యొక్క ఆదేశము.

క్రీ.శ. 824 సంవత్సరమున జన్మించిన శ్రీనాథమునుల వారు శ్రీరంగమున ప్రథమముగా వైష్ణవమతమును స్థాపింపగా, వారి మనుమడు (ఈశ్వరమునుల కుమారుడు) యామునాచార్యులు ప్రథమముగా శ్రీరంగమున విశిష్టాద్వైత మతమును స్థాపించి, తన అంత్యకాలమున శ్రీరామానుజుని (క్రీ.శ 1017-1137) విశిష్టాద్వైత ఆచార్యునిగా నియమించెను.

"సర్వాంతర్యామియు, అవాఙ్మానస గోచరమును అయినట్టి వైష్ణవ శక్తికి మూర్తిత్వమును ఆపాదించిన (భక్తుల కొరకు) యామునా

చార్యులు ఈశ్వరశక్తిని ఈశ్వరుడు, సగుణమూర్తి, సృష్టికర్త, సర్వ నియామకుడు, పరమాత్మ, సర్వశక్తియుతుడు, అనంత కల్యాణ గుణ పరిపూర్ణుడు, సర్వాంతర్యామి, సర్వోపగతుడు, విష్ణువు అని దెల్పెను. ఈ విరాట్స్వరూపమును సాంకేతికముగా శ్రీరంగనాథ విగ్రహమున నెలకొల్పిరి. శ్రీరంగనాథ విగ్రహమును సేవించుట అనగా విశ్వ జ్ఞానమును పొందుట యగును. ఉపాయ, అభయ హస్తములు గల శ్రీ వేంకటేశ్వర విగ్రహమును సేవించుట గీతా చరమ శ్లోకార్థమును గ్రహించినట్లగును. భగవచ్ఛక్తి త్రిభువన సుందరమును, సత్య సౌందర్య సుగుణమూర్తియు నగును. అందువలన సత్య సౌందర్య సుగుణ మూర్తిగా నున్న పురుషోత్తముడే దైవాంశ సంభూతుడు. ఆరాధ్యుడు - కావున సారస్వతమున తీర్చిదిద్దబడిన పురుషోత్తములు శ్రీరాముడు, శ్రీకృష్ణుడు ఆదర్శప్రాయులు. వారి గుణములు అనుసరణీయములు. గీతా చరమ శ్లోకము ఉపాయ, అభయముల చూపుచున్నది. స్వార్థ రహితుడవై విశ్వశక్తికి శరణాగతుడవగుము. ని న్నేపాపములు అంటవు- నీవు మోక్షమార్గమున నుందువు'', అని శ్రీరామానుజాచార్యులు బోధించిరి.

''కుల, భాషా భేదములు లేక సర్వులును సమానముగా భగవచ్ఛక్తిని ఆరాధింప వచ్చును. ఇది నమ్మాళ్వారుల సూక్తి. భగవచ్ఛక్తి సర్వాంతర్యామి అని తలంచు వానిని నేను శ్రీ వైష్ణవుడని పిలచెదను'', అని దయాసముద్రుడు రామానుజుడు సెలవిచ్చి యున్నాడు.

''విశ్వము తత్త్వత్రయముతో కూడినది - చిత్, అచిత్, ఈశ్వర అనునది తత్త్వత్రయము. ఈశ్వరశక్తి చిత్తునందును, అచిత్తునందును ఉన్నది. ఈశ్వరశక్తి చిత్, అచిత్‌లను ఆధారముగా చేసికొని యున్నది; చిత్, అచిత్ అనునవి ఈశ్వరశక్తిని ఆధారముగా జేసికొని యున్నవి. ఇట్లు ఈ తత్త్వత్రయమున విశిష్టమైన ఈశ్వరశక్తి విశిష్టముగా నెలకొని యున్నది. ఇది సత్యము, శాస్త్రీయము. ఈ సత్యమును బాగుగా నెరిగి మానవుడు మూఢవిశ్వాసములకు దూరముగా నుండి సత్యమార్గము ననుసరింపవలయును'', అని రామానుజుడు ప్రవచించుచున్నాడు.

"చిత్, అచిత్, ఈశ్వర అను ఈ మూడును సత్యములే, అనగా చిత్, అచిత్‌లతో గూడిన ప్రకృతియు, ఈశ్వరశక్తి యనబడు పురుష - యీ రెండును సత్యములే. మాయావాదమునకు స్థానము లేదు. ప్రకృతి లోని స్థితి మార్పును మిథ్య అనరాదు", అని శ్రీమద్రామానుజుడు ప్రకటించియున్నాడు.

"బుద్ధులు, ముక్తులు, నిత్యులు" అని జీవులు మూడు విధములు. సంసారమున చిక్కుకొని, పరమాత్మ విషయము నెరుగక. యెల్లపుడు వ్యసనముల యందే బంధింపబడిన వారు బద్ధులు. ప్రారంభమున బద్ధులుగా నుండియు, సంస్కార ఫలితముననుు, భక్తి ప్రపత్తులవలనను, సంసార వ్యసన బంధముల త్రెంచుకొని, మోక్ష భావమునకు వచ్చువారు ముక్తులు. బాల్యము నుండియు యే అపరాధముల నెరుగక, స్వాచార్యుని వలె సత్యము నెరిగి, వ్యసనము లలో బడక, యెల్లప్పుడు మోక్షభావమున నుండువారు నిత్యులు", అని భగవద్రామానుజుడు చేతనులకు దెల్పి వారి నుద్ధరింప బూనెను.

"మోక్షము పరమ పురుషార్థము. ఈ మోక్ష భావము స్వార్థరహితునకే లభ్యమగును. స్వార్థరాహిత్య భావమే మోక్షభావము. విశ్వశక్తికి శరణాగతి అయినవాడు మోక్షభావమున నుండును. స్వార్థ రహితుడై శరణాగతులైన మోక్షభావమున నుందురు", అని శ్రీరామానుజాచార్యులు ఉపాయ, అభయములను మానవాళికి జూపెను.

ఇట్టి దయాసముద్రుడైన రామానుజుడు కూరత్తాళ్వాన్ అను శిష్యభక్తునిచే ఈ విధముగా కీర్తింపబడినాడు:

శ్లో॥ యోనిత్యమచ్యుత పదాంబుజ యుగ్మరుక్మ ।
వ్యామోహత స్తదితరాణి తృణాయ మేనే ।
అస్మద్గురోర్భగవతో ఽస్య దయైక సింధోః ।
రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే ॥

"శాశ్వతుడయిన శ్రీమన్నారాయణుని దివ్యపాద ద్వయ మనెడి బంగారము మీదనే వ్యామోహము గలిగి, తదితరము లన్నిటిని గడ్డిపరక వలె భావించునట్టి కరుణాసముద్రుడును, భగవానుడును, మా ఆచార్యుడును అయిన శ్రీరామానుజుల పాదముల నాశ్రయించు చున్నాడను", అని భావము.

"భగవచ్ఛక్తికి శరణాగతి ననుష్ఠించుటకు స్థల, సమయ నియమములు గాని, జాతి లింగ భాషావయో విచక్షణలు గాని లేవు. అన్నిచోట్ల యందును, సర్వసమయములందును, సర్వులును ప్రపత్తి ధర్మము నవలంబింపవచ్చును", అని శ్రీరామానుజుడు వెల్లడించి యున్నాడు. ఇట్టి "ప్రపత్తి దర్శన మార్గము"ను నిరూపించుటకే దయాసాగరుడైన రామానుజుడు గద్యత్రయమును రచించి యున్నాడు.

శ్లో॥ యామునార్య సుధాంబోధి మవగాహ్య యథామతి ।
ఆదాయ భక్తియోగస్య రత్నం సందర్శయామ్యహమ్ ।

శ్లో॥ శారీరకే ఽపి భాష్యేయా గోపితా శరణాగతిః ।
అత్ర గద్యత్రయే వ్యక్తాం తాం విద్యాం ప్రణతో ఽస్మ్యహమ్ ॥

"యామునాచార్యులు రచించిన వాఙ్మయమునుండి భక్తి యోగమునకు సారభూతమైనట్టి యీ ప్రపత్తిని, ఈ శరణాగతి తత్త్వమును గ్రహించి, యీ జ్ఞానామృతమును గద్యత్రయమున ప్రదర్శించుచున్నాను. శరణాగతి తత్త్వము మహావిద్య, శ్రీభాష్యములో కొంతవరకు గూఢముగా తెల్పబడిన ప్రపత్తి యోగవిద్య ఈ గద్య త్రయమున మిక్కిలి స్పష్టముగా, సులువుగా, నిరూపింపబడినది. మోక్షదాయకమగు ఆ దివ్య విద్యకు ప్రణమిల్లుచున్నాను", అని రామానుజుడే పలికినాడు.

ఈ భక్తి ప్రపత్తి శరణాగతి యోగము పూర్వులచే గూఢముగా నుంచబడినది. ఈ యోగము భగవద్గీత యొక్క చరమ శ్లోకమున సూచింపబడియున్నది:

శ్లో॥ సర్వధర్మాన్ పరిత్యజ్య ।
మామేకం శరణం వ్రజ ।
అహం త్వా సర్వపాపేభ్యో ।
మోక్షయిష్యామి మాశుచః ॥

దీనిని చరమ శ్లోకమనియు, అష్టాక్షరీ భావ యుక్తమయిన దనియు, ప్రప్రథమున గ్రహించిన యామునాచార్యులు, వార్ధకమున దీనిని పరిశోధింపజేసి, ప్రచారము గావింపలేని కారణమున, రామానుజునకు దీనిని సూచింపజేసి పరమ పదించెను. పూర్వులచే గూఢముగా నుంచబడిన యీ దర్శనమును, ఈ గీతా చరమ శ్లోకార్థ జ్ఞాన రహస్యమును మోక్షసన్న్యాస తత్త్వమున లోకహితాసక్తుడును, కరుణాసాగరుడును అయిన రామానుజులు అందరకును తేటతెల్లము గావించి, ప్రబోధించినాడు. అందువలననే శ్రీమద్రామానుజుల వారు భక్తకోటిచే ఇట్లు కీర్తింపబడుచున్నారు:

శ్లో॥ ఏకైక పూరుష సురక్షిత వంశ రీత్యా ।
గుప్తా ప్రపత్తిపదవీపురుషైః పురాద్యైః ।
రామానుజస్తు పరయా దయయా దయాళుః ।
సీమామిమా మతియయౌ జగతాం హితాయ ॥

ఇట్టి జ్ఞానియు, దయాసముద్రుడును, ప్రవక్తయును అయిన శ్రీమద్రామానుజాచార్యుల పరోపకార జీవిత చరిత్రమును పఠించి, అవగాహన జేసికొని, ఆనందించి, ముక్తి మార్గమును బడయగలము.

రామానుజ మతమని ప్రసిద్ధిగాంచిన విశిష్టాద్వైత సిద్ధాంతము యొక్క సారాంశమేమనగా - తత్త్వత్రయ జ్ఞానముతో, సర్వభూత ప్రియత్వముతో, శరణాగతి తత్త్వమున విష్ణు సంశ్లేష భావముతో లోక కల్యాణార్థము కర్మఫల త్యాగమున జీవితయాత్ర గావించుట.

శరణాగతి భావము కర్మఫల త్యాగమును పెంపొందించుటకే, బౌద్ధము వెల్లడించు భూతదయ సారాంశమున నిదియే. క్రైస్తవమున

పశ్చాత్తాపము, శరణాగతి భావము, సేవా భావములు ముఖ్యముగా శిఖరాగ్ర సందేశము ఇవ్వబడియున్నది. "ఇస్లాం" అను పదము యొక్క భావమే శరణాగతి. ఇక నూతనముగా అధునాతనముగా ప్రచారములో నున్న సమతాభావమును కర్మఫల త్యాగముననే లీనమగును. కావున బాగుగా బోధింపబడినను కర్మఫల త్యాగమే నేరుగానో గూఢముగానో తెలుపబడినది. శ్రీరామానుజమతము యొక్క విశిష్టత, విశ్వమును శాస్త్రీయముగా అర్థము చేసికొనుచూ, మానవుడు శరణాగతి, స్వార్థరహిత సేవాభావమును కలిగియుండుటయే మోక్షభావమని, బాహాటముగా బిగ్గరగా ప్రకటించును.

# 2. జననము - విద్యాభ్యాసము

## ప్రథమ ఆధ్యాత్మిక గురువు తిరుక్కచ్చినంబి

ప్రసంత్త తమిళనాడు రాష్ట్రమునకు ముఖ్యపట్టణమైన చెన్నపట్టణమునకు దక్షిణమున సుమారు నలువది కిలోమీటర్ల దూరమున శ్రీ పెరుంబూదూరను గ్రామము కలదు. ఇది యొక పుణ్య క్షేత్రముగా భావింపబడుచున్నది. ఇందు చెన్నకేశవస్వామి దేవాలయ మున్నది. సమీపముననే శ్రీవిశిష్టాద్వైత సిద్ధాంత స్థాపకులు, ప్రవక్తలు అయిన శ్రీమద్రామానుజాచార్యుల వారి దేవస్థానమున్నది. శ్రీపెరుంబుదూరు గ్రామమే శ్రీరామానుజుని జన్మస్థానము. ఏ స్థలమున నతడు తల్లిగర్భము నుండి ప్రపంచమున బడెనో అదే స్థానమున శ్రీరామానుజుని పితృగృహస్థానముననే శ్రీరామానుజ దేవాలయము వెలయుచున్నది. ఈ దేవాలయ నిర్మాణముగాని, శ్రీరామానుజ దివ్య విగ్రహ ప్రతిష్ఠగాని, శ్రీమద్రామానుజాచార్యులు శ్రీరంగ క్షేత్రమున సజీవులుగా నున్నపుడే జరిగినది. జీవితకాలముననే అంతటి ఘనతకు నెక్కిన మహానుభావుడు రామానుజుడు.

రామానుజుని తలిదండ్రులు ఆసూరి కేశవాచార్యులు, కాంతిమతి అను దివ్య దంపతులు, ఈతని జన్మ వృత్తాంతము కూడా నొక పవిత్ర చరిత్ర.

సుమారు ఇప్పటికి వేయి సంవత్సరములకు పూర్వము శ్రీపెరుంబుదూరు నందు ఆసూరి కేశవాచార్యుడను బ్రాహ్మణోత్తము డుండెను. ఇతడు హరిత గోత్రీయుడు, మహాపండితుడు, విష్ణు భక్తుడు.

ఆ కాలమున శ్రీరంగక్షేత్రమున యామునాచార్యుడును మహనీయుడయిన వైష్ణవాచార్యుడు వైష్ణవ కులపతియై, విశిష్టాద్వైత మతమును స్థాపించి, ఆ మఠాధిపతిగా నుండి, శిష్యకోటికి ముక్తి మార్గము నుపదేశించుచుండెను. వీరి శిష్యులలో నొకరగు

శ్రీశైలపూర్ణుడు భాగవతోత్తము డనదగిన వాడుండెను. ఇతని కిరువురు సోదరీ రత్నములుండిరి. వీరికి వివాహములు జరుపు గురుతర బాధ్యత ఆయనమీద యుండెను. అందువలన సాధ్యమైనంత త్వరలో వారిరువురకు కల్యాణ మహోత్సవములు గావించి, తన శేష జీవితమును తిరుమల తిరుపతి స్థానమగు శ్రీశైలముపై భగవన్నామ సంకీర్తనము గావించుకొనుచూ, గడపి, తన జీవితమును సార్థకము జేసికొనవల యునని ఆయన ఉద్దేశ్యము.

తోబుట్టువులకు వివాహములు గావింప నిశ్చయించిన శ్రీశైలపూర్ణుడు తగిన వరుల నన్వేషించుచూ, శ్రీపెరుంబూదూరునకు వచ్చెను. ఆసూరి కేశవాచార్యుడు కులమున, గోత్రమున, పాండిత్యమున, నడవడి యందునను తన మొదటి చెల్లెలు కాంతిమతికి తగిన వరుడని తలంచి, కేశవుని తల్లిదండ్రులతో సంప్రదించి శుభ ముహూర్తమున కాంతిమతిని కేశవునకిచ్చి వివాహము గావించెను.

శ్రీపెరుంబుదూరునకు అనతి దూరమున అహరము అనునొక కుగ్రామముండెను. అందు కమలభట్టు అను బ్రాహ్మణ యువకునకు తన ద్వితీయ సోదరి దీప్తిమతి నిచ్చి పెండ్లి జేసెను. ఇట్లు శ్రీశైల పూర్ణుడు తన బాధ్యతను నెరవేర్చిన వాడై, కృతకృత్యుడ నయితినని సంతోషించి, సంతుష్టిపడి, తరువాత కొలది దినములకు శ్రీరంగ క్షేత్రముజేరి యామునాచార్యుల సన్నిధిని భగవదన్వేషణమున కాలము గడుపుచుండెను.

ఆసూరి కేశవాచార్యుడును, కాంతిమతియు, నూతన వధూ వరులుగా సంతోషమున సంసారము జేయుచుండిరి. కేశవాచార్యుడు అనేక క్రతువు లొనరించి యుండుటంజేసి అతనికి సర్వక్రతువనియు, సోమయాజి యనియు బిరుదనామము లొప్పియుండెను.

వివాహానంతరము సకాలమున సంతానము కలుగమింజేసి, ఆ పుణ్యదంపతులు సంతానప్రాప్తి కొరకు వేయి మ్రొక్కులిడిరి, వేయి నోములిడిరి. సోమయాజియగు కేశవాచార్యుడు పుత్ర ప్రాప్తికి

పుత్రకామేష్టి చేయ సంకల్పించెను; వైదికాచార నిరతుడుగాన పుత్రకామేష్టి యాగ ఫలితముగా పుత్ర సంతానమును పొందెదనను దృఢ విశ్వాసము ఆయనకు పొడమెను. ఈ యాగ నిర్వహణమునకు తగిన స్థలము బృందారణ్యమని కేశవాచార్యుడు తలంచెను. నేటి మద్రాసునగర సముద్రతీరమే నాటి బృందావనము. అందు తిరువల్లిక్కేణి అను పేరుగల సరోవర మొకటుండెను. ఈ సరోవర తీరమున శ్రీ పార్థసారథిస్వామి ఆలయముండెను. ప్రస్తుతము మద్రాసు నగరమున ట్రిప్లికేన్ అను ప్రాంతమున నున్న పార్థసారధి స్వామి ఆలయము పూర్వపు బృందావన ప్రాంతము. ఇప్పుడున్న కోనేరు నాటి సరోరాజము.

బృందావనమున సరోవరతీరమున శ్రీ పార్థసారథిస్వామి సన్నిధిన కేశవాచార్యుడు పత్నీసమేతుడై పుత్రకామేష్టి పూర్తి గావించెను. ఆ కాలమున వసతిగల బ్రాహ్మణ క్షత్రియ నూతన వధూవరులు పుత్ర ప్రాప్తికి పుత్రకామేష్టి గావించుట పరిపాటి.

కేశవాచార్యుని భార్య కాంతిమతి గర్భవతియై, నవమాసములు గడపి, చైత్ర మాసమున శుక్ల పక్షమున దశమ దినమున భానుడు కర్కటక రాశిని ప్రవేశించు లగ్నమున కుమారుని ప్రసవించెను. (1017 A.D.)

కాంతిమంతి సోదరి దీప్తిమతియు అదే మాసమున కుమారుని గనెను. మూడవ మాసమున అక్క కాంతిమతిని, ఆమె పుత్రుని చూచుటకును, తన కుమారుని అక్కకు జూపుటకును దీప్తిమతి శ్రీ పెరుంబుదూరుకు వచ్చెను. ఈ లోపలనే శ్రీరంగ క్షేత్ర నివాసియు, ఈ బిడ్డల మేనమామయు, పరమ భాగవతోత్తముడును, విశిష్టాద్వైత సిద్ధాంత ప్రతిపాదకుడు శ్రీ యామునాచార్య శిష్యుడును అగు శ్రీశైలపూర్ణుడు, మేనల్లుండ్రు జనించిరన్న శుభవార్త విని, వారి నామకరణ మహోత్సవముల గావించి, ఆశీర్వదించి పోవలయుననెడి సంకల్పముతో శ్రీపెరుంబుదూరున కేతెంచెను.

శ్రీశైలపూర్ణుడు కాంతిమతి కొమరుని గాంచి, వాని దివ్య తేజస్సునకు మురిసిపోయెను. సోదరి కాంతిమతితో, "అమ్మాయీ! నీ కుమారుని ముఖమున దైవత్వము వెల్లివిరిసి యున్నది. ఈతడు శ్రీరాముని సోదరుడు లక్ష్మణుడు జనించిన లగ్నమున బుట్టినవాడు, ఈతని జన్మము పరోపకారార్థమున సార్థకమగుగాక! అనంతుడైన ఆదిశేషుని అంశమున లక్ష్మణుడు జనించెనని రామాయణము పల్కుచున్నది. అనంతుడే కలియుగమున జన్మించి, అజ్ఞానులను మానవులకు తిరుమంత్రమును గరపి వారికి జ్ఞానోదయమును గలుగ జేయుననని పురాణములయందు గలదు. యతీంద్రుడయిన నమ్మాళ్వారును ఈ విధముననే ప్రవచించియున్నాడు. నీ కుమారుడు అనంతుని అంశము. శ్రీరామానుజుడగు లక్ష్మణుడుదయించిన రాశియందు నీ కుమారుడు జన్మించుటచే ఈతనికి రామానుజుడని నామకరణము చేయుట ఉచితమని భావించుచున్నాను. వీనిని రామానుజుడనుట ఉచితము", అని సంతోషమున నుడివెను.

శ్రీశైలపూర్ణుడు శ్రీపెరుంబుదూరున నుండగనే బాలుర కిరువురకు నామకరణ మహోత్సవములు కేశవాచార్యుడు జరిపించెను. కాంతిమతి కుమారునకు రామానుజుడనియు, దీప్తిమతి కుమారునకు గోవిందుడనియు నామకరణములు గావింపబడెను. శ్రీశైలపూర్ణుడు మేనళ్లుల నిద్దరిని ఆశీర్వదించెను.

జ్యోతిశ్శాస్త్రమును బాగుగా నెరిగిన శ్రీశైలపూర్ణుడు తన బావమరిది కేశవాచార్యునితో, "బిడ్డను జాగ్రత్తగా జూచుకొనుడు. ఇతడు దీర్ఘాయుష్మంతుడు. మహాప్రవక్తయగు లక్షణములు కన్పట్టుచున్నవి. దైవాంశ సంభూతుడు. ధర్మ సంస్థాపనార్థము దైవము నీకు పుత్రుడుగా జన్మించెనేమో అని భావించుచున్నాను", అని ఆలోచనా యుక్తముగా ననెను. తత్త్వజ్ఞానియు, కరుణాహృదయుడును అగు శ్రీశైలపూర్ణుడు బావమరిదితో వెండియు నిట్లనెను, "మానవులలో అజ్ఞానము ప్రబలుచున్నది. అహం బ్రహ్మాస్మి - అను ఉపనిషద్వాక్యమును

అపార్థము చేసికొనుచున్నారు. ఇది శోచనీయము! ఈ సూత్రమందలి దివ్య విషయమేమనగా - చేతనుడు తాను పరబ్రహ్మ అంశమని గ్రహించి, ఆ పరమాత్మవంటి నైర్మలమును, ఔన్నత్యమును పొంద వలయును. ఇందు శరణాగతి భావమున్నదేగాని, గర్వమునకు తావు లేదు. కాని యీ అర్థమును, ఈ భావమును వదలి తాము పరబ్రహ్మల మనియు, నీటిబిందువు తామరాకు నందున్నట్లు తాము శరీరమున నున్నామనియు, పాపములు వారినంట వనియు పండితులయిన మానవులు భావించుచున్నారు. వీరు అహంకారయుతులై, గర్వాంధ కారులై పండితులమని, శాస్త్రజ్ఞులమని, విదులమని చెప్పుకొను చున్నారు. వాస్తవముగా వీరు మోక్షమునకు దూరమగుచున్నారు. అజ్ఞానాంధకారమున నున్న మానవులను తరింపజేయుటకు శరణాగతి ప్రపత్తి యోగములను బోధించు భక్తుడైనట్టి ఆచార్యోత్తముడు ప్రస్తుత ప్రపంచమునకు అవసరమై యున్నాడు. అట్టి ఆచార్య లక్షణములు నీ కుమారుని నుదుట కన్పట్టుచున్నవి. ఇతడు ఆచంద్రతారార్క కీర్తిని పొందగల అంశమున జన్మించి యున్నాడు. శాశ్వత యశోసంపద వాస్తవముగా చక్రవర్తులకు లేదు, పండితులకు లేదు, మానవుల దివ్య మార్గమున నుద్ధరించిన వారికే గలదు. ఈ బిడ్డడు దివ్యకీర్తిని బడయ గలడని మంగళాశాసనము గావించుచున్నాను. ఈ విషయమును మనస్సున గుప్తముగా నుంచుకొని, బాలుని జాగ్రత్తగా పెంచుము'', అనెను.

బావగారి బంగారు పలుకుల విని కేశవాచార్యుడు పరమానంద భరితుడై పుత్త్రోత్సాహమును తన ఆత్మయందు పొందెను. తమ కుమారుని దివ్య జ్ఞానినిగా మలుపగలందులకు కేశవాచార్యుడును కాంతిమతియు దైవమును ప్రార్థించిరి.

చెల్లెంద్రతో, బావమరుదులతో, అర్భకులైన మేనల్లుంద్రతో కొలది దినములు సంతోషముగా శ్రీపెరుంబుదూరున కాలము గడపిన శ్రీశైలపూర్ణుడు తిరుగా శ్రీరంగము చేరెను. దీప్తిమతియు తన కుమారుని దీసికొని స్వగ్రామము జేరెను.

రామానుజుడు శుక్లపక్ష చంద్రునివలె ఆరోగ్యవంతుడై దినదిన ప్రవర్ధమానుడయ్యెను. అక్షరాభ్యాసము, ఉపనయనము మున్నగు వేదవిహిత సంస్కారము లన్నియును తండ్రి కేశవాచార్యుడు సకాలమున క్రమముగా కుమారునకు జరిపించెను. ఏకైక పుత్రుడయిన రామానుజుని తలిదండ్రులు అల్లారుముద్దుగా పెంచుచుండిరి. అందరు తలిదండ్రులవలెగాక వారి దృక్పథము వేరు. తన శరీర ప్రకృతి వలనను, ప్రకృతిశక్తుల సహకారముననను, రామానుజుడు శారీరకముగా సౌందర్య తేజోరాశియై బలిష్ఠుడుగా నుండెను. మానసికముగా మేధావిగా కన్పడుచుండెను. ఇట్టి కుమారునకు విద్యా సంపదను గరపవలయు నని తలిదండ్రుల కోరిక. కాంతిమతి విద్యా సుగంధరాశి; భక్తిపరురాలు. కేశవాచార్యుడు ఆధ్యాత్మిక విజ్ఞానమున గొప్ప పండితుడు. కుమారుని గొప్ప ఆధ్యాత్మిక తత్త్వవేత్తనుగా జేయవలయుననెడి కోరిక తలిదండ్రుల కుండెను. విద్యాభ్యాసము శ్రీపెరుంబుదూరులో వీలైనంతవరకు గొప్ప పండితుని వద్ద జరుగుచున్నను, వీలైనపుడెల్లను రామానుజుడు తన తల్లి యొద్ద బాల్యమునుండియు భాగవతుల కథలను వినుచుండు వాడు. తండ్రివద్ద నుండి ఆళ్వారాదుల యొక్కయు, పూర్వాచార్యుల యొక్కయు జీవిత కథలను తెలిసికొనుచుండెడివాడు.

బాల్యముననే రామానుజుని యౌన్నత్యమును తండ్రి గమనించు చునే యుండెను. బాల్యముననే గురువుల వారితో రామానుజుడు వేదాంతార్థములపై తర్కమునకు దిగువాడు. రామానుజుడు నిరుపమాన మేధావి; ఏకసంథాగ్రాహి. అక్షరాభ్యాసమయిన కొలది సంవత్సరముల కాలములోనే వేదశాస్త్ర పురాణములను వల్లెవేసెను. గురువు వేదాంతార్థములను వివరించుతరి, రామానుజుడు కొన్ని విశేషార్థములను సూచించువాడు. సహృదయుడగు ఆచార్యుడు రామానుజుని విశిష్ట జ్ఞానసపందకు అచ్చెరువంది, బాలుని ప్రశంసించు వాడు. ఈ విషయములు తెలిసికొనిన తండ్రి కుమారుని మనః కౌశలమునకు లోన ఆనందించుచు, పలుమారు బాలునితో నిట్లను వాడు, "నాయనా! గురువులతో తర్కమునకు దిగరాదు. నీ వయస్సున

నీవవశ్యము చేయదగినది గురువుల వారు చెప్పినదంతయు విని, గ్రహింపవలసినదే. తరువాత నిదానముగా వివరించుకొనవలయును. అపరిమిత జ్ఞాన సంపాదనానంతరమే తర్కమునకు దిగతగును. దీనికి విద్యయేగాక, వయస్సును, జీవితానుభవమును ఉండవలయును. ప్రథమముననే గురువులతో వాదించిన, వారు చీకాకు జెందుదురు; శిష్యునిపై అప్రియమును బొందుదురు; కుపితులగుటకును వీలున్నది. కావున వినయసంపన్నుడవై విషయ గ్రాహ్యముననే యుండ వలయును".

రామానుజుడది మొదలు పెద్దల యెడ నతి వినయ విధేయతలను ప్రదర్శించువాడు. ఈ వినయమే భవిష్యత్కాలమున తన శరణాగతి తత్త్వమునకు కారణమయినది.

రామానుజుని దివ్య తేజస్సు విషయమై తండ్రి కొక అనుభవము గలిగెనని కథ యొకటి గలదు. ఒకనాడుదయమున పది గంటలకు పైన తులసీదళముల దెచ్చుటకు రామానుజుడు తోటలోనికి పోయి, చాలాకాలమునకు తిరిగి ఇంటికిరానందున, తండ్రి వానిని పిలుచుకొని వచ్చుటకు తులసీవనమును ప్రవేశించెను. బాలుడేమి చేయుచూ కాలము గడుపుచున్నాడో పరికింప వలయుని చప్పుడు చేయకుండ తండ్రి తులసివనమున నటునిటు తిలకించుచుండెను. ఒకానొక తులసి వృక్షపుమూల భూమిపై రామానుజుడు శయనించి నిద్రించు చుండ, శేషుడు పడగవిప్పి బాలుని ముఖముపై సూర్యుని వేడి కిరణములు బడకుండ నుండునట్లు చేయుచుండెను. తటాలున ఈ అద్భుత భయానక దృశ్యమును గాంచిన తండ్రి భయమున కొయ్యబారి నిలుచుండెను. సద్దుజేసిన పుత్త్రున కేయపాయము సంభవించునో యని భయపడెను. కొలది నిముసములలో నాగము వెడలిపోయెను. మెల్లగా, జంకుచూ, తండ్రి కేశవాచార్యుడు కుమారుని సమీపించి, నిద్రనుండి లేపి, బాలుని ముఖ కమలముపై నున్న చిరుచెమట బిందువులను మెల్లగా తుడిచి, వానిని యింటికి గొంపోయెను. రహస్యముగా ఈ సంఘటనను అర్ధాంగి కాంతిమతి కెరింగించి,

ఆత్మజునకు ఉజ్జ్వల భవిష్యత్తుండగలదను విశ్వాసముతో ఆనందమును వ్యక్తము జేసెను. శేషుని నీడను అనుభవించిన మానవార్భకుడు మహర్దశను బొందుననెడి యొక విశ్వాసము హిందూ ప్రజానీకములో నున్నదిగదా!

భవిష్యత్కాలములో రామానుజుడు విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవక్తయై మానవావళికి గావించిన ఆధ్యాత్మిక సేవల దృష్ట్యా వారియొక్క శిష్యు డొకడు ఇట్లు వక్కాణించి యున్నాడు:

**శ్లో॥ యథావతారాన్ - మధురామురారే -**
**రామస్య సాకేత పురీచ యద్వత్ -**
**తథా యతీంద్రస్య - కృపాశ్రయస్య -**
**పుణ్యోత్తరా భూతపురీ బభూవ ॥**

శ్రీకృష్ణావతారముచే మధురానగరమును, శ్రీరామావతారముచే అయోధ్యానగరమును పుణ్యవంతమైనట్లు, శ్రీ యతిరాజ రామానుజుల వారి జన్మముచే భూతపురి (శ్రీపెరుంబూదూరు) పవిత్ర మయినది''.

రామానుజునకు పదునారేండ్లు నిండినవి. తండ్రి కేశవాచార్యుడు దగ్గరి బంధుత్వమునుండి రక్షకాంబ (మరియొక పేరు తంజమ్మ) అను నామమున నొప్పు కన్యను దెచ్చి, రామానుజునకు వివాహము గావించెను. ఆకాలమున ముఖ్యముగా బ్రాహ్మణ కులమున నతి బాల్య వివాహములు సహజముగా జరుగుచుండెడివి. వివాహమయి ఒక మాసము గడచెనో లేదో కేశవాచార్యుడు ఆకస్మికముగా జబ్బున బడి మరణించెను. ఈ విపత్తునకు తట్టుకొనలేక సాధ్వి కాంతిమతి భూమిపై బడి మూర్ఛిల్లెను. తన వైధవ్యమును తలచుకొని, కుమారుని యౌవనావస్థను తలచుకొని ఆమె పడిన మనోవ్యాకులత వర్ణనా తీతము. తుపానుకు నేల గూలిన మహావృక్షము వలె ఆమె క్రుంగిపోయెను. కుమారుడను ఆశాజ్యోతియే ఆమె ప్రాణజ్యోతిని నిలబెట్టెనని చెప్పవలసియున్నది. పసివాడైనను రామానుజుడు ధైర్యము దెచ్చుకొని తల్లిని ఓదార్చు చుండెడివాడు.

ఆత్మజుని జీవితమును తేజోమయము జేయ సంకల్పించియున్న కాంతిమతి, ధైర్యమును పుంజుకొన్నట్లు కన్పడుచూ, విద్యాభ్యాసమున కంతరాయము కలుగకుండునట్లు కుమారుని ప్రోత్సహించు చుండెడిది. స్వగ్రామమయిన శ్రీపెరంబూదూరులో నున్న పండితవర్యు నొద్ద రామానుజుడు విద్యాభ్యాసమును సాగించుచునే యుండెను. గృహకృత్యములందు తల్లికి సహకరించు వేళలలో తప్ప, నిద్రావేళల దప్ప, తన కాలకృత్యములు ఆహార వేళలయందు తప్ప, తక్కిన కాలము నంతటిని గ్రంథపఠనమునందే రామానుజుడు సద్విని యోగము చేయువాడు. అగ్నిజ్వాలలు ఎండుగడ్డిని దహించువేగమున, రామానుజుడు గ్రంథస్థ విషయములను పీల్చుకొనుచుండువాడు.

అప్పటికే, అనగా రామానుజుడు పదునారేండ్ల చిరుతప్రాయమున నున్నప్పుడే, శ్రీరంగమున విశిష్టాద్వైత మత స్థాపకుడును, శ్రీనాథ మునుల మనుమడును అగు యామునాచార్యులు అతి వైభవమయిన తన మత ప్రచారమును శిష్యకోటికి గావించుచుండెను. ఈ మహాను భావుని శిష్యకోటిలో మహామేధావులు, భక్తులు, జ్ఞాన వయోవృద్ధు లనేకులుండిరి. రామానుజుని మేనమామ శ్రీశైలపూర్ణుడు (తిరుమల నంబి) యామునాచార్యుని శిష్యుడు. తండ్రిని గోల్పోయిన రామానుజుని, భర్తను బాసిన తన సోదరి కాంతిమతిని, చూచి విచారించి, ఓదార్చి, ధైర్యము గొల్పుటకు శ్రీశైలపూర్ణుడు శ్రీపెరంబూదురునకు వచ్చెను.

"చెల్లీ! కాంతిమతీ! జరిగినది జరిగిపోయినది. వగచి లాభము లేదు. గతించినవారు తిరిగిరారు. ఇక పిల్లవాని యభివృద్ధియే నీ కర్తవ్యము. ఏపుగా నెదుగనున్న మొక్కకు నీరుపోసి రక్షించి, పెంచుము. నీవు స్థిరచిత్తమున, ధీరత్వమున, నీ కుమారుని విద్యాభ్యాసమున ప్రోత్సహింప వలసియున్నది. అతడు తేజోరాశి" అని శ్రీశైలనంబి సోదరి నోదార్చెను.

"రామానుజా! నీ జనకుడు పోయినను జగజ్జనకుడున్నాడు గదా! అతని ఆశీర్వాదమున, కృపవలన, నీ యాధ్యాత్మిక విద్యాసేకరణ

సులువుగా జరిగిపోగలదని నా దృఢ విశ్వాసము. నా మంగళా శాసనమును అయ్యదియే", అని మేనల్లుని బుజ్జగించి ప్రోత్సహించి నాడు శ్రీశైలపూర్ణుడు.

శ్రీశైలపూర్ణుడు తాను సోదరి యింటనున్న కొలది దినములలో రామానుజునకు యామునాచార్యుని విశిష్టాద్వైత సిద్ధాంత సారాంశమును, ఆళ్వారాదుల దివ్యవైభవమును, భక్తిప్రపత్తి మార్గములను గూర్చియు అనేక విషయములను క్లుప్తముగా స్థూలముగా నెరుక పరచెను. తాను ఆధ్యాత్మికవేత్తను గావలయుననియు, మానవాళికి సేవజేయ వలయుననియు రామానుజునియందు దృఢ సంకల్ప మేర్పడెను. వీలున్నప్పుడు మరలావచ్చి, చూచెద నని చెప్పి, శ్రీశైలపూర్ణుడు తిరుగ శ్రీరంగమునకు పోయెను.

(ఆళ్వారుల దివ్య వైభవమును, విశిష్టాద్వైత సిద్ధాంతమును ముడివడి యున్నవి. ఈ దివ్యజ్ఞాన రత్న ద్వయముతో శ్రీరామానుజాచార్య దివ్యజ్ఞానము పెనవేసికొని సంబంధపడి యున్నదని భక్తు లెరుగుదురు. విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవక్తయు ప్రచారకుడును అయిన శ్రీరామానుజాచార్యుడు బాల్య దశయందే క్లుప్తముగాను స్థూలముగాను ఆళ్వారుల దివ్యవైభవ శ్రవణము గావించిన గాథయు అతి మనోహరమైన విషయము).

తల్లి కాంతిమతి అతి వివేకవంతురాలు. ఆమె ఆధ్యాత్మిక చింతన గలిగిన జ్ఞాని. కొంతవరకు వైష్ణవభక్తి గ్రంథములను వల్లెవేసిన తల్లి. భక్తులైన భర్త కేశవాచార్యుడును, అన్నయైన శ్రీశైలపూర్ణుడును ఆమె ఆధ్యాత్మిక జ్ఞానమునకు కారకులు. తన కుమారు నెట్లయినను గొప్ప విద్వాంసునిగా, పండితునిగా, భక్తునిగా, తీర్చి దిద్దవలయునని ఆమె కోరిక. దైవకృపకు పాత్రురాలు యయిన భక్తురాలామె. అనాడు కాంచీపురము కీర్తిగన్న విద్యాపీఠము. కుమారుని విద్యాభివృద్ధికై సకాలములో సంసారమును కాంచీపురమునకు మార్చు సంకల్పమున కాంతిమతి యుండెను. ఆకాలమున కాంచీపురమున యాదవప్రకాశ యను పేరుగల అద్వైతసిద్ధాంతి కొంతమంది శిష్యులను జేర్చుకొని

వైదిక విద్యను గరుపుచుండెను. ఆనాడు యాదవప్రకాశుని మించిన సంస్కృత వేద తత్త్వతర్క పండితుడు లేడని ప్రతీతి. కాని ఆయన సిద్ధాంతము శ్రీ శంకరాచార్యులు బోధించిన అద్వైత సిద్ధాంతము. రామానుజుడు బాల్యము నుండియు తన వంశాచార క్రమముగా వైష్ణవ భక్తుడు. ఇక రామానుజుడు కొలది కాలములో యాదవప్రకాశ శిష్య కోటిలో చేరనున్న కాలమది. తల్లి కాంతిమతి పండితురాలేగాక, సంస్కరణ తత్వముగలది. మూఢవిశ్వాసములకు, మూఢాచారములకు ఆమె వద్ద తావులేదు.

రామానుజుని వయస్సు పదునారు వత్సరములు దాటినది. ఆ రోజులలో కాంచీపురమున కాంచీపూర్ణుడను ప్రఖ్యాతిగాంచిన వైష్ణవ భక్తుడుండెను. వీరిని తిరుకంచినంబి, తిరుక్కచ్చినంబి అనికూడా పిలుతురు. మత సంబంధముగా ఈ తిరుక్కచ్చినంబి రామానుజునకు ప్రథమాచార్యుడు.

కాంచీపూర్ణుడు అప్పుడప్పుడు కాంచీపురి నుండి శ్రీపెరుంబూదూరు మీదుగా ప్రస్తుత మద్రాసు నగరమున నొక భాగముగా నున్న పూనమల్లికి ప్రయాణము జేయువాడు. పూనమల్లిలో వైష్ణవ భక్తుల కూటమి, దేవాలయము ఉండెడివి. తిరుక్కచ్చినంబి కంచికి పోవునపుడు గాని, పూనమల్లికి పయనించు నపుడుగాని, మధ్యలో శ్రీపెరుంబూదూరులోని చెన్నకేశవస్వామి దేవాలయమున కొంత తడవాగి, సేద తీర్చుకొని, స్వామిని దర్శించి పోవువాడు. రామానుజుడు తన తల్లి నుండి, మేనమామ నుండి తిరుక్కచ్చినంబి ఘనతను గూర్చి విని యున్నవాడు. తిరుక్కచ్చినంబిని తన గృహమును అతిథ్యమునకు ఆహ్వానించ వలయునని రామానుజుని చిరకాల ప్రియమైన వాంఛ. కొన్ని నెలల నుండి దేవాలయము నొద్ద విచారించుచునే యుండెను.

ఒకనాడు ఉదయవేళ తొమ్మిది ఘంటలపుడు తలవని తలంపుగా చెన్నకేశవస్వామి కోయిల్ బావివద్ద స్నాన మాచరించు చుండిన

తిరుక్కచ్చినంబిని రామానుజుడు చూచెను. కొలది గజముల దూరమున నిశ్శబ్దముగా నిలుచుండి రామానుజుడు నంబిని భక్తితో తిలకించుచుండెను. స్నానానంతరము తిరుక్కచ్చినంబి వస్త్రముల ధరించి, చేతికఱ్ఱబూని, యిక ప్రయాణమున కుపక్రమింపనున్నాడు. రామానుజుడు తటాలున నంబిని సమీపించి, సాష్టాంగ నమస్కారము గావించి, వినమ్రుడై, ముకుళిత హస్తములతో నిలువంబడి యుండెను.

"నీ వెవరవు నాయనా!" అని కొంత ఆశ్చర్యమున సంతసమున నంబి ప్రశ్నించెను.

"నేను ఆసూరి కేశవాచార్యుల కుమారుడను. మాతల్లి కాంతిమతి. శ్రీశైలనంబి మా మేనమామగారు" అని రామానుజుడు సవినయముగా ఆనందపూరితుడై బల్కెను.

రామానుజుని కుటుంబీకుల నెల్లరను, ఎరిగినట్టియు, వారి యందరి యెడ గౌరవ ప్రేమభావములు గలట్టియు నంబి రామానుజుని గాఢాలింగమును జేసికొని, ముద్దిడి, "నాయనా! అమ్మ క్షేమముగా నున్నదా? పాపము, భర్తను గోల్పోయిన దుఃఖమున మ్రగ్గు చున్నయది కాబోలును. అది తీరని నష్టము, తీరని దుఃఖము. మామగారప్పుడప్పుడూ వచ్చుచుందురా? మీ తండ్రిగారుగాని, మీ మేనమామగారుకాని, నాకు గురుతుల్యులు. నాయనా, మీ నాన్నగారు పరమపదించిన తరువాత మీరెక్కడనుంటిరో యెరుగనైతిని. నిన్ను జూడ ఇపుడు నాకెంతయో సంతోషము కలుగుచున్నది. సుదీర్ఘా యుష్మంతుడవు కమ్ము! దివ్య జ్ఞాన సిద్ధిరస్తు!" అని రామానుజుని మూర్ధమును స్పర్శించుచూ, ఆశీర్వదించి, తనయొద్ద నున్న ఒక కదళీ ఫలమును రామానుజుని దోసిలియందిడి, "నాయనా! యిక పోయి వచ్చెద", ననెను.

"స్వామీ! నేను మిమ్ముల నాతిథ్యమునకు ఆహ్వానించుటకై కొలది దినములనుండి కనిపెట్టుకొనియే యున్నాడను. ఈ నాటికి మిమ్ముల

గంటిని, మీ దర్శన భాగ్యమున ధన్యుడనయితిని. సాపాటుకు మా యింటికి రండు", అని రామానుజు డర్థించెను.

"నాయనా! అమ్మతో ముందుగా చెప్పితివా? ఆమె యంగీక రించెనా? ఎటూ ఒక దఫా ఆమెను దర్శింపనెంచి యున్నాను. ఇంకొక సారి తీరికజూచుకొని యీ మార్గమున పయనించునపుడు నేనే మీ యింటికి నేరుగా వచ్చెదనులే. ఈ పర్యాయము త్వరగా కంచి చేరవలసి యున్నది", అని నంబిగారు చెప్పిరి.

"స్వామీ! మా తల్లిగారును మీరాక కెదురుచూచు చున్నారు. మిమ్ముల సాపాటునకు ఆహ్వానించమని ఆమెయే చెప్పియున్నది. తమరీనాడే మా యింటికి రావలయును. దాసుని కోరికను మన్నింపుడు", అని రామానుజుడు సవినయముగా అర్థించెను.

"అట్లయిన సరే", అని తిరుక్కచ్చినంబి అనడము, రామానుజుడు ముందునడువగా నంబి వెంబడించి పోవడము జరిగినది.

"నాయనా! నీ పేరేమి? అని నంబి ప్రశ్నించెను.

"రామానుజుడు", అని ప్రత్యుత్తరము ఇచ్చెను.

"రామానుజుడవా? శ్రీరాముని అనుజుడు లక్ష్మణుడును, బలరాముని అనుజుడు శ్రీకృష్ణుడును, యిరువురును నాకు సమానులే-ప్రియులే", అని తిరుక్కచ్చినంబి మురిపెమున బల్కెను. ఈ పలుకులు రామానుజుని మనము ముద్రవేసికొన్నవి.

కొలది నిముసములలో ఇల్లు జేరిరి. రామానుజుని జనని కాంతిమతి నంబికి సాష్టాంగ దండ ప్రమాణంబులు నాచరించి, కుశల ప్రశ్నలడిగి, తరువాత తిరుక్కచ్చినంబికి భక్తియుక్తముగా సాపాటును వడ్డింపగా, వారు ప్రీతితో ఆశీర్వచన పూర్వకముగా సాపడిన తదుపరి, వలదన్నను రామానుజుడు భక్తితో తళిహాకును (విస్తరాకును) తీసివేసి, నేలకు శుద్ధి పెట్టెను. ఆ తరువాత తల్లికొడుకులు సాపడిరి.

భోజనానంతరము తిరుక్కచ్చినంబి విశ్రాంతిగా కూర్చొని యున్నపుడు కాంతిమతి వారిని సమీపించి, "స్వామీ! నా కుమారుడు రామానుజుని వేదాధ్యయన పారంగతునిగాను, దైవభక్తియుతునిగాను, ఆళ్వారాదుల దివ్యవైభవమును పాటించు వానినిగాను ఆశీర్వదింపుడు. తండ్రిలేని బిడ్డ!" అని కాంతిమతి కంటితడితో పల్కెను.

"అమ్మా! కులమున అగ్రజులు మీరు. నేను రామానుజుని ఆశీర్వదించుటయా? ప్రేమింపగలనేగాని" అని నంబి పల్కెను.

"స్వామీ! మీ భక్తి అనన్యము, మీరందరికంటె అగ్రజులు. మీరే రామానుజునకు ఆధ్యాత్మిక గురువులు. మమ్ముల నింక పరీక్షింపవలదు. పిల్లవాని యెడ, నాయెడ కనికరముంచి, వానిని శిష్యునిగా స్వీకరించి, తమ రీమార్గమున పయనించు నపుడెల్లను మాయింటి కరుదెంచి, ఆతిథ్యమును స్వీకరించి పిల్లవానిని ఆశీర్వదించి పొండు", అని కాంతిమతి ప్రార్థించెను. కాంచీపూర్ణుడు తన సమ్మతిని సంతసమున "అ" కార వర్ణోచ్చారణతో వ్యక్తపరచెను.

"స్వామీ! నా కుమారుడు ధన్యుడు. "అ"కార వర్ణోచ్చారణకు మూడుమార్లు చేసి మీ సంపూర్ణ అంగీకారమును వ్యక్తము జేసినారు. వర్ణమాలలో "అ"కారము శ్రేష్ఠమయినదని గీతాచార్యుడు వక్కాణించి యున్నారు; అ, ఉ, మ్ ల సమ్మేళనమయిన "ఓం" అను ప్రణవము భగవద్వాచక మయినను, అందు "అ" కారవాచ్యుడు సర్వేశ్వరుడని మీబోటి వారినుండి వినియున్నాను. తమరు "అ-అ-అ" అని అంగీకారమును తెలుపుటలో భగవత్కృప ముప్పిరిగొని నా కుమారుని ఆశీర్వదించునని తమరు అభయమిచ్చినట్లు నేను భావించుచున్నాను", అని కాంతిమతి సవినయముగా పల్కెను.

ఈ మాటలు వినిన తిరుకచ్చినంబి కాంతిమతి యొక్క జ్ఞానమునకు, సంస్కారమునకు ఎంతయో అబ్బురపడెను.

తల్లి కాంతిమతి కోరికపై ఆనాడే ప్రప్రథమముగా రామానుజునకు ఆధ్యాత్మిక దివ్య విద్యాభ్యాసమునకు ప్రారంభోత్సవము జరుపు

విధమున తిరక్కచ్చినంబి రామానుజునకు తిరుప్పాణ్ ఆళ్వారు చరిత్రమును బోధించెను. అందున్న దివ్యదార్శనిక విషయముల రామానుజుడు గ్రహించెను. తరువాత క్రమక్రమముగా అప్పుడప్పుడు తక్కిన ఆళ్వారుల చరిత్రములను రామానుజునకు బోధించుటయే గాక, వారి భక్తి కీర్తనలు వారి రచనలైన ప్రబంధములు, వారి తత్త్వము, వారి సేవాభావములను తిరుక్కచ్చినంబి రామానుజునకు సులభ గ్రాహ్యముగా బోధించెను. రామానుజుడు భక్తిప్రపత్తులతో, విశ్వసోదర భావముతో తన్మయత్వమున నుండువాడు. తానును ఆళ్వారుల వలె జీవితమును గడపి, లోకకోటికి దివ్యసందేశముల నొసంగవలయునని రామానుజునకు అప్పటినే కోరిక జనించెను. బ్రాహ్మణ వైష్ణవ కులజుడయిన రామానుజుడు వాస్తవముగా వైష్ణవుడాయెను. "సర్వం విష్ణుమయం" అను నమ్మాళ్వారుసూక్తిచే నభిషిక్తుడాయెను. ఆళ్వారుల దివ్యవైభవ శ్రవణము రామానుజునిపై అగణిత ప్రభావమును గలిగించెను. భవిష్యత్కాలమున ఆళ్వారుల దివ్యజ్ఞానమే రామానుజుని విశిష్టాద్వైత సిద్ధాంతమునకు మూలమయినది.

ఆళ్వారుల దివ్యవైభవమును బాల్యముననే రామానుజుడు తిరుక్కచ్చినంబి, శ్రీశైలపూర్ణుడు, తండ్రి కేశవాచార్యుల నుండి స్థూలముగా గమనించెను. ఇందువలన గలిగిన శ్రద్ధ ఫలితముగనే తరువాత కాలమున ఆళ్వారుల ప్రబంధములనెల్ల గ్రహించి, వారి జ్ఞానసౌరభమును రామానుజుడు తన రచనలయందు వెదజల్లెను.

"ఆళ్వారుల దివ్యవైభవము", "శ్రీభక్తిసారము" అనునట్టి నాచే రచింపబడిన యితర గ్రంథములందు చదువరులు ఆళ్వారుల చరిత్రలను, రచనలను గూర్చి కొంతవరకు తెలిసికొన గలుగుదురు. ప్రస్తుతమిచట రామానుజుడు బాల్యమున గ్రహించిన ఆళ్వారుల చరిత్రాంశములను గమనింతము.

# 3. ఆళ్వారుల దివ్య వైభవము

## ( మొదలాళ్వారులు )

రామానుజుడొక దినమున, తిరుక్కచ్చినంబి తన యింటిలో ఆతిథ్యమును స్వీకరించి, విశ్రాంతిగా నాసీనుడై యున్న తరి, నంబికి సాష్టాంగదండప్రమాణంబు లాచరించి, "స్వామీ! ఆళ్వారులను వారెవరు? వారెందరు? వారి భక్తభావమెట్టిది? మున్నగు విషయములు నాకు సవిస్తరముగా సెలవిండ"ని ప్రార్థించెను.

అందుమీదట తిరుక్కచ్చినంబి వాత్సల్యముతో రామానుజునకీ విధమున యెరుక పరచెను:

"ఆళ్వారు" అనగా లోతునెరిగిన వాడు అని భావము. భగవద్భక్తి ప్రపత్తుల ఫలితమున బడసిన పరమానంద సముద్రము యొక్క లోతు నెరింగినవాడు "ఆళ్వారు". ఆళ్వారులు భక్తిపరవశమున నుండి, భగవంతుని అనంత దివ్య మంగళ విగ్రహమును వారి మనో నేత్రములతో తిలకించుచూ, తన్మయభావమున సంశ్లేష భావమున భగవంతునితో సంభాషించుచూ, భగవంతుని బిగ్గరగా, గంభీరముగా దివ్య కీర్తనలతో సంకీర్తనము గావించుచు, ఆనందసాగరమున మునిగి తేలుచున్న దివ్య ఆనంద తేజోమయులు. అనంత అగణిత అనిర్వచనీయ దివ్య ఆనందమును పొంది అనుభవించినవారు ఆళ్వారులు. పరమానంద భరితుని ఆళ్వారనుట లోకోక్తి అయినది.

వేదములు సర్వులకు తెలియని సంస్కృత భాష యందుండ డము, ఆ వేదములనందరు చదువరాదను నియమముండడము, వైదిక మతాచారములు రానురాను క్రూరముగా, అర్థరహితముగా, కొన్ని కులముల వారికి మాత్రము స్వలాభకరములుగా తయారయినందున, సర్వులకును అర్థమగు విధమున తమిళభాష యందు భగవద్భక్తి కీర్తనలను గానము చేసినట్లయితే, ప్రజలు భక్తి

ప్రపత్తి యోగముల నాలింగనము గావింతురని ఆళ్వారులు భావించిరి. వారు సంస్కృత పాండిత్యము గలవారైనను, కారుణికులును, వివేక చతురులును, అగుటంజేసి, వేదోపనిషత్తులు బ్రహ్మసూత్ర పురాణేతి హాసముల యొక్క సారమును భక్తికీర్తనలలో గానము చేయసాగిరి. ఆళ్వారుల భక్తి స్వచ్ఛమైనది. వారికి కులభేదములు లేవు. సర్వమానవ సోదరభావమే వారి మతము. ఆచారములకు వారు ప్రాధాన్యము నివ్వలేదు. మానవుడు శరణాగతి తత్త్వమున భక్తిప్రపత్తులతో దైవము నారాధించుటయేగాక, భక్తి ప్రేమలను తోటి మానవులకు జూపి, సర్వము భగవత్సంసారమను భావమున జీవితముల సుఖపరచు కొనుచూ, ఆనందమయులుగా దైవ స్పర్శతో నుండవలయునని ఆళ్వారుల దివ్య సందేశము.

ఆళ్వారులు పండ్రెండు మంది. ప్రబంధములయందు ద్వాదశా ళ్వారులని ప్రసిద్ధి. వీరిలో అన్ని కులముల వారికి సంబంధించిన వారున్నారు. ఈ పన్నిద్దరాళ్వారులలో ఒకరు స్త్రీ. ఒకరు పంచమ జాతివారు, కొందరు శూద్రులు, కొందరు బ్రాహ్మణజాతివారు, ఒకడు క్షత్రియుడు, కొందరు అయోనిజులు ఉన్నారు.

ద్వాదశాళ్వారుల తిరునామధేయము లేవనగా - పొయిగై ఆళ్వారు, పూదత్తాళ్వారు, పేయాళ్వారు, తిరుమళిశైయాళ్వారు, కులశేఖరాళ్వారు, తొండరడిప్పొడియాళ్వారు, తిరుప్పాణ్ ఆళ్వారు, తిరుమంగైయాళ్వారు, పెరియాళ్వారు, ఆండాళ్, మధురకవి ఆళ్వారు, నమ్మాళ్వారు. ఈ పన్నిద్దరాళ్వార్లు శ్రీ మహావిష్ణుమూర్తి అంశమున జన్మించినవారని భక్తుల భావము. ఆళ్వారు లెక్కడెక్కడనో జన్మించి, యెక్కడెక్కడనో సంచరించి, యెక్కడెక్కడనో పరమపదించిరి. కాని వారిలో ఎక్కువమంది శ్రీరంగ పుణ్యక్షేత్రమున పరమపదించిరి.

# మొదలాళ్వారులు

పొయిగై ఆళ్వారు, పూదత్తాళ్వారు, పేయాళ్వారు అను నీ ముఫ్వురు ద్వాదశాళ్వారులలో మొదటివారు. అందువలన వీరిని మొదలాళ్వారు లందురు; వీరు సమకాలికులు. వీరి తలిదండ్రులెవరో, వీరి కులగోత్రము లెట్టివో, చరిత్ర కందలేదు. వారెక్కువగా వాసము జేసిన స్థలములబట్టి పొయిగై ఆళ్వార్ల జన్మస్థానము కాంచీపుర మనియు, పూదత్తాళ్వార్ల జన్మస్థలము మహాబలిపురమనియు, పేయాళ్వారుల జన్మభూమి మైలాపూరు (నేటి మద్రాసు పట్టణ భాగము) అనియు తెలియుచున్నది. వీరు భగవద్భజనల జేయుచూ, అనేక పుణ్యక్షేత్రముల దర్శించుచూ, సంచారజీవనులుగా నుండిరి.

పొయిగైయాళ్వారు శ్రీకాంచీనగరమందు దేవాలయ సమీపమున నున్న కాసారమున స్వర్ణమయ తామరపుష్పముల యందు ద్వాపర యుగాంతరమున జన్మించిరి. (తామర పుష్పములయందు దొరికిన బిడ్డడితడు. తలిదండ్రులెవరో తెలియదు. అందువలన ప్రబంధముల యందు వీనిని అయోనిజుడనిరి). వీరిని కాసారయోగి, సరోయోగి అనియు కూడా నందురు. వీరి తిరునక్షత్రము:

శ్లో॥ తులాయాం శ్రావణేజాతం ।
కాంచ్యాం కాంచన వారిజాత్ ।
ద్వాపరే పాంచజన్యాంశం ।
సరో యోగిన మాశ్రయే ॥

వీరు శ్రీ మహావిష్ణుమూర్తి యొక్క పాంచజన్యాంశమున జన్మించి రని భక్తులు భావింతురు. శ్రీ మహావిష్ణువు యొక్క పంచాయుధము లలో పాంచజన్యమను తిరునామమున నొప్పు శంఖ మొకటి కదా!

పూదత్తాళ్వారు పేయాళ్వారు జన్మించిన మరునాడు తిరుక్కడల్ మల్లై (మహాబలిపురము) అను దివ్య క్షేత్రమున బండి గురిగింజ పుష్ప సముదాయమున అవతరించిరని ప్రబంధములు దెల్పుచున్నవి. వీరు పొయిగై ఆళ్వారు వలె అయోనిజులుగా భావింపబడుచున్నారు. "పూత"

మనగా "ఆత్మ" అని భావము. జ్ఞానాధికులగుటచే వీరికి పూదత్తాళ్వారను తిరునామము గలిగెను. వీరికి భూతాళ్వారను నామధేయమును కూడా గలదు. పంచభూతముల యొక్క తత్వమెరిగిన వారు వీరు. వీరి తిరునక్షత్రము:

శ్లో॥ తులాశ్రవిషా సంభూతం
భూతం కల్లోల మాలినః
తీరే ఫుల్లోత్పలే మల్లా
పూర్యా మీడే గదాంశజమ్.

వీరు విష్ణుమూర్తి యొక్క కౌమోదకియను గదాంశమున జన్మించిరని భక్తులు దలంతురు.

తులా శతభిషగ్జాతం
మయూరపుర కైరవాత్
మహంతం మహదాఖ్యాతం
వందే శ్రీ నందకాంశజమ్.

పేయాళ్వారు కెందామరపుష్పంలో నందకఖడ్గం అంశజునిగా అవతరించాడు.

ఈ యాళ్వార్ల త్రయమును గూర్చి పూర్ణచరిత్ర అందలేదు. వారి రచనలబట్టి వారు తిరిగిన ప్రదేశములు మాత్రము వెల్లడగుచున్నవి. ఈ మహనీయత్రయమును గూర్చి ఒక మహోజ్వల కథ గలదు. పొయిగై యాళ్వారొక దినమున ఆశ్రయమును విడిచి ప్రయాణమై పోయెను. భగవద్గుణ గానము చేయుచూ, గ్రామగ్రామమునకు సంచరించుట వారి దివ్య జీవన విధానము. సూర్యాస్తమయము కాగా, తిరుక్కోవలూరు అను గ్రామ గమిడిలోనున్న ఒక ఖాళీగానున్న చిన్న పూరిగుడిసెను గాంచెను. ఉన్నట్లుండి తుఫాను సంభవించెను. ఈ పెనుతుఫాను కుంభవృష్టి సహితముగా భయంకరమాయెను. ఆళ్వారు గుడిసెను ప్రవేశించి, శయనించి యుండెను. "ప్రళయ వర్షమును గురిపించు వాడవు నీవే; నాకీ యాశ్రమమును జూపినది, నీవే, స్వామీ!"

అని ఆళ్వారు భగవన్నామ సంకీర్తన గావించుకొనుచూ గానము చేయుచుండెను. ఝంఝామారుత ఝంకారధ్వని తన గానముతో మేళవించుటే తన గానమాధుర్యము ఇనుమడించినట్లు ఆళ్వారు ఆనందపరవశుడై యుండెను. సర్వప్రకృతి శక్తులు ఆళ్వారునకు ఆనంద దాయకములే! ప్రళయమును ఒక దైవలీలగా జూచి దాని మహోన్నత స్థితిని హర్షించు సమదృష్టిగలవాడు ఆళ్వారు. ఈశ్వరశక్తి యొక్క శివ రుద్ర శక్తులను సమానముగా నానందింపగల జ్ఞానశక్తియుతుడు ఆళ్వారు. ప్రకృతిశక్తి జ్ఞానముతో జోడింపబడిన ఆధ్యాత్మిక జ్ఞాన సంపన్నుడు ఆళ్వారు. శాస్త్రజ్ఞానమును ఆధ్యాత్మిక జ్ఞానముల యొక్క అద్వైత సమ్మేళనము ఆళ్వారుల చిత్తవృత్తి.

ఇంతలో మరియొకడు ఆ కటికచీకటి యందును, జోరు వర్షము నందును గుడిసె వాకిట నిలువబడి, "అయ్యా, తలదాచుకొనుటకు కొంచెము చోటిచ్చెదరా?" అనెను. లోనున్న పొయిగైయాళ్వారు లేచి, కూర్చొని, "అడియేన్ (దాసుడను - నీకు సేవచేయుటకు సిద్ధముగా నున్నాను అని భావము) లోనికి రండు", అని ఆహ్వానించుచు, వెండియు నిట్లనియెను. "ఒక్కడు సాగిల పడుకోగలిగిన స్థలమున ఇద్దరు సుఖముగ కూర్చొనవచ్చును. రండి, దయచేయుడు". వారిరువురు ఆ గాఢాంధకారమున ఒండొరులు చూచుకొన లేకపోయిరి. వారిరువురు ఒకరినొకరు ఆనుకొని కూర్చొని, కునికిపాటున నుండు సమయమున, మూడవ వాడొకడు వాకిట వెలుపల నిలవబడి, "అన్నలారా! తలదాచుకొనుటకు కొంత తావిచ్చెదరా? ఈ చలికి, ఈ వర్షమునకు, ఈ గాలికి తట్టుకొనలేక యున్నాను", అని వడకుచూ బిగ్గరగా నరచెను. లోనున్న యిద్దరు లేచి, నిలువంబడి, "రండు లోనికి, యిద్దరు కూర్చొనుతావున ముగ్గురు నిలుచుకొని యుండగలరు. రండి దాసులము", అని ఆహ్వానించిరి. ఆ ముప్పురు నొండొరులు నానుకొని నిలుచుండియే కన్నుమూసిరి; తూగుచుండిరి. ఈ లోపల నాల్గవవాడొక డరుదెంచి, వాకిట నిలువంబడి, "అయ్యలారా, నన్ను లోనికి రానెచ్చెదరా? చలికి తట్టుకొనజాలకున్నాను", అనెను. నాల్గవవానికి

లోపల నిలుచుకొనుటకు కూడా స్థలము లేనందున, ఈతనికి రక్షణ గల్పించుటకు గుడిసెలోనున్న ముగ్వురిలో నొకరు వెలుపలికి రావలయును గాన, "నేను వెలుపలికి పోదును; కాదు, నేను పోదును; కాదు, గాదు, నేను వెళ్లెదను", అని వారు ముగ్వురును వంతులు వేసికొనుచూ, స్వార్థరాహిత్య భావమున, సేవాతత్పరతయందు, కరుణారస భావమున ఆ ముగ్వురిలో తీసిపోవు వారెవ్వరును లేనందున, ఒకరినొకరు వెంబడించుచూ, ఒక క్షణములో ముగ్వురును వెలుపలకి వచ్చిరి. "పెద్దన్నయ్యలారా! మీరు ముగ్వురు నా కొరకు ఎంత యిబ్బందిని పడ్డారు! నేనే వెలుపల నుండెదను. లోన నాల్గవ వానికి స్థలములేదని తెలియుచున్నదిగదా! మీ ముగ్వురు యథా స్థానమున నిలువుడు. నేను వేరుతావును జూచుకొందునులే!" అని అనుచుండగా తటాలున ప్రకృతి వైపరీత్యమోయన, గాలి నిలచెను; వర్షమాగెను; చలి తగ్గెను; ఉదయభానుడు ప్రకాశించెను. ఇట్టితరి యెవ్వానికి కూడా నా గుడిసెలో తలదాచుకొనుట యనునదేమున్నది?

పాయిగై ఆళ్వారు బిగ్గరగా, "ఓం నమో నారాయణాయ! ఓహో, యేమి యీ విచిత్రము? భూమియే ప్రమిదయై, సాగరజలమంతయు తైలమై నిలువ, ఉదయ భాస్కరుడు దీపపువత్తియై వెలుగుచూ ప్రపంచమును ప్రభావితము చేయుచున్నాడు! ద్వాదశాదిత్యులలో సూర్యడవు నీవేకదా! ఓ సర్వాంతర్యామీ! నమస్తే, నమః" అను భావమిచ్చు సంస్కృత శ్లోకమును గానము జేయుచూ ఆనందించు చుండెను.

రెండవవాడు, "స్వామీ ప్రేమయనెడు వెచ్చదనముతో నా హృదయ మను వెన్నను గరగించితివి. జ్ఞానమను వత్తిని వెలిగించితివి. నాకాత్మ వికాసమున ప్రసాదించితివి. ఓం, నమో నారాయణాయ!" అని పరవశమున సంస్కృత శ్లోకమున గానము జేయ మొదలిడెను.

మూడవ వాడు, "ఓ పురుషోత్తమా! నిన్ను, నీ తత్త్వమును సాక్షాత్కారము జేసికొన గలిగితిని. ధన్యుడనయితిని. ఓం నమో

నారాయణాయ", అని అష్టాక్షరిని జపించుచూ తన్మయత్వమున గానము చేయుచుండెను.

నాల్గవవాడు తక్కిన మువ్వురను తిలకించుచూ, "కృతార్థుడను, ధన్యుడను, కనుగొంటిని" అనుచూ గంతులు వేయుచుండెను. ఆనంద పరవశమున నృత్యము జేయదొడగెను.

మొదటి మువ్వురు ఆశ్చర్యముతో, "ఏమి కనుగొన్నావయ్యా, నీవు!" అని ప్రశ్నించిరి.

"మీరు మువ్వురు ఆళ్వారులని కనుగొంటిని. అన్నయ్యలారా! నీవు పొయిగై ఆళ్వారు తిరునామమున పాంచజన్యాంశమున నవతరించితివి. ఈయన పూదత్తాళ్వారు నామమున కౌమోదకీ అంశమున జన్మించినవారు. ఈ పేయాళ్వారు నందకము", అని బిగ్గరగా హాసము జేయుచూ, ఆనందించుచుండగా, ఆ మువ్వురు యేక కంఠమున, "తమరెవరో మాకును తెలుసులేవయ్యా! తిరుమళిశై యాళ్వారను దివ్యనామమున అవతరించిన సుదర్శన చక్రమవుగదా తమరు", అనిరి.

"నేనును మిమ్ముల వెదకుచూ వచ్చినాడను", అని ప్రతివాడును తక్కిన మువ్వురితో ననెను. "మనము నల్వురము ఇచట కేంద్రీకరింప బడుట మనవాంఛ, మన ప్రయత్నము - ఇదియొక విచిత్ర సంఘటనము. ఇదియొక సహజమైన కలయిక కూడాను", అనుచూ పరమానందభరితులై ఒండొరుల తిలకించుకొంటూ మందహాసమున నుండిరి.

"ఓం నమో నారాయణాయ, నీకు మాయందుగల వాత్సల్యము అద్వితీయము. మమ్ముల నొకచోట చేర్చుటకే యీ ప్రళయమును కల్పించితివయ్యా", అని స్వామిని స్తుతింపసాగిరి, నల్వురు ఆళ్వారులు.

ఈ నల్వురాళ్వార్లు కలిసిన కారణమున తిరుక్కోయిలూరు ప్రసిద్ధమయిన పుణ్యక్షేత్రమయినది. భవిష్యత్కాలమున నిది

విశిష్టాద్వైత మతమున కొక ఉపప్రచారక కేంద్రము కూడా అయినది. ఒక ఆచార్య పీఠము అచట వెలసినది.

ముదలాళ్వార్ల త్రయము శ్రీమన్నారాయణ రూపగుణ విభూతులను అనుభవించుచూ, అట్టి మానసిక అనుభవ జనిత ప్రీత్యతి శయమున వైయంతగిళి, అన్బేతగళి, తిరుకణ్ణేన్ అనెడు దివ్య ప్రబంధములను చేతనుల నుజ్జీవింప జేయుకొరకు అనతిచ్చి, ఉపకరించిరి. వీరు తమ యోగ మాహాత్మ్యముచే ఈ విభూతియందు చేతనుల నుజ్జీవింప జేయుచూ చిరకాలముండిరి.

ఈ ముదలాళ్వారుల చరిత్రమును సావధానముగా నాకర్ణించిన రామానుజుడు తిరుక్కచ్చినంబితో, "స్వామీ! స్వార్థరాహిత్య జీవితము నకును, విశ్వమానవ ప్రేమభావమునకును, ముదలాళ్వారుల జీవితము ఉత్తమ తార్కాణముగా నున్నదే! వీరి పవిత్ర జీవితములు అనుపములు. స్వామీ! వారి జీవితములవలె నేనును స్వార్థరహితుడ నగుటకు నామనము ఉవ్విళ్ళూరుచున్నయది. వీరి దివ్య చరిత్రమును అకర్ణించి నేను పవిత్రుడనయితిని స్వామీ! విష్ణు నాకర్ణించు వీనులు వీనులు నాకర్ణించుటయగును", అని రామానుజుడు పరమానంద భరితుడుగా కన్నట్టెను. ఆనందబాష్పము లాతని నయనకమలముల నుండి బొటబొట రాలెను.

"రామానుజా! నీవు పరోపకార జీవివయ్యెదవు గాక! లక్ష్మణాంశ మున జనించిన నీకు రామానుజుడని ఉచిత నామకరణము గావించెనుకదా మీ మేనమామగారు శ్రీశైలపూర్ణుడు! లక్ష్మణునివలె సేవామూర్తి వయ్యెదవుగాక నీవు!" అని తిరుక్కచ్చినంబి రామానుజుని ఆశీర్వదించి, ఆనాటికి తాను చెప్పదలచిన ముదళార్వారుల దివ్యవైభవ విశేషములను పూర్తిగావించెను. "మరు పర్యాయము వచ్చినపుడు ఇతర ఆళ్వారుల చరిత్రముల బోధించెదన"ని నుడివి, తిరుక్కచ్చినంబి కాంచీపురికి ప్రయాణమాయెను. తిరుక్కచ్చినంబి పునరాగమనము కొరకు రామానుజుడు ఎదురు జూచుచుండెను. తిరుక్కచ్చినంబి తనకు ప్రథమాచార్యుడుగా రామానుజుడు భావించెను.

# 4. తిరుమళిశైయాళ్వారు

మరియొక సందర్భమున తిరుక్కచ్చినంబి శ్రీ పెరుంబుదూరున రామానుజుని యింట నాతిథ్యము స్వీకరించి, సేద దీర్చుకొను సందర్భమున యువకుడును, ఆధ్యాత్మిక విద్యయందానక్తిగల వాడును అగు రామానుజుడు నంబిని సమీపించి, సాష్టాంగ నమస్కార మిడి, "స్వామీ! గత పర్యాయము తాము ముదలాళ్వారుల గూర్చి సెలవిచ్చియున్నారు. అందు నాల్గవ ఆళ్వారు తిరుమళిశైయాళ్వారుల ప్రస్తావన వచ్చియున్నది. వారి చరిత్రమును, ఘనతనూ గూర్చి ఆకర్ణింపగోరెద. సెలవిండు", అని రామానుజుడర్థింప, వాత్సల్యమున నంబి మందహాసభరితుడై యిట్లు చెప్పదొడగెను:

"తిరుమళిశైయాళ్వారు ముదలాళ్వారులకు సమకాలికుడని చెప్పియుంటిని గదా! వీరి చరిత్రము అతి విచిత్రమైనట్టియు, పవిత్రమైనట్టియు, ఒక గొప్ప సంఘటన. కాలమానము ప్రకారము వీరు నాల్గవ వారు.

తిరుమళిశైయాళ్వారుల జన్మస్థలము తిరమళిశైయను పట్టణము. ఇది ప్రస్తుత చెంగల్పట్టు జిల్లాయందు ముదలాళ్వారుల జన్మస్థల మయిన కాంచీపురము, మహాబలిపురము, మైలాపూరులకు మధ్యప్రాంతమున సమదూరమున నుండెను. ఈ తిరుమళిశై పట్టణమునకు మహీసారమని నామాంతరము గలదు. ఈ నగరము జగన్నాథస్వామి ఆలయముతో, జనబృందములతో, సజ్జనులయిన పురవాసులతో, పురప్రాంతముల ప్రకృతి సౌందర్యములతో, వనరాజము లతో, శోభిల్లుచుండుటంజేసి, తాపసులు, సాధువులు, భక్తులు పలుమారీపురమును దర్శించువారు. ఈ వనములందు కాలక్రమమున ఋషికులములు విలసిల్లెను. ఒకప్పుడు భార్గవియను ఋషి తన ప్రేయసి కనకాంగి యను సుందర యువతితో వచ్చి, వనమున నొకమూల కుటీరము నేర్పరచుకొని యుండెను. కనకాంగి గర్భవతియై మగశిశువును గనెను. ఆ బిడ్డడు జన్మించినది మొదలు కేకవేయ

కుండుటచే, సజీవుడు కాడని తలంచి, భార్గవీ దంపతులు ఆ బిడ్డను అనాదరించి, వనములోని యొక పేముపొదలో రహస్యముగా నాబిడ్డను వదలి, ఆ స్థలమున వదలి యెచటికో పోయిరి.

మరునాడుదయమున ఆ శిశువు ప్రాణయుతుడై కేకలు వేయుచుండ, తిరువాళన్ అను నామమున నొప్పు మేదర కులజుడు ఆ ప్రాంతమునకు పేములు గోయుటకై వచ్చియుండి, బిడ్డను గాంచి, దయతో వానినెత్తుకొని స్వగృహముజేరి, తన భార్యయగు పద్మవల్లికి బిడ్డను జూపెను. పద్మవల్లి సంతానహీనురాలగుటే అత్యాదరమున మాతృ హృదయముతో అర్భకుని స్వీకరించి, గారాబమున పెంచ సాగెను. కాని ఆ బిడ్డ స్తన్యపానాదులు లేకనే, వాయు భక్షణమున తేజోమయుడయి పెరుగుచుండెను. ఈ ప్రకృతి వైపరీత్యమునకు ప్రజలెల్లరు అచ్చెరువందిరి. ఆహారపానీయ వర్జితుడయినను, బాలుడు నిత్య స్నానాలంకరణలతో నొప్పియుండువాడు; దివ్యసుందర విగ్రహ మూర్తి. బాల్యము నుండియు విష్ణుభక్తుడై దైవగుణ గానమే ఆహార పానీయములుగా జేసికొనెను.

ఈతడు బాల్యమున నున్నపుడే ఆ నగరవాసియు, అనపత్యుడును అయిన నొక శూద్రకులజుడు వీని ప్రభావమునకు ఆకర్షింపబడినవాడై, వీని ప్రభావమున తాను సంతానమును బడయ గల ననెడి దృఢవిశ్వాసమున, భార్యాసమేతుడై, ఈ దివ్యబాలకుని సమీపించి, తాను దెచ్చిన క్షీరపాత్రను వానిముందిడి. ఆరగింపుడని ప్రార్థించెను. ఇట్లనేక విధముల ప్రార్థింపగా, ఆ దివ్యబాలుడు ఏలనో ఆ క్షీరములో కొంత భాగమును స్వీకరించి, శేషమును స్వీకరింపుడని ఆ దంపతుల కొసంగెను. ఆ దంపతులను శేషక్షీరమును మహా ప్రసాదముగా స్వీకరించిరి. కాలక్రమమున సంవత్సరము పూర్తియగు సరికి ఆ దంపతులొక కుమారుని బడసిరి.

కణికణ్ణన్ అను నామాంకితుడయిన యీ బిడ్డ పెరిగి ద్వాదశ వర్షములు నిండుసరికి పరమభాగవతోత్తముడై అప్పటికి తిరుమళిశై

యాళ్వారను ప్రసిద్ధ నామధేయుడయిన (భార్గవి కనకాంగినుల కుమారుడు) వానికి శిష్యుడాయెను. ఇదియొక దివ్యమైనట్టియు అపూర్వమయినట్టియు సమ్మేళనము. తిరుమళిశైయాళ్వారు తన దివ్య భక్తిగానముతో చేతనుల నుజ్జీవింపజేయుచుండ, శిష్యుడు మణికణ్ణన్ ఆళ్వారుని శ్లాఘించుచు దివ్య కీర్తనములు పాడుచుండెడివాడు. వీరి వలన [illegible]శై నగరము భక్తులకు పుణ్యక్షేత్రమై యలరారుచుండెను.

శ్లో॥ మఖాయాం మకరేమాసే
చక్రాంశం భార్గవోద్భవమ్
మహీసార పురాధీశం
భక్తిసార మహం భజే.

సుదర్శనాంశమున జన్మించిన తిరుమళిశైయాళ్వార్ల జీవితమంతయు అద్భుతములతో గూడినది. ఒకనాడొక వ్యాధిగ్రస్తురాలును, కృశించిన శరీరము గలదియు, ముదుసలివలె యేదో శరీర బాధలతో మూల్గుచూ నడచిపోవుచుండెడి యొక యువతిని ఆళ్వారుగాంచి, ఆమెనాశీర్వదించుచు, మూర్ధమును స్పృశించెను. దాని ఫలితమో యనునట్లు అనతికాలముననే ఆమె సంపూర్ణారోగ్యవంతురాలై, త్రిభువన సుందరియగు నడిజవ్వనిగా మారెను. ఆ పట్టణపు ప్రభువు ఆమెనుగాంచి, ఆమె సౌందర్యమునకు సమ్మోహితుడై, ఆమె సంస్కార భాషణంబుల కచ్చెరువంది, ఆమె కుల, వంశ, విశేషముల నరయకనే ఆమెను పరిణయ మాడెను. కాలక్రమమున నామె నిత్య యౌవనవతిగా శోభిల్లుచుండుటయు, తాను వృద్ధుడగుటయు గాంచిన రాజు తన భార్యతో, "నీ యౌవన సౌందర్యములు తరుగని, చెరగని స్థితి యందుండుటకు కారణమేమి? నేను వృద్ధుడనగుచున్నాను; నీవు మాత్రము అనేక సంవత్సరముల క్రితము మనము వివాహమాడిన దినమున నెట్లుంటివో అట్లే యిప్పుడును కన్యవలె కన్పడుచున్నావు. దీనికి కారణమేమైయున్నదో తెల్పుము", అని అడిగెను. అందులకామె రాజుతో, "నాథా! నా శారీరక, మానసిక సంపదకు కారణము

తిరుమళిశైయాళ్వారుల ఆశీర్వాదబలము", అని చెప్పి, జరిగిన కథను నివేదించెను.

రాజు ఆళ్వార్ల శిష్యుడగు కణివణ్ణన్‌ను రప్పించి, ఆళ్వారును తోడ్తెమ్మని అజ్ఞాపించెను. అందుమీదట కణివణ్ణన్ ప్రభువుతో, "రాజా! మా గురువర్యుడు తిరుమళిశైయాళ్వారు యిచటకి రావడం జరుగదు. వారెల్లప్పుడు భక్తి తత్త్వమున తన్మయులై యుందురు. బాహ్య ప్రపంచముతో సంబంధము లేని ఆళ్వార్లను తమరు చూడదలచిన యెడల, తమరే వారి ఆశ్రమమునకు దయచేయుడు", అని చెప్పగా రాజు కుపితుడాయెను. "సరే! అది అట్లుండనిమ్ము - కణివణ్ణన్ నీవును గొప్ప గాయకుడవనియు వినియున్నాను. ప్రభువునగు నన్ను గూర్చి ఒక కీర్తనను గానము చేయుము", అని రాజు కోరెను. అందులకు కణివణ్ణన్, "రాజా! నా రచనలు, నా గానము నా గురువర్యుని పరము గానే జరుగుతవి. అన్యుల నా నోరు కీర్తింపజాలదు", అని ప్రత్యుత్తర మిచ్చెను. ప్రభువు ఆగ్రహావేశమున మండిపడి, "నీవును, నీ గురువును ఈ క్షణమున ఈ నగరము వదలి పోవలసినదని మా ఆజ్ఞ. ప్రభువును ధిక్కరించు మీకు ఇచట తావులేదు. వెంటనే వెడలిపొండు", అని గర్జించెను.

కణివణ్ణన్ మారుమాటాడక, రాజసదనమును వీడి, జగన్నాథ స్వామి గుడి సమీపముననున్న ఆళ్వార్ల ఆశ్రమమును జేరి, ఆళ్వారునకు రాజు నాజ్ఞను తెలియపరచెను. భగవానుడైన ఆళ్వారు మందహాసమున లేచి, పట్టణమును వదలి నడువ నారంభించెను. ఆళ్వారునకు ప్రపంచమే తన నివాస స్థానము; శిష్యుడు వెంబడించెను. చిరకాల వాసియు, ఆధ్యాత్మిక వెలుగును అయిన ఆళ్వారు పురమును వీడిపోవుట గాంచిన పౌరులు రాజుయొక్క గర్వమునకు, అనాదరమునకును కినిసి, ఆళ్వారు వెంబడించిరి. ఆబాలగోపాలమును అవనతవదనులై ఆళ్వారు వెనుకనడచిరి. పట్టణ హద్దులను దాటగా, దేవాలయములోని జగన్నాథస్వామియు వెలుపలికి వచ్చి వారి వెంబడి పయనించినట్లు భక్తులైన ప్రజలు భావించిరి, ఏకాకియైన రాజు యీ

విచిత్రమును తిలకించి, భార్యాసమేతుడై దిక్కుతోచని వానివలె పరుగిడి వచ్చి, ఆళ్వారును సమీపించి, భక్తి ప్రపత్తులతో సాష్టాంగ దండప్రమాణము లాచరించి, అపరాధముల క్షమింపుడని ఆళ్వారుల వేడెను. దయాసముద్రుడును, ప్రేమరస భరితుడును అయిన ఆళ్వారు మందహాస వదనారవిందుడై, రాజు నాశీర్వదించెను. కొంతసేపటి కెల్లరు వారివారి నెలవుల జేరిరి. ఆళ్వారు తన శిష్యరత్నము మణికణ్ణన్ సహితుడై నిజాశ్రమమును జేరెను. రాజు అది మొదలు ఆళ్వారును, భక్తిపూర్వకముగా పూజించుచుండెడి వాడు. ఆ పట్టణమునకును, పురవాసులకును, ప్రభువునకును ఆళ్వారుని ఆశీర్వదించిన బలము క్షేమకరమని సర్వులు గుర్తెరిగి భావించియుండిరి.

తిరుమళిశైయాళ్వారు "నాన్ముగన్" అను తిరునామమున నొప్పు తమిళమున భక్తిరస ప్రబంధమును రచించెను. ఈ ప్రబంధమున నొక పాశురమున వీరు ఈ దివ్య భావమును వ్యక్తముజేసి యున్నాడు:

"నాకు స్వామియగు నిన్ను దేవాదిదేవుడవనియు, జగత్కారణ భూతుడవనియు, నాకిప్పటికి వ్యక్తమయిన పదార్థములును, అవ్యక్తములయిన పదార్థములును - సర్వమును - నీవని యిప్పుడు తెలిసికొంటిని. అతి మానుష చేష్టితుడవగు నిన్ను పరాత్పరుడవగు నారాయణుడవని చక్కగా నేను తెలిసికొంటిని".

భగవచ్ఛక్తి యొక్క నిర్వచనమును ఎంత తేటతెల్లముగా వ్యక్త పరిచినాడో గమనింపదగియున్నది. సర్వం విష్ణుమయం, ఏకేశ్వరోపాసన - భావములు వెల్లడి చేయబడి యున్నవి". తిరుమళిశై ఆళ్వారు వృత్తాంతమును విన్న రామానుజుడు పరమానంద భరితుడయ్యెను.

# 5. కులశేఖరాళ్వారు



"ముకుందమాల" నానతిచ్చిన కులశేఖ రాళ్వార్ల చరిత్రమును వినగోరుచున్నాన"ని యొకనాడు రామానుజుడు తన కోరికను వెలిబుచ్చగా, తిరుక్కచ్చినంబి కులశేఖరాళ్వార్ల దివ్య చరిత్రమును ఈ విధమున జెప్పదొడగెను.

శ్లో॥ ఘుష్యతే యస్యనగరే
రంగయాత్రా దినే దినే
తమహం శిరసా వందే
రాజానం కులశేఖరమ్.

శ్రీరంగనాథ భక్తుడయిన కులశేఖరుడు కేరళదేశపు రాజు.

శ్లో॥ కుంభే పునర్వసౌ జాతం
కేరళే చోళపట్టణే
కౌస్తుభాంశం ధరాధీశం
కులశేఖర మాశ్రయే.

కులశేఖరుడు శ్రీ విష్ణుమూర్తి యొక్క కౌస్తుభ రత్నాంశమున జన్మించినవారు.

కులశేఖరుడు రథ గజ తురగ పదాతులతో శత్రురాజుల నోడించి, ఏకచ్ఛత్రాధిపతిగా బలహీనులను బలవంతులు బాధింపకుండునట్లు మిక్కిలి ఉదారులై రాజ్యభారము వహించియుండిరి. ఇతడు వైష్ణవ భావము నెరిగినవాడై, రాజస తామస గుణ విముక్తుడై, సత్వగుణ ప్రధానుడై, సర్వ ప్రజామోదముగా రాజ్యభారము వహించుచుండెను. జనక మహారాజువలె రాజర్షియై ధర్మపరిపాలనము గావించిన రాజ

శిఖామణి యితడు. కమ్మని కవిత్వము చెప్పగల సంస్కృత, తమిళ పండిత ప్రకాండుడు. శరణాగతి తత్త్వమున నున్న కులశేఖరుడు సుఖ సంపదల యందాశవదలి, శ్రీరంగ క్షేత్రమున వెలసిన అనంత శయనుడు శ్రీరంగనాథుని కన్నులార సేవించి, తరింపవలయు ననెడి ఆశతో స్వామిని భక్తులను సేవించి, అనుభవించి, ఆనందించుట యెప్పుడోనని శ్రీరంగయాత్ర యందు ప్రతిదినమును ఆశ గలవాడై అచ్చట నిత్యవాసము జేయవలయునని సంకల్పించుచుండెను.

గంగానది మొదలగు తీర్థములకంటె శ్రేష్ఠమయిన స్వామి పుష్కరిణిని గలదియై, మహాత్ములు నిత్యవాసము జేయు తిరువేంగడమను తిరుమలయందు మృగాది జన్మములు, చెట్టుచేమలు పుట్టుకలనైనను పరిగ్రహించి, వాసముజేయ నాశించిన వాడు కులశేఖరుడు. మరియు నాతడు ఇతర దివ్యదేశముల నన్నింటిని సందర్శించి, సేవింప సంకల్పించి యుండెను.

వేదవేద్యుడగు పరమపురుషుని దివ్య గుణములతో నొప్పారు శ్రీరామచంద్రుని చరిత్రముగా రచింపబడినట్టియు, ఉపనిషత్ జ్ఞాన పూరితమును, ఇతిహాసరత్నమును అయిన శ్రీమద్రామాయణ కథా శ్రవణమును కాలక్షేపముగా నుంచుకొన్న భక్తుడు కులశేఖరుడు. రామాయణ కావ్య మూలపురుషుడు శ్రీరాముడును, భారత కథానాయకుడు గీతాచార్యుడు శ్రీకృష్ణుడును, సత్య, సౌందర్య, సుగుణ సంపన్నులగుటచే వారిరువురును కులశేఖరుని దృష్టిలో సమానులే.

శ్రీమద్రామాయణ పఠన సందర్భమున కులశేఖరుడీ క్రింది శ్లోకమును వినెను -

శ్లో॥ చతుర్దశ సహస్రాణి
రక్షసాం భీమకర్మణామ్
ఏక శ్చ రామో ధర్మాత్మా
"కథం యుద్ధం భవిష్యతి

భయంకరులగు రాక్షసులు పదునాలుగు వేలమంది, ధర్మ స్వరూపియగు శ్రీరాముడు - వీరి మధ్య యుద్ధము ఏ విధముగా జరుగగలదో" అని వాల్మీకి వ్యసనపడుచున్నాడు.

ఈ శ్లోకార్థమును గమనించిన కులశేఖర చక్రవర్తి, రామభక్తి తన్మయత్వమున, "స్వామి కేమి హాని కలుగునో, స్వామి కెవ్వరును సహాయులు లేరే", అని చీకాకునంది, తాము చతురంగ బలములతో స్వామికి సాయముగా బయలుదేరిరి. వీరి భక్తి చిత్త విభ్రమమును తెలిసికొన్న సానుభూతిపరులగు మంత్రులు రాజు నాపలేక, ఒక పన్నాగమును పన్నిరి - కొందరు భటులను రహస్యముగా రాజుకెదురంపి, "స్వామి యా పదునాల్గవేల దుష్టరాక్షసులను తామొకరే సంహరించి, మరలి వేంచేసిరి," అని తెలియబరచిరి. అది విని కులశేఖరుడు అమితానందమున నిజనగరమున జేరెను. కులశేఖరుని వైష్ణవ సంశ్లేష భావమిట్టిది.

"వైష్ణవ భక్తుల సహవాసముచే మన ప్రభువున కింతటి కలవర మేర్పడినది. ఈ వైష్ణవ భక్తి పారవశ్యమున ఇక మనరాజు అప్రాపంచకముగా పరిణమించు నాపద సంభవింప వచ్చును. వీరి భక్తిభావమును, విశ్వాసమును కొంతవరకైనను తగ్గించుట యుక్తమ"ని అమాత్యులు తలచి, ఒక చక్కటి ఉపాయమును బన్నిరి. రాజునకు వైష్ణవభక్తులపై నున్నట్టి వ్యామోహమును తగ్గింప ప్రయత్నింప సంకల్పించిరి.

శ్రీ కులశేఖరుని రాజప్రాసాదమున నిత్య నైవేద్య ఆరాధనము కొరకు ఏర్పాటయియున్న దైవ సన్నిధిలో స్వామి యలంకారము కొరకుపయోగింప బడుచున్న అమూల్య రత్న ఖచిత కనక హారమును మంత్రులు రహస్యముగా తీసి, దాచియుంచి, ప్రభువునకు ఆంతరంగు లగు వైష్ణవభక్తులు దాని నపహరించి యుండనోపునని వారొక ప్రవాదమును కల్పించిరి. అది విని కులశేఖరుడు "వైష్ణవభక్తులట్టి నీచ కార్యమున కొడిగట్టర"ని, శపథము జేయుచూ, తన విశ్వాసమును

జొప్పించి, జయించెను. దీనిని తిలకించిన మంత్రులు వెరచి, భయపడి, రత్నహారమును దెచ్చి రాజున కొసగి క్షమింపుడని రాజును వేడిరి. వైష్ణవులయెడ, దైవకృప యెడ కులశేఖరున కున్నట్టి దృఢ విశ్వామట్టిది.

తరువాత కులశేఖరుడు భగవద్విముఖుల మధ్యనుండు స్థితిని ఓర్వజాలక, తమ కుమారులకు రాజ్యాభిషేకం బొనర్చి, రాజ్య భారమును వారి కప్పగించి, పరమ విరక్తులై, తమకు అంతరంగు లయిన శ్రీ వైష్ణవ భక్తుల సహవాసముతో శ్రీరంగధామమునకు వేంచేసి, శ్రీరంగనాయకుని కన్నులార తిలకించి, సేవించి, విశ్వరూప చిహ్నమగు శ్రీరంగనాయక శ్రీ విగ్రహమును నోరార స్తుతించి, అనుభవించి, సంశ్లేషపడి, ఆ దివ్య అనుభవమున గలిగిన అత్యధిక ప్రీతిచే, భగవద్భాగవత వైభవమును సర్వులు గుర్తెరిగి ఉజ్జీవించునట్లు "ముకుందమాల" అను ప్రబంధమును, "పెరుమాళ్ తిరుమొళి" అను మరియొక దివ్య ప్రబంధమును ఆనతిచ్చి, భక్త లోకమును సుఖింపజేసి, తన జీవితమును సార్థకము జెసికొనెను. ఆళ్వారను విశిష్టనామ ధేయమును పొందెను.

కులశేఖరుడు శ్రీకృష్ణుని దేవదేవునిగా, గీతాచార్యుడుగాన జగద్గురువుగా భావించి, ముకుందమాల స్తోత్రప్రబంధమును రచించెను. ఇది భక్తిరస పూరితమేగాక, గొప్ప పాండిత్య ప్రకర్షమును ప్రకటించు ప్రబంధము. కులశేఖరాళ్వారు తాను దశరథునిగా భావించు కొని, శ్రీరాముని ప్రేమించినట్లును, శ్రీరాముని సత్య సౌందర్య సుగుణ సంపత్తిని పొగడునట్లును తెల్పుతూ "పెరుమాళ్ తిరుమొళి" అను ప్రబంధమును తమిళమున రచించెను. ముకుందమాల సంస్కృతమున రచింపబడినది. ఈ ప్రబంధ ద్వయము భక్తులకు పరమ దివ్య రచనలు.

కులశేఖరాళ్వారు తిరుమల నొకసారి దర్శించి శ్రీ వేంకటేశ్వరుని సన్నుతించియున్నాడు.

శ్రీ కులశేఖరాళ్వారు బాల్యము, యౌవనము, కౌమారము, వార్ధకము అని జీవిత చతుర్దశలను సక్రమముగా, సంపూర్ణముగా పురుషార్థముల బడయుచూ గడిపిన మహావ్యక్తి. బ్రహ్మచర్యము, గృహస్థాశ్రమము, వానప్రస్థాశ్రమము, సన్యాసము అను జీవిత చతురాశ్రమముల నియమబద్ధముగా లోకకల్యాణ దృక్పథమున గడిపిన పుణ్యపూర్ణజీవి శ్రీ కులశేఖరాళ్వారు. ఇతడు సర్వులకును ఆదర్శప్రాయుడు.

కులశేఖరాళ్వారుల దివ్య చరిత్రమును క్లుప్తముగా స్థూలముగా నీవిధమున తిరుక్కచ్చినంబి నుండి వినిన రామానుజుడు పరమానంద భరితుడై, "స్వామీ! కులశేఖరాళ్వార్ల జీవిత చరిత్ర వినగానే వారి దివ్య రచనలను చదివి ఆనందింప వలయునని నా మనమువ్విళ్ళూరు చున్నది", అని పలికెను. "రామానుజా! కులశేఖరుని దివ్య రచనలనే గాదు, ద్వాదశాళ్వారుల రచనలన్నింటిని చదువగలవు, ప్రచారము చేయగలవు", అని తిరుక్కచ్చినంబి మందహాసము జేయుచూ రామానుజుని ఆశీర్వదించెను.

# 6. తొండరడిప్పొడి ఆళ్వారు



రామానుజుడు తొండరడిప్పొడి ఆళ్వారుల దివ్య చరిత్రమును తిరుక్కచ్చినంబి నుండి యిట్లు తెలిసికొనెను.

"తొండరడిప్పొడి" అనగా "భక్తుల-పాద-ధూళి" అని అర్థము. "తొండ-ర-డి-ప్పొడి" అను తమిళ సమాసమునకు సరియైన సంస్కృత సమాసము "భక్తాంఘ్రిరేణువు". ఇది బిరుదములాంటిది. వీరి ప్రథమ నామధేయము విప్రనారాయణుడు.

విప్రనారాయణుడు బ్రాహ్మణ కులజుడు. జన్మస్థానము తిరుమండన్‌గుడి అను గ్రామము. మహావిష్ణువు యొక్క వైజయంతీ మాల అంశమున వీరు జన్మించిరని భక్తులు భావింతురు.

శ్లో॥ కోదండే జ్యేష్ఠ నక్షత్రే
మండంగుడి పురోద్భవమ్
చోళోర్వ్యాం వనమాలాంశం
భక్త పద్రేణు మాశ్రయే.

ఇతడు బాల్యము నుండి యౌవనదశకు రాగానే గొప్ప భక్తుడై అతి శ్రద్ధతో తోట పనిజేసి పుష్పమాలలనల్లి శ్రీరంగనాథునకు సమర్పించువాడు. శ్రీరంగనాథుని దేవాలయమునకు సంబంధించిన పుష్పవనమున నొక మూల పర్ణశాలయందు రాత్రి విశ్రాంతి కొరకు తలదాచుకొనువాడు. పగలంతయు తోటయందే పనిజేయు చుండెడి వాడు. అహర్నిశము భగవన్నామ సంకీర్తన జేయుచుండువాడు.

విప్రనారాయణుడు అవివాహితుడు. స్త్రీ ముఖ సందర్శనమునకు విముఖుడనని ప్రతిన బూనినవాడు. ఇట్లుండ నొకనాడు దేవదేవి యను అప్సరస వంటి వేశ్యకుల కన్య వైవాహికజీవితము నొల్లక, శ్రీరంగమున రంగనాథుని సేవించుచూ, శ్రీరంగమునందే తాను జీవించి, తరింపవలయుననెడి సంకల్పమున శ్రీరంగమునకు వచ్చియుండి, పుష్పవన మందున్న విప్రనారాయణుని జూచెను. ఆతని నవమన్మథ రూపురేఖావిలాసమునకు సమ్మోహితయై, ఆతనిని మనమున దృఢముగ వరించినదై, ఆతని పరస్త్రీ విముఖత్వ భావమును ముందుగనే తెలిసికొనినదై, ఆతనిని సమీపించి పలుకరింప ధైర్యము లేనిదై, విశాలమయిన దేవాలయ పుష్పవనమున నొక మూల వాసము జేయుచూ, పూలమొక్కలకు నీరుపోయుట మున్నగు తోటపనుల యందు నిమగ్నురాలై యుండెను. ఒకనాడు విప్రనారాయణుడు ఆమెను గాంచి, ఆమె వృత్తాంత మెట్టిది యని యడుగగా, దేవదేవి వానితో నిట్లనియె, "స్వామీ! నేను వేశ్యకుల కన్యను. శ్రీరంగనాథ దర్శనమునకు వచ్చియుండి, దర్శనాంతరము నా స్వగ్రామమునకు పోవ నిష్టపడక, శ్రీరంగనాథునకే నా జీవితము నంకితము జేసితిని. అందువలన నేనును మీవలెనే మాలాకారవృత్తి నవలంబించి యీ ఉద్యానవనముననే నుండదలచితిని".

"అట్లే కానిమ్ము", అని పలికి, విప్రనారాయణుడు పరాన్ముఖుడై తనపని తాను చేసికొనుచునుండెను.

"ఎంతకాల మీతడు నా సమక్షమున నుండియు, నాతో భాషింపక, పరాన్ముఖుడై యుండగలడు? ఎప్పటికైనను నాకు వశపడగలడను విశ్వాసము నాకున్నది. నేను ఆతురత పడవలసిన యవసరము లేదు", అని తలంచిన దేవదేవి ఒక విధమయిన తృప్తితో కాలము గడపు చుండెను. ఆ తృప్తి యేమనగా విప్రనారాయణుడు తన్ను తోట నుండి బహిష్కరింపలేదనుటయే.

ఒకనాడు విప్రనారాయణుడు పూలమాలల గట్టుచుండగా, వెలుపల వర్షమున దడసిన దేవదేవి లోనికి వణకుచూ వచ్చెను. సహజ

సానుభూతితో విప్రనారాయణుడు తన అంగవస్త్రము నామె కొసగెను. ఆమె అతని ఉత్తరీయమును ధరించి, తన చీరను పిండి ఆరవేసి కొనుచుండెను. అర్ధనగ్నగా నున్న దేవదేవిని జూచి, మన్మథ వికారమున నామెను సమీపించి, ఆమెను పరిణయమాడెదనని విప్రనారాయణుడు వెల్లడించెను. వెంటనే వశమై నట్లుండుటకంటె కొలది బెట్టుజూపుట యుక్తమని దలచిన దేవదేవి, "నాకు వేయి వరహాల శుల్కము నిచ్చి నన్ను గ్రహింపు", మని దేవదేవి మందహాసము లొలుక మెల్లగా ననెను. "అట్లే జేసెద"నని విప్రనారాయణుడనెను. అది మొదలు వారిరువురు అన్యోన్యభావమున భాషించుచూ, తోట మొక్కలకు నీరు పోయుచూ, పుష్పహారముల గట్టుచూ, స్వామికి వాని నర్పించుచు, కాలము గడుపు చుండిరి. కాని "ఎప్పుడు ఏ విధమున సహస్రవరహాల శుల్కమును సంపాదించి దేవదేవిని బడయుదునా", అని విప్రనారాయణుడు వాపోవుచుండెను. "అనవసరముగా మానస చాంచల్యముతో ఆలోచనా రహితముగా నేను శుల్కమను షరతును బెట్టితిని. నేనెపుడు విప్రనారాయణుని బడయగలుగుదును?" అని దేవదేవి ఉబలాట పడుచుండెను.

ఒకనాడు ఉద్యానవన ద్వారమున ఆలోచనా నిమగ్నుడై కూర్చొని యున్న విప్రనారాయణునొద్ద కొక దూరదేశ వర్తక యాత్రికుడు వచ్చెను. విప్రనారాయణుని భక్తికి, దినచర్యకు తానెంతయో ఆనందించి, "స్వామీ! నేననేక సువర్ణాభరణముల జేయించుకొని వచ్చియున్నాను. వాని నన్నిటిని శ్రీరంగనాథున కర్పింప నెంచితిని. ప్రతి యాభరణముపై నాయింపార స్వామివారి ముద్రను గూడ చెక్కించితిని. ఇదిగో! ఈ బంగారు పళ్లెమును తమరికివ్వవలయునని నాకిచ్ఛ గలిగినది. స్వామి వారి భక్తున కిచ్చినను స్వామికి సమర్పించినట్లే యగునని నా అభిమతము", అని చెప్పుచూ ఆ పసిడి పళ్లెమును విప్రనారాయణున కొసంగెను. కనకముపై వాంఛ, వ్యామోహములు లేనివాడయ్యును, దానిని దేవదేవికి శుల్కముగా నిచ్చుటకు తగియున్నదని వ్యామోహము జెందిన విప్రనారాయణుడు పళ్లెమును స్వీకరించెను. వెంటనే దానిని తన పర్ణశాలలోనికి తీసికొనిపోయి, దేవదేవికి ఇవ్వబోయెను.

వాస్తవముగా దేవదేవి విప్రనారాయణుని కాంక్షించి యుండెనే గాని, అతడిచ్చు శుల్కమును గాదు. అక్రమమార్గమున నాతడు పసిడి పళ్లెమును బొందెనేమో అని తలంచి, దానిని తాక నొల్లక, "ఇది యెక్కడిది? స్వామివారిముద్రకూడా దీనిపై చెక్కబడి యున్నదే? దొంగిలించితిరా? నాకొరకు మీరెంత అపచారమున కొడిగట్టితిరి?" అని బిగ్గరగా నేడ్వసాగెను.

విప్రనారాయణుని కంగారు వర్ణనాతీతము. సత్యము నామెకు తెలుపవలయు ననెడి యుద్దేశముతో, తనకా పళ్లెము నిచ్చిన వర్తకుని తోడ్తెత్తునని చెప్పుచూ, నాతడు దేవాలయము వైపు వడివడిగా పోయెను. ఈలోగా తోటయందు పనిజేయుచుండిన దేవాలయపు పనివారు, వీరి సంభాషణమును కుటీరపు వెలుపల నుండియే వినినవారై, స్వామి సొత్తేదో పర్ణశాల జేరినదని తలచి, వేవేగ చని, దేవాలయాధికారితో జరిగినది, వినినది దెల్పిరి.

దేవాలయ సేవకులు వెంటనే పర్ణశాలకు వచ్చిరి. ఈ లోగా వర్తకుడగపడలేదని విప్రనారాయణుడు పర్ణశాల జేరెను. దేవాలయ సేవకులు పర్ణశాలయందు నేలపై బడియున్న బంగారు పళ్లెమును జూచి, స్వామి సొత్తు తస్కరింపబడినదని తలచి, దానిని స్వాధీన పరచుకొని, విప్రనారాయణుని దేవదేవిని దేవాలయ ప్రధానాధికారి కడకు దీసికొని వచ్చిరి.

ఈ దృశ్యమును జూచిన వారెల్లరును, దేవాలయములోని సిబ్బందియు, దేవాలయాధికారులును వారిరువుర నిందించు చుండిరి. విప్రనారాయణుడు చెప్పినది యెవరును వినిపించుకొనలేదు. ఈ లోపల ఈ వార్త దేవాలయ ప్రాంగణమంతయు విస్తరింపగా, దూరదేశ వర్తక యాత్రికుడా వార్త విని, తన మూలమున భక్తుడు, నిరపరాధియు అయిన విప్రనారాయణుడు నింద, ఆపదల పాలాయెనే అని చింతించుచు, వేవేగ దేవాలయ విచారణ స్థానమునకు వచ్చి, జరిగనదంతయు నివేదించెను. పొరపాటుగా, త్వరపడి అనుమానించి

విప్రనారాయణుని దూషించినందులకు దేవాలయ ప్రధానాధికారి విప్రనారాయణుని పాదములపై బడెను. విప్రనారాయణుడును దేవదేవియు, సంతోషమున సువర్ణ తాంబాళమును రంగనాథుని కర్పించి, తమ తులసి వనమును ప్రవేశించిరి.

ఇరువురును చింతాక్రాంతులై ఒక విశాల వృక్ష మూలమున కూలబడి, వారిటీవలి మనస్తత్వముల దుష్పరిణామమును గూర్చి సింహావలోకనము గావించుకొన దొడగిరి. అవివాహితుడుగా నుండ గోరి, పరస్త్రీ సౌందర్యముచే నాకర్షింపబడి, ఋజుమార్గము నుండి తొలగినందులకు శోకించి, పశ్చాత్తాప పడినాడు విప్రనారాయణుడు; తన జీవితము తాత్కాలికముగానైనను మలినపడుటకు ఎలుగెత్తి యేడ్చినాడు; కన్నీరు మున్నీరుగా కారినవి.

వేశ్య కులమున బుట్టిన తనకట్టి సౌందర్య సంపద యెందుల కనియు, వేశ్య వృత్తిలో తన పెద్దవారు తన్ను ప్రవేశపెట్టు దుష్కాలము సమీపించునేమో అని భయపడుచు, ఈ జన్మమున వేశ్యవృత్తిలో బడక, అవివాహితగానే యుండి, శ్రీరంగనాథుని దర్శించి, తన సర్వస్వమును స్వామికి సమర్పించి, శ్రీరంగముననే తన జీవితమును గడిపి, అచటనే తరింపదలచిన తాను, మన్మథ పరవశయై, సాధువును నిరపరాధియు నయిన విప్రనారాయణుని చలింపజేసి, ఆతని నిర్మల జీవితమునకు కళంకము దెచ్చిన తాను ఘోరాపరాధిని ననియు, క్షమాపణార్హతను గోల్పోయిన దානననియు, తలచుచు, పంచ భూతములు సానుభూతి నందునట్లు బిగ్గరగా పసిబిడ్డవలె నేడ్చెను.

ఇట్లు పశ్చాత్తాప భరిత విలాపములతో పవిత్రులయిన వారిరువురు వారి శేష జీవితముల శ్రీరంగముననే మిత్ర భావమున భక్తి ప్రపత్తులతో గడుపవలయునని నిర్ణయించుకొనిరి. సత్యమును గనిన ప్రజలు వారిని గౌరవించి; పూజించు చుండిరి.

విప్రనారాయణుడు భగవన్నామ సంకీర్తనము గావించుకొనుచూ, దేవదేవిని తన శిష్యురాలుగా స్వీకరించెను. వారిరువురును స్వామివారి

తులసివనముననే యుండి, జీవితమంతయు పుష్పకైంకర్యమునందే గడపి, స్వామిని స్తోత్రము జేయుచూ, కడపట శ్రీరంగమునందే స్వామి సన్నిధానమున, పూర్ణ జీవితాంతమున పరమపదించిరి. వక్రమార్గము నుండి తన్ను రక్షించి, ఋజుమార్గమును జేర్చినది పరశక్తియే యని భావించి, విప్రనారాయణుడు తన ప్రతిజ్ఞను కడకు దైవమే నిలబెట్టెనని తలచి, అది మొదలు "తొండరడిప్పొడి" అను తిరునామమును స్వీకరించెను. (తొండర్ = భక్తుని యొక్క అడి = పాదము యొక్క, ప్పొడి = రజము లేక దుమ్ము - అని భావము). అగణిత భక్తి ప్రపత్తులతో నానందమున నోలలాడుచుండిన విప్రనారాయణుని భక్తులెల్లరు "తొండరడిప్పొడి ఆళ్వార"నియు, "భక్తాంఘ్రిరేణు ఆళ్వార"నియు ప్రశంసించినందువలన వారు ఈ దివ్య నామముల శాశ్వత కీర్తి నందియున్నారు.

తొండరడిప్పొడి ఆళ్వారు తమిళమున "తిరుమాలై" "తిరుప్పళ్ళి యెజిచ్చి" అను స్తోత్ర గ్రంథ ద్వయమును రచించెను. "తిరుమాలై" యనునది "ముకుందమాల" వలె శ్రీరంగనాథ స్తోత్ర శ్లోకరత్నమాల. "తిరుప్పళ్ళియెజిచ్చి" అనునది భగవంతునకు సుప్రభాతము పలుకుచూ, స్వామిని మేల్కొలుపు పాశుర సంపుటి.

తొండరడిప్పొడి ఆళ్వారు దివ్య చరిత్రమును ఈ విధముగా ఆకర్ణించిన రామానుజుడు వారి దివ్య ప్రబంధముల పఠించు శుభ సమయము తనకెప్పుడు గల్గునో యని వాపోయెను. తానును భక్తాంఘ్రిరేణువుగా తన జీవితమును జరుపదలచు కొనెను.

# 7. తిరుప్పాణ్ ఆళ్వారు



తిరుప్పాణ్ ఆళ్వారు శ్రీ విష్ణుమూర్తి యొక్క శ్రీవత్సము యొక్క అంశమున జన్మించిన వారని భక్తుల భావము. వీరు పంచమ కులజులు. వీరి జన్మస్థానము ప్రస్తుత తమిళనాడు రాష్ట్రములోని ఉరైయూరు.

శ్లో॥ వృశ్చికే రోహిణీ జాతం
శ్రీపాణం నిచుళా పదే
శ్రీవత్సాంశం గాయకేంద్రం
మునివాహన మాశ్రయే.

ఇతడు హస్తమున తంబురబూని, భగవన్నామ సంకీర్తన గానము చేయుచూ, తన్మయత్వమున నుండెడివాడు. ఇతడెప్పుడును శ్రీరంగ పుణ్యక్షేత్రమున కావేరీ తీరమున తిరుగుచూ, శ్రీరంగనాథ దేవాలయ గోపుర శిఖరములను దవ్వున నుండి దర్శించుచు, తంబుర మీటుచూ, నాట్యము జేయుచూ, శ్రీహరి సంకీర్తనము జేయువాడు. రేయింబగళ్ళు పరమానంద భరితుడై భక్తి పరవశమున నుండువాడు. అనేకమార్లు వైష్ణవ సంశ్లేష భావమున బాహ్య స్మృతిని గోల్పోయి నేలపై పరుండెడివాడు.

ఏమి యాహారమును పుచ్చుకొనునో, యెప్పుడు తిండిదినునో, ఎవరు పెట్టెదరో, ఎవ్వరికిని తెలియదు. కాని అతడు సతతము ప్రాభాత నీరజ బంధు ప్రభలవలె ప్రకాశించు కోమల శరీరకాంతుల నొప్పారు వాడు. పంచముడనబడు వాడుగాన ఇతనికి శ్రీరంగపురి వీధులలోనికి గూడా ప్రవేశము లేదు.

ఒకనాటి ఉదయమున శ్రీరంగనాథ దేవాలయ ప్రధానార్చకుడు, సర్వవేదాంగ పారంగతుడు లోకసారంగముని (శ్రీ వరరంగ మహాముని

అనియు పిలుతురు) స్వామి అర్చన కొరకు కావేరీనది నుండి తీర్థపు బిందెను శిరముపై నిడికొని, వచ్చుచుండెను. దారిలో కొంత దవ్వున ఇసుక తిన్నెపై శయనించి యుండిన తిరుప్పాణిని జూచి, ఏమిరా! మాలవాడా! దారి కడ్డముగా బారుదూలము వలె పడియున్నావు? నీకు వేరుచోటు దొరకలేదా నిద్రించుటకు? ఇంత ప్రొద్దెక్కినను మొద్దువలె పడియున్నావు? లే, లెమ్ము! తొలగిపొమ్ము!'' అని అరచెను.

భక్తి పారవశ్యమున తన్మయుడై బాహ్య స్మృతిని బాసియున్న తిరుప్పాణ్‌కి ఆ కేకలు వినబడలేదు. లోకసారంగముని విసిగి, కోపగించి, అచ్చట పడియున్న నొక కొక్కెరాతి ముక్కను చేగొని తిరుప్పాణ్‌పై విసరెను. ఆ దెబ్బకు తిరుప్పాణ్ కనులు తెరచి, బ్రాహ్మణుని జూచి, హడలి, వణకుచూ లేచి, "స్వామీ! అపరాధిని! క్షమింపుడు", అనుచూ చివుక్కున లేచి, తొలగి దూరముగా పరుగిడెను.

లోకసారంగముని నడువసాగెను. తాను తిరుప్పాణ్‌పై రాయి రువ్వడము, రాయి తిరుప్పాణ్‌కి తగలడము, ఆయన భయ వినయములతో, "అపరాధిని నంటూ" పరుగిడడము, మొదలుగా గల సంఘటన పరంపర తన మనసునకు వచ్చెను. సంస్కారిగావున జ్ఞానోదయము గలిగెను. కులాంధకార గాఢ మేఘముల వెనుకనున్న జ్ఞానభాస్కరుడు వెలుపలకు వచ్చెను. పశ్చాత్తాప మనస్కుడాయెను. తానే అపరాధినని గ్రహించెను. భగవద్గీతలోని శ్లోకమొకటి తటాలున జ్ఞప్తికి వచ్చెను.

> శ్లో॥ విద్యా వినయ సంపన్నే
> బ్రాహ్మణేగవి హస్తిని
> శునిచైవ శ్వపాకే చ
> పండితాః సమదర్శినః.

లోకసారంగముని తనలో తాను ఇట్లు తర్కించుకొనుచూ మెల్లగా నడచుచుండెను. "నేను నిజమైన పండితుడ నయియుంటే తిరుప్పాణ్ నట్లు అనాదరించియుందునా? నేను జూపిన క్రూరత్వమునకు

తిరుప్పాణ్ కోపింపక, విసుగుజెందక, క్షమింపుడనుచూ తానే వినయమున తొలగిపోయినాడు! నేను ఆత్మను మరిచి, మూఢాచారమున మ్రగ్గుచున్నాను. "ఆత్మవత్సర్వ భూతాని" అని చదివితినే గాని, దాని భావమును గ్రహింపనైతిని. భక్తి లక్షణములు తిరుప్పాణ్ యందే సంపూర్ణముగా నున్నవి. నాయెడ మృగ్యము. భేదబుద్ధితో జీవించు నేను భక్తుడ నెట్లగుదును? మహాభక్తుడయిన తిరుప్పాణ్ అస్పృశ్యుడా! ఆతనిని అస్పృశుడుగా భావించిన నేనే అస్పృశ్యుడ నయితిని. మహాభక్తుడయిన తిరుప్పాణ్‌ని రాతితో కొట్టిన నేను అజ్ఞానమున నిద్రించునట్టివాడను. ధ్యానముననున్న తిరుప్పాణ్ వాస్తవముగా నెరుకలో నున్నవాడు. నాయట్టి మూఢునకు తెలివి గరుపుటకు వచ్చిన ఉద్ధారకుడు తిరుప్పాణ్", అని తలుచుచూ, బాహ్య ప్రపంచమును మరచి నడుచుచున్న లోకసారంగముని అటు కన్ను విప్పి చూడ, తాను దేవాలయ గర్భగుడి ద్వారమును చేరియున్నాడు. వెంటనే తీర్థపు బిందెను ద్వారమునందుంచి, ఉన్మాదునివలె, "కనుగొంటిని, కనుగొంటిని" అని కేకలు వేయుచు లోకసారంగముని నదివైపు పరుగిడుచుండెను. ప్రజలెల్లరు ఆశ్చర్యమున జూచుచుండిరి. కావేరీగట్టున ముకుళిత నేత్రుడై ధ్యానమున పరుండి యుండిన తిరుప్పాణ్‌ని లోకసారంగముని ముట్టెను. "స్వామీ! నన్ను ముట్టుచున్నారేల?" అనుచూ తిరుప్పాణ్ తొలగి తొలగి పోవుచుండెను. "తిరుప్పాణ్ ఆళ్వార్లూ! నన్నింకను పరీక్షించెదవా?" అనుచూ, బలాత్కారముగా తిరుప్పాణ్‌ని పట్టుకొని, ఎత్తి తన భుజముపై నిడికొని, ఆలయము చుట్టును మూడుమార్లు ప్రదక్షిణము జేసి, తరువాత తిరుప్పాణ్‌ని స్వామి ద్వారముకడ దింపెను. ఇంతవరకు (యోగి వాహనుడు) మునివాహనుడుగా నున్న తిరుప్పాణ్ తన్మయతతో వీణను మీటుచూ, దైవసంకీర్తనము జేయుచూ, నిలువబడెను. బ్రాహ్మణ వైష్ణవ బృందము నివ్వెరబోయి చూచుచుండిరి. గర్భగుడి ద్వారము గణగణ శబ్దముతో తెరువబడెను. దేవాలయ గంటలు మ్రోగెను. దైవారాధన కాలమది.

తన జీవితమున మొదటిసారిగా గర్భగుడిలోని స్వామి మూల విరాట్ దర్శనము గావించిన తిరుప్పాణ్ యెంతో కాలము అట్లే తన్మయత్వమున బాహ్యస్మృతి దప్పి, ద్వారమున సాష్టాంగ నమస్కారమున నుండెను. కొంతసేపటికి, తేరి, నిలుచున్న తిరుప్పాణ్ స్వామివారి దివ్యమంగళవిశ్వరూప విగ్రహమును తిలకించుచూ, ఏ విశ్వమునకును విశ్వమయ ఈశ్వరశక్తికిని చిహ్నముగా ఈ విరాట్ విగ్రహము ఉన్నదో, అట్టి సర్వాంతర్యామి యగు వైష్ణవశక్తి, దాని విభూతులు, వైభవములు, అన్నిటినీ ఏకకాలమున మనసునకు దెచ్చుకున్నవాడై, తన పాండిత్యము గానకళ సార్థకముకాగా, స్వామి అవయవ సౌందర్యమును (ఆపాదమస్తకము) గూర్చి సంస్తుతించెను. ఈ దివ్య సంస్తుతియే "అమలనాది ప్పిరాన్" అను ప్రబంధము.

తిరుప్పాణ్ ఆళ్వారుల దివ్య చరిత్ర వైభవమిట్టిది. వీరు మునివాహనుడు, యోగివాహనుడు, గాయకేంద్రుడు అను నామముల భక్తులచే కొనియాడబడు చున్నాడు.

అమలనాది ప్పిరాన్ అను ప్రబంధము ద్రావిడ వేద ప్రబంధము లలో అతి ముఖ్యమయినది. అది యొక దివ్యభక్తి సారస్వత ఖండము.

శ్రీ తిరుప్పాణ్ ఆళ్వార్ చరిత్రమును ఇట్లు తిరుక్కచ్చినంబి వద్దనుండి గ్రహించిన రామానుజుడు ఎంతయో ప్రభావితుడై, తన జీవితమున ఆళ్వారుల నాదర్శముగా పెట్టుకొన వలయునని సంకల్పించుకొనెను. కులద్వేషము సంఘాభివృద్ధికి నిరోధకమని రామానుజుడు గ్రహించెను.

# 8. తిరుమంగై ఆళ్వారు



తిరుమంగైయాళ్వారు శ్రీ మహా విష్ణుమూర్తి యొక్క శార్జమను ధనస్సు అంశమున జన్మించిన వారని భక్తుల విశ్వాసము. ఈతడొక దోపిడిదొంగ. వీరి బాల్యనామము మరుగున బడినది. తిరుమంగై యను ప్రదేశమునకు నాయకుడుగా నున్నందున తిరుమంగై వారు అని పిలువబడు చుండిరి. భక్తి శిరోమణికాగా తిరుమంగై ఆళ్వారను దివ్యనామము ప్రసిద్ధిగాంచిరి.

శ్లో॥ వృశ్చికే కృత్తికా జాతం
చతుష్కవి శిఖామణిమ్
షట్ప్రబంధ కృతం శార్జన్
మూర్తిం కలిహ మాశ్రయే.

వీరి జన్మస్థానము తిరువాలి తిరునగరికి సమీప గ్రామమయిన తిరుక్కురైయలూరు. వీరి ప్రథమ నామధేయము "నీలన్" అని ప్రబంధముల గలదు.

ఈ విధముగా తిరుక్కచ్చినంబి తిరుమంగైఆళ్వారుని దివ్య చరిత్రము జెప్పనారంభింపగా, రామానుజు డతి యుత్సాహముతో వినుచుండెను.

తిరుమంగై యౌవనమున నొక సైన్యాధిపతిగా నుండి, తరువాత నొక చిన్న ప్రదేశమునకు ప్రభువాయెను. ఇతడు అధికారైశ్వర్యముల గలిగి యుండియు, శాంతి సుగుణ సంపన్నుడని వినుతికెక్కెను. సామాన్య వైష్ణవభక్తుడుగా నుండి, తన విధ్యుక్త ధర్మములను న్యాయ సమ్మతముగా నెరవేర్చువాడు; దాన నిరతుడని పేర్గాంచిన వాడు.

ఇతడు కుముదవల్లి యను వైష్ణవ కన్యను ప్రేమించి, వివాహమాడ ప్రయత్నించెను. ఆమె బాల్యము నుండియు వైష్ణవ తత్త్వము గలది గావున క్షత్రియునితో వర్ణాంతర వివాహమునకు విముఖత చూపలేదు. మరియు నతడు బలశాలి, ప్రభువు. కావున అతని కోరికను తిరస్కరించుట అపాయకరమని ఆమె భావించెను. ఆమె కోరిక యొక్కటియే - అతడు నిరంతర వైష్ణవ భక్తుడుగానున్న పక్షమున అతని పరిణయమాడుటకు ఆమెకు ఆక్షేపణలేదు. అతని వైష్ణవభక్తి, పట్టుదలను పరీక్షింప దలచినది.

కుముదవల్లి తిరుమంగైతో ఇట్లనెను, "నీవు దినమునకు వెయ్యి మంది విష్ణుభక్తులకు భోజనము లేర్పాటు జేయుచూ, అట్టి సంతర్పణము 365 దినములు జరుపగలిగిన యెడల నేను నిన్ను వివాహమాడెదను. ఇందులకు మా తండ్రిగారి సమ్మతిని నేనే పొందగలను. నీవు వైష్ణవ భక్తుడవని తెల్పితివిగాన, వైష్ణవ కన్యయైన నా యీ కోరికను నెరవేర్పుము".

ఆమె విజ్ఞానవంతురాలును, వివేకవంతురాలును అగుటచే తనలో తాను ముందుగనే వితర్కించుకొని ఒక నిర్ణయమునకు వచ్చియే యుండెను, "నాయాత్మను నేనెన్నడో శ్రీరంగనాథున కంకిత మొనర్చియున్నదానను. వైష్ణవభక్తి సౌరభముగల యీ తిరుమంగై 365 దినములు అవిఘ్నముగా వైష్ణవ భక్తకోటికి సంతర్పణలు గావించుచు, వారితో సంపర్కము కలిగియున్న పక్షమున తాను గొప్ప సంస్కారియై స్వామికే ప్రపత్తుడగును. ఈ లోపల, నీతని కోరికను నేను తిరస్కరింప నవసరములేదు".

తిరుమంగై ఐశ్వర్యవంతుడైనందునను, మాట చెల్లుబడి గలవాడై నందునను, కుముదవల్లి యొక్క సౌందర్య సుగుణ సంపత్తినే గాక, ఆమె యొక్క వైష్ణవశాఖను అభిమానించినవాడై, ఆమె బెట్టిన షరతునకు అంగీకరించెను. తిరుమంగై వెంటనే వ్రతమును సాగించి, దినమునకు సహస్ర వైష్ణవ భక్తులకు షడ్రసోపేత భోజనములు నేర్పాటు

గావించుచుండెను. విశాలమయిన నూతన సంతర్పణశాలలు వైష్ణవ భక్తుల భజనలతోడను, సత్సంభాషణలతోడను, వైష్ణవ మత తత్త్వ చర్చలతోడను, ఒక పుణ్యక్షేత్రమువలె పరిణమించినవి.

అనుదినము వెయ్యిమందికి తక్కువలేని వైష్ణవభక్త బృందమునకు తోడు, పెక్కుమంది పనివాండ్రు, సేవకులు, కార్యనిర్వాహకులు, అసంఖ్యాక బీదప్రజలు, యాత్రికులును భోజనములచటనే చేయు చుండుటచేత, కొలది మాసముల కాలమునకు తిరుమంగై వారి యొక్క ధనమంతయు కరిగిపోయెను. ఇక ఈ సంతర్పణ కార్య క్రమమునకు రాబడియెట్లు? యాచకము వలన ఈ బృహత్కార్యము నెరవేరదని గ్రహించెను. అధర్మపరులైన ధనవంతులను దోపిడీజేసి భక్తులను, బీదలను పోషించుట ధర్మమే యగునని తిరుమంగై తలంచెను.

తనకు హృదయపూర్వకముగా సేవజేయు విశ్వాసపాత్రులయిన కొంతమంది బలశాలురను, నిపుణులను చేరదీసి, ఈ అనుచర బృందముతో సమీపారణ్యములలో రహస్య ప్రదేశముల యందు దాగి, తిరుమంగై అడవిని దాటు ధనవంతులయిన వ్యాపారులను, యాత్రికులను కొల్లగొట్టసాగెను. యాత్రికులు తమ ముడుపులను శ్రీరంగనాథున కర్పించువారేకదా? కావున వారి ముడుపుల దోపిడీ జేయుటచే వారు నష్టపోయేదేమున్నది? అక్రమ సంపాదన గావించు వర్తకులను దోపిడీ చేయుట పాపము కాదు; ఆ దోపిడీ ధనమును భక్తులకు బీదలకు వినియోగించునపుడు ఇక తప్పేమున్నది? ఇది తిరుమంగై ఆలోచనా క్రమము. ఇక సామాన్యుల జోలికి పోవువాడు కాడు. అట్టివారి కింకను కొంతదారి సహాయమును కలుగజేయుచూ, సురక్షితముగా తన సంతర్పణశాలకో, రంగనాథుని ఆలయమునకో పంపుచుండువాడు. తిరుమంగై తన సహచరులతో పన్నిన దోపిడీ పద్ధతి వలన, వీరు అడవులలో అన్ని బాటలను పొంచియుండుటచేత, మృక్కడులగు చోరులు ఆ స్థలములను వీడిపోయిరి. ఇదియును ఒక సత్ఫలితమే.

శ్రీరంగనాథునకు ముడుపుల చెల్లించుటకు పోవువారిని దోపిడీ చేయుటవలన స్వామి సొత్తు స్వామి భక్తులకే చేరుచున్నది గావున ఈ కార్యమును స్వామికూడా అంగీకరించునని తిరుమంగై చిత్తశుద్ధితో తలచెను. తన వాస్తవిక ఆలోచనలలో ఇది యొక మలుపు.

భక్తులును, సామాన్య ప్రజలును, వివేకవంతులును, తిరుమంగై యొుక్క స్వార్థ రాహిత్య భావము నెరిగిన వారును, వాని కార్యకలాపమును సక్రమముగా గ్రహింపగలిగిరి. ధనవంతులయిన అక్రమ సంపాదకులు మాత్రము తిరుమంగైను ద్వేషించుచుండిరి.

ఒకనాడు నూతన దంపతులు స్వామి ముడుపుల నొక పెట్టెలో బెట్టుకొని, పయనించుచుండగా, తిరుమంగై చేతిలోబడిరి. చేయునది లేక ముడుపులు పెట్టెను తిరుమంగైకు స్వాధీనపరచిరి. వీరు భయపడ లేదు; మరియు సంభాషణకు దిగిరి:

"స్వామి ముడుపుల స్వీకరించుటకు నీకెవరు అధికారమిచ్చిరి?"

"నేను స్వామి భక్తుడను, స్వామి ముడుపులను స్వామి భక్తులకే వినియోగించుటకు నాకెవ్వరి ఉత్తరువులు అవసరము లేదు".

"సరే, అన్ని ముడుపులు నీవే తీసికొనుము. ఒక్కటి మాత్రం మాకు వదలుము. దానిని మా స్వహస్తములతో స్వామికి అర్పించెదము".

ఇట్లు వారి సంభాషణ జరిగినది.

తిరుమంగై సంతోషముగా నొక ఆభరణమును వారికి వదలెను.

కడపటిసారిగా వరుడొక మాట జెప్పెను - "అయ్యా! నీవు గావించు సంతర్పణ కార్యక్రమమును నేను ఆక్షేపించను. కాని నీవు ఇట్లు స్వామి ముడుపులను దారిలోనే దోపిడి చేయుటచేత, యాత్రికులు భయపడి, వారి సంఖ్య సన్నగిలును. కడకు భక్తులు స్వామిని దర్శించుటకు రాని పక్షములో స్వామి వైభవమునకు లోటు కలుగదా? ఆలోచింపుడు". నూతన దంపతులు దారిబట్టి వెళ్లిరి.

వారి కడపటి మాట తిరుమంగై చెవులయందు రింగుమని మ్రోగి నట్లుండెను - "నిజముగా దారిదోపిడి జరుగుచున్నదని తెలిసిన యెడల, యాత్రికులు వచ్చుట తగ్గవచ్చును. ఇప్పటికే చాలవరకు యాత్రికుల సంఖ్య సన్నగిల్లినది. అంతమేరకు స్వామి వైభమునకు అటంకమును కలుగజేసిన వాడనే అగుదును. కావున ఈ దోపిడి విధానమును ఈనాటితో ఈ క్షణమున నిలిపెదను. వైష్ణవ భక్తుల సంతర్పణను నిలిపి, దేవాలయమునందే స్వామిసేవ జేసెదనుగాక" అని తిరుమంగై నిర్ణయించుకొనెను. తన్నుద్ధరింప నేతెంచిన లక్ష్మి నారాయణులే ఆ నూతన దంపతులై యుండనోపునని తిరుమంగై భక్తి భావమున తన్మయుడాయెను. తన నిర్ణయమును తన సహచరులకు దెల్పెను. వారును వారి శేష జీవితమును తిరుమంగైతో కలిసి దేవాలయ సేవలయందు గడుపుటకు నిర్ణయించుకొనిరి.

తిరుమంగై కుముదవల్లిని సమీపించి, "కుముదవల్లీ నీవు నిర్ణయించిన వ్రతమువలన నాకు జ్ఞానోదయము కలిగినది. నన్ను క్షమింపుమ"ని ప్రణమిల్లెను. "నేను కాంక్షించిన విధముననే పెరుమాళ్లు నెరవేర్చినాడు. నేనేనాడో పెరియ పెరుమాళ్ శ్రీరంగనాథునకు అంకిత మయిన దానను. నేనును నీ కర్థాంగినై, శిష్యురాలనుగా నా శేష జీవితమును నీతోడ స్వామి సేవయందు గడపుదు"నని దెల్పెను.

ఇపుడు తిరుమంగైకు శ్రీరంగనాథుని ఆలయమే ఆశ్రయ మయినది. కాని అతడొక నూతన ప్రణాళికను రూపొందించుకొనెను. పురాణాదులయందు వర్ణింపబడిన వైకుంఠమునందు వోలె శ్రీరంగమున స్వామి దేవాలయమును రమణీయముగా పునర్నిర్మించి, దానికి ఏడు ప్రాకారములను, నాల్గువైపుల గలిపి యిరువది యెనిమిది గోపురములను, సహస్ర స్తంభ మంటపమును, చిల్లర దేవాలయము లను నిర్మించవలయునని సంకల్పించెను. శ్రీరంగమును వైకుంఠముగా తీర్చిదిద్ద వలయునని తలంచెను. ఉభయకావేరి విరజానది కాగలదని భావించెను.

ఇందులకై తిరుమంగై చందాల కొరకు ధనవంతులను సమీపించెను. పిసినారులును, అధర్మ సంపాదకులును, అయిన ధనవంతులు, "ఓ నామాల దాసరీ! జీవితమంతయును దోపిడీలు జేసిన నీవు ఈనాడు పట్టెనామములు పెట్టుకొని, వైష్ణవభక్తుడవై, యీ యెత్తు యెత్తితివా?" అని పరిహసించిరి. చిత్తశుద్ధి గల తిరుమంగైకు మనస్సు చివుక్కుమనెను. ధనవంతుల సహకారము తనకిక తోడ్పడదని తలచెను. తన ప్రణాళికను నెరవేర్పవలయు ననెడి దృఢ సంకల్పమును దృఢతరము జేసికొనెను. లోభులైన ధనవంతులకు బుద్ధి చెప్పదలచెను.

తిరుమంగైకు తన సహచరులుగాక, నూతనముగా గజదొంగలు కొందరు శిష్యులయిరి. ఒకడు తొళవళక్కన్, ఇతడు గొప్ప తార్కికుడు. ఇతనితో సంభాషించువాడు బాహ్య స్మృతిని గోల్పోయి కొయ్యబారి వినుచుండవలసినదే. రెండవ వాని పేరు తాళూదువన్. ఈతడు బీగము లేకుండగనే యెట్టి తాళపుబుర్రనైనను నోటితో గాలియూది విడగొట్ట గలడు; మరలా బిగించగలడు. మూడవవాడు నిళనిల్ వొదుంగువాన్ ఈతడు పోవువాని నీడపై కాలువేసిన యిక నతడు కదలజాలడు. నాల్గవ వాడు నీర్మేల్ నడుప్పాన్. ఇతడు నీటిపై నడచిపోగలడు.

ఈ శిష్య చతుష్టయ సహాయమున తన్ను హేళన జేసిన ధనవంతులకు గుణపాఠము చెప్పదలిచినవాడు తిరుమంగై.

మరునాడు రాత్రి యీ నల్వురున్ను ఇద్దరు ముగ్గురు ధనవంతుల యిండ్లనుండి ధనమును, స్వర్ణాభరణములను దొంగలించి, స్వామి ఆలయమున గర్భగుడి ద్వారము కడనుంచిరి. తెల్లవారు సరికి తిరుమంగై స్వామిని కీర్తించుచు ఆభరణముల రాసి ప్రక్కన కూర్చొని యుండెను. జరిగిన దొంగతనపు విధమునకు (వేసిన తాళము వేసియే యున్నవి) ఆశ్చర్యపడుచూ దుఃఖించుచున్న ధనవంతుల కడకు తిరుమంగై శిష్యులే పోయి వారి ధనము బంగారము సురక్షితముగా తిరుమంగై వారిముందు స్వామి సాన్నిధ్యములో నున్నవని యెరింగించి, వారివారి సొత్తులను వారు తీసికొని పోవచ్చునని దెల్పిరి. వేవేగ వచ్చిన

ధనవంతులు ఈ దృశ్యమును జూచి, తిరుమంగై యొక్క భక్తిని గమనించినవారై వారికి సాష్టాంగపడి శిష్యులయిరి.

అది మొదలు సమీప ప్రదేశముల నుండియు, దూరప్రాంతముల నుండియు, ధనవంతులు ధనరాసులను విరాళములుగా తెచ్చి తిరుమంగైకు అప్పగించుచుండిరి. ఈ విరాళములతో తిరుమంగై దేవాలయ పునరుద్ధరణకు పూనుకొనెను. తిరుమంగై సర్వసంగ పరిత్యాగియై, కేవల విష్ణుభక్తిపరుడై యిట్టి ఘనకార్యము చేయ బూనగా, తన్నెరిగిన వేలకొలది చోరులు వచ్చి, ప్రణమిల్లి, వారి శేషజీవితముల స్వామిసేవలో గడుప నిర్ణయించుకొనిరి. ఈ అపూర్వమైన మార్పువలన శ్రీరంగదేశ ప్రాంతమున చోరులనువారలు లేకుండా బోయిరి. ఇట్లు అంసంఖ్యాక సేవకులు తోడ్పడిరి. వీరందరు నామధారులై, వైష్ణవనామ సంకీర్తనల గావించుచు, దేవాలయ నిర్మాణ కార్యముల జేయుచుండిరి.

తిరుమంగైని తిరుమంగైఆళ్వారు అని భక్తులెల్లరు ప్రశంసింప సాగిరి. దేశములోని శిల్పులకు, కళాకారులకు, శ్రీరంగము వాసస్థల మయినది. తిరుమంగై శిష్యులలో కొందరు గుమాస్తాలు, కొందరు పర్యవేక్షకులు, కొందరు కోశాధికారులు, తక్కినవారు తక్కిన వివిధ కార్యములు జేయువారు.

తిరుమంగై ఆళ్వారు శ్రీరంగనాథ దేవాలయ జీర్ణోద్ధరణకు ఉపక్రమించెను. అనేక శిల్పులను వాస్తుశాస్త్రవేత్తలను, నిర్మాణపు పనివారిని పిలిపించి, దేవాలయ గర్భగుడిని మొదట వైభవోపేతముగా నిర్మింపజేసెను. తరువాత గర్భగుడి చుట్టును విశాల స్థలమును వదలి గంభీరమయిన ప్రాకారమును. ద్వార గాలిగోపురమును నిర్మింప జేసెను. క్రమముగా సప్త ప్రాకారములు, ప్రతి ప్రాకారమునకు నాల్గు దిక్కుల ద్వార గాలిగోపురములు, ఎన్నో చిల్లరమల్లర గుడులను, గోపురములను, మంటపములు, సమావేశముల కొరకు సహస్రస్తంభ మంటపమును, క్రమక్రమముగా నిర్మింపజేసెను. ప్రతి గోడయు, ప్రతి

కట్టడము యొక్క యే చిన్న భాగముకూడా శిల్పముతో రంగులతో ఒక కళాఖండముగా నొప్పారెను. ఎల్లరు తిరుమంగై ఆళ్వారు చేయు కార్యక్రమమున కచ్చెరువందిరి. సత్యము నెరిగిన ప్రజలు వారికైవారే ధనమును దెచ్చి, తిరుమంగై ఆళ్వారునకు సమర్పించుచుండిరి. అసంఖ్యాక చోర సమూహములు పరివర్తనులై వారి ప్రాపున నుండుటంజేసి, ఆళ్వారుల ప్రమేయము లేకనే విరాళములు ప్రవాహములుగా దేవాలయమును చేరుచుండినవి. వీరందరును పరమ భాగవతోత్తములుగా మారి, తిరుమంగై ఆళ్వారుతో కలిసి శ్రీరంగనాథ దేవాలయావరణముననే నివసించుచూ, దైవనామ సంకీర్తనలు గావించుకొనుచూ తరించిరి.

తిరుమంగైయాళ్వారు మహాపండితుడు, గొప్ప కవీశ్వరుడు, దేవాలయ నిర్మాణమున నిమగ్నుడై యుండియు, గ్రంథ రచన జేయుచూ నుండెను. వారు సుమారు వెయ్యి భక్తిరస కీర్తనలను రచించి, వానిని పాడుచూ, తన శిష్యకోటిచే పాడించుచుండు వాడు.

తిరువెళుక్కూత్తిరుక్కై, శిరి తిరుమడల్, పెరియ తిరుమడల్, పెరియ తిరుమొళి, తిరుకురున్దాణ్డకం, తిరునెరున్దాణ్డకం అను భక్తికీర్తన గ్రంథములు వీరివి.


నేటి శ్రీరంగక్షేత్ర వైభవమునకు ఇతడే కారకుడు.

తిరుమంగైయాళ్వారు తన యిరువదవ యేట శ్రీరంగమునకు వచ్చెను. శ్రీరంగ దేవాలయ నిర్మాణములు పూర్తియగుటకు అరువది సంవత్సరములు కాలము పట్టెను. ఆళ్వారునకు, తాను నిర్ణయించు కొనిన ప్రణాళికలు పూర్తియగు సరికి, ఎనుబదేండ్లు నిండెను. తాను తలపెట్టిన పని పూర్తియయ్యెనను సంతృప్తితో, సంతోషముతో, ఆళ్వారు తన యవతారమును చాలించెను. తిరుమంగై ఆళ్వారుల మహోద్యమ ఫలితముగా ఊహింపబడుచున్న వైకుంఠపురము భూలోకమున సాక్షాత్తుగా నవతరించినది. సప్త ప్రాకారములతో వెలయు శ్రీరంగపురి, ఉభయకావేరీ మధ్యనున్న యీ ద్వీపము, ప్రపంచఖ్యాతి జెందినది.

దివ్యమైన యిట్టి చరిత్రమును ఆకర్ణించిన రామానుజుడు తిరుమంగై యాళ్వార్ల ప్రతిభకు ఆశ్చర్య నిమగ్నుడాయెను. శ్రీరంగమును దర్శింపవలయునను కుతూహలము జనించినది.

తిరుమంగైయాళ్వారు ఒకపరి తిరుమల దర్శించి, తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర దివ్య వైభవము ననుభవించి, స్వామిని ద్రావిడ పాశురములతో నన్నుతించి యున్నాడనియు తిరుక్కచ్చినంబి రామానుజునకు దెల్పెను.

# 9. పెరియాళ్వారు - ఆండాళ్



ఒకనాడు రామానుజుడు తిరుక్కచ్చి నంబితో, "స్వామీ! పెరియాళ్వారు ఆనతిచ్చిన "తిరుప్పల్లాండును", ఆండాళ్ రచించిన "తిరుప్పావై"ని గూర్చి తెలిసికొన వలయునని కుతూహల పడుచున్నాను", అనెను.

"రామానుజా! తిరుప్పల్లాండు, తిరుప్పావై అనునవి మహా రచనలు. వాని భక్తి భావమును భవిష్యత్కాలములో నీవు మూలములను చదివి గ్రహింపగలవు. ప్రస్తుతము వీరిరువురను గూర్చి కథా రూపమున దెల్పెదను. ఆకర్ణింపుము", అని తిరుక్కచ్చినంబి పలుకుచూ, పెరియాళ్వారు, ఆండాళ్ వీరి చరిత్రలను ఈ విధమున చెప్పెను.

తండ్రి, కుమార్తెలయిన యీ ఆళ్వార్ల ద్వయ చరిత్ర సమ్మిళితమై యున్నది.

పెరియాళ్వారు బాల్య నామము తెలియదు. వీరియొక్క విష్ణు భక్తిని బట్టి ప్రజలు వీరిని విష్ణుచిత్తుడని పిలుచుచుండిరి. ఈతడు శ్రీవిల్లిపుత్తూరను గ్రామమున బ్రాహ్మణకులమున జన్మించెను. ఈతడు విష్ణు రథాంశమున జన్మించిన వారని భక్తుల అభిప్రాయము.

శ్లో॥ మిథునే స్వాతిజం విష్ణోరథాంశం ధన్వినఃపురే ।
ప్రపద్యే శ్వశురం విష్ణోర్విష్ణుచిత్తం పురశ్శిఖమ్ ॥

విష్ణుచిత్తుడు బాల్యము నుండి శ్రీకృష్ణ భక్తుడు. ఒకనాడు పాండ్య రాజాస్థానమునకు ఉత్తరదేశము నుండి ఉద్దండ సంస్కృత పండితు డొకడు వచ్చి, "తనతో వేదాంత తర్కమును గావింపగల పండితు

లెవరైనను రాజాస్థానమున గలరా" అని ప్రశ్నించెను. వాస్తవముగా తన ఆస్థానమున అంతటి గొప్ప విద్వాంసులు లేకపోయినను, లేరని చెప్పుటకు అప్రతిష్ఠగా దలచిన రాజు విష్ణుచిత్తుని రావించి, "విష్ణుచిత్తుడా! మన ఆస్థానమునకు ఉత్తరదేశము నుండి ఉద్దండ పండితు డొకడరుదెంచి యున్నాడు. వానిని నీవు వేదాంత తర్కమున నోడించి, మన రాజాస్థాన గౌరవమును నిలబెట్ట వలయును. నీ విష్ణు భక్తిప్రభావమున నీవు ఎట్టి పండితునైనను తర్కము నోడింపగలవను విశ్వాసము నాకున్నది. ప్రయత్నింపుము", అని రాజు కోరెను.

"రాజా! నేనెల్లప్పుడు విష్ణుచిత్తుడనై ఆలయమున స్వామికి సేవ జేయుచూ కాలము గడపినవాడనే. బాహ్యప్రపంచము నెరుగను. గొప్ప చదువరినిగాను. కాని తమరి యభీష్టమును త్రోసిపుచ్చజాలను. ప్రజల రంజింపజేయు రాజును మాబోటి భక్తులు ప్రోత్సహించుట తగును", అని విష్ణుచిత్తుడనెను.

అతడు శ్రీకృష్ణుని మనమున దలంచి, అప్రతిహతమగు ధైర్య స్థైర్యముల బొందెను. యువకుడైన విష్ణుచిత్తుడు ఉద్దండ తార్కిక సంస్కృత పండితునితో వేదోపనిషత్తులపై తర్కమునకు మోకరిల్లెను. రాజు సింహాసనాసీనుడై యుండ, పండితులు, విద్వాంసులు, అమాత్యులు, ఉద్యోగులు, పెద్దలతో రాజసభ క్రిక్కిరిసలాడి యుండెను. వేదికపై ఉద్దండ పండితుడు మదగజమువలె దర్పమున శోభిల్లు చుండగా, విష్ణుచిత్తుడు వాని సమక్షమున సింహకిశోరము మాడ్కి ప్రకాశించుచుండెను. విష్ణుచిత్తుడు తన యిష్టదైవము శ్రీకృష్ణుని అనుగ్రహమున అపర సరస్వతి వలె భాసిల్లుచూ, భాషింపదొడగెను. ఉదయము మొదలు సాయం సమయము వరకు తెరిపిలేని తర్కవాద ఝంఝామారుతము వీచెను. కడకు రానురాను సూర్యాస్తమయ కాలమునకు విష్ణుచిత్తునిదే పైచేయి అయినది. సూర్యోదయ కాలమున విలవిలబోవు చంద్రబింబము మాడ్కి ఉద్దండ పండితుడు విష్ణుచిత్తుని జ్ఞానమునకు సరితూగలేక పోవుచున్నాడు. విజ్ఞుడును,

వివేకియు నగుటంజేసి సంస్కృత పండితుడు తన ఓటమికి సమ్మతించెను.

"రాజా! విష్ణుచిత్తుడు మానవాకృతిలో నున్న వాగ్దేవి. ఈతని యెడ నాకు మాత్సర్యము లేదు; వాత్సల్య గౌరవములే పొడముచున్నవి. ఈ పండిత కిశోరముగల యీ రాజ్యమునకు మీరు ప్రభువులుగా నుండుట మీకు ఆచంద్రార్క కీర్తిని చేకూర్చగలదు", అని పలుకుచూ పండితుడు విష్ణుచిత్తుని ప్రశంసించెను. విష్ణుచిత్తుని దైవాంశ సంభూతుడని యెల్లరు భావించిరి. పరమానందమున నుప్పొంగిన ప్రభువు విష్ణుచిత్తునితో, "మహానుభావా! నీవు నాకు దెచ్చిన గౌరవమునకు కానుకగా నిన్ను అర్ధరాజ్యమునకు పట్టాభిషిక్తుని జేయదలచితిని", అనెను.

"రాజా! ఇందు నా ప్రతిభ యిసుమంతయును లేదు. శ్రీకృష్ణునకు ప్రపత్తుడనయిన నాకు జయము గలిగిన దానికి స్వామియే కారణము. నేను సర్వసంగ పరిత్యాగిని. నాకు రాజ్యమేల? సర్వాంతర్యామియగు వైష్ణవశక్తికి ప్రపత్తుడును. విడివడిన నాకు ఇక బంధమేల? స్వార్థ రహితుడైన వైష్ణవభక్తిని పాపములంటవు; అతనికి బంధములు లేవు. అట్టివాడు పరమానంద భరితుడు. అట్టి దాసవర్గమునకు జెందిన దాసానుదాసుడను నేను. నాకు రాజ్యముతో పనిలేదు; నాకు అధికారము వలదు. శ్రీకృష్ణదేవాలయమే నా రాజ్యము; వారికి సేవజేయుటయే నా యధికారము. నన్ను పోనిమ్ము ప్రభూ!", అని విష్ణుచిత్తుడు పలుకగా ఆశ్చర్యమున ఆనందబాష్పముల వదలిరి.

అప్పుడు పాండ్య రాజదంపతులు విష్ణుచిత్తుని అపార భక్తి వైరాగ్యములకు మెచ్చి, సాష్టాంగ దండప్రణామము లాచరించి, "స్వామీ! మమ్ము కృతార్థుల జేయనరగుదెంచిన స్వామీ! మీ మాటను కాదనజాలము. కాని నా కోరికను మన్నింపుము. నా ప్రతిజ్ఞను కాపాడుము. నా సత్య సంధతకు విఘ్నము రానీయకుడు. నా ప్రతిజ్ఞకు భంగము వాటిల్లకుండుటకై నీ శిరముపై రాజకిరీటమును ధరింపజేసి,

నిన్ను పట్టపుటేనుగుపై కూర్చుండబెట్టి పురవీధులలో నీకు మహోత్సవమును జరిపి నేను కృతార్థుడ నయ్యెదనుగాక!'. అని రాజు నుడివి. ఉత్సవమునకు ఉత్తరువుల నొసంగెను.

విష్ణుచిత్తుడు ఏనుగు అంబారుపై స్వర్ణపీఠముపై నాసీనుడై యుండ, ప్రభువును ఉద్దండ పండితుడును సామంతుల వలె క్రింద నడువ, వైభవోపేతముగా పురవీధులందు ఉత్సవము జరుగుచుండెను.

ఇట్టి వైభవమునకు పరమానంద భరితుడైన విష్ణుచిత్తుడు సర్వము వైష్ణవ మాయయేనని భావించినవాడై, బిగ్గరగా, శ్రీమన్నారాయణ మూర్తిని గూర్చి మంగళము (పల్లాండు) పాడ దొడగెను. అతడు విష్ణు సంశ్లేష భావమున బాహ్య సంస్కృతిని గోల్పోయి పరమానందమున నుండెను. ఈ మంగళ పాశురములే "తిరుప్పల్లాండు" అను దివ్య ప్రబంధమయినది.

"పల్లాండు - పల్లాండు - పల్లాయిరత్తాండు - పలుకోటి నూరాయిరమ్", అను పదములతో ప్రారంభమగు తిరుప్పల్లాండు భగవంతుని అనంత కల్యాణ గుణములకు మంగళమును పల్కుచున్నది. విష్ణుచిత్తుడు "తిరుప్పల్లాండు" గానము చేసినవాడు వారికా పేరు పరమ సార్థకమయినది.

"తిరుప్పల్లాండు" ప్రబంధము అవతరించిన క్రమము విన్న రామానుజుడు పులకాంకితుడాయెను.

ఇక ఆండాళ్ వృత్తాంతమును తిరుక్కచ్చినంబి చెప్పదొడగెను:

# ఆండాళ్



ఆండాళ్ విష్ణుచిత్తుని కుమార్తెయని ప్రసిద్ధి. కాని అవివాహితుడైన విష్ణుచిత్తునకు దైవ ప్రసాదితముగా ఆండాళ్ కుమార్తెగా ప్రాప్తించుట యనునదొక విచిత్ర గాథ.

ఒకనాడు ప్రాభాతవేళ విష్ణుచిత్తుడు తులసి వనమున తిరుగు చుండగా, వికసిత వదనారవింద ముఖియగు నొక చిన్నారి శిశువు కనులపండువుగా నాతనికి ప్రత్యక్షమాయెను. దైవమే తనకు కుమార్తెను ప్రసాదించెననియు, యిక తన కర్తవ్యము బిడ్డను పెంచి పెద్ద జేయుటయే ననియు, భక్తుడైన విష్ణుచిత్తుడు తలచెను. ఈమెను అయోనిజగా భక్తులు భావింతురు. ఆ బిడ్డ సీతాదేవి వలె భూదేవి యవతారమని తలచిన విష్ణుచిత్తుడు ఆమెకు గోదాదేవి (భూదేవి) యను తిరునామముంచెను.

శ్లో॥ కర్కటే పూర్వ ఫల్గున్యాం
తులసీ కాననోద్భవామ్
పాండ్యే విశ్వమ్భరాం గోదాం
వందే శ్రీరంగ నాయకీమ్.

గోదాదేవి దినదినాభివృద్ధి జెందుచూ, ఆశ్రమునకు వనమునకు ఒక శోభను కలుగజేసెను. ఆమె అవయవ సౌందర్యమునకు, మంగళకర రూపురేఖావిలాసము విష్ణుచిత్తుడును, తన శిష్యులును అచ్చెరువందువారు. ఆమె తేజోమయురాలు.

బాల్యము నుండి గోదాదేవి తత్త్వము ఒక విశిష్టమయినది. తండ్రితో సంభాషించుట తప్ప అన్యులతో మాటాడదు. తనలోతానే భాషించుకొనుట, హసించుట, ఆలోచించుట - యిట్లుండి వింతగొల్పు చుండెడిది చూపరులకు. చిన్నారి చిట్టిపాప ఆకృతిలో నున్న నొక

వేదాంత తత్త్వ శిరోమణిగా కన్పట్టెను. తిరుత్తుళాయి మొక్కలకు నీరు పోయుట యందును, తులసిమాల లల్లుటయందును, తండ్రి కెల్లప్పుడు సహకరించు చుండెడిది. తండ్రి శిష్యుల కొనర్చు విద్యా బోధలను అత్యంత క్రమశిక్షణాయుతముగా వినుచుండెడిది. ఆమె ఏకసంథాగ్రాహిణి. ప్రకృతియే ఆమెకు చెలికత్తె. ఆమె యెల్లప్పుడు శ్రీకృష్ణ పరమాత్మతో సంశ్లేషించి యుండెడిది. ఆమె యోగిపుంగవు రాలుగా కన్పట్టెడిది.

ఒకనాడొక విచిత్ర సంఘటన జరిగినది. తండ్రి విష్ణుచిత్తుడు తులసిమాలను పూర్తిజేసి, పర్ణశాలలోని స్తంభమునకు తగిల్చి, వెలుపలికి పోయెను. అది సాయంసమయము. ఆయన తిరిగి పర్ణశాల చేరునప్పటికి గోదాదేవి తిరుత్తుళాయిహారమును ధరించి, తన సౌందర్యము నద్దమున చూచుకొనుచుండెను. తండ్రి ఆశ్చర్యముతో కొంత కినిసి, "అమ్మాయీ! గోద! ఎంతటి యపరాధమును గావించితి వమ్మా! స్వామి కర్పింపవలసియున్న తులసిమాలను నీవు ధరించి మయిల పరిచితివి. ఈనాడు స్వామికి హారము లేకపోయెనే! అనుదినము సాయంకాలమున భక్తితో గుడికిపోయి పెరియ పెరుమాళ్లకు తులసి హారమును సమర్పించు నా వ్రతమునకు భంగము వాటిల్లెగదా!" అని చింతించెను.

చింత్రాక్రాంతుడై అనాటి రాత్రి విష్ణుచిత్తుడు పరుండెను. జరిగిన సంఘటనను మరలామరలా గాఢముగా అలోచింపగా, జరిగినది గొప్ప అపరాధముగా తోచలేదు. గోదాదేవి యెల్లపుడు విష్ణు సంశ్లేష భావమున జీవించునట్టిది. అట్టి యామె హారము ధరించుటలో అజ్ఞానము లేదు, చిలిపి చేష్టయు లేదు. విష్ణుచిత్తుడును వైష్ణవ సంశ్లేషమున నుండువాడు గాన భగవంతుడు తనతో ఇట్లు చెప్పినట్లు భావించెను, "విష్ణుచిత్తుడా! గోదాదేవి భూదేవి అవతారము - ఇది నీకు తెలియనిదికాదు. ఆమె యెల్లపుడు విష్ణు సంశ్లేషమున నుండెనుకదా! సర్వం విష్ణుమయం అని భావించు భక్తురాలు. ఆమె ధరించుటచే తులసిమాల

మైలపడలేదు. దానిని నేను స్వీకరించెదను. నాకది ప్రియతమ హారము".

తెల్లవారి చూడగా తిరుత్తుళాయిహారము తాజాగా నుండెను. తులసి వనమున కొంత దూరములో చెట్లమధ్య శ్రీకృష్ణ సంశ్లేషమున నటించుచూ, ఆడుచూ, గానము చేయుచున్న గోదాదేవిని విష్ణుచిత్తుడు గాంచెను. తన అనుమానము లంతరించెను. ఉదయముననే ఆ తులసి హారమును గుడికి గొంపోయి స్వామి కర్పించెను. స్వామి అత్యానందముతో హారమును స్వీకరించినట్లు విష్ణుచిత్తుడు తన సంశ్లేషణ స్థితియందు తలచెను. పరమానంద భరితుడుగా పర్ణశాల జేరి, శ్రీ మహాలక్ష్మి తనయందు కుమార్తెగా విలసిల్లుచున్నదని తలచి ఆనందించెను. గోదాదేవి "ఆముక్తమాల్యద" అను తిరునామమును బొందెను. (తాను ధరించి విడిచిన హారమును స్వామికి యిచ్చినది అని భావము).

ద్వాదశ వత్సరములు పూర్తియగుసరికే గోదాదేవి సంస్కృత తమిళ భాషాకోవిదురాలయ్యెను. తండ్రి శిష్య భక్తులకు బోధించు ఆధ్యాత్మి కామృతముము గ్రోలుచుండెను. ఆమె భక్తి గీతముల రచించుకొనుచూ, వానిని గానము చేయుచూ, జనకుని తదితర ఆశ్రమ వాసులను ఆనంద పరవశులనుగా జేయుచుండెను. దినమున కొకవేళ తాళపత్ర గ్రంథముల వ్రాయుచునే యుండెను. "తిరుప్పల్లాండు పలికిన విష్ణుచిత్తునకే ఆమె రచనలు అద్భుతముగా కన్పట్టెను.

గోదాదేవికి వివాహ వయస్సు వచ్చెను. ఆమె స్వామినే పరిణయ మాడవలయునని సంకల్పించి యుండెను. స్వామిని మానసికముగా వరించుట యనునది బాల్యము నెప్పుడో జరిగిపోయినది. ఆమె యవతారము నెరిగిన విష్ణుచిత్తుడు వివాహ విషయమై ఆమెను హెచ్చరింపలేక పోయెను. స్వామినే స్వీకరింపవలయునని భ్రమ పడుచున్న గోదాదేవి తత్త్వమట్లే నిలిచిపోవునేమోనని తండ్రి భయపడు చుండెను. ఒకనాడు గోదాదేవితో "గోదా! తల్లీ! మానవయువతి స్వామిని

పరిణయమాడుట యే గ్రంథము నందైనను చదివియున్నావా? అది సాధ్యమా?" అని ప్రశ్నించిన విష్ణుచిత్తునితో "తండ్రీ! నేను స్వామిని తప్ప వేరొకరిని వివాహమాడునది లేదు" అని ఖండితముగా గోదాదేవి పల్కెను. ఆమె విష్ణు సంశ్లేష భావము నెరిగియు, చేయునది లేక విష్ణుచిత్తుడు మానసిక క్లేశమున బడెను.

గోదాదేవి "తిరుప్పావై", "నాచ్చియార్ తిరుమొళి" అను రెండు ప్రబంధముల రచించెను. ఈ రచనల చదివిన విష్ణుచిత్తుడును. ఆయన శిష్యులును గోదాదేవి యొక్క సారస్వత ఆధ్యాత్మిక జ్ఞాన ప్రతిభకు అబ్బురపడిరి.

గోదాదేవి భగవంతునికే అంకితమై యుండుటగాంచి, కడకు ఆమె అవివాహితగానే నిలిచిపోవునని ఎల్లరు భావించిరి. కడపటిసారిగా ఒకనాడు తండ్రి, "అమ్మా! గోదా! సర్వాంతర్యామియగు భగవంతునెట్లు వివాహమాడగలవు? తెల్పుము", అని ప్రశ్నించెను.

"భగవంతుని అర్చావతారమునే వివాహమాడెదను".

"భగవంతుడు అర్చావతారముల నూట యెనిమిది దివ్య తిరుపతులలో విలసిల్లియున్నాడు గదా! నీవు ఏ అర్చావతారమును వరించెదవమ్మా, గోదా"!

"నేను విశ్వరూప ప్రదర్శనమగు శ్రీరంగనాథునే వివాహ మాడెదను".

ఇట్లు తండ్రి కుమార్తెల సంభాషణ జరిగినది.

విష్ణు సంశ్లేషమున నున్న గోదాదేవి ముచ్చటదీర నామెను (బొమ్మల పెండ్లివలె) శ్రీరంగనాథునకే వివాహము చేయవలయునని యెట్టకేలకు విష్ణుచిత్తుడు నిర్ణయించుకొనెను. గోదాదేవి సంతృప్తిని జెందునట్లు ఆమెను ముచ్చటగా శ్రీరంగనాయకుల విగ్రహము కడకు తీసికొనిపోయి, స్వామిని ఆమెచే దర్శింపజేసి, వరింపజేసి, ముచ్చటదీర్చి

తీసికొని రావలయుననని సంకల్పించెను. ఈ కార్యక్రమము గోదాదేవికి తృప్తిని, శాంతిని మోదమును కలుగజేయగలదని విష్ణుచిత్తుడు తలచెను.

తన నిర్ణయమును విష్ణుచిత్తుడు గోదాదేవికి శిష్యులకును ఎరింగించెను. ఈ విషయము పాండ్యరాజ్య దంపతులకును, శ్రీరంగనాథ దేవాలయ ప్రధానార్చకునకును తెలిసినది. దానినొక కేళికగా, ఒక నాటకముగా అందరు ఆనందింప దలచిరి.

విష్ణుచిత్తుడు శుభముహూర్తమును నిర్ణయించెను. గోదాదేవి తన వివాహ విషయమై అతి సంతోషవంతురాలుగా నుండెను. శ్రీరంగనాథ దేవాలయ ప్రధానార్చకుడు దేవాలయములోని లక్ష్మీదేవి యొక్క ఆభరణములు, పట్టుపీతాంబరములు తెచ్చి గోదాదేవి అలంకరణకు గాను ఇచ్చెను. విష్ణు సంశ్లేషియయిన గోదాదేవికి దేవాలయములోని ఆభరణముల నిచ్చుట ఉచితమేనని ప్రధానార్చకుడు భావించెను. మరియు బాల్యమున నావెం తాను ముందుగా ధరించిన తులసిమాలను స్వామివారిచే స్వీకరింపజేసెను గదా! పాండ్యరాజ దంపతులు పెండ్లికుమార్తె పెండ్లి మంటపమునకు తరలివెళ్లుటకు కావలిసిన యేర్పాట్లన్నిటిని చేకూర్చిరి.

అతి వేగముగా గోదాదేవి "పెండ్లికుమార్తె"వలె అలంకరించు కొనెను. సర్వాలంకార భూషితయగు గోదాదేవి ముత్యాల పల్లకిలో కూర్చొనగా, మంగళవాద్యములు ముందుసాగగా, పల్లకికి ఇరువైపుల భూమిపై పాండ్యరాజ దంపతులు, విష్ణుచిత్తుడు, ప్రధానార్చకుడును, పల్లకిని వెంబడించి అశేష భక్తజన బృందము, సామాన్య ప్రజానీకము వైభవోపేతముగా శ్రీరంగనాథుని దేవాలయమును ప్రవేశించిరి.

గోదాదేవి పల్లకి దిగి, అతివేగమున మిక్కిలి చనువుగా అతి పరిచయముగా ఆనంద భక్తి యుక్తులతో చకచక అడుగులిడుతూ గర్భాలయమును ప్రవేశించుచుండెను. నర్వులును గర్భాలయ ద్వారమున నిలిచిరి. గోదాదేవి అట్లనే నడచుచు, శేషపాన్పు మెట్ల

వరునల నధిరోహించి, శ్రీరంగనాయకుని పాదయుగ్మముకడ నాసీనురాలై స్వామి యందైక్యము జెందెను.

ఎల్లరును ఆశ్చర్య భయములతో దిగ్భ్రమజెంది స్తంభముల వలె నిలుచుండిరి. విష్ణుచిత్తుడు కంపితహృదయుడై, గడగడ వణకుచు, గద్గదస్వరమున, కన్నీరు వెల్లువలె పార, "స్వామీ! నా కుమార్తెయేది? నాగారాబు గోదాదేవి?" అని విలపింపదొడగెను. పాండ్యరాజు, ప్రధానార్చకుడు ఏక కంఠమున, "విష్ణుచిత్తుడా! భక్తశిరోమణీ! అర్ధ రాజ్యమును కూడా తృణీకరించి, స్వామికి తిరుప్పల్లాండు పలికిన సర్వసంగపరిత్యాగీ! గోదాదేవి ఆండాళ్ అయి (జగన్మాత అయి) శ్రీరంగనాథునిలో ఐక్యమయిపోయినది. మీరు స్వామికే మామ వైతిరి. ఆళ్వారులలో మిన్నయై పెరియాళ్వార్ అయితిరి. ఇక మీకేమి కొరత యున్నది? మీ యిరువురు ఆచంద్రార్కతారార్క కీర్తినిధులైతిరి", అని మంగళాశాసనములు బల్కిరి. జనులెల్లరు తథాస్తు పల్కిరి. దేవాలయపు గంటలు మ్రోగినవి. సర్వసమ్మతిని చూపించుమాడ్కి కర్పూరహారతి దీప్తులలో రంగనాయక విగ్రహము దేదీప్యమానముగా ప్రకాశించినది. విష్ణు సంశ్లేషియయిన విష్ణుచిత్తుడు (పెరియాళ్వారు) సర్వమును గ్రహించి శాంతచిత్తుడాయెను.

ఇదియే పెరియాళ్వారు ఆండాళ్ గార్ల దివ్యవైభవము.

రామానుజుడు ఈ దివ్య వృత్తాంతమును విని, తిరుక్కచ్చినంబి యెదుట ముకుళిత హస్తుడై, ఆనందమున నిల్చొని యుండెను.

"రామానుజా! యామునాచార్యుల పితామహుడు, శ్రీమన్నాథ మునులు పెరియాళ్వారుని గూర్చి పల్కిన శ్లోకమును వినుము", అని తిరుక్కచ్చినంబి పల్కుచూ, ఆ దివ్య శ్లోకమును గానము చేసెను :

శ్లో॥ గురుముఖమనధీత్య ప్రాహవేదానశేషాన్
నరపతి పరిక్లృప్తం శుల్కమాదాతు కామః
శ్వశుర మమర వంద్యం రంగనాథస్య సాక్షాత్
ద్విజకుల తిలకం తం విష్ణుచిత్తం నమామి

"ఆముక్తమాల్యద యయిన గోదాదేవిని (అండాళ్‌ను) గూర్చి భక్తులు నుతించిన విధమును వినుము, రామానుజా" అని తిరుక్కచ్చినంబి పలుకుచూ క్రింది శ్లోకమును గానము జేసెను:

శ్లో॥ నీళాత్తుంగస్తనగిరి తటీ సుప్తముద్బోధ్య కృష్ణం ।
పారార్థ్యం స్వం శ్రుతిశత శిరస్సిద్ధమధ్యాపయంతీ ।
స్వోచ్ఛిష్టాయాం స్రజినిగళితం యాబలాత్కృత్య భుజ్క్తే ।
గోదాతస్యైనమ ఇదమిదం భూయ ఏవాస్తుభూయః ॥

ఈ శ్లోకద్వయామృతమును గ్రోలిన రామానుజుడు పరమానంద భరితుడై తానును వారియట్టి విష్ణు సంశ్లేషభావమును పొందు దివ్య మానసిక స్థితి ఎప్పుడు రాగలనో అని ఆతురత నందెను.

# 10. మధురకవి ఆళ్వారు - నమ్మాళ్వారు



మధురకవి ఆళ్వారు

కడపటిదిగా తిరుక్కచ్చినంబి మధురకవి ఆళ్వారు, నమ్మాళ్వార్ల చరిత్రమును రామానుజునకు దెల్పెను.

ఆళ్వారులలో ముఖ్యుడు నమ్మాళ్వారు. వారికంటె వయస్సున పెద్దవాడయిన మధురకవి ఆళ్వారు నమ్మాళ్వారుకు ప్రథమ శిష్యుడయి నమ్మాళ్వారు పరమపదించిన తదుపరి నమ్మాళ్వార్లను శ్లాఘించుచు శేష జీవితమును గడపెను. అందువలన ఈ ఆళ్వారు ద్వయము యొక్క జీవిత చరిత్రలు జోడింపబడి యున్నవి.

మధురకవి ఆళ్వారు తిరుక్కోయిలూరులో వసంత ఋతువును ప్రారంభించు చైత్రమాసమున శ్రీ విష్ణుమూర్తి వాహనమగు గరుత్మంతుని అంశమున జన్మించిన వారని భక్తుల భావము. సూర్యోదయమునకు పూర్వము వచ్చు అరుణోదయము మాడ్కి శ్రీ నమ్మాళ్వారుకు ముందుగా మధురకవి అవతరించెను.

శ్లో॥ మేషే చిత్రా సముద్భూతం
పాండ్యదేశే గణాంశజమ్
శ్రీపరాంకుశ సద్భక్తం
మధురం కవి మాశ్రయే.

యతీంద్రుడును, పరాంకుశుడును, ఉభయవేదాంత ప్రబోధకుడును అగు నమ్మాళ్వారు ఆధ్యాత్మికసారస్వతప్రభ అజ్ఞానాంధకారమున బడియున్న చేతనులకు సూర్యుడే అగును. సూర్యోదయమునకు

ముందు కన్పడు అరుణోదయమే మధురకవిఆధ్యాత్మికతత్వ గానామృతము.

మధురకవి బ్రాహ్మణ కులజుడు. తలిదండ్రులీతనికి సకాలమున చౌలోపనయనాదుల గావించి, పదునాల్గు విద్యలను నేర్పించిరి. మధురకవి యౌవనదశయందు మోక్షప్రదముగా పురాణాదులయందు తెల్పబడిన అయోధ్య, మధుర, కాశి, అవంతి, ద్వారవతీ మున్నగుగల ఉత్తరదేశ పుణ్యక్షేత్రముల సేవించుటకు బయలుదేరిరి.



నమ్మాళ్వారు

అప్పటికే కడపటి ఆళ్వారగు నమ్మాళ్వారు అవతరించియున్నారు. మధురకవి ఉత్తరదేశ యాత్రకు పోవునప్పటికి వారికి నమ్మాళ్వారు వైభవము తెలియదు.

కలియుగమున "సర్వం విష్ణుమయం" అని ప్రకటించిన నమ్మాళ్వారు సకలచేతనులకు, వర్ణవివక్షత లేకుండా, భగవద్భక్తిని ప్రతిష్ఠింపజేయుట కొరకు అవతరింపగలరని ప్రబంధ ప్రమాణము. తనకు ముందు అవతరించిన ఏకాదశాళ్వార్లను అవయవభూతులనుగా గలుగు నమ్మాళ్వారు పాండ్యదేశమున తామ్రపర్ణి నదీతీరమున తిరునగరియను దివ్య నామముగల పుణ్యక్షేత్రమున జనించి శ్రియః పతి సేవ సాదించెదరనియు ముందుగనే జ్యోతిష్కులు వక్కాణించి యున్నారని నానుడి.

నమ్మాళ్వారు ప్రథమనామము మారన్. వీరు కారియర్ అను భాగవతోత్తముని కుమారుడు. వీరిది గాండ్లకులము. వీరివంశపు ఆదిపురుషుడు ద్వాపరాంతమున జీవించిన తిరువలుదివళనాడర్.

వీరి జన్మ వృత్తాంతము అద్భుతము. కారియర్ నాథనాయకమ్మ దంపతులకు పుత్ర సంతానము లేనందున వారి గ్రామమున (తిరునగరి) వెలసిన శ్రీకృష్ణస్వామిని ప్రార్థింపగా క్రమముగా దైవాను

గ్రహమున నాథనాయకమ్మ గర్భము దాల్చి, కుమారుని గనెను. ఇతడే మారన్. ఇతడు విష్ణుమూర్తి సేనాని విష్వక్సేనుని అంశమని భక్తుల భావము.

ఈ బిడ్డడు సామాన్య మానవ శిశువువలె గాక, కన్నులు దెరువక, స్తన్యపానాదులుడిగి యుండెను. ద్వాదశ దినమున తలిదండ్రులీ శిశువును లక్ష్మీదేవాలయమునకు దీసికొని పోయి, బిడ్డను పెరిందేవి విగ్రహపాదముల సమీపమున పెట్టి ప్రార్థించిరి. తక్షణమే బిడ్డ కన్నులు విప్పి, దోగాడుచూ, దేవాలయావరణమున నున్న తింత్రిణీ వృక్ష మూలమును జేరి, పద్మాసనమున యోగమున కూర్చుండెను. అందరు ఆశ్చర్య భయ విభ్రాంతులైరి. అతడట్లనే అన్నపానాదులు లేక, వాయు భక్షణమున పదునారు సంవత్సరములు తపస్సు నందుండెను.

శ్లో॥ వృషభేతు విశాఖాయాం
కురుకాపురి కారిజమ్
పాండ్యదేశే కలే రాదౌ
శఠారిం సైన్య పం భజే.

ఆళ్వారులందరు స్వాచార్యులు. అందులో అనిర్వచనీయమైన మేధాసంపత్తి వీరిది.

నమ్మాళ్వారు పదునారు సంవత్సరములు తింత్రిణీ వృక్ష మూలమున యోగాసనాసీనుడై ధ్యానమునందున్న కాలమున దేశములోని ఋషులు, మునులు, సాధువులు, భక్తులు, పండితులు, శాస్త్రజ్ఞులు అనేకులు వారిని దర్శించి అబ్బురపడిరి. ఈ కాలమున వారు అర్ధవికసితలోచనుడుగా నుండి, దర్శించుటకు వచ్చిన పండితులు, శాస్త్రజ్ఞులు, వేదాంతులు వేదోపనిషత్తులు, బ్రహ్మ సూత్రములు, భగవద్గీత శాస్త్రపురాణేతిహాసములు చదువుతూ కాలక్షేపము చేయుచుండగా, సర్వమును గ్రహించినవారైరి. సర్వులు వీరిని దైవాంశ సంభూతులని భావించి, సేవించుచుండిరి.

"సర్వం విష్ణుమయం" అని తలంచి, తత్సూత్రమును ప్రచారము జేయదలచిన వారగుటచే, వారెల్లప్పుడు విష్ణు సంశ్లేష భావమున నుండి పరమానంద భరితులుగా నుండువారు. అందువలన సర్వేశ్వరుడు, అనంతకల్యాణగుణ ప్రపూర్ణుడు, సమస్త వైకుంఠ పరివారముతో వచ్చి, తనముందు నిలిచి, తన్ను ఆశీర్వదించినట్లు నమ్మాళ్వారు తలంచిరి. పెరియాళ్వారు తిరుప్పల్లాండు పల్కిన విధమున వీరును స్వామికి మంగళాశాసనము చేయువారు.

తరువాత కాలమున వీరి జ్ఞానమును మధురకవి ఆళ్వారు లోకమున వ్యాపింపచేసిరి. వారి తరువాత శ్రీరంగమున వైష్ణవమత స్థాపకుడు శ్రీనాథమునులు ఈ కార్యమును నెరవేర్చిరి.

రామానుజా! ప్రస్తుతము శ్రీరంగక్షేత్రమున విశిష్టాద్వైత మతమును స్థాపించియున్నట్టియు, శ్రీనాథమునుల మనుమడును అయిన మహా మేధావియగు యామునాచార్యులు నమ్మాళ్వారుని జ్ఞానసౌరభమును వెదజల్లుచున్నారు.

రామానుజా! మీ మేనమామ శ్రీశైలపూర్ణుడు యామునాచార్యుల శిష్యుడు కదా! నేనును ఆ శిష్యకోటిలో చేరినవాడనే! అని తిరుక్కచ్చి నంబి రామానుజునితో నని మరియు నమ్మాళ్వార్ల ప్రతిభను గూర్చి వర్ణింపదొడగెను.

నమ్మాళ్వార్ల ప్రతిభ వర్ణనాతీతము. వీరు కోపమెరుగని శాంతి స్వరూపుడు గాన వీరికి శఠారి, శఠరిపుడు, శఠకోపి అను తిరునామములు గలవు. యతులలో శ్రేష్ఠుడుగావున యతీంద్రుడన బడుచున్నాడు. మూఢవిశ్వాసములతో వెలసినట్టియు, మాయావాద ప్రధానములైనట్టియు, మతములనెడి మత్తగజములకు అంకుశము వంటి వారుగాన వీరిని "పరాంకుశమ్" అని అంటారు. వీరు దయామయులు గావున, సర్వమానవులు దేవుని సమప్రతిపత్తితో నారాధింప వచ్చుననియు, మాతృభాష యందు దైవస్తుతి గావింప వచ్చుననియు, బోధించినవారు గాన ప్రజలు వారిని "మన ఆళ్వారు"

"నమ్మాళ్వారు", అనిరి. ధర్మమార్గమున నున్నట్టియు, విష్ణు సంశ్లేష భావమున యున్నట్టియు తన్ను భగవంతుడు సైతము "నమ్మాళ్వార్" అని సంబోధించినట్లు భావించి ఆనందించువాడు.

నమ్మాళ్వారు వెలిసిన తిరునగరికి "ఆళ్వార్ తిరునగరి" యను ప్రసిద్ధ నామధేయము గలిగినది.

"మధురకవి ఆళ్వారు నమ్మాళ్వారుకు శిష్యుడయిన విధము ఒక విచిత్ర గాథ, రామానుజా - వినుము" అని తిరుక్కచ్చినంబి ఆ కథా భాగమును చెప్పదొడగెను.

నమ్మాళ్వారు తన పదునారవ సంవత్సరమున దేశయాత్రకు బయలు దేరెను. దేశములోని వివిధ పుణ్యక్షేత్రములను దర్శించి, వివిధ దేవాలయముల దర్శించి, తన అనుభవముచే తన జ్ఞానమునకు సంపూర్ణతను కలిగించుకొనవలయునని తలపెట్టెను. "సర్వం విష్ణు మయం" అను సూత్రమునకు ప్రచారము గావింప నెంచెను.

ఇంతకు పూర్వమే మధురకవిఆళ్వారు ఉత్తరదేశ యాత్ర చేయుచుండెనని మనము ఇదివరలో గమనించియున్నాము. ఒకనాడు మధురకవి ఆళ్వారు ప్రయాగలో నున్నపుడు, దక్షిణదేశ యాత్ర సలిపి తిరిగి వచ్చిన కొందరు ఉత్తరదేశ యాత్రికులు మధురకవితో, "స్వామీ! దక్షిణదేశమున లేని పుణ్యక్షేత్రము లిచటనున్నవా? ఆళ్వార్ తిరునగరిలో వెలసిన నమ్మాళ్వారును మీరు దర్శించియుండలేదా? అచ్చట స్వామి కోయిల్ ప్రాంగణమున వెలసిన శేషాంశమయిన తింత్రిణీ వృక్షమూలమున జన్మించినది మొదలు పదునారు సంవత్సరముల కాలము తపస్సు గావించుచు, భక్తుల నుజ్జీవింప జేయుచున్న నమ్మాళ్వారును మీరెరుగరా? వారు ఆధ్యాత్మికాకాశమున ధ్రువ నక్షత్రము వలె ప్రకాశించుచున్నారు" అని చెప్పిరి.

ఈ మాటలు విన్న మధురకవి అబ్బురపడి, చేతిలోని పక్షిని వదలి పొదలోని రెండు పక్షుల కొరకు ప్రయత్నించు వానివలె తనస్థితి యున్నదని దీర్ఘముగా నాలోచింప దొడగెను. నమ్మాళ్వార్ల దివ్య

విగ్రహమును మనమున ఊహించుకొనుచు, త్వరలో దక్షిణదేశము చేరి నమ్మాళ్వారును సేవింపవలయునని వాపోయెను. రాత్రింబగళ్లనక యెల్లపుడు దక్షిణదిక్కున గగనమున నొక ధ్రువతారవంటి నక్షత్రమును తాను చూచుచున్నట్లు భావించువాడు.

ఇట్లు భావించుచు, మిగిలిన పుణ్యక్షేత్రముల దర్శనమును శీఘ్రముగా పూర్తి జేసికొననెంచుచూ పయనించుచున్న మధురకవి ఒకానొక సుదినమున వారణాసియందు ఉత్తరదేశ యాత్రకై వచ్చి అచ్చటి కరుదెంచియున్న నమ్మాళ్వారును తటాలున దర్శించుట సంభవించెను. దన దృగ్గోచరముననున్న తార గగనము నుండి వాలి నమ్మాళ్వారులో ప్రవేశించినట్లు గాంచిన విధమున మధురకవి భావించెను. భక్తి జ్ఞానములతో దేదీప్యమానముగా వెలుగొందుచున్న నమ్మాళ్వారును జూచిన క్షణముననే మధురకవి వారిని నమ్మాళ్వారని భావించి, భూమిపై సాష్టాంగముగా పడి, నమ్మాళ్వారి వకుళాభిరామ పాదయుగళమును స్పృశించి, ప్రణామంబు లాచరించెను. సర్వజ్ఞుడయిన నమ్మాళ్వారు మధురకవిని ఆశీర్వదించెను. తాను నమ్మాళ్వార్ల ప్రథమ శిష్యుడనని మధురకవి ప్రకటించుకొనెను. అదియొక అపూర్వ సన్నివేశము. దేశ యాత్రలు పూర్తి అయిన తరువాత ఆళ్వార్ తిరునగరిలో వారు పునఃసమాగమగునట్లు నిర్ణయించుకొని విడివడిరి.

నమ్మాళ్వారు దేవాలయ ప్రాంగణమున వెలసియున్న తింత్రిణీ వృక్షమూలమున నాసీనుడై, తన ధ్యాన యోగమును పునఃప్రారంభము గావించెను. దినమున కొలది కాలము తనను పరివేష్టించి ఆసీనులై యున్న భక్తులనుద్దేశించి ఉపన్యసించుచు, కొలది కాలము గ్రంథరచన గావించుచు, కొలది కాలమున ధ్యాన నిష్ఠయందును ఆళ్వారు కాలము గడపుచుండిరి. ఆహారపానీయ వర్జితుడును, తేజోరాశియు, స్వాచార్యుడును, ఏక సంథాగ్రాహియు, సంపూర్ణ ఆత్మ జ్ఞానమున నున్నట్టియు నమ్మాళ్వారునకు నిద్రయనున దేమున్నది? ఎల్లప్పుడు యెరుకయందున్న ఆత్మజ్ఞానానికి రాత్రింబగళ్లను భేదము లేదుకదా?

నీడయే లేనట్లు ఆళ్వారు దివ్య శరీరములోని ప్రతి యణువు దివ్యకాంతుల నీనుచుండెను.

ఈలోపల మధురకవి, తన దేశ పర్యటనను పూర్తిగావించుకొని, స్వస్థలమునకు బోక, నేరుగా ఆతురతగా ఆళ్వార్ తిరునగరి చేరి, దేవాలయ ప్రాంగణమును జేరి, అటినిటు అవలోకించుచు తింత్రిణీ మహావృక్షమును సమీపించి, తన్మూలమున ఆసీనుడై ధ్యాన నిమగ్నుడై అర్ధవికసిత నయనారవిందములతో భాసిల్లు నమ్మాళ్వారును దర్శించి, వారికి ప్రపత్తుడాయెను. ఇప్పుడును గగనము నుండి యొక దివ్య అప్రాకృత తేజస్సు నమ్మాళ్వారులో ప్రవేశించినట్లు మధురకవి భావించెను. తన శేషజీవితమును నమ్మాళ్వార్ల సమక్షముననే గడప వలయునని నిశ్చయించుకొనిన మధురకవి నమ్మాళ్వారున కెదురుగ భూమిపై ధ్యాన నిష్ఠుడుగా కూర్చొని యుండెను. నమ్మాళ్వారుతో సంశ్లేషించి మధురకవియు ఆళ్వారుగా సర్వులచే ప్రశంసనందెను.

సామాన్యముగా ముకుళిత నేత్రుడుకాగా ఆసీనుడై యుండు నమ్మాళ్వారు, అర్ధ వికసిత లోచనుడై మధురకవికి తన అభయ హస్తముతో మంగళాశాసనము గావించెను.

"ఆత్మ అనునది శరీరమును భౌతికపదార్థము నుండే ఉత్పన్న మగునని చెప్పినపుడు, ఆ యాత్మ యేమి భక్షించును? ఎందుండును?" అని మధురకవి ప్రశ్నించెను.

"ఆత్మ ఆత్మను భక్షించును, ఆత్మయందుండును', అని నమ్మాళ్వారు పల్కిరి.

"అచిత్ తో చిత్ (జీవాత్మ) సంబంధపడి యున్నపుడు, జీవాత్మ దేనిని అనుభవించి, యెక్కడ పడియుండును"? అని మధురకవి ప్రశ్నించెను.

"ఆత్మ శరీరగతమగు సుఖదుఃఖాదులను అనుభవించుచూ, శరీరమునే ఆశ్రయించుకొని యుండును", అని నమ్మాళ్వారానతిచ్చిరి.

ఈ విజ్ఞానమును గమనించిన మధురకవి, "నమ్మాళ్వారు సర్వజ్ఞుడు, ఈ మహాత్ముని, ఈ మహానుభావుని అనువర్తించి, ఉజ్జీవింతును గాక!", అని నిర్ణయించుకొని, మిక్కిలి సంతుష్టుడై, నమ్మాళ్వార్ల శ్రీపాదారవిందములందు సాష్టాంగ ప్రణామముగా సేవించి, మనోవాక్కులచే ఆళ్వార్లను సదా అనుభవించుచు, ఆళ్వార్లకు ప్రథమ శిష్యరత్నమై, ప్రసన్నజన కూటస్థులగు స్వాచార్యుడయిన "నమ్మాళ్వార్ల వైభవమును" చరమార్థమగు "కణ్ణినుణ్ శిరుత్తాంబు" అను దివ్య ప్రబంధమును ప్రసాదించి, పంచమోపాయ నిష్ఠలగు ముముక్షువులకు ఉపకరించుచూ, ఇట్లు పరాంకుశుని వైభవమును సర్వులకు తెలియునట్లు ప్రకాశింపజేసి, కీర్తించి, లోకమును సుఖింప తోడ్పడిరి.

మధురకవి ఆళ్వార్లను గూర్చి ప్రస్తుతము విశిష్టాద్వైత మతాధిపతిగా నున్న యామునాచార్యుని పితామహుడు నాథమునులు ఒక శ్లోకమున యీ భావమును వెల్లడించి యున్నారు:

"స్వాచార్యులగు నమ్మాళ్వార్ల యొక్క ద్రావిడోపనిషత్తులగు నాల్గు దివ్య ప్రబంధముల గానమును నేను సుఖముగా ననుభవించుచూ, తదితరముల నెరుగక, మరియు నమ్మాళ్వార్ల కల్యాణ గుణముల యందు సంశ్లేషించి, వారికే శేషభూతుడై వెలయు మధురకవి యాళ్వారునకు దాసుడనై వారిని నా హృదయము నందెల్లప్పుడు ఆవిర్భవించుకొని యుందునుగాక".

మధురకవి ఆళ్వారు అతిమధురముగా గానము చేయువారు. అతడు గొప్ప తత్త్వవేత్త, తార్కికుడు, గాయకుడు, ప్రవక్తయును. నమ్మాళ్వార్ల ద్రావిడ వేదమును గానము చేయుచూ, లోకమును ఉద్ధరించినవారు. వారు నమ్మాళ్వార్లను గూర్చి అనేక పాశురములను, కీర్తనలను రచించి, గానము జేసిరి.

ద్వాదశాళ్వారులందరి ప్రతిభలు వీరియందు విలసిల్లియుండెనని పండితులు, భక్తులు భావింతురు.

ఇంతకు పూర్వము తెలుపబడిన విధమున తనతోకూడా కలిసి ద్వాదశాళ్వారులు రచించిన గానముజేసిన పాశురములు, శ్లోకములు, కీర్తనలు ఇతర సారస్వతమును సర్వమును నమ్మాళ్వారు సేకరించి, నాల్గువేల పాశురముల కూర్పుగా తయారుజేసిరి. ఈ కూర్పునకు "నాలాయిరం" అని పేరు. దీనికి ద్రావిడ వేదము అని ప్రసిద్ధి.

ఇదిగాక సర్వోపనిషత్సారమగు భగవద్గీతా వస్తువును ద్రావిడ ప్రబంధ మను పేర రచించిరి. సంస్కృత భాషను ఒక్క కులమువారే, అందులో కొలదిమంది మాత్రమే యెరిగియుండుటచేత, ఆది రచన లయిన వేదములు, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, గీత మున్నగునవి సామాన్యప్రజలకు దూరమాయెను. అందువలన నమ్మాళ్వారు నాలాయిర ద్రావిడ ప్రబంధములను తమిళ భాషలో రచించి, దేవాలయములందు వీనిని చదివిన అందరికిని అర్థమగునని వారుద్దేశించిరి. అట్లే తరువాత కాలమున జరిగినది; వారి ధ్యేయము సఫలమయినది. అది వారి ఆత్మబలము, నమ్మాళ్వారు ఈ విభూతియందు ముప్పదినాల్గు వసంతములే వేంచేసియున్నట్లు తెలియుచున్నది. తన ప్రధాన శిష్యరత్నము మధురకవి ఆళ్వారు సమక్షముననే నమ్మాళ్వారను ఆదిత్యుడు జీవితాకాశ పశ్చిమదిశన అస్తమించెను.

సమస్త పూర్వాచార్య సమూహముచే కొనియాడబడినట్టి యతీంద్రుడు నమ్మాళ్వారుల విషయమందు శ్రీమధురకవి ఆళ్వారు విశేషప్రపత్తి యొనర్చి, నిత్యసేవ యొనరించుచు, వీరి వైభవమును "కణ్ణినుణ్ శిరుత్తాంబు" అను దివ్య ప్రబంధముచే ప్రసిద్ధిపరచి, తిరునగరిలో శ్రీ నమ్మాళ్వారుల దివ్య మంగళ విగ్రహమును అర్చా రూపముగా ప్రతిష్ఠింపజేసి, గోపుర, ప్రాకార మణిమంటపాదులు ఏర్పాటుల నొనర్చి, నిత్యోత్సవాది సకలోత్సవములను అతి వైభవముగా నెరవేర్చుచూ వచ్చిరి. ఇవ్విధమున మహాప్రభావ శీలుడయిన నమ్మాళ్వార్ల యొక్క దివ్యరచనలకు, దివ్యవైభవమునకు ఆకాలముననే మధురకవి ఆళ్వారు ప్రచారము గావించుటయేగాక, తరువాత

కాలమున శ్రీనాథమునులు ఈ విషయమై ఎంతో కృషిజేసి భక్తుల నుజ్జీవింపజేసిరి.

తిరువాయ్‌మొళి యను ద్రావిడ వేదసారమును గూర్చి శ్రీ నాథమును లిట్లు వక్కాణించి యున్నారు:

శ్లో॥ భక్తామృతం - విశ్వజనానుమోదనమ్
సర్వార్థదం - శ్రీ శఠకోప వాఙ్మయమ్
సహస్ర శాఖోపనిషత్సమాగం
నమామ్యహం - ద్రావిడ వేదసాగరమ్.

యామునాచార్యులు (ఆళవందార్) నమ్మాళ్వారుని గూర్చి యిట్లు ఒక తనియన్‌ను సెలవిచ్చియున్నారు:

శ్లో॥ మాతాపితా యువతయస్తనయా విభూతి
స్సర్వం యదేవ నియమేన మదన్వయానామ్
ఆద్యస్యనః కులపతే ర్వకుళాభిరామం
శ్రీమత్తదంఘ్రి యుగళం ప్రణమామి మూర్ధ్నా.

ఇట్లు చెప్పుచూ, తిరుక్కచ్చినంబి, "రామానుజా! వింటివా నమ్మాళ్వారు అద్భుత జీవిత విశేషములు? మరియు పన్నిద్దరాళ్వార్ల దివ్య వైభవమును నీకు క్లుప్తముగా దెల్పితిని. వారి రచనలను, వారి భక్తి భావమును, వారి స్వార్థరాహిత్య భావమును, వారి విష్ణు సంశ్లేష స్థితిని, వారి సేవలను గూర్చి సూచనప్రాయముగా నేను నీకు దెల్పితిని. భవిష్యత్తులో సకాలమున వారి రచనలను పఠించి, నీవు గ్రహింపవలసిన జ్ఞానామృత మెంతయో యున్నది, రామానుజా!" అని తెల్పగా, శ్రీరామానుజుడు పరమానందభరితుడై, "స్వామీ! ఆళ్వారుల దివ్య వైభవము నా మనస్సున కెంతయో నచ్చినది. మీరు నాయెడ దయతో గావించిన మంగళాశాసనము ప్రకారము నా జీవితమున వారి రచనలను తరచి, తరించగలను", అని సవినయముగా పల్కెను.

ఆళ్వారుల దివ్య వైభవ శ్రవణము రామానుజుని ప్రభావితము జేసినది; అతని మనఃఫలకముపై చెరగని ముద్రను వేసినది.

# 11. శ్రీనాథముని - శ్రీ యామునాచార్యులు

రామానుజుడు తిరుక్కచ్చినంబి వద్దనుండి ఆళ్వారుల చరిత్రమును కొంతవరకు విస్తారముగా గ్రహించుటకు పూర్వమే. తన బాల్యముననే శ్రీనాథముని యామునాచార్యులను గూర్చి కొంత వినియున్నాడు. ఆ వృత్తాంతమును ఇప్పుడొకసారి జ్ఞప్తికి దెచ్చుకొనుట యుక్తము.

శ్రీశైలపూర్ణుడు (తిరుమలనంబి) రామానుజుని మేనమామ అనియు, శ్రీరంగమున స్థాపించబడియున్న విశిష్టాద్వైత మతాధిపతి యామునాచార్యుని శిష్యుడనియు మన మెరుగుదుము. ఒకపరి బాలుడైన మేనల్లుడు రామానుజుని చూచి పోవలయుననెడి కుతూహలమున శ్రీశైలపూర్ణుడు శ్రీపెరుంబుదూరునకు వచ్చెను. మరియు తన మరియొక తోబుట్టువు దీప్తిమతి సమీపగ్రామముననే యున్నదిగదా! ఆమెను, ఆమె కుమారుడు గోవిందుని గూడా చూడ నరుగుదెంచినాడు శ్రీశైలపూర్ణుడు.

సాయంసమయమున భోజనానంతరమున ఇంటి ముంగిలి భాగమున పండు వెన్నెలలో ఆరుబయట చాపలు పరచుకొని, కేశవాచార్యుడు, కాంతిమతి, రామానుజుడు, శ్రీశైలపూర్ణుడు కూర్చొని, క్షేమసమాచారముల గూర్చి మాటాడుకొనుచుండిరి. మేనల్లుని నడవడికకు, అప్పటికతడార్జించిన విద్యా వైశాల్యమునకు శ్రీశైల పూర్ణుడు సంతృప్తినందెను. రామానుజునకు కొన్ని ప్రోత్సాహ వాక్యములు జెప్పి ఆశీర్వదించెను అప్పుడపుడు తలిదండ్రుల నుండి ఆళ్వారుల చరిత్రములు, ఆళవందారు వృత్తాంతములను రామానుజుడు కుతూహలముగా వినుచుండెనని శ్రీశైలపూర్ణుడు తెలిసికొని ఆనందించెను.

క్రమముగా శ్రీశైలపూర్ణుడు తన యోగక్షేమముల చెల్లికి, బావమరిదికి చెప్పు సందర్భమున, యామునాచార్యుల ప్రతిభ, శిష్య వర్గమును గూర్చి చెప్పుట తటస్థించెను. తండ్రి నుండి సందర్భాను

సారముగా అప్పుడపుడు రామానుజుడు యామునాచార్యుల ఘనతను గూర్చి వినియేయున్నాడుగదా? ఇంకను సవిస్తరముగా నెరుగుటకు కుతూహలపడినాడు రామానుజుడు. ఇప్పుడు తన మేనమామ యామునాచార్య శిష్యవర్గములోని వారగుటచేత వారినుండే నేరుగా యామునాచార్యులవారిని గూర్చి మరికొన్ని విషయములు తెలిసి కొనుట యుక్తమని భావించిన జిజ్ఞాసువు రామానుజుడు, "మామగారు! మీ అచార్యులును, యావద్ వైష్ణవాచార్యులును అయిన యామునాచార్యుల గూర్చి సవిస్తరముగా మీవద్దనుండి వినదలచితిని. నేనీవిషయమును మీవద్దనుండి సంపూర్ణముగా వినగలుగుదునని మా తల్లిదండ్రులును నన్ను ఆశీర్వదించి యున్నారు", అని చెప్పగా, శ్రీశైలపూర్ణుడు మందహాసమున శ్రీరామానుజునివైపు జూచుచూ, తనహస్త ద్వయముతో రామానుజుని శిరమును స్పర్శించుచూ, మూర్ధమును ముద్దిడుకొనెను. తల్లిదండ్రులు కేశవాచార్యుడు, కాంతిమతియు ఆనందమున శ్రీశైలపూర్ణునివైపు చూచుచుండిరి.

శ్రీశైలపూర్ణునకు తన ఆచార్యరత్నము ఆళవందారును గూర్చి చెప్పుటకంటే ఎక్కువ ఆనందకరమైన విషయము మరియొకటి యుండదుగదా!

శ్రీశైలపూర్ణుడిట్లు చెప్పదొడగెను:

"పరమ భాగవతోత్తములగు ఆళ్వారులు వేదసారమును, ప్రస్థాన త్రయసారమును తరచి, తరచి, తమిళభాషలో పాశురములుగా రచించిరి. నాలాయిరమను నాల్గువేల శ్లోకగ్రంథమును, ఉపనిషత్సార మయిన తమిళ ప్రబంధమును, ఆళ్వారుల దివ్యవైభవ భక్తి కీర్తనలును కాలక్రమమున మరుగున పడుచుండెను. వీనిని అన్వేషించి, సేకరించి, ప్రపంచమును ప్రభావితము జేయవలయునను సంకల్పము శ్రీనాథమునులకు గల్గెను.

నాథముని జన్మస్థానము మన్నార్గుడి. ఇది తంజావూరు మండలముననున్నది. (క్రీ.శ. 824 సంవత్సరము వారి జనన కాలము)

వీరు యౌవన దశకువచ్చి, శ్రీవైష్ణవ భక్తుడై, ఆళ్వారులను గూర్చి తెలిసికొన వలయుననెడి కుతూహలము జనించునప్పటికి ఆళ్వారుల దివ్య రచనలు చీకటిలో పడిపోయినవి. ఒకనాడు ఒక వైష్ణవ భక్తుడు నమ్మాళ్వార్ల "ఆరావముదే" అను పాశుర మొకదానిని చదువగా విని, నాథముని అద్భుతపడి, యీ పాశురము నమ్మాళ్వారుని జ్ఞాన మేరువునందొక బంగారురవ్వయని భావించెను. గుప్తమయియున్న ఆళ్వార్ల రచనలను వెలుపలికి తీయవలయునని నాథముని నిర్ణయించుకొనెను. ఇందుకొరకు నాథముని దేశాటన ప్రారంభించెను. దేశములోని దివ్యక్షేత్రముల దర్శించి, ఆళ్వారులు వెలసిన, తిరిగిన, పరమపదము జెందిన ప్రాంతములను స్వయముగా దర్శించి, వారి రచనలను, ప్రజలచే గానముచేయబడు వారికీర్తనలను సర్వమును సేకరింప ప్రయత్నపడెను. నాథముని ప్రయత్నము లేనియెడల ఆళ్వారుల రచనలు శాశ్వతాంధకారమున బడియుండెడివి.

నాథముని కొక్కడే కుమారుడు. ఈతని నామధేయము ఈశ్వరముని; ఇతడు మహామేధావి; ఏకసంథాగ్రాహి. నాథముని తనభార్యను, కుమారుని, కోడలిని వెంటనిడుకొని ఉత్తరదేశయాత్ర గావించుచుండెను. మధురకవి ఆళ్వారు ఉత్తరదేశయాత్రలు గావించి యున్నారు గాన, తన ఉత్తరదేశ పర్యటనలో వారిజీవిత విశేషముల కొన్నిటిని సేకరింపవచ్చునని నాథముని తలచెను. వారు యమునా నదీతీరమున బృందావన ప్రాంతమున కొంత కాలము పర్యటన గావించుచుండిరి. కోడలు ఆకాలముననే గర్భవతి యయ్యెను. తీర్థయాత్ర అనంతరము వారు స్వగృహము జేరిరి. కోడలు గర్భవతి యగుటంజేసి, బిడ్డకు "యామునాచార్యుడ"ని (యామునుడని) నామకరణము జేసిరి.

యామునుని తండ్రి ఈశ్వరముని అకాలమరణము జెందెను. పుత్రవియోగమును భరింపజాలక శ్రీనాథముని వైరాగ్యభావమున సన్న్యసించెను. శ్రీరంగమున శ్రీవైష్ణవ మఠమును స్థాపించి, అచ్చటనే శిష్యులతో కాలము గడుపుచుండెను. మఠాధిపత్యము వహించిన

తరువాత మరియొకసారి దక్షిణదేశ పర్యటన గావించి, అళ్వారులు సంచరించిరని ప్రసిద్ధిగాంచిన ప్రదేశముల తిలకించి, అళ్వార్ల చరిత్రలను, రచనలను, ప్రజలలో నాటుకొనిపోయిన అళ్వార్ల కీర్తనలను సేకరించుచూ, తిరిగి ఆ మఠమునుజేరి వైష్ణవమత విషయములు శిష్యులకు దెల్పుచుండెను.

యామునుని తల్లియు, నాయనమ్మయు అష్టకష్టముల కోర్చి బాలుని పెంచుచుండిరి. బాలుని దౌర్భాగ్యస్థితికి వారు చింతించు చుండిరి. కాలక్రమమున బాలుడు పెరిగి ఏలున్నంతవరకు పంద్రెండు సంవత్సరములలోపల గొప్ప విద్యను బడసెను. విద్యాభిరుచి లెస్సగా గలిగిన యీ బాలుడు విద్యాసంపాదన నిమిత్తము వేరు ప్రదేశమున నున్న భాషాచార్యుడను విద్వాంసునొద్దకు చేరెను. ఇది మొదలు యామునుడు స్వగృహమునకు పోయినది లేదు; స్వజనమును కలుసుకొన్నదియులేదు. పితామహియు, మాతృమూర్తియు నిద్దరు బాలుని దౌర్భాగ్యస్థితికి వగచుచు, మొగదిక్కులేనివారై క్రమముగా కాలగర్భమున ప్రవేశించిరి.

యామునుడు మహామేధావి; ఏకసంథాగ్రాహి. పదునారు సంవత్సరములకే ప్రతిభాశాలియగు గురువునొద్ద వేదములు, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, భగవద్గీత, శాస్త్రపురాణముల నన్నిటిని స్వాధీనము జేసికొనెను.

అకాలమున పాండ్యభూపతి యాస్థానమున విద్వజ్జన కోలాహల బిరుదాంకితుడైన ఉద్దండ సంస్కృత పండితుడొకడుండెను. ఇతడు గొప్ప విద్వాంసుడేగాని, అతిగర్వి; మాత్సర్యపూరితుడు. ఇతరుల ఔన్నత్యమునకు భరింపరాని అసూయ బొందువాడు. రాజాస్థానము నకు ఏతెంచిన విద్వాంసులను, పండితులను తర్కమున నోడించి, వారిని తత్తరబిత్తరబెట్టి, అగౌరవపరచి పంపువాడు. పాండ్యరాజున కదియొక గర్వకారణముగా నుండెను. విద్వజ్జన కోలాహలుడు ప్రభువుయొక్క ప్రేమ, ఆదరణ, గౌరవములకు పాత్రుడుగా

నుండువాడు. ఒకనాడు సంవత్సరాది దినమున సంతోషభరితుడైయున్న భూపాలుడు విద్వజ్జన కోలాహలునితో, "అగణిత పండితవర్యా! నీవు నాయీరాజాస్థానమున కెంతయోకీర్తిని చేకూర్చితివి. నీవొక వరమును కోరుకొనుము. నూతన సంవత్సర బహుమానము నొసంగెద", ననెను.

వెంటనే విద్వజ్జన కోలాహలుడు తనమనమున, "వలలోపడ్డ చేపను వదలుట యేమున్నది? సమయము దొరకినది, సద్వినియోగ పరచుకొనుట ప్రాజ్ఞునికర్తవ్యము", అని తలపూచి, అతడహంకార పూరితుడగుటచే ప్రభువుతో సుంకములు చెల్లించుమాడ్కి, నీరాజ్యము లోని పండితులెల్లరును నాచే ఒకనాడు ఓడింపబడియుండిన వారేగాన, వారెల్లరు నాకు సామంతులవలె ప్రతిసంవత్సరమును చైత్రమాస పూర్వ పక్షమున కప్పములు గట్టునట్లు అజ్ఞాపింపుడు. సార్వభౌముడవయిన నీ యాస్థానముననున్న పండితసార్వభౌముడను నేనుగాన, నా హోదాకును, నీ ఘనతకును ఈ యాచారము తోడ్పడగలదు. అజ్ఞ నొసంగుము ప్రభూ".

రాజు అదే క్షణమున అధికారపత్రము నొసంగి రాజ్యము నలుమూలల యీ వార్తను ప్రసారము చేయించెను.

విద్వజ్జన కోలాహలునకు కప్పము చెల్లించవలసిన పండితులలో యామునుని గురువు భాష్యాచార్యుడొకడు. ఇతడు పండితాగ్రగణ్యు డయ్యును. వాదమున కవసరమగు కొన్ని ప్రత్యేకించిన శక్తులు ఉపాయములు లోపించియుండుటచే, గడునరియైన విద్వజ్జన కోలాహలునిచేతిలో పూర్వమొకసారి ఓడినట్లు భావింవబడెను. మల్లయుద్ధమున జయింపవలయునన్న కేవలము శారీరక బలము కండరములు చాలవు. నైపుణ్యము, సమయస్ఫూర్తియు నవసరములు. అట్లే తర్కమున జయింపవలయునన్న కేవలము పాండిత్యము చాలదు. సభా మధ్యమున ధైర్యముగా తర్కమునకు నిలువగలుగుట, వాక్పటిమ, వాక్చతురత, సమయస్ఫూర్తి మొదలగునవి అవసరము. వీనియందు సామర్థ్యము లేని నిరాడంబరుడైన భాష్యాచార్యుడు

గడునరియు గర్వియునగు విద్వజ్జన కోలాహలునకు సామంత పండితుడై కప్పమును చెల్లింపవలసిన వాడాయెను.

ఒకసారి భాష్యాచార్యుడు గడువునకు కప్పము చెల్లింప పైకము లేనివాడై, యెక్కడికో అప్పుగా పైకమును సేకరించుటకై గృహము వీడిపోయియుండెను. ఆనాడే విద్వజ్జనకోలాహలుడు తనశిష్యుని భాష్యాచార్యుని గృహమునకు బంపెను. అపర నక్షత్రకుని వలె ఈ దూత అనవసరమయిన ఆడంబరమును ప్రదర్శించెను. భాష్యాచార్యుని గూర్చి నిందలాడెను. అప్పుడు భాష్యాచార్యుని గృహమున యామునుడు మాత్రముండెను. యామునుని వయస్సు పదునారేండ్లు. వచ్చిన కోలాహలుని శిష్యుడు అతిదురుసుగా యామునునితో, "ఎక్కడ భాష్యాచారుడు? మతిలేనివాడుగా కన్పట్టెడిని? కప్పము చెల్లింప గడువుదినము నెరుగడా? ఈతని కొరకై మేము శ్రమపడి యిచటకి రావలయునా? ఏమి? రాజాజ్ఞను ధిక్కరించినవాడైనాడు! రాజాజ్ఞను ధిక్కరించిన వారెట్టి శిక్షకర్హులో తానెరుగడా?" అని గర్జించెను.

సూక్ష్మగ్రాహియు, వివేకియు, పౌరుషవంతుడును, గురుభక్తి పరాయణుడును అయిన యామునుడు, "ఎవరవు నీవు? పెద్ద చిన్నయను తారతమ్యము లెరుగక కల్లుత్రాగిన వానివలె యొడలెరుగక త్రుళ్ళుచున్నావు?" అనెను.

"ఏమంటివి? విద్వజ్జన కోలాహలుని శిష్యుడనయిన నన్నే యిట్లు తూలనాడుచున్నావా? పెద్ద చిన్నయనెడు తారతమ్యము లెరిగి నీవు ప్రవర్తించుచున్నావా?" అని తరువుకాడు అధిక్షేపించెను.

"అహంకారపూరితులగు నీకును నీ గురువునకును అవమానము గాక పూజార్హత లభింపగలదా?" అని యామునుడు ఎత్తిపాడిచెను.

"శిష్యుడవైన నిన్నిట్టి మూర్ఖునిగా తయారజేసిన నీగురువు భాష్యాచార్యులు యెట్టివాడని ఊహింపనోపు?" అని తరువుకాడనెను.

"అధిక ప్రసంగము మాని యికగుట్టుగ ఇటనుండి వెడలి పొమ్ము", అని యామునుడు తీవ్రముగా హెచ్చరించెను.

"వినాశకాలే విపరీతబుద్ధిః. నీకును నీ గురువునకును వినాశకాల మాసన్నమయినది", అని గొణుగుచూ, కోరచూపులు విసరుచూ వాడు నిష్క్రమించుచుండెను.

"వినుము - వినాశకాలే విపరీత బుద్ధిః - అని పండితోక్తులు పల్కితివి. వినాశకాలము దాపురించినది మాకుగాదు; నీకును నిన్ను బంపిన అహంకారి నీగురువునకును! కోలాహలుని తర్కమున నోరు మూయించుటకు శ్రీభాష్యాచార్యుని శిష్యులలో యామునుడున్నాడని నీగురువునకు, పాండ్యభూపతికిని ఎరింగింపుము", అని యామున సింహకిశోరము గర్జించెను.

విద్వజ్జన కోలాహలుని శిష్యుడు యువకుడైన యామునుని మాటలకు ఆగ్రహ మాత్సర్య విస్మయములు ముప్పిరిగొన, తోక దెగిన నాగసర్పమువలె పగబూని సరసర వెడలి జరిగిన వృత్తాంతమును పూసగ్రుచ్చినట్లు గురువునకు విన్నవించెను.

ఇది వినిన కోలాహలుని ఆగ్రహావేశము వర్ణనాతీతము. అగ్నిపర్వతము వలె కోపాగ్నిని వ్రెళ్లగ్రక్కుచూ, త్రాచువలెబుస గొట్టుచూ, పాండ్యనరపాలుని డాయంబోయి, ముకుళితహస్తుడై, "రాజా! భాష్యాచార్యుని శిష్యుడట! యామున నామధేయుడట! కొంటె యువకుడు! నన్ను తూలనాడెనట! ప్రభునాజ్ఞను ఆక్షేపించెనట. రాజద్రోహి! చెనటివాక్కులాడెనట! అవిధేయుడు! ఇట్టివానిని శిక్షింపక యూరకున్నను, జాగుచేసినను, ఇక సామాన్యప్రజానీకములో క్రమక్రమముగా క్రమశిక్షణ దెబ్బదినగలదు. వీనిని వదలరాదు, ప్రభూ", అని తనకోపాసూయాగ్నిజ్వాలల విడచెను.

వివేకవంతురాలగు రాణి తానిట్లు కలుగజేసికొనెను - "పండిత వర్యా! ఆగ్రహపడకుము! త్వరపడకుము! నీశిష్యుడు జెప్పినదంతయు వాస్తవమని విశ్వసింపజనదు. భాష్యాచార్య లరుగుదెంచినపుడు

శాంతముగా సత్యాసత్యముల నరయదగును. నీశిష్యుడు ధూర్తుడుగా కన్పట్టెడిని. అమాయకుడును, గురుభక్తి పరాయణుడును అయిన యువకుని నీశిష్యుడు రెచ్చగొట్టినట్లు తోచుచున్నది. నీశిష్యుడే శిక్షార్హుడగునేమో! చూచిరమ్మన్న కాల్చివచ్చు వాడుగానున్నాడు! శాంతింపుము. శాంతము సత్యాన్వేషణమునకు మార్గము. ఆగ్రహము అంధకార కవాటము", అని రాణి పలికెను.

రాజు, "అదిసరే! కాని ఆ యువకుడు మన ఆస్థానపండితుని తర్కమున నోడించి, తరిమెదననెనట. ఇది కొంత దురుసు తనమే గదా!" అనెను.

"నాథా! అందు ఆక్షేపణీయమేమున్నది? ఆ యువకుని ప్రజ్ఞ యెట్టిదో! ఏ పుట్టలో ఏ పామున్నదో! యేఖనిలో ఏ రత్నము గుప్తముగా నున్నదో! ఎవరికెరుక! యువకుని తర్కమునకే ఆహ్వానించెదము గాక! ఓడినచో శిక్షింపవచ్చును", అని క్షితిపతికి పట్టపుదేవి సూచించెను.

ఈ సూచన రాజునకు, అమాత్య బృందమునకు, పండితులకు, సభాసదులకు ఎల్లరకు లెస్సగా నచ్చినది. యామునుని తోడ్తెమ్మని భటులకు రాజాజ్ఞ యివ్వబడినది.

రాజభటుని వలన రాజాజ్ఞను తెలిసికొన్న యామునుడు, సగర్వ వినయ మందహాసములతో రాజభటుని నిట్లనెను - "ఆర్యా! ప్రభునకు నేనొక లాంఛనమును సూచించినట్లు విన్నవింపుము. విద్వజ్జన కోలాహలుడు అసమాన ప్రతిభాశాలికదా! అట్టి వానిని రాజసభ యందు తర్కమున నోడింపగల నాకు పల్లకిని బంపి ఉచిత మర్యాదతో రాజాస్థానమునకు నాహ్వానింప తగియున్నదిగదా!"

రాజభటుడు దెచ్చిన సందేశమును వినినరాజు, రాణివైపు హెచ్చరిక జేసిన విధమున జూచి, "ప్రాణేశ్వరీ! కంటివా, ఆ బ్రాహ్మణ యువకుని సాహసము? ఇది గర్వమా? అవివేకాంధకారమా? పిల్లచేష్టయా? గడుసుదనమా? నామనస్సునకు రాకున్నది", అని వితర్కించుకొన దొడగెను.

అతి సూక్ష్మముగ్రాహిణియు, పండితురాలును, సత్యాన్వేషణ దృక్పథముగల వ్యక్తియు అయిన రాణి చిరునగవుతో, "రాజా! ఆ బాలుడు ప్రతిభాశాలిగానే నా మనస్సునకు కన్పట్టుచున్నాడు. అతని వాక్కులును తెలియముచ్చట గానున్నవి. వాని మాటలు మిమ్ములను, మన ఆస్థాన పండితుని ఏల కుపితులనుగా జేయుచున్నవో నాకు తెలియుటలేదు. నిగర్వి, స్వార్థరహితుడు, శాంతియుతుడుగా నున్నవాడే సత్యాన్వేషణకు తగినవాడు. ఇక వితర్కమునకును, ఆలస్యమునకును అవకాశము వలదు. ముత్యాలపసిడి పల్లకిని బంపి బాలపండితుని రప్పింపుడ"ని చెప్పెను.

యామునుడు రాజాస్థానము జేరులోపల రాజదంపతులు ఈ విషయమై సంభాషించుచునే యుండిరి -

"మహారాణీ! ఒకవేళ ఆ యువకుడు ప్రజ్ఞాశాలియయినను, మన విద్వజ్జన కోలాహలునిముందు నిలువగలడా? శార్దూలము ముందు శశము కుప్పిగంతులు వేసినట్లుండును", అని ప్రభువనెను.

"నాథా! హిమవత్పర్వతమువంటి యెండుగడ్డివామి ఒక చిన్న నిప్పురవకు లోకువగదా! బాహ్యాడంబరములు, వేషము, వయస్సు ఖీకరములా ప్రజ్ఞకు సాంకేతికములు? వశిష్ఠ దూర్వాసులకున్న తారతమ్యము లెట్టివి? ప్రహ్లాదునకు హిరణ్యకశ్యపునకున్న భేదము మనమెరుగమా? ఆ యువకుని సత్వరము ఆహ్వానింపుడు. వానిని చూడవలయుననియు నాకు కుతూహలము పొడముచున్నది!" అని ప్రభ్వి తేజోసంపన్నముగా నుడివెను.

"మహారాణీ! పండితప్రవరుడగు రాజాస్థాన పండితుని ఆ కుర్రవాడు గడుసరితనమున తూలనాడుట యుచితమే? నీవును వారిని గడ్డివామికి పోల్చుటతగునా?" అని రాజు ఛలోక్తులాడెను.

"ఏమో! రాజా! నాకుమాత్రము విద్వజ్జనకోలాహలుడు నిండుకుండగా కన్పట్టుటలేదు. పండితోత్తముడు విద్యావినయ

సంపన్నుడుగా నుండవలయును; సమదర్శనుడుగా నుండవలయును. ఇతని యెడ ఈ లక్షణములు శూన్యము... ధరాహెచ్చుట తగ్గు కొరకే! ఈతని నీల్గు ఎల్లకాలము నుండనోపదు. ఈతనికున్న సహజగర్వ లక్షణము రాజాదరణవలననేమో యినుమడించినది! ఇక పాతము తప్పదని నా అంతరాత్మ ఘోషించుచున్నది'', అని రాణి తత్త్వవేత్త వలె వక్కాణించెను.

విద్వజ్జన కోలాహలుని ఇంతకాలము ఆదరించి, గౌరవించిన రాజు మనస్సు చివుక్కుమనెను. మరియు అధికారయుక్తులు గాన, అర్ధాంగి వద్దనుండియు ఎదురుమాటు సహింపజాలడు పరిపాలకుడు! ఇందువలన రాజుల చిత్తము చపలము! తటాలున రాణివైపు జూచుచు కొంత కినుకతో, ''విషయ పరిశీలనమునకు పూర్వమే పర్యవసానము వెల్లడించుమాడ్కినున్నది నీమాటల తీరు! ఆ కుఱ్ఱడు వయస్సును మించిన కోవిదుడుగా నుండునేమో గాని, వయోజ్ఞాన వృద్ధుడయిన కోలాహలుని ఓడించుననియా నీ విశ్వాసము?'' అని రాజు ప్రశ్నించెను.

''ఔను! ప్రభూ! అట్టి ప్రజ్ఞాశాలిగాకున్న ఆ యువకుడు రాజా స్థానమునకు తర్కప్రదర్శనమునకు వచ్చునట్టి సాహసమున కొడిగట్టునా? ఆతడు పల్లకిని కోరుట గౌరవముననే! ఆతడు దుర్మతిగాడు'', అని రాణి పల్కెను.

''సఖీ! నేనేదో వినోదమునకీ వాదప్రదర్శనమును ఏర్పాటు గావించుచున్నానేగాని, వేరొండుగాదు. నా నిశ్చితాభిప్రాయమేమనగా, ఆ యువకుడు విద్వజ్జన కోలాహలుని చూచినంతనే, యేనుగును తటాలున గాంచిన జాగిలము వాలమును ముడుచుకొని తొలగునట్లు పారిపోవునది నిశ్చయము - పందెమునకు రమ్ము - చూతము'', అని రాజు తటాలున వాచాలత్వమున ననెను.

''సరే! అట్లు జరిగెనేని, నేను పట్టమహిషి స్థానమును వదలి, మీ దాసీ జనులలో నొకదానినిగా నుండి జీవితాంతమును మీకు సేవజేయుచూ నుందునుగాక!'' అని రాణి పందెమునకు తలపడెను.

"అట్లానా! సరే! వినుము! ఆ యువకుడు తర్కమున నెగ్గిన, నేనతనికి అర్ధరాజ్యము నొసంగెదను గాక", అని రాజు ప్రతిజ్ఞ జేసెను.

వినువారెల్లరు, ముఖ్యముగా మంత్రులు, ఉన్నతోద్యోగులు కలవరమున నల్దిశలు జూచుచుండిరి - "అయ్యో! ఆటస్థలము రణరంగముగా మారినట్లున్నదే! మన రాజు, రాణి గావించిన ప్రతిజ్ఞలు పాటింపబడుటెట్లు? ఎవరు గెలిచినను రాజ్యమునకును దురవస్థయే గదా? రాజు అర్ధరాజ్యమును గోల్పోవుట మనము సహింపగలమా? తల్లివంటి రాణిగారు దాసియగుట మనము చూచి భరింపగలమా? ఈ విద్వజ్జన కోలాహలుడెట్టి తిప్పలు దెచ్చిపెట్టినాడయ్యా! చాడీమాటలు ప్రళయాంతకములు!" అని యెల్లరు చీకాకు నందిరి.

యామునుని కొరకు రాచపల్లకితో పరిజనులేతెంచిరి. ఈ లోపల గురువు భాష్యాచార్యులు ఇల్లుజేరియున్నాడు. విషయమును గ్రహించినాడు; భయకంపితుడయినాడు.

యామునుడు, "గురవరేణ్యా! నన్నాశీర్వదించిపంపుడు, పాండ్యభూపతి సభాస్థలిని, విద్వజ్జనకోలాహలుని నోటికి బీగము వేసిరాగలను", అని గురువుతో ననెను.

గతజలసేతు బంధనమేల! జరిగినదానికి వగచి లాభమున్నదే! ఈ స్థితిలో చేయదగినది మరియొకటి గాన్పింప లేదు. భాష్యాచార్యుడు యామునుని ఆశీర్వదించి పంపెను.

మదగజమండిత సరోవర ప్రాంతమును సమీపించు కంఠీరవము మాడ్కి, యామునుడు అశేష పండిత, అమాత్య, విద్వత్పూరితమగు రాచదర్బారును ప్రవేశించెను.

విద్వజ్జన కోలాహలుడు రాజాస్థానమును ప్రవేశించుచున్న యామునుని జూచి, రాణివైపుజూచి, "అమ్మా! ఈ పిల్లకుంకయా నాతో తర్కమునకు మోకరిల్లుట? నన్ను గెలువ ఘనుడేగుదెంచినాడా? (ఆళవందారా?)", అని హేళన, అసూయాభావములతో ననెను.

మహారాణి అతని హేళన మాటలకు సూటిగానే ప్రత్యుత్తర మిచ్చినది - "అవును - ఆళవందార్ - (నిన్ను గెలుచు ఘనుడేగు దెంచినాడు)".

విద్వజ్జనకోలాహలుని పాండిత్య ప్రకర్షములు ఆనాటితో అంతమొందగలవను భావము రాణిపలుకులలో సువ్యక్తమై కోలాహలుడు చిరాకుజెందెను. నిముసములో విషయమును తేల్చగల ననెడి దురభిప్రాయమున నుండెను.

విద్వజ్జనకోలాహలునకును, యామునునకును తర్కము ప్రారంభ మాయెను. ప్రథమమున కోలాహలుడు యామునుని ప్రశ్నించునట్లు నిర్ణయింపబడెను.

విద్వజ్జన కోలాహలుడు యామునుని, అమరకోశమున, అనగా భాషాజ్ఞానముపై పదార్థములపై పరీక్షింపదొడగెను.

"మహాపండితా! నన్ను విద్యాభ్యాసమునకు వచ్చిన పిన్నవానినిగా తమరు భావించినట్లున్నదే! అమరకోశమునందే యింత తడవు ప్రశ్నించుచున్నారే? తేజోనిధికి వయసుకారణమగునే! మాగురువుగారు భాష్యాచార్యులు పండిత భాస్కరుడు. నన్ను వేదోపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, శాస్త్రపురాణాదుల యందు కోవిదునిగా జేసియున్నారు. ఎందైనను ప్రశ్నింపుడు", అని యామునుడనెను.

అది మొదలు విద్వజ్జనకోలాహలుడు వేదశాస్త్రపురాణేతి హాసముల యందతి చిక్కు ప్రశ్నల వేయదొడగెను. మంచినీరు త్రాగురీతి, యామునుడు ప్రత్యుత్తరముల నియ్యదొడగెను. వారి యుత్తరప్రత్యుత్తరములు దావానలజ్వాలలపై మహావర్షోరు ధారాపరం పరలుగా నుండినవి. కడకు కోలాహలుని ప్రశ్నపేటిక కాళీయయినది! యామునునకును తెలియని విషయము లేనట్లుండెను!

అలసిన కోలాహలుడు, "ఇక నీవు నన్ను ప్రశ్నించవచ్చును" అని యామునునికి సూచించెను.

"పండితవర్యా! మీరు తార్కిక శిరోమణులని వినియున్నాను. మీరు తర్కమున నందిని పందిగా, పందిని నందిగా జేయగల సమర్థులట. అట్లగునేని నేను ఔనన్నది నీవు కాదనియు, నేను కాదన్నది నీవు ఔననియు నిరూపింపుము; చూతము", అని యామునుడు పల్కెను.

"అట్లనే కానిమ్ము", అని కోలాహలుడు తోకదెగిన నాగమువలె బుసగొట్టెను.

యామునుడు ప్రశ్నింప మొదలుపెట్టెను -

"మీ జనని గొడ్రాలు గాదు - అని నే ననుచున్నాను. అవును అని నీవు నిరూపింపుము".

కోలాహలుడు పట్టరాని కోపము, "ఈ విపరీతపు ప్రశ్న యెక్కడిది? అద్భుప్రశ్న! మాతల్లి అనపత్యురాలైన నేనెట్లు జన్మించితిని? ఇతనికి మతిపోయినదా?" అనెను.

రాణి వారి తర్కమున కలుగజేసికొని, "కోలాహలుడా! కోపింపకుము! నీవు నిరూపింపకున్న, ప్రశ్నించిన అతడు నీతల్లి వంధ్యయని నిరూపింప వలయునుగదా? కోపింపకుము; త్వరపడకుము" అని వారించెను

కోలాహలుడు మౌనము వహింపవలసి వచ్చెను.

"మొదటి ప్రశ్నకు జవాబు నివ్వలేకపోతివి; ఇపుడు ద్వితీయ ప్రశ్న నడుగుచున్నాడ - వినుము - పాండ్యభూపతి పాపరహితుడు అని నేననుచున్నాను. కాదు అని నీవు నిరూపింపుము", అని యామునుడు పల్కెను.

"ఏమంటివి? ప్రభువునే పాపి అని నేను నిరూపింపవలయునా? నా శిరచ్ఛేదమును కాంక్షించుచున్నావా? గడుసరి రాజనీతిజ్ఞుడవుగా నున్నావే! ఓహో! ప్రభూ! విన్నారుగదా! వీనికి యేదో మూడినట్లున్నది?" అని కోలాహలుడు విషము గ్రక్కెను.

రాణిగారు జోక్యము జేసికొని, "ఆర్యా! యువక పండితునిపై కొంటెములు చెప్పకుడు, మీరు నిరూపింపజాలని విషయమును అతడు నిరూపించునులే! శాంతింపుడు!" అనెను. యామునుని చూచిన క్షణముననే అతడు బాలసరస్వతియని భావించిన రాణి అతనిపై మాతృప్రేమను వహించినది.

కోలాహలుడు అవనత వదనుడై కూర్చొని యుండగా యామునుడు తృతీయ ప్రశ్నాబాణమును ప్రయోగించెను - "మహారాణి మహాపతివ్రత - అని నేను చెప్పచున్నాను. కాదు అని నీవు నిరూపింపుము", అనెను.

"తల్లీ - మహారాణీ! ఈ కొంటెకాయ తమరి పాతివ్రత్యమునే ప్రశ్నించుచున్నాడు! ఈగడుసరి నిట్లు కొంటెకాయ ప్రశ్నలనడుగుటకు ఇంకెంతకాలము తడవిచ్చెదరు?.... సరే.... నాకేమి? ఇతడు రాణిగారు పతివ్రతకాదని యెట్లు ఎంతటి సాహసముతో నిరూపింపగలడో చూచెద. బోనులో ప్రవేశించినది యీ మూషికము!" అనుచూ, ఆగ్రహమున యామునునితో, "ఓ యువకా! నీకొంటె ప్రశ్నాత్రయమునకు నీవే సమాధానముల జెప్పము. నీకు తగిన శాస్తి కలుగునులే", అని కోలాహలుడనెను.

సభాసదులెల్లరు నివ్వెరపోయి చూచుచుండిరి, రాజుగారు సైతము. మందహాసవదనారవిందయై వాత్సల్యపూరిత జగన్మాతవలె రాణిగారు గంభీరస్వరమున, "విద్వజ్జనకోలాహల బిరుదాంకితా! ఈ తర్కప్రదర్శనము మహోజ్జ్వలముగాను, మనోహరముగాను ఉన్నది. ఈతని ప్రశ్నత్రయము మహాద్భుతము! ఇయ్యెడ నీవును, రాజుగారును, నేనును ఆగ్రహపడనవసరములేదు. యువక పండితుడే వివరణముల నొసగవలయునుగదా! వినెదము గాక!" అని పల్కెను.

విద్వజ్జనకోలాహలుని దీర్ఘమౌనము నవలోకించిన ప్రభువు, "యామునా! నీవొసంగిన ప్రశ్నాత్రయమునకు నీవేజవాబుల నొసంగుము. నీ ప్రత్యుత్తరములు ఆమోదయోగ్యములైన,

శాస్త్రసమ్మతములైన, నీవు నా అర్థరాజ్యమునకు అధిపతి వయ్యెదవుగాక! ఈ మేరకు రాణితో పందెమున ప్రవేశించి యున్నాడను!

యామునుడిట్లు వక్కాణింపదొడగెను -

"ఏక పుత్రోహ్యపుత్రః - అని ధర్మశాస్త్రప్రమాణము - ఒక్క పుత్రునే గన్న తల్లి అపుత్రగనే పరిగణింపబడును. ఈ పండితుని తల్లికి ఇతడొకడే గదా పుత్రుడు? కావున ఈతని తల్లి వంధ్య అని తర్కమున తేలును".

"ఇక రెండవ ప్రశ్న విషయమును గమనింపుడు. పాండ్యరాజు పాపరహితుడుకాడు - అనునది. ప్రతి భూపతి స్థితియునిట్టిదే! పాండ్యభూపతియేగాదు, ప్రతిరాజును పాపియే! ఎట్లన - పరిపాలకుడు పరోక్షముగానైనను ఏదో యొక పాపభారమును వహింపవలసి యున్నది! మనుస్మృతి ప్రకారము రాజు తనపాలనలో నున్న ప్రజలార్జించిన పుణ్యపాపములలో ఆరవవంతు పొందునని ప్రమాణము. అట్టియెడ అధర్మము ప్రబలియున్న యీ మానవ సంఘము రాజు ఎంతవారించినను పాపముల కొంతవరకైనను చేయుచునే యుండును. ఆమేరకు రాజుకు కూడా కొంతపాపము అంటియుండును కదా! కావున రాజు పాపరహితుడుగా నుండజాలడు.

"ఇక మూడవ విషయము మహారాణి గారియొక్క పాతివ్రత్యమును గురించినది. ఇందు రాణిగారి యొక్క వ్యక్తిగత శీలమునకు భంగములేదు. వినుడు, నృపాలుడు అష్టదిక్పాలుర అంశమని పురాణప్రమాణము కదా! అందువలన రాజు ఒకవ్యక్తిగా వ్యవహరించుచున్నను, అతడు అష్టదిక్పాలకాంశముల సమ్మేళనము. కావున రాణి అష్టమూర్తుల సమ్మేళనావతారమగు నృపాలునకర్ధాంగి యగునని పురాణము చమత్కరించుచున్నది", అని తెల్పుచూ, యామునుడు తానొసంగిన ప్రశ్నాత్రయమునకు వివరణము నొసంగెను.

యువక పండితరత్నము, అపరసరస్వతీమూర్తి అనదగిన యామునుని ప్రతిభకు పండితులు, అమాత్యులు, సభాసదులు ముక్కున వ్రేలిడిరి.

రాణిగారు పరమానందావేశమున "ఆళవందార్ - ఆళవందార్! అని యామునుని సంబోధించుచు, సింహాసనమును దిగివచ్చి, యామునుని మాతృవాత్సల్యమున స్వీకరించి, తన యంకమున నాసీనుని జేసెను. "ఆళవందార్" అను పలుకుచూ, విద్వజ్జన కోలాహలుని వైపు క్రీగంటి చూపు నిగిడించుటచే, "తన్ను జయించు ఘనుడేగుదెంచినాడని" సూటిమాట లనిన కోలాహలుడు సిగ్గున అవనత వదనుడై కూర్చొని యుండెను.

రాజులేచి, "ఆళవందార్! నేజేసిన ప్రతిజ్ఞానుసారము నీవు అర్ధరాజ్యాధిపతివైతివి. రాజదంపతులమైన మేము, నిన్ను వాత్సల్యమున పుత్రునిగా ప్రేమించుచున్నాము. నీకు సింహాసనమే యుచితాసనము. నాయెదుట యీ సింహాసనముపై ఈ క్షణమున కూర్చొని నాకు కనులపండువు గావింపుము", అనెను.

"పూజ్యులును పితృసమానులును అయిన ప్రభూ! నాయందు మీకు వాత్సల్యము జనించుట నామహదైశ్వర్యము, నా అదృష్టము. అంతవరకు చాలును. రాజదంపతులయిన మిమ్ము్మను, నా ఆచార్యు లయిన భాష్యాచార్యులను సంతోషపెట్టిన నాజన్మ సఫలమయినదని భావిస్తున్నాను. నాకు అర్ధరాజ్యమేల? నేను ద్విజుడును", అని యామునుడు పల్కెను.

"యామునా! ఆళవందార్! నేను రాణితో పందెమున నోడితిని. నీవు వలదన్నను అర్ధరాజ్యాధిపత్యము నిన్ను జేరినది. దీనిని నేను ప్రసాదించునది కాదు. నీవు సకల వేదశాస్త్రపారంగతుడవు. ధర్మా ధర్మముల నెరిగినవాడవు. మహాతత్త్వవేత్తవు. అట్టి నీవూ రాజ్యపాలన కర్హుడవు. వేదాంత చక్రవర్తియయిన నీవు రాజ్యాధిపత్యమునకు తగినవాడవు. పరిపాలనాచరిత్ర యందిది సువర్ణాక్షరములతో లిఖింప దగిన ఘట్టము. నీధర్మ పాలనమున సర్వులు సుఖింపగలరు", అనుచు రాజు యామునునకు అర్ధరాజ్య పట్టాభిషేకమును గావింపగా, ఎల్లరును ఆనందించిరి.

రాజదంపతులు మరియును ఆళవందారునిట్లు ఆశీర్వదించిరి, "యామునా! నేననపత్యుడను - నాయనంతరము నారాజ్యభారము నా తమ్ముని కొమరునకు కట్టబెట్టవలసినదే. అతనిని నా కుమారుని వలె నేను ఆదరించుచున్నాను. నిన్ను నా జ్యేష్ఠపుత్రునిగా భావించెదను. మా వంశము వారినిగూడా నైతికమార్గమున బెట్టు భారము నీదియే. ఈ రాజ్యాధికారమునకే గాక నీవు నీ పాండిత్యమువలన ఆచంద్ర తారార్కకీర్తిని పొందగలవు", అని రాజదంపతులు మంగళాశాసనము పలికిరి.

"ఆళవందార్! ఇది మొదలు విద్వజ్జన కోలాహలుడు నీకు సామంత పండితుడుగానుండి నీకు సుంకము చెల్లించుగాక", అని ప్రభువు ఆదేశింపగా, శిరచ్ఛేదమును పొందనున్న దోషివలె కోలాహలుడు నిర్వీర్యుడై నిలువబడియుండ, యామునుడు గంభీరముగా, "వలదు రాజా! కోలాహలుడు నాకు కప్పముగట్ట నవసరము లేదు. కాని యిది మొదలు కోలాహలుడే యితర పండితుని వద్దనుండిగాని కప్పములు వసూలుజేసికొను అధికారమును రద్దు జేయుము రాజా!" అని అర్థించెను. అట్లేయగు గాక అని ప్రభువు ఆదేశింప, పండితులెల్లరు స్వాతంత్ర్యవాయువులను పీల్చిరి!

రాజాస్థానమున యామునున కేయాపద కలుగునో అని భయపడిన భాష్యాచారులు రహస్యముగా నరుగుదెంచి సభాసదులకు వెనుక నిలిచియుండెను. యామునునకు గల్గిన దైవానుకూల్యమునకు ఆనందబాష్పముల వదలుచుండెను.

"రాజా ! మొదట నేను నాగురువగు భాష్యాచార్యుని ఆశీర్వచనమును పొందిరావలయును", అని యామునుడు బయలు దేరబోగా, "నీవు పూజ్యుడవు; నీ గురువు మహాపూజ్యుడు. పల్లకిని బంపి యిచటికి యిప్పుడే పిలిపింతమ"ని రాజు పల్కెను. "ప్రభూ అది మర్యాదకాదు; నేనే నడచి వారివద్దకేగి, వారి పాదముల స్పర్శింప వలసియున్నది", అని యామునుడనెను. ఈలోపలనే సభాజనుల మధ్య నుండి భాష్యాచార్యులు వచ్చి యామునుని సమీపింప,

యామునునితో, "ఆధ్యాత్మిక సారస్వత సాగరుడు, వైష్ణవమఠాధిపతియు, మునీంద్రుడును అయిన శ్రీనాథమునులవారు వైకుంఠమును జేరిరి. మీతండ్రిగారు ఈశ్వరముని నీబాల్యముననే గతించినందున, మీ మహావంశవృక్షాంకురము మీరే! నాథమునులు ఒక అనిర్వచనీయ అగణిత నిక్షేపమును చేకూర్చిపెట్టియున్నవాడు. శ్రీరంగ పుణ్యక్షేత్రముననున్న ఆఘననిక్షేపమును వారు నాకు జూపి, దానిని పౌత్రుడవగు నీకు వారసత్వముగా చెందజేయవలయునని ఆదేశించి, వైకుంఠమును జేరెను. నీవు వెంటనే నన్ననుసరించి వచ్చి, ఆనిక్షేపమును గ్రహింపవలసినది", అని పల్కెను.

యామున మహారాజు, "నాపితామహుడు మనుమడునగు నాపై కలిగియున్న యింతటి ప్రేమవాత్సల్యములను నేను స్వయముగా మనసార వారినుండి స్వీకరించి, ఆనందింప లేకపోతినిగదా! ఏదో యిప్పటి వరకు విడివడి జీవించుచుంటిని. నావంశస్థుల దలచుకొనిన ఒక క్షణములో నా శరీరము గగుర్పాటు నందుచున్నది. మా వంశమునకు నేనొక్కడనే గదా నిలిచియున్నాను! తాతగారికి సేవ చేయలేకపోయినను, వారి నిక్షేపము మనుమడనగునన్నే చేరుచున్నదా! పెద్దలకు పిన్నల యెడగల గాఢానురాగమట్టిది! సరే - మరియొక విషయం - వెదకబోయిన తీగ కాళ్లకు తగిలినట్లయినది! ప్రస్తుతము ఒక సంఘటన యందిరుకుకొనియున్నాను. మనరాజ్యసరిహద్దుననున్న పరరాజు మా కశాంతి గల్గించుచున్నాడు. తగిన సైన్యమున్నను చాల ధనవ్యయము కూడా తప్పదు. ప్రస్తుతము బొక్కసమున తగినంత ధనము లేకున్నది. రక్షక సుంకముల ప్రజలపై విధించుటెట్లా అని ఆలోచించుచున్నవాడను. మీరు ఆపద్బాంధవుని వలె నరుగు దెంచితిరి. మా పితామహుని ధనమెచ్చట నున్నదో చూపుడు, ఆ ధనము నాకెంతయో ఉపయోగార్థమగుగాక", అని నంబితో ననెను.

పరమభాగవతోత్తముడైన మణక్కాల్‌నంబి మందహాసముతో "రాజా!, మీ పితామహుని దివ్యనిధి ఉభయకావేరి మధ్య ద్వీపమున వైకుంఠమును బోలు సప్తప్రాకార మధ్యస్థలమున శేషునిచే రక్షింప

బడుచూ, గుప్తముగానున్నది. ఆ నిక్షేపమును, నీవు చూడగలుగుటకు నీవొక మంత్రమును ఉపాసింపవలసియున్నది", అనెను.

యామునుడు ద్రవ్యాభిలాషిగా నున్నందునను, రాజకార్యముల యందే చిక్కిన మనస్సు గలవాడును అగుటచే, మణక్కాల్‌నంబి మాటల పరమార్థమును గ్రహించు తీరిక ఆలోచన వానికి లేకపోయెను. యామునుడు నిక్షేపము కొరకు సపరివారముగా బయలుదేర నేర్పాట్లుగావింప నుత్తరువుల నొసంగెను.

"రాజా! మీ పితామహుని నిక్షేపమును నీవొక్కడవే ఒంటరిగా చూడవలసియున్నది. ఇప్పుడు సపరివారముగా రానక్కరలేదు. నిన్నెవరును గుర్తింపని విధమున సామాన్యునివలె ప్రచ్ఛన్న వేషమున నన్ననుసరించి రమ్ము", అని నంబి యెరుకపరచెను.

యామునుడు ప్రధానమంత్రికి రహస్యాదేశముల నొసగి, తాను రెండు దినములలో తిరిగి వచ్చెదనని తెల్పి, రాజకార్యముపై ప్రచ్ఛన్న వేషమున బయలుదేరునట్లు తెల్పి, మణక్కాల్‌నంబిననుసరించి, పయనించి, ఉత్తరాభిముఖులై నడచి, శ్రీరంగ పుణ్యక్షేత్రము జేరిరి. శరీర కష్టములకలవాటు పడని ఆళవందారు మహారాజు నడకవలన శ్రమజెంది, "సాధుపుంగవా! కొంచెము విశ్రమించి, తదుపరి ప్రయాణమును సాగింత", మనెను.

"అట్లే చేసెదము గాక - అల్లదివో స్వామి కోవెల. దానికి ముందు భాగమున రమణీయమయిన చల్లని సలిలములతో నొప్పారు కోనేరున్నది. అందుస్నానము జేసిన శారీరక, మానసిక శ్రమలు రెండును క్షణములో అంతరించును", అని నంబి పల్కగా, యామునుడు కోనేటిలో స్నానమాచరించి, సమీపమున నున్న పొన్న వృక్షము క్రింద శయనించి, నిద్రింపదొడగెను. కొన్ని ఘడియలు సుఖముగా నిద్రించి శ్రమ బాపుకొనిన యామునుడు యిక లేచునని తలంచిన మణక్కాల్ నంబి సుప్రభాతమును పలికిన విధమున మెల్లగా శ్రావ్యముగా భగవద్గీతా శ్లోకముల పఠింప సాగెను:

1. శ్లో॥ క్లైబ్యం మాస్మగమః పార్థ నైతత్త్వయ్యుప పద్యతే ।
క్షుద్రం హృదయ దౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప ॥

2. శ్లో॥ అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత ।
అవ్యక్త నిధనాన్యేవ తత్ర కా పరిదేవనా ॥

3. శ్లో॥ యావానర్థ ఉదపానే సర్వతత్సంప్లు తోదకే ।
తావా$ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః ॥

4. శ్లో॥ దుఃఖేష్వనుద్విగ్నమనా స్సుఖేషు విగత స్స్పృహ ।
వీతరాగ భయక్రోధః స్థిత ధీర్ముని రుచ్యతే ॥

5. శ్లో॥ నకర్మణా మనారంభా న్నైష్కర్మ్యం పురుషోశ్నుతే ।
నచసన్న్యసనాదేవ సిద్ధిం సమధిగచ్ఛతి ॥

6. శ్లో॥ సక్తాః కర్మణ్యవిద్వాంసో యథా కుర్వంతి భారత ।
కుర్యా ద్విద్వాం స్తథాసక్త శ్చికీర్షుర్లోక సంగ్రహం ॥

7. శ్లో॥ తద్విద్ధిప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా
ఉపదేక్ష్యన్తి తే జ్ఞానం జ్ఞాని స్తత్త్వదర్శినః ॥

8. శ్లో॥ నాదత్తే కస్య చిత్పాపం నచైవ సుకృతం విభుః ।
అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జన్తవః ॥

9. శ్లో॥ విద్యావినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।
శునిచైవ శ్వపాకేచ పండితా స్సమదర్శినః ॥

10. శ్లో॥ ఉద్ధరే దాత్మనాత్మానం నాత్మాన మవసాదయేత్ ।
ఆత్మైవహ్యాత్మనోబన్ధు రాత్మైవరి పురాత్మనః ॥

11. శ్లో॥ సుహృన్మిత్రార్యుదా సీన మధ్య స్థద్వేష్య బంధుషు ।
సాధుష్వసి చ పాపేషు సమబుద్ధిర్వి శిష్యతే ॥

12. శ్లో॥ మత్తః పరతరం నాన్య త్కించిదస్తి ధనంజయ ।
మయి సర్వమిదం ప్రోతం సూత్రేమణిగణా ఇవ ॥

13. శ్లో॥ నమః పురస్తాదథే పృష్ఠతస్తే నమోస్తుతే ।
సర్వత ఏవ సర్వ అనంత వీర్యామిత విక్రమ స్త్వం
సర్వం సమాప్నోషితతోసి సర్వః ॥

14. శ్లో॥ మత్కర్మకృన్మత్పరమో మద్భక్తస్సంగ వర్జితః ।
నిర్వైరస్సర్వ భూతేషు యస్సమామేతి పాండవ ॥

15. శ్లో॥ శ్రేయోహిజ్ఞానమభ్యాసాత్ జ్ఞానాధ్యానం విశిష్యతే ।
ధ్యానాత్కర్మ ఫలత్యాగిస్త్యాగా చ్ఛాన్తిరనంతరమ్ ॥

16. శ్లో॥ అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవచ ।
నిర్మమో నిరహంకార స్సమ దుఃఖ సుఖః క్షమీ॥

17. శ్లో॥ సం తుష్టస్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః ।
మయ్యర్పిత మనోబుద్ధిర్యోమద్భక్తస్సమే ప్రియః ॥

18. శ్లో॥ అనపేక్షశ్శుచిర్దక్ష ఉదాసీనో గత వ్యధః ।
సర్వారంభ పరిత్యాగి యోమద్భక్తస్సమే ప్రియః ॥

19. శ్లో॥ సర్వధర్మా పరిత్యజ్య మామేకం శరణంవ్రజ ।
అహంత్వా సర్వపాపే భ్యో మోక్ష యిష్యామి మాశచః ॥

20. శ్లో॥ యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ।
తత్ర శ్రీ ర్విజయో భూతి ర్ధ్రువా నీతిర్మతి ర్మమ ॥

పాఠకుల ఉపయోగార్థము పై శ్లోకరత్నములకు భావము క్రింద వ్రాయబడినది. అష్టాదశాధ్యాయముల సారాంశముగా ఒక్కొక్క అధ్యాయము నుండి అతిప్రాముఖ్యమయిన శ్లోకము నేరి వ్రాయడ మయినది. ఈయిరువది శ్లోకముల భావము వాస్తవముగా గీతావృక్షపు చేవ. "ద్విదశ శ్లోక గీతా'. అనియూ ఈ సంపుటినన వచ్చును. గీతలో ప్రతియొక్క శ్లోకము చరమశ్లోకము కానేరదు. అర్జునుడడిగిన ప్రశ్నలా లేక శ్రీకృష్ణుడునుడివిన సమాధానములా మనము గమనింప వలిసినది? మరియు "వారు, వీరు అయా విధములుగా భావించినారు; నేను చెప్పునదిది", అని పర్యవసానము శ్రీకృష్ణుడు ప్రతి అధ్యాయమున

సూచిస్తాడు. గావున గీతాసారము అనునది శ్రీకృష్ణుడు భావించిన విధానమే అవుతుంది. ఈ అంశములను పాటించుచు ఈ ద్విదశ శ్లోకసంపుటి తయారైనది. ఇక భావమును గమనింపుడు:

1. నీవు పిరికి తనమునకు ఎర గావలదు. పిరికితనము తగినదికాదు. అతినీచమయిన యీ మనోదౌర్బల్యమును వదలి, కార్యార్థివై లెమ్ము.

2. సకల భూతములును ఏదేని యొక అగోచర పదార్థము నుండి పుట్టి, నడుమ యిట్లు కనుపించుచున్నది. తుదకాయగోచర పదార్థమునందే అవియన్నియు లయించును. కావున అందులకు శోకమెందులకు?

3. వెల్లివిరియుచున్న జలసమృద్ధిగల బావియందు విజ్ఞానశాలికి ఎంత అవసరమో (ఒకటి రెండు బిందెల నీరేగదా స్నానమున కవసరము?) అట్లే వివేకియయిన వానికి సకలవేదము లందును అంతయే అవసరముండును. (వేదములోని ప్రతి ముక్క జ్ఞానసారమని యనుట తగదు - రాళ్లనుండి రత్నము నేరు విధమున వివేకవంతుడు సారమును గ్రహించును).

4. దుఃఖములు సంభవించినపుడు కటకట బడనివాడును, సుఖములు ప్రాప్తించినపుడు ఉబ్బితబ్బిబ్బులు కానివాడును, ప్రేమ భయము కోపము అనువానికి లోపడనివాడును అగు పురుషుడు స్థితప్రజ్ఞు డనబడును.

5. పురుషుడు కర్మముల నారంభింపనంతమాత్రమున సన్న్యాసి యనబడడు. సన్న్యసించి నంతమాత్రముననే సిద్ధిబొందినట్లు కాదు.

6. పండితులుగాని సామాన్య ప్రజలు స్వలాభము కొరకే కర్మల జేయుదురు. పండితుడైనవాడు లోకక్షేమమును గోరి కర్మల జేయును.

7. తత్త్వవేత్తలయిన జ్ఞానులు భక్తియుక్తమయిన నమస్కారము చేతను, సముచితమయిన ప్రశ్నముచేతను, తగు శుశ్రూషచేతను నీకు జ్ఞానము నుపదేసింతురు.

8. ఈశ్వరుడు ఒకని పాపమునుగాని, పుణ్యమునుగాని, తీసికొనడు. అజ్ఞానమున లోకులు భ్రమపడుచున్నారు.

9. నిజమైన పండితుడయినవాడు విద్య వినయము గల బ్రహ్మజ్ఞాని యందును, గోవునందును, ఏనుగునందును, కుక్కయందును, కుక్క మాంసమును తినుచండాలునందును సమభావము కలిగియుండును.

10. ఆత్మను ఆత్మచే నుద్ధరించు కొనవలయును (తన్ను తానే ఉద్ధరించుకొనవలయును). ఆత్మను అణగద్రొక్కరాదు (దాని అభివృద్ధికి సంపూర్ణావకాశములు కలుగజేయవలయును). ఆత్మకు ఆత్మయే చుట్టము. ఆత్మకు ఆత్మయే శత్రువు. (తనకుతానే శత్రువు, మిత్రుడును అగుచున్నాడు).

11. తనయెడ సద్భావము గలవారు, తనకుపకరించువారు, అపకారులు, తటస్థులు, మధ్యస్థులు, ద్వేషింపదగువారు, బంధువులు, సజ్జనులు, దుర్జనులు - అను భేదములేక అందరియందును సమచిత్తుడైయుండువాడు శ్రేష్ఠుడు. (9వ శ్లోకభావమే కొంత విపులముగా చెప్పబడినది. - నడవడికలో యిది సర్వమతసారము).

12. నాకంటె అతీతమయినదెద్ధియులేదు. దారమునందు మణిగణము వలె నాయందు ఈ జగత్తంతయు కూర్చబడి యున్నది. (ఇచట నేను అనునది ఈశ్వరశక్తి; సర్వాంతర్యామి యగు ఈశ్వరశక్తితో నిండిన శూన్యము, లేక ఆకాశము).

13. నీయెదుట నమస్కారము, నీవెనుక వైపున నమస్కారము; ఓ సర్వాత్మకా! నీకన్ని వైపులను నమస్కారము. అనంత బల

సంపన్నుడవై అమితవిక్రమ శాలివైయున్నావు. నీవు సర్వము నందును వ్యాపించిన వాడవు. కావున సర్వనామకుడవు. (నీవు అనునది సర్వాంతర్యామియగు ఈశ్వరశక్తి. సారస్వత అలంకారయుక్తముగా పుంలింగమున చెప్పబడినది - ఇచ్చట దేవాలయ కట్టడములకు, విగ్రహములకు యెంత వరకు ప్రాముఖ్యమివ్వ బడినదో గుర్తింపతగియున్నది).

14. కేవలము నా నిమిత్తమే కర్మలు చేయువాడను, నేనే పరమ దైవముగా తలచువాడును, నాకు భక్తుడును, సంగవర్జితుడును, సకల భూతముల యందును వైరములేనివాడునునై యెవ్వడుండునో వాడు తప్పక నన్నుజేరును. (నేను అనునది సర్వాంతర్యామియగు ఈశ్వరశక్తి - విశ్వభావమున స్వార్థ రాహిత్యము చెప్పబడినది - తాను విశ్వభావము కలిగి యుండుటయే ఈశ్వరశక్తిని జేరుననుట - ఇది విజ్ఞాన శాస్త్రోక్తము; మానస శాస్త్ర విషయము)

15. అభ్యాసముకంటె జ్ఞానము శ్రేష్ఠమయినది (విషయ జ్ఞానము లేక మూఢముగా కార్యాచరణ నిష్ప్రయోజనము)జ్ఞానము కంటె ధ్యానము శ్రేష్ఠము. (తాను ఆర్జించిన విషయ జ్ఞానము యొక్క ఆది మధ్యాంతములను గూర్చి ఆలోచింపవలయును. అప్పుడే సత్యము తెలుస్తుంది). ధ్యానమునకంటె కర్మ ఫలత్యాగము శ్రేష్ఠము. (స్వార్థరాహిత్య భావమునకు అతి ప్రాముఖ్యత యివ్వబడినది). త్యాగమువలన తనకును, సర్వులకును శాంతి కలుగును.

16. సకల భూతములయందును ద్వేషము లేక, వానియెడ మైత్రియు, కారుణ్యమును గలవాడవై, మమకారహంకారములను వదలి సుఖదుఃఖముల యందు సమచిత్తుడవై, క్షమాశీలుడవై యుండుము; అట్టి నీవునాకు భక్తుడవనతగుదువు; అట్టి నీవు నాకు ప్రియుడవు (స్వార్థరాహిత్య భావముగలవాని నడవడిక

వర్ణింపబడినది - అట్టివాడు నాకు ప్రియుడు అనగా సర్వులకు ప్రియుడు అని భావము; నేను అనబడునది యిచట సర్వాంతర్యామియగు వైష్ణవశక్తి కాబట్టి).

17. నిత్య సంతుష్టుడును, నియతాత్మకుడును, దృఢ నిశ్చయుండును, మనోబుద్ధుల నాయందర్పించిన వాడు నాకు భక్తుడు. నాకు ప్రియుడు. (స్వార్థరాహిత్యుని గుణవిశేషములే చెప్పబడినది. అట్టివాడు సర్వమును ప్రేమించునుగాన, సర్వము తన్ను ప్రేమించును. నేను అనునదిచట సర్వాంతర్యామియగు ఈశ్వరశక్తి.

18. ఫలాపేక్షలేని వాడను, చిత్తశుద్ధి కలవాడను; సమర్థుడును, ఉదాసీనుడును, దుఃఖరహితుడును, సకలారంభములను పరిత్యజించిన వాడును అగు నాభక్తుడు నాకు ప్రియుడు. (17వ శ్లోక భావమును గమనించిన విధమున దీనిని గమనింప వలయును).

19. సకల ధర్మములను వదలి నన్నొక్కనిచే శరణుజెందుము. నేనే నిన్ను సకల పాపముల నుండి విముక్తుని జేయుదును. శోకింపకుము. (ఇదియే గీతాచరమ శ్లోకము - తిరుమంత్రార్థ శ్లోకము - అన్ని ధర్మములకంటే శ్రేష్ఠమయిన ధర్మము శరణాగతి భావము; శరణాగతి భావమనగా స్వార్థరాహిత్య భావము. అట్టి భావము గలవాడు పాపము చేయుట అనునదియే సంభవింపదు. అట్టివానికి విచారమే లేదు. ఇది విశిష్టాద్వైత సిద్ధాంత తిరుమంత్రము. ఈ శ్లోకార్థమే "ఓం నమో నారాయణాయ" అను అష్టాక్షరీ మంత్రమును యిమిడియున్నది. అదియే "ఓం" అను ఏకాక్షరీ మంత్రమయిన ప్రణవమున యిమిడియున్నది).

20. యోగీశ్వరుడయిన శ్రీకృష్ణుడెచ్చట నుండునో, ధనుర్ధారియయిన అర్జునుడెచ్చట నుండునో, అచ్చట లక్ష్మియు, విజయమును,

ఐశ్వర్యమును, నీతియు ఉండునని నా దృఢ అభిప్రాయము. (కృష్ణుడు విజ్ఞానవంతుడయిన ఆచార్యునకు సాంకేతికము; అర్జునుడు, ధనుర్ధారియయిన అర్జునుడు - ఆచార్యుని సలహాలను పాటించి కార్యాచరణకు సంసిద్ధుడగు శిష్యునకు సాంకేతికము. ఇట్టి సంయోగమున సంఘమునకు, ప్రపంచము నకు సర్వశుభములచే కూడును - ఇది లేనియెడల సర్వ అనర్థములు వాటిల్లుచుండునని వేరుగా చెప్పనవసరము లేదు).

(ఆదిలో చెప్పిన విధమున అష్టాదశాధ్యాయములు అను దినము వల్లించుచూ యీ యిరువది శ్లోకార్థములు గమనింపకున్న గీతా పఠనము నిష్ప్రయోజనము. గీతార్థమును గమనించి దానిని కార్యాచరణలో పెట్టకున్న గీతాజ్ఞానము నిష్ప్రయోజనము. చరమ శ్లోకము సర్వార్థ ప్రదము. అందువలన అది తిరుమంత్రము. తిరుమంత్రము జపము కొరకుగాదు. ఆయర్థమును జీవితమున కార్యార్థముల పాటింప వలయును. స్వార్థరహితముగా కార్యముల జేయుట)

మణక్కాల్‌నంబి అట్లు గీతాశ్లోకముల గానము చేయుచుండెను. కొంత మెలకువలో సమీపమున ఆళవందార్ శయనించి యున్నాడు.

అప్పటికి ఆళవందారుకు వయస్సు ముప్పదియారు వసంతములు. పదునారేడుల నూగుమీసముల లేబ్రాయంబున ఆచార్యుడనబడి, ఆధ్యాత్మిక చక్రవర్తియై పాండ్యరాజ్య సార్వభౌమత్వమును పొంది, యిరువది సంవత్సరముల ధర్మపరిపాలన గావించి యున్నాడు. రాజర్షివలె - పిన్న వయస్సుననున్న జనక మహారాజువలె శోభిల్లుచున్నవాడు యామునచక్రవర్తి. బాల్యము నుండియు పఠించి, మననము జేసికొని, రాజ్యాభిషిక్తుడయిన యీ యిరువదివత్సర కాలమున మరచియుండిరి, యిపుడు గీతాశ్లోకములు కర్ణరంధ్రముల ప్రవేశించగనే, కోల్పోయిన పెన్నిధిని మరలా కనుగొనిన పిసినారి బడయు అగణిత ఆనందమును బోలు పరమానందమున

యామునుడు తాను బంధవిముక్తుడైనట్లు దలంచెను. తటాలున ఉత్తిష్ఠుడై, నంబికి సాష్టాంగ నమస్కారంబాచరించి, "మహాత్మా! మహానుభావా! నేనెంతటి అదృష్టహీనుడను! భాష్యాచార్యునొద్ది బ్రహ్మజ్ఞానోపదేశమును పొంది, ఆధ్యాత్మిక సామ్రాజ్యమును పొందవలసిననేను, చపలుడనై, రాజాస్థానమునకు తర్కవాదముల జేయనేగి, రాజ్యాభిషిక్తుడనై, రాజ్యభోగముల బడి, సత్యమార్గమునకు దూరుడనయితిని. పురుషార్థములలో శ్రేష్ఠమయినది మోక్షమను విషయమును మరిచి, అర్థకామాదులయందు పడి, మాలిన్యుడనైతినే! నాతండ్రి యొక్కయు నా పితామహుని యొక్కయు మార్గముల విస్మరించితిని! రాజ్యభోగములు జ్ఞానిని గూడా అంధునిగా జేయనోపు! మకరముచే ఈడ్చబడిన గజేంద్రుని విష్ణుమూర్తి ఉద్ధరించినట్లు, మాలిన్య కూపమున బడియున్న నన్ను తమరి గీతాశ్లోక పఠనమాధుర్యామృతము అభిషిక్తుని జేసినది. గట్టును జేరితిని! ఇక మాలిన్యపుమడుగు దూరమయినది. కాని నాకు గమ్యస్థానమేదో తెలియుటలేదు. నన్ను కరుణింపుము, నాకు మార్గమును జూపుము.

శ్లో॥ సర్వోపనిషదో గావో దోగ్ధాగోపాలనందనః ।
పార్థో వత్సస్సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥

అని చెప్పబడి యున్నదిగదా! ఆయమృతమును నాకొసగుడు, నన్ను తరింపజేయుడు", అని గద్గద స్వరమున ప్రార్థించెను.

"నాయౌవన దశయందు, గతించిన తండ్రికి, పితామహునకు అజ్ఞానమున అపచారము గావించినవాడనైతినిగదా ! వారి దివ్యమార్గముల ననుసరించి, వారి ధ్యేయముల స్వీకరించి, వారి సత్యజ్ఞానమును ప్రచారముజేసి, కృతకృత్యుడనయ్యెదను, మహాత్మా! మాబోటివారల కరుణచే, పితామహుడు సేకరించిన సారస్వత సౌరభముచే, ఆధ్యాత్మిక సత్యము నన్వేషించి, దానినిబడసి, విశ్వజనానీకమునకు పంచిపెట్టెదగాక! నాకు మార్గమును జూపుము! స్వామీ!" అని నంబిని ప్రార్థించెను.

పరమానందభరితుడైనట్టియు కృతకృత్యుడనయితినను భావమున నుప్పొంగునట్టియు మణక్కాల్‌నంబి, "యామునా! గీతా రహస్యమును, అధ్యాత్మికసారమును నీకు దెల్పెదను. అది నా కర్తవ్యమై కూడాయున్నది. మరియునది మా యాచార్యులను, మీపితామహుడు నాథమునులవారును గావించిన ఆదేశము. నీవు కలవర పడకుము. శాంతింపుము. నిశ్చలమనస్కుడవుకమ్ము... ఒకమాట - నీరాజ్యభార విషయమెట్లు? యెంచితివా?" అని మహాత్ముడయిన మణక్కాల్‌నంబి సూక్ష్మముగా, సూటిగా ననెను, ఇది యొక హెచ్చరిక.

"మహాత్మా! వెలుగున బడ్డవాడు మరలా చీకటిని జేరనిచ్చ గించునా? మురికికూపమున బడియున్ననేను మీ కృపాకటాక్షమున దరిజేరితిని. మరలా నేను వెనుకబడను. నాపూర్వాశ్రమమును గూర్చి, రాజరికమును గూర్చి యేల నాకు జ్ఞప్తికి దెచ్చెదరు? మసిబొగ్గును పొంది, మాణిక్యమును జారవిడచితిని", అని యామునుడు అశ్రుతప్త లోచనుడయ్యెను. ఆలోచనా సముద్రమున మునిగియున్నాడు!

"స్వామీ! నీ హెచ్చరికను గూడా త్రోసిపుచ్చను. తెలిసియో తెలియకచో రాజ్యభారమును వహించి యుంటిని. దానిని అజ్ఞాతముగా దొంగలకు త్రోయడము కూడా విధ్యుక్తధర్మమునకు భంగమేయగును. సన్న్యాసము స్వీకరింపదలచినవాడు అంతకు ముందు తనకున్న బంధముల ఉచిత మార్గముల సవరించి, తాను బంధవిముక్తుడు కావలయును. బాధ్యతారహితుడు కారాదు. ఉన్న బాధ్యతను నక్రమముగా అన్యాక్రాంతము చేయవలయును. ఇంతవరకు నాచే పరిపాలింపబడిన రాజ్యమును, ప్రజలను గాలికి వదలను. తగినయేర్పాట్లే చేసెదను గాక! ఒక్క దినములో ఇచ్చట నుండియే ఆకార్యమును చేయగలను. సర్వజ్ఞానమును మానవసేవకు కడకు అంకితము కావలయునుకదా! అట్టిదే నిజమైన జ్ఞానము. అదియే విశ్వమానవ సోదరత్వము. అదియే స్వార్థరాహిత్య ఫలము. అదియే వైష్ణవ భావమని తలచెదను. అదియెంతపని! ప్రస్తుతము

నాకు మంత్రిగా నున్నవాడు పాండ్యరాజ వంశస్థుడు. నేను లేకున్న సహజముగా నాతడే రాజ్యమునకు వారసుడయ్యెడివాడు - పాండ్యరాజు అనపత్యుడగుటచే మరియు నాయొక్క సైన్యాధిపతియు రాజబంధువే, అతి నీతికోవిదుడు. నేను రేపటి దినమే వారిరువుర నిచటికి రప్పించి, మంత్రిని రాజుగాను, సైన్యాధిపతిని మంత్రిగాను నియమించుచూ నాశాసనమును బంపుదును. వారినట్లు ఆమోదింప వలసినదని ప్రజలకు, అధికారులకు, సామంతులకు నాయాదేశములు వారిరువురి ద్వారా పంపగలను. ఇది నాదృఢనిశ్చయము", అని యామునుడు తెల్పెను.

అది వినిన మణక్కాల్‌నంబి, "యామునా! నీ నిశ్చయము, నీ కార్యక్రమము, నీవితరణగుణము అత్యుత్తములుగా నున్నవి. అట్లే జరుగుగాక!" అని మంగళాశాసనము బల్కెను. యామునుని యొక్క నిశితవిమర్శనా జ్ఞానమునకును, అతిని క్రమశిక్షణా పద్ధతికిని, మణక్కాల్‌నంబి లోలోన ఎంతయో ముగ్ధుడాయెను. తన ఆచార్యుడు శ్రీనాథమునుల ఈప్సితార్థమును నెరవేర్చగలవాడు యామునుడని విశ్వసించెను.

"యామున సార్వభౌమా! మట్టిని బట్టుకొని మాణిక్యమును వదలితినని వాపోవుచున్నావు గదా! రమ్ము, ఆ మాణిక్యము నీకై యెదురు చూచుచున్నది. నన్ననుసరించి నడువుము", అనుచూ నంబి యామునునకు వినిపించెను. క్రమక్రమముగా నడచుచూ, కావేరి పుణ్య తీర్థమును జేరిరి.

ఇరువురును తిరుకావేరీ పుణ్యజలముల నభిషిక్తులై, శ్రీరంగ ద్వీపక్షేత్రమును జేరిరి. దేవాలయ ప్రథమ ప్రాకారమును దాటిరి. పురాణములో వర్ణింపబడిన దివ్యవైకుంఠమును బోలు రమణీయ శ్రీరంగపురమును దర్శించుచూ (స్వామి దేవాలయ సప్తప్రాకారముల లోనిదేగదా శ్రీరంగము) ఆనందించుచూ, యామునుడు నడచు చుండెను. తిరుమంగైయాళ్వారు నిర్మింపజేసిన సప్తప్రాకారములను

గాలిగోపుర ముఖద్వారముల గుండా దాటి, గర్భగుడిని ప్రవేశించిరి. మణక్కాల్ నంబి గర్భగుడిని అలంకరించియున్న అర్చావతారము, అనంతశయనుడు, శేషశాయియయిన శ్రీరంగనాథుని జూపుచూ, "యామునా! వత్సా! ఆధ్యాత్మిక సత్యసామ్రాజ్య వారసుడా! తిలకింపుము. నీనయన కమలములను విశాలముగావించుము. అదిగో! మీపితామహుడు నీకొరకు దాచియుంచిన నిక్షేపము! అల్లదిగో ఆదిశేషుడు; సహస్రాక్షుడు; నిక్షేపమును నిరంతరము రెప్పవాల్పక పదిల పరచుచున్నాడు. తిలకింపుము - అదిగో శ్రీమహాలక్ష్మి, సర్వసంపదలకు తావు! స్వామి పాదాంబుజ ద్వయమును సేవించు చున్నది. ఆమెయే ఆండాళ్. స్వామి నాభికములమున ప్రకాశించు చతుర్ముఖుడు. విశ్వకర్మ. "విశ్వచిద్రూపిస్వామి" తిలకింపుము. అనిర్వచనీయ, శాశ్వత, నిక్షేపమును స్వీకరింపుము - సేవింపుము", అని నంబి వర్ణించుచుండగా, ప్రపత్త్యుడయిన యామునుడు "విశ్వప్రతి రూపమయిన" రంగనాథుని తన నేత్రద్వయకమలములతో సేవించుచూ, మనోనేత్రమున చెరగని ముద్రను ముద్రింపించు కొనుచూ అట్లనే నిలువబడియుండెను.

"యామునా! విశ్వజ్ఞానార్జనుడవయిన నీవు ఇక అష్టాక్షరీ మంత్రమును అర్థయుక్తముగా జపింపుము - "ఓం నమో నారాయణాయ" అను అష్టాక్షరిని మణిక్కాల్‌నంబి వచింపగా, యామునుని ఆవరించియున్న మాయామేఘము విచ్ఛిన్నమైపోయినది. అష్టాక్షరీ మంత్రము యొక్క "అర్థజ్ఞాన" మహిమఅట్టిది. "నారాయణాయ", అను శబ్దము సూచించు విశ్వార్థమును రంగనాథ విగ్రహమున యామునుడు చూడగలిగెను.

"మదీయ ఆచార్యపౌత్రా! యామునా! మీ పితామహుడును, ప్రథమ వైష్ణవాచార్యుడును అయిన శ్రీనాథమునులు స్థాపించిన వైష్ణవ సామ్రాజ్యమునకు నిన్ను పట్టాభిషిక్తుని గావించి, నా ఆచార్యాజ్ఞను నెరవేర్చగలిగితిని. ధన్యుడను! ఇక నీవీ సామ్రాజ్యమును విస్తరింపజేసి, బలపరచి, ఏకచ్ఛత్రాధిపతివి గమ్ము. నీకీర్తి సంపద, నీసేవాఫలితము

ఆచంద్రార్కముగా భక్తులచే నుతింపబడునుగాక!" అని మణక్కాల్‌నంబి మంగళాశాసనము గావించెను.

ఈ విధమున నాథమునుల యొక్కయు, యామునాచార్యుల యొక్కయు వృత్తాంతములను శ్రీశైలపూర్ణుడు యువకుడయిన రామానుజునకు తెల్పుచుండెను.... "యామునాచార్యుడు సన్నసించి, శ్రీరంగమున వైష్ణవమఠాధిపతియై, శిష్యకోటికి, జ్ఞానసత్యమార్గమును బోధించుచున్నారు. వారి శిష్యకోటిలో నేనొకడను", అని శ్రీశైలపూర్ణుడు చెప్పుచూ సగర్వమునందెను . రామానుజుని తలిదండ్రులును యామునాచార్యుని అద్భుత జీవిత విశేషాంశములను విని ముగ్ధులయిరి.

"రామానుజా!, యామునాచార్యుని మేధ వర్ణనాతీతము. అతడు తన పితామహుడు సేకరించినట్టియు, తనపితామహుడు రచించి నట్టియు, గ్రంథములనెల్లను పఠించి, అవగాహనము జేసికొనెను. ఆళ్వార్ల రచనలను, నమ్మాళ్వార్ల ద్రావిడ ప్రబంధమును, సంస్కృత తమిళభాషలలో వెలసిన ఆధ్యాత్మిక జ్ఞానమునంతటిని వశపరచు కొనెను. మరియు గీతార్థమును నిశితముగా పరిశోధనను ఇంకను గావించుచునే యున్నాడు. ఈ పరిశోధనా కార్యకలాపములే వారికి అన్నపానాదులు. అద్వైత మతమనబడు దానియందు తెల్పబడిన మాయావాదమునుండి, పరస్పర విరోధ భావాంధకారము నుండి చేతనులను తొలగింప వలయునని యామునాచార్యుల వారి ధ్యేయము.

యామునాచార్యులు గావించిన ఆధ్యాత్మిక పరిశోధనలేగాక, వారు స్తోత్రత్రయమును, సిద్ధిత్రయమును, ఆగమ ప్రామాణ్యమును, పాంచరాత్రాగమమును, గీతార్థ సంగ్రహమును రచించియున్నారు. ఈ పరిశోధనలు, ఈ రచనలు, లోకశ్రేయస్సు కొరకే. ఇట్టి లోకక్షేమకర గ్రంథముల నింకను కొన్నిటిని రచింపవలయునని వారి సంకల్పము. కాని ఆ భక్తశిఖామణి వార్ధక్యమును సమీపించు చున్నారు!", అని

శ్రీశైలపూర్ణుడు రామానుజునకు విశదపరచుచున్న ఆళవందారు చరిత్రమును అప్పటికి ముగించెను.

పరమానంద భరితుడయిన యువకుడు రామానుజుడు తదేక ధ్యానమున యామునాచార్యులవారి ఘనతను స్మరించుచూ, కొంతకాలము ఆ దివ్య అనుభూతి యందుండెను.

శ్రీనాథముని, శ్రీయామునాచార్యుల యొక్కయు, ఆళ్వారుల యొక్కయు దివ్య చరిత్ర వైభవములు రామానుజుని మనోఫలకమున చెరగని ముద్రను వేసినవి.

శ్రీయామునాచార్యులు పితామహుడు స్థాపించిన వైష్ణవ మతమునకు వైష్ణవ విశిష్టాద్వైత మతమను తిరునామము నుంచెను. విశిష్టాద్వైత సిద్ధాంతమును ప్రతిపాదించిన యామునాచార్యుని దివ్యజ్ఞానము రామానుజునకు బాల్యముననే లెస్సగా నచ్చినది.

# 12. కాంచీపురవాసము - యాదవప్రకాశునొద్ద విద్యాభ్యాసము

రామానుజునకు పదునారేండ్లు నిండినవి. మిక్కిలి చురుకుగా విద్యాభ్యాసము గావించుచుండెను. అతడు ఏక సంధాగ్రాహి. తలిదండ్రులకు ఎంతో పుత్రోత్సాహమును గలిగించిన యువకుడు రామానుజుడు. శ్రీపెరుంబూదూరులో వెలసియున్న చెన్నకేశవస్వామి ఆలయమునకు అనుకొనియున్న తులసీవనమునకు నీరుపోసి పూలమొక్కలను పెంచుచు, తులసిని, ఇతర పరిమళభరిత పుష్పరాజముల దెచ్చి స్వామికైంకర్యమున కిచ్చువాడు. ఈ కార్యక్రమము నెంతో శ్రద్ధాభక్తులతో తండ్రి కేశవాచార్యుడు చాలకాలము నుండి చేయువాడు. తండ్రి ఆదేశానుసారము తండ్రికి సహకరించుచూ, రామానుజుడు భక్తితో ఈ స్వామికైంకర్యము నొనరించు చుండెడివాడు.

రామానుజునకు పదునారవయేటనే వివాహము జరిగినది. చాల సన్నిహిత సంబంధమునుండి రక్షకాంబయను బాలికను రామానుజుని తలిదండ్రులు ఎంపికజేసి, రామానుజునకు వివాహముగావించిరి. ఈ కన్యను తంజమ్మ అనికూడ పిలుతురు.

రామానుజునకు వివాహమయిన మరుమాసమున కేశవా చార్యుడు అకస్మాత్తుగా జబ్బుచేసి, అకాలమరణము నొందెను. దుఃఖమును భరింపజాలక, కాంతిమతి మూర్ఛిల్లెను. రామానుజుడు ధైర్యమును వహించి, తల్లి నొదార్చెను. సంసార బాధ్యతను స్వీకరించెను. బాల్యదశలో ఇట్టి యిక్కట్టులలో రామానుజుడు వహించిన ధైర్య శాంతి గుణములకు, ఆతని నడవడికకు బంధువు లెల్లరు ఆశ్చర్యపడిరి. ఈ విషయము నిదివరలో తెలిసికొని యున్నాము.

వైధవ్యమునబడిన కాంతిమతి స్వగ్రామమున నుండ ఇష్టపడలేదు. కుమారుని విద్యాభ్యాసమునకు సంసారమును కాంచీపురికి తరలించుట యుక్తమని కాంతిమతి తలచెను. రామానుజు

డాలోచించి, తల్లి నిర్ణయముచితమయినదని గ్రహించి, సంసారమును కంచికి తరలింపజేసెను.

కాంచీపురియందు దేశవిఖ్యాతుడగు ఆధ్యాత్మికాచార్యుడు యాదవప్రకాశుడు, శిష్యకోటికి ఆధ్యాత్మిక విద్యను గరపుచుండెను. రామానుజుడు యాదవప్రకాశుని శిష్యుడాయెను. యాదవప్రకాశుడు అద్వైత వేదాంతనిధియేగాక, గొప్ప పండితుడు, తర్కవేత్తయు కూడ. రామానుజుడప్పటికే వేదశాస్త్రములయందు దిట్టయయినను, విద్యకు అంతము లేదనుభావమున యాదవప్రకాశునకు శిష్యుడాయెను. గోవు అతి త్వరగా కడుపునిండుగా ముందున్న పచ్చిగడ్డిని తినును; తరువాత విశ్రాంతిగా నొకదగ్గరపరుండి నెమరు వేయుచుండును. అట్లే విద్యాభ్యాసమున పఠించిన విషయమును అతిసావధానముగా ధ్యానించి, సత్యమును గమనింపవలసి యుండును. అట్టివాడే నిజమైన పండితుడు.

రామానుజుని పినతల్లి కుమారుడు గోవిందుడు కూడా విద్యాభ్యాసమునకై కాంచీపురమునకేతెంచి, రామానుజుని కలిసి, యాదవప్రకాశుని శిష్యగణమును చేరెను.

ప్రథమమున రామానుజుని భక్తిప్రపత్తులకు, తెలివితేటలకు యాదవప్రకాశుడు సంతృప్తిపడి, రామానుజుని వాత్సల్యముతో జూచెడివాడు యాదవప్రకాశుడు. రామానుజునకు నీడవలె వ్యవహరించువాడు సోదరుడు గోవిందుడు.

యాదవప్రకాశుడు శ్రీశంకరాచార్యులు బోధించిన అద్వైత మతమున సంపూర్ణముగా విశ్వసించి స్వీకరించినవాడు. ఆ సిద్ధాంతము "బ్రహ్మసత్యం, జగన్మిథ్యా, - జీవో బ్రహ్మైవ నాపరః" అని తెల్పుచున్న "తత్త్వమసి" అను బ్రహ్మసూత్రము నాధారముగా జేసికొనియున్నది. "అహంబ్రహ్మాస్మి" (నేను బ్రహ్మను) అని బోధించుచున్నది. ఈ సూత్రము అప్పట్లో ముఖ్యముగా పండితజనులలో ఎక్కువ ప్రచారములో నుండినది.

రామానుజున కీసిద్ధాంత విషయములు పరిచయములే. కాని అతడు దీనిని పూర్తిగా విశ్వసించువాడుకాదు. అయినను తన భావములను గుప్తముగా నుంచుకొనువాడు. మొదట సర్వశాస్త్ర జ్ఞానమవసరము; తరువాతనే వ్యక్తిగత పరిశీలనము, పరిశోధనలు రాణింపగలవు. రామానుజ విద్యాభ్యాసము పరిశోధనా సహిత మయినది. అతడు దేనినేని మూఢముగా విశ్వసింపడు

ఒకనాడు యాదవప్రకాశుడు శిష్యులకు ఆధ్యాత్మిక జ్ఞానబోధనను జేయు సందర్భమున తైత్తిరీయోపనిషత్తునగల ఒక విషయమగు "సత్యం, జ్ఞానం, అనంతం, బ్రహ్మ' అనుదానికి వ్యాఖ్యనొసంగుచూ, "ఇవియన్నియు ఒకటే - సత్యమే బ్రహ్మ, జ్ఞానమే బ్రహ్మ, బ్రహ్మ అనంతము - ఇదియన్నియు ఒక్కటే" - అని వివరించెను.

నిశిత విమర్శనా జ్ఞానయుతుడు రామానుజుడు - "ఇవియన్నియు ఒకటిగాదు; సత్యం, జ్ఞానం, అనంతం, అనునవి పరబ్రహ్మ లక్షణములు - పుష్పమున వివిధ వర్ణములు, పరిమళములు ఉన్నట్లు - అనంత కల్యాణ గుణములతో నొప్పారు పరబ్రహ్మ", అని రామానుజుడు వివరించెను. ఇదివిన్న యాదవప్రకాశుడు ఉగ్రుడాయెను. తాను జెప్పినది కాదనగలిగిన పండితుడప్పటికి లేడు. అట్టి పరిస్థితిలో శిష్యుడుగానున్న రామానుజుడు తానొసంగిన వివరణమును త్రోసిపుచ్చి, ఆతడు వేరొండు వ్యాఖ్యను తెల్పుటను యాదవప్రకాశుడు సహింప లేకపోయెను. తనకు శిరసావహించి ప్రవర్తింపనిచో తన శిష్యవర్గమును వదలిపోవచ్చునని రామానుజునకు యాదవప్రకాశుడు సూచించెను. గురువులవారి తత్త్వము నెరిగిన రామానుజుడు మిన్నకుండెను - శాంతే కలహో నాస్తి - విద్యాభ్యాసమే అతని ధ్యేయము - తాను స్వాతంత్ర్యముగా విమర్శింపగల సమయము భవిష్యత్తులో నున్నదని అతడు గమనించెను.

ఒకనాడు ఛాందోగ్యోపనిషత్తులో కొన్ని విషయములను శిష్యులకు యాదవప్రకాశుడు బోధించుచుండెను. "తస్య యథా కప్యాసం పుండరీక మేవ మక్షిణీ" - అను విషయము.

"కపి" అనగా కోతి - "కప్యాసం" అనగా కోతిపిఱ్ఱి - పురుషోత్తముని నయనములు కోతిపిఱ్ఱిలవలె, ఎఱ్ఱగా నున్న తామరరేకులవలె నున్నవి" - అని యాదవ ప్రకాశుండు వివరించెను.

గురువుగారిచ్చిన వ్యాఖ్యను విని రామానుజుడు దిగ్భ్రమ జెందెను. తనమనస్సునకు ముల్లు గ్రుచ్చుకొనినట్లయినది. మనఃక్లేశము భరింప రానిదయ్యెను. కన్నీరు ధారగా పడుచుండెను. యాదవప్రకాశుడు ఇదిగని, "రామానుజా! ఏల కంటి నీరుపెట్టుచున్నావు" అని విచారించెను.

"స్వామీ! క్షమింపుడు. మహా పండితులరగు తమ నోటినుండియా, ఇట్టి విపరీతపు మాటలు వెడలుట? భగవంతుని నయనారవిందముల సౌందర్యమును వర్ణించుటకు ఇట్టి నీచపు ఉపమానమా? మీరిచ్చిన వివరణము సత్యదూరమేగాక, విపరీతముగాను, నీచముగాను హీనముగాను ఉన్నది", అని రామానుజుడు కంటితడితో బల్కెను.

రామానుజుని వచనముల కాశ్చర్య ఆగ్రహములు బొందిన యాదవప్రకాశుడు, "దీనికా, యేదో పోగొట్టుకొన్నవానివలె యేడ్చు చున్నావు. వెర్రివాడవు! నీవెర్రిభక్తి నట్లుంచుము! విను, అసలు పరబ్రహ్మ నిరాకారుడుగాన బ్రహ్మమునకు కన్నులెక్కడివి? లేనట్టి కన్నులను వర్ణించుటకు ఏ ఉపమానమైతేనేమి?" అని హేళనగా, తన తర్కశాస్త్ర కౌశలమున చమత్కరించెను.

రామానుజుడు ఊరటజెందలేకపోయెను. కంపిత హృదయమున కన్నీరురాల్చుచునే యుండెను. "ఆర్యా! కప్యాసం - అను పదమునకు వేరొక అర్థముండి తీరవలయును. ఆలోచింపుడు!" అనెను.

యాదవప్రకాశుడు కోపోద్రేకమున ఇట్లు గర్జించెను - "అట్లగు నేని, నాకు తెలియని యా అర్థమేమిటో నీవే తెల్పుము. ఆలోచించు మనినన్ను హెచ్చరించువాడవయితివా? చాల దూరము వచ్చినదే నీ నడవడి!"

తదుపరి రామానుజుడు, "కప్యాసం - అనగా కం = జలమును, పిబతీతి = త్రాగువాడు, కపి = సూర్యుడు. కప్యాసం = సూర్యకిరణ తాకిడిచే వికసించిన - అని భావము. కావున, పురుషోత్తముని నయనములు సూర్యకిరణ స్పర్శచే వికసించిన తామరలవలె మనోహరముగా నున్నవి - అని భావము", అని పలికెను.

రామానుజుని ప్రతిభా విశేషములను శిష్యులెల్లరు ప్రశంసించిరి. లోన అసూయాగ్నిచే దహింపబడుచున్న యాదవప్రకాశుడు బాహ్యముగా రామానుజుని వివరణమును అంగీకరించినట్లు నటించెను.

"అద్వైత సిద్ధాంతము ప్రకారము నిరాకారుడైన పరబ్రహ్మను, సాకారునిగా చెప్పుచూ, అట్టి భావమున కనుకూలమైన వ్యాఖ్యానము జేయు రామానుజుడు భక్తియోగ విశిష్టతను పైకి దెచ్చి, అద్వైత సిద్ధాంతమును వ్యతిరేకించుచున్నాడు", అని యాదవ ప్రకాశుడు కినుక బూనెను.

"నేను బోధించునది నీకు సరిపోని పరిస్థితిలో నీ శిష్యత్వమున కిచట తావులేదు. నీవే ఆచార్యుడవని భావించు లాగుననున్నావు! నీవు ఇటనుండి వెడలి, మరియొక విద్యాపీఠమును స్థాపించి, నీ యిష్టము వచ్చినరీతుల వక్రమార్గములను, వక్రభాష్యములను సూచింపుము", అని ఆగ్రహావేశమున యాదవప్రకాశుడు రామానుజుని హెచ్చరించెను.

పెద్దలను నిరసించుట యెరుగని రామానుజుడు సానుభూతి నెరుగని గురువుపై ఎట్టి అసూయను బూనలేదు. మౌనముగా నుండి, వినయ విధేయలతో సాష్టాంగపడి, "క్షమింపుడని" ప్రార్థించెను.

అసూయాపూరితుడగు, అహంభావయుతుడును అయిన యాదవప్రకాశుడు చేయునది లేక, అప్పటికి మిన్నకుండెను. పశ్చాత్తాపము, సాష్టాంగనమస్కారము, క్షమాభిక్ష కోరుట - అను

గుణముల ప్రభావమట్టిది. ఈ గుణ విశేష ఔన్నత్యమును సహజముగా పాటించి, తెలుసుకున్నవాడు రామానుజుడు. (భవిష్యత్కాలములో తాను విశిష్టాద్వైత సిద్ధాంత ప్రచారకాచార్యుడయినపుడు మానవుని యిహపర ఆనందములకు - భౌతిక మానసిక ఆనందములకు - ఈ మూడు గుణవిశేషము లుపకరించునని బోధించును. ఈ విషయము విపులముగా రామానుజుని తత్త్వబోధనామృతము అను విషయమున తెలుపబడును.)

యాదవప్రకాశునకు రామానుజునిపై లోలోన అసూయ ప్రజ్వరిల్లు చుండెను. రామానుజుని తనశిష్యునిగా భావింపలేక యున్నాడు. ఆధ్యాత్మిక తత్త్వవాదమున రామానుజుడు తనకు ప్రత్యర్థియయిన తార్కికుడుగా తయారగునని యాదవప్రకాశుడు భావించెను. "అద్వైత సిద్ధాంతము ననుసరించి, శంకర భగవత్పాదుల బోధనామృతము ననుసరించి, సర్వులు విశ్వసించి, ఆమోదించిన రీతి, నేను పరబ్రహ్మను నిరాకారుడుగను, నిర్గుణుడుగను భావించుచుండ, ఇతడు పరబ్రహ్మను సాకారుడుగాను సగుణునిగాను భావించి, నూతన సిద్ధాంతమును లేవనెత్తువానివలె కన్పట్టుచున్నాడు. నేనిక మిన్నకున్న, వీనివలన అద్వైతసిద్ధాంతమునకే ముప్పుగలుగును. ఆదిశంకరులకు, అద్వైత సిద్ధాంతమునకు అపచారము జరుగనీయను", అని తనలోతాను కుములుచుండెను యాదవప్రకాశుడు.

ఈ యసూయా భావముతో యాదవప్రకాశునకు మనశ్శాంతి లేదు అరిషడ్వర్గములో మాత్సర్యము మిక్కిలి చెడ్డది. ప్రపంచమున అశాంతికి అనైక్యమున, దుఃఖమునకు, విరోధములకు ఈ మాత్సర్యము మూలకారణము. మాత్సర్యమునకు స్వార్థముతో గూడిన అహం భావము మూలకారణము. "స్వార్థభావము" సర్వదుర్గుణములకు మూలమైనట్లు, "నిస్స్వార్థము" సకల క్షేమకర స్థితికి కారణభూతము.

యాదవ ప్రకాశుని మనస్సు ఒక అగ్నికుండముగా మారినది. రామానుజుని తుదముట్టించుటెట్లు అనునది ఆతని తక్షణ సమస్య

అయినది! రామానుజుని మరణమను వర్షము వలననే తన అసూయాగ్ని చల్లారగలదు! వేరుమార్గమికలేదు!.. అసూయ దినదిన ప్రవర్ధమానము. వేగము అగణితము! అది నశించదు. అది గలవాడు నశించిన దనుక వైర విస్తరణకంటె మిక్కిలి వేగము గలదికదా అసూయారోగ బీజము.

యాదవ ప్రకాశుడు తన శిష్యుల కొందరిని రహస్యముగా పిలిచి, "శిష్యులారా! ఒక మాట - కడపటి మాట - తిరుగులేనిమాట- మీరు వినడము, తదనుగుణముగా కర్తవ్య నిర్వహణమునకు సంసిద్ధులరు కావడం - అంతే వినుడు, రామానుజుడు మన శిష్యకూటమిలో నుండుట కనర్హుడు. ఈ ప్రపంచమున నతడుండుటయు ఆధ్యాత్మిక విద్యకు అపచారము జరుగుటకే. అతనిని తుదముట్టింపవలసి యున్నది. మనము మనమత భక్తిని నిరూపించుటకు ఇది అవశ్యము జరుగవలసినదే. కాని ఒరులెరుంగరాదు గదా! జాగరూకతను వహింపుడు. వాడు తెలివిగలవాడని పలుమారు నేనువచించుచు, అతనిని బిడ్డగా ఆదరించుచు వచ్చుటవలన, అతనికి అహంకార భావము బలసినది. నేను ఏ వ్యాఖ్యను వెల్లడించినను, అతడు ప్రతి పర్యాయము ప్రతివ్యాఖ్య చేయుటకు ప్రయత్నము చేయుచున్నాడు. మీరును వినుచునే యున్నారుగదా! వీనినిట్లు వదలిన ఆదిశంకరుని అద్వైత సిద్ధాంతమునే తుడిచివేయుటకు ప్రయత్నింపగలడు. అట్టి యపచారము జరుగకుండా చూడవలసిన బాధ్యత నాపైనున్నది. సరికదా! వీనిని తుదముట్టించు మార్గమునన్వేషింపుడు, ఆలోచింపుడు," అని యాదవప్రకాశుడు తన మనస్సులోని మర్మమును గ్రక్కెను.

మూర్ఖులయినట్టియు, మూఢవిశ్వాసముగలట్టియు, శిష్యులెల్లరు గురువుగారి నిర్ణయమును బలపరచిరి. రామానుజుని అంత మొందించుటకు ఒక్కొక్క శిష్యుడు ఒక్కొక్క మార్గమును సూచించి నాడు. కడపట ఈ పద్ధతి యేకగ్రీవముగా నామోదింప బడినది:

"ఉత్తరదేశమున వారణాసి, ప్రయాగ మొదలగు పుణ్యక్షేత్రముల దర్శించుటకు యాత్ర సాగింపవలయును. మార్గమధ్యమున అటవీ మధ్యమున విశ్రమించు రాత్రివేళ రహస్యముగా రామానుజుని, తుదముట్టించి, వానికళేబరమును అదృశ్యము గావింపవలయును" - ఇది వారి పన్నాగము. పన్నాగము అతిగుప్తముగా నుంచబడినది.

యాదవప్రకాశుడు శిష్యవర్గముతో ఉత్తరదేశయాత్రకు బోవ నిశ్చయింపబడినట్లు ప్రకటింపబడెను. సుముహూర్తము నిర్ణయింప బడెను. శిష్యులెల్లరు పరమోత్సాహమున ప్రయాణ సన్నద్ధులగు చుండిరి. మూటముల్లె సరిచేసికొనుచుండిరి. వారి దురుద్దేశమునెరుగని అమాయకులు, నిరపరాధులు అయిన రామానుజుడు, వానిసోదరుడు గోవిందుడును (పిన్నమ్మ కుమారుడు) పుణ్యక్షేత్రములదర్శించి, పుణ్య తీర్థముల స్నానములు జేసి పవిత్రులు గావలయుననెడి యుత్సాహముతో పయనమయిరి. గురువుల వారి ఘాతకాలోచన వీరిరువురకే తెలియదు. తక్కిన వారందరు ఆ కూటమి సభ్యులే.

గురుశిష్యుల యాత్రామండలి క్రమముగా నడుచుచూ, ఒకనాటి సాయం సమయమునకు పర్వతప్రాంతములోని యొకదట్టమైన అరణ్యమును జేరిరి. సమీపముననొక కాసారముండుటంజేసి, ఆ రాత్రికచట విశ్రమింపవలయునని నిర్ణయించుకొనిరి. కాసారమున నెల్లరు స్నానములాచరించి, కొంతతడవు విశ్రమించి, యిక వంటలు జేయ నారంభించిరి. చీకటి పడినది. శుక్లపక్షమగుటంజేసి సంద వెన్నెలలో ప్రకృతి తనసౌందర్యమును ప్రదర్శించుచుండినది. రామానుజుడును గోవిందుడును చేత బిందెలబట్టుకొని, త్రాగెడు నీటికై కాసారమునకు పోయిరి. అచ్చట గోవిందుడు రామానుజునితో, "అన్నా! ఒక ఘాతకకార్యమును మనగురువు గారే పన్నుచుండుట గ్రహించితిని. నిన్ను తుదముట్టింప వలయునని వారెల్లరు నిర్ణయించుకొని యున్నారు. అది నేను గ్రహించితిని. దారిలో పలుమారు గుసగుసలు విన్నాను. కాని దృఢముగా విషయమును తెలియకనే చెప్పిన అసత్యనేరారోపణ పాపమున బడుదునని తలచి, నీతో ఏమియుననక,

యింతవరకూ ఊరకుంటిని. కాని నేను రహస్య వేదినిగానే ప్రవర్తించితిని. ఈనాటి రాత్రి నిదురించు సమయమున నిన్ను మృత్యుపాలు జేయవలయునని వారు నిర్ణయించుకొని యున్నారు. నీవెటులనేని ఈ రాత్రికే అనగా అర్థరాత్రికి పూర్వమే యిచట నుండి రహస్యముగా పారిపోవలయును'', అని గోవిందుడు రహస్యముగా జెప్పెను.

రామానుజుని మనస్సు పరిపరి విధముల పోయినది. తాను చేసిన యపచారమేమో తనకు దోచలేదు. చిత్తశుద్ధితో వినయ విధేయతలతో మెలగుచున్న తన్ను గురూత్తముడేల తుదముట్టింప దలచెనో వానికి తెలియుటలేదు. గురువుగారి ఆగ్రహమునకు తానెట్టి నెపమును కలుగజేయలేదని తనమనస్సున తరించి, తరించి, కడకు తేల్చుకొనలేక పోవుచున్నాడు. సరియే, దీర్ఘాలోచనమునకు తడవుకాదది. ఇతరులతో చర్చించుటకు తనకు అప్పుడు గోవిందుడొక్కడే. ఆరాత్రి భోజనా నంతరము ఎల్లరు నిద్రించువేళ రహస్యముగా పారిపోదునని గోవిందునితో రామానుజుడనెను. "సోదరా! భగవత్కాటాక్షమున నీవు సురక్షితముగా స్వగృహము జేరగలందులకు నేనెంతయో దైవమును ప్రార్థించుచున్నాడ. నన్ననుమానింపకుండుటకు నేను మెల్లగా యేమియు నెరుగని వానివలెనటింతును. ఉత్తరదేశయాత్ర నుండి తిరిగి కాంచీపురి జేరినపుడు మనము మన స్వగృహమున కలుసుకొందము గాక!" అని గోవిందుడు వాపోయెను. రామానుజుని యాలింగనము గావించుకొని, కంటనీరుపెట్టెను. గోవిందునకు ధైర్యముజెప్పి రామానుజుడు అంతటితో గుప్తముగా మెలగుమని గోవిందుని కోరెను.

అప్పటికి రాత్రియేడుగంటలయినది, రామానుజుడు గోవిందుడు బిందెలతో త్రాగుటకు నీరుదీసికొనిపోయిరి. ప్రయాణబడలికవలన త్వరగా విశ్రమింపవలయునను తలంపుతో అందరును భోజనములు జేసి, రాత్రి తొమ్మిది ఘంటల లోపలనే నిద్రించిరి. అది శుక్లపక్ష సప్తమి దినమగుటచే రాత్రి పండ్రెండు ఘంటల తరువాత వెన్నెలబోయి చీకటి

వచ్చును. గాఢనిద్రయందుండునపుడు అర్ధరాత్రివేళ రామానుజుని తుదముట్టింప సమకట్టిన దుష్టశిష్యచతుష్టయము లేచి సంసిద్ధులగు చుండిరి. చంద్రుడు మరుగునపడెను. పెనుచీకటి నలుదిశల నలముకొన్నది. ఆకాశము మేఘావృతమైయున్నందున కటిక చీకటిగానుండెను. రామానుజుడు మెల్లగా నిద్రలేచి, ప్రక్కన పరుండి యుండిన గోవిందుని గీరి సన్నజేసి, చీకటిలోబడి దక్షిణ దిక్కుగా వెడలిపోయెను. అంధకార సముద్రమున దరిగానక ఈదుతూ పోవుచున్నాడు.

కొలది నిముసములు గడచిన తరువాత దుష్టశిష్యచతుష్టయము మెల్లగా రామానుజుడు గోవిందుడు పరుండిన స్థలమునకు వచ్చిరి. రామానుజుడట లేడు. చీకటిలో మరొకతావున పరుండియున్నాడేమో నని వెదకసాగిరి. తరువాత నిద్రించుచున్న అందరిని లెక్కించిరి. ఒక వ్యక్తి తక్కువ. ఒక ఘంటకాలము వెదకిరి. రామానుజుడు లేడని నిర్ణయింప బడినది. గోవిందుని లేవగొట్టి "రామానుజుడెక్కడ" అని ప్రశ్నించిరి. తూగుననున్నట్లు నటించిన గోవిందుడు "అర్ధఘంటకు పూర్వము అల్పాచమనమునకు రామానుజుడు లేచి అటు పదియడుగులు పోయినట్లు జూచితిని. మరలా మరుక్షణమున నేను కన్నుమూసితిని. అయ్యో! రామానుజునకేమైనదో! అని కేకలు వేయుచూ, గోవిందుడు తత్తరపాటునభినయించుచూ, తిరుగు చుండెను. అందరును నిద్రలేచిరి, యాదవప్రకాశుడు కూడా. అందరును కలిసి సమీపమున నలుదిక్కుల కొంతదూరము వెదికిరి. గాఢాంధకారము కావున ఎక్కువ దూరము చూడలేకపోయిరి. ఈ లోపల తలవని తలంపుగా వర్షము పడెను. అందరు గుమిగూడి, వారు విశ్రమించిన స్థలమును జేరి, మహావృక్షచ్ఛాయలో జేరిరి. నాల్గవ ఝామము సమీపించుచున్నది. కోయిల, భరద్వాజ, శుకపిక పక్ష్యాదులు మేల్కొలుపులు పాడుచున్నవి. వర్షము నిలిచినది. "రామానుజుడు అల్పాచమనమునకు అటుపోయి యుండవచ్చును. ఏదో క్రూరమృగము వాతబడియుండును! పాపము! మనమింకేమి

చేయగలము! విధివ్రాత అట్లున్నది! గోవిందా! ఊరడింపుము! చెట్టునగాచిన కాయలన్నియు ఒకే సమయమున పండిరాలవు కదా! ఏదిముందో, యేదివెనుకో, ఎవరికెరుక? పాపము! మనము తిరిగి కాంచీపురము చేరినపుడు యేకైకపుత్రుని వియోగమునకు రామానుజుని తల్లి యెట్లు చింతించునోకదా! కాని యిట్టి అకాల మరణమునకు అద్వైతులమగు మనము చింతింపరాదు. జగము మిథ్య! మనము నిరుత్సాహపడి తిరోగమింపరాదు. మన యాత్ర సాగించెదము", అని యేమియు నెరుగనివానివలె యాదవప్రకాశుడు శిష్యులకు తత్త్వబోధ గావించి, రామానుజుడు పంచత్వము నందెనని లోలోన ఆనందించుచూ, ఆత్మకు ఊరటను దెచ్చుకొనెను. తరువాత, తెల్లవారి అందరును యాత్రకై ఉత్తరాభిముఖులై పయనించిరి. అందరును ఆనందముగా పయనించు చుండిరి. గోవిందుడొకడే యెల్లపుడు అవనతవదనుడై ఆలోచించుచూ మౌనముగా నడుచువాడు. "రామానుజునకేమి యిక్కట్లు సంభవించునో మార్గ మధ్యమున", అని గోవిందుని భయము. "దగ్గర బంధువును పోగొట్టుకున్న గోవిందుడు కొన్ని దినములు దిగులుగా నుండుట సహజమే కదా, "అని యెల్లరు భావించిరి.

మరునాడుదయమున గురుశిష్యులు దారిన నడుచుచుండగా, "మనలో నెవరు మరణించినను తక్కినవారు జీవయాత్ర చాలించేదిలేదు కదా! పుట్టుకయెట్లు సహజమో గిట్టుటయునట్లే. ఎవరి కర్తవ్యము వారు నెరవేర్చుచుండవలసినదే జీవమున్నంత వరకు. మనము కాశీయాత్ర కర్తవ్యముననున్నారము, నడువుడు", అని కుటిల మనస్కుడైన యాదవప్రకాశుడు శిష్యుల నుత్సాహపరచుచూ పయనింపసాగెను. లోలోన పీడ వదలినదని సంతసించువాడు. ఎంత చదువు చదివినను అవివేకి తెరగిట్లుండును. స్వార్థరాహిత్య భావములేని చదువు మాత్సర్యమును గర్వమును పెంపొందించును.

ఇక రామానుజుని పరిస్థితుల గమనింతము. ప్రాణముల గుప్పెటలో పెట్టుకొని పరుగెత్తిన రామానుజుడు. అర్ధరాత్రి చీకటిలో

దారి తెన్నులెరుగక, అడవియందు పరుగెత్తుచుండెను. భీతిల్లిన వారికి ఇతరములు దోచునా? పరువిడి, పరువిడి ఆయాసము నొందెను. కాళ్ళు గుంజుచుండెను. శరీరము చెమటచే తడిసెను. ఇక ఒక్క అడుగు పెట్టుటకును శక్తి లేదు. నేలపై కూలబడెను. మరుక్షణము నేలపై వాలెను. గాఢనిద్ర నందెను. అది సుదీర్ఘనిద్ర. మరునాడు మిట్టమధ్యాహ్నమప్పటికి నిద్రనుండి లేచెను. ఎండ తీవ్రముగా కాయుచున్నది. భయభ్రాంతుడయిన రామానుజుడు కొంత ఆశ్చర్యమును పొందెను. తనయేకాకిత్వమునకు, తనకష్టములకు అతడు చింతించలేదు. నిరపరాధియయిన తన్ను గురువర్యుడేల ద్వేషించెనో గదా అని వాపోవుచుండెను. విషయ పరిశీలనమునకు శాంతియుత ఆలోచనమునకు తరుణము కాదది. రామానుజుడు లేచి, అచటి సెలయేటిలో స్నానమాచరించి కొంత స్వస్థత నందెను. రామానుజుడు సహజముగా ఆరోగ్యవంతుడు, బలశాలి, సుందర విగ్రహుడు. ఆజానుబాహుడు, తేజోరాశి. ఒక వృక్షమూలమున కొంతసేపు కూర్చొని, తరువాత పయనింప నెంచెను. క్షుద్బాధ కలిగెను. కాని, అచ్చట ఆహారమెక్కడిది? ఫలవృక్షములున్నవేమో నిదానముగా చూచెదగాక - అని ఆలోచించుచు వృక్షమూలమున నాసీనుడై శ్రీమన్నారాయణుని అనంతశక్తిని తలంచుకొను చుండెను. ఈ లోపల దంపతులైన భిల్లులు ఇరువురు ప్రక్కన నడచుచూ, రామానుజుని నవలోకించి, సమీపించి, "నాయనా! నీవేల ఒంటరిగా ప్రయాణము జేయుచున్నావు? ఎచ్చటికి పోవలయును?" అని అడిగిరి.

"నా నివాసస్థలము కాంచీపురము, బహుదూరమున నున్నదని భావించుచున్నాను", అని రామానుజుడనెనను.

"నీవు కాంచీపురమునకు పయనించుచున్నావా, నాయనా!, ఉత్తరదేశ యాత్రను ముగించుకొని నిజస్థానమునకు మరలినా వన్నమాట. మంచిది మాకు కొంత తోడయినావు నాయనా. మేమిరువు రము నూతన దంపతులము. రామేశ్వరయాత్రకై పోవుచున్నాము. కంచిపట్టణము వరకు నీతో కలిసిరాగలము నాయనా!" అని ఆ భిల్లు

దంపతులనిరి. దారితోడు దొరకినందులకు రామానుజుడు పరమానంద భరితుడాయెను. సర్వమును అదృష్టమయిన దైవశక్తి వలన సంభవించు చుండునని భావించు రామానుజుడు భక్తి భావమున నారాయణుని మనమున ధ్యానించుకొనెను. "నాయనా! అలసట జెందినట్లు కన్పట్టుచున్నావు. నీవు పైగుడ్డలతోనే యున్నావు. నీ సామాగ్రి దారిన పోయినదేమో! సరే, యివిగో మావద్ద కొన్ని ఫలములున్నవి. ఆరగించి సెలయేటిలోని సలిలముల ద్రావి సేదదీర్చికొనము, నాయనా! తరువాత నడువసాగెదము", అని భిల్లదంపతులనిరి. వారి జోలినుండి కొన్నిఫలముల నివ్వగా, రామానుజుడు వానినారగించి క్షుద్బాధ తీర్చుకొనెను.

రామానుజుడు భిల్లదంపతులతో కలిసి పయనింపసాగెను. వారి స్నేహమున, వారి దివ్యదేశ పర్యటనావిశేషములు వినుచుండుటవలన, రామానుజునకు ప్రయాణమెంతో సుఖకరముగా, ఆనంద యుక్తముగా నుండెను. ఒకనాడు సూర్యాస్తమయముకాగా ఒక తావునవారు ముయ్వురును శయనించిరి. మరునాడు వేకువననే వారు నిద్రనుండి లేచి, సమీప ప్రవాహమున స్నానమాచరించి, చెంతనున్న ఫలముల దినిరి. సూర్యోదయమగు చుండెను. భిల్లు దంపతులు రామానుజుని వైపుజూచి, "నాయనా, అదిగో చూడుము. మనమున్నత ప్రదేశమున నిలుచున్నాము గదా! చూడుము, అకనబడు కనక శిఖరములు శ్రీవరదరాజస్వామిదేవాలయగోపుర శిఖరములే గదా! ఇక నీ మార్గమును బట్టి నడువుము; త్వరలో నీ స్వస్థలమును జేరగలవు. మేమిచట నుండి నేరుగా పయనించెదము", అనిరి. రామానుజుడు దూరమున నుండి దేవాలయ సువర్ణ శిఖరముల దర్శించి, పరమానందమున సాష్టాంగపడి నమస్కరించెను. "అయ్యా, అమ్మా నేనింత త్వరలో, ఇంతటి సురక్షితముగా స్వస్థలమును జేరగలనని యూహింపలేదు. ప్రేమాతిశయమును జూపు మీ సహవాసమున మీరు దారిని నాకు దెల్పుచున్న అనేక దివ్యక్షేత్ర విషయములు నేను వినుచుండుటవలన నేను ప్రయాణకాలమునే మరచితిని. ప్రయాణ

శ్రమను బొందనైతిని. నాయీ పరమానందభరిత ప్రయాణమున మిమ్ముల నేగలిసికొన్నది నిన్ననే అని నేను భ్రమపడుచున్నాను. నేను మీకు కృతజ్ఞుడను. మీయెడ నాకు పితృభక్తి మాతృభక్తి పొడముచున్నవి. మీరు నాకొనగూర్చిన సాయము, సానుభూతి అనన్యము; మీరు నాతోగూడ వచ్చి, కంచి వరదరాజస్వామిని దర్శించి, నాయాతిథ్యమును స్వీకరించి, తరువాత యాత్ర సాగింపుము", అని రామానుజుడు కోరెను. అందులకు భిల్లుడు, "నాయనా! నీ ఆదరమునకు సంతోషము. కాని ఒక విషయమును వినుము. మాధ్యేయము రామేశ్వర దర్శనము. ఇది దేశ దక్షిణాగ్రముననున్నది. ముందు రామేశ్వరమును దర్శించి, అటనుండి తిరుగు పయనము గావించునపుడు దారిలోని పుణ్యక్షేత్రముల నన్నిటిని దర్శింతుముగాక. అట్టితరి కాంచీపురమును గూడ దర్శించెదము", అని పల్కెను. విషయమును గ్రహించిన రామానుజుడు వల్లెయని పలికి, కాంచీనగరమున తనగృహమున్న తావును భిల్లులకు గుర్తుజెప్పి, వారిని తిరుగు ప్రయాణమున తప్పక రమ్మని ఆహ్వానించి, వారికి కృతజ్ఞతను వెల్లడించి, కాంచీనగరము వైపు అత్యానందముతో నడువసాగెను. వరదరాజాలయ స్వర్ణ శిఖరములు దిక్సూచివలె కన్పడి దారిని చూపుచుండినవి.

మధ్యలో నొక కోనేటిలో దప్పిదీర్చుకొని, గట్టునన్ను అరగు పై కూర్చొని విశ్రాంతిగా నాలోచింపదొడగినాడు రామానుజుడు - "ఇక కొలది ఘంటలలో నిజసదనమును చేరగలను. జరిగిన విషయముల రహస్యముగా నుంచెదగాక! అట్లుకాదేని గురువులవారిని దోషిగా ఎల్లరు భావింతురుగదా! అట్టియెడ నేను గురువులవారికి అపచారమును జేసిన వాడనగుదును. అది తగదు. అది గురుద్రోహమే కాగలదు. వారు నాపై అసూయపూనుట నా దౌర్భాగ్యమనియే భావించెద గాక, అంతవరకే. కావున యాత్రాకాల మధ్యమున జరిగిన ఘటనను నేనెవ్వరికిని చెప్పరాదు", అని రామానుజుడు నిర్ణయించు కొనెను.

మరియు ఆలోచనాపరుడయిన రామానుజుడు ఈ విధముగా వితర్కించుకొనదొడగెను - "సృష్టి స్థితి లయముల దెలిసికొని, ఆ జ్ఞానమునకనుగుణమైన నడవడిని నిర్ణయించుకొనుటయే మతమనబడును; ఇది లోకకల్యాణము కొరకు. అందువలన ఏ జాతి ప్రజలయినను సృష్టిస్థితిలయ విషయములను భిన్నముగా భావించినను, నడవడి విషయమున మాత్రము సామ్యతను జూపవలసి యున్నది. ఇట్టి పరిస్థితిలో మహాపండితుడనియు, శాస్త్రకోవిదుడనియు, అద్వైత సిద్ధాంత ప్రచారకుడనియు కీర్తిగన్న యాదవప్రకాశుడు శిష్యుడనయిన నాపై ద్వేషమునూనుట విడ్డూరముగా కన్పట్టుచున్న యది. అదియునుగాక నన్ను తన శిష్యులచేతనే తుదముట్టింప ప్రయత్నించుటలో వారి పాండిత్యమునకును, పాండిత్యసారమగు జ్ఞానమునకును ఏలాంటి సంబంధము కన్పడుటలేదు. "విద్యా శాస్త్ర పురాణవేదపఠనం కిం తేన జ్ఞానం వినా" - అని పెద్దలిందులకే వచించిరేమో! జ్ఞానమునకు సూచకము కరుణ, దయ, సానుభూతి - మతమనునది మానవులలో కరుణదయ సానుభూతులను జనింప జాలకున్న నది మతము ఎట్లగును? నా గురువు యాదవప్రకాశునిదిట్టి మతాంధకారమున నుండుటకు నేనెంతయో చింతించుచున్నాను - "ధీమహి - ధియో యోనః ప్రచోదయాత్", అను గాయత్రీ మంత్ర తాత్పర్యమునకాయన యెంత దవ్వున నున్నాడోకదా! (భగవచ్ఛక్తి నా హృదయమున వసించి, నాచే సత్కార్యములు చేయించుగాక అని గాయత్రీమంత్రభావము). అనుదినము తాను జేయు గాయత్రీ జపమేమైనట్లు? ఎంత వైపరీత్యము! శిష్యుడనుగాన నాకర్తవ్య మొక్కటియే. గురువర్యుడెట్టివాడైనను వారి తప్పులెన్నుట నా కర్తవ్యము కాదు - వారిని గౌరవించుటయే నా విధి. వారిని విమర్శించు అధికారము నాకు లేదు. వారు దయార్ద్రహృదయులుగా మారుటకు దైవశక్తిని ప్రార్థించెదగాక. ఇదియే నా వాస్తవమైన గురుదక్షిణ కాగలదు!", అని రామానుజుడు నిర్ణయించుకొనెను. సర్వవేదసర్వశాస్త్ర

పారంగతుడయిన యాదవప్రకాశుడు సుగుణ సంపత్తి లేక సంపూర్ణ వ్యక్తి కాలేనందులకు రామానుజుడు పరిపరివిధముల చింతించెను.

రామానుజుని మనమున గలిగిన యీ వితర్క భావము అతని కరుణ దయాగుణములకు నిదర్శనము. బాల్యము నుండియే అడకువ, వినయము, దయ, స్వార్థరాహిత్య భావము, నిశిత ఆలోచనాక్రమము రామానుజుని యందు మెండుగా నుండినవి.

రామానుజుడు నడువసాగెను. కాంచీపురము సమీపమున కన్పట్టుచుండెను. అన్నిటికంటె అత్యున్నతములయిన వరదరాజస్వామి ఆలయ శిఖరములు అతనిని ఆకర్షించుచున్నవి. విలుకాడు తన లక్ష్యమునే చూస్తాడు; ఇతర విషయముల జూడడు కదా!

మరియొకసారి భిల్లు దంపతుల దలచుకొని, "నేను వారికి కృతజ్ఞుడను; వారిసాయము లేనిది నేను సురక్షితముగా అరణ్యముల గుండా పయనించి యుండెడువాడను గాను. నన్ను మార్గమున రక్షించి, యింతవరకు నడిపించిన యీ భిల్లదంపతులు నాపాలిట పురాణ దంపతులే! వారిని లక్ష్మీనారాయణులగనే భావింపగలను. సాయము జేయువారు, దయార్ద్రహృదయులైనట్టివారు, దైవాంశ సంభూతులే. కృప దైవగుణము. కృపగల మానవుడు దైవాంశ సంభూతుడు. మానవులలో రెండు వర్గములు, సజ్జనులు దుర్జనులని, ఉండుటకు కారణములు కృపాసహితత్వము, కృపారహితత్వములే", అని రామానుజుడు మనమున వితర్కించుకొనెను.

త్వరలో స్వగృహము జేరి తల్లిపాదముల నమస్కరించెను. గురువర్యుల యితర శిష్యులనందరిని వదలి రామానుజుడు ఇంత శీఘ్రముగా ఇల్లు జేరుటకు తల్లి కాంతిమతి అచ్చెరువందెను. కాని, రామానుజు డేదో నిజదేహారోగ్యకారణము దెల్పి, ఆ విషయము నంతటితో మరపింపజేసెను. కాని అది తాత్కాలికమే. తాను ఒంటరిగా తిరిగి యిల్లు జేరుట తల్లి మనమును కలవరపెట్టుచున్నదని రామానుజుడు గమనించినవాడై, ఒకనాడు తల్లి చెంత సావధానముగా

ఆశీనుడై, తన యాత్రయందు జరిగిన సర్వవిషయములను తల్లికి నివేదించి, గురువుగారి కీర్తిప్రతిష్ఠలకు భంగము కలుగకుండుటకు ఈ విషయముల రహస్యములుగా నుంచవలసినదని రామానుజుడును తల్లిని కోరెను. నిండుగుండెగల కాంతిమతి భగవానునివలె మిన్నకుండెను. తన కుమారుని రక్షించిన ఆది లక్ష్మీనారాయణులకు మనమున కృతజ్ఞతను వెల్లడించుకొనెను. మాతృసమురాలైన పినతల్లి దీప్తిమతి అక్కగారినుండి రహస్యముగా విషయమును గ్రహించి, రామానుజుని ప్రాణరక్షణకు తనకుమారుడు గోవిందుడు తోడ్పడ గలిగినందులకు లోలోన సంతసించెను.

## యాదవప్రకాశునొద్ద పునర్విద్యాభ్యాసము

మూడు మాసములు పూర్తికాగా యాదవప్రకాశుడు శిష్య గణముతో ఉత్తరదేశయాత్ర నుండి తిరిగి కాంచీపురి కేతెంచెను. తనకంటే చాలకాలము పూర్వమే రామానుజుడు స్వగృహమును సురక్షితముగా చేరెనన్న విషయమును తెలిసికొన్న యాదవప్రకాశుడు ఆశ్చర్యభయాందోళనలు ముప్పిరిగొన నిరాశచే నిశ్చేష్టుడై కూర్చొనెను. రామానుజుడెట్లు సురక్షితముగా నిల్లుజేరినాడను ఆశ్చర్యము, అతని వలన తన పన్నాగము బయటబడినదేమో యనుభయము, తాను తలపెట్టిన పన్నాగము విఫలమయినదను నిరాశ - వీనివలన అతడు డోలాయమానమానసుడై కొంత తడవు తనలో తాను చింతించు చుండెను. తన క్రూర ప్రణాళిక విషయము రామానుజుని మనస్సునకు వచ్చినదేమోనను బిడియమునబడినాడు యాదవప్రకాశుడు. క్రూరత్వము, మాత్సర్యము ఒక విధమైన దృఢత్వమును మనస్సునకే చేకూర్చును. కపట ప్రవర్తమునకు ఇవి దోహదకారులు. మానవుడు సులభముగా పశ్చాత్తాపమును వెల్లడించడుగదా! కావున పరివర్తన మెక్కడిది? దుర్మార్గ మానవునకు పట్టుదలమెండు. సత్కార్యములందు విఘ్నములు మెండుగా తోయును; అట్టితరి మానవుడు నిరుత్సాహియై తన ప్రయత్నముల నుజ్జగించును. కాని దుష్కార్యములందట్లుగాదు.

ఎన్ని విఘ్నములు మధ్యలో వచ్చినను మానవుడు తన క్రూరత్వము వదలడు.

సరే, యాదవప్రకాశుడు ఊరకెట్లుండగలడు? గోముఖ వ్యాఘ్రము కదా! పరివ్రాజకబ్రువుడు! ఏమియు నెరుగనివానివలె రామానుజుని పిలువనంపెను. ఈలోగానే గురువుగారు తిరిగివచ్చిన విషయము తెలిసి రామానుజుడు గురుదర్శనార్థము బయలుదేరి యుండెను. రామానుజుడు యాదవప్రకాశుని సమీపించి, నమస్కృతుల గావించెను. యాదవప్రకాశుడు ఆశీర్వాదమును పలికి, మందహాసము నభినయించుచూ, రామానుజుని ముఖమును పరికించిచూచెను. రామానుజుడు తనపై విహితుడుగానున్నాడా, కినుక బూనియున్నాడా అను చిహ్నమేమియు యాదవప్రకాశకునకు కనబడలేదు. రామానుజుడు తన సహజ ప్రవర్తనము బయల్పడ భక్త్యానందముల ముకుళితహస్తుడై గురువు మ్రోల నిలుచుండి యుండెను. "రామానుజా! మేమెన్ని యిక్కట్లు పాలయితిమి! ఆనాటిరాత్రి నీవు అగపడక పోవుటచే, మేమెల్లయెడల నీకొరకు వెదకి వెదకి, వేసారివెదకి, కడకు దురదృష్టవశాత్తున నీవే క్రుక్కడిమృగమువాత పడితివో అని తలచి మేమెంతయో వగచితిమి. ఎట్లో యిల్లు జేరితివి. సంతోషము", అని పల్కెను.

రామానుజుడు, "గురూత్తమా! సర్వము మీకృపయే! మీ ఆశీర్వాద బలమే", అని వినయమున నుడివెను. రామానుజుని సహజ వినయసంపద యాదవప్రకాశునందు తాత్కాలికముగానైనను కొంత మార్పును దెచ్చెను. "రామానుజా! రేపటినుండి యథాస్థితిగా విద్యాభ్యాసమునకు రమ్ము", అని గురువు పలుకగా, "మహాభాగ్యమ"ని రామానుజుడు వందనము నమర్పించెను. రామానుజునకెంత మాత్రమును యాదవప్రకాశునిపై వైముఖ్యము కలుగలేదు.

పిన్నమ్మ కుమారుడు గోవిందుని క్షేమసమాచారముల విచారింపగా, కొందరు శిష్యులు రామానుజుని విట్లనిరి -

"మేమందరము పుణ్య భాగీరథిలో స్నానముచేయుతరి గోవిందునకొక శివలింగము దొరకినది. నాటినుండి అనుదినమతడు దాని నర్చించుకొనుచూ, దానిని తనజోలియందు సురక్షితముగా నుంచుకొనియుండువాడు. తిరుగు ప్రయాణమున శ్రీకాళహస్తి వరకు వచ్చి, గురువుగారికి నమస్కరించి, తాను పుణ్యశ్రీకాళహస్తి క్షేత్రమున ఏకాంత ప్రదేశమున శివు నారాధించుచు జీవితాంతము నచటనే నిలిచిపోదునని దృఢనిశ్చయమును వెల్లడించి, తన నిశ్చయమును తన తలిదండ్రులకు దెలుపుడని మమ్ముల గోరెను. చేయునది లేక గురువుగారును అతనికోరిక నంగీకరించెను. ఇపుడతడు శ్రీకాళహస్తి యందు శివార్చన చేసుకొనుచూ నున్నవాడు".

రామానుజుడు యాదవప్రకాశునొద్ద పునర్విద్యాభ్యాసమును ప్రారంభించెను. అకాలమున కొన్ని ముఖ్య సంఘటనలు సంభవించెను. పలుమారు గురువర్యులొసంగు వ్యాఖ్యానములతో రామానుజుడు ఏకీభవించ లేకుండెను. రామానుజుని వేదాంతార్థ కౌశలము యాదవప్రకాశునకు రాళ్లు నమలునట్లుండెను. కాని యెటులో సర్దుకొని కష్టతరముగా తనబోధనలను సాగించుచుండెను. రామానుజుని బుద్ధి కౌశలము క్రమక్రమముగా సర్వుల నాకర్షించు చుండినది.

మేనమామ శ్రీశైలపూర్ణుడు ఎప్పుడైనను రామానుజుని యోగక్షేమముల విచారించుటకు వచ్చినపుడు, విద్యాభ్యాసమున రామానుజుని విశిష్ట మేధను గూర్చి తెలిసికొని ఆనందించువాడు. సందర్భోచితముగా, శ్రీరంగము చేరినపుడు, యామునాచార్యునకు రామానుజుని విశిష్ట ఆధ్యాత్మిక విషయ వ్యాఖ్యానములనూ గూర్చి, తెల్పువాడు. రామానుజుని చూడకున్నను అతని గూర్చి వినిన యామునాచార్యుడు ఆనందించువాడు. అట్టి వైష్ణవ యువకుడు తనకు శిష్యుడుగా ప్రాప్తించిన, అతడు తన విశిష్టాద్వైత సిద్ధాంత బీజమును నాటి, నీరు పోసి, పోషించి, మహావృక్షముగా చేయగలడన్న విశ్వాసము యామునాచార్యునకు గలిగెను.

ఆకాలమున కాంచీనగరము చోళరాజధాని. రాజకుమార్తెకు మానసిక వ్యాధి సంభవించెను. ఆమెకు పిశాచ మావరించినదని అందరు భావించిరి. యాదవప్రకాశుడు ఆధ్యాత్మిక విద్యయందే గాక, మంత్ర శాస్త్రమునందును నిపుణుడని ప్రసిద్ధి. ప్రభువు యొక్క ఆహ్వానముపై యాదవప్రకాశుడు శిష్యులతోగూడి రాజభవనమును జేరి, రాజకుమార్తెను పరీక్షించి, పిశాచమనుదానిని వెడలగొట్టుటకు బిగ్గరగా మంత్రముల వల్లింపసాగెను. ఆయన మంత్రోచ్చారణ మేఘగర్జనము వలె ప్రతిధ్వనించుచుండెను. పిశాచ పీడిత యనబడు రాజకుమార్తె (తన మానసిక వ్యాధి చాపల్యమున) తన యిష్టము వచ్చినట్లు పరిపరి విధముల ప్రలాపించుచుండెను. మానసిక వ్యాధికి ఒక నిర్ణీత గతియనునదేమున్నది? మంత్రోచ్చారణ ధాటిగా గావించుచున్న యాదవప్రకాశునితో రాకొమరిక యిట్లనెను - "ఓయీ! నీ తెల్లగడ్డమును నీ ముఖతిలకములను, నీమంత్రగర్జనములును నన్నేమి చేయగలవు? పండితుడవయ్యును మూర్ఖుడవు, క్రూరుడవు నీవు. కలుషితహృదయుడవగు నీమంత్రములు నాపై పనిజేయునా? ఎందులకు వృథాప్రేలాపము?"

రాజకుమార్తె మాటలు విన సర్వులు ఆశ్చర్యపడిరి. యాదవ ప్రకాశునుడు కినుకబూన నవసరము లేదు! ఏలన ఆమె మాటలను పిచ్చిదాని మాటలుగా త్రోసిపుచ్చిరి.

మరియు రాజకుమార్తె యిట్లనెను, "నన్ను తరుమను నీశక్యము గాదు! ఓ మాయావాదీ! మాయావీ! ద్రోహి! అడుగో, నీవెనుకను ముకుళితహస్తుడై నిలువబడియున్న యువక మహాత్ముడు - ఆయనను ఇటు రప్పింపుము. రామానుజుడు గదా అతడు. నీకు అదృష్ట పూర్వకముగా అతడు శిష్యుడుగా లభించినాడు. ఆ రామానుజుని, అపరిశుద్ధాత్ముని, అదయాసముద్రుని, అనిష్కళంక హృదయుని, అపరాధిని సైతము మన్నించి ప్రేమించు ఆ యుదార స్వభావుని, ఆగురుభక్తి పరాయణుని రప్పింపుము".

ఈ మాటలు విన్న యాదవప్రకాశుడు, శిష్యులు, ప్రభువు, రాజోద్యోగులు, అందరును విస్మయమున కొయ్యబారి నిలుచుండిరి. ఇక అందరినిమించి యాదవప్రకాశు దిగ్భ్రమ వర్ణనాతీతము. అతని మనస్సు పరిపరి విధముల బోయెను. కలుషాత్ముడయిన అతని మనమునకు రాజకుమార్తె మాటలు ముల్కులవలె గ్రుచ్చుకొనినవి. తన విషయములెల్లను గ్రహించిన దానివలె రాజకుమార్తె మాట్లాడుట అతనికి అనిర్వచనీయమయిన విస్మయమును కలుగుజేసెను. ఇంకను తన్ను గూర్చి రాజకుమార్తె యేమి పల్కునోయని లోలోన గడగడలాడ జొచ్చెను. ఎప్పుడెప్పుడు ఆ స్థలమును వదలుదమా అని ప్రయత్నించు చుండెను.

రామానుజుడు సమీపింపగనే రాజకుమార్తె నోటినుండి యీ పలుకులు వెలువడెను -"మాయావాదము నంగీకరింపని ఓ మహాత్మా! నన్నే గాదు, అసంఖ్యాక మానవాభ్యుదయమునకు పాటుపడగల మహాత్ముడవు నీవు! నన్నాశీర్వదింపుము".

రామానుజుడు ప్రపత్తుడుగాన, సర్వం విష్ణుమయమ్ - అని భావించువాడుగాన. శ్రీవరదరాజస్వామిని మనమున స్మరించి, త్రికరణ శుద్ధిగా రాజకుమార్తె మూర్ధమును తనహస్త కమలద్వయముతో స్పర్శించి, ఆశీర్వదించెను. వెంటనే రాజకుమార్తె స్వస్థతను జెంది, మేఘము తొలగినచంద్రబింబముఖియై లేచి, మందహాసమున సిగ్గున తలిదండ్రులయిన రాజదంపతుల మ్రోలజేరెను. ఆ క్షణమున నెవ్వరేని రాజకుమార్తె ముఖమున ఎట్టి వ్యాధి లక్షణమును గాని తిలకింప లేకపోయిరి. ఆమె నడిజవ్వనమున సంపూర్ణారోగ్య ముఖవర్చస్సుతో ప్రకాశించెను. రామానుజుని ఆశీర్వాదబలమది!

ప్రభువు రామానుజునకు నమస్కరించి, "మహాత్మా! యౌవనా కారముననున్న మహాత్మా! సిద్ధపురుషా! వేయిజన్మలకేని నీ ఋణమును నేను తీర్చుకొనజాలను. నాకు మహోపకారము గావించి, మాకుటుంబ సభ్యుల నెల్ల సంతోషపెట్టితివి. నాకుమార్తెకు

పునర్జన్మము నొసంగినవాడవయితివి. కోరుకొమ్ము నీకేయది యిష్టమో, యిచ్చి ధన్యుడనయ్యెదనగాక", అని భక్తియుక్తముగా పలికెను.

ప్రభుని పలుకుల నాకర్ణించుచున్న యాదవప్రకాశుని మనస్సు రామానుజునిపై అసూయతో నిండియుండెను. సిగ్గున క్రుంగిపోవు చుండినను, బాహ్యముగా, గంభీరత నభినయించెను. తన ఔన్నత్యమునకు శాశ్వత కళంక మేర్పడినదని లోలోన వగచుచుండెను. ఆ నిష్పత్తిలో రామానుజునియెడ తన అసూయాభావము వృద్ధి జెందుచుండెను. తన శిష్యుని ఔన్నత్యమును పుత్రవాత్సల్యముతో స్వీకరింపలేని పండితుడాతడు! ప్రేమను స్వీకరించి, క్రూరత్వమును బదులుగా నొసంగిన అపరద్రోణాచార్యుడతడు!

రామానుజుడు రాజుతో, "ప్రభూ! నేను యాదవప్రకాశ శిష్యుడనే గదా! అస్వతంత్రుడను. మరియు నేను వారిసొత్తును. వారి విద్యాపీఠమున శిష్యత్వముననున్నానుగాన, నేగోరదగినదేదియు లేదు. మరియు కోరు అధికారమును నాకు లేదు. దైవమునకు గురువునకు ప్రపత్తిని దెల్పువాడనుగాన, సర్వము దైవకృప యనియు, గురువుల వారి ఆశీర్వాదబలమనియు నా విశ్వాసము. ప్రజారక్షకుడవగు ప్రభువునకు ఇంతవరకు మేము సహాయ పడినందులకు మేము ధన్యులముగా భావింపవలసియున్నది. ప్రభువుగారి యొక్క కృతజ్ఞతా భావము మా గురువర్యులకే జెందుగాక!" అని సవినయముగా బల్కెను. రాజదంపతులు, అమాత్యులు, సదస్యులు రామానుజుని దివ్యవాక్కులకు సంతసించిరి.

రామానుజుడిట్టి దివ్యమార్గమునవలంబించి పలికినను, యాదవ ప్రకాశుడు మాత్రము లోలోన పరాభవమునే భావించి, రామానుజునిపై అనిర్వచనీయమైన క్రోధమునే మనమున బూనెను. బహిర్గతముగా మాత్రము ఆనందము నభినయించుచూ, రామానుజుని ఆశీర్వదించుచూ, రాజసదనమును వీడి నిజాశ్రమమును జేరెను.

మఠమును జేరగనే యాదవప్రకాశుడు రామానుజుని పిలిచి, "రామానుజా! ఏ మంత్రముతో నీవారాజకుమార్తెకు బట్టిన పిశాచమును

తరుమగలిగితివి?" అని ప్రశ్నించెను. రామానుజుడు భక్తిపూర్వకముగా, "స్వామీ! ఇందు నా ప్రతిభ యేమియులేదు. నేనుచ్చరించిన మంత్రమును లేదు. రాజకుమార్తె స్వస్థతకు కారణము ఆమెకు నాయెడ జనించిన విశ్వాసమే. నావరకునేను భగవచ్ఛక్తిని తలచుకొని, ఆమె స్వస్థత గాంచవలయునని త్రికరణశుద్ధిగా కోరితిని. ఇంతవరకే", అని ప్రత్యుత్తరమిచ్చెను. ఈ ప్రత్యుత్తరము యాదవప్రకాశునకు ఎంతవరకు నచ్చినదో వారికే యెరుక. కాని రామానుజుని ప్రత్యుత్తరము మానసిక శాస్త్ర సమ్మతమేనని చెప్పవలసియున్నది.

ఈ దినములలో మరియొక సంఘటన జరిగినది. ఇది యామునాచార్య కాంచీపుర సందర్శనము. ఈ సంఘటనకు రామానుజ భవిష్యత్కాల జీవితమునకు విడివడని ముడిపడినది.

యామునాచార్యుడు మహాపూర్ణుడను (పెరియనంబి) శిష్యరత్నముతో శ్రీవరదరాజస్వామిని సేవించుటకు కాంచీపురికేగు దెంచెను. మతమున భేదాభిప్రాయములున్నను, యామునాచార్యునకు యాదవప్రకాశుడు పరిచితుడే. శాస్త్రపాండిత్యమున వారిరువురు పరస్పర గౌరవము గలవారే.

యాదవప్రకాశుడు తన శిష్యులతో కలిసి వీధిని నడచుచుండగా, శిష్యులలో నొకడగు రామానుజుడు యామునాచార్యునికి కంటబడెను. అప్పటికే యామునాచార్యుడు వృద్ధుడు. రామానుజుని ముఖవర్చస్సు, శరీర తేజస్సు, అజానుబాహుత్వము యామునాచార్యు నాకర్షించినవి. "మహాపూర్ణా! యాదవప్రకాశును వెంబడించినడుచుచు ప్రాభాత భాస్కరుని వలె ప్రకాశించుచున్న ఆయువక శ్రేష్ఠుడెవడో! అతని వ్యక్తిత్వము నన్నెంతయో ఆకర్షించుచున్నది", అని యామునాచార్యు డనెను.

"స్వామీ! ఆయువకుడే మన శ్రీశైలపూర్ణుని మేనల్లుడు. ఆసూరి కేశవాచార్యుని ఏకైకపుత్రుడు. ఈతనిబుద్ధి కౌశలమును గూర్చి శ్రీశైల పూర్ణుడు పూర్వము తమతో అప్పుడప్పుడు తెల్పుచుండెడివాడు.

"సత్యం, జ్ఞానమనంతం బ్రహ్మ" అను మంత్రమునకు సరియైె భాష్యమును దెల్పి, గురువుగారి వ్యాఖ్యను త్రోసిపుచ్చిన రామానుజు డతడే! అనేక విషయములందును అద్వైత మాయావాద పరముగా యాదవప్రకాశుచే తెల్పబడిన విషయములకు సరియైన భాష్యముల దెల్పి, శిష్యులలో విశిష్టతను సంతరించుకున్నవాడు ఈ రామానుజుడు", అని యామునాచార్యునకు పెరియనంబి వివరించెను.

"అవును, ఈతని భాష్యకౌశలమును గూర్చి అనేక తార్కాణములు శ్రీశైలపూర్ణుడు తెల్పియున్నాడు. ఈతని వివరణములు నాకు ఎంతయే తృప్తిని, మోదమును చేకూర్చినవి. వానిని విన్నపుడు అద్వైత సిద్ధాంతమును సంస్కరించి, విశిష్టాద్వైత సిద్ధాంత పరమున ప్రస్థాన త్రయమునకు భాష్యమును రచించు ప్రతిభ యీతనికి గలదని నేను ఊహింపగలుగుచున్నాను. ఈతడు లోకోపకారమునకే అవతరించిన మేధావి యని నేను భావించువాడను. మా పితామహుడు శ్రీనాథమునులవారు సంస్కృత వేదములను, తమిళ ప్రబంధములను సమన్వయపరచి, ఉభయవేదాంత ప్రవర్తకుడై, వేదాంతసారమును లోకమునకుపదేశించెను. నేనును వారియాజ్ఞానుసారము, వారికోరిక ననుసరించి, భక్తిప్రపత్తి మార్గములను అనుసరించి కృషి జేయుచున్నాడను. కొన్ని వేదాంత గ్రంథములు రచించితిని. ఇంకను పెక్కింటిని రచియింపవలసియున్నది. నేనును వయోవృద్ధుడ నగుచున్నాను. రామానుజునివంటి తేజోరాశియగు మేధావియగు యువకుడే నాయనంతరము నాసందేశమును, నా సిద్ధాంతమును ప్రవర్తింపజేయగలడు. ప్రస్తుతము నాకున్న శిష్యులందరు మధ్య వయస్సునుదాటినవారే, నావలెనే వృద్ధులయినవారు మెండు, దీర్ఘాయుష్మంతుడును, ఆరోగ్యవంతుడును, మేధావియు అయిన యువకుడే ఆధ్యాత్మిక వారసుడుగా నాకవసరము", అని యామునాచార్యులు సుదీర్ఘాలోచనాపరుడై పల్కెను.

"స్వామీ! తరువాత రామానుజుని గృహమున కరిగి, వానిని మీసన్నిధికి గొనివచ్చెద"నని మహాపూర్ణుడనెను. "రామానుజుని మన

శిష్యవర్గములోనికి స్వీకరించుట కిది సమయముగాదు యాదవప్రకాశు నొద్ద విద్యనభ్యసించుచున్నాడు గదా! జరుగనిమ్ము. ఈ విషయమై తరువాత నిర్ణయమును తీసికొందము. రామానుజుని మనతో కలయిక వాని బంధువులెల్లరు ఆమోదించునదియేలే. రామానుజుడిప్పటికి తన గురువర్యునితో భేదించిన ఆధ్యాత్మిక విషయములను బట్టిచూడ నాతనిచిత్తము మనవైష్ణవమత సిద్ధాంతమునకు రావలసినదేనని నేనెరుగుదును. కాని యువకుడయిన రామానుజుని సమీపించి, స్పృశించి, ఆశీర్వదింప వలయునని నామనమువ్విళ్లూరుచున్నది. అది రేపటి దినమున జరుగునులే. యాదవప్రకాశుడు తన ఆశ్రమమును సందర్శింపుమని నన్నాహ్వానించియున్నాడు కదా! రేపే వారిని దర్శించుటకు వారి మఠమున కేగెదము", అని యామునాచార్యుడు వెల్లడించెను.

మరునాడు ప్రాతఃకాలమున యాదవప్రకాశుడు తన శిష్య వర్గముతో కలసి వెడలుచుండగా చూచిన యామునాచార్యులు "వీరిలో రామానుజుడెవ్వరు?" అని తిరుక్కచ్చినమ్బిని ప్రశ్నింపగా - నమ్బి - "ఆయతాశ్చ సువృత్తాశ్చ" అను రీతిలో ఆజానుబాహుడై నడుమ నడచుచున్నవాడే రామానుజుడు అని సమాధానమును పల్కెను. అంత యామునులు ప్రీతిపూర్వకముగా రామానుజులను కటాక్షించి "ఆముతల్వన్ ఇవన్" అని ఆశీర్వదించి, వరదరాజస్వామిని తలచి "యస్యప్రసాద కలయా బధిరః శ్రుణోతి పంగుః ప్రధావతి జలేనచవక్తి మూకః, అంధః ప్రపశ్యతి సుతం లభతేచ వంధ్యా తం దేవమేవ శరణం శరణం గత్యోస్మి" అనుచు శరణాగతినిచేసి " స్వామీ! నీవు ప్రార్థించిన వారి అభీష్టములను తీర్చువాడవు. మహానుభావుడైన ఈ రామానుజుడు వైష్ణవదర్శన ప్రవర్తకుడు అగునట్లు అనుగ్రహింపుము" అని విన్నవించెను. పిమ్మట వరదరాజస్వామిని సేవించి, తీర్థప్రసాదములను గొని శ్రీరంగమును చేరెను.

యాదవప్రకాశునితో ఆధ్యాత్మిక విషయ భాష్యములందు రామానుజుడు పలుమార్లు భేదించుట మరియొక ముఖ్యసంఘటన. ఇది రామానుజుని జీవితమార్గమునే మార్చివేసినది.

ఒకనాడు యాదవప్రకాశులు ఛాందగ్యోపనిషత్‌లోని "సర్వం ఖల్విదం బ్రహ్మ" అను మంత్రమునకు అర్థమును వివరించు సందర్భమున "విశ్వమంతయు బ్రహ్మము" అని బోధించెను. కఠోపనిషత్తులోని "నేహ నా నాస్తికించన" అను మంత్రమును వ్యాఖ్యానించుతరి, "ఆత్మయును బ్రహ్మమును ఒక్కటే" అని తెల్పెను.

ఈ వివరణముల వినిన రామానుజుడు గురునితో, "స్వామీ! తమరు సెలవిచ్చిన వివరణములు సరియైనవికావని నాయుద్దేశము. "సర్వం ఖల్విదం బ్రహ్మ" అను మంత్రమునకు అర్థము ఇదిగా తోచుచున్నది - "విశ్వమునకును, బ్రహ్మమునకును సంబంధమున్నది. కాని, అవిరెండును ఒకటికాదు. దేని విశిష్టత దానికున్నది. నీటి యందు పుట్టినచేప, నీటియందే పెరిగి, నీటియందే జీవించి, కడకు నీటియందే మరణించి, కడకు నీటియందే కరగిపోవును. కాని, చేప నీరు కాదు. అట్లనే విశ్వములో ప్రతియణువు బ్రహ్మపదార్థముతో సంబంధ పడియున్నను, విశ్వము బ్రహ్మము కానేరదు", అని రామానుజుడు వివరించెను.

"నేహనానాస్తి కించన" అన్నపుడు సత్యవిషయము ఇట్లు గోచరమగుచున్నది - "ఆత్మయు, బ్రహ్మమును ఒక్కటియే కాదు. బ్రహ్మము ఆత్మల నావరించియున్నది. పూసలగుండా పోవుదారము వలె. దారము నందు గ్రుచ్చబడిన ముత్యములు ఒకహారముగా కన్పడును. కాని, దారము ముత్యము కాదు. ముత్యములన్నియు ఒకటి కాదు; సారూపముననున్నవి - అంతవరకే. సకల చరాచరముల గుండా సూత్రముగా వ్యాపించియున్న బ్రహ్మము విశ్వమగుచున్నది. ఈయేకత్వమున వానివాని వైవిధ్యమున్నది. అంతియేగాని, బ్రహ్మము విశ్వము కాదు", అని తోచుచున్నదని రామానుజుడు పల్కెను.

రామానుజుని యొక్క యీ వ్యాఖ్యలు వినిన యాదవప్రకాశు శరీరము, భూమి కంపించినట్లు, వణకెను. తనమనస్సు అగ్నిపర్వతము వలె దహింపదొడగెను. అగ్నిపర్వతములోని ఉష్ణద్రావకము వలె తన

ముఖద్వారమునుండి అసూయాద్వేషములు పొర్లి ప్రవహించినవి. వానికిక అవధిలేదు, "రామానుజా! నీవు అద్వైత మతశత్రువువు. ప్రతి మంత్రమునకు అద్వైతసిద్ధాంతమునకు వ్యతిరేకమైన భావములు నీకు పొడముచున్నవి. నాతో ఎదురువాదములాడు నీవు నాకెట్లు శిష్యుడుగా కొనసాగగలవు? నీవు ఇక వెడలిపోయి మరియొక విద్యాపీఠమును స్థాపించుకొనుము. ఒకయొరయందు రెండు ఖడ్గములెట్లు నిలుచును? అద్వైత సిద్ధాంతమునకు శత్రువయిన నీవు నాకును, నా మఠమునకును, నా శిష్యులకును శత్రువువే. ఇక వెడలిపొమ్ము. నీకిచట స్థానము లేదు. ఇక నాగడప త్రొక్కకుము", అని యాదవప్రకాశుడు వృద్ధసింహమువలె గర్జించెను.

రామానుజుడు మిన్నగా శాంతియుతముగా గురుదేవుని మాటలవిని, మారుమాటాడుటకు నోరులేక, యిక చేయునది వేరొండు లేక, తన యెడబాటు ఇక అనివార్యమని గ్రహించి, గురువునకు నిశ్శబ్దముగా నమస్కరించి, అవతనవదనుడై, బహిష్కరణా దుఃఖ భారమును మోయుచూ, మఠమును వదలి, నడచెను.

రామానుజుడు నిజగృహము చేరి, గురువర్యునిచే తాను బహిష్కరింపబడిన వార్తను తల్లికి దెల్పి, తరువాత తాను మనమున నిట్లు శాంతచిత్తుడై వితర్కింపదొడగెను:

"గురువర్యుడు నన్ను బహిష్కరించుటకు గల ప్రళయకారణ మేమో నాకు తెలియకున్నది. సర్వవేద, సర్వశాస్త్ర పఠనము, సత్యాన్వేషణము కొరకేగదా! ఈ సత్యాన్వేషణము కొరకు నేను నా సందేహమును వెల్లడించుట తప్పా? నాకు తోచిన అర్థమును దెల్పుట తప్పా? విద్యానిధియైన గురువర్యుడు శిష్యుల సందేహములబాపి, కారణయుక్తములయిన వివరణముల నిచ్చి తృప్తిని కలుగజేయ వలయునుగదా? నాయుద్దేశముల నేను విన్నవింపగా అది అవిధేయత యని గురువులు భావించిరి! ఇయ్యది విపరీతముగా తోచెడిని. ఇంతకు పూర్వ మొకప్పుడు "తస్యయథాకప్యా సం పుండరీక మేవ

మక్షిణీ" అను ఉపనిషద్వాక్యమునకు గురువర్యుడు నీచోపమానము నాపాదించినపుడు, నేను సరియైన అర్థము దెల్పినపుడు సైతము వారు నాయెడ ననూయ బూని నన్ను మందలించి యున్నారు. నీవొక విద్యాపీఠమును ఏలస్థాపింపకూడదని హేళన జేసెను. ఉత్తరదేశయాత్ర నెపమున మార్గమధ్యమున నన్ను తుదముట్టింప ప్రయత్నింపదలచె కదా! రాజకుమార్తె నాశీర్వదించి, ఆమెకు స్వస్థత కల్పించినది గూడ గురువర్యునకు అనూయను గలిగించెను. ఇట్టి గురుడు నన్ను బహిష్కరించుట నాయోగక్షేమమునకేయని భావించెదగాక! నా ప్రథమ ఆధ్యాత్మిక ఆచార్యుడును, నాకు ఆళ్వారుల దివ్యవైభవమును బోధించిన తిరుక్కచ్చినంబిని సేవించి, తరించెద", నని రామానుజుడు నంకల్పించెను.

మరునాడుదయమున స్నాన సంధ్యానంతరము శాంతియుత పరమానంద భరిత హృదయుడయిన రామానుజుడు తిరుక్కచ్చినంబి యాశ్రమమునుజేరి, వారికి సాష్టాంగ నమస్కారము గావించి, "స్వామీ! మీరేనాకు ఆచార్యులు; నన్ను శిష్యునిగా స్వీకరించి, నన్ను జ్ఞానమార్గమున నడుపుడ"ని ప్రార్థించెను. తిరుక్కచ్చినంబి, "రామానుజా! నీవు బ్రాహ్మణ కులజుడవు. నేను వైశ్యకులజుడను; నేను గొప్ప పండితుడనుగాను; శాస్త్రజ్ఞుడనుగాను. నేను నీకేమి బోధింప గలను? నీకిప్పుడున్న వ్యాకరణ, తర్కశాస్త్ర జ్ఞానము నాకున్నదా?" అని పలికెను.

"మహానుభావా! మహాత్మా! నర్వవేద శాస్త్ర జ్ఞానమువలన లభ్యమగు అనుభూతి మీకున్నది. అది నాకెన్నడో తెలియును. మీరు భగవానులు. భగవచ్ఛక్తి మీకు వశమైయున్నది. ఎంత పాండిత్యము, శాస్త్రజ్ఞానమున్ననేమి? - శాస్త్రముల లక్ష్యమును గమనింప లేనపుడు? నర్వజ్ఞాన నమన్వయము యొక్క లక్ష్యము మానవుడు తాను సత్యమును తెలిసికొనుట; దానికి ప్రపత్తుడగుట; విశ్వకల్యాణార్థము జీవితయాత్ర జరుపుట - ఈ లక్ష్య సాధనము లేనివారికి ఎంత శాస్త్ర జ్ఞానముండి లాభమేమి స్వామీ! ఈ దివ్యమార్గమును తమరు నాకు

ఆళ్వారుల దివ్యచరిత్రమును బోధించిననాడే గ్రహించితిని. మీకంటె నాకు ఘనతర ఆచార్యుడు లేడు. స్వామీ! కరుణింపుడు", అని రామానుజుడు ఆనందబాష్పలోచనుడై తిరుక్కచ్చినంబికి ప్రపత్తుడాయెను.

తిరుక్కచ్చినంబి రామానుజుని లేవనెత్తి, మంగళాశాసనము గావించి, "నాయనా! నీవు మహాభక్తుడవని యెన్నడో తెలిసికొని యున్నాడను. నీవు ఏకసంథాగ్రాహివిగాన ఇప్పటికే సర్వవేద, ఉపనిషత్, బ్రహ్మసూత్ర, శాస్త్ర, గీత పురాణేతిహాసముల కంఠస్థము జేసియున్నావు. విద్యానిధివిగా ప్రకాశించుచున్నావు. మరియొక గురువు నొద్దతెలిసికొన తగినది నీకులేదు. నీవు మేధావివి. నీకు వితరణ గుణమున్నది. నీవు స్వయంప్రకాశకుడవు. నీకును, నాకును శ్రీవరదరాజస్వామియే ఆచార్యుడును, దైవమును. ఇదే నా ఆదేశము. నీవు అనుదినమును దేవాలయ బావినుండి స్వామి తిరుమంజనమునకు పుణ్యతీర్థమును తెచ్చి యిమ్ము. స్వామిని ఆరాధించుము. వరదరాజస్వామి నిన్ను స్వీకరించుగాక!" అని తిరుక్కచ్చినంబి ఆశీర్వదించెను, "భగవచ్ఛక్తి సర్వాంతర్యామి, నిర్గుణమును అయినను, భగవచ్ఛక్తిని అనంత కల్యాణ గుణభరితముగా భావించి, సేవించినపుడే, మానవుడు విశ్వశుభమునకు మానవులయెడ కల్యాణగుణము లవసరమని భావించి, అట్టి కల్యాణగుణముల పెంపొందింప జేసికొనుటకు ప్రయత్నించును", అని వెండియు తిరుక్కచ్చినంబి సూచించెను. జ్ఞానము యొక్క పరమావధి సేవ, ఆనందములని రామానుజుడు గమనించెను. తిరుక్కచ్చినంబి చూపిన భక్తిమార్గము రామానుజున కెంతయో నచ్చినది. అది మొదలు అనుదినమును స్వామికైంకర్యమున రామానుజుడు నిమగ్నుడై, దినమునకొకవేళ తిరుక్కచ్చినంబి యొద్ద తత్త్వజ్ఞానమును పొందుచుండెడివాడు.

# 13. రామానుజుడు యామునాచార్యుని మార్గమునకు అంకితుడగుట

రామానుజుడు యాదవప్రకాశునొద్ద శుశ్రూషమాని, తిరుక్కచ్చి నంబి యొద్ద ఆధ్యాత్మిక విద్యాభ్యాసము సాగించుచున్నాడని తెలిసి యామునాచార్యులు చాల సంతోషించెను. శ్రీరంగమున తన విశిష్టాద్వైత మఠముననున్న శిష్యులలో నుత్తముడగు మహాపూర్ణునితో నీ విషయముదెల్పి, హర్షించెను. పూర్వము వారిరువురను రామానుజుని యాదవప్రకాశుని గురుకులమున జూచుటయు, ఆశీర్వదించుటయు, జ్ఞప్తికి దెచ్చుకొనిరి. రామానుజుని తన శిష్యవర్గములో చేర్చికొనుటకును, ఆహ్వానించుటకును అది అప్పట్లో తరుణముగాకున్నను, ఇప్పుడది సులభ సాధ్యమని వారు భావించిరి. మరియు రామానుజుడు తిరుక్కచ్చినంబి నాశ్రయించుట ఆళవందారుకు పరమానందమును గూర్చినది. ఈ వార్తయే తన్ను కృతకృత్యుని జేసినట్లు ఆయన భావించెను. తిరుక్కచ్చినంబియు ఆళవందారు శిష్యుడే. మహాపూర్ణుడు, శ్రీశైలపూర్ణుడు, ఆదిగాగల యామునాచార్య శిష్యగణము తిరుక్కచ్చినంబికి సోదరసములు.

యామునాచార్యులు అప్పటికి శతవృద్ధుడు. తానిక ఎంతో కాలము జీవింపనని గమనించగలిగిన ఆత్మజ్ఞాని. జీవితమును లోకకల్యాణార్థమై అంకిత మొనర్చిన యామునాచార్యులు తన సందేశము లోకమున శాశ్వతముగా ప్రబలవలయునని కాంక్షించిన మహావ్యక్తి.

యామునాచార్యులు వార్ధక్యముచేత బలహీనతను బొందగా దూరప్రాంతముల నుండి శ్రీవైష్ణవభక్తులు వారిని దర్శించిపోవుటకు వచ్చుచుండిరి.

ఒకనాడు ఆళవందారు మఠమున నున్న తనశిష్యుల సమావేశపరచి, యిట్లుపదేశింప మొదలిడెను-"జగజ్జనకుడైన పరమాత్మ శ్రీమన్నారాయణమూర్తి మన జీవమునకు జీవము. ఈ పరమాత్మకు

ప్రపత్త్యుడయిన వాడే భక్తుడు. ప్రపత్తుడయి శరణాగతి యయిన భక్తుడు స్వార్థరహితుడై లోకకల్యాణము కొరకు ఆలోచన పరముగాని, మాటలవలనగాని, చేతలవలనగాని సేవజేయును. తన ఔన్నత్యమునకు మాత్రము తాను కృషిచేయడు. లోకోన్నతియే తన ధ్యేయము. ఇదియే మోక్షసన్యాసయోగము; శరణాగతుని లక్షణము.

"సర్వాంతర్యామి యయిన అనంతశక్తి సహజశాస్త్రీయమయినది. ఆ శక్తి ఈశ్వరశక్తి అనబడును. అది అవాఙ్మానసగోచరమైనను, దానిని సందేహించువాడు తన ఆత్మనే సందేహించినవాడగును. ఆ పరశక్తిలో మనము లీనమైయున్నాము. ఆ పరశక్తి  మనలోను, విశ్వములోని చరాచరమయిన పంచభూతముల యందు లీనమైయున్నది. ఈ తత్త్వ జ్ఞానమే నిజమైన జ్ఞానము; జ్ఞానసారము; తత్త్వ జ్ఞానము గలవాడు సేవాతత్పరుడగును. తత్త్వజ్ఞానము మూఢవిశ్వాసములను భేదించును.

"ఈ ప్రపంచమున మనముద్భవించుట స్వయంపోషణార్థము కొరకుగాదు. పుట్టినవాడు మరణించి తీరవలయును గదా! కావున పురుషార్థమనునది లోకకల్యాణార్థమయిన సేవ. సేవయే, సేవాభావమే ఆధ్యాత్మిక భక్తి; మరియొకటి గాదు.

"శ్రీకృష్ణ భగవానుడు గీతాభక్తి యోగమున భక్తుని లక్షణముల నెట్లు వర్ణించినది మీకు విదితము జేసియున్నాను గదా!" అని యామునాచార్యులు శిష్యులకు బోధించెను. (మతమనగా సేవాభావము అని యామునాచార్యులు నొక్కి వక్కాణించి యున్నారు. ఇదియే వారి బోధనామృత విశిష్టత). ఒక వైష్ణవుడు మరియొక వైష్ణవుని దర్శించినపుడు, సాష్టాంగపడి, "అడియేః" అని పలుకవలయును. "అడియేః" అనగా "దాసుడను" అని భావము. నిజమైన వైష్ణవభక్తుడు సేవాతత్పరతతో జీవింపవలయునని భావము.

కడపటిమాటగా శిష్యులనిట్లు ప్రభావితపరచిన యామునా చార్యులు శిష్యులతోగూడి కడపటి సారిగా శ్రీరంగనాథుని దేవాలయమునకేగి, విశ్వమునకును విశ్వశక్తికిని ప్రతిరూపమయిన

శ్రీరంగనాథుని విగ్రహము నెదుట ముకుళితహస్తుడై కొంత తడవు నిలవంబడి, సాష్టాంగనమస్కార మాచరించి తిరుగా మఠమును జేరి, శిష్యకోటి పరివృతుడై, ఆసీనుడైయుండి, యెల్లరను ఏకాగ్రతతో అవలోకించి, ఆ నిశ్శబ్ద సౌరభ వాతావరణమున అందరికి మంగళాశాసనము పలికి, తటాలున శిష్యకోటి యెదుట సాష్టాంగపడి, "వత్సలారా! శ్రీవైష్ణవులారా! తెలిసియో తెలియకనో నేనేమైనను అపరాధములొనర్చియున్న యెడల, నన్ను క్షమింపుడు, అడియేన్", అని పలికి, మరలా భూమిపై కూర్చుండెను. అచ్చటనున్న భక్తులు, శ్రీవైష్ణవులు, శ్రీరంగములోని అనేకమంది ప్రజలు కండ్లతడి జేసికొనిరి, "నాయనలారా! నేను త్వరలో పరమపదించవలసియున్నది", అనిపలుకగా అందరును అశ్రుతర్పణ గావించుచు మౌనముగా వారిచుట్టును ఆతురతతో నాసీనులైయుండిరి.

తరువాత తన ముఖ్య శిష్యుడయిన పెరియనంబిని (మహాపూర్ణుని ప్రత్యేకముగా దగ్గరకు పిలిచి, అందరు శిష్యుల సమక్షమున నిట్లు సెలవిచ్చిరి, "మహాపూర్ణా! నీవు వెంటనే కాంచీపురి కేగి, వీలున్నంత త్వరలో రామానుజు నిచటికి తోడ్కొని రమ్ము. ఆతడు నాకు ఆధ్యాత్మిక వారసుడై విశిష్టాద్వైత సిద్ధాంతమును వెల్లడిజేసి లోకము నుద్ధరింపవలయునని నాతుది కోరిక. ఆతడు లోకమునకు తత్త్వత్రయ జ్ఞానమనెడి సత్యమార్గమును జూపవలసి యున్నది. పరాశరుడు (వ్యాసుడు) విష్ణుపురాణమున చిత్, అచిత్, ఈశ్వరులకు (జీవులు, విశ్వము, సర్వంతర్యామియగు ఈశ్వరశక్తికిని) గల పరస్పర సంబంధమును వెల్లడించియున్నాడు. రామానుజుడీ తత్త్వత్రయ జ్ఞానమును లోకమునకు వెల్లడింపవలసి యున్నది. మరియు బ్రహ్మసూత్రములకు సరియైన భాష్యమును రచింపవవలసి యున్నది. ఇందుల కనుబంధముగా ఉపనిషత్తులకు, గీతకు నతడు భాష్యమును రచింపవలసియున్నది. కావున నీవు వెంటనే పోయి రామానుజు నిచటికి తోడ్కొనిరమ్ము. ఆతడు నీవు పిలువగనే వచ్చునో రాడో అను సందియము నీకువలదు. నీవాతనిని సమీపించి, కొంత దూరమున

నుండి, అతనికి వినబడునట్లు నాచేరచింపబడినదియు, సత్యవచన కారియు, భక్తులకు మోదమును కలుగజేయునదియు, భగవచ్ఛక్తికి ప్రీతిపాత్రమయినట్టిదియు, నగు "స్తోత్రరత్నము" నుండి శ్లోకముల వల్లింపుము. మహాభక్తుడుగాన రామానుజుడు ఆ శ్లోకములు చెవినిబడగానే నిన్ను వెంబడించును. ఇక పోయిరమ్ము. నీవు కృతకృత్యుడవై నాకోరికను దీర్చగలందులకు నీకు మంగళాశాసనము గావించుచున్నాను".

మహాపూర్ణుడు ఆచార్యునకు నమస్కరించి, కాలినడకను పయనించి, అయివదనాడు కాంచీపురము జేరెను. రామానుజుని రాకకై శ్రీవరదరాజస్వామి ఆలయద్వారమున చేరియుండెను. కాంచీపూర్ణుని (తిరుక్కచ్చినంబి) ఉపదేశానుసారము అనుదినమువలె ఆనాడును స్వామి తిరుమంజనము కొరకు (అభిషేకము కొరకు) బావినుండి, జలముల బిందెను తలపై నిడికొని దైవనామస్మరణ జేసికొనుచూ, రామానుజుడు మెల్లగా నడచుచుండెను. రామానుజుని కొలది గజముల దవ్వునజూచి, మహాపూర్ణుడు తనపాండిత్య భక్తి సంగీత జ్ఞాన ప్రదర్శనమున మనోహర కంఠస్వరమున అతిశ్రావ్యముగా శ్రీమన్నారాయణ స్తుతి శ్లోకరత్నముల గానము జేయదొడగెను. అయస్కాంతమునకు ఇనుపముక్కవలె, సునాదమునకు నాగము వలె, పెన్నిధికి పిసినారివలె, ఆభరణమునకు ముగుదవలె, పుష్పమునకు తుమ్మెదవలె, తినుబండారమునకు అర్భకునివలె, రామానుజుడు పెరియనంబి దివ్యభక్తిగానమునకు ఆకర్షింపబడి పరవశుడై నిలిచెను.

"మహాత్మా! తమరెవరు? ఎందుండి యిటకరుదెంచితిరి? మీరు గానము జేసిన శ్లోకరత్న రచయిత యెవరు? మీ గానము పసిడికి సువానన అబ్బినట్లున్నది!" అని రామానుజుడు సవినయముగా పెరియనంబిని ప్రశ్నించెను.

"నాయనా! నేనెవరో, నేగానముజేసిన శ్లోకరత్న రచయితయెవరో నీకు దెల్పుటకు పూర్వమే, నీవెవరవో నాకుముందుగనే తెలుసునని

చెప్పదలచితిని. రామానుజా! తిరుక్కచ్చినంబి ఆదేశానుసారముగా నీవు స్వామి తిరుమంజనము కొరకు పుణ్యతీర్థముల గొంపోవు చున్నావనియును నాకు తెలునును - రామానుజా! (తన నామధేయముతో తన్ను సంబోధింపగా వినిన రామానుజుడు నివ్వెరపోయి పెరియనంబి వైపుచూచుచుండెను) నీవు శ్రీశైలపూర్ణుని (తిరుమలనంబి) మేనల్లుడవనియు, కేశవాచార్య కాంతిమతుల యేకైక పుత్రుడవనియు నేనెరుగుదును, రామానుజా!" అని పెరియనంబి పలుకుచుండగా, రామానుజుడు ఆశ్చర్యమున ఆతురతతో వినుచుండెను. "నాయనా, రామానుజా! నేను శ్రీరంగమున వెలసి యున్న విశిష్టాద్వైత మత స్థాపకుడు, కులపతియు, వైష్ణవాచార్యుడును అగు యామునాచార్యుని శిష్యపరమాణువులలో నొకడను. నాపేరు మహాపూర్ణుడు. నే గానము చేయగా నీవు వినిన శ్లోకములు యామునాచార్యకృత "స్తోత్రరత్నము" లోనివి. ఇట్టి శ్లోకరత్నములు వారి వాఙ్మయమున అసంఖ్యాకములు. సాగరుడు రత్ననిలయుడెట్లో, యామునాచార్యుడను విద్యాసాగరమున శ్లోకరత్నములు అగణితములు!" అని ప్రశంసించెను.

రామానుజుడు పెరియనంబికి సాష్టాంగదండ ప్రణామంబు లాచరించి, "స్వామీ! ఇది సుదినము. మిమ్ముల దర్శించితిని. నేను శ్రీ యామునాచార్య దర్శనమునపేక్షించువాడను. పూర్వము మా మేనమామ శ్రీశైలపూర్ణుని నుండి, మా తండ్రిగారినుండి ఆళవందారు విజ్ఞాన సౌరభమును అఘ్రాణించి యున్నవాడనయినను, ఇటివల నా ఆచార్యుడు తిరుక్కచ్చినంబి ప్రేరణమున యామునాచార్యుల దర్శింప వలయుననెడి వాంఛాప్రవాహము గట్టుదాటి పొర్లి ప్రవహించు చున్నది. నన్ను మీరు శ్రీరంగమునకు తీసికొనిపోయెదరా! వారికి ఈ భక్తాంఘ్రిరేణువును పరియముగావింతురా? మరియొక విషయము స్వామీ! ఇటీవల వార్ధక్యమున కాబోలు వారు అస్వస్థులుగా నున్నారను వార్తను తిరుక్కచ్చినంబి ద్వారా విన్నాను. ఇప్పుడు వారి ఆరోగ్య మెట్లున్నది?" అని రామానుజుడు ఆతురతతో పల్కెను.

పెరియనంబి కృతకృత్యుడనయితినను తృప్తితో, ఆనందముతో "నాయనా, రామానుజా, నీవు ధన్యుడవు, ఆళవందారే నిన్ను తోడ్తెమ్మని నన్ను పంపినాడయ్యా!" అనెను.

ఇది విన్న రామానుజుని ఆనందము అనిర్వచనీయము. "స్వామీ, ఎట్లా? ఆ మహర్షిపుంగవుడు నన్నెరుగునా? వారు ఈ దాసానుదాసుని తోడ్తెమ్మని ఆజ్ఞాపించిరా? ఏమి నా భాగ్యము! స్వామీ, రండు ఆలయములోనికి. స్వామివారి అర్చన ముగించి వచ్చెద. మీరును స్వామిని సేవింపరండు. త్వరలో మాయింటికి పోయి, సాపడి, పయనమై పోవుదము", అని రామానుజుడు వినయ ప్రేమభావములు పెనగొన పల్కెను.

భోజనానంతరము తల్లి కాంతిమతికి నమస్కరించి, రామానుజుడు పెరియనంబితో కలిసి, శ్రీరంగమునకు పయనింపసాగెను. ఇది కుమారుని యున్నతస్థితికి చిహ్నముగా భావించినది కాంతిమతి. తన పుత్రుని కులపతి ఆళవందారు గుర్తించుట మహాభాగ్యముగా భావించినది.

అదిమొదలు అయిదవనాటి మధ్యాహ్నకాలమునకు వీరిరువురు శ్రీరంగ శివారుల సమీపించిరి. చరచర నడచుచు, విశిష్టాద్వైత మఠమును జేరిరి. మఠప్రాంగణము జన సమ్మర్దముగా నుండెను. పెరియనంబి, రామానుజుడు (పచ్చిగడ్డిని మేయుటకు ఆతురతతో సమీపించు ఆవు, దూడలవలె) మఠమును చేరగనే, భక్తజనులత్యాశతో వీరిని వీక్షించుచుండుటచే, అంతకుముందు చాలకాలము నుండి వీరిరువురి ఆగమనమును వారు నిరీక్షించుచున్నట్లు కనబడిరి. "వచ్చిరి" అనుతృప్తిని, జరిగిన దుస్సంఘటనకు శోకమును వెల్లడించు విధమున అందరును నిశ్శబ్దముగా దీర్ఘనిశ్వాసమును గావించిరి.

మహాపూర్ణుడు ఆతురతతో, "ఆచార్యుల వారి ఆరోగ్యమెట్లున్నది? ఆచార్యులు లోపలనున్నారా? రామానుజా! రమ్ము", అనుచూ పెరియనంబి మఠములోనికి ప్రవేశింపనుపక్రమించెను.

"ఇంకెక్కడి ఆచార్యులు! ఆళవందారు తనదివ్య అవతారమును చాలించిరి! శ్రీమన్నారాయణుని తిరువడగళు జేరిరి. ఆదిత్యునిలో నుండి విడివడిన జ్యోతిర్మణువు మరలా ఆదిత్యునిలో జేరి ఐక్యమయినది", అని భక్తులు అశ్రుతప్తలోచనులై పల్కిరి.

ఈ విషాదవార్త విన్న మహాపూర్ణుడు భూకంపమునకు నేలగూలిన మహాభవనమువలె, పెనుగాలికి పెళపెళమని నేలగూలినమహావృక్షము పగిది, భూమిపై వ్రాలిన అర్భకునివలె విలపించెను - "స్వామీ! నేనెంతటి అభాగ్యుడను. నేనే యపరాధము గావించితిని! అవసాన కాలమున నేను మీసాన్నిధ్యమున నుండలేకపోతిని! మీకు దూరముగా నుండునట్లు నాకేల శిక్ష విధించితిరి. జీవితమంతయు శశ్రూషయొనర్చి, అవసానకాలమున మీకు దూరమైతినే!" అని వాపోవుచూ శోకించు చుండెను.

ఇక రామానుజుని స్థితి అనిర్వచనీయము. నారాయణుని నిర్యాణ వార్త విన్న నరునివలె, సీతాపహరణవార్త విన్న రామునివలె, తహతహ లాడుతూ భూమిపై వ్రాలి మూర్ఛిల్లెను.

తత్త్వజ్ఞానియు, వయోవృద్ధుడును, మహానుభావుడును అయిన పెరియనంబి, ఈలోపల ధైర్యము దెచ్చుకొని, రామానుజుని ముఖకమలముపై శీతలసలిలముల జల్లి, సేదదీర్చి, స్వస్థత చేకూర్చి, "నాయనా! రామానుజా! విధిబలీయము. మనమేమి చేయగలము? ఊరడిల్లుము. భౌతికదేహ దర్శనమైనను, లభించినది. అంత్య క్రియలలో పాల్గొను భాగ్యమైనను దక్కినది", అని ఊరట గల్గింప ప్రయత్నించెను.

ప్రశాంతముగా ప్రగాఢ నిద్రయందున్న వానివలెకన్పట్టు యామునాచార్యుని జూచుచు రామానుజుడు, "నేనెంతటి భాగ్యహీనుడను? ఈ మహాత్ముని ఘనత వినియును, వీరిని దర్శింప నేను కుతూహలపడియు, వారియానతిబడసియు, కడకింత దూర ప్రయాణము గావించియు, సకాలమున వారిని దర్శించి, వారి

బోధనామృతమును గ్రోలనైతిని! ఆనోము నోచనైతినే! అభాగ్యుడను", అని వాపోయెను.

శిష్యులు, భక్తులు అంత్యక్రియలకు సన్నాహములు జేయుచుండగా, రామానుజుడు, యామునాచార్యుల దివ్యకళేబర పాదముల దగ్గర నిలువబడి, యేకాగ్రతగా ఆచార్యుని విగ్రహమును చూచుచుండెను. అస్త్రవిద్యానిపుణుడు తన లక్ష్యమునే చూస్తాడు; ఇతర ప్రపంచమాతనికి అంధకారముగా నుండును. యామునాచార్యుని దక్షిణహస్తమున మూడు వ్రేళ్లు ముకుళితముగా నుండుటను, బొటనవ్రేలు దానిప్రక్కవ్రేలు సాచియుండుటను రామానుజుడు గాంచెను. అవసానకాలమున తనకోరికలను లెక్కించుచూ యుండనోపునని రామానుజుడు ఊహించెను. "ఆచార్యుని దక్షిణ హస్తమున మూడువ్రేళ్లు ఏలముడుచుకొని యున్నవి?" అని రామానుజుడు మెల్లగా ప్రశ్నించెను.

ప్రక్కననున్న శిష్యులు యిట్లుచెప్పిరి - "ఆచార్యులవారు అవసాన కాలమున మూడు కోరికలను వెల్లడించుచూ, మూడువ్రేళ్లను క్రమముగా ముడిచి, తరువాత అంత్యశ్వాసను వదలిరి. ఆ మూడు వ్రేళ్లును అట్లే ఉండిపోయినవి", అని యామునాచార్యుని సన్నిహిత శిష్యులనిరి.

రామానుజుడు వారినుండి ఆళవందారు యొుక్క చరమ వాంఛాత్రయమును తెలిసికొని, వెంటనే తనప్రతిజ్ఞాత్రయమును వెల్లడించెను:

"వ్యాసపరాశరుడు విష్ణుపురాణమున దెల్పిన విశ్వము, జీవులు పరబ్రహ్మములకు గల పరస్పర సంబంధమును అనగా తత్త్వత్రయ మును వెల్లడించి, పరాశరుని కీర్తిని శాశ్వతమొనర్చెదగాక!

"ఉభయవేదాంత ప్రవక్తలు, శఠకోపుడు, పరాంకుశుడు అయిన నమ్మాళ్వారుల ద్రావిడప్రబంధమును ప్రచారము జేతునుగాక!

"బ్రహ్మసూత్రములు, ఉపనిషత్తులు, భగవద్గీతయను ప్రస్థాన త్రయమునకు విశిష్టద్వైత సిద్ధాంతపరముగా భాష్యముల రచింతునుగాక"!

రామానుజుడిట్లు తన ప్రతిజ్ఞాత్రయమును ప్రకటింపగా, యామునాచార్యుని చేతివ్రేళ్లుమూడును ఒక్కొక్కటిగా యథా ప్రకారముగా చాచుకొనినవి! ఈ అద్భుతము నందరు తిలకించు చుండిరి! యామునాచార్యుని ఆత్మబలమేమని వర్ణింపదగును! (యామునాచార్యుని శరీరము బాహ్యస్మృతిని పూర్తిగా గోల్పోయినను, వారిహృదయస్పందన నాడీవిధానమును పరీక్షించిన శిష్యులు వారు మరణించిరని భావించినను, వారియాత్మ అంతరాళముననెక్కడో దాగియుండి, రామానుజుని ప్రతిజ్ఞలు చెవినబడగానే, శాంతినంది, తృప్తిబడి, పరమాత్మయందైక్యమాయెనని చెప్పదగియున్నది! వారి ప్రాణాయామబల మట్టిది!

యామునాచార్యుని శిష్యవర్గముతోగూడి, రామానుజుడు ఆచార్యులవారి అంత్యక్రియలలో పాల్గొనెను. వేదవిహితముగాను, ద్రావిడవేద విహితముగాను, జరిగిన అంత్యక్రియలు, నిత్యకర్మలు, తిరువధ్యయన, తిరువారాధనలతో రామానుజుడు భక్తియుక్తముగా విద్యుక్తధర్మ నిర్వహణముగా (ఆధ్యాత్మిక వారసుడుగా) పాల్గొని, తాను తరించినట్లు భావించి, కొంతవరకు ఊరటపడి, కొంత తృప్తిని పొందెను. కాని చరమదశయందు యామునాచార్యునితో సంభాషించి, వారియుపదేశములనంది, వారి మంగళాశాసనమును, వారి దివ్యహస్త స్పర్శసుఖమును పొందలేకపోతినే యను అసంతృప్తి రామానుజుని వదలలేదు.

రామానుజుడు ఇల్లువదలివచ్చి పదునారు దినములయినది. స్వగృహముజేరి తల్లికిని, తిరుక్కచ్చినంబికిని జరిగిన విషయముల నివేదింప వలసియున్నది. తన ప్రతిజ్ఞాత్రయయుక్త దీర్ఘప్రణాళికను చేపట్టులోపల తాను సవరించుకొనవలసిన విషయములున్నవిగాన,

రామానుజుడు తిరిగి కాంచీపుర ప్రయాణమునకు సంసిద్ధుడై, పెరియనంబి మొదలగు భక్తుల సెలవుదీసికొని, బయలుదేరెను. పెరియనంబి, యితర యామునాచార్యులవారి శిష్యులు రామానుజునితో, "ఇంతదవ్వు శ్రీరంగమునకు ఏతెంచిన నీవు ఈనాడు స్వామి దర్శనము చేసికొనిపొమ్ము", అనిరి. రామానుజుడు మహాశోకమున అశ్రుపూర్ణలోచనుడై, "శ్రీరంగనాథుడు కృపారహితుడు. నాయెడ నిర్దయుడై, నేనేగుదెంచులోపలనే ఆళవందారును తనలో నైక్యము జేసికొన్నాడు గదా!" అని బిడ్డ తల్లిపై అలిగినచందమున, రామానుజుడు చరచర నడచుచూ, ప్రయాణమును సాగించెను. అతని హృదయ సముద్రపుకెరటముల శబ్దము నెవరు గ్రహింపగలరు? రామానుజుడు యామునాచార్యుని తత్త్వబోధనకు అంకితుడాయెను. శుభమస్తు! లోకకల్యాణసిద్ధిరస్తు!

## 14. తిరుక్కచ్చినంబి ఉపదేశములు - పెరియనంబి ఉపదేశములు

రామానుజుడు శ్రీరంగమునుండి తిరిగివచ్చిన ఆరు మాసములకు తన తల్లికాంతిమతి పరమపదించెను. మూల్గుచున్న నక్కనెత్తిన తాటిపండు పడ్డట్లయినది; గోరుచుట్టుపై రోకటి పోటుచందమయినది. యామునాచార్యులను దర్శించి వారి ఉపదేశమును ఆశీర్వాదమును బడయ లేకపోతినే అను ఆశాభంగ శోకములు తనమనమున వీడకముందే తల్లి వియోగము రామానుజుని మనస్సును కలవర పరచినది. ఏమియో పోగొట్టుకొన్నవానివలె ఊరకనెల్లప్పుడు నేదియో ఆలోచించు చుండువాడు. ఇతరులతో భాషింపడు. పరధ్యానమున నున్నట్లు కనబడెడివాడు.

దయార్ద్ర హృదయుడయిన తిరుక్కచ్చినంబి రామానుజుని మనః క్లేశమును గమనించినవాడై, ఒకనాడు రామానుజుని చేరబిలిచి, "నాయనా! సహజమైన విషయములను సహజముగానే జూడుము. ప్రాణిలోకంబు సంసారపతితము; వసుధపై పుట్టి గిట్టనివాడుగలడే? లోకకల్యాణార్థ జీవితమే సఫలము. వత్సా, నీమనమున శోకమునకు తావీయవలదు. జీవితమున దుఃఖ కారణము లనేకములు. ఆళవందారు మహర్షికి చేసిన నీ ప్రతిజ్ఞాత్రయమును నెరవేర్చు ప్రయత్నము జేయుము," అని చెప్పెను.

రామానుజుడు, "స్వామీ! ఆనాడు యామునాచార్యుల కళేబర సన్నిధిని వారిశిష్యుల సమక్షమున నేనెందులకు ప్రతిజ్ఞాత్రయమును గావించితినో నాకేతెలియకున్నది! నాశక్తియెక్కడ, నావాగ్దాన మేరువు లెక్కడ!", అని విభ్రమమున పల్కెను.

తిరుక్కచ్చినంబి, "నాయనా, అట్లనకుము. నీశక్తియుక్తు లపారములు. నీమేధ కడుగొప్పది. నీభక్తిప్రపత్తులు ప్రశంస నీయములు. నీవు యామునాచార్యవారికి జేసిన వాగ్దానములు తప్పక నెరవేర్పగలవు. ఆ శక్తిసామర్థ్యములు నీకేయున్నవి. ఆ

మహానుభావునకు అదితెలియును. నీవు ఆ మార్గమునే ఆలోచింప తగియున్నది", అనెను.

"చిత్తము, స్వామీ! కాని నామనవిని దయతో వినుడు. నాకు సత్యమార్గమును దెల్పెదనంటిరి. ఇప్పటికి నాసందేహముల దీర్పక పోతిరి. ద్రావిడవేదముల బోధింతునంటిరి. ఇప్పటికి అప్రయత్న సమయమే రాలేదు. మిమ్ముల నేనెన్నిమార్లు ఆశ్రయించినను, నన్ను శిష్యునిగా గ్రహించి, సత్యమార్గము నుపదేశింపరైరి", అని పల్కెను.

కాంచీపూర్ణుడు, "రామానుజా! నేను పదిసంవత్సరముల క్రితమే మీరు శ్రీపెరంబూదురులో నున్నపుడే నేను నీకు ఆళ్వారుల దివ్య వైభవమును దెల్పు సందర్భమున నొకమాట జెప్పియుంటిని. ఆ మాటనిపుడు నీకు మరల జ్ఞప్తికి జేసెదను... నేను వైశ్యకులజుడను. నీవో, బ్రాహ్మణకులజుడవు. నేను నీకు ఆచార్యునిగా నుండతగనని చెప్పియుంటిని ..... నేను మహాపండితుడగాను. గొప్ప శాస్త్రజ్ఞుడగాను. దైవమునకు భక్తిప్రపత్తుల నెరపువాడను. దాసానుదాసుడను. వరదరాజ స్వామికి సేవజేయుటయే నేనెరుగుదను. స్వామికి పుష్పముల సమర్పించెదను. ఫలముల సమర్పించెద; అవి స్వామిభక్తులకు తిరుగాజెందును. నాయొక్క విష్ణు సంశ్లేషభావమున వరదరాజ స్వామికి వివిధ విధములయిన ఉపచారములుగావింతును. వేసవిని స్వామికి తాపోపశమనము కొరకు శ్రీగంధమును సమర్పించెదను. వీవనను సలిలంబుల ముంచి స్వామికి విసరెదను. ఇది నా భక్తి. అదే ప్రకారము భక్తిపురస్సరముగా స్వామి తిరుమంజనమునకు బావినుండి అనుదినము తీర్థమును తీసికొని దేవాలయమున నిచ్చుచుండుమని నేను నీకు చెప్పియుంటిని. దానిని నీవు చేయుచున్నాడవు. ఇక స్వామియే నిన్ను అనుగ్రహింపగలడు. స్వామి నిన్ను ఆశీర్వదించి, నిన్ను కృతకృత్యునిగా చేయగలడు", అని చెప్పెను.

రామానుజుడు, "మహానుభావా! మహాత్మా! మీ ప్రపత్తి భావము అనన్యము. మీనిరాడంబరత్వము అనిర్వచనీయము. మీ మాటలు

కులశేఖరాళ్వారు ముకుందమాలయందు దెల్పినట్టి యొక శ్లోకమును జ్ఞప్తికి తెచ్చుచున్నది.

శ్లో॥ మజ్జన్మనః ఫలమిదం మధుకైటభారే ।
మత్ప్రార్థనీయ మదనుగ్రహ ఏష ఏవ ।
తత్ భృత్య భృత్య పరిచారక భృత్య భృత్య ।
భృత్యస్యభృత్య ఇతిమాం స్మర లోకనాథః॥

స్వామీ, మీరు జ్ఞానులేకాదు. మీరు జ్ఞానసాగరమునకు నెలవు. గ్రంథములలో జ్ఞానము భాషారూపమున నున్నను, మీలో సర్వమును గ్రహింపగలరు నాబోటి శిష్యరేణువులు. స్వామీ, మీరు కులాతీతులు; భగవానులు; నన్నింకను పరీక్షింపవలదు. నాయందు కరుణించి, నాకు సత్యమార్గమును దెల్పుడు, మీరిచ్చు జ్యోతితో నేను పెనుజీకటిని భేదించి పోగలను. స్వామీ!" అని రామానుజుడు తిరుక్కచ్చినంబికి ప్రపత్తుడాయెను. తనకు ప్రథమ ఆధ్యాత్మికాచార్యుడు తిరుక్కచ్చినంబి గారనియే రామానుజుడు తరువాత వెల్లడించియున్నాడుకూడా.

తరువాత రామానుజుడు వెల్లడించిన సందేహషష్ఠకమునకు తిరుక్కచ్చినంబి వివరణముల నొసంగి రామానుజునకు సత్యమార్గమును జూపెను:

1) అహమేవ పరంతత్వం. (ఆపరతత్త్వమే, ఆసత్యమే, "నేను" అనబడు "ఆత్మ")

2) దర్శనం భేద ఏవచ (మతములే విభిన్నతలను సూచించు చున్నవి)

3) ఉపాయేన ప్రపత్తిస్యాత్ (ప్రపత్తియే మోక్షదాయకము)

4) అంతిమ స్మృతి వర్జనమ్ (నావశ్యకీచస్మృతిరంతకాలే) అవసాన కాలమున దేవుని స్మరించునది చాలుననునది తగదు. జీవిత సర్వావస్థలయందును, అనుక్షణమును, విష్ణుభావము గలిగియుండ తగియున్నది.

5) దేహావసానే మోక్షం చ. (శరీర భావము నుండి విముక్తియే మోక్షము).

6) మహాపూర్ణ సమాశ్రయః. (మహాపూర్ణుని పెరియనంబిని) ఆచార్యునిగా స్వీకరింపుము).

ఈ విధమున తిరుక్కచ్చినంబి రామానుజుని సందేహముల పటాపంచలుగావించి, దివ్యమయిన సత్యమార్గమును జూపెను.

రామానుజునకు జ్ఞానోదయమయ్యెను; ఆయన తత్త్వజ్ఞానమును బొందెను. విశ్వమానవు డాయెను. తాను కోరతగినది యింకేమియు లేదు; తాను చేయవలసిన దెంతయోయున్నది. పరమానంద పరవశుడై నాట్యము చేయనారంభించెను.

"స్వామీ, నాసందేహములన్నియు వాతోద్ధూత శరదాభ్రసకల చయము వోలె పటాపంచలై నలుమూలల వెడలి విశ్వమున అదృశ్య మయినవి. ఇదిగో, స్వామీ, పరీక్షింపుడు. మీరొసంగిన జ్ఞానసారమునకు నా తాత్పర్యమును విన్నవించుచున్నాను. చేర్పులు, తీసివేతలు అవసరములైన చేయుడు:

"నేను ఈశ్వరాంశము నగుదును. కాని, నేను ఈశ్వరుడనుగాను. "నేను" అని చెప్పబడునది "ఆత్మ". ఆత్మకును ప్రాణమునకును భేదమున్నది. ప్రాణమునకును (జీవమునకును) ఘటమునకును భేదమున్నది. ఈశ్వరుడు (సర్వాంతర్యామిశక్తి), చిత్ (జీవుడు), అచిత్ (శరీరము) ఈ మూడును వేర్వేరు తత్త్వములని గ్రహించితిని; కాని ఈశ్వరశక్తి చిత్, అచిత్ అను రెంటియందును వ్యాపించియున్నది. చిత్‌నకు ఆధారము అనగా నివాసస్థానము అచిత్. ఈశ్వరశక్తికి ఆధారము అనగా నివాసస్థానము చిత్, అచిత్ రెండును. ఇదియే తత్త్వత్రయ జ్ఞానము.

"భక్తులకు ప్రపత్తిమార్గముననే మోక్షమున్నది. స్వార్థరాహిత్య భావము జీవునకు దేహాభిమానమును తొలగించి, విముక్తిని కలుగుజేయును. ఈ విముక్తి భావమే మోక్షము.

స్వార్థరాహిత్య భావము లోకసేవకు దారితీయును. లోకసేవ లోకశాంతికి, లోకకల్యాణమునకు మార్గమని గమనించితిని. ప్రపత్తి భావమును పొందిన భక్తులు స్వార్థరాహిత్యమును ప్రేమభావమున నుందురు. వీరికి ఏలాటి బంధములు లేవు. వీరిస్థితి పరమపదము.

"ఇది నేనర్థము జేసికొన్న తాత్పర్యము స్వామీ! సరియైనదా!

"మహాపూర్ణుడు (పెరియనంబి) యామునాచార్యుని ప్రథమ శిష్యరత్నముగాన వారు గురుశ్రేష్ఠుడని తమరు సెలవిచ్చియున్నారు. వారిని ఆచార్యునిగా స్వీకరించెదగాక.

"ఇక మీపాద పద్మముల వదలిపోవుచున్నాను గాన, మీయాజ్ఞాను సారము శ్రీరంగమును జేరి పెరియనంబిని ఆచార్యునిగా స్వీకరించి వైష్ణవ మతసారాంశమును విశదముగా గ్రహింతునుగాక. నన్నాశీర్వ దించిపంపుడు", అని పలుకుచూ, రామానుజుడు తన ప్రథమ ఆధ్యాత్మికాచార్యుల పాదపద్మముల వ్రాలి ప్రణమిల్లెను.

తిరుకచ్చినంబి మహదానందమున రామానుజుని తన హస్తద్వయమున లేవనెత్తి, శిరస్సును ఆశీర్వాద పూర్వకముగా స్పృశించి, "రామానుజా, సత్యమార్గమును కూలంకషముగా గ్రహించితివి. గ్రహించిన సత్యమార్గమును జీవిత ప్రయోగములను గూడ నీవ్యక్తిత్వ మేధ వెల్లడగు విధమున నుడివితివి. నీజ్ఞాన భాస్కరుడు విశ్వమును ప్రభావితము జేయుగాక!" అని రామానుజుని ఆశీర్వదించెను.

ఇక కొలది కాలములో రామానుజుడు కాంచీపురమును వదలి శ్రీరంగమున స్థిరనివాస మేర్పరచు కొనవలయునుగదా! అప్పుడే ఆ పుణ్యక్షేత్రముననే శ్రమించి, ఆళవందారుకు తానిచ్చిన ప్రతిజ్ఞాత్రయ మును ఫలప్రదము చేసికొనగలడు. ఈలోపల స్వగృహమున, శ్రీవరద రాజాలయమున, తనకు సంబంధించిన తావులయందు తాను చేయవలసిన యేర్పాట్లన్నియు క్రమముగా పూర్తిజేసి కొనవలయును గదా! అతి వితరణ గుణప్రధానుడు రామానుజుడు!

తనకు తిరుక్కచ్చినంబిపైనున్న శిష్యభావము నిష్కళంక మయినదని తనకుతాను నచ్చజెప్పుకొనవలయునని రామానుజుడు సంకల్పించెను. మహానుభావుడును, జ్ఞానసారనిధియు, శ్రీమన్నారాయణునకు ప్రపత్తుడును అగు తిరుక్కచ్చినంబి యింతకు పూర్వము (అనగా రామానుజునకు షట్సూత్ర జ్ఞానసత్యము నుపదేశించుటకు పూర్వము) పలుమారు తాను దైవభక్తుడయిన రామానుజునకు ఆచార్యుడు కానేరననియు, రామానుజునితో చెప్పియున్నాడు గదా! ఆమాటల ముద్రణలు రామానుజుని మనమున నాటుకొనియేయున్నవి. ఆ ముద్రల తుడిచివేసికొని, ఆత్మతృప్తిని పొందవలయునని రామానుజుని ప్రగాఢ వాంఛ.

అందువలన నొకనాడు రామానుజుడు తిరుక్కచ్చినంబికి ప్రణమిల్లి, "స్వామీ! ఆచార్యుడవయిన మీకు నాచిరకాలవాంఛను దెల్పుచున్నాను. మన్నింపుడు. రేపటి దినము మీరు మాస్వగృహమున కరుదెంచి, సాపాటుజేసి, నన్నానందింప వేడుచున్నాను," అని ప్రార్థించెను. ఆచార్యుడేగాన, ఇక మారుమాటాడలేక రామానుజుని యాహ్వానము నంగీకరించినాడు తిరుక్కచ్చినంబి.

తరువాత ఏకాంతముగా తిరుక్కచ్చినంబి శ్రీవరదరాజ స్వామిగుడి కేగి, స్వామిమ్రోల నమస్కృతుడై, నిలువంబడి, "స్వామీ, నేను నీకు దాసుడనై యుండ నీకిష్టములేదా? నాకాచార్య పదవి యెందులకు? నా ఆచార్యకత్వమును ధ్రువపరుపమని రామానుజునేల ప్రేరేపించు చున్నావు? స్వామీ, నాకెందులకీ ఘనత? ఆచార్యుడనన్న అహంకారము పెరిగి దూరమై పోవుటకా! నన్ను నీదాసునిగా, దాసానుదాసునిగా నుండనిమ్ము స్వామీ!" అని ప్రార్థించి నిజసదనమున కేగెను.

తిరుక్కచ్చినంబి ప్రపత్తి అట్టిది! వారి స్వార్థరాహిత్య భావమిట్టిది! వారి నిరాడంబరత అట్టిది! వారివిష్ణు సంశ్లేషభావ మట్టిది! భగవద్గీత యందు భక్తియోగమును తెల్పబడిన భక్తునితత్వనిర్వచనమునకు తార్కాణము తిరుక్కచ్చినంబి యొక్క జీవితమార్గము.

తన ఆహ్వానము నంగీకరించినందులకు లోలోన నంబికి కృతజ్ఞతను వెల్లడించుకొనుచూ, పరమానందమున రామానుజుడు తన యిల్లుజేరి, భార్య రక్షకాంబను పిలిచి, "మహాత్ముడయిన నా ఆచార్యుని మనయింటికి సాపాటునకు అహ్వానించి వచ్చినాను. రేపటి మధ్యాహ్న భోజనమునకు వారు వస్తారు", అని తెల్పెను.

"ఎవరు ఆ అచార్యుడు?" అని యీసడింపుగా రక్షకాంబ (తంజమ్మ) ప్రశ్నించెను.

"మన తిరుక్కచ్చినంబిగారు కదా", అని రామానుజుడనెను.

తంజమ్మ బాహ్యముగా నూరకుండెనేగాని, లోన, "ఆ శూద్రుడు ఆచార్యుడట! ఇంతగా పైనెక్కించుకొనుట యెందులకో! కర్మ! ఇంటిలో పెద్దదిక్కు లేకపోయెను. నేనెవరికి చెప్పుకొందును? బ్రాహ్మణ వైష్ణవ కులమునబుట్టి యీ శూద్రులకు, ఈ అంటరానివారికి నేనెట్లు పరిచర్య జేయగలను? నాభర్త యీ మార్గమున బడుటనాకు సిగ్గుచేటు.." అని తలంచుకొను చుండెను.

రక్షకాంబ ఒక విచిత్రవ్యక్తి; అర్థములేని మడి, అచారములను పాటించుటయే ఆమె విధానము. మూర్ఖురాలు. ఆమెను సక్రమ మయిన మార్గమున బెట్టుటకు, సకలజనులను సమాన భావముగా చూచునట్లు చేయుటకు రామానుజ డెంతయో ప్రయత్నించి యుండెను. అయన సలహాలు ఆమెయెడ నిరర్థకములయినవి. కడకు చేయతగినదిలేక ఊరకుండువాడు. రామానుజుడు కోపరహితుడు; విసుగుజెందెడివాడుకాడు; దయార్ద్ర హృదయుడు. తనకట్టి భార్య లభించుట తన దురదృష్టమని భావించి, తన్ను తానూరడించుకొని సంతృప్తి పొందువాడు. ఆమె అతి మూఢవిశ్వాసముల గలట్టిది. బ్రాహ్మణ స్త్రీ యితర స్త్రీలనంట రాదనియు, శూద్రులగాలి సోకినను మైలపడుదుననియు తలచు మూఢవిశ్వాసిని. దినమున కనేకమార్లు స్నానము చేయడము, మడిగట్టు కొనడము, ఆమె విధానము. ఆమె జీవితము శరీరస్నానమునకు, మడిగట్టుటకు అంకితమైనట్లే.

శూద్రులతో మాటాడినను మైల పడ్డట్లు భావించునది. రామానుజుడెంత బోధించినను ఆమె మార్గమామెదే. "మొదట ఇంట గెలువు" అను లోకోక్తి యెందులకేర్పడినదో గాని, యింటగెలుచుటయే సంస్కారికిని, యే సంస్కరణవాదికిని దుస్సాధ్యము. అతి పరిచయమువలన ఇంటిలోనివారిని ఏ సంస్కరణకర్తయు సంస్కరింపజాలడు. అట్లు చేయగలిగితే అది మహద్భాగ్యమే. (ప్రపంచ మహావ్యక్తుల విషయములో ఇట్టి భాగ్యము ననుభవింపగలిగినవాడు మహాత్మాగాంధి ఒకరేనని అనిపించుచున్నది. మూఢవిశ్వాసములతో, అంటరాని తనమును పాటించుటలో నిమగ్నురాలైన కస్తూరిదేవిని గాంధీ తనమార్గమునకు త్రిప్పుకొన గలిగినాడు. అది ఆయన భాగ్యము). "ఇంట గెలిచి రచ్చ గెలువుము" అను సూచన సామాన్యముగా ఏ వ్యక్తియందును జయప్రదమగుట లేదు. ఇంట గెలువ ప్రయత్నింప వలసినదే; అది వీలులేనపుడు ఇంటిని వదలి ప్రపంచమును ఇల్లుగా జేసికుంటాడు సంస్కర్త. రామానుజుని భార్య రక్షకాంబను సామాన్యమయిన భార్యకుండవలసిన లక్షణములు కూడా లేకుండినవి. అనురాగము, అనుబంధము లనునవి ఆమెకు తెలియవు. భార్యాభర్త సంబంధము లెరుగని యువతి ఆమె. ఆమె విజ్ఞానము, అంతయు స్నానము, మడిగుడ్డతో ముడివడి పోయినది. కాని దయార్ద్రహృదయుడును, శాంతమూర్తియునునగు రామానుజుడు ఆమెపై నెప్పుడును ఆగ్రహించిన వాడునుకాడు. తత్త్వత్రయ జ్ఞానము నెరిగినవాడుగాన. ఆమె నడవడికి ఆమె శరీర, మానసిక తత్త్వములే కారణమని తలచువాడు. బొగ్గును తెల్లబరచుట, వేమును మధుర పరచుట భౌతికముగా వీలగునవి కావుకదా! గృహిణియున్న సుఖమును రామానుజు డనుభవించలేదు; కాని, అట్టియావిడను ఆయన నిరసింపలేదు. తాను ఒక వంటమనిషి మాదిరి ప్రవర్తించు స్త్రీ ఆమె.

మరువాడు వంటయగుటతోనే రామానుజుడు తిరుక్కచ్చినంబిని ఆహ్వానించి, తోడ్తెచ్చుటకు వారి సదనమునకు బోయెను. కాంచీపూర్ణుని

అర్ధాంగి "నాయనా, రామానుజా, వారు మీయింటికనే బయలుదేరి పోయినారే! సాపాటుకు రమ్మని నిన్నటి దినము ఆహ్వానించి యుంటివిగదా? మరల యెఱ్ఱటి యెండలో రానేల నాయనా?" అని రామానుజునితో ననెను.

రామానుజుడు తిరిగి వడివడిగా నడచి యింటికి వచ్చులోపలనే జరుగవలసినదో, జరుగకూడనిదో, యేమైననుసరే, అంతయు జరిగి పోయినది! అలోపలనే తిరుక్కచ్చినంబి రామానుజుని పెరటి గుమ్మమును తట్టి, "అమ్మా తంజమ్మా వంట అయినచో నాకు వడ్డించెదవా?" అనెను. తంజమ్మ "వారు మిమ్ముల తోడ్తెచ్చుటకు వచ్చినారే! నరే, మీకును, వారికిని దారిలో కలియుట తటస్థ పడలేదేమో! ఆయనగారే మీకు స్వయముగా సాపాటు వార్చెదనని అన్నారు. ఇదిగో చెంబుతో నీరు. కాళ్లుచేతులు కడుగుకొనుడు. ఈ లోపల వారు వస్తారులేండి", అనెను.

తిరుక్కచ్చినంబి, "అమ్మా, నేను త్వరగా శ్రీవరదరాజస్వామి గుడికేగవలసియున్నది. అచ్చట నాకొరకు తిరుపతి నుండి కొందరు భక్తులు అరుదెంచియున్నారు. నేను వారిని సందర్శింప వలసియున్నది. నీభర్త రామానుజుడు వచ్చుటకు ఆలస్యమగునేమో", అని అన్నాడో, లేదో వెంటనే తంజమ్మ వసారాలో అరటియాకు విస్తరను పరిచి, "అట్లయిన నేను వడ్డించెద. మీరు భోజనము చేసి పోవచ్చును," అని అన్నది - ఒల్లనివాడు తాళిగట్టినట్లు.

తంజమ్మ చేసిన వంటకముల వడ్డింపగా, నంబి త్వరితగతిని భుజించి, విస్తరాకును తీసివైచి, భోజనము చేసినచోట గోమయముతో శుద్ధిజేసి, తరువాత కృతజ్ఞతాపూర్వకముగా నామెకు నమస్కరించి, యిల్లు వదలి వెడలిపోయెను.

రామానుజుడు తిరిగి యింటికి చేరులోపల గురువర్యుని దారిన చూడలేదు. తనకొరకు తనయింటివద్ద వేచియున్నారేమోనని, ఆలస్యమునకు క్షమాపణ వేడవలయుననెడి యుద్దేశముతో వడిగా

నడచి యిల్లుజేరెను. రామానుజుడు ఇల్లుజేరుసరికి తంజమ్మ మరలా స్నానమాచరించి, మడిగట్టుకొని వంట జేయుచుండినది. "ఇది యేమి?" అని రామానుజుడు ఆశ్చర్యమున నడిగెను.

తంజమ్మ రామానుజునితో, "మనము భోజనము చేసిన తరువాత అతనికి వడ్డింప వలయునని అనుకొనియుంటిని. ఈ లోపలనే అతడు త్వరజేసి ముందే భోజనము చేసిపోయెను. అన్నియు శూద్రలక్షణములే! ఇకనతడు ముందుగా భుజించుటచేత, మిగిలిన ఆహారమును బ్రాహ్మణులమయిన మనము భుజించుట తప్పుగదా! మడికి, ఆచారమునకు భంగముకదా! అందువలన మిగిలిన భోజన పదార్థమును కొంత కుక్కకు, కొంత యింటిముందు పోవుచున్న బిచ్చగానికి వేసినాను. అందువలన మరలాస్నానముచేసి, మైలబాపుకొని, మడిగట్టుకొని, వంటజేయుచున్నాను. త్వరలో అవుతుంది లేండి వంట," అని చెప్పెను.

రామానుజుడు ఇది విని నివ్వెరపోయెను; నోటిగుండమాట రాదయ్యె. ఒక నిముసము పాటు మిన్నక తిన్నెపై కూలబడెను. అనాడు పెరియనంబితో కలిసి శ్రీరంగపురిచేరి, తాను సమీపించు లోపలనే యామునాచార్యుడు పరమపదించినపుడు ఎంత నైరాశ్యమును జెందినాడో, అట్టి ఆశాభంగమును ఈనాడు రామానుజుడు పొందినాడు. అతనిబాధ అనిర్వచనీయము.

"అయ్యో, యెంత పనిజేసితివి! ఎంతటి అపచారము గావించితివి? ఆ మహానుభావునకు భక్తితో, ప్రీతితో సాపాటును వడ్డించి, వారి భోజనానంతరము వారి విస్తరాకును తీసివేసి, వారిని సాగనంపి, తరువాత మిగిలియున్న ఆహారపదార్థమును మహాప్రసాదముగా ఆరగింప వలయునని నేనుద్దేశించియుంటిని. అయ్యో! నా సంకల్పము వృథా అయ్యెనే!...... వారా శూద్రులు! వారు పరమభాగవతోత్తములు! స్వామితో సంశ్లేషమును పొంది పరమానందస్థితియందుండు భక్తుడు ఆయన". అని పలుకుచూ రామానుజుడు కంటనీరుపెట్టుకొనెను.

"ఏమండీ! ఇదేమివెఱ్ఱి! శూద్రులనెందుకండీ నెత్తిన ఎక్కించుకొని తిరుగుతారు! కాని, మీరన్నట్లు ఆయనగొప్ప వివేకియే, శూద్రుడయినను, దానిని నేకాదనను. తన అంతస్థు దానెరిగినవాడు. ఏది ఉచితమో, యేది అనుచితమో బాగుగా నెరిగినవాడే. మీ ఉద్రేకమున మీ రాతని ఎట్లు ఆహ్వానించినను, ఆయన మాత్రము సలక్షణముగనే యిచట మెలగినాడు. ముందుగా నన్నడిగి భోజనము పెట్టించుకొన్నాడు. భోజనానంతరము విస్తరనెత్తి వీధిలో దూరముగా పారవైచి, తదుపరి తిన్నచోట గోమయముతో శుద్ధిపెట్టి, వెడలిపోవునపుడు నాకు నమస్కరించిపోయినాడు. ఆయన వెళ్లిన తరువాత నేనాతనికిచ్చియుండిన చెంబును శుద్ధిచేసి యింటిలో పెట్టినాను. జరిగినదిది. మీరు వాపోవుట యెందులకో నాకు తెలియకున్నది!" అని తంజమ్మ పలికెను.

ఈమాటలు రామానుజునకు గోరుచుట్టుపై రోకటి పోటు చందమయినది. పరితాప పడుటయేగాని, కోపమనునదెరుగడు రామానుజుడు. దయ, సానుభూతి, పరితాపము, పశ్చాత్తాపము, క్షమాపణ, శాంతము మొదలగు గుణములకు మూర్తి రామానుజుడు. చేయునది లేక, జరిగిన అపచారమునకు మనమున నెంతయో క్రుంగినాడు. ఆనాటి మధ్యాహ్నము తాను ఆహారమును తీసికొన లేకపోయినాడు. తన హృదయమున జనించిన శోకాగ్నివలన. ఆయనకు స్వస్థత జెందుటకు కొన్ని గంటల కాలము అవసరమయినది. భర్తకు ఆకలికాలేదేమోనని, అజ్ఞానముగా తలంచిన తంజమ్మ యధాస్థితిగా వంట అయిన తరువాత, మరలా స్నానముజేసి, మడిగుడ్డతో భోజనము జేసినది! తంజమ్మ అజ్ఞానమును, అవివేకమును, మూర్ఖత్వమును తన వివాహారంభము నుండియు రామానుజుడు గమనించు చుండియు, సంపూర్ణమయిన ఓర్పు నవలంబించి యున్నాడు; అయినను ఈ విషయమున రామానుజుని మెత్తని మనస్సునకు తీరని గాయము తగిలినది.

మరియొక సందర్భమున గూడా రామానుజుని మనస్సునకు తీరని భారమగు బాధను కలిగించినది తంజమ్మ. ఒకనాటి మధ్యాహ్నము రామానుజుడు, భార్య తంజమ్మ నిరువురును సాపాడి, విశ్రాంతి తీసికొనుచుండిరి. వారిరువురి భోజనానంతరము చాల ఆహారము మిగిలియున్నట్లు రామానుజుడు చూచియేయున్నాడు. ఒక శ్రీవైష్ణవుడు ఆకలిగొని భోజనార్థము రామానుజుని యింటి గుమ్మము చేరెను. అత్యాదరమున ఉత్సాహముతో రామానుజుడు భార్య రక్షకాంబను పిలిచి, ఆ శ్రీవైష్ణవునకు భోజనము పెట్టుమని చెప్పెను. ఆ క్షణముననే రక్షకాంబ ఖచ్చితముగా ఇంటిలో ఒక మెతుకయినను లేదని అనగా, శ్రీవైష్ణవుడు "భగవదనుగ్రహము" అనుచూ వెళ్లిపోయినాడు. రామానుజుడు ఇంటిలో బొత్తిగా అన్నములేదనుట విని ఆశ్చర్యపడినాడు. కాని సానుభూతి, దయ ఆయన సొత్తు కాబట్టి, యితరుల మాటలు విశ్వసించుటయేగాని, అనుమానించుట యనునది ఆయన తత్త్వము కాదుకాబట్టి, విశాలహృదయముతో యీలోపల మరియెవరికైనను లేక పనిమనిషికైనను మిగిలిన ఆహారమును తంజమ్మ యిచ్చివేసియున్నదేమోనని కూడా సందేహించెను. కాని, రక్షకాంబ చేష్టలకుగాని, మాటలకుగాని, యెదురు జెప్పిన ఆమె యింకను ఎక్కువ మూర్ఖముగా మాటాడుటయో, చేయుటయో జరుగును. ఆమె విపరీత మూర్ఖ స్వభావము గమనించియున్న రామానుజుడు కొంతసేపు మిన్నకుండి, తరువాత రక్షకాంబ నీరుదెచ్చుకొనుటకు బావికిపోగా, రామానుజుడు ఇంటిలోనికిపోయి యేదోవస్తువుకొరకు వెదకుచుండగా, తలవని తలంపుగా ఒకమూల పదిలముగానుంచబడిన ఆహార పదార్థముల జూచెను. ఇది జూచిన రామానుజు డెంతయో ఆందోళన జెందినాడు - "గృహస్థునకు గృహిణి సహాయమున అతిథి సత్కారము జేయుటయేగదా పరమావధి! అట్టి అవకాశములేని నాకు గృహిణి వలన ప్రయోజనమేమో తెలియకున్నది! నా వైవాహిక జీవితము నన్నెంతటి దౌర్భాగ్యస్థితికి దించినది! తిరుక్కచ్చినంబివి సాపాటుకు

ఆహ్వానించినపుడు ఈమె అట్లు ప్రవర్తించె! ఈనాడిట్లు ప్రవర్తించినది! అతిథి సత్కారములేని గృహస్థుని జీవితము నిష్ఫలము!" అని రామానుజుడెంతయో వాపోయెను.

తిరుక్కచ్చినంబి ఆదేశానుసారము రామానుజుడు శ్రీరంగమునకు బోయి, పెరియనంబిని ఆచార్యునిగా స్వీకరింపవలసియున్నది. మరియు ఇది యామునాచార్యుని ఆదేశముకూడాను. తిరుక్కచ్చినంబి ఆశీర్వాదమును బొంది, రామానుజుడు శ్రీరంగమునకు బయలు దేరెను. నాల్గవనాటికి మధురాంతకమను పట్టణము జేరెను. అచ్చటి కోదండ రామాలయమును దర్శించి పోదమని తలచి, రామానుజుడు దేవాలయమునకు పోగా, తలవని తలంపుగా నచట పెరియనంబిని జూచి, సాష్టాంగదండ ప్రమాణము లాచరించి, "స్వామీ, వెదకబోయిన తీగ కాలికి చుట్టుకున్నట్లున్నది! మీదర్శనార్థము శ్రీరంగమునకు బోవ బయలుదేరి, మార్గమధ్యముననే మిమ్ము ఇచ్చట కనుగొనుచున్నాను! అడియేన్", అని రామానుజుడు పరమానందమున ననెను.

"రామానుజా, నాకును ఈ సంఘటన అతిచిత్రముగా నున్నది. నీ కొరకు నేను కాంచీపురము వచ్చుచుంటిని. నేనును నాఅర్ధాంగియు శ్రీకోదండ రామస్వామిని సేవించుటకు ఇట ఈనాడు ఆగితిమి. నిన్నిట జూచుట పరమానందముగానున్నది", అని పెరియనంబి పలుకుచూ, రామానుజుని ఆశీర్వదించెను.

తరువాత రామానుజునకు పెరియనంబితో, "స్వామీ, నేను మీకు శిష్యుడను; దాసుడను; మీరునాకు ఆచార్యులు. నన్ను పంచసంస్కార పవిత్రుని జేయుడు. నాకు వైష్ణవమంత్రోపదేశమును జేయుడు" అని ప్రార్థించెను.

"రామానుజా, మనమందరము కాంచీపురము పోవుచున్నాము కదా! శ్రీ వరదుని సన్నిధానముననే నీ కోరిక నెరవేర్చెదనులే", అని పెరియనంబి వాత్సల్యముతో పల్కెను.

"స్వామీ, మీకు విషయమును సూచింప గలవాడనుగాను. భవిష్యత్తు మనస్వాధీనము లేనిదికదా. మరుక్షణము సంగతేమో యెవరికి తెలియును? ఎప్పటి మంచి అప్పుడు. ధర్మమాచరించునెడ మృత్యుచే తలబట్టి యీడ్వబడినవానివలె నుంట శ్రేయస్కరముగదా స్వామీ! ఆనాడు యాతురతతో శ్రీరంగము చేరియు, ఆళవందారు దర్శనోప దేశములు నాకు లభ్యము కాకపోయెను; తమరును అవసాన కాలమున వారివద్ద లేకపోతిరి! కావున నాప్రార్థనమును మీరు ఈనాడే యిచటనే యీడేర్చుట నాయిష్టము స్వామీ!" అని రామానుజుడు సవినయముగా నర్థించెను.

"వత్సా, నీవు యువకుడవైనను నీ విచక్షణ జ్ఞానము అపారము. నీకార్యదీక్షా పరత్వము గూడా నిటులనేయుండుగాక! ఇదిగో, ఈ దేవాలయ ప్రాంగణముననున్న వకుళ వృక్షచ్ఛాయలో నిన్ను పంచసంస్కారుని గావించి వైష్ణవ మంత్రోపదేశమును గావించెదగాక" అని మహాపూర్ణుడు పల్కెను.

పవిత్ర స్నానానంతరము, పవిత్ర వకుళ వృక్షమూలమున, పెరియనంబి రామానుజునకు వేద, పాంచ రాత్రాగమ విహితముగా పంచ సంస్కారములగావించి, చక్రాంకనము జేసెను. ఆళవందారు ఆజ్ఞానుసారము వైష్ణవ మంత్రమయిన అష్టాక్షరీ మంత్రమును (ఓం నమో నారాయణాయ) ఉపదేశించెను. దీని సారాంశము ద్వయ మంత్రము. ప్రమాణ, ప్రమేయ ప్రమాత అను సత్యత్రయమును రామానుజునకు పెరియనంబి వివరించెను. సంస్కృత ద్రావిడ వేదములు ఇచట "ప్రమాణ" మనబడును. సర్వాంతర్యామియయిన వైష్ణవశక్తి (ఈశ్వరశక్తి)యే "ప్రమేయమ"నబడును. బ్రహ్మజ్ఞాని అయిన ఆచార్యుడే "ప్రమాత" అనబడును. ఇట్లు రామానుజుడు మంత్ర రత్నమును పెరియనంబి నుండి గ్రహించెను.

ఆనాడే రామానుజుడు గురువు, గురుపత్నిని వెంటబెట్టుకొని, కాంచీపురంజేరెను. ఆచార్యుడయిన పెరియనంబికి నివాసమునకు

గృహము నేర్పాటు గావించి, రామానుజుడు వారికెట్టి లోటుపాట్లు లేకుండా తగిన జాగ్రత్త వహించెను. ఆచార్యునకు సేవజేయుచూ రామానుజుడు షణ్మాసకాలములో వారివద్ద నుండి తమిళవేదము (లేక) దివ్య ప్రబంధమని ప్రఖ్యాతిగాంచినట్టియు, శ్రీనాథమునుల వారిచే సంకలనముగావింప బడినదియునైన "నాలాయిరము" అను తిరునామముగల నాల్గువేలపాశుర సంకలనమున కొన్ని ప్రబంధము లను నభ్యసించెను. రామానుజుడు ప్రబంధమును నేర్చిన తెరగును గాంచిన పెరియనంబి అతని యేకసంథాగ్రాహ్యతకును, అతని భాష్యవిధానమునకును, నిశిత విమర్శనా జ్ఞానమునకును, అచ్చెరువందెను. ఆరుమాసములయిన తరువాత ఆచార్యుడు రామానుజునితో, "రామానుజా! నేను శ్రీరంగమును వదలి సుమారు అర్ధసంవత్సరమయినది కదా! అచ్చట నాకొరకు వేచియుండు శిష్యులు, నా సహనంబిజనులు పెక్కండ్రున్నారు. కావున శీఘ్రముగా నేను శ్రీరంగమున జేరుట యుక్తము. నావద్ద దివ్య ప్రబంధమును బడసితివి. అంతకు పూర్వమే వేద, ఉపనిషత్, బ్రహ్మసూత్ర, భగవద్గీతలను వశము చేసికొనియే యున్నావు. ఉభయవేదాంత వేదివయితివి. నీవు ఉభయ వేదాంత ప్రవర్తకుడవై, ప్రపంచమునకు ఉభయ వేదాంత ప్రవక్తవు గావలయునని యామునాచార్యులు కోరియున్నారు కదా! మరియు ఆనాడు యామునాచార్యుల వారికి నీవు గావించిన వాగ్దానత్రయమును అనుక్షణమును జ్ఞప్తికి యుంచుకొనుము. నీవు అతి శీఘ్రకాలములో శ్రీరంగమును జేరి, అచట వైష్ణవమతాధిపత్యమును స్వీకరించి, లోకకల్యాణార్థము నీ విశిష్ట జీవితమును గడపుచూ చేతనుల నుజ్జీవింప జేయవలయునని నిన్ను ఆశీర్వదించుచున్నాను", అని చెప్పి, పత్నీసమేతముగా తిరిగి శ్రీరంగమునకు వెళ్లెను. రామానుజుని జీవితమున పెరియనంబి ఆచార్యకత్వము ఒక ముఖ్యమైన మలుపు.

## 15. సన్న్యాస స్వీకారము

తిరుక్కచ్చినంబివద్ద తత్త్వజ్ఞానమును బొంది తన సందేహముల బాపుకొనిన రామానుజుడు పెరియనంబి వద్ద ద్రావిడ దివ్యవేదమును (నాలాయిర ప్రబంధమును) గ్రహింపగా, తాను సత్యమార్గమును సంపూర్ణముగా పొందినట్లు భావించెను. అతడు విముక్తి నంది మోక్షమార్గమున నున్నట్లు తలంచెను. మహామేధావి యయిన రామానుజుడు మూఢవిశ్వాసముల కఠితుడు. (తాను భవిష్యత్తులో విశిష్టాద్వైత సిద్ధాంతమును ప్రచారము జేసినపుడు, ప్రబోధించినపుడు అతని వ్యక్తిత్వము పూర్తిగా వెల్లడగుట పాఠకులు గమనింతురుగాక).

రామానుజుడు తన దివ్యజ్ఞానమును సమన్వయ పరచుకొని ఒక నిర్ణీత దార్శికమును జేరెను. ప్రపంచముననున్న సర్వదార్శికములకు రత్నము వంటిదది. శ్రుతి స్మృతులను కాదనకుండనే తన సత్య విశిష్ట మార్గమును జూపినాడు రామానుజుడు. (తత్త్వశాస్త్రమును దార్శనికము, దర్శనము అనియు నందురు).

ఈశ్వరశక్తి, చిత్, అచిత్, అనునవి తత్త్వ త్రయములని తెలుపబడెను కదా. జీవులకు ప్రకృతి శరీరము; ప్రకృతియు జీవకోటియు ఈశ్వరశక్తికి శరీరము. తత్త్వత్రయము పరస్పర సంబంధము నుండి విశ్వము, విశ్వేశ్వరము అగుచున్నది. ఈశ్వరశక్తికి ప్రకృతినుండి (అనగా చిత్, అచిత్‌ల నుండి) వేరుపడుట అనునది లేదు.

ఇట్టి తత్త్వత్రయ సమ్మేళనామూర్తి అనబడు పురుషోత్తముడే (ఈశ్వరశక్తి) లోకకల్యాణార్థము దుష్టశిక్షణ, శిష్టరక్షణకు తోడ్పడును.

అనిర్వచనీయమైన అద్వైష్ణవశక్తికి ఆరాధన కొరకు మూర్తిత్వమును మనము ఆపాదించుచున్నాముగావ, పురుషోత్తముడుగానున్న మానవుని ఆమూర్తియొక్క అవతారమని మనము భావించుట సమంజస మయినది. ఇది యొక దార్శనిక సారస్వతపు మలుపు.

జీవులు నిత్యులు, ముక్తులు, బద్ధులు అని మూడు విధములుగా కర్మఫలితమని పూర్వులచే చెప్పబడినను, ఆళ్వారుల భావమున రామానుజుడీ పదములకు శాస్త్రీయ సత్యభావముల నాపాదింప జేసినట్లు విలక్షణ జ్ఞానులు గమనింపగలరు.

ఏ జీవుడును (ఏమానవుడును) తత్త్వత్రయ ఫలమే. అతనిలో మూడు తత్త్వములున్నవికదా! పుట్టకతోనే మహామేధావులుగా జన్మించి, అళ్వారులవలె స్వాచార్యులుగా తయారయిన జీవులు నిత్యులు, వీరు నిత్య సంతోషులు, పరమానందమయులు. పురాణపురుషులలో ప్రహ్లాదుడు ఈ కోవకు జెందినవాడు. ప్రహ్లాదుడను పదమునకు గొప్ప సంతోషమున నుండువాడు అని భావము - ఆళ్వారును అంతయే - యెల్లప్పుడును భక్తి అనందసముద్రమున మునిగియున్నవాడు.

పుట్టుకతో సామాన్యుడుగానుండి, సామాన్యముగానభివృద్ధి గాంచుచు, సప్తవ్యసనములలో బడి, వానికిబద్ధుడై, పాపకర్మలు చేయుచునుండి, అదృష్టవశాత్తున తనస్వంత ఆలోచనలవలననో, లేక యితరుల ప్రభావమువలననో, ఆచార్యుని వాత్సల్యముననో, సప్తవ్యసనములనుండి, అరిషడ్వర్గమునుండి విముక్తుడై, సంస్కరింప బడినవాడై సత్పురుషుడుగా మారినమానవుడు ముక్తుడు. పురాణమున వాల్మీకి సరియయిన ఉపమానమిందులకు.

కొందరు మానవాధములు సప్తవ్యసనములలోబడి, అరిషడ్వర్గ మునకు లొంగిపోయి, వానినుండి బయటపడలేక, పాపులుగానే కడపటివరకు జీవించువారు బద్ధులు. మహిరావణుడు తగిన ఉదాహరణము. మరణవేదనలోకూడా దైవస్మరణ చేయనన్నాడు.

నిత్యుడు ప్రహ్లాదునివలె నిత్యసంతోషిగానుండి జీవితమున దుః ఖ మనున దెరుగడు. ముక్తుడనువాడు ఆదిలో దుఃఖమున నున్నను సంస్కార ఫలితమున తరువాత సంతోషమున నుండును. బద్ధుడను వానికి జీవితమంతయు దుఃఖమయము. నిత్యులు, ముక్తులు, బద్ధులనువారు ఉత్తమ, మధ్యము అధములనబడువారు.

తత్త్వత్రయ సమ్మేళనమే జీవియొక్కయు అవతార (రూపము) విశేషముగాన, యేనూతన జీవియు తత్త్వత్రయమును బట్టి నూతన జీవికాదు. వస్తువొకటే; అది వేరువేరు రూపమున అవతరించును. ఇట్టి తత్త్వత్రయజ్ఞానము కేవలము శాస్త్రజ్ఞానము. అందువలన ప్రతి అణువును ఈశ్వరశక్తి సమ్మేళనమున పునర్జన్మ (వేరురూపము)ను పొందుతున్నట్లే. ఆళ్వారులు, "ఇదే వైకుంఠము; యిదే పరమపదము. పరమపదమును పొంది నిత్యానందమున నుండుడు", అని ప్రబోధించి యున్నారు.

పరమపదమునకు మార్గము స్వార్థరాహిత్యమయిన ప్రపత్తి మార్గము. ప్రపత్తి నిర్దుష్టమయిన ఋజుమార్గము. ఇది యేదో ఒక మూర్తికి ప్రపత్తిగాదు. విశ్వమునకే ప్రపత్తి; అనగా ఈశ్వరశక్తి లోనగల ప్రతిజీవితిక ప్రపత్తి. ఇదియే సేవాభావము కూడాను. ఇదిలోక కల్యాణ మార్గము ఈ మార్గముననున్నవాడు విశ్వమానవ సౌభ్రాత్రమును బొందియుండును. ఇతనికి జాతి, కుల, మత, వర్గ భాష భేదములు లేవు. రామానుజుని మార్గము (రామానుజునిమతము) అట్టిది.

ఇట్టి సత్యమార్గమును మోక్షమార్గముగా గమనించిన మహనీయుడు రామానుజుడు.

ఇట్టి సత్యమార్గము తనకు లభ్యమగుట తిరుక్కచ్చినంబి యనుగ్రహమని తలచిన రామానుజుడు ఈ విషయమును కృతజ్ఞతా పూర్వకముగా నంబిగారికి విన్నవించి, వారి ఆశీర్వాదములు పొందెను. మరునాడు తన ప్రథమ అధ్యాత్మికాచార్యుడగు నంబిగారికి షోడశోప చారముల గావించి, పూజింపనాకాంక్ష వెల్లడించి, వారియంగీ కారమును పొంది, యింటికి పోయెను.

ఒకనాడు రామానుజుడు పెరియనంబి సదనమునకుజని, నంబియు వారి ధర్మపత్నియు ఇంట లేరని తెలిసికొని, ఆశాభంగమున యిరుగు పొరుగు వారిని విచారించెను. ఆనాటి ఉదయము మంచినీటి బావివద్ద పెరియనంబి భార్యకును, రామానుజుని భార్య రక్షకాంబకును

వాగ్వాదము జరిగినట్లు రామానుజుని యెరుకకు వచ్చినది. బాగుగా విచారించిచూడ అయ్యుదంతము ఈ క్రింది విధమున జరిగినట్లు వివరములు వచ్చినవి:

ఆనాటియుదయమున రామానుజుని భార్య తంజమ్మ మంచినీటికని బావికిపోయెను. అచ్చటికి వచ్చిన యితర స్త్రీలలో పెరియనంబిగారి భార్యయు నుండెను. తంజమ్మ స్నానముచేసి, తడిబట్ట గట్టుకొని, బిందెతో నీటిని తీసికొని బయలుదేరునపుడు, కొంచెను దూరమున పెరియనంబిగారి భార్య గుడ్డను విదిలింపగా నొకిటి రెండు నీటిచుక్కలు తంజమ్మపై పడ్డట్లు తంజమ్మ గమనించెను. అంతటితో నామె కోపావేశమున బిందెలోని నీరు క్రుమ్మరించి, గొంతెత్తి, "యేమి యీ అపరాధము! ఏమి యీ మర్యాద! యీ నిర్లక్ష్యము! నీచేతినీటిబొట్టు నాపైపడినది; నేను మైలపడ్డాను. మరలా యిక స్నానముజేసి, నీటిబిందెను ఇంటికి తీసికొని పోవలసిన స్థితిని కలుగజేసినావు. ఒకవేళ నాభర్త నీభర్తను గౌరవించిన మాత్రమున యిట్లు ప్రవర్తించెదవా? అసలు తప్పంతయు మా ఆయనదే! ఇట్లు నెత్తికెక్కించుకొనుట వలనగదా నీవిట్లు ప్రవర్తించితివి?", అని అనర్గళముగా ధారా పాతముగా తంజమ్మ ఆమెను తిట్టెను. తంజమ్మకు తోడైన కొందరు మూర్ఖబ్రాహ్మణ స్త్రీలు సంతసించుచూ చూచుచుండిరి. పెరియనంబి భార్య చిన్నవోయి, మెల్లగా అన్నిమాటలు విని, కడపట వినయమొప్ప, "అమ్మా, తంజమ్మ గారూ, పొరపాటు; క్షమింపుము! కావలయునని నేను నావస్త్రమును నీ సమీపమున విదలించలేదు. పోనిమ్ము", అని పల్కెను. కాని తంజమ్మకు నోటికడ్డులేదు. ఆమె అట్లనే మాటాడుచూ, మరలా స్నానమున కుపక్రమించుచుండెను. ఈలోన పెరియనంబి భార్య యిల్లుజేరి, జరిగిన వృత్తాంతమును భర్తచెవిలో వేసెను. రామానుజుని తత్త్వమెరిగిన నంబి చాలబాధపడెను. రామానుజుడీ విషయమును తెలిసికొని యెంత పరితాపపడునో అని ఆలోచింపదొడగెను. తాను అచట నుండుట రామానుజుని గృహస్థ జీవితమునకు ఎక్కువ యిబ్బందులు కలుగజేసినవాడ నగుదు

నేమోయని తలపోసెను. కొంతకాలము తన భార్యను దూరముగ నుంచిన, జరిగిన సంఘటనను ఇరువురు స్త్రీలు విస్మరించెదరని తలచెను. మరునాటికి ఉద్దేశింపబడిన శ్రీరంగపురి ప్రయాణమును అనాటికే నిర్ణయించుకొని, పెరియనంబి పత్నీసమేతముగా వేవేగ బయలుదేరి పోయెను.

ఈ విషయమును వినిన రామానుజుడు ఎంతయో బాధపడెను. మూలిగే నక్కనెత్తిపై తాడిపండు పడినట్లయినది. తంజమ్మగావించిన అపచార పరంపరలో రామానుజుడు సహింపలేకపోయిన వానిలో యిది నాల్గవది. చతుర్థ ఆశ్రమమునకు, అనగా సన్యాసాశ్రమమునకు, రామానుజుని పురికొల్పి, తరిమినది యిది. తక్కినమూడు అపచారములు ఇంతకుపూర్వమే జరిగిపోవుట పాఠకులకు విదితమే. తిరుక్కచ్చినంబిని సాపాటుకు పిలిచిన సందర్భమును, ఒకానొక శ్రీ వైష్ణవునకు భోజనముపెట్టమన్నపుడు తంజమ్మ లేదనిచెప్పిన సందర్భమును, పెరియనంబికి రామానుజుడు భోజన నివాసవసతులు ఏర్పరచు సందర్భమున తంజమ్మ చూపుచున్న అనాదరణ, యీసడింపు చేష్టలు అనునవి తంజమ్మ యింతకుపూర్వము చేసిన అపరాధములు; అవి రామానుజుని లలితమైన మనస్సును గాఢముగా నొప్పించి యుండినవి.

ఇదివరలో జరిగిన యీ అపచారత్రయమును స్మరణకు దెచ్చుకొనుచూ, రామానుజుడీనాడు జరిగిన సంఘటనకు కలవరపడి, యింటికివచ్చి, భార్యతో, "ఆసాధ్వికి అనవసరముగా అపచార మొనరించితివే", అని రామానుజుడనెను. తోకత్రొక్కబడిన నాగవనిత వోలె తంజమ్మ మహాకోపమున బుసకొట్టుచూ, "ఎవరాసాధ్వి? ఆమె సాధ్వియా! నేనపచారము జేసితినా? యేమంటిరి? అమర్యాదగా ప్రవర్తించి, తనమగనిచే చీవాట్లు పెట్టింపవలసిన దానికి బదులు నన్నాపేక్షించుచున్నారా? చాల బాగున్నది! మీరు వారినిట్లు శిరముపై దాల్చుకొనుట వెఱ్ఱిగా నున్నది!" అని పల్కెను.

శాంతస్వభావుడయిన రామానుజుడు ఇంటి పెరటి అరుగుపై అట్లే నిశ్శబ్దముగా కూర్చొని ఆలోచింపసాగెను. "నాభార్య అజన్మ మూర్ఖురాలు - పాపము! బొగ్గుపాలగడుగ పోవునా నల్లదనము! ఆమెతన అజ్ఞానమున, మూఢవిశ్వాసములయందు మ్రగ్గవలసినదే. బద్ధులతెగకు జెందిన వ్యక్తి! ఈమెతో నాగృహస్థాశ్రమ జీవితము వ్యర్థమగును. అతిథి సత్కారమునకుగాని గృహమేల? గృహిణియేల? నాకార్యములకు, నేజేసిన ప్రతిజ్ఞలకు యీామె సహవాసము నాకు ప్రతిబంధకమే యగును. యామునాచార్యుల దివ్యాజ్ఞానుసారము నేను మఠాధిపత్యము స్వీకరించుటెట్లు? శిష్యకోటితో మెలగవలయును గదా? దేశాటనము గావింపవలయునుగదా? ప్రపంచ జ్ఞాన మెరగని యీామె సహవాసమున ఆ దివ్యకార్యము జరుగునా? నాకు ఈమె తోడుగా నుండునా? యిది జరుగదు! అసలు ఆమెకు స్త్రీకి సహజముగా నుండవలసిన లక్షణములే లేవుకదా! మడిగుడ్డకు అంకితురాలయిన అభాగ్యురాలు! పాపము! నావలన ఆమెకు సుఖము లేదు; ఆమెవలన నాకును సుఖము లేదు. ఆమెకు కావలసినది మడిపేలిక; వయస్సు వచ్చుకొలది కూడా యీామె యింత మూర్ఖురాలుగా నుంటుందని తెలియనిది కాదు. వారే పలుమార్లు నాదీనస్థితికి సానుభూతి తెల్పియున్నారు గదా! ఈమెను త్యజించుట ఉచితమా అను ప్రశ్న యొకటియున్నది. అగ్నిసాక్షిగా వనితను స్వీకరించి, ఆమె నేలుకొందునని ప్రమాణము జేసిన గృహస్థుడు ఏనాడు భార్యను వదలి సన్యసించినను, తాను ఇదివరలో జేసిన ప్రతిజ్ఞను భంగపరచినవాడే యగును. కాని నాపరిస్థితి అట్లుగాదు. నేను సన్న్యసించిన, నా వియోగమును తలచు జ్ఞానమును ఆమెకు కలుగదు. నన్ను సక్రమముగా అర్థము చేసికొని, నాయెడ సానుభూతి ప్రకటించు మా మామగారును, బావలును ఆమెను పోషింపగలరు. ఆమె కవసరమయినవి క్షుద్బాధకు ఆహారము, పవిత్రతకు మడిగుడ్డ! ఈ రెండు మినహా కాంక్షించునది మరియేమియు లేదు. కావున నేను ఆమెను త్యజించుటలో బాధ్యతారహితముగా ప్రవర్తించుట యనునది

లేదు. గృహస్థాశ్రమము ఫలముల నివ్వని చెట్టు అయినది నాపాలిటకు", అని పరిపరి విధముల నాలోచించుచు రామానుజుడట్లే కూర్చొనియుండెను.

ఈలోపల రక్షకాంబ తల్లిగారి గ్రామమునుండి బ్రాహ్మణ బంధువొకడు అరుదెంచి, "తంజమ్మా, మీ చెల్లెలి వివాహము నిశ్చయింప బడినది. ఇది మొదలు పంద్రెండవ దినము వివాహ దినముగా నిర్ణయింపబడినది. నిన్నును, నీభర్తను ముందుగా తీసుకొని రావలసినదని నన్ను పంపిరి", అని తెల్పెను. రక్షకాంబ అమితోత్సాహమున ఆనాడు జరిగిపోయినదంతయు మరచి, రామానుజుడాలోచనా నిమగ్నుడై కూర్చొని యున్నాడని గమనింపకయే రామానుజుని సమీపించి, "మనమిరువురము, వివాహమునకు ముందుగా పోవలసియున్నది. గుడ్డలను సర్ది పెట్టెలో పెట్టితిని. కానిండు - ప్రయాణమునకు సిద్ధము కండు", అని చెప్పెను.

ఆమె మతిలేని తనమునకు రామానుజుడెంతయో సానుభూతితో చింతించెను. వచ్చిన బంధువును బిలిచి, "ఆర్యా! ఆమె నిపుడే తోడ్కొని పోవచ్చును. నేనిపుడు రాజాలను", అని రామానుజు డనెను రక్షకాంబ పయనమై తల్లిగారి యిల్లుచేరెను.

ఇక రక్షకాంబ భర్త యింటికి రావడమనునది జరుగలేదు.

దిక్కుతోచని రామానుజుడు వరదరాజస్వామికి సాష్టాంగపడి, "స్వామీ, నాబంధములు తెగినవి. నేను విముక్తుడనయితిని. నేనెంత మాత్రమును, ఏ అంశముననను ఇక బద్ధుడనుగాను. మోక్షభావమును చేరుచున్నాను. ఈక్షణమునుండి నీవాడనయితిని. సర్వవ్యాపకుడ వయిన నీకు అంకితుడనయిన నేను లోకకల్యాణార్థము సేవజేయు వాడనయితిని. నన్ను శిష్యునిగా స్వీకరింపుము; ఆశీర్వదింపుము", అని ప్రార్థించెను. రామానుజుని విష్ణుసంశ్లేషణభావ మట్టిది.

రామానుజుని ప్రార్థనను అంగీకరించిన వరదరాజస్వామి "త్రిదండ ముపవీతంచ వాసః కౌపీన వేష్టకమ్, శిక్యం కవచమేతద్ధి

భృయాదావదాయుషమ్" అను రీతిలో త్రిదండ కాషాయములను ధరింపుము అనుచు అర్చకముఖమున వానిని ప్రసాదించి "రామానుజముని" అను నామమును పెట్టెను.

త్రిదండధారియై రామానుజుడు వరదరాజస్వామి ముందు నిలిచి, "స్వామీ, త్రికరణశుద్ధిగా త్రికరణముల జయించెదనన్న పూనికతో ఈ త్రిదండమును ధరించితిని. సన్న్యాసమును స్వీకరించితిని. స్వార్థ రహితుడనైన నన్ను లోక సంగ్రహము కొరకు వినియోగించు కొనుము - లోకసంగ్రహము, లోకకల్యాణము, లోకశాంతి నీ కార్యములు గదా! స్వామీ", అని ప్రార్థించెను.

రామానుజుడు సన్న్యసించిన కొలది కాలముననే భార్య తంజమ్మ విషజ్వరముచే అకాలమరణము జెందినదని కథ. ఈ వార్త నెవరు, ఏ సందర్భమున రామానుజునిచెవికి తేగలరు? లోకమే రామానుజునకు గృహమయినదికదా!

## 16. రామానుజుడు ఆచార్యుడగుట

రామానుజుడు శ్రీవరదరాజస్వామి ఆలయ సమీపమున శ్రీవైష్ణవ మఠము నొకదానిని స్థాపించి, అచటనే ధ్యాననిమగ్నుడై యుండెను. దీనికి రామానుజమఠమను తిరునామము ప్రసిద్ధమయ్యెను. నలువైపుల నుండి ప్రజలు తండోపతండములుగా వచ్చి, రామానుజుని దర్శించి పోవుచుండిరి. ఉత్సాహపరులును, యువకులయినవారును, భక్తియోగముచే ఆకర్షింపబడినవారును, అయినట్టి కొంతమంది శిష్యులు రామానుజునిచే స్వీకరింపబడిరి. అట్టివారిలో ప్రథముడు తన మేనమామ కుమారుడు దాశరథి అనువాడు. ఇతనికి ముదలియాండన్ అను తిరునామము ఒప్పియున్నది. ఇతడు ఏకసంథాగ్రాహి. చిరుతనముననే వేదవేదాంతముల వశపరచుకొనెను. రామానుజునకు శిష్యుడై రామానుజు డెచటికేగినను నీడవలె వెంబడించువాడు.

కూరేశుడు 'కూర్' అను అగ్రహారమునకు అధిపతి, గొప్ప సంపన్నుడు, వితరణశీలి. అతని భార్య అండాళమ్మ భర్తకు తగిన సాధ్వి. రామానుజుడు సన్న్యసించి, కంచిలో నివసించుచుండుటను, అతని జ్ఞాన భక్తి వైరాగ్యములను వినిన కూరేశుడు రామానుజుని ఆశ్రయింపగోరి సతీసమేతముగా కంచిని చేరి, తమకు పంచసంస్కారములను అనుగ్రహించి శిష్యులుగా అంగీకరింపుడని ప్రార్థించెను. రామానుజుడు వారి వినయవిధేయతలకు సంతసించి పంచసంస్కారములను చేసెను. ఈవిధముగా కూరేశుడు రామానుజునకు వేరొక అంతరంగిక శిష్యుడయ్యెను.

దాశరథియు, కూరేశుడును, రామానుజుని అనుక్షణము వెంబడించియుండిరి. ఇరువురును మహాపండితులు, మేధావులు, ఏక సంథాగ్రాహులు, జ్ఞానులు, భక్తులును.

వార్ధకముననున్న యాదవప్రకాశుడు రామానుజుని కీర్తిసంపదను గూర్చివిని, ఆశ్చర్యపడెను. రామానుజుని, విశిష్ట బోధనామృతమును

గూర్చి కూడా వినుచుండెను. యాదవప్రకాశకునకు తన అద్వైత తత్త్వభావము శాంతి ఆనందముల నొసంగ లేకపోయినది. జ్ఞాన ధ్యానముల కంటే కర్మఫలత్యాగము శ్రేష్ఠమయినదని ప్రవచించుచున్న రామానుజుని మతము ఇప్పుడు యాదవప్రకాశకునకు నచ్చినది. తన అద్వైత భావమున నతడు ఒంటరివాడయినట్లు భావించెను. వైష్ణవశక్తి తనలో నున్నను, అది విశిష్టముగా నున్నదని భావించిన భక్తుడే విష్ణు సంశ్లేష భావమున విశ్వమానవ సౌభ్రాత్రమున ఆనందము నొందగలడు. ఈ విషయ సత్యమును గమనించిన యాదవప్రకాశుడు రామానుజునకు శరణాగతుడగుటకు నిశ్చయించుకొనెను. కాని ఒక విధమయిన జంకు, సిగ్గులతో వెనుకాడుచుండెను.

యాదవప్రకాశుని తల్లి, శతవృద్ధ. ఆమెకూడా రామానుజుని ప్రభావమునబడి, అనుదినము రామానుజ మఠమునకువచ్చి, వారిని దర్శించి, వారి బోధనామృతమును గ్రోలుచుండెడిది. ఏకాంతమున మ్రగ్గుచున్న తనకుమారుడు యాదవప్రకాశుని రామానుజుని దర్శింపమని ఆమె ప్రేరేపించుచుండెడిది. కాని నేరస్థుడనని భావించిన యాదవప్రకాశునకు రామానుజుని దర్శించు ధైర్యము కలిసి సంభాషించు మమేకత లేకుండినవి. రామానుజుని తాను అనాదరించిన ఘటనలకు ఈనాడు యాదవప్రకాశుడు పశ్చాత్తాపపడుచున్నాడు.

"రామానుజుడు ఉపనిషద్వాక్యములకు సరియైన భాష్యములు చెప్పినందులకు నేను వానిని ద్వేషించితిని. విజ్ఞానుడైన శిష్యుని అభినందించి, ఆశీర్వదించవలసిన నేను, అతడు శిష్యుడుగా నున్నందులకు సగర్వపడవలసిన నేను, అతనిని శత్రుభావమున అనాదరించితిని. రాజకుమార్తె అతని ఆశీర్వాదబలమున స్వస్థత జెందగా అతనిని ద్వేషించితిని. ఆమె విశ్వాసమే ఆమెకు స్వస్థతను గల్గించెననియు, తనమంత్రబలమేమియు లేదనియు రామానుజుడు ఉన్నత సత్యమును వచింపగా నాతడు కపటియని నేను తలంచితిని. అతడు సగుణమును గూర్చి భాష్యము చెప్పుచుండగా, అతడు అద్వైతమునకు శత్రువని తలచి, అతనిని తుదముట్టింపవలయునని

ప్రయత్నించితిని; ఇట్టి ఘాతక చర్యలకు మానవాధములు గూడా జంకుదురు; కాని, గురువర్యుడుగా కీర్తిగాంచిన నేను హంతనగుటకు ప్రయత్నించితిని. ఇట్టి హత్యాప్రయత్నమునకు శిష్యులనే ప్రేరేపించిన నేను ఏమతమునకు సంబంధించినట్లు? రామానుజుడు నాయొక్క హత్యాప్రయత్నములనుండి తప్పించుకొనియును, నేను కాశీయాత్ర నుండి తిరిగివచ్చిన తరువాత అతడు యథారీతిగా భక్తిప్రేమలతో నన్ను సందర్శించెను. అతని ఔదార్యము, సహనము నేమని పొగడగలను? శఠారి కదా అతడు? ఇట్టిజ్ఞాన దీపకుడుగా ప్రవర్తించిన రామానుజుని ఆధ్యాత్మిక సత్యవివరణములను నేను గ్రహింపలేక మూఢమయి నట్టియు, గురుపరంపరగా పాటింపబడునట్టియు మూఢ భావములలో బడియుంటిని; ద్వేషమును వృద్ధిజేసికొంటిని. కడపట నాతనిని దూరము జేసితిని; తూలనాడితిని; దూషించితిని. ఇప్పుడు నేనున్న అంధకారము నాకు తెలియుచున్నది. రామానుజుడొకడే నాకు జ్ఞానజ్యోతి కాగలడు", అని యాదవప్రకాశుడు వాపోయెను.

ఇట్ల మనోవ్యాకులముతో నొకనాటి సాయంసమయమున వీధిని నడచుచు తిరుక్కచ్చినంబిని గాంచెను. తన ఆధ్యాత్మిక దీనావస్థను నంబికి ఇట్లు తెలియజేసెను. "నా మనస్సున ఒక అభిప్రాయమున్నది. మీరు ఈనాటి రాత్రి వరదరాజస్వామిని సేవించునపుడు దానిని గూర్చి స్వామి ఏమి తలచుచున్నాడో స్వామిని అడిగి తెలిసికొని, నాకు తెల్పుడు". ఆనాటి రాత్రి నమ్బి వరదరాజస్వామితో "స్వామీ! యాదవప్రకాశుని మనస్సున ఒక అభిప్రాయము కలదట. దానిని గూర్చి నిన్ను అడిగి తెలిసికొనమన్నాడు. నీఆజ్ఞ ఏమో తెల్పుము" అనెను. అంత స్వామి "ఓయీ! యాదవప్రకాశుడు రామానుజుని ఆశ్రయింప గోరినను మనస్సున ఇంకను సందేహపడుచున్నాడు. ఇక ఏమాత్రము సంశయింపక రామానుజుని ఆశ్రయింపుమని నా మాటగా పల్కుము" అని బదులిచ్చెను. తిరుక్కచ్చినమ్బి ఈ మాటను మరునాడు యాదవప్రకాశునకు తెలియజేసెను.

నంబిగారి సమాధానము యాదవప్రకాశునకు ధైర్యము గూర్చినది. రామానుజుని తత్త్వమును తానూహింపలేక పోలేదు. ప్రపంచ మేమనుకొనునో అను ఒక విధమైన భావము కూడా తన్నిట్లు వేధించి యుండనోపు. నంబిగారి వాక్కులు దైవాజ్ఞగా భావించిన యాదవప్రకాశుడు మరునాటి ఉదయమున రామానుజుని మఠము జేరి, రామానుజుని సమీపించి, రామానుజునకు శరణాగతి వెల్లడింప రామానుజుని పాదపద్మముల జేర ప్రయత్నించుతరి, రామానుజుడది గ్రహించినవాడై, తక్షణమే లేచి, యాదవప్రకాశుని భుజముల బట్టుకొని, గౌరవ పురస్సరముగా అలింగనము జేసికొని, వారినాసీనుల గావించి, ముకుళిత హస్తుడై నిలువబడెను. తరువాత యాదవప్రకాశునెదుట కూర్చొనగా, రామానుజుని గౌరవభావమునకు యాదవప్రకాశుడు అద్భుతపడెను.

యాదవప్రకాశుడు రామానుజుని ముఖారవిందము నట్లే తిలకించుచూ, ఆనంద భాష్పముల కార్చుచుండెను. "రామానుజా! నీ దర్శన భాగ్యమునకు పరమానంద భరితుడనయితిని. నాకొక్క అనుమానమున్నది. దానిని తీర్చుము. "ఏకమేవాద్వితీయమ్" అన్నపుడు "ఆ ఒక్కటి సగుణ బ్రహ్మమ"ని యెట్లు నిరూపింతువు? దయతో తెల్పుము. నీ భాష్యమును తెలిసికొనుటకు శరణాగతి భావమున అరుగుదెంచితిని", అని యాదవప్రకాశుడు పల్కెను.

అందులకు రామానుజుడు, "స్వామీ, ఇతడు కూరేశుడు. నా శిష్యరత్నము. మీ సందేహము నితడు తీర్చగలడు", అనెను.

కూరేశుడు వెంటనే అందుకొని, "ఆర్యా! పరబ్రహ్మము సగుణము. బ్రహ్మము సర్వవేది, సర్వశక్తియుతము'. అని ముండకోపనిషత్తు తెల్పుచున్నది. "అతడు సర్వశక్తియుతుడు; జ్ఞానము, బలము, కార్యము వాని సహజ లక్షణములు" అని శ్వేతాశ్వతరోపనిషత్తు వెల్లడించు చున్నది. ఇట్లు పరబ్రహ్మము సగుణమని నిరూపించుచూ కూరేశుడు ప్రస్థానత్రయము నుండి అనేక ఆధార శ్లోకముల వల్లించెను.

కడకు యాదవప్రకాశుడు సందేహరహితుడాయెను. సగుణ బ్రహ్మను అరాధించుటలోనే మానవుడు ఆనందమయుడు కాగలడని యాదవప్రకాశుడు గమనించెను.

"ఇది సత్యము; బ్రహ్మము సగుణము - రామానుజా! నీవు వాస్తవముగా లక్ష్మణునివి. శ్రీరాముని సోదరాంశమవు. సేవా తత్పరుడవు. కర్మ సన్న్యాస సిద్ధాంతమును తెగనరికి, కర్మఫల సన్న్యాస సిద్ధాంతమును ప్రకటించి, మానవుల నుద్ధరించుటకు అవతరించిన సేవాతత్పరుడవయిన లక్ష్మణునివి", అని ఆశీర్వదించుచు యాదవప్రకాశుడు ఆనంద పరవశత్వమున గగుర్పాటు జెందెను.

రామానుజునకు, రామానుజ సిద్ధాంతమునకు (రామానుజ మతమునకు) ప్రపన్నుడయిన యాదవప్రకాశుడు తన నిర్ణయమును రామానుజునకు ఈ శ్లోకము ద్వారా వెల్లడించెను:

శ్లో॥ నధర్మ నిష్ఠోస్మి - న చాత్మ వేదీ
నభక్తిమాన్ - త్వచ్చరణారవిందే
అకించనో౽న్యగతిః శరణ్య
తత్పాదమూలం శరణం ప్రపద్యే

తాత్పర్యము: నాకు వేరు ధర్మము, వేరు నిష్ఠలు లేవు. నేను ఇక వేరుగా తెలిసికొనదగినది లేదు. నీపాదపద్మములపై దప్ప ఇతరముపై నాకు భక్తి లేదు. అన్యమత శరణ్యము కొంచెమేని నాకు వలదు. తత్త్వాది మూలమయిన నీపాదారవిందములకు శరణుజొచ్చు చున్నాను.

రామానుజుడు పులకాంకిత శరీరుడై, యాదవప్రకాశుని ప్రేమతో ఆలింగనము జేసికొనెను.

యాదవప్రకాశుడు అది మొదలు "గోవిందదాసు" అను తిరునామమున ఒప్పియుండెను.

యాదవప్రకాశుడు రామానుజుని జేరుట, తన సందేహముల దీర్చుకొనుట, రామానుజునకు శరణాగతుడగుట - యీ వార్త నలుమూలల వ్యాపించుటతో రామానుజుని ప్రతిభ నెల్లవారు తెలిసికొనిరి. ఆనాటి పండితులకు, భక్తులకు ఈ విషయము అనుదిన సంభాషణా విషయమాయెను. అద్వితీయపండితుడును, సాటిలేని అద్వైత సిద్ధాంత వేదాంతియు, రామానుజునకే గురువర్యులయిన యాదవప్రకాశులు రామానుజునకే ప్రపత్తుడగుట సామాన్య విషయము కాదుగదా! బ్రహ్మము నిర్గుణము, సర్వం మిధ్య అనుభావముల వెల్లడించు అద్వైత సిద్ధాంత మహావృక్షము యొక్క క్రుంకుటేరు తెగిపోయినట్లయినది. అద్వైత సిద్ధాంత మాయావాద భవనము కంపింపదొడగినది. ప్రస్థాన త్రయము ప్రమాణమయినను సక్రమముగా భావన చేయనందున నిర్గణ సిద్ధాంతము లేవనెత్త బడెను. ఇప్పుడది నిలువలేకయున్నది. ఇదియే రామానుజుని ప్రతిభ. ఈ రామానుజుని ప్రతిభనే యాదవప్రకాశుడు ప్రారంభమున యూహించి ఉండెను. యాదవప్రకాశుని ఊహ (రామానుజుడు అద్వైత సిద్ధాంత వృక్షమునకు గొడ్డలిపెట్టు కాగలడను ఊహ) యిప్పుడు నిజమయినది. అతని ద్వేష పూరితమయిన ఊహ సత్యముగా మారినది. ఆయనగూడా తన మాయావాద సిద్ధాంతమును వీడి రామానుజుని సగుణ సిద్ధాంతమున కంకితుడాయెను! గురువు శిష్యుడాయె, శిష్యుడు గురుడాయె! రామానుజుని ప్రతిభ అట్టిది. విద్యాకోవిదుడు దాశరథి, ఏకసంథాగ్రాహి కూరేశుడు, గురువర్యుడు యాదవప్రకాశుడు - అట్టివారు రామానుజునకు శరణాగతులయినారంటే యిక వారి శిష్యగణ మెంతఘనముగా అభివృద్ధి జెందెనో ఊహింపదగియున్నది.

## 17. శ్రీరంగపురవాసము - తిరుమంత్రోపదేశము

తిరుక్కచ్చినంబి రామానుజునకిట్లు చెప్పదొడగెను - "రామానుజా! శ్రీరంగమున యామునాచార్య శిష్యవర్గము, మఠవానులు, భగవద్భక్తులు నీకొరకై యెదురు చూచుచున్నారు. నీవు యామునాచార్యుల వారికిచ్చిన ప్రతిజ్ఞాత్రయమును వారెల్లరు ఎరుగుదురు కదా! నీవు శ్రీరంగమున వైష్ణవ పీఠమునలంకరింప వలయునని వారెల్లరు కోరుచున్నారు. నీవు యతిరాజువగుట వారికెంతో నంతోషకరముగాను, ఆశాజనకముగాను, ఉన్నది. పెరియనంబి నీరాకకై ప్రత్యేకముగా ఎదురు చూచుచుండును. రామానుజుడు కాంచీవరదుని యాజ్ఞలేనిది కంచివదలడని నేను వారికి తెల్పి యున్నాను. నిన్ను శ్రీరంగమునకు తోడ్కొని పోవుటకై యామునాచార్య శిష్యరత్నము వరరంగముని (తిరువరంగ పెరుమాళ్ రాయర్‌ను) ఇచటికి పంపియున్నారు. ఆయన నిన్నటి రాత్రి కంచి చేరినారు. బహుశః ఈనాడు నిన్నతడు కలియగలడని నేను భావించుచున్నాను. లోకకల్యాణార్థమై నీవు శీఘ్రముగా శ్రీరంగమును జేరి వైష్ణవ మఠాధిపత్యమును వహింతువుగాక!" అని తిరుక్కచ్చినంబి రామానుజుని ఆశీర్వదించెను.

మరునాడు మధ్యాహ్నకాలమున వాడుకగా, శిష్యజన, భక్తజన పరివృతుడై రామానుజుడు తత్త్వోపన్యాసము జేయుటకు వరదరాజ స్వామిదేవాలయమును ప్రవేశించెను. స్వామికెదురుగా అనేక భక్తులు ఆసీనులైయుండిరి. వారిలో వరరంగముని కూడా యుండెను. రామానుజుడు ఆసీనుడై, యిక ఉపన్యాసమును ప్రారంభింప బోవునరికి, వరరంగమునివచ్చి, పరిచయవాక్కులు బల్కెను. యామునాచార్యుని శిష్యుడుగాన, రామానుజుడాతనికి నమస్కృతుడై, తనభక్తి వినయ నిరాడంబరముల వ్యక్తముజేసెను. ప్రారంభమున ఆచార యుక్తముగా జరుగవలసిన కార్యక్రమమును వరరంగముని ప్రారంభించెను. వరరంగముని భక్తుడు, పండితుడేగాక, గొప్ప నంగీత

పాఠకుడు; మనోహరగాన కౌశలముగలవాడు; దివ్య ప్రబంధము నుండి పాశురముల గానము చేయదొడగెను.

సువర్ణమునకు సువాసన అబ్బినట్లు దివ్యార్థములతో నిండియుండు పాశురముల వారి శ్రావ్య కంఠస్వరమున ప్రేక్షకులను ఆనంద పరవశులను గావించినవి. రామానుజుడు పరమానందమున ఆకర్ణించుచుండెను. తాను వరదరాజస్వామిని అవలోకించుచు ప్రార్థన పాశురముల పాడుచుండగా, స్వామివారు, "నీవు కృతార్థుడవు. రామానుజుని తోడ్కొనిపొమ్ము", అని పలికినట్లు వరరంగముని స్వామితో సంశ్లేషపడెను. రామానుజుడును పాశురగానము వినుచూ, స్వామి ముఖారవిందమును తిలకించుచుండ, "యతిరాజా! నీవెక్కడ నున్నను నావాడవే! యామునాచార్యున కొసగిన ప్రతిజ్ఞ త్రయమును దీర్చుటకు నీవు ఇక శ్రీరంగము పోవలసినదే", అని స్వామి పలికినట్లు భక్తుడయిన రామానుజుడు సంశ్లేషపడెను.

వరరంగమునితో కలిసి రామానుజుడు తన ముఖ్యశిష్యులతో గూడి శ్రీరంగమునకు బయలుదేరుచున్నాడని తెలిసి కాంచీపుర భక్తులెల్లరు, "యతిరాజు వర్ధిలుగాక! యతిరాజ సందేశము ప్రపంచమున వ్యాపించుగాక!" అని జయజయ నాదములు జేసిరి.

శ్రీమద్రామానుజుడిట్లు వరదుని యాజ్ఞానుసారము, తిరుక్కచ్చి నంబి మంగళాశాసనముతో, దాశరథి కూరేశాది శిష్యరత్నములతో శ్రీరంగము జేరెను.

యతిరాజును ఆహ్వానించుటకు శ్రీరంగమున వైష్ణవభక్తులు ఘనమైన సన్నాహముల గావించిరి. రామానుజాగమనము ఒక పర్వదినముగా పరిగణింపబడెను. వేదమంత్రోచ్చారణలతో, దివ్య ప్రబంధ పాశురపఠనముతో, భక్తులు రామానుజుని శ్రీరంగనాథుని దేవాలయములోనికి తోడ్కొని పోయిరి. రామానుజుడు విశ్వప్రతిబింబమైన రంగనాథ విగ్రహమును దర్శించి, ఆళ్వారాదులచే రచింపబడి ద్రావిడ దివ్య ప్రబంధమున చేర్చబడిన శ్రీరంగనాథ స్తోత్ర

శ్లోకముల అనర్గళముగా గంభీరకంఠస్వరమున గానము చేయదొడగెను. విష్ణు సంశ్లేషభావముననున్న రామానుజునకు జగజ్జనకుడు మంగళా శాసనముగావించునట్లును, తన స్తోత్రమును స్వీకరించుచున్నట్లును కన్పడెను. తన్ను వైష్ణవకులపతిగా స్వీకరించిన ఆళవందారు గగనమునుండి తన్ను ఆశీర్వదించు చున్నట్లు రామానుజుడు భావించి ఉత్సాహపడెను. తాను యామునాచార్యునకు గావించిన ప్రతిజ్ఞత్రయమును భావించి ఉత్సాహపడెను. తాను యామునాచార్యునకు గావించిన ప్రతిజ్ఞ త్రయమును స్మరణకు దెచ్చుకొని, మరల ఈ భగవత్సన్నిధానమున త్రికరణశుద్ధిగా అంకితుడాయెను. తాను ఆళవందారుకు వారసుడగుట తన అదృష్టము, భగవత్కటాక్షమని ఆనందమున సంతృప్తినందెను. తన జీవితము ఫలప్రదమార్గమున బడుటకు తనకృతజ్ఞతను ఆలవందారుకు మానసికముగా వ్యక్తము జేసికొనెను. శ్రీరంగనాథుని దర్శించి, సేవించి, స్తోత్రముజేసిన ఆళ్వారాచార్యులనందరిని రంగనాథునిదివ్యవిగ్రహమున నున్నట్లు గాంచెను. భగవద్విగ్రహము భక్తులయొక్క సేవలవలన విశిష్టత జెందునుగదా! శ్రీరంగనాథునితో తన పితామహుడు దాచిన దివ్య నిక్షేపమును యామునాచార్యులు దర్శించిన విధమున, యామునాచార్యులు రంగనాథ కమలాక్షము లందు గాంచిన సత్య సౌందర్య సుగుణములతో గూడిన త్రిభువన సుందరుని రామానుజుడు చూడగలిగెను. మూల విరాట్ దర్శనా నంతరము రామానుజుడొక్కసారి ఆలయసప్త ప్రాకారములను, గోపురములను, వివిధదేవాలయములను తిలకించుచు, శ్రీతిరుమంగై యాళ్వారు అరువది సంవత్సరముల శ్రమించి, నిర్మింపించిన దేవాలయ నిర్మాణములను ప్రశంసించెను. తాను దేవాలయావరణము నందు తిరుగుచూ, సర్వ విషయములను తిలకించుచూ, శ్రీతిరుమంగై యాళ్వార్ల విరచితమగు "వాడినేఁవాడి"ని (తిరుమంత్ర వైభవమును) పఠించుచుండ, భక్తులు ముగ్ధులయిరి. అంతకుముందు మూలవిరాట్ దర్శనమపుడుకూడా తిరుప్పాణ్ ఆళ్వార్ల విరచితమగు "అమలనాది

పిరా౯" అను దివ్యప్రబంధమును (శ్రీరంగనాథుని పాదాదికేశాన్తాను భవము) పఠించినపుడు భక్తులెల్లరు తన్మయులైరి.

యామునాచార్యవారి శిష్యరత్నగణము, భక్తకోటి, ఏకగ్రీవముగా ప్రథమమున శ్రీరంగదేవాలయ పాలనను, సేవా కార్యక్రమమును క్రమబద్ధముచేయ శ్రమించ వలసినదని శ్రీరామానుజుని కోరిరి. ప్రబోధకుడు ముందు సేవకుడుగా నుండవలయును గదా! కావున రామానుజుడు దైవసేవయందు ప్రథమమున ఉత్తీర్ణతను జూపదలచెను. అనతికాలమున దానిని నిరూపించుకొనెను.

దేవాలయ పరిపాలనాంగములనెల్ల క్రమబద్ధముజేసి, వారివారి విధి నిర్ణయములను గావించెను. దైవకైంకర్యపరంపర నిత్యము జరుగవలసిన విధానమును నిర్ణయించెను. ఇందు సంస్కృత వేదములకును, ద్రావిడ వేదమునకును (ద్రావిడ దివ్య ప్రబంధమునకును) సమాన ప్రాధాన్యమును వెలయింపజేసినాడు. అర్చనారాధన క్రమమందు కఠిన క్రమశిక్షణను ప్రవేశపెట్టెను. మత విశిష్టత సామాన్యప్రజలను చేరుటకు హరికథా కాలక్షేపములను, భాగవత నాటక ప్రదర్శనములను, ఏర్పాటుగావించెను. అంతకు పూర్వము దేవాలయమున ఎల్లపుడు వేదపఠనము, ఆధ్యాత్మిక చర్చలే జరుగుచుండి నందున, అవియొక విధమైన యాంత్రిక దినచర్యలుగా నుండినవి. ఇప్పుడిట్లుగాక, ప్రజలు, భక్తులు ఉత్తేజితులగుటకు దేవాలయమున వివిధములగు ఉత్సవసేవలను రామానుజుడు ఏర్పాటు జేసెను.

ఇంతకుపూర్వము ఏ భక్తులో, ఏ దూరదేశయాత్రికులో యాంత్రికముగా దేవాలయ దర్శనము జేసికొని ముడుపులను చెల్లించి పోవువారు. ఇప్పుడన్ననో అట్లుకాదు. భక్తులకు తాత్త్వికులకేగాక, సర్వజనులకు పిల్లలకు సైతము దేవాలయములో జరుగు అఖండ కార్యక్రమములవలన దేవాలయము ఒక ప్రార్థనాలయముగాను, పూజాలయముగాను, వినోద విజ్ఞాన వేదికగాను మారి దినములోని

యిరువది నాల్గుఘంటలకాలము దేవతార్చన సేవాపరంపరలతో కళకళలాడు చుండినది. భక్తులయొక్క నవదివ్యమార్గములకు, అనగా తనుహృద్భాషల నఖ్యమున్, శ్రవణమున్, దానత్వమున్, వందనార్చనముల్, సేవయు, ఆత్మలో నెరుకయున్, సంకీర్తనల్, చింతనంబను ఈ తొమ్మిది భక్తిమార్గములకు - శ్రీరంగనాథాలయము నెలవైనది. శ్రీరామానుజ ప్రతిభా విశేషములవలన వైష్ణవమతము గొప్ప భక్తి విజ్ఞాన సేవాసంస్కరణ ఉద్యమముగా రూపొందినది.

దేవాలయ పాలన విషయమును పర్యవేక్షించుచునే, యామునాచార్యుల వారికి తానిచ్చిన వాగ్దాన త్రయ నిర్వహణకు కావలసిన ఆధ్యాత్మిక వస్తుసేకరణకు పూనుకొనెను. ఒక విధముగా రామానుజుడు తన దివ్యమార్గమున అహర్నిశలు పనిచేయుచున్నట్లే కన్పడువాడు.

శ్రీరంగమున రామానుజుడు మహాపూర్ణునకు (పెరియనంబికి) ప్రణమిల్లి, "స్వామీ! మీరు నాకిది వరలో ద్రావిడ దివ్యప్రబంధమును (నాలాయిరమును) బోధించియున్నారు. నేను ప్రస్థానత్రయమునకు భాష్యము రచింపవలసియున్నది కదా! కావున తమరు కరుణించి గీతార్థ సంగ్రహమును, సిద్ధిత్రయమును, బ్రహ్మసూత్రములను, న్యాసతత్త్వమును, పాంచరాత్రాగమమును, యామునాచార్యులు గ్రహించి బోధించిన విధమున నాకు తెలియజేయుడు", అని ప్రార్థించెను.

"రామానుజా! యామునాచార్యులవారి ఆదేశానుసారము సర్వవిజ్ఞానము నీకందజేయబడును. ఇందులకై ఆళవందారే ఉచిత వితరణ విధానముల నేర్పరచి పోయిరి. వారి శిష్యులలో, నాతో కలిపి, నలువుర పిలిచి, మాలో ఎవ్వరు ఏ విషయమును నీకు అందజేయ వలయునో నిర్ణయించి పోయిరి. ఈ నల్వురి వద్ద యామునాచార్య సుధాంబోధియున్నది. నాల్గుతట్లు నాల్గు పార్లు కట్టల వలె నుండి వారి దివ్యజ్ఞానమును గుప్తపరచియున్నాము. నీవు స్వీకరించుటయే

తడవు. జ్ఞానద్వారములు తెరిచియున్నవి. ఈ జ్ఞానార్జనము తరువాత యామునాచార్యుని వారసుడివిగా వైష్ణవ మఠాధిపత్యమును స్వీకరింపవలసి యున్నది. ఇప్పటికే నీవు అపార జ్ఞానమును వేద, ఉపనిషత్, బ్రహ్మసూత్రములందు పొందియున్నావని మాకందరికిని తెలుసును. ఇప్పటికే నీ వితరణపాలనా శక్తివలన శ్రీరంగనాథ దేవాలయ కార్యక్రమము మిక్కిలి సున్నితముగాను, వైభవోపేతము గాను, జరుగుచున్నదని దేశములోని భక్తులెల్లరు గమనించి యున్నారు. యాత్రికులు, పురవాసులు తండోపతండములుగా ఇంతకుపూర్వము కంటే వెయ్యిరెట్లు ఆలయ దర్శనము చేయుచున్నారని సర్వులు గమనించిన విషయమే. నీయాధిక్యమును, సర్వులును గమనింప గలిగిరి. నిన్ను వారసుడుగా సూచించిన ఆళవందారు యొక్క దివ్యదృష్టిని, దూరదృష్టిని ఎల్లరు ప్రశంసించుచున్నారు.

రామానుజుడు యామునాచార్య సుధాంభోదిని ప్రవేశించు చున్నాడు.

1) రామానుజుడు ఆళవందారు గావించిన వాఙ్మాలము ప్రకారము మహాపూర్ణునియొద్ద న్యాసతత్త్వాది శాస్త్రములను గ్రహించెను. ఏక సంథాగ్రాహియు, సూక్ష్మగ్రాహియు, మేధావియు, వినయ సంపన్నుడును అగు రామానుజుడు అతనికాలమున పెరియనంబి వద్ద గ్రహింపవలసిన విషయముల నన్నింటిని బడసెను.

2) తరువాత ఆళవందారు శిష్యులలో నొకరగు మాలాధరుని యొద్ద నమ్మాళ్వారు విరచితమగు శఠారి సూక్తమును (శఠకోప వాఙ్మయము - నమ్మాళ్వార్ల తిరువాయ్‌మొళి) పఠింప నారంభించెను. ఈవాఙ్మ యములోని ప్రతిపాశురమును, తాను యామునాచార్యుని యెద్ద నేర్చుకొనిన విధమున మాలాధరుడు రామానుజునకు బోధింప దొడగెను. మాలాధరుడిచ్చు భావములను మించి వినూత్న సత్యభావముల కొన్నింటిని రామానుజుడు వెల్లడించువాడు. ఇది మాలాధరునకు కొంత నిరుత్సాహమును, కలిగించినది. రామానుజుడు

ఆళవందారు కంటె మిన్ననని భావించు చున్నాడేమోనని మాలాధరుడు బేధాభిప్రాయపడెను. తాత్కాలికముగా విద్యాబోధనను నిలిపెను. వినయ సంపన్నుడయిన రామానుజుడు ఆళ్వారుల మార్గము ననుసరించువాడు కదా! ఛాందసవైదికులవలె అర్థగ్రాహ్యములేక వేదముల నధ్యయనము చేయుట, వల్లెవేయుట, ఆళ్వార్లు నిరసించి యుండిరి. సత్యవిషయము ప్రధానముగా గాని, భాష కవనములు ప్రధానములుగావు. అధ్యాత్మిక చింతనయందును, శాస్త్రజ్ఞానము నందును, విషయమును గమనించినమీదట దానిననుసరించి జీవించుట ఉత్తమోత్తమమని ఆళ్వార్లు బోధించి యుండిరి. ఆళ్వార్లు రచించిన స్తోత్రప్రబంధములనన్నిటి యందును పఠనాఫలితములు బేర్కొనునపుడు, నిష్కర్షగా ఏమని వ్రాయబడి యున్నదనగా - "ఈ ప్రబంధమును చదివి అర్థము జేసికొన్నవాడు దైవానుగ్రహ ప్రాప్తుడగును; నిత్యసంతోషి యగును; బంధవిముక్తు డగును; మోక్షపథమును బడయును," అని వ్రాయబడియున్నది. ఇట్టి అధ్యయన మార్గముననున్న రామానుజుడు ప్రతి విషయమును బాగుగా అర్థము జేసికొనుతత్త్వముననే ఉండువాడు. ఇదితెలియక మాలాధరుడు, రామానుజుడు నూత్నభావముల వెల్లడించినపుడు, చిన్నపోయి నట్లున్నది. రామానుజుడు మాలాధరుని సమీపించి, "స్వామీ! క్షమింపుడు! సానుభూతిని వెల్లడింపుడు! ఒక రచన యొక్క విశిష్టత, సారస్వతములు వానికున్న నానార్థ భావములపై ఆధారపడి యుండును. నూతన భావముల వెల్లడించుటలో ఆచార్య పరంపరకు న్యూనత లేదు. స్వామీ, "రచన" ఒక్కసారి చేయబడును. అది శాశ్వతముగా నుండును. "రచన" సంఘకల్యాణము కొరకు జరిగినది. "సంఘము యొక్క అవస్థ" ఆర్థికముగాను, నైతికముగాను, సాంఘికముగాను, మారుచుండును. ఇట్లు మారుచున్న అభివృద్ధి జెందుచున్న సంఘమునకు ఉపయుక్తముగా నుండవలసిన రచనలలోని అంతరార్థముల జూపి సంఘకల్యాణమునకు దోహదము చేయునట్లు సూచింపవలయును. అప్పుడే ఆ రచన శాశ్వతమై

నిలుచును; అట్లుకాదేని గ్రంథము బూజుపట్టు స్థితికి వచ్చును. ఆళ్వారుల భావములు సతత హరితములుగదా!" అని రామానుజుడు సవినయముగా పల్కెను. దీనికితోడు అంతకుముందుగనే మాలాధరుడు తిరుక్కోట్టియూర్‌నంబి ద్వారా యిట్లు వినియున్నాడు - "రామానుజుడు నూతన వ్యాఖ్యానములు జేయుచున్నాడని కుపితుడ వయితివని విన్నాను. వినుము, మాలాధరా, రామానుజుడు అహంకార రహితుడు; మహామేధావి; యువకుడు; ఉత్సాహి; మనమో వృద్ధులము - శ్రీయామునాచార్యులు మనకొసంగిన దివ్యజ్ఞానమును మనము రామానుజునకు ప్రసరింపజేయవలసిన కర్తవ్యము మనది. అతనికి నూతన అర్థములు స్ఫురించిన మనము సంతసింపవలసినదేకాని, కోపింప తావులేదు. విద్యాభ్యాన కాలమున యాదవప్రకాశుడు రామానుజుని ద్వేషించిన కథ మనకందరికిని విదితము కదా! యామునాచార్యుడును కూడా వినియుండి, సంతసించి, రామానుజుని కౌశలమునకు మెచ్చుకొనియున్నాడు. కావున పుత్రుని ప్రతిభకు నీవు సంతసించవలసినదేగాని, ఓటమిని బొందినట్లు భావింపరాదు - సోదరా!" అని తిరుక్కోట్టియూర్‌నంబి మాలాధరునకు జెప్పియుండును. అందువలన మాలాధరుడు సంతృప్తి నంది, రామానుజుడు స్వార్థరహితు డనియు, బ్రహ్మజిజ్ఞాస గలవాడనియు తెలిసికొని, సంతసించి, తనబోధనను పూర్తిగావించెను.

3) తరువాత మాలాధరుని సూచనపై మూడవ ఆచార్యుడు వరరంగముని నాశ్రయించి, నాలాయిర ప్రబంధమును మరియొకసారి పఠించెను. పెరియనంబి, మాలాధరుడు, వరరంగముని - యీ ముగ్గురు గురువుల నుండి బడసిన విద్యవలన రామానుజుడు అగ్నికి వశమైన మేలిమి బంగారువలె ప్రకాశింపదొడగెను.

4) ఇక మిగిలియుండు గురువు గోష్ఠీపూర్ణుడు. వీరిని తన గ్రామ నామధేయమునుబట్టి "తిరుక్కోట్టియూర్‌నంబి" అను తిరునామమున ప్రజలు పిలుచుచుండిరి. గోష్ఠీపూర్ణుని వద్దనుండి రామానుజుడు

"తిరుమంత్రమును" బడయవలసియున్నది. ఇదియును ఆళవందారు యొక్క ఆజ్ఞయే. కావున ప్రథమమున రామానుజునకు రామాయణ రహస్యములను దెల్పిన తిరుమలనంబితో కలిసి రామానుజునకు ఆచార్యులు ఐదుగురు.

పెరియనంబి ఆదేశానుసారము రామానుజుడు నడచి గోష్ఠీపూర్ణుని నివాసస్థలమగు తిరుక్కోట్టియూర్‌నకు పోయెను. దారిన బోవువారి నడిగి నంబిగారి స్వగృహమును సమీపించెను. వారిదొక చిన్న పూరిగుడిసె. భూగర్భమున వజ్రము దాగియున్నట్లు ఆకుటీరమున ధ్యాననిష్ఠుడై యుంటాడు గోష్ఠీపూర్ణుడు. రామానుజుడు గోష్ఠీపూర్ణునకు సాష్టాంగ దండ ప్రణామంబుల నాచరించి, "స్వామీ, మీ వద్ద తిరుమంత్రోపదేశమును పొందుటకై అరుదెంచితిని. దాని అంతరార్థమును గ్రహింప వచ్చినవాడను. కరుణింపుడు", అని ప్రార్థించుచూ, ముకుళితహస్తుడై నిలువబడియుండెను. (ఇంతకు పూర్వము ఒకటి రెండుసార్లు నంబిని యామునాచార్య వైష్ణవ మఠము నందు రామానుజుడు చూచియున్నాడు; అది యామునాచార్యులు పరమపదించిననాడు, తరువాత కొలది దినములలో జరిగిన సందర్శనము. వారిరువురకు కొద్ది ముఖ పరిచయము మాత్రమే).

రామానుజుని శ్రద్ధాభక్తుల పరీక్షింపదలచిన గోష్ఠీపూర్ణుడు ఏ సంభాషణకును దిగక, ముక్తసరిగా, "ఇపుడుకాదు, మరియొకసారి చూచెదనులే", అని చెప్పెను. రామానుజుడెంతో ఆశాభంగమున శ్రీరంగమునకు తిరిగివచ్చెను.

కొంతకాలము గడచిన తరువాత మరియొకసారి నంబిని దర్శించెను. మొదట జెప్పిన మాటనే జెప్పి పంపెను. రామానుజు డనుమానింపబూనెను. "నాలో ఏదో లోపముండియుండును. తిరుమంత్రమును బొందునన్ను తిరస్కరించినారు? కాని, పట్టిన పట్టును వదలరాదు. తెలియని తప్పులున్న క్షమింపమని సర్వేశ్వరుని ప్రార్థించెదగాక! అట్లనే నంబిగారిని గూడ ప్రార్థించెద. వారి క్షమాపణలచే

పవిత్రుడనయ్యెదగాక - మించిపోయిన దేమున్నది? ఆశాభంగమేల? నంబిగారు నన్ను తిరస్కరింపలేదు. మరియొకసారి చూచెదనన్నారు. గురునాజ్ఞను శిరసావహించవలసినదే! ఎన్నిమార్లు వాయిదా వేసినను నేను శిరసావహించవలసినదే", అని రామానుజుడు దృఢనిశ్చయుడాయెను.

తిరుక్కోట్టియూర్ నంబి వద్దకు రామానుజుడు పదునెనిమిదిసార్లు పోయెను. పదునెనిమిదవ పర్యాయముగూడా వాయిదాపడినది. కాని రామానుజుడు ఎట్టి విసుగును చూపక, మందహాసమున, "గురువర్యుల చిత్తము", అని పలికి నమస్కరించెను. ఇప్పటికి నంబి సంతృప్తి నందినాడు. రామానుజుని భక్తిప్రపత్తులకు, పట్టుదలకు సంతోషించినాడు నంబి. ఆళవందారుకు వారసుడుగా మఠాధిపత్యమునకు తగినవాడేనని సంతసించెను. మతప్రచారకుని కుండవలసిన పట్టుదల రామానుజునకున్నదని, అట్టి సహనము పట్టుదల యౌవన దశయందుండుట అపూర్వమని నంబితలంచెను. ఇట్లు తలంచుచున్న నంబికి శ్రీరంగనాథుడే రామానుజునకు తిరుమంత్రోపదేశమును చేయుమనియు, ఇక ఆలస్యముజేసి రామానుజుని కష్టపెట్ట తగదనియు, తెల్పినట్లు నంబి భావించెను. వారి విష్ణుసంశ్లేషణ భావమట్టిది. అందువలన తిరుమంత్రోపదేశమునకుగాను రామానుజుడు ఒంటరిగా రావలసినదని తన శిష్యులతో నొకరిద్వారా నంబిగారు రామానుజునకు వర్తమానము నంపెను.

చంద్రోదయమునకు ఎదురుచూచుచున్న చకోరములవలె, రామానుజుడు పరమోత్సాహమున దాశరథి కూరేశులతో గలిసి వేవేగ బయలుదేరి, పయనించి, తిరుక్కోట్టియూర్‌నంబి గృహమును జేరెను. లోపలనుండియే ఇరువైపుల దాశరథి కూరేశులతో కూడి నడుచుచున్న రామానుజుని జూచి, నంబిగారు, "ఇదేమి? ఒంటరిగా రమ్మని నేను వర్తమానము పంపినను, ఇరువుర వెంటగొని వచ్చినావు?" అని ప్రశ్నించెను.

"స్వామీ! నేను పరివ్రాజకుడనుకదా! సన్న్యాసికి ఎల్లప్పుడు ఒకచేతి యందు పవిత్రమును, మరియొక చేతియందు త్రిదండమును ఉండునుకదా! ఇతడు నాశిష్యుడు కూరేశుడు, నా పవిత్రము. ఇతడు మరియొక నా శిష్యుడు దాశరథి, నా త్రిదండము", అని రామానుజుడు వినయమొప్ప పల్కెను.

వివేకవంతమైనట్టియు, సమయస్ఫూర్తిని సూచించునట్టియు ఈ ప్రత్యుత్తరమును విని తిరుక్కోట్టియూర్‌నంబి (గోష్ఠిపూర్ణుడు) ఆశ్చర్య ఆనంద చకితుడాయెను. తరువాత గురునాజ్ఞానుసారము రామానుజుడు తన శిష్యరత్న ద్వయమును పరిచయము చేయుటలో దాశరథి యేకసంధాగ్రాహియయిన గొప్పవేదవిదుడు. శాస్త్రజ్ఞానము నెరిగిన మహాపండితుడని చెప్పెను. కూరేశుని గురించి చెప్పుటలో నతడు వేదోపనిషత్తుల బ్రహ్మసూత్రముల బాగుగా వల్లించిన యేక సంధాగ్రాహియనియు, గొప్పత్యాగశీలియనియు నుడివెను. "వీరిరువురి సమక్షముననే నీకు తిరుమంత్రోపదేశమును జేసి తిరుమంత్రార్థమును వెల్లడించెదగాక! పోయి పుణ్యస్నానముల నాచరించి, పవిత్రులై, తిరుమణిధారులై రండు", అని నంబియాజ్ఞాపింప, వారట్లే జేసిరి.

తిరుక్కోట్టియూర్‌నంబి యీలోన స్నానమాచరించి, పవిత్రుడై, పద్మాసనాసీనుడై వెలుగొందుచుండెను. ఆయనకు ముందుగా ఎదురుగా రామానుజుడాసీనుడుకాగా, అతని కిరుప్రక్కల దాశరథి, కూరేశుడు కూర్చొనిరి. నంబిగారి కుటీరము చరితార్థము కాబోవు తరుణమది. అది విశ్వఆధ్యాత్మికాలయము. లోకమునకు తిరుమంత్రార్థమును బోధింపగల ఆచార్యునిగా రామానుజుని తీర్చిదిద్దు విశ్వ ఆధ్యాత్మిక గురుకులమది. ఇట్టి గురుకుల స్థాయికి పోయిన యింకొకటి అంతకుముందు వేరొండు లేదుగదా!

తిరుక్కోట్టియూర్‌నంబి తిరుమంత్రార్థమును, తిరుమంత్ర ప్రభావమును రామానుజునకు బోధింపసాగెను. "రామానుజా! మంత్రములలో కెల్లను, ఉపాయమంత్రములలో కెల్లను, మోక్ష

ప్రదాయిని యయిన మంత్రములలోకెల్లను శ్రేష్ఠమయిన మంత్రము గాన దీనికి తిరుమంత్రమని పేరు వచ్చినది. ఇది దివ్యమంత్రము. ఇదియే, అష్టాక్షరీ మంత్రము. గీతాచరమ శ్లోకార్థము ఇందు ఇమిడియున్నది. వినుము..." అని బోధించుచు, రామానుజుని చెవిలో మూడుమార్లు, "ఓం నమో నారాయణాయ" అను అష్టాక్షరీ మంత్రమును ఉపదేశించెను.

"రామానుజా! మూడు పదములతో కూడినదియు, (ఓం - నమో - నారాయణాయ) ఎనిమిది అక్షరములతో గూడినదియునైన యీ మంత్రము సర్వమంత్రములలో శ్రేష్ఠమయినది. దీని భావమును తెలిసి కొన్నవాడు మోక్షపథమును బొందును", అని తెల్పుచూ, యామునాచార్యుని బోధనలవలన తానుబొందిన విజ్ఞానము నంతటిని, తిరుమంత్రమును గూర్చి, రామానుజునకు వెల్లడించెను.

వేదములయందును, ఉపనిషత్తులయందును, విష్ణుపురాణము నందును, "నారాయణ" పదము యొక్క విశిష్టార్థముల నిదివరలో వ్యాకరణ యుక్తముగా గ్రహించినను, రామానుజుడీనాడు దానియొక్క అంతరార్థములను మెండుగా నేర్చుకొన గలిగినాడు. (పంచభూతాత్మక మయిన పాదిలో తగిన వసతులు గల్పించి వేయబడిన విత్తనము సక్రమముగా పెరుగుచున్నను - వసంత ఋతువునందెక్కువుగా చిగిర్చి, గ్రీష్మఋతువునందు సూర్యతేజస్సునెక్కువగా స్వీకరించి, వర్ష ఋతువున అమోఘముగా పెరుగు మొక్కవలె, ఈ తిరుమంత్రార్థము ఇక మేధావి అయిన రామానుజుని వలన ఎట్టి గంభీరతను, వాస్తవికతను పొందనున్నదో కదా!)

కడపట తిరుక్కోట్టియూర్నంబి రామానుజునకొక హెచ్చరిక జేసెను - "ఈ అష్టాక్షరీమంత్రమును నీవు గుప్తముగా నుంచవలయును. ఇతరులకు తెలుపరాదు. నీవే జపించి, తరింపవలయును. నీయవసాన కాలమున నీకు వారసుడయిన శిష్యునకే అందజేయవలయును. ఇతరులకు తెల్పరాదు. ఇది

గురునాజ్ఞ. జాగ్రతసుమా! గురునాజ్ఞ మీరినవానికెట్టి నరకములు ప్రాప్తించునో నీకు తెలియునుకదా!" అని హెచ్చరించి, రామానుజుని పొమ్మనెను. రామానుజుడు గురునకు సాష్టాంగ దండప్రణామంబుల గావించి, పరమానందమున "ఓం నమో నారాయణాయ" అని మనమున జపించుకొనుచూ గురుకుటీరమును వదలి, నడచు చుండెను. ఇక యిదే నడకపై శ్రీరంగము జేరవలసినదే.

అష్టాక్షరీమంత్రమును జపించుచూ, నడచుచున్న రామానుజునకు ప్రపంచమున నేమియు కనబడుటలేదు. "నారాయణ" శబ్దము సూచించు విశ్వము, విశ్వమూర్తియే కనబడుచున్నారు. పంచ భూతములు, పంచశక్తులు (అనగా పంచాయుధములు) సమ్మేళనా మూర్తి, సర్వాంతర్యామి యయిన ఈశ్వరశక్తియే తనకగపడు చున్నది. ఇట్లు ఆదివ్య పదముయొక్క అర్థము నెవ్వరును గ్రహించి యుండలేదు. ఆ విశ్వములో, ఆ విశ్వశక్తిలో లీనమై సంశ్లేషణ భావమును పొందినాడు రామానుజుడు. తిరుక్కోట్టియూర్ గ్రామములోని విష్ణ్వాలయము ప్రక్కనే నడచిపోవుచున్నాడు. సామాన్య ప్రజలను చూచినాడు. "అష్టాక్షరీ మంత్రార్థమును, దాని ప్రభావమును అనుభవించి, ఆనందించవలసిన వాడను నేనేనా? వీరందరు, భ్రాతృ సమానులు, ఏల విని, తెలిసికొని, తరింపరాదు? ముందు తిరుమంత్రమును ఎల్లరకు వినిపించెద. తరువాత క్రమముగా దాని భావమును నేర్చుకొనెదరుగాక! ఇందు నేను స్వార్థమును చంపుకొన వలయును. లోకకల్యాణము కొరకు నేను తిరుమంత్రమును ఎల్లవారికి బహిర్గతము చేయవలసినదే", అని రామానుజుడు నిర్ణయించు కొనెను.

పురజనులను జూచి, రామానుజుడు, "రండు , రండు, నాకు లభించిన నిక్షేపమును మీకు పంచియిచ్చెద, రండు", అని పలుకుచున్న యతిరాజును ప్రజలు వెంబడించిరి. రామానుజుడు దేవాలయగోపుర అగ్రభాగమును జేరి, నిలుచుండెను. త్వరితగతిని

పిన్నలు, పెద్దలు, చాతుర్వర్ణముల వారు అత్యాసక్తితో వచ్చి, దేవాలయముముందు నిలుచుండిరి.

రామానుజుడు, "సోదర మానవులారా! విశ్వసంపత్తికి భాగస్వాములారా! వినుడు! నాకొక మంత్రరాజము లభించినది. దానిని మీకుపదేశించెదను. నిత్యము జపించి, తరింపుడు. దాని భావమును ప్రశాంతముగా గమనించి జీవించెదరుగాక! మీకు వైకుంఠ ప్రాప్తి కలుగును. మీరు నిర్మలులగుదురు", అని ఉపోద్ఘాత వాక్యములు పలికెను. క్రిందజేరిన ప్రజలెల్లరు, "మహాత్మా! దయైకసింధో! అనుగ్రహింపుము", అని ప్రార్థించిరి.

"ఇదిగో తిరుమంత్రము - భక్తి యుక్తముగా ఉచ్చరింపుడు. ఓం నమో నారాయణాయ, ఓం నమోనారాయణాయ, ఓం నమో నారాయణాయ", అని రామానుజుడు మంత్రము నుచ్చరించుచుండ, ప్రజలెల్లరు భక్తితో ఎలుగెత్తి వచించిరి. అది యొక పరమానంద ప్రజాసమూహము. తిరుక్కోట్టియూర్ గ్రామమంతయు "ఓం నమో నారాయణాయ అను అష్టాక్షరి మంత్ర ధ్వనితో ఆవరింపబడెను.

సర్వమును ఆదినుండి యిప్పటివరకును దాశరథి, కూరేశుడును ఆశ్చర్య ఆనందములతో, భయభ్రాంతులతో తిలకించుచు నిశ్శబ్దముగా నుండిరి. శ్రీరామానుజుని దయాగుణమునకు, సానుభూతికి ఆనందించుచున్నను, గురనాజ్ఞను మీరుటవలన రామానుజుని ఆత్మ కెట్టిపాపము ఆపాదించునో అని భయపడుచుండిరి.

ఈ కలకలమును వినిన గోష్ఠీపూర్ణుడు తనకుటీరము నుండి వీధిలోనికి వచ్చెను. దారిన బోవువారెల్లరు, బాలబలికలతో సహా, "ఓం నమో నారాయణాయ" అని పలుకుచూ, పరమానందమున నాట్య గానములు జేయుచూ దారిని పోవువారిని నంబిగారు చూచిరి. రామానుజుడు చేసిన అపరాధము ఆతనిని అగ్నివలె ప్రకోపింప జేసెను. నిప్పులు గ్రక్కుచున్న నేత్రములతో, అగ్రహమున కంపిత శరీరుడై, త్వరత్వరగా దేవాలయమువద్దకు వచ్చి, నిలువబడి, "రామానుజా!

ఇటు రమ్ము", అని గర్జించెను. నంబిగారిని తపస్విగా, గురుతుల్యులుగా భావించు గ్రామస్థులందరు వారికోపాగ్నికి గడగడ వణకుచుండిరి.

అచ్చటనే ప్రజల సమక్షమున దాశరథీ కూరేశులు కంపిత శరీరులై తిలకించుచుండ, గోష్ఠీపూర్ణుడు, "రామానుజా! ఇదేమిటి! నేను చెప్పిన దేమిటి? నీవు చేసినదేమిటి? గురుద్రోహీ! తిరుమంత్రమును గుప్తముగా నుంచమని నేనాజ్ఞాపింప, దానిని బట్టబయలు చేసితివి. విచక్షణరహితముగా అందరి చెవుల వేసినావు; నీవు గురువునకు జేసిన అపచారమునకు నరకమునకు బోదువుగాక! నీవు పాపివి నీముఖము చూడరాదు. ఇట్టి అలబరపుతనము వాడివి. నీవు వైష్ణవ మఠాధిపత్యమును స్వీకరింపగలవా? నీవిట్టి అల్పమానవుడవని యామునాచార్యులవారుగాని, యితర నంబులుగాని, ఊహించి యుందురా? ఓరీ పాపీ! నీముఖమును చూడరాదు,' అని దూషించుచూ, శపించుచూ, గోష్ఠీపూర్ణుడు నిజసదనమువైపు మరలెను.

రామానుజుడు గురువునకు సాష్టాంగ నమస్కారముచేసి, లేచి నిలువబడి, ముకుళితహస్తుడై, "స్వామీ, అష్టాక్షరీ మంత్రజపము వైకుంఠ ప్రాప్తిని కలుగుజేయుననెడిది సత్యము. నేను గురునాజ్ఞనుల్లంఘించి, తిరుమంత్రమును బహిరంగముగా ప్రకటించుట నాకు నరకము దెచ్చుగాక! స్వార్థబుద్ధితో తిరుమంత్రమును గుప్తముగా పెట్టుకొన నైతిని. ఇంతమందికి తిరుమంత్రమున వలన వైకుంఠప్రాప్తి కలుగునపుడు, నావంటి అల్పుడొక్కడు నరకమునకు బోయిననేమి? నేను లోకకల్యాణము కొరకు సన్న్యసించినవాడను; స్వీయ మోక్షమును గూడా పరిత్యజింప వలసినదే. భగవద్గీతలోని మోక్ష సన్న్యాస యోగము యొక్క భావమిదే గదా! స్వామీ!" అని రామానుజుడు ప్రపత్తి భావమున వెల్లడించెను.

తిరుక్కోట్టియూర్‌నంబికి జ్ఞాననేత్రము వికసించెను. మూఢవిశ్వాస మూఢాచారమను పాగమబ్బు తొలగిపోయినది. "ఎంబెరుమానార్"

అని సంబోధించుచు, రామానుజుని గాఢాలింగనము జేసికొనెను. ("ఎంబెరుమానార్" అనగా "మాప్రభూ" "మమ్మేలువాడా" అని భావము)

"మహాత్మా, మహానుభావా! నీవు శిష్యరూపమున వచ్చిన భగవదవతారపురుషుడవు! నాకు జ్ఞానోదయము గావించి, నన్నుద్ధరింప వచ్చిన ఆచార్యుడవు! నేను సంకుచిత హృదయుడను; నీవు వైష్ణవ హృదయుడవు! లోకకల్యాణార్థమవతరించిన మహాపురుషుడవు! శ్రీయామునాచార్యుడు నీవారనత్వమును గోరి నీరాక కంతటి ఆతురతను వ్యక్తము జేయుటకు గల కారణము ఇపుడు తెలిసినది. వత్సా! నీవు ఆచార్యుల కాచార్యుడవు. శేషావతారుడవు. ఇక లోకకల్యాణార్థము నీ జీవితయాత్రను సాగింపుము", అని పరమానందమున నంబి రామానుజుని ఆశీర్వదించి పంపెను.

గోష్ఠీపూర్ణునియొద్ద తిరుమంత్రమును బడసి, దానిని ప్రజలకందరికి వెల్లడించి, ఆచార్యునిచేతనే, "ఎంబెరుమానార్" అను బిరుదమును పొంది, రామానుజుడు దాశరథీ కూరేశుల సహితముగా శ్రీరంగపురి ప్రవేశము జేయునపుడు నంబులు, భక్తులు, సర్వ శ్రీవైష్ణవులు, శ్రీరంగపురజనులు "ఎంబెరుమానార్" అని జయజయ ధ్వనులు గావించుచు, రామానుజాచార్యులకు ఘనమైన స్వాగతము నేర్పాటు జేసిరి. ఇది మొదలు రామానుజుని "ఎంబెరుమానార్" అని "యతిరాజ"ని, "ఆచార్యుడ"ని ప్రజలు, భక్తులు అనుచుండిరి.

## 18. తిరుమంత్ర వైభవము

తిరుమంత్రము సర్వులకును బహిరంగము కాగా, దాని అంతరార్థమును గ్రహింపవలయునని ఉవ్విళ్లూరుచున్న భక్తులు, శ్రీవైష్ణవులు, పండితులు, పెద్దలు, సర్వులును రామానుజ దివ్యజ్ఞానమును వినుటకు గొప్ప సభ మరునాడు ఏర్పాటు జేయబడెను. సహస్రస్తంభ మంటపమున వేదికపై ఆసీనుడైయున్నాడు రామానుజుడు ఉదయాద్రిపై ఉదయ భాస్కరునివలె ప్రకాశించు చున్నాడు యతిరాజు. వారినేత్ర ద్వయము నుండి కృపాకిరణములు సదస్యులపై ప్రసరింప సర్వులు పవిత్రులై రామానుజుని వాగమృతమును గ్రోలుటకు సంసిద్ధులై త్రికరణశుద్ధిగా నాసీనులై యుండిరి. శ్రీరంగమంతయు నచట చేరినట్లాయెను. తెలిసినంతవరకు చుట్టుప్రక్క గ్రామములనుండి ప్రజలరుదెంచి యున్నారు. దూరప్రాంతముల నుండి యేతెంచిన యాత్రికులు సైతము ఈ మహద్భాగ్యమును పంచుకొనుటకు సిద్ధముగా ఆసీనులై యున్నారు.

చరిత్రాత్మకమయిన శ్రీమద్రామానుజాచార్యులవారి తిరుమంత్ర విశిష్టతను గూర్చిన ఉపన్యాసము ప్రారంభ మగుచున్నది.

శ్రీమద్రామానుజాచార్యులు సర్వులకు "అడియేన్" (దాసుడను) అని పలుకుచూ, సర్వాంతర్యామికి ఆచార్యులకు దండము సమర్పించి, ఉపన్యసింపదొడగెను.

"సోదరులారా! భక్తులారా! భగవత్ స్వామ్యమునకు సమాన వారసత్వహక్కుగల విశ్వకుటుంబ సభ్యులారా!

వినుడు, ఉచ్చరింపుడు తిరుమంత్రమును. ఓం నమో నారాయణాయ! ఓం నమో నారాయణాయ! ఓం నమో నారాయణాయ!

తిరుమంత్రోచ్చారణకు సర్వులకు సమానహక్కు గలదు. ఇందులకు జాతి, కుల, వృత్తి, భాషలు అడ్డంకులు గానేరవు.

భగవచ్ఛక్తి, సర్వాంతర్యామి; సర్వవ్యాపకము - అని విశ్వసించు వారెల్లరు వైష్ణవులు. ఆ విశ్వాసము ఇచ్చట నుండు వారందరికి నున్నది. అందువలన మీరందరు శ్రీవైష్ణవులే.

ఓ శ్రీవైష్ణవులారా! తిరుమంత్రమును విన్నారు; ఉచ్చరించినారు; ఇక ఎల్లవేళల జపింతురుగాక! కాని తిరుమంత్రార్థమును గమనింపుడు, అర్థము తెలియని మంత్రము నిష్ప్రయోజనము - జీర్ణశక్తి లేనివానికి షడ్రసోపేతాహారమువలె, నిరక్షరాస్యునకు సద్గ్రంథమువలె - కావున ఇక అర్థమును గమనింపుడు.

అష్టాక్షరిలో ఎనిమిది అక్షరములున్నవి. అందు ఓం, నమో, నారాయణాయ అను మూడు పదములున్నవి.

'అ' కార, 'ఉ' కార, 'మ' కారములతో గూడినది 'ఓం'. 'అ' కారము సర్వాంతర్యామియగు ఈశ్వరశక్తిని సూచించును. 'మ' కారము జీవాత్మలను (చిత్) సూచించును. 'ఉ' కారము ఘటమును (అచిత్) సూచించును. ఇట్లు 'ఓం' అనునది చిత్, అచిత్, ఈశ్వర అను తత్త్వత్రయమును సూచించును. తత్త్వత్రయమే సర్వాంతర్యామి ఈశ్వరశక్తితో గూడిన విశ్వము. అర్థయుక్తముగా భావమును గమించి, "ఓం"ను ఉచ్చరించిన తత్త్వత్రయజ్ఞానము నార్జించినట్లగును. తత్త్వత్రయమును అర్థము చేసికొన్నపుడు మానవుడు తన్ను తానెరుగుతాడు. తన్ను తానెరుగుట యనగా స్వార్థరాహిత్య భావము నలవరచుకొనుటయే యగును.

ఇట్టి స్వార్థరహిత భావమును సూచించు తత్త్వత్రయ జ్ఞానమునకు "నమో" (ప్రణమిల్లెదను).

"నారాయణాయ" అను పదము సర్వాంతర్యామి అను భావము గలది. సర్వమును, సర్వమునందుండు ఈశ్వరశక్తియు ఈ పదముచే చెప్పబడుచున్నవి. విశ్వము, విశ్వేశ్వరము ఈ రెంటి యొక్క సమ్మేళవార్థమును దెల్పును.

ఇట్టి విశ్వ విశ్వేశ్వర సమ్మేళనమునకు ప్రణమిల్లుచున్నాను అని "నమో" అనుపదము తెల్పుచున్నది.

కావున "ఓం నమో నారాయణాయ" అన్నపుడు మానవుడు జ్ఞానము కలిగి విశ్వమునకు శరణాగతి యగుచున్నాడు. ఇట్టివాడు స్వార్థరహితుడు; ముక్తుడు; లోకకల్యాణమున కాంక్షించువాడు; విశ్వమునకు శాంతినిగూర్చువాడు; ఇది పరమానంద మార్గము.

ప్రపంచశాంతికి, లోకకల్యాణమునకు, వ్యక్తి ఆనందమునకు, సంఘ ఆనందమునకును దీనికిమించిన మంత్రము లేదు; కావున ఇది తిరుమంత్రమనబడుచున్నది.

తిరుమంత్రము దివ్యమంత్రము; ఇది చరమమంత్రము; ఇందు ద్వయమంత్రము యొక్క అర్థము ఇమిడియున్నది. ఇందు జ్ఞాన ప్రపత్తులున్నవి.

తిరుమంత్రము భగవద్గీతా చరమశ్లోకార్థము. భగవద్గీతా చరమ శ్లోకము ఇది:

శ్లో॥ సర్వ ధర్మాన్ పరిత్యజ్య ।
మామేకం శరణం వ్రజ ।
అహంత్వా సర్వ పాపే భ్యో ।
మోక్షయిష్యామి మా శుచః ॥

"ఓం నమో నారాయణాయ" అను శరణాగతి భావము "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణంవ్రజ" అను శ్లోక భాగభావము తెల్పును. అట్టి అష్టాక్షరీ మంత్రమును పాటించుటచే మోక్షము కలుగునని చెప్పబడిన గీతాచార్యుని ఫలవాక్యమును "అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః" అను శ్లోకార్థము వెల్లడి చేయుచున్నది.

కావున అష్టాక్షరీమంత్రమే గీతాచరమ శ్లోకమయినది.

ఇపుడు భగవద్గీతా చరమ శ్లోకార్థమును విపులముగా గమనింతము. గీతయందు భగవానుడు అష్టాదశ అధ్యాయము

లందనేక ధర్మముల సూచించియున్నాడు. వానినన్నిటితో శ్రేష్ఠతమ మయిన ధర్మము - ఏకమైనట్టియు అద్వితీయమైనట్టియు సర్వాంతర్యామికి శరణుజొచ్చుట. దీని తాత్పర్యము స్వార్థరహితుడగుట - స్వార్థరహితుడు చేయు పాపము లేదు. పాపము చేయు అవకాశము శరణాగతి భావమున నున్నవారిని సమీపింపదు. పాపములందు ప్రవేశింపనివాడు విముక్తుడయి మోక్షభావమున నుండును. ఇదియే చరమ శ్లోకార్థము. ఈ ధర్మమును జీవితమున పాటించుటయే లోకకల్యాణ సాధనము. అంతియేకాని చరమ శ్లోక పఠనమే కాదు అష్టాక్షరి జపము కాదు. చరమశ్లోకార్థమే ద్వయమంత్రము - ఒకటి ఉపాయము, మరియొకటి అభయము.

"ఓం నారాయణాయ" - యిందులోని పదద్వయ దివ్యార్థమును శ్రీరంగనాథ విగ్రహము సూచించుచున్నది - అనగా విశ్వవిశ్వేశ్వరముల సమ్మేళనము - సర్వజ్ఞాన మయము.

"నమో" అను మూడవపదమున పై జ్ఞానమునకు శరణుజొచ్చు చున్నాను అను భావమున్నది.

కాని, "అహం త్వా సర్వపాపే భ్యో ।
మోక్షయిష్యామి మా శుచః ॥

అన్న అభయమును సూచించు విగ్రహరాజము కూడా రూపొందింప బడవలసియున్నది. అనగా గీతాచరమ శ్లోకార్థసూచక విగ్రహరాజము రూపొందింపబడ వలసియున్నది. అది యొక దిక్సూచి కావలసియున్నది. ఆది అనగా అభయప్రదానము; ఒక ప్రోత్సాహిగా నుండగలదు. యామునాచార్యునిచే ప్రతిపాదింపబడి, నాచే ప్రచారము చేయబడవలసిన విశిష్టాద్వైత సిద్ధాంతమునకు మూలమయినది చరమ శ్లోకము. గీతలో దీనిని చరమశ్లోకముగా నిర్ణయించినవాడు మేధావి యయిన యామునాచార్యులే గదా!

సర్వవ్యాపకమయిన ఈశ్వరశక్తికి మనము దాసులమగుట అనగా భగవచ్ఛక్తి జీవులయందే యున్నదిగాన సర్వజీవులకు దాసులమగుట

అని భావము. యామునాచార్యుల మతము యొక్క ధ్యేయము సంఘసేవ అని సూచించియున్నాడు.

చరమశ్లోకార్థ భావమును ప్రకటించి, తద్భావమును కార్య రూపమున బెట్టుటయే నాప్రబోధము కాగలదు. అదియే విశిష్టాద్వైత సిద్ధాంతము. మతము యొక్క ధ్యేయము స్వార్థరాహిత్యభావ జీవితము. ఇది లోకకల్యాణమునకు తోడ్పడును; ఆత్మానందమునకు తోడ్పడును. ఈ విశిష్ట పథము మోక్షపదము; వైకుంఠపథము; పరమపదము.

పరమపదమనగా మరణావస్థకాదు. పరమానందపదవే పరమపదము. జీవితమంతయు స్వార్థరహితముగా లోకకల్యాణ సేవకు వినియోగించి, కడకు అవసానకాలమున ఎట్టి కోరికలు లేక శాంతి యుతముగా ఆనందముగా మరణించిన వానిని పరమపదము చేరినాడని చెప్పుట యుక్తముగానే యుండును. తన జీవితము ఒక విశిష్టస్థాయికి జెందినదని చెప్పుట యగును.

ఉపాయ అభయ ప్రధానమగు చరమశ్లోకమును ప్రకటించుటకే గీతాభాష్య రచనకుపక్రమించెదను.

ఓం నమో నారాయణాయ, ఓం నమో నారాయణాయ, ఓం నమో నారాయణాయ -" అనుచూ శ్రీమద్రామానుజాచార్యులు ఆనాటి సమావేశమున తన తిరుమంత్రార్థ ఉపన్యాసమును స్థూలముగా పూర్తిగావించెను.

ఈ మహోపన్యాసము అయిన తరువాత, సర్వులును - చిన్నలు, పెద్దలు అబ్బురపడి పెన్నిధినిగన్న వారువోలె, పరమానందమున రామానుజునకు ప్రపత్తిని వెల్లడించిరి.

ఉపన్యాసానంతరము ఆచార్య, సూరిజనులు వెంటరాగా రామానుజుడు శ్రీరంగనాథుని మూలవిరాట్ విగ్రహ దర్శనమునకు

పోగా, స్వామిని రామానుజుడు తదేక నిష్ఠతో తిలకించుచు, పల్లాండు పాడుచుండగా, ఆచార్య సూరిజనుల మనములనున్న రామానుజ ప్రతిభను వెల్లడించుటకు స్వామియే రామానుజుని "ఉడైయవర్" అని సంబోధించి, ఆశీర్వదించినట్లు స్వామితో సంశ్లేషపడిరి. "ఉడైయవర్" ఉభయవిభూతులను తన సొత్తుగా కలవారు అని తాత్పర్యము. సర్వాంతర్యామికి శరణాగతుడగుట, భూతకోటికి సేవజేయుట అను రెండు మార్గములను నొక్కి వక్కాణించి యున్నారు ఉడైయవర్లు. రామానుజ మతము యొక్క విశిష్టతయిదియే.

# 19. వైష్ణవ విశిష్టాద్వైత మతాధిపత్యము

ఆళవందార్ ఆదేశానుసారము వారి నలువురు శిష్యరత్నముల నుండి తిరుమంత్రార్థ రహస్యముతో సహా ఆధ్యాత్మిక విద్యా పీఠాధిపతి అయినారు శ్రీ రామానుజాచార్యులు. ఇప్పటికి అవసరమైన అధ్యాత్మిక వస్తుసామాగ్రి సంపూర్ణముగా సేకరింప బడినదిగాన, రామానుజుడు ఇక నిర్వర్తించవలసిన మహత్కార్యములు మూడు: 1) విశిష్టాద్వైత సిద్ధాంతము ననునరించి, తత్త్వత్రయు జ్ఞానానుసారముగా, ప్రస్థానత్రయమునకు భాష్యము రచించి, తదనుగుణమయిన తన యొక్క బోధామృతమును రచించుట.

2) చిత్, అచిత్, ఈశ్వర అను తత్త్వత్రయ పరస్పర సంబంధమును వివరించి తన సిద్ధాంతము శాస్త్రీయమయినదని తెల్పురచనలు చేయుట, 3) సత్యమార్గమును (అనగా సేవాతత్పర జీవితమును గడపుట) ప్రజలకు బోధించుట.

నర్వవిధముల ఆచార్యస్థానమునకు రామానుజుడిపుడు అర్హుడయి యున్నాడు. యామునాచార్యులు స్థాపించిన వైష్ణవ విశిష్టాద్వైత మతమును స్వీకరించి, దానికి అధిపతియు, పరమాచార్యుడాయెను.

విశిష్టాద్వైత మతాధిపతిగా శ్రీరామానుజాచార్యులు దిగంత కీర్తి సంపదను బడసెను. నూతన శిష్యులను వైష్ణవులనుగా మార్చుట (వైష్ణవ భావముగల వారినిగా మార్చుట), అధ్యాత్మికోపన్యానముల గావించుట, పరమతముల వారిని మూఢవిశ్వాసముల నుండి తొలగించి, వారికి తన సత్యమైన తత్త్వబోధనను వినిపించి, వారిని సంస్కరించుట, తానుద్దేశించిన భాష్యరచనలు గావించుట అనునవి మతమున నిర్విరామముగా జరుగు కార్యక్రమములు. తరువాత దేవాలయాధిపత్యమును సాగించి, దేవాలయ కార్యక్రమముల క్రమబద్ధము అర్థయుక్తము జేసి, సమతను వెల్లడించి, భక్తుల నాకర్షింప జేయుట, భూరివిరాళముల స్వీకరించి, దేవాలయ కార్యముల సర్వతో

ముఖాభివృద్ధి చేయుట, నిత్యము వెయ్యిమందికి తక్కువగాకుండా సంతర్పణను జరిపించుట అనునవి రామానుజుని నిత్యదేవాలయ కార్యక్రమములు. దేవాలయమున సంతర్పణ భోజనములయిన తరువాత మధ్యాహ్నము ఒకటిరెండు ఘంటల మధ్యకాలమున రామానుజుడు రెండు, మూడు వైష్ణవగృహములకు బోయి కబళముల అన్నమును తన అంగవస్త్రమున సేకరించి, కావేరి నదికిబోయి, వస్త్రములో నున్న, అన్నమును నీటిలో జాడించి, ఆ అన్నమును భుజించువాడు. దినమున కొకసారి యీ ఆహారమును తీసికొనువాడు. ఈ ఆహారముతో రామానుజుడు ఎంతో బలశాలిగా నుండువాడు. వారి శరీరము గంభీర సుందరమయినది; మరియు సౌష్ఠవము గలది. ఎండలో గంటల తరబడి నడచినను, శ్రమించినను తనముఖవర్చస్సు తగ్గునది కాదు. లేతకానుగ యిగుళ్లవలె వారి శరీరకాంతి ప్రకాశించెడిది. ఇట్టి శరీర సంపదగలవాడు శ్రీరామానుజుడు. వీరి శరీర సంపద, మనస్సంపద, మనోవ్యాపారములు, సేవలు - అన్నియు అతి విశిష్టములైనవి.

రామానుజునకంటె పెద్ద వారందరును, వారికి ఆచార్యులుగా వ్యవహరించినవారును, రామానుజునకు ప్రపన్నులయిరి. ఇందులకు కారణములు వారియొక్క సత్యమార్గము, వివేకము, దక్షతలు.

కాంచీపురినుండి తన్ననుసరించి యేతెంచిన కూరేశదంపతులు, దాశరథియు శ్రీరంగవాసము జేయుచూ, దినమంతయు రామానుజుని సన్నిధానమున దివ్యముగా గడపువారు.

తాను కంచియందు యతిరాజై వైష్ణవమతమును స్థాపించినపుడు తనమేనల్లుడగు మొదలియాండాన్, నగోత్రుడగు కూరత్తాళ్వాన్ అనువారు రామానుజునకు ప్రపన్నులైయుండినారని యిదివరలోనే తెలిసికొని యున్నాము కదా!

తనకు ఆధ్యాత్మిక విద్యగరపుటలో గురువర్యుడయిన యాదవ ప్రకాశుడు కడకు కంచిలో మఠమున రామానుజునకు ప్రపన్ను

డాయెనని యిది వరలో తెలిసికొని యున్నాము గదా! అతడు రామానుజ సిద్ధాంత సత్యమును పాటించినవాడై "గోవిందదాసు" అను తిరునామమును స్వీకరించి యుండిరికదా! అట్టివారును ఒకటిరెండు పర్యాయములు శ్రీరంగము వచ్చి, ఉడైయవర్లను సేవించి పోయినాడు. తన ఆచార్య పంచకములోనొకరగు వరరంగముని రామానుజునకు "లక్ష్మణముని" అను తిరునామముంచి తన సోదరుడైనట్టియు, మహాపండితుడై నట్టియు కొట్టనంబిని రామానుజుని ఆశ్రయింప జేసెను. తనకు తిరుమంత్రోపదేశము గావించిన ఆచార్యుడు తిరుక్కోట్టియూర్‌నంబి తన కుమారుడైన తెర్కాళ్వాన్‌ను రామానుజు నాశ్రయింపజేసెను. తనకు ఆచార్యుడై శఠారి సూక్తి రహస్యములను బోధించిన మాలాధరుడు (తిరుమాలైయాండాన్) తనపుత్రుడు శుందరత్తోళుడైయాన్న్ను రామానుజున కంకితుని జేసెను. రామానుజుని మేనమామయగు పెరియతిరుమలనంబి (శ్రీశైల పూర్ణుడు) తన కుమారుడగు పిళ్లైతిరుమలనంబి, తన మేనల్లుడు ఎంబారును రామానుజుని పాదపద్మముల నాశ్రయింపజేసెను.

రామానుజుని శిష్యకోటి యిట్టిది.

ప్రస్థాన త్రయమునకు (బ్రహ్మసూత్రములు, ఉపనిషత్తులు, గీత) భాష్యమును వ్రాసి, "భాష్యకారు"లను తిరునామమును బొందెను. శ్రీరామానుజుడు రచించిన భాష్యమునకు శ్రీభాష్యమనిపేరు. సరస్వతీదేవియే (వాగ్దేవి) రామానుజునకు భాష్యకార్లు అని బిరుదముగా నొసంగెనని ప్రతీతిగా చెప్పటలో అంతరార్థ మేమనగా ఈభాష్యము ప్రత్యేకించి, రామానుజుని మేధను సిద్ధాంతములను విశిష్టముగా తెల్పుచున్నది.

శ్రీమద్రామానుజాచార్యులు రచించిన గ్రంథములు శ్రీభాష్యము, వేదాంతసారము, వేదాంతదీపము, వేదాంత సంగ్రహము, గద్య త్రయము, (శరణాగతిగద్య, శ్రీరంగగద్య, శ్రీవైకుంఠగద్య) నిత్యగ్రంథ గీతాభాష్యము మొదలయినవి.

రామానుజునకు యజ్ఞమూర్తి యను అఖండవైదిక పండితుడు అద్వైతియు అయిన దేశప్రఖ్యాతి గాంచిన వేదాంతి ప్రపన్నుడగుట గొప్పవిశేషము. ఈ విషయమును గూర్చి మరియొక అధ్యాయమున చదువగలరు.

మూఢవేదవాదులు, మాయావాదులు, రామానుజునిచే జయింప బడిరి. వారు రామానుజునకు శిష్యులయిరి.

రామానుజుడు దిగ్విజయార్థముగా కాశ్మీరము మొదలు కన్యాకుమారి అగ్రమువరకు పర్యటించెను. వేలాది పండితులను, రాజులను, ధనవంతులను తన విశిష్టాద్వైత సిద్ధాంతమునకు త్రిప్పుకొనెను. లక్షలాది ప్రజలను వైష్ణవ భక్తులుగా మార్చెను.

ఆయన దేశమున వివిధ ప్రాంతములయందుగల వేదాంత దర్శన గ్రంథములను సేకరించెను.

"ఈశ్వరశక్తి సర్వవ్యాపితమయియున్నది అని విశ్వసించు వారిని శ్రీవైష్ణవులని పిలిచెదను. శ్రీవైష్ణవులు జాతికుల భాషాభేదములకు అతీతులు. ఈశ్వరశక్తి సత్యము, సుగుణము, సౌందర్యము అనుగుణములతో త్రిభువన సుందరము. ఈ త్రిభువన సుందరమును అనుభవించి, ఆనందించువాడు శ్రీవైష్ణవభక్తుడు. ఈ త్రిగుణములుగల పురుష శ్రేష్ఠుడు త్రిభువనసుందరాంశమే. కావున రాముడు, కృష్ణుడు అనువారు త్రిభువన సుందరులు. వీరిని ఆదర్శముగా జేసికొని సానుభూతితో, స్వార్థరహితముగా భూతకోటికి సేవజేయుచూ అనంత సర్వాంతర్యామి శక్తికి సేవజేయుచూ వైష్ణవభక్తుడు మనవలయునని రామానుజుని దివ్యాజ్ఞ. శ్రీరామానుజుని దివ్యజ్ఞానమయిన విశిష్టాద్వైత సిద్ధాంతమును క్రియారూపమును బొందింపజేయుటయే రామానుజార్య దివ్యాజ్ఞ యగును.

అసంఖ్యాకులకు పంచ సంస్కారములు గావించి (జ్ఞానేంద్రియ ములను, కర్మేంద్రియములను పవిత్రపరచి) వారిని వైష్ణవ భావమున సోదరప్రేమతో మెలగునట్లు జేసిన మహాసంఘసంస్కర్త రామానుజుడు.

పంచవర్ణముల వారినుండి శిష్యులబడసి, సమాన ప్రతిపత్తినొసగి, కులవ్యత్యాసములను, కులభేదములను, అస్పృశ్యతా రాక్షసిని అంతమొందించుటకు ప్రయత్నించిన సంఘసంస్కర్త రామానుజుడు. రామానుజుడు దయాసముద్రుడుగాన దళితవర్గములను, పంచములను ఆకర్షింపగలిగినాడు.

వైష్ణవభక్తకోటిలో చేరుటకు, దైవకైంకర్యముల జేయుటకు, తిరుమంత్రోపదేశమును పొందుటకు, తిరుమంత్రార్థమును ప్రచారము జేయుటకు స్త్రీ పురుషులకును సమాన ప్రతిపత్తిని కలిగించిన దయార్ద్ర హృదయుడు రామానుజుడు. మత విషయమున సామ్యవాదమును పాటించినవాడు రామానుజుడు. మహమ్మదీయులు సైతము విశిష్టాద్వైత సిద్ధాంతమును పాటింపవచ్చునని చెప్పినాడు రామానుజుడు. ఈ విషయమును మరియొక అధ్యాయమున తెలిసి కొనగలరు.

ఆర్థిక సమత్వము ఇహసుఖములకు అవసరము, ఇహసుఖ మనగా సంఘమున వ్యక్తికి అవసరమయిన భౌతికసుఖము. మత సమత్వము వ్యక్తికి ఆత్మానందమును, సగర్వమును కలుగజేయును. ఈ సత్యమును తెలిసికొని ప్రకటించినవాడు రామానుజుడు.

తత్త్వత్రయ జ్ఞానముపై వెలసిన విశిష్టాద్వైత సిద్ధాంతము మానవ సమత్వమును శాస్త్రీయముగా వెల్లడించును. అందరును సృష్టియందు జన్మించినారుగాన, అందరు జగజ్జనకుని సంతానము, అందరును హరిజనులే. పంచములన బడువారిని రామానుజుడు "ఉన్నత కులజులని" పిలుచువాడు. వీరిలో రమారమి అందరు కష్టజీవులు. సంఘమునకు ఆర్థికపుష్టిని కలుగజేయువారు; నిరాడంబరులు; కావున ఉన్నత కులజులనబడుట సమంజసమే. దోపిడి వర్గమునకు సంబంధించినవారు ఉన్నత కులజు లెట్లవుతారు?

మతము సంఘసేవకు వినియోగపడవలయును అను సూచనను యామునాచార్యుడు చేయగా రామానుజుడు దానిని పూర్తిగా అమలు పెట్టినాడు.

పంచములకు ఆనాడే రామానుజుడు దేవాలయ ప్రవేశమును గల్పించినాడు. ఈ విషయమును గూర్చి మరియొక అధ్యాయమున తెలిసికొనగలము.

"నారాయణాయ" అను శబ్దము యొక్క అర్థము వెల్లడి యగునట్లు విశ్వవిశ్వేశ్వర సమ్మిళిత విగ్రహరాజముగా శ్రీరంగనాథుడు ప్రత్యక్షమై యున్నాడని రామానుజుడు వివరించియున్నాడు.

ముప్పది సంవత్సరముల వయస్సులోపలనే విశిష్టాద్వైత మతాధిపతియైన రామానుజుడు నూట యిరువది సంవత్సరములు జీవించుటచేత, ఈ దీర్ఘ జీవితకాలమున అనేక అద్భుత సంఘటనలు జరుగడము, రామానుజుడు తన సిద్ధాంత ప్రచారమున అనన్య సంఘసేవ జేయగలుగుటయు సంభవించినది. దీర్ఘమతాధిపత్య కాలమున రామానుజుడు వాస్తవముగా మహానుభావు డయినాడు; తన శిష్యులకును మహానుభవముల కలుగజేసినాడు, రాబోవు అధ్యాయములలో ఈ సంఘటనల గూర్చి సవివరముగా గ్రహింప గలరు.

# 20. గోవిందుని వృత్తాంతము

రామానుజుడు కంచిలో యాదవప్రకాశునొద్ద వేదవిద్యనభ్యసించు కాలమున తనపిన్నమ్మ కుమారుడు గోవిందుడు సహపాఠకుడుగా నుండుట, కాశీప్రయాణమున మార్గమధ్యమున నొకరాత్రివేళ గోవిందుని నలహాపై రామానుజుడు హత్యచేయ దలచిన యాదవప్రకాశుని శిష్యులనుండి తప్పించు కొనిపారిపోవుట, కాశీయాత్ర నుండి తిరిగి కంచి చేరు సందర్భమున గోవిందుడు శ్రీకాళహస్తిలోనే నిలిచిపోయి, అచట శివార్చనము జేసికొనుచూ నుండెనని యిదివరలో చదివి యుంటిమి.

ఇప్పుడు రామానుజుడు విశిష్టాద్వైత మతాచార్యుడుగా నుండి గోవిందు నుద్ధరింపదలచెను. ఆతనిని పిలిపించుట యెట్లు? ఆ కార్యమును వృద్ధుడును వారిమేనమామయునైన శ్రీశైలపూర్ణుడే సాఫల్యము చేయగలడు.

రామానుజుడు శ్రీశైలపూర్ణునితో, ''ఆర్యా! గోవిందుడట్లే శివలింగమును పూజించుచు శ్రీకాళహస్తిలో నిలిచియున్నాడు. మీరాతనిని కలిసి, విశిష్టాద్వైత సిద్ధాంతసత్యమును దెల్పి వానిని సత్యమార్గమునకు త్రిప్పుడ''ని కోరెను.

గోవిందుడు తనమేనల్లుడగుటచే నాతనిని ఉద్ధరించుట యెంతయో తగినకార్యమని తలంచిన శ్రీశైలపూర్ణుడు శ్రీకాళహస్తికి పయనమైపోయెను. గోవిందుడున్న పుష్పవనమును జేరెను. అది ప్రాతః కాలము. స్నానమాచరించి, నామధారియై, కోనేటిగట్టున విష్ణు సహస్రనామ స్తోత్రము పఠించుచూ కూర్చొనియున్నాడు శ్రీశైలపూర్ణుడు.

గోవిందుడు యథారీతి ప్రాతఃకాలస్నానమాచరించి, సమీపమున గల చెట్లనుండి, మొక్కలనుండి వివిధ సుమరాజముల గిల్లుచుండెను. మేనమామను జూచి బహుకాలమయినది గదా! వృద్ధుడైనట్టియు, తెల్లని శిరోజములు, పొడవుగడ్డముతోనున్న శ్రీశైలపూర్ణుని గోవిందుడు

గుర్తింపలేకపోయెను. శ్రీశైలపూర్ణుడే కలుగజేసికొని పలుకరింప మొదలిడెను. కంఠ స్వరమును బట్టి వెంటనే గోవిందుడు మామగారిని గుర్తించి, సాష్టాంగ నమస్కారము గావించెను.

"నాయనా! గోవిందా! మనోహరములగు ఈ సుందరకుసుమ రాజము లెవరికొరకు?" అని శ్రీశైలపూర్ణుడడిగెను.

"ఆర్యా! నేను వారణాసిలో పవిత్ర గంగాస్నానము జేయుతరి శివలింగమొకటి నాకు దొరకినది. ఆ శివలింగమును దెచ్చి యిచట ప్రతిష్ఠించుకొంటిని. దక్షిణకాశియను ప్రసిద్ధినందిన యీ శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రమున నిలిచి, ఆ పవిత్ర శివలింగమును పూజించు కొనుచూ కాలము గడపుచున్నాను", అని గోవిందుడు పల్కెను.

"నీవు అద్వైతివో శైవుడవో తెలియకున్నది. అద్వైత్వము ఒక దర్శనము (తత్త్వశాస్త్రము). దాని ప్రకారము భగవచ్ఛక్తి నిర్గుణము, నిరాకారము. కాని అద్వైతులనబడువారు ఈ నిర్గుణత్వమును దెల్పుచూ, మాయావాదమును బలపరచుచూ, అనేకానేక వేద దేవతలను స్తోత్రము జేయుచూ, షణ్మతములును ఒకే సత్యమునకు మార్గములని ప్రకటించుచూ, వారు మనకలోబడి, ప్రజలను అంధకారములో మతిభ్రమలో పెట్టుచున్నారు.

నాయనా! నీవు శివలింగార్చన చేయుచున్నావు. కావున పరబ్రహ్మను సాకారముగానే చూచుచున్నావుగదా! నీలింగము వెనుక త్రినేత్రుడును, నాగభుషణుడును, విభూతిధారియునగు పురాణ ప్రసిద్ధ శివవిగ్రహమును మదిలో దలంచుకొనుచున్నావుగదా! కావున నీవు అద్వైతివిగావు. నిన్ను శైవుడని పిలువవలసి యున్నది. భగవచ్ఛక్తి శుభస్కరమైనట్టియు, శుభమైనట్టిదియు నైయున్నందున శివుడు, శంకరుడు అని యనుచున్నావు. కాని యిట్టి శుభస్కర శివమైన ఆకారమునకు సరిపోయినదేనా నీ యూహావిగ్రహము? చేతిన కపాలమును దాల్చి, మరియొక హస్తమున త్రిశూలమును దాల్చి, ప్రళయాగ్నిని ప్రజ్వలింపగల ముకుళిత తృతీయ నేత్రధారియై,

శరీరమంతయు బూదిబూసికొని, శ్మశానమున సంచరించువాడు భగవంతుడని, శివుడని, శంకరుడని యూహింపగలవా? ఎంతటి పరస్పర విరోధభావములు మెలికెలు వేసికొని యున్నవో ఆలోచింపుము గోవిందా!"

"ఈవిషయమును గ్రహింపుము - సర్వాంతర్యామియగు ఈశ్వరశక్తియే (వైష్ణవశక్తియే) శివమును, రుద్రమును రెండును అగుచున్నది. శివరుద్ర వైష్ణవశక్తి యొక్క మూర్తిరూపము శ్రీమన్నారాయణమూర్తి. భగవచ్ఛక్తి సృష్టి స్థితిలయములకు కారణభూత మయినదిగాన అందులో ఒక్క విభూతిగా నీవు ఆరాధింప వలసినది? నీవు మూడు విభూతులను ఒక సమ్మేళనామూర్తియందు చూడగలగాలి. శివరుద్ర వైష్ణవమైన ఆ ఈశ్వరశక్తిని శ్రీమన్నారాయణ మూర్తిగా ఊహించి, వానికి అనంత కల్యాణగుణములనాపాదించి, సంశ్లేషించుట యెంతటి పరమానంద స్థితియో ఊహించుకొనుము. దార్శనికము (దర్శనము philosophy) మతము అనునని మానవులను సన్న్యాసులుగా మార్చుటకుగాదు; సృష్టిని, సంఘమును నిరసించుటకు గాదు; విశ్వప్రేమను పెంపొందించుటకు; జీవితమును పరమానంద భరితము జేయుటకు. కావున గోవిందా! గోవిందుడవు కమ్ము! సర్వులను ఆనందింపజేయువాడు గోవిందుడు. నీవు కర్మ సన్న్యాసమును బూనితివి; కాని నీవు నిజముగా కర్మఫల సన్యాసివి కావలయును. నీ వ్యక్తిగత మోక్షమును కాంక్షించుచున్నావేమో! మోక్ష సన్న్యాస యోగమున లోకకల్యాణమునకు తోడ్పడుము. సత్యమైన తత్త్వత్రయ జ్ఞానమును పొందుము. నిరాకారుడగు ఈశ్వరశక్తిని (వైష్ణవశక్తిని సర్వవ్యాపితముగాన) అనంత కల్యాణగుణమూర్తిగా, త్రిభువన సుందరునిగా భావించి, సంశ్లేషపడి ఆనందింపుము గోవిందా! నీ జ్ఞానమును, నీ సేవలను సర్వాత్మున కర్పించుటలో వాస్తవముగా సర్వాత్మలకు అందజేయుము. ఈ అంధకార సన్న్యాసము నుండి బయటపడుము. విశ్వమును ప్రేమింపుము. లెమ్ము, రమ్ము", అని శ్రీశైలపూర్ణులు ప్రబోధించెను.

గోవిందుడు, "ఆర్యా! మీరు నాతో సంభాషణను ప్రారంభించి నపుడు నేను మొదట దురభిప్రాయపడినాను. మూఢ శైవులవలె మీరును మూఢవైష్ణవ తెగవారని భావించితిని. ఇపుడు నా పొరపాటును గమనించితిని. మీరు నుడివిన సమాసము "శివరౌద్రవైష్ణవము" అనునది శ్రీమన్ నారాయణమూర్తి యందున్నదని తెలిసికొంటిని. విశ్వరూపమున అన్ని విభూతులున్నవి. అన్ని విభూతులు గలిగిన ఆ విశ్వరూపమునే దలచి, స్మరించి, మీదు మిక్కిలి సంశ్లేషింప వలయునని మీరు నుడివిన విధానము నాకు నచ్చినది. ఇప్పుడు నాకు భగవద్గీతార్థము (విశ్వరూప ప్రదర్శన యోగము, విభూతి యోగములు) నాకు సువిదితములు, విచారించి చూడ అజ్ఞానులును అమాయకులును అయిన మానవులను మసకనుండి కటికచీకటిలోనికి నెట్టుచున్నవి. అజ్ఞాన పంకిలములో కూరుకపోతున్న నన్ను వెలుగుదరికి లాగితివి. విష్ణుసహస్రనామస్తోత్రమున శివ, రుద్ర, శంకర శబ్దములున్నవి కదా! ఈ సహస్రనామములు పరస్పర విరోధములుగాక, యివి యన్నియు కలిసి పరబ్రహ్మ మగుచున్నది అని చెప్పుటలో విష్ణు (సర్వవ్యాపకము) శబ్దమున తక్కిన శబ్దార్థములన్నియు ఇమిడి యున్నవను సత్యమును ఇపుడు గ్రహించితిని. ఆర్యా మీరొసగిన యీ దివ్య జ్ఞాన మెక్కడిది?" అని ఆతురతతో నడిగెను. శ్రీశైలపూర్ణుడు, "గోవిందా! నీవు విజ్ఞానశాలివి! వివేకివి! బుద్ధికౌశలయుతుడవు! కంటి చూపుగలవానికే చీకటియందు దీప ముపకరించును. గ్రుడ్డివానికి చీకటియును, వెలుగు దివిటీయును సమానములు. నీ విచక్షణ జ్ఞానమునకు సంతసించితిని.

కాని, వినుము. ఈ జ్ఞానామృతము, ఈ వివరణము నావిగావు. సర్వదార్శనిక గ్రంథముల పఠించిన వారికిని ఈ జ్ఞానము సులభముగా లభ్యపడదు. మీ పెద్దమ్మ కుమారుడు రామానుజుడు, కాంచీపురి యందు యాదవప్రకాశుని యొద్ద నీ సహపాఠి, యామునాచార్యుల నిర్యాణము తరువాత శ్రీరంగమున శ్రీవిశిష్టాద్వైత సిద్ధాంత మఠాధిపతియైయున్నాడు. ఈ దివ్యజ్ఞానము రామానుజునిది. వీకంటె

ఎంతయో పిన్నయైనను, నాకండ్ల యెదుట పుట్టినవాడైనను, రామానుజుడు చూపిన యీ దివ్య జ్ఞానజ్యోతికి నేను ముగ్ధుడనై వానికి ప్రపత్తుడనయితిని. రామానుజ సిద్ధాంతమునకు అద్భుత పడినవారై, వాని ఆచార్యులెల్లరు వానికి ప్రపత్తులయినారు. రమ్ము, రామానుజుని దర్శింపుము. ఆయనకు ప్రపత్తిని వెల్లడింపుము. రామానుజుని నుండి తిరుమంత్రమును, తిరుమంత్రార్థమును బడయుము. లోక కల్యాణార్థము, కర్మఫలసన్న్యాసమున మోక్ష సన్న్యాస యోగమున, నీ జీవితము నంకితముగావింపుము. పరమానందమున జీవితయాత్ర సాగింపుము. లోకసేవ యందు రామానుజుని అనుసరింపుము. రమ్ము గోవిందా", అని ప్రోత్సాహయుక్తముగా పల్కెను.

గోవిందుడు, "ఇది శుభసమయము. నా సంశయములు దీరినవి. శ్రీరంగమునకు నీతోడ ఇప్పుడే వచ్చెద. సోదరుడు రామానుజుడే నాకు ఆచార్యుడు కాగలడు", అనెను.

"గోవిందా! రామానుజ దివ్యజ్ఞానమునకు ఆయన యొక్క ఆచార్యులే ప్రపత్తిని వెల్లడించినారని చెప్పియుంటినిగదా! మరియొక అద్భుతమును వినుము: యాదవప్రకాశుడే రామానుజునకు శరణాగతుడై, అద్వైతవాద మాయావాదమునూ వీడి, విశిష్టాద్వైత సిద్ధాంత దర్శనమును స్వీకరించినాడు. ఇక ఇతరుల దేమున్నది? రామానుజునకంటె పెద్దవారందరు ఆయనకు శిష్యులయినారు. గురుస్థానమునకు వయస్సు కారణమగునే? తేజోనిధికి వయస్సు కారణమగునే?" అని శ్రీశైలపూర్ణుడు చెప్పగా, గోవిందుడు పరమానందమున అబ్బురపడెను.

"గోవిందా! యాదవప్రకాశుడు తన పూర్వాశ్రమ నామధేయమును త్యజించి, యిపుడు గోవిందదాసు అను తిరునామమున కాంచీ పురమున తన ఆశ్రమమున భక్తియోగమున జీవితమును ఆనంద మయము చేసికొన గలిగి యున్నాడని, "శ్రీశైలపూర్ణుడు తెలుపగా గోవిందుడు తనచెవులనే తాను నమ్మలేకపోయెను.

గోవిందుడు తనమేనమామ శ్రీశైలపూర్ణునకు కృతజ్ఞతను వెల్లడించుటకు భాషకొరతగలవాడై, మామగారి పాదములపై సాష్టాంగ పడి నిశ్శబ్దముగా కొంత తడవట్లేయుండి, తరువాత ఆనంద బాష్పముల రాల్చుచూ పైకిలేచి, ముకుళితహస్తుడై, "మామగారు! నేను మీకు కృతజ్ఞతనెట్లు తెల్పగలను? తలిదండ్రుల చిన్న వయస్సులో పోగొట్టుకొనిన మా అమ్మ పెద్దమ్మలకు మీరే వివాహములు గావించి పితృసములైనారని వారనుట నేను వినియున్నాను. నాకు బాల్యమున తండ్రివలె మీరు నాయభివృద్ధిని కోరియుంటిరి. ఇప్పుడు నన్ను జ్ఞానమార్గమునకు త్రిప్పితిరి. మీరే నాకు మేనమామవు, తండ్రివి, మార్గదర్శకుడవు అయినారు. ఇదియే నా అంజలి", అని గోవిందుడు పల్కెను.

శ్రీశైలపూర్ణుడు, వలనిండుగ మత్స్యములబడసిన జాలికునివలె, ఒక ఆవిష్కారమును గావించిన శాస్త్రజ్ఞునివలె, పరమానందముతో, తృప్తితో గోవిందుని వెంటగొని శ్రీరంగపురి జేరెను.

బహుశిష్య భక్తజన పరివృతుడై వేదాంతోపదేశమును గావించు చున్న రామానుజుని గోవిందుడు తటాలున జూచెను. అతని అనుభూతి వర్ణనాతీతము. గోవిందుడు రామానుజునకు ప్రపన్నుడై సాష్టాంగ దండము సమర్పించెను. "అన్నా" అని యిదివరలో రామానుజుని సంబోధించుచున్న గోవిందుడు, ఇపుడు యతిరాజును, ఆచార్యులును అయిన శ్రీరామానుజుని "స్వామీ" అని సంబోధించుచూ, "సర్వవృత్తాంతము మామగారి నుండి గ్రహించితిని. ఆ మహానుభావుడు పెడమార్గమున బడి నన్ను ఉద్ధరింప ఋజుమార్గమునకు జేర్చినాడు. ఇక నన్నుద్ధరింపవలసిన బాధ్యత మీదే! అనుగ్రహించి నన్ను శిష్యునిగా స్వీకరింపుము", అని ప్రార్థించెను.

రామానుజుడు వాత్సల్యముతో గోవిందుని చేరదీసి ఆశీర్వ దించెను. "గోవిందా! నీవు ముందుగా స్వగృహమునకు పోయి నీతల్లిగారిని, నీ భార్యను చూచి వారి యోగక్షేమముల విచారింపుము.

వారు నీకొరకు పరితపించుచున్నారని వినియున్నాను. మొదటవారి నోదార్చి, వారికి ముదమును గూర్చుము. తరువాత శ్రీశైలపూర్ణునకు శిష్యుడవై ద్రావిడ ప్రబంధము, ఇతర వైష్ణవ మతగ్రంథములను పఠింపుము. ఆ మహాత్ముని బోధనామృతము నిన్ను పవిత్రుని జేయగలదు", అని గోవిందుని ఆశీర్వదించెను.

సందర్భానుచితముగా గోవిందుడు తన పెద్దమ్మయు, రామానుజుని తల్లియునయిన కాంతిమతి మరణమును గూర్చి ప్రస్తావించెను. ఈ సంఘటన జరిగినపుడు గోవిందుడు శ్రీకాళహస్తిలోనే సన్న్యసించి యుండెను. "గోవిందా! తత్త్వత్రయ జ్ఞానము గలవాడు గతించినవారిని గూర్చి చింతించడు; కాని గతించిన వారి సుగుణములను సేవలను స్మరించి, వారికి కృతజ్ఞతను మానసికముగా వెల్లడించి, సద్గుణులగువారి ఆదేశములను పాటించుట తగియున్నది. అంతవరకే గతించిన నా తల్లి విషయము. కాని మానవుడు బ్రతికియున్న తనవారియెడ తనకున్న విధ్యుక్తధర్మమును విస్మరింప రాదు. అందువలననే వేగముగా స్వగ్రామము జేరి నీతల్లి, నీ భార్యను చూచి ఓదార్చుమని అంటిని", అని రామానుజుడు పల్కెను.

గోవిందుడు పయనించి కాంచీపురమునకు సమీపముననున్న తన స్వగృహము జేరెను.

సన్న్యసించి శ్రీకాళహస్తిలో శివార్చన చేయుచుండినట్టియు, ఇక తిరిగి యిల్లుజేరడని భావింపబడిన గోవిందుడు ఇంటికిరాగానే తల్లి దీప్తిమతియొక్కయు, భార్యయొక్కయు ఆనందమునకు మేరలేదు. ఇదంతయు రామానుజుని అనుగ్రహమని భావించిరి.

గోవిందుడు తల్లితో, "అమ్మా! నేనొక మూఢభక్తుడనై మూఢ విశ్వాసమున సన్న్యసించి, శ్రీకాళహస్తిలో శివలింగార్చనము గావించుచు నేకాకిగాయుంటిని. మేనమామగారివలన రామానుజుని విశిష్టాద్వైత సిద్ధాంత రాజమును విని, చీకటినుండి వెలుగుబాటకు జేరినాను. శ్రీరంగమునకు వచ్చి శ్రీరామానుజుని ఆచార్యునిగా స్వీకరించినాను.

వారి యాజ్ఞానుసారము నేనూ మీ దర్శనార్థము స్వగృహమునకు వచ్చినాను. అమ్మా, నీవును, నీకోడలును వినమ్రులై, నిరాడంబరులై, భక్తి మార్గమున జీవయాత్ర జేయుచుంటిరని విని సంతృప్తి జెందుచున్నాను. అమ్మా రామానుజుని యాజ్ఞానుసారము మీ యిరువుర దర్శించితిని. కాని నేను ఇప్పటినుండి యిటనే మీవద్ద నిలిచిపోజాలను. శ్రీరామానుజుని మరియొక యాజ్ఞానుసారము నేను తిరుమలకు పోయి, మేనమామగారి వద్ద వైష్ణవ వాఙ్మయమును స్వాధీనము చేసికొనవలసియున్నది. ఈ పనిపూర్తి యయినతదుపరి రామానుజ నాజ్ఞప్రకారము ప్రవర్తించగలను. తిరుపతి ప్రయాణమునకు నన్ను ఆశీర్వదించి పంపుమమ్మా," అని చెప్పెను.

గోవిందుని పునరాగమనమునకు సంతసించిన ఆతని తల్లియు, భార్యయు గోవిందుని నిర్ణయమును సంతోషముగా అంగీకరించిరి. వానిపునర్దర్శనముతోనే వారు ఎంతయో తృప్తి నందిరి. గోవిందుడు రామానుజుని ప్రభావపరిధిలోనికి వచ్చుటయే వారికి సంపూర్ణానందమును దెచ్చినది. ఇపుడు రామానుజ మతసిద్ధాంతమును గోవిందుడు పూర్ణముగా గ్రహించుటకు మేనమామగారి వద్దకే తిరుమలకు పోవడమనునది గోవిందుడు స్వగృహమున నున్నట్లే వారు భావించిరి.

శ్రీశైలపూర్ణుడు (పెరియతిరుమలనంబి) రామానుజునితో, "యతిరాజా! నేను వృద్ధుడనయితిని. యామునాచార్యుని యాజ్ఞాను సారము నీవు విశిష్టాద్వైత సిద్ధాంత మతాధిపతివయినంతవరకు ఇచట శ్రీవేంకటేశ్వరుని సన్నిధానమున నాశేషజీవితమును గడుప దలచితిని. గోవిందు నచటికి రమ్మని చెప్పిపంపినాను. అతడు తిరుమల చేరులోపలనే నేనచట చేరుట యుక్తము", అని చెప్పి, రామానుజుని సమ్మతితో శ్రీశైలపూర్ణుడు తిరుమలజేరి, తిరుమల వానమున శ్రీవేంకటేశ్వరుని సేవించుచూ, పెరియతిరుమలనంబి అను తిరునామమున ప్రసిద్ధిగాంచెను. అనేక భక్తులకు తిరుమలలో

విశిష్టాద్వైతపరముగా తిరుమలనంబి వేదాంతమును బోధించు చుండెను.

తిరుమలనంబి త్యాగశీలి. కార్యశూరత్వముగల మహానుభావుడు. తాను రామానుజునకు ఎట్టి సత్సంకల్పముతో నామకరణము జేసెనో, అట్లే రామానుజుడు లోకసేవకుడై ఆచార్యుడగుట ఆయన కెంతయో తృప్తిని దెచ్చినది. కార్యసిద్ధి గావించి అట్టివారికి శేషజీవితమును భగవద్భక్తితో గడుపుటయేగదా పరమావధి! విశిష్టాద్వైత సత్వగుణ ప్రధానమయిన రజోగుణమును ప్రోత్సహించును. సన్న్యాసమును అనగా కర్మసన్న్యాసమును నిరసించును. కర్మ ఫలసన్న్యాసమున ప్రోత్సహించును, మోక్షసన్న్యాసయోగమును ప్రబోధించును. కావున లోకకల్యాణార్థము, స్వార్థరహితుడుగా మానవుడు అవసానకాలము వరకు సేవాతత్పరుడుగా నుండవలయును. అందువలననే శ్రీశైలపూర్ణుడు అతివృద్ధాప్యమును గూడా, మంచమును బట్టుకొని యుండక, తనశేషజీవితమును, తిరుమలపై విశిష్టాద్వైత సిద్ధాంతా శ్రమమును నెలకొల్పి భక్తజనులకు తన బోధనామృతమును పంచిపెట్టుచూ, గడపెను.

గోవిందుడు అనతికాలములోనే తిరుమలజేరి శ్రీశైలపూర్ణునకు శిష్యుడై, వైష్ణవ వేదాంత గ్రంధపఠనమును సాగించెను.

★

## 21. యజ్ఞమూర్తి వృత్తాంతము

యజ్ఞమూర్తి యనునతడు మహాపండితుడు, తార్కికుడు, శాస్త్రవేత్త, వేదాంతి, అద్వైతసిద్ధాంతావలంబకుడు. అతడు ఉత్తరదేశ యాత్రగావించి, అనేక వేదాంతులతో తర్కించి, అద్వైత మతమును (మాయావాదమును) అనేకులచే ఒప్పింపజేసిన గొప్ప ఆధ్యాత్మిక తత్త్వవేత్త. అతడు తిరిగి దక్షిణదేశమునకు వచ్చి, శ్రీరామానుజుడు శ్రీరంగమున విశిష్టాద్వైత సిద్ధాంత మఠాధిపతియై వేరు సిద్ధాంతమును బోధించుచున్నాడని తెలిసి, వానిని తర్కమున నోడించి, తన సిద్ధాంతమును అతనిచే అంగీకరింప జేయవలయుననెడి ఉద్దేశముతో శ్రీరంగపురి జేరెను.

రామానుజుడు తన శిష్యగణముతో మఠమున గూర్చొని వేదాంతోపన్యాసము గావించుచుండెను. ఒక శకటము మఠమునకు ముందు నిలిచినది. అందుండి ఒక కాషాయ వస్త్రధారి సన్న్యాసి యొకడు దిగెను. బండిమనిషి బండినుండి గ్రంథముల మూటలను, ఒక్కొక్కదానిని తెచ్చి, మఠముయొక్క ముందు పంచలో చేర్చుచుండెను.

రామానుజుడెదురేగి, అర్ఘ్యపాద్యముల నొసగి, ఆహ్వానించి, ఆసీనునిగావించి, శాంతముగా, "తమరెవర"ని ప్రశ్నింపగా, తాను "యజ్ఞమూర్తి" నామధేయుడననియు, అద్వైత మాయావాదిననియు, ఉత్తరదేశ వేదాంతపండితుల నెల్లరనోడించి, వారినందరిని అద్వైత మతమునకు మరల్చివచ్చిన అజేయుడు ననిపలికెను.

రామానుజుడు తన స్వభావ, ఆచారముల ప్రకారము భక్తితో యజ్ఞమూర్తికి భోజన మేర్పాటుగావించి, భోజనానంతరము యజ్ఞమూర్తిని విశ్రాంతి తీసికొమ్మని చెప్పెను.

విశ్రాంతి అనంతరము సాయంకాలము మూడుఘంటల సమయ మప్పుడు రామానుజుడును, యజ్ఞమూర్తియు ఎదురెదురుగా ఆసీనులై, సంభాషింపదొడగిరి. భక్తులు పండితులు, కూర్చొనియుండిరి.

రామానుజుడు యజ్ఞమూర్తి ఆగమన కారణము నరయగోరెను.

యజ్ఞమూర్తి, "నీవేదియో విశిష్టాద్వైతమను పేర నూతనమత సిద్ధాంతమును బోధించుచున్నావని వింటిని. నీవు అద్వైతమును, మాయావాదమును వ్యతిరేకించు వాడవని తెలిసినది. నీతో తర్కించి, నిన్ను ఓడించవలయుననెడి సంకల్పముతో అరుదెంచితిని", అనెను.

రామానుజుడు మందహాసముతో, "మంచిది. కాని, ఈ గ్రంథ సముదాయము నేలగొనివచ్చితిరి? ఎంతశ్రమ తీసికొన్నారు? ఈ గ్రంథములను బండిలో వేసికొని యింతదూరము పయనించి వచ్చినారు"!, అని పల్కెను.

యజ్ఞమూర్తి పకపక నవ్వి, "నేనేదో గాలిమాటలు పలుకువాడవని, భావించితివేమో! నా వాదములు ప్రమాణ సమ్మతములు. ప్రమాణముల నెప్పటికప్పుడు చూపి, నిన్ను ఓడించుటకు ఇటకు వచ్చితిని. నాతో తర్కమునకు సంసిద్ధుడవు కమ్ము", అని హెచ్చరించెను.

రామానుజుడు చిరునగవుతో, అడకువతో, "ఆర్యా! మీరు మహాపండితులమని నుడివితిరి. దేశములోని వేదాంతులనెల్ల నోడించితిరని తెల్పితిరి. దానికి తార్కాణము తమరిపుడిచటికి తెచ్చిన అసంఖ్యాక గ్రంధరాజ సంపుటులు చాలును. మిమ్ముల నేను కాదనజాలను. ఇట్టి వానిలో తర్కమునకు తావెక్కడిది? ఒక్క విషయమును విన్నవించెదను; అవధరింపుము. తర్కమునకు దిగిన వారి మనస్సు విజయకాంక్షపై నుండునేగాని, సత్యాన్వేషణపై నుండజాలదు. స్వార్థరాహిత్యతత్త్వము, అడకువ, శాంతి, యనునవి సత్యాన్వేషణమునకు తోడ్పడును", అని పల్కెను.

యజ్ఞమూర్తి, "ఓహో మంచి యెత్తు వేసినావే! వాదమునకు భయపడ్డావు! సరే, ఓటమికి సమ్మతించినట్లేనా?" అని ప్రశ్నించెను.

రామానుజుడు, "ఆర్యా! విజయకాంక్షతో తర్కించినవాడు ఓడినపుడు, పరాభవమును తలంచును. నాకట్టి విజయకాంక్ష లేదు.

తర్కము కాలహరణమునకు కారణమగును. అట్టి కాలహరణము అప్రయోజకము. నేను ఓటమికి అంగీకరించుచున్నాను. మీరు విద్యాధికులు. మీవద్ద నేను నేర్చుకొనదగిన విషయములనేకము లుండును; నేర్చుకొందునుగాక", అని మెల్లగా సవినయముగా పల్కెను.

యజ్ఞమూర్తి రామానుజుని అడకువకు, అహంభావరాహిత్య మునకు, శాంతస్వభావమునకు అచ్చెరువంది, నిరుత్తరుడై, నిశ్శబ్దముగా కూర్చొని యుండెను.

రామానుజుని ప్రథమశిష్యుడు (ముదలియాండాన్) సకల వేద విద్యాపారంగతుడును, తార్కిక శిరోమణియు, రామానుజ పదాంకిత దాసానుదాసుడను అగు దాశరథి, "ఆచార్యవర్యా! ఈ యజ్ఞమూర్తి మనకు జూపుటకు అనేకగ్రంథములను ప్రమాణముగా దెచ్చియున్నాడు గదా! వీనికి తెల్పదగు ప్రమాణములన్నియు నామస్తకమస్తిష్కమున నున్నవి. నేనితనిని తర్కమున నోడించి, మీపాదాక్రాంతునిగా జేసెదను. ఈలోన మీరు విశ్రమింపుడు", అని పల్కెను. మఠవాసులెల్లరు నివ్వెరపోయి చూచుచుండిరి.

రామానుజుడు తన శిష్యుడు దాశరథిని వారించుటకోయన మాటాడక, తనదక్షిణహస్తమునటు సంజ్ఞగా నెత్తెను. ఆచార్యుని సన్నను అవలోకించిన దాశరథి అవనతవదనుడై మాటాడక కూర్చొనియుండెను. అప్పుడే కొలది నిమిషములలో రామానుజుడు దాశరథిని అచ్చటనుండి వేరుపనిపై బంపివేసెను (సంఘటన గూర్చి సవిస్తరముగా రాబోవు అధ్యాయమున తెలిసికొనెదము).

తన శిష్యుని వారించిన విధమునకు, అతనిని వేరుపనిపై అచట నుండి పంపివేసినందులకు యజ్ఞమూర్తి రామానుజుని వైపు నివ్వెరపడి చూచుచుండెను. రామానుజని వైఖరి యజ్ఞమూర్తికి వివేకోదయమును గావించెను. అతని కా రాత్రి నిద్రపట్టలేదు. ఆలోచించుచునే యుండెను - "నాపాండిత్యము వలనను, నాతర్కకౌశలము వలనను, నా

విజయముల వలనను నాకు అహంభావము హెచ్చినదేగాని, అంతకంటే ఆధ్యాత్మిక ఫలితము. ఆత్మశుద్ధి నాకు కనబడుటలేదు. నా జీవితమింతవరకు వృధాఅయినట్లే గ్రహింపవలసియున్నది. నిజమైన బ్రాహ్మణుడు విద్యా వినయ సంపన్నుడుగా నుండవలయును గదా!" అని యజ్ఞమూర్తి తనలోతాను వితర్కించుకొనుచూ రెప్పవాల్చక ఆరాత్రి కాలమంతయు గడపెను.

మరునాడుదయమున యజ్ఞమూర్తి రామానుజునకు ప్రణమిల్లి, "ఆచార్య, మీదర్శన భాగ్యము వలన నా అహంభావము అంతరించినది. నేను ధన్యుడనయితిని. నా మనవి నాలకింపుడు. సత్య మార్గమును తెలిసికొనుటకు మాత్రము ఇక మీతో గోష్ఠి జరుపదలచితిని. అనుగ్రహింపుడు. మీతో సంభాషించి, నేను దివ్యజ్ఞానమును పొందగలననెడి విశ్వాసము నాకు జనించినది. నా కోరికను సఫలముజేసి, నన్ను ఋజుమార్గమున బెట్టుడు", అని ప్రార్థించెను. మహాప్రతిభాశాలియు, అద్వితీయ పాండిత్య శూరుడును. అగు యజ్ఞమూర్తితో గోష్ఠి సలుపుటకు రామానుజుడు సమ్మతించెను.

ప్రతిభాశాలురైన యీ మహాశయద్వయము ప్రస్థానత్రయముపై పదునేడు దినములు తర్కించిరి. ఈ తర్కము పరస్పరము వారిరువురకు ఆనంద దాయకముగా నుండినవి. శ్రోతలకందరికి అదియొక ఆధ్యాత్మికమైన విందుగా నుండెను. ఎల్లరు పరమానంద భరితులైరి.

కడపట అష్టాదశ దినమున గోష్ఠియొక్క సారాంశముగా రామానుజుడు ఇట్లు సెలవిచ్చెను:

"ఏకమేవాద్వితీయం - పరశక్తి యొక్కటియే. అది అద్వితీయము, ఉపనిషత్తులలో పేర్కొనబడిన ఈ అద్వితీయ ఈశ్వరశక్తియే మూర్తిత్వ మున శ్రీమన్నారాయణమూర్తి అని పిలువబడుచున్నది. ఈశ్వరశక్తి నిర్గుణమైన శ్రీమన్నారాయణమూర్తిని సగుణముగా తలంచు చున్నాము. ఈ సగుణమూర్తిని, ఈ త్రిభువన సుందరమును, ఈ సత్య

సుగుణ సౌందర్యమూర్తిని, మానవులు అర్థయుక్తముగా భక్తిప్రపత్తులతో ప్రేమదాస్యములతో సేవింపవలయును. సర్వాంతర్యామిని ఈ మూర్తి యందేగాక, సర్వజీవులలో చూడగలిగి విశ్వమును ప్రేమింపగలిగి యుండవలయును చేతనుడు. సర్వులును లింగ, వర్ణ, భాషాభేదములు లేకుండా మోక్షమున కర్హులు. మోక్షమనగా తాను తనసంఘము నుండి బంధ విముక్తుడై, సమ భావమున, ఉదాసీన భావమున, ఆనందమున నుండగలుగుటయే, స్వార్థరహితుడై వైష్ణవ కైంకర్యమున నిమగ్నులై యుండుటయు మోక్షమనబడును. ఈ మోక్షభావము తన్ను విశ్వమానవునిగా జేయును. ఈ స్థితియే పరమపదము అనబడును", అని రామానుజుడు నుడివెను.

రామానుజుడు నిర్వహించిన మోక్షభావములోని సంఘసేవా తత్పరతయు, పరమానంద భావమును యజ్ఞమూర్తికి సంపూర్ణముగా నచ్చినది. రామానుజునకు ప్రపన్నుడైన యజ్ఞమూర్తి, " ఆచార్యవర్యా! మీరు విద్యాసాగరులు, జ్ఞానసముద్రులు, దయైక సింధులు, భగవానులు - అహంకారపూరితుడనై తర్కమునకు మిమ్ముల బిలిచి, అపరాధి నయితిని; క్షమింపుడు - అడియేన్ నన్ను మీ శిష్యపరమాణువుగా స్వీకరించి, నన్నుద్ధరింపుడు. జీవితమున్నంతవరకు శుష్కవేదాంత తర్కవాదములతో గడిపితిని. నన్ను తరింపజేయుడు, కేశవాత్మజా, రామానుజా, కాంతికిరణరూపా", అని ప్రార్థించెను.

రామానుజుడు యజ్ఞమూర్తిని ఆశీర్వదించుచు, "వత్సా! యజ్ఞమూర్తి! చింతింపకుడు! నీవు వేదశాస్త్ర కోవిదుడవు. నీకు తెలియనిది ప్రస్థాన త్రయమున లేదు. అయినను, నిన్నావరించి యుండిన మాయామేఘము ప్రస్తుతము నీవుపొందిన ప్రపత్తి యోగమున పటాపంచలయినది. స్వార్థరాహిత్య భావమహిమ అట్టిది", అని అభయ ప్రదానముగా బల్కెను.

యజ్ఞమూర్తి పరమానందమున, "స్వామీ! ఎంబెరుమానార్ అను తిరునామము తమకెట్లు తగియున్నదో అనుసత్యమును గమనించితిని

వాస్తవముగా మాబోటి వారి నుద్ధరింప నవతరించిన ప్రభువులు మీరు! ఎంబెరుమానార్", అని స్తుతించెను", ప్రణమిల్లెను.

రామానుజుడు, "నీవు నాకు సర్వవిధముల సమానుడవు. నీ జ్ఞానసాగరము అంతు లేనిది. నేనును ప్రణమిల్లెదను. మన యిరువురి పరస్పర గౌరవభావము. నన్ను "ఎంబెరుమానార్" అని సంబోధించిన నీకు ఇపుడు నేను "అరుళాళప్పెరుమాళెంబెరుమానార్" అను తిరునామము నొసగుచున్నాను. కంచి వరదరాజస్వామి పిలిచి నంతనే పలుకుస్వామి అని ప్రసిద్ధి. వారి దయ నాకెల్లప్పుడును గలదు. నిన్ను వారిదాసునిగా భావించి యీ తిరునామమున నిన్ను పిలిచెదగాక. నీవు వైష్ణవ విశిష్టాద్వైత గ్రంథములను అనతికాలములో పరిశీలించి, వాని సారముగా "జ్ఞానసారము" అను దివ్యరచనను గావింపుము. నీవు విశిష్టాద్వైతమునకును, వైష్ణవభక్తి కోటికి అనన్యసేవ జేసినవాడ వగుదువుగాక", అని ఆశీర్వదించెను.

శ్రీరామానుజాజ్ఞానుసారము యజ్ఞమూర్తి అరుళాళప్పెరుమాళెం బెరుమానార్ అను తిరునామమున శ్రీరంగమున ప్రత్యేకముగా ప్రశాంతి కొరకు నొక మఠము నందు నివసించుచూ, అతివేగమున వైష్ణవ విశిష్టాద్వైత సారస్వతమును వల్లెవేయుచూ, తన ఆధ్యాత్మిక జ్ఞానమున సంపూర్ణతను బడసెను. శ్రీరామానుజునిచే గౌరవింపబడి, ఆశీర్వదింప బడిన మహాత్ముడుగాన వీరుచాల ప్రసిద్ధులుగా వెలయచుండిరి. ఆచార్య అజ్ఞానుసారము ఆళ్వారాచార్యుల శ్రీవచన భూషణ సారముగా, "జ్ఞానసారము" "ప్రమేయసారము" అను రెండు అద్వితీయ గ్రంథరాజముల రచించిరి. ఈ గ్రంథముల విలువలను వర్ణింవనలవిగాదు. పాఠకులు వాని భావముల గమనించి తరింపవలసినదే! హిమగిరిని ముకురమున జూచిన విధమున సర్వ అధ్యాత్మిక విజ్ఞానమును ఈ గ్రంథద్వయము నందు బడయనగును. (ఈగ్రంథభావమును "శ్రీభక్తిసారము" అని నామమున నాచే రచింప బడిన గ్రంథమున పాఠకులు చదివి ఆనందింపగలరు)

అరుళాళప్పెరుమాళెంబెరుమానార్ జీయరు శ్రీరంగమున తనప్రత్యేక మఠమున ధ్యాన, రచనలను గావించుచు భక్తులు నుత్తేజ పరచుకాలమున, ఒకనాడు కొంకణరాష్ట్రము నుండి కొందరు వైష్ణవ భక్తులు శ్రీరంగమున కేతెంచి, ఎంబెరుమానార్ల (రామానుజ) మఠమెక్కడనని విచారించుచుండగా, అచ్చటివారు, "ఏ యెంబెరు మానార్ల మఠము?" అని ప్రశ్నించిరి. "ఇచ్చట ఇద్దరు ఎంబెరుమానార్లు ఉన్నారా? మాకు తెలియదే! శ్రీమద్రామానుజుడే గదా ఎంబెరుమానార్ అను తిరునామమును ధరించియుండేది? మాకు వారుగాక యితరు లవసరము లేదు", అనిరి.

ఈ విషయము యజ్ఞమూర్తికి తెలిసినది, "ఓహో! నేను నాఅచార్యుడయిన రామానుజునకు (ఎంబెరుమానార్లకు) ప్రత్యర్థి నయితినా? అపచారము! రామానుజుడే యెంబెరుమానార్ అగును. నాకు ప్రత్యేక తిరునామము, మఠము తగవు," అని యజ్ఞమూర్తి అనుతాపము నంది, తక్షణమే తన మఠమును మూసివేసి, యతిరాజ పాదపద్మ సన్నిధినిజేరి, సేవజేసికొనుచూ రామానుజుని మఠముననే వసించుచుండెను.

శ్లో॥ రామానుజార్య సచ్ఛిష్యమ్ ।
వేదశాస్త్రార్థ సంపదమ్ ।
చతుర్థాశ్రమ సంపన్నమ్ ।
దేవరాజమునిం భజే ॥

యజ్ఞమూర్తికి దేవరాజముని యనియు నామధేయమున్నది. ఈ నామము "అమళాళప్పెరుమాళ్ ఎమ్బెరుమానార్" అను పేరునకు సంస్కృతీకరణ రూపము.

యజ్ఞమూర్తి జ్ఞానప్రపత్తులు, రామానుజుని వాత్సల్యము ఈ అధ్యాయమున వెల్లడియగుచున్నవి.

ఎంబెరుమానార్ల శ్రీపాదముల నాశ్రయించి, సకలవేద శాస్త్ర తాత్పర్యాదులను వారినుండి గ్రహించి, దివ్యమైన స్వరూప జ్ఞానము

గలవారై, మరియొక దైవము నెరుగక, శ్రీరామానుజుని పాదపద్మము లందు నిత్యకైంకర్యము నొనర్చుచూ, సేవించుచుండిన అరుళాళప్పెరామాళ్లెంబెరుమానార్లు తమ పరమకృపచే ఈ యర్థ విశేషములనందరును తెలిసికొని ఉజ్జీవింప వలయుననెడి తలంపుతో సకల వేదశాస్త్రసారాంశములను సర్వులకును, అనగా సర్వవర్ణముల వారికిని స్త్రీలకును సైతము, తెలియునట్లు ద్రావిడ భాషయందు ప్రబంధముగా రచించుటచేత దీనికి "జ్ఞానసారము" అను తిరునామము గలిగినది. ఇది రామానుజుని భావనాపరంపర. ఇందు నలువది దివ్యపాశురములు గలవు.

సకల శాస్త్రకోవిదులై, స్వరూపజ్ఞులలో నగ్రగణ్యులై, సంసారి చేతనోజ్జీవనకాములై, ఎంబెరుమానార్ల పాదారవిందములందు చిరకాలము సేవయొనర్చుచూ, సకలార్థములును చరమ పర్వపర్యంతముగా వారు తెలుపగా విని, తన్నిష్ఠులైయుండు అరుళాళప్పెరుమాళ్లెం బెరుమానార్లు తమ పరమకృపచే సకల శాస్త్ర సంగ్రహమును తిరుమంత్రముచే ప్రతిపాదించబడి ప్రమేయముల లోని సారాంశమును సంగ్రహించి, "ప్రమేయ సారము" అను గ్రంథమును రచించి ప్రసిద్ధి కెక్కిరి.

## 22. దాశరథి వృత్తాంతము

ముదలియాండాన్ అని ప్రసిద్ధిగాంచిన దాశరథి రామానుజుడు యతిరాజయినపుడు వారినాశ్రయించి ప్రథమ శిష్యుడయినాడని చదివి యున్నాము. యజ్ఞమూర్తి రామానుజుని తర్కమున నోడింప వచ్చినపుడు, అతనిని పరాజితుని జేయుటకు కావలసిన అధ్యాత్మిక వస్తువు తన మేధయందున్నదని దాశరథి అన్నట్లు మనమిదివరలో పఠించియున్నాము.

రామానుజుని పంచాచార్యులలో మహాపూర్ణుడు (పెరియనంబి) ఒకడుగదా! వీరికొక కుమార్తె యుండెను. ఆమెపేరు అతుల్యాక్షి. ఆమెకిటీవలననే వివాహమయ్యెను. అత్తగారింటకాపురము జేయుచుండను. రామానుజుడు యజ్ఞమూర్తితో సంభాషించు మొదటి దినమున ఒక అబల రామానుజుని సమీపించి, నమస్కరించి నిలుచుండెను. రామానుజుడామెను జూచి, "అమ్మాయీ! చెల్లీ! అత్తగారి యింటి నుండి యెప్పుడు వచ్చితివమ్మా? నీ భర్తకు, అత్తమామలకు కుశలమేగదా? ఇప్పుడు పండుగ పబ్బము లేమియు లేవే! పుట్టినింటి కేల యింత త్వరలో వచ్చినావు?" అని అడిగెను.

అతుల్యాక్షి కన్నీరుగార్చుచూ, "అన్నా! మా అత్తగారు నాపై కోపించి, పుట్టినింటికి పొమ్మని వెడలగొట్టినది".

"అట్లేల జరిగినదమ్మా?"

"మా అత్తగారు వృద్ధురాలు. గృహకృత్యములనన్నిటిని నేను చేయ లేకయున్నాను. మరియు, అన్నయ్యా! నాకు కొన్ని యింటిపనులు తెలియవు. ఇంకను నేర్చుకొనవలసియున్నది. మా అత్తగారు కోపించి, 'నీవు వైష్ణవాచార్యుడయిన మహాపూర్ణుని కూతురవు గావచ్చును. కాని మహా రాజకుమార్తెవు కాదుగదా! ఇంటి పనులను కోడలినయిన నీవు చేయకున్న నీకు బదులు ఎవరు చేస్తారు? పనిచేయకుండా మూడు పూటలు తిని కూర్చొని యుండుటకు వీలులేదు. మీ యింటికిపొమ్ము! నేను నీకు చాకిరి చేయజాలను. తిరిగి నీవు అత్తగారింటికి రాదలచిన

ఒక వంట బ్రాహ్మణుని వెంటబెట్టుకొని రమ్ము' అని చెప్పి నన్ను వెడలగొట్టినది".

"అమ్మా, నాయన గారితో ఈ విషయమును చెప్పితివా? వారు ఏమన్నారు?"

"పోయి, మీ అన్నయ్యకు చెప్పమని నన్నిచటికి బంపినారు."

రామానుజుడు, "సోదరీ! నీవు పనులు చేయలేకపోవుటకు కారణములు నాకు విదితము. తండ్రిగారి సమక్షమున నెక్కువ కాలమును అధ్యాత్మిక విద్యాభ్యానమున గడపితివి. కొలది కాలములోనే గృహ కృత్యముల నేర్పగలవులే! మీ అత్తగారు నిన్ను ద్వేషింపరు; పరిస్థితులనుబట్టి ఆమె నీపై కినుకపూని యుండును. దానిని మనస్సున నుంచుకొనకుము, పరులతో ననకుము. అత్తగారి యెడ మాతృభక్తిని చూపుము. ఇపుడు నీవు ఈ దాశరథిని వెంట తీసికొనిపొమ్ము. ఇతడు నీకు ఇంటి పనులలో సాయపడుచుండును", అనెను.

ఆ క్షణముననే రామానుజునకు నమస్కరించి, అతుల్యతో గూడి దాశరథి వెడలిపోయెను. (ఇట్టి క్రమశిక్షణను సైనికులయందైనను మనము ఊహింపగలమా!)

దీనినంతా తిలకించుచున్న యజ్ఞమూర్తి అబ్బురపడెను. "ఆర్యా! మీచర్యనాకు వింత గరపుచున్నయది. మీ శిష్యుడు సర్వవేద శాస్త్ర పారంగతుడుగా కన్పట్టుచున్నాడు. మరియు తర్కమునకు సంసిద్ధు డయియుండెను. అట్టివానిని ఒక బ్రాహ్మణ అబలతో అత్తగారి యింటికి చాకిరిచేయుటకు పంపినారే! మీ ఉద్దేశము నాకర్థమగుట లేదు! అతడును శిరసావహించి వెడలుటయు నాకు ద్విగుణీకృత విస్మయమును కలుగజేయుచున్నది!" అని యజ్ఞమూర్తి పలికెను.

రామానుజుడు యజ్ఞమూర్తితో, "స్వామీ! మీరన్నట్లు దాశరథి మహాపండితుడు, విద్యాసాగరుడును కావచ్చును. కాని అతడు మీతో

తర్కమునకు పూనుకొనుటకు ప్రయత్నించి ఆడిన మాటలలో అహంభావము కొంత పొడసూపినది", అనెను.

యజ్ఞమూర్తి, "దానికేమి? విద్యాధికుయినవాడు స్వప్రతిభను వెల్లడించుట సహజము! అంత మాత్రమున కాతనికి అట్టి శిక్షను విధించితిరా?" అనెను.

రామానుజుడు, "మీరన్నది సర్వసామాన్యమే. విద్యావేత్తలకు తాము విద్యాధికులమని అహంభావముండవచ్చును. సన్న్యసించిన యతులయందును యిట్టి గర్వమును నేను చూచియున్నాను. ఈ సగర్వము వారికి సహజలక్షణమయినను, వారికట్టి అహంభావము తగినదేయని యితరుల అంగీకరించినను, నావ్యక్తిగత ఉద్దేశము భిన్నమయినది - అహంభావము తొలగినగాని అడకువ కలుగదు. వినయము లేని విద్య ఘనతను చేకూర్చదు. వినయసంపద లేని పండితుడు తర్కమున అనేకుల నోడించినను, విజయ గర్వమున నతడు సత్యాన్వేషణకు అనర్హుడు. విద్యావినయ సంపన్నుడయినపుడే అతడు పూజ్యుడు. అహంభావము నిజమైన సంపూర్ణ పండితున కుండదు. వెల్తికుండ తాదొలకుచునుండుగాని, మరితొల్కునేనిండు ఘటంబు. ఎంతటి విద్యాధికుడయినను తాను విశ్వమున నొక విద్యార్థినని భావింపవలయును. తనకు ఇప్పటికి స్వాధీనమయిన జ్ఞానము అతిస్వల్పమయినదనియు, తాను ఇక తెలిసికొన తగియున్నది యెంతయో యున్నదనియు భావించు నిరాడంబరుడే పరవస్తువును అన్వేషించుచు, తెలిసినవారితో గౌరవప్రదగోష్ఠి సలుపుచుండును. ఇట్లు అనుభవపూర్వకముగా నార్జించిన జ్ఞానమును తన మోక్షమునకును, జగత్కల్యాణమునకును వినియోగింపవలయును. నిజమైన జ్ఞానము సర్వుల నుద్ధరించును. నిజమైన జ్ఞానము మానవుడు స్వార్థరహిత భావమును పొంది విశ్వమునకు విశ్వేశ్వరమునకు ప్రపత్తిని జూపును. అట్టివాని జీవితోద్దేశము లోక సంగ్రహమే", అని చెప్పెను.

ఈ మాటలే యజ్ఞమూర్తికి వివేకోదయమును గరపి రామానుజునకు ప్రపన్నుని జేసినవి.

ఇక ఈ యుపోద్ఘాతములో మనము దాశరథి వృత్తాంతమునకు వచ్చెదము. దాశరథి అతుల్యాక్షి వెంట ఆమె యత్తగారింటికి పోయెను. పోయినవెంటనే వంటిల్లు ప్రవేశించి, గృహకృత్యముల జేయ నారంభించెను. అతుల్యాక్షియొక్క అత్తమామలుగాని, ఆమె భర్తగాని, వానిని చూచిరేగాని, యేదోఒక వంట బ్రాహ్మణుడనియే తలంచి సంతృప్తి పడిరి.

దాశరథి అచట పాచకుడై పనులు జేయుకాలమున నొకానొక దినమున నొక బ్రాహ్మణ పండితుడు ఆ యింటికి నతిథిగా ఏతెంచి యుండెను. ఈ బ్రాహ్మణ పండితుడును, అతుల్యాక్షి మామగారును, భర్తగారును భగవద్విషయముల గూర్చి చర్చించుకొనుచుండిరి. పండితుడు గాయత్రీ మంత్ర శ్లోకమును జదివి దాని తాత్పర్యమును దెల్పుచుండెను.

"మీరనుదినము గాయత్రీ జపమును గావించువారే కదా! కాని దాని అర్థము యెంత అమోఘమో తెలిసికొంటిరా!

"ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గో
దేవస్య ధీమహి । ధియోయోనః ప్రచోదయాత్ ॥

ఇందు మొదటి చరణము యొక్క అర్థమును విపులము జేయుటకు సామాన్యనితరమా? భగవంతుని ఎంత గంభీరముగా వర్ణించినారు ఋషులు!

"ఓం" సర్వచరాచరమును ఈశ్వరశక్తిని సూచించును. అ, ఉ, మ్‌లతో గూడిన "ఓం కారము యొక్క అర్థమును గమనించుటకు వ్యాకరణ భాషాజ్ఞాన మెంతయో అవసరము.

ఇక మొదటి పాదము యొక్క అర్థము గమనింతమన్న - సర్వజగత్తునకును జీవనాధారుడైనవాడును, దుఃఖముల బాపువాడును, సర్వాంతర్యామియును, సమస్తైశ్వర్యముల నిచ్చువాడును, వరింపదగిన వాడును, పవిత్రమైనవాడును, అయిన పరమేశ్వరుని

మేము భరింతుముగాక - చూచితిరా భగవద్గుణ వాచకములయిన భూః, భువః, స్వః, సవితుః, వరేణ్యం, భర్గః అను నారింటి యొక్క అర్థములు! ఈ అర్థముల యొక్క విశాలభావముల గమనించుటకు ఈ జీవిత కాలము చాలునా?" అని పండితుడనెను.

ప్రక్క వంటయింటిలోనుండి కొలది మాటలు బిగ్గరగా వినవచ్చెను. "అయ్యలారా, మీరు మొదట పాదమునకు చెప్పకొను భావము సరియైనదే, కాని అంతటిలో ఆపినారే! అసలు విషయం ఉండేది రెండవ పాదములో" అని. ఈ మాటలు విన్న ఆ ముువ్వురు పెద్దలు కలవరమున నెవరాతడని విచారించి, వంట బ్రాహ్మణుడని తెలిసికొనిరి. ఇంటి పెద్దలాతని అధికప్రసంగమునకు మందలించిరి. దాశరథి నమ్రతతో తాను మనవి చేయు విషయమును దయతో సావధానముగా వినుడని అర్థించి, తదుపరి అనేక శాస్త్ర ప్రమాణముల వల్లెవేయుచూ, శ్లోకార్థమును వెల్లడించెను.

"స్వామీ, ఓంకారార్థమును తెలుసుకున్నను, భగవద్వాచకము లయిన గాయత్రీమంత్ర ప్రథమ పాదమున నున్న ఆరు పదముల యొక్క అర్థమును పూర్తిగా తెలునుకున్నను చాలునా? ఇది పాండిత్యమునకుపకరించును గాక - మానవుని జ్ఞానిగా జేయును గాక - అయితేనేమి? సరియైన ప్రవర్తన లేనపుడు - సరియైన కార్యాచరణుడు కానపుడు -

రెండవ పాదమేమి తెల్పుచున్నది?

'పరమాత్మ మాయొక్క బుద్ధులను సత్కార్యములకు ప్రేరేపించు గాక' - అని చెప్పుచున్నది. ఇది పరమ ప్రాధాన్యమయిన విషయము. పరోపకారార్థమై సత్కార్యముల చేయనివాడు కర్మఫల సన్న్యాసి గానేరడు. ఇట్టివాని జీవితము, నిష్ప్రయోజనము. జ్ఞానము మొదటి మెట్టు, కర్మఫలత్యాగము కడపటి మెట్టు, మోక్షదాయకమగు మెట్టు

గీతయందు శ్రీకృష్ణ భగవానుడు ఏమి సూచించినాడు?

'శ్రేయోహిజ్ఞానమభ్యాసాత్ - జ్ఞానాధ్యానం విశిష్యతే -
ధ్యానాత్కర్మ ఫలత్యాగం - త్యాగాశ్శాంతిరనంతరమ్ ॥' అని కదా? కావున సత్కర్మములు చేయవలయును - అని సూచించు గాయత్రీ మంత్ర రెండవ పాదము నందు ఉండే గురుత్వమంతయు. మా ఆచార్యుడు ప్రబోధించు విశిష్ట మార్గమిదియే - తత్వత్రయ జ్ఞానమును బొంది స్వార్థరాహిత్యుడై మానవుడు పరోపకారార్థ జీవితమును గడుపుటయే మోక్షమార్గము" అని. అతిథిగా అరుదెంచియున్న పండితుడును ఇతర గృహస్థులును ఆశ్చర్యపడి, ఆతడు సామాన్య మయిన వంటబ్రాహ్మణుడని విశ్వసింపలేక, "మహాత్మా, తమరెవరు?" అని ప్రశ్నించిరి. వెంటనే అతుల్యాక్షి కలుగజేసికొని, "ఇతడు దాశరథియను నామధేయుడు. భగవద్రామానుజుల ప్రథమశిష్యుడు", అని చెప్పుచు, జరిగిన వృత్తాంతమును నెల్ల ఎరిగించెను. వెంటనే వారు ముప్పురు దాశరథికి పాదాక్రాంతులై, "మహాత్మా, మమ్ముల మన్నింపుడు. తెలియక అపరాధము గావించితిమి. పొరపాటున మా కోడలు అతుల్యాక్షిని శ్రమపెట్టి, పనిమనిషిని తోడ్కొని రమ్మని చెప్పి పంపితిమి. పెరియనంబి వంటి వాని కుమార్తె మాకు కోడలయినదని మేము తగుతృప్తి ఆనందములను పొందలేక పోతిమి! అది మా అభ్యాగము! భగవద్రామానుజాచార్యులు అతుల్యాక్షికి అగ్రజసముడని మాకు తెలియదు. మాకిపుడు జ్ఞానోదయమయినది. మీరాకచే మాయిల్లు పావనమయినది. అతుల్యాక్షి మా గృహలక్ష్మి", అని అత్తమామలు పలికిరి. తరువాత గౌరవ పురస్సరముగా ఆ కుటుంబీకులందరును శ్రీరంగమునకు దాశరథితో గూడా పయనించి, రామానుజునకు ప్రణమిల్లి, "స్వామీ - మా అపరాధమును మన్నింపుడు. మహాత్ముడయిన దాశరథిని తెలియక చాకిరివానిగా నుపయోగించు కొంటిమి. మమ్ముతరింపజేయుడు. మీసోదరి అతుల్యాక్షి మా యింటికి లక్ష్మి, మాస్వగృహమునకు దీపము," అని అతుల్యాక్షి అత్తమామలు పల్కిరి.

రామానుజుడు దాశరథిని ఆశీర్వదించి, "వత్సా! నిన్ను పరీక్షించుటకు అతుల్యతోగూడ పంపితిని. నీ వినయ విధేయతలు అద్వితీయము; అగ్నిలో బడిన మేలిమి బంగారము అపరంజిగా తయారయినయట్లు, ఈ అనుభవముతో నీవు మహానుభావుడ వయితివి. బంగారమునకు పరిమళమబ్బినట్లు నీజ్ఞానము తేజోవంతమయినది. నీ జీవితము మనమతవానులకు ఆదర్శప్రాయమగుగాక", అని మందహాసమున పలికెను. అందరును నివ్వెరపోయి వినుచుండిరి.

ఈ సన్నివేశమును తిలకించుచున్న యజ్ఞమూర్తి విజ్ఞాన వికాసమున, ఆనందమున ఉప్పొంగి పోయెను.

శ్రీరామానుజుని జ్ఞానామృతము, క్రమశిక్షణ యెట్టివో దాశరథి వృత్తాంతము వ్యక్తపరచును.

# 23. ఉరంగావిల్లి వృత్తాంతము

శ్రీరామానుజాచార్యుల పర్యవేక్షణలో శ్రీరంగక్షేత్రమున నున్న రంగనాథాలయము మిక్కిలి ప్రసిద్ధిజెందినది. అచట జరుగు దైవ కైంకర్యములు భక్తులకు, ప్రేక్షకులకు, యాత్రికులకు మనోజ్ఞముగా నుండినవి. భక్తితో జరుపు అలంకరణలు, ఆరాధనలు, ఉత్సవాది కైంకర్యములు భక్తులకు విష్ణు సంశ్లేషభావమును కలుగ జేయుచుండినవి. భక్తి ప్రపత్తులతో వారు పరమానంద భరితులుగా నుండిరి.

దేవాలయము నందలి సహస్రస్తంభ మంటపమున అనుదినము వేదాంతోపన్యాసములు జరుగుచుండినవి. ఇవి భక్తులను, పండితులను సామాన్య ప్రజలను ఉత్తేజ పరచుచుండినవి.

మానవులు కుల, జాతి, లింగ, భాషా భేదములు లేక, విశ్వమానవ సౌభ్రాత్రమున మెలగ గలుగుటయే వైష్ణవము యొక్క ప్రబోధమని రామానుజుడు పలుమారు హెచ్చరించువాడు. రామానుజుని గురువులు, గురుతుల్యులు వివిధ కులములకు జెందియున్నారు. వారి శిష్యకోటియు వివిధ వర్ణములకు జెందియున్నారు.

దేవాలయమున స్వామికి నైవేద్యమనునది మనము వంట జేసికొని భుజించు సామాన్య సాదముగా నుండవలయుననియు, దానిని సర్వులకు ఏకపంక్తిలో ప్రసాదముగా పంచిపెట్టవలయుననెడి రామానుజుని దైవకైంకర్య సంస్కరణము జాతిభేదమును, జాతి ద్వేషమును పొగొట్టుటకే నిర్దేశింపబడినది.ఆ కాలమున బ్రాహ్మణు లనబడువారు ఇతర జాతులనన్నింటిని అస్పృశ్యులుగా భావించు చుండిరి. చాతుర్వర్ణములవారు కలిసి యి నాల్గు వర్ణములలో జేరనివారిని (మాల, మాదిగ, ఎరుకల యానాది మొదలగు కొండ జాతులు, అడవిజాతులు, సంచార జీవులను వారిని) పంచములని పిలుచుచూ, వారిని అంటరాని వారినిగా భావించుచుండిరి. ఈ ఆచారమునకు రామానుజుడు బద్ధవ్యతిరేకి. భగవచ్ఛక్తి సర్వాంతర్యామి

గావున సర్వులు సోదరభావమున జీవింపవలయునని బోధించుచు రామానుజుడు మతమునకును సంఘసేవకును సంబంధము నేర్పరచి నాడు.

ఈ కారణమున శ్రీరంగక్షేత్రము సర్వులకు ఆకర్షణదాయకముగా నుండెను. ప్రభువులు, ధనవంతులు, వ్యాపారులు భూరి విరాళముల నిచ్చుచుండిరి. యాత్రికులు, భక్తులు, ప్రేక్షకులు ముడుపులు మెండుగా చెల్లించుచుండిరి. ఈ ధనము నంతటిని స్వామికైంకర్య ములకు, నిత్యోత్సవములకు, తిరునాళ్లకు, బ్రహ్మోత్సవములకు, నిత్య సంతర్పణలకు, దేవాలయ భాగముల పునరుద్ధరణకు ఖర్చుపెట్టు చుండిరి. ఈ కార్యములన్నియు అతివితరణయుక్తముగా జరుపబడు చుండినవి.

శ్రీరంగదేవాలయము వలన వైష్ణవోద్యమము ప్రబలెను.

చోళవంశ ప్రభువైన అకళంకుడనువాడు రామానుజునకు శిష్యుడు కాగా, ఆతనిని రామానుజుడు దేవాలయ ప్రధాన పరిపాలకునిగా నియమించెను. రాజ్యపరిపాలనా దక్షుడయిన అకళంకుడు దేవాలయ పరిపాలనను క్రమబద్ధము జేయుటయే గాక, పెక్కు మార్పులతో దేవాలయ కార్యనిర్వాహకమును సుప్రసిద్ధము జేయగలిగెను.

అకళంకుడు రామానుజునకు శిష్యుడై తన సర్వస్వము శ్రీ రంగనాథాలయమున కంకితముజేసి, రామానుజునియాజ్ఞానుసారము దేవాలయ పరిపాలన బాధ్యత వహించుటకు గలకారణము విచిత్రమైనది. అకళంకుడు రాజ్యపరిపాలన జేయునపుడు అతనికి అంగరక్షకుడుగాను, సైనిక సలహాదారుడుగాను ఉన్న ఉరంగావిల్లి (ధనుర్దాసు) భార్యాసమేతుడుగా శ్రీరంగక్షేత్రమున జరుగు స్వామి రథోత్సవమును తిలకింపవచ్చి, అచటనే శ్రీరామానుజాచార్యులకు ప్రపన్నుడై, తన సర్వస్వమును రామానుజ మతమునకర్పించి, అచటనే నిలిచిపోయెను. ఈ వృత్తాంతము నెరిగిన అకళంకుడు శ్రీరామానుజ దర్శనమునకై శ్రీరంగము వచ్చినాడు. రామానుజ మతమును ప్రవేశించి,

రామానుజుని దర్శించినాడు; రామానుజుని దివ్యతేజమునకు ముగ్ధుడయినాడు; తాను రామానుజపదాంకితుడయినాడు. తన శేషజీవితమును శ్రీరంగదేవాలయ పరిపాలన యందే గడిపినాడు.

ఈ సందర్భమున ఉరంగావిల్లి (ధనుర్దాసు) యొక్క వృత్తాంతమును విశదముగా నరయుట యెంతయో ఉచితము కదా!

అది వైకుంఠ ఏకాదశీ పర్వదినము. శ్రీరంగనాథుని రథోత్సవము లక్షలాది భక్తులను ప్రజలను ఆకర్షించు దినమది. రథోత్సవము రామానుజ మఠమును సమీపించుచున్నది. రామానుజుడును రథోత్సవమును దర్శింప మఠము వెలుపలకు వచ్చుచున్నాడు. మఠములోని శిష్యులెల్లరు, మఠవాసులు, మఠమును దర్శింప వచ్చిన భక్తులు ఎల్లరును రాజవీధి యందు రథోత్సవ దర్శనమునకు ఉత్సాహమున నిలిచియున్నారు. ఆంధ్రపూర్ణుడను భక్తుడు మాత్రము వెలుపలికి రాక, మఠమునకు వెనుకనున్న వనమున నొకచోట స్థిమితముగా కూర్చొని, క్షీరమును వేడిచేయుచుండెను. రామానుజుడు మఠద్వారమును వదలుటకు ముందుగా అటు వెనుకకు మరలి, "వత్సా, ఆంధ్రపూర్ణా, నేడు స్వామి రథోత్సవమును తిలకించుటకు దేవతలుసైతము భువికి దిగివచ్చెదరే! నీవేల యింకను అచటనే కూర్చొనియున్నావు; లేచిరమ్ము", అనుచూ శ్రీరామానుజుడు వెలుపలకు వచ్చి, మఠమునకు ముందు రాజవీధి పార్శ్వమున నిలిచెను.

రథోత్సవము తిలకింపవచ్చిన వారు వీధి యెల్లయెడల మూగియుండిరి. సూర్యప్రకాశమున స్వామి గంభీర రథమును, అలంకరించుకున్న ప్రజలును వైభవోపేతముగా ప్రకాశించుచుండిరి. ఆ సమూహములో రామానుజుడొక వింత దృశ్యమును గాంచెను. రథమును వీక్షించుచు నొక సుందరి నిలుచుండి యుండెను. ఆమె ప్రక్కన యువకుడొకడు ఉన్నాడు. అతడామె ప్రియుడై యుండవోవు. ఆమెకు ఎండబెట్ట తగలకుండా యుండగలందులకు ఆ యువకుడు

ఒక చేతిలో ఛత్రమును పట్టుకొని, మరియొక చేతితో విసనకర్రను దాల్చి, ఆమె ముఖమునకు చల్లని వాయువులు తగులునట్లు విసరుచుండెను. తన ప్రియురాలి సేవలోనే నిమగ్నుడయియున్న ఆ యువకునకు స్వామి రథముపై ధ్యానమే లేదు. తన ప్రాణము, ధ్యానము తన ప్రియరాలి సేవయందే వినియోగింప బడియున్నవి. తన్ను జూచిన యితరులు ఏమనుకొందురో అను బిడియము, అనుమానములును అతనికి లేకుండినవి.

కొలది గజములలో నిలుచుండిన రామానుజు డా యువకుని రప్పించి, "వత్సా! నీవెవరవు? ఆ యువతి నీయర్ధాంగి కాబోలు! ఆమెను ఛత్రచాయలో నుంచుచు, తాళవృంతముతో నామెకు విసరుచు, ఆమె వదనారవిందమునే వీక్షించుచూ, నీవు స్వామిని ఉపేక్షించితివే! స్వామి దర్శనమునకుకదా నీవు ఇంతదూరము యాత్రకై వచ్చియున్నావు? కాదా?" అని రామానుజుడు ప్రశ్నించెను.

ఆ యువకుడు, "ఆర్యా! నా నామధేయము ఉరంగావిల్లి. ధనుర్దాసు అనియు పిలుతురు. నేను అకళంకుడను చోళరాజునకు అంగరక్షకుడను. ఆమె నా ప్రియురాలు. ఆచారయుక్తముగా వివాహమాడిన ధర్మపత్నిగాదు. కాని ఆమెను నేను ప్రేమించి అర్ధాంగినిగా జేసికొన్నాను. నేను ఏకపత్నివ్రతుడను; ఆమెయు మహా పతివ్రత. ఆమె నాకు ప్రాణముకన్న మిన్న. నావరకు నేను రథోత్సవమునకు రాలేదు. నాప్రియురాలయిన యీ పొన్నాచి (హేమాంబ) శ్రీరంగనాథ రథోత్సవమును తిలకింప ఉత్సాహమును వెలిబుచ్చగా నామెను వెంటనిడికొని వచ్చినాను. ఆమెకు ఎండతాపము తగులకుండుటకై ఛత్రమునుబట్టి విసనకర్రతో విసరుచుంటిని. ఈనాడు ప్రత్యేకించి ఆమె ముఖమున అపూర్వ సౌందర్య ముట్టి పడుచున్నది. సరోజములవలె వికసించి, కాంతులు వెదజల్లు ఆమె నయనారవిందములను మించి నన్నాకర్షింపగలవి యొందు లేవు. ఆమె శరీరమునకు తాపము తగిలిన నేను భరింపజాలను", అనెను.

ఈ సంభాషణ పూర్తియగులోపలనే పొన్నాచ్చి వారిని కలుసు కొనెను. రామానుజుని శిష్యులెల్లరును ఆయువక దంపతులను జూచి నివ్వెరపోయిరి.

రామానుజుడు ఉరంగావిల్లి ప్రత్యుత్తరము వినగానే, "ఈతడు నైర్మల్యహృదయుడు, కపటములేనివాడు; అమాయకుడు", అని యోచించెను.

తరువాత అట్లనే నిలువబడి రామానుజుడు మౌనముగానున్నాడు. ఆచార్యులేమి ఆలోచించుచున్నారో, యేమిపల్కెదరో అని యెల్లరు నిశ్శబ్దముగా నిలువబడియుండిరి.

రామానుజుని ఆలోచనాగతి యిట్లున్నది - "ఈ యువతీయువక రత్నములు వారి బాహ్య సౌందర్యమున నెవ్వరినైనను ఆకర్షింతురు. ఈ యువతి సౌందర్యము వర్ణనాతీతము. వీరి పరస్పర ప్రేమ కళంకము లేనిదే! వారిగాఢప్రేమాభావములకు బాహ్యప్రపంచము అడ్డుగాలేక యున్నది. వీరిని ఆక్షేపింపతగదు. వీరిహృదయము లెట్లు ప్రేమ పూరితములో, అట్లే అవి దయాపూరితములుగా కూడా నుండవలయును. కాని వీరి ప్రేమను భౌతిక సౌందర్యము నుండి ఆధ్యాత్మిక సౌందర్యమునకు మరల్పగలను"

తరువాత రామానుజుడు, "వత్సలారా! మీరు ప్రేమహృదయలు. మంచిది. రథోత్సవమును తిలకించితిరిగదా! స్వామి మూలవిరాట్ విగ్రహమును సేవించి తరింపుడు. రండు నావెంట; చూపెదను. మీకు గర్భాలయమున స్వామి దర్శనమును గలిగించెదను". అనుచు రామానుజుడు దేవాలయమును ప్రవేశించుచుండ, ఉరంగవిల్లి, పొనాచి మరికొందరు శిష్యులు రామానుజుని వెంబడించిరి.

గర్భాలయమున కర్పూరము మెండుగా వెలిగింపబడెను. "అదిగో వీక్షింపుడు - శేషశయనుడు, శ్రీరంగేశుడు, కమలాక్షుడు అదుగో!" అని రామానుజుడనెను. ధనుర్దాసుహేమాంబలు రెప్పవాల్పక స్వామి వదనారవిందమును దర్శించు చుండిరి. ధనుర్దాసు ఒకసారి తన

ప్రియురాలి సరోజాక్షములను వీక్షించి, మురిసిపోయి, "హేమాంబ నయనారవిందములు కర్పూర హారతిప్రకాశములో ఎట్లు విలసిల్లు చున్నవి!" అని తలంచు కొనుచుండెను.

భగవానుడు సర్వజ్ఞుడు అయిన రామానుజుడు ధనుర్దాసు వైపుచూచి, "వత్సా, అమెనయనార విందములను వికసింప జేసిన తేజోమయములగు స్వామినేత్రములు జూడుము. జగత్తు యొక్క చీకటులను బాపు స్వామి నయనారవిందముల సేవింపుము. ప్రపంచమునుకు దివ్యశోభను గలిగించు స్వామి చూడ్కుల పరికింపుము. జగత్తును వెలిగించు సూర్య, చంద్ర నక్షత్ర, గ్రహరాసులకు చిహ్నములు ఆ స్వామినేత్ర ద్వయము.

మనశరీరములు అశాశ్వతములు కదా! మన నయనములు, ఇతర అవయములు సైతము శరీరము నశించుకొలది అవియును నశించుచుండును. నాశరహితమును, జగజ్జ్యోతులును అగు స్వామినయనార విందములను సేవింపుడు. ఒక చిన్న విషయమును గమనింపుము - నీ కన్నులు సూర్యకాంతిలో అగ్నిదీపములో చూడగలవేగాని, అవిలేనపుడు చూడలేవు కదా! మన కన్నులకు వెలుగు నిచ్చు పరంజ్యోతిని ఊహింపుము. మరియు స్వామి నేత్రములు భౌతికమైన వెలుగునేగాక మనకు జ్ఞానకాంతిని కూడ ప్రసాదించు చున్నవి. వాని సౌందర్యము, పరాక్రమము వర్ణనాతీతము గదా", అని రామానుజుడు శాంతముగా బోధించెను.

ఉరంగావిల్లి చూడ్కులు స్వామి నేత్రములపై స్థిరముగా నిల్చినవి. ఆతని మనస్సున నున్న అంధకారము మాయమయ్యెను. ఆతని మనస్సున జ్ఞానజ్యోతి వెలుగుచున్నది. ఆధ్యాత్మిక జ్ఞానోదయమున పరవశుడైన యురంగావల్లి, "అయ్యో! ఇంతవరకు మోసపోతినే! కూపమును జూచి సాగరమని భ్రమపడితిని. మిణుగురు బూచిని జూచి చంద్రబింబమని తలచితిని. ప్రకృతి సౌందర్య ఖండములకు లోనై యుంటినిగాని, ఈ ప్రకృతి సౌందర్యమునకు కారకుడయిన త్రిభువన

సుందరుని గుర్తింపలేకపోతినే! ఆచార్యవర్యా! నన్ను స్త్రీ లోలత్వము నుండి ఉద్ధరించి, దైవలోలునిజేసితిరి. నన్ను దాసునిగా స్వీకరింపుడు", అని రామానుజునకు ప్రణమిల్లెను, పొన్నాచ్చియు సాష్టాంగ పడెను.

తరువాత రామానుజుడు మఠము చేరగా వారిరువురును వారిని వెంబడించిరి. ఆంధ్రపూర్ణుడు ఆచార్యులవారికి క్షీరముగొని తెచ్చెను. "ఆంధ్రపూర్ణా! నీవిచటనే యుంటివా! స్వామిరథోత్సవమును సేవించుటకు కూడా వెలుపలకు వచ్చినట్లులేదే!" అని రామానుజు డనెను. "స్వామి, నేను బయటదేవుని సేవింపనేగినచో లోపలి దేవుని కైంకర్యముల నెవరు చక్కబెట్టెదరు?" అని ఆంధ్రపూర్ణుడు భక్తియుక్తముగా ననగా, రామానుజుడు మందహాస వాత్సల్యములతో పాలపాత్రను స్వీకరించెదను.

ఆచార్య శిష్యుల యీ సంభాషణమును ధనుర్దాసు హేమాంబలు విని, విస్మయమునందిరి. హేమాంబ, "భక్తశిఖామణీ, లోపలి దేవుడన్నారే తమరు, ఆదేవుడెవరండి? మాకు జూపుడు", అనెను. ఆంధ్రపూర్ణుడు చిరునగవుతో, "మాలోపలి దేవుడు ఈ ఆచార్యవర్యులే గదమ్మా", అనెను. వాని వచనములకెంతయో సంతసించిరి ఆ దంపతులు.

ఉరంగావిల్లియు, పొన్నాచ్చియు, వారి ఆస్తిపాస్తులను రామానుజ మఠమునకు, శ్రీరంగ దేవాలయమునకు సమర్పించి, శ్రీరంగముననే నివాసమేర్పరచుకొనిరి. వారొక చిన్నగృహమున నివసించుచూ, పగటి కాలమంతయు రామానుజుని మఠమున భక్తులతో గలిసి ఆనందముగా గడపుచుండిరి. రామానుజుడు కులభేదముల పాటించు వారుగారు. తన శిష్యులు అన్ని కులములవారికి జెందియుండిరి. వారందరు సమాన ప్రతిపత్తిని అనుభవించుచుండిరి.

# 24. శ్రీవైష్ణవ జీవితాదర్శములు

శ్రీరామానుజుల దైనిక ఆహారపానీయ నియమములెట్టివి? రామానుజుడు తన అధ్వర్యమున శ్రీరంగనాథ దేవాలయమున అనుదినము వెయ్యిమంది యాత్రికులకు కులమత వివక్షత లేకుండా సంతర్పణ భోజనములనేర్పాటు జేయువాడు. ఈ సంతర్పణ ఒక నిత్యవైభవము, శ్రీరంగనాథ కైంకర్యములలో. రాజులు, భూస్వాములు, ధనవంతులు, వర్తకులు యీ నిత్య సంతర్పణకు భూరివిరాళముల నిచ్చువారు. ఒక్కొక్కనాటి సంతర్పణ ఖర్చులు ఒక్కొక్కరే భరించుటయు అప్పుడప్పుడు జరుగు చుండెడిది. ఈ సంతర్పణ కార్యక్రమము మధ్యాహ్నము ఒంటిగంట ప్రాంతమునకు పూర్తికాగా, అప్పుడు రామానుజుడు దేవాలయ సమీపముననున్న మూడు వైష్ణవ గృహములకు బోయి, వారిచ్చు కబళముల తనకాషాయ అంగ వస్త్రమున బట్టికొని, కావేరీనదికిబోయి, ఆ అన్నమును పుణ్య తీర్థములలో జలకొట్టి, దానిని భుజించువాడు! రాత్రివేళ మఠములోని శిష్యుడు ఒకలోటా పాలనిచ్చిన పుచ్చుకొనువాడు. ఈ ఆహారముతో ఆయన శరీరము బహుబలాఢ్యమై తేజోవంతముగా నుండుట ఆశ్చర్యకరము.

ఇతర ప్రాంతముల నుండి వచ్చిన కొందరు భక్తులు వారిని, "స్వామి! మహారాజులుసైతము మీ మ్రోలప్రపన్నులై నిలుచుచున్నారు. మీరు అనవరతము వెయ్యిమందికి సంతర్పణ భోజనముల నేర్పాటు గావించుచున్నారు. మీరేల ఆహార భిక్షకు పోవలయును? సంతర్పణ శాలలోనే భోజనము జేయకూడదా? లేక మఠమున శిష్యులు తయారు చేయు నాహారమును స్వీకరించకూడదా?", అని ప్రశ్నించిరి.

అందులకు రామానుజుడు, "వత్సలారా! దైవభక్తుడయిన సన్న్యాసి కబళ భిక్షములతోనే జీవింపవలయును. ఈ విధానము అతని నమ్రతను పెంపొందించును. తన నివాసస్థానము, తన ఆహార వసతులు, తన దుస్తులు, తనముల్లె, తనమూట అని ప్రత్యేకముగా

యతిరాజనువానికేల? యతిరాజుకున్న భాగ్యము ఒక్కటే. లోక కల్యాణార్థమై చేయవలసిన సేవాతత్పరత!" అని చెప్పగా, అందరు భక్తి పూర్వకముగా ఈ జ్ఞానమును స్వీకరించిరి. వారిలో నొకరగు కొంగుదేశపు సన్యాసిని, మహాసాధ్వి, "స్వామీ, నాకు దివ్యజ్యోతిని ప్రసాదించితిరి. మీ వైష్ణవ ఆదర్శము అనన్యము", అని పలుకుచూ సాష్టాంగ నమస్కారము గావించెను.

ఒకనాటి మధ్యాహ్నమున రామానుజుడు కబళభిక్షాటనముపై బోవు సందర్భమున పెరియనంబి గృహముముందు నిలువగా, నంబిగారి కుమార్తె అతుల్యాక్షి (అత్తుళాయి) ఆహారమును విస్తరాకు నందుంచుకొని రామానుజునకు సమర్పింప వచ్చెను. అప్పుడు రామానుజుడు పరవశమున అండాళ్ దివ్యప్రబంధమగు తిరుప్పావై లోని పాశురముల గానముచేయుచుండెను. తన వైష్ణవ సంశ్లేష భావమున, తనముందు నిలుచున్న అత్తుళాయిని నప్పిన్నగా భావించి, ఆమెను సంబోధించుచూ, సంశ్లేషపడి తిరుప్పావై పాశురములను రామానుజుడు పాడుచునే యుండెను. ఇట్లు గానము చేయుచూ, తన సంశ్లేషభావమున పరవశత్వమున అత్తుళాయికి మ్రొక్కబోగా, ఆమె దిగ్భ్రమజెంది, ఇంటిలోనికి పరుగిడి తండ్రిని సమీపించి, "నాన్నా అన్నయ్యను జూడుడు, ఈ నాడేదో మతిభ్రమలోనున్నట్లున్నారు! అయ్యో, అన్నయ్యను చూడుడు", అని కేకలు వేయగా, పెరియనంబి వెలుపలకు వచ్చి, చూడగా, రామానుజుడు ముకుళిత నేత్రుడై తిరుప్పావై పాశురముల గానము చేయుచూ, ఆనందాబ్ధియందుండెను. శ్రీరామానుజుని వైష్ణవ సంశ్లేష భావమునకు అబ్బురపడి, తానట్టి స్థితికి ఎప్పుడు రాగలనోగదా అని వాపోయెను పెరియనంబి.

ఒకనాటి ఉదయమున రామానుజుడు తిరుకావేరియందు స్నానమాచరించి, తనశిష్యులతోగూడి భగవన్నామగానము చేయుచూ, మెల్లగా మఠమువైపు నడచుచూ వచ్చునపుడు, అతడొక దృశ్యమును గాంచెను. కొంతమంది పసిబాలురు బాలికలు, 6 మొదలు 10

సంవత్సరముల లోపలి వయస్కులు, దైవారాధన ఆట ఆడుకొను చుండిరి. భూమిపైనొక వెడల్పయిన చదరపు ఆకారములో గీతను గీచిరి; అది దేవాలయము. ఒకప్రక్కన నొక శిలనుంచిరి; అది శ్రీరంగనాథస్వామి. అచ్చటపడియున్న ఆకులు, ఎండుపుష్పములతో పూజసేసియుండిరి. ఏదేదో మాటలు పల్కుచున్నారు. అర్చకులు శ్లోక, పాశురముల వల్లెవేసినట్లు, భూమిపైనున్న మెత్తని దుమ్మును ఒక పెద్ద అరటియాకున నుంచి, దానిని ప్రసాదమనుచుండిరి. ఆ ప్రసాదమును అందరికి పంచిపెట్టుచున్నారు. ఇది వారు అభినయించు చున్న కేళిక, మొత్తము మీద వారందరు భగవత్సంశ్లేష భావముననే యున్నారు. ప్రపంచమును మరచి నట్లగపడినారు. పరమానందమున ఆదైవకైంకర్య కేళియందు నిమగ్నులైయున్నట్టి ఆ పసికూనల రామానుజుడు చూచి, మురిసిపోయెను. ఆయనకూడా ఆక్షణమున అనిర్వచనీయమయిన అనుభూతిని పొందినాడు. తటాలున ప్రసాదమును పంచుచున్న పిల్లవానినెదుట నిలిచి, రామానుజుడు దోసిలియుంచెను. రామానుజు డతివినయమున దానినీ స్వీకరించి, కళ్ళకద్దుకొని, "శిష్యులారా! చూచితిరా, ఈ బిడ్డలు కూడా పురుషోత్తముని సగుణాకారునిగా ఊహించుకొని, వారిరూపముననే దైవమున్నాడని ఊహించుకొని, సంశ్లేషపడుచున్నారు. వీరితత్వము యెంత నిర్మలమయినదో, ఎంతటి బంధరహితముగా నున్నదో చూడుడు, దేవాలయముననున్న ప్రధానార్చకుని మనస్సునకంటే వీరి మనస్సులు ఉన్నతములు. నిష్కళంకములు అవి గ్రహింప వలసియున్నది", అని పలుకుచూ రామానుజుడా స్థలమును వదలి నడచిపోవుచుండెను.

నిజమైన భక్తులకు కులభేదములులేవు; సర్వులు దైవసృష్టిలోని వారనియు, సమాన ప్రతిపత్తిగలవారనియు, సోదర భావముతో నుంటారు. ఇది శ్రీవైష్ణవుని తత్త్వము. రామానుజుని తత్త్వమట్టిది. ఉరంగావిల్లి (ధనుర్దాసు) బ్రాహ్మణ కులజుడుకాదు. రామానుజుడు వానిని తన బ్రాహ్మణశిష్యులో నొకనిగా ఆదరించువాడు.

ఉదయస్నానానంతరము మఠమునకు తిరిగినడచి వచ్చునపుడు రామానుజుడు ఉరంగావిల్లి భుజముపై తనహస్తము నుంచి, వాత్సల్య భావముతో నడచువాడు. ఈ ప్రత్యేక ప్రేమాదరముల జూచిన బ్రాహ్మణ కులజులయిన శిష్యులు కొందరు కుపితులైరి. ఉరంగావిల్లి యెడ నసూయ భావమును పొందిరి. ఆచార్యులనడవడి విచిత్రముగా విపరీతముగా నున్నట్లు వారు భావించిరి. ఒకనాడు ధైర్యమును దెచ్చుకొని, వారు ఆచార్యుని మెల్లగా ప్రశ్నించిరి, "స్వామీ, మీరు స్నాన మాచరించి, పవిత్రులైయుండి, శూద్రుని స్పృశించుచూ నడచి వచ్చుటను జూచి, వైష్ణవులయిన బ్రాహ్మణులు ఏవగించుకొను చున్నారు. అదేమో మీకును మనస్పుకురాకున్నదే!" అనిరి. వారి హ్రస్వభావములకు కారణములు అనాదిగా వచ్చుచున్న మూఢా ఛారములు, మూఢవిశ్వాసములని భావించిన రామానుజుడు అప్పటికి మందహాసమున నూరకుండెను.

రామానుజుడు వారికి జ్ఞానోదయమును గల్గించుటకు ఒక పన్నాగమును పన్నెను. తనకు సంపూర్ణ విశ్వాస పాత్రుడయిన ఒక శిష్యునితో, "ఈరాత్రివేళ, ఆరవేయబడిన శిష్యుల కాషాయవస్త్రములలో ఒకదాని నుండి రహస్యముగా జానెడు గుడ్డను చించివేసి, ఆ పేలికను రహస్యముగా నొకదగ్గర దాచియుంచుము", అని చెప్పెను.

రామానుజుడు చెప్పినట్లు శిష్యుడు చేసెను. తెల్లవారిన తరువాత మఠముతోటలో కలకలము బయలుదేరినది. "నావస్త్రమును చింపిన వాడెవడు?" "నీవు" - "నేను కాదు నీవు", "జాగ్రత్త" "అపనిందలు పల్కుచున్నావు జాగ్రత్త" - ఈ మాటలతో శిష్యులు పరస్పరము కలహించుకొనుచూ, అలేఖ్యములయిన పరుషభాషణములకు కూడ దిగిరి. రామానుజుడు వెలుపలికి రావడం, వారందరు భయముతో తాత్కాలికముగ నిశ్శబ్దముగా నుండడము జరిగినది. అందులో ఒక శిష్యుడు మెల్లగా, "స్వామీ, యిచ్చట వస్త్రముల నుండి కొంత భాగములను రాత్రివేళల దొంగతనముగా చించివేయుచున్నారు", అని అనగా, రామానుజుడు శాంతముగా, మెల్లగా, "నిదానముగా

విచారించు కొందములేండి - కలహింపకుడు - వాదులాడకుడు" అని పలుకగా అందరు మిన్నకుండిరి.

రెండు మూడు దినములు గడిచిన తరువాత ఒకనాటి సాయంకాలమున కలహము లాడుకొన్న కొందరు శిష్యులను బిలిచి, "ఈనాడు మీ కొకపనిని నిర్ణయించుచున్నాను. అతి రహస్యముగా జాగ్రత్తగా మెలకువగా దానిని నెరవేర్చ వలయునుసుమా! ఈనాడు చీకటి పడిన తరువాత కనిపెట్టుకొనియుండి, ప్రొద్దుబోయిన తరువాత మీరు రహస్యముగా ఉరంగావిల్లి యింటికి పోయి, పొన్నాచ్చి నిద్రించి యుండుటను గాంచి, జాగ్రత్తగా ఆమె బంగారు నగలను తస్కరించి తీసికొనిరండు. మీరాపని గావించి తిరిగి మఠమునకు వచ్చినంత వరకు ఉరంగావిల్లిని యేదోనెపమున మాట్లాడుచూ మఠము నందే నిల్పుదును. ఈ ప్రణాళికా ప్రయోజనమును మీకు తరువాత దెల్పెదను. మఠవాసులమగు మనకు సువర్ణాభరణములేల అనిగాని, తస్కరించుట తగునా అనిగాని, వితర్కించు కొనవద్దు. ఇది నా యాజ్ఞ; శిరసావహింపుడు. రేపటి దినము ఈ కార్యార్థమును విచారింతము గాక", అని రామానుజుడు శిష్యులకు దెల్పెను.

ఉరంగావిల్లి ప్రొద్దుపోయినను ఆచార్యుని వద్దనే కూర్చొని, సంభాషించుచుండెను. ఆచార్యులు సెలవిచ్చిన వరకు మఠమును వదలు అలవాటు ఉరంగావిల్లికి లేదు. ఆ సమయమున నిర్ణీత శిష్యగణము ఉరంగావిల్లి గృహమునకు పోయిరి. ప్రొద్దుపోయినందుకు భర్తకొరకు ఎదురుచూచుచుండి పొన్నాచ్చి తటాలున నిద్రబోయినది. కొందరు శిష్యులు వెలుపలనుండగా, ఇద్దరు మాత్రములోన ప్రవేశించి, ఆమె ఒక చెవిలోని నగలను తస్కరించిరి. తాకిడికి మెలకువవచ్చి మెల్లగా అర్ధకన్ను తెరచిచూచెను. తిరుమణిధారులయిన బ్రాహ్మణ వైష్ణవులని గమనించెను; "పాపము! వారెట్టి దారిద్ర్యమున బద్ధారో! లేనియెడల ఈ భాగవతోత్తములు దొంగతనమునకు పాల్పడుదురా? నా ఆభరణములు భాగవతులకుపయోగ పడినట్లయితే అంతకంటే మహాభాగ్యము నాకేమియున్నది? ఒక ప్రక్కనగలను మాత్రమే తీసిరి.

నేను ఈ ప్రక్కకు పొర్లిపండుకొనిన వారు ఆ పార్శ్వపు నగలను గూడా తీసికొనిపోవుదురు. ఇదే నా అభిలాష", అని తలంచుచు, పొన్నాచ్చి మేల్కాంచినట్లగపడక, నిద్రమత్తునే అభినయించుచూ, మెల్లగా నటుపొర్లెను. ఆమె నిద్రలేచినదనియు, వారి దొంగతనము బయట పడునేమోయని భయపడి, శిష్యులు దొరికిన నగలను జాగ్రత్తగా మూటన గట్టి తిరిగి వేవేగ మఠమును జేరిరి. ఇది గమనించిన రామానుజుడు, "ఉరంగావిల్లీ! చాలప్రొద్దుపోయినట్లున్నదే! ఇక ఇంటికిపొమ్ము. పొన్నాచ్చి యొక్కతే నీకొరకు ఎదురుచూచుచుండును", అని పల్కెను. ఉరంగావిల్లి బయలుదేరిపోయెను.

జరిగిన వృత్తాంతమును శిష్యులు రామానుజున కెరింగించిరి. "మంచిది. ఇక మీరొకపని చేయవలసియున్నది. ఇప్పటికి ఉరంగావిల్లి యిల్లు చేరియుండును. మీరును అతని గృహమునకుబోయి, రహస్యముగా పొంచియుండి, భార్యాభర్తల సంభాషణమును మెల్లగా వినిరండు", అని రామానుజు డాదేశించెను.

అట్లే ఆ కటిక చీకటిలో ఉరంగావిల్లి గృహసమీపమునజేరి శిష్యులు ఇంటిలో జరుగు విషయముల గమనించుచున్నారు. ఉరంగవిల్లి యిల్లుచేరి భార్యను చూడగనే ఆమె చెవులోని నగలు లేకుండట జూచి, అదేమి అని ప్రశ్నించెను. పొన్నాచ్చి జరిగిన వృత్తాంతమును చెప్పుచూ, "ఈ పార్శ్వపునగలను ఆ భక్తులు తీసికొన గలందులకై నేను మెల్లగా తలద్రిప్పగా, నేను మేల్కాంచితినని భయపడి గాబోలు వారు పరుగిడిపోయినారు. అట్లు జరుగుట నా దరదృష్టము. నాయొక్క నగలన్నియు భాగవతుల కుపయోగపడకపోయనే", అని భర్తతో ననెను.

ఉరంగావిల్లి, "నీవట్లు ఒత్తిగిలి పండుకొనుటచే భక్తులకు అపచారమే గావించితివి - ఇవి నానగలు - యీ నానగలను వారికి వశము జేసెదను - అను తలంపునందు గూడా నీ అహంభావము కొలదిగయున్నది. నీవు కదలకుండా నుండినచో ఆ వైష్ణవ భక్తులు

కృతార్థులైయుండెడివారు కదా! భక్తులకెంతటి అపచారము జరిగినది? వారు దొంగతనముగా నీయాభరణములు దీసికొనిపోయినను వారేదో మంచి కార్యమునకే వానిని వినియోగించెదరు. వారిని చోరులనరాదు. వారు చేసిననది చోరకార్యము కాదు. తిరుమంగైఆళ్వార్లకథ తెలియదా నీకు? వారికృషి ఫలితమేగదా యీనాటి సప్తప్రాకార శ్రీరంగనాథాలయ వైభవము?" అని భార్యతో ననెను. తరువాత వారిరువురును మరియొకసారి తిరుమంగై ఆళ్వార్ల జీవిత చరిత్రమును స్మరణకు దెచ్చుకొనుచూ సంభాషించు కొనుచుండిరి.

ఈ భార్యాభర్తల సంభాషణను వినిన శిష్యులు తిరిగి రామానుజ మఠముజేరి, వారు కన్న విన్న విషయములను సూదిగ్రుచ్చినట్లు ఆచార్యులవారికి నివేదించిరి.

మరునాడు మఠమున వేదాంతోపన్యాసమునకు ముందు, తస్కర పాత్రలు వహించిన శిష్యులచే జరిగిన వృత్తాంతమును రామానుజుడు చెప్పించెను. అంతకుపూర్వ మొకనాటి రాత్రివేళ శిష్యులకాషాయ వస్త్రమునకొలది భాగము చింపివేయబడుట తన అజ్ఞానుసారముగా జరిగిన ఘట్టమని ఆచార్యులు తెల్పిరి. "కౌపీనమంతటి గుడ్డపేలిక పోయినదని మీరు ఈర్ష్యాపరులై శత్రువులవలె పరస్పర దూషణములు జేసికొని దుర్మార్గమైన మాటలను పలికితిరి. మీకు సహనము లేకపోయెను గదా! ధార్మికగుణము లేకపోయె! మీరిక స్వార్థరహితులగు టెట్లు? స్వార్థరాహిత్యభావమేకదా మోక్షమార్గము? చరమ శ్లోకార్థము నెంతవరకు మీరు పాటించినట్లు? మీకును ఆ శూద్రులనబడు ఉరంగావిల్లి దంపతులకును గల భేదమును గమనింపుడు. అట్టివారు కదా నిజమైన శ్రీవైష్ణవులు?" అని రామానుజుడు తెల్పగా, మఠవాసు లయిన శిష్యులు సిగ్గున తలవంచి, క్షమాపణ కోరుచూ సాష్టాంగపడిరి.

తస్కర పాత్ర ధరించిన మఠశిష్యులు పొన్నాచి వద్దకుపోయి ఆచార్యులవారు జరిపించిన నాటకమును దెల్పి, తస్కరింపబడిన నగలను ఆమెకు అందజేసిరి. ఇతర శిష్యులను ఉరంగావిల్లిని,

పొన్నాచ్చిని వారిభక్తి భావమునకు ప్రశంసించిరి. శూద్రులని వారిని మానసికముగా ద్వేషించినందులకు క్షమాపణ కోరిరి. వారు వచించిన పశ్చాత్తాపవచనములు ఆచార్యులవారికి తెలియుగా వారును సంతుష్టులయిరి.

కథయంతయు పూర్తిగా తెలిసికొన్న ఉరంగావిల్లి దంపతులు రామానుజుని పాదపద్మములకు మ్రొక్కి, వారు ఆచార్యులవారి ప్రేమ వాత్సల్యములకు పాత్రులగుట వారి మహద్భాగ్యమని మనవి చేసికొనిరి. పొన్నాచ్చి తన శరీరమున నున్న సువర్ణాభరణములనన్నింటిని తీసి, ఆమెకు వాని ప్రయోజనము లేనందునను, ఒక విధముగా ఆనగలు దైవభక్తులకు జెందవలసినవేయని ఆ దంపతులు తలంచి నందున, ఇకవానిని మఠమునకో, దేవాలయమునకో అర్పించుట యుక్తమని భావించి, రామానుజుని ఆజ్ఞానుసారము తన సువర్ణా భరణములనన్నింటిని శ్రీరంగనాథునకు భక్తితో సమర్పించినది. ఈ విధమున రామానుజ మఠమున వైష్ణవాదర్శములు ప్రదర్శింప బడుచుండినవి.

పవిత్రుడయిన ఉరంగావిల్లి శ్రీవైష్ణవుడేగాని, యిక అతనికి కులమేమున్నది? కావుననే ఆయనపై అంతటి వాత్సల్యమును రామానుజుడు చూపువాడు. ఈ సత్యము నెరుగని మఠములోని శిష్యులు, ఇప్పుడు విషయము నెరిగి సిగ్గుపడిరి. ఇట్టి వైష్ణవా దర్శములు ఈనాటికి ఎంతవరకు మానవులను ప్రభావితము జేయుచున్నవో గమనింప తగియున్నది. ప్రాచీన ఆచారములు, విశ్వాసములు, అతిబలిష్ఠములయినవి. ఎంతోమంది సంస్కరణవాదులు ఉద్భవించి నను, ఎన్నో సంస్కరణములు సంఘమును జేరినను, కొంత కాలమునకు మరలా మూఢాచారములు తలయెత్తుచుండును. గడ్డివ్రేళ్లవలె ఇవి మొండివి.

గరికయెండాకాలమున అగపడకున్నను, కొంతకాలమయిన తరువాత వర్షము పడగానే పచ్చగా చిగుర్చును. ఎండకాలమున

వానివ్రేళ్లు మట్టిలోనే కలిసిపోయి యుండునేమో అని అనిపించును. అట్లనే తాత్కాలికముగా అంతమొందినట్లగపడి, యీమూఢా చారములు తలయెత్తుతునేయున్నవి. వాని అంకురములు సంఘమున స్థిరముగానాటుకొని పోయినవి. ఇది చాల శోచనీయ మయిన విషయము. మానవులు చరిత్రగతిని గమనింపవలసిన అవసరము ఇందున్నది. మహానుభావుల ఆదర్శము నెల్లప్పుడు పాటించుచుంటేనే సంఘమునకు మోక్షమున్నది. ఉరంగావిల్లి నిజమైన శ్రీవైష్ణవు డెట్లాయెను? రామానుజుడు శిష్యులకు వైష్ణవాదర్శముల నెట్లు బోధించెను? అను విషయములు మరువరానివి, అనుసరణీయ ములు, అప్పుడే సంఘమునకు శాంతి, ఆనంద, భద్రతలుండును. "నేను అగ్రజాతివాడను, నేనగ్రకులజుడను" అని భావించు బ్రాహ్మణ కులజునకు నమ్రతరాదు. బ్రాహ్మణుడు, బ్రాహ్మణకులజుడు అన్న పదములకు గల భేదమును గమనింపవలయును. ఉరంగవిల్లికి స్వాభావసిద్ధముగా అడకువ నమ్రతలు చేకూరినవి. జ్ఞానప్రాతిపదికగా అతడు బ్రాహ్మణుడే ఆయనకు బ్రాహ్మణ కులజునితో పోల్చతగదు. నేడు బ్రాహ్మణ కులజుడను పదము సంఘ వ్యవస్థలోనున్నది. 'బ్రాహ్మణ' అను పదము అధ్యాత్మిక పదము. ఈ సత్యముల గమనించి మానవులెల్లరు సోదరభావమును మెలగుచూ జ్ఞానవంతుడెవరైనను వానిని పూజింపవలయును.

ఉరంగావిల్లి యొక్క నమ్రతను, సంస్కారమును ప్రపత్తి భావమును రామానుజుడు గమనింపగలిగినాడు. ఇక మఠవాసులలో క్రమముగా నందరు వాని ఔన్నత్యమును తెలిసికొనిరి. ఇదియే రామానుజ మఠవానము యొక్క వైష్ణవాదర్శము. కూరేశుడు ఉరంగావిల్లిని "మహామతి" అని పిలుచువాడు.

మారనేర్‌నంబి పంచమకులజుడు; అతడు అస్పృశ్యుడేగదా? అందులో ఆ కాలములో! కాని ఆయన యామునా చార్యులవారి (ఆళవందార్) సన్నిహిత శిష్యుడు. పెరియనంబికి సన్నిహిత స్నేహితుడు. ఈ సంబంధము వైష్ణవాదర్శములను చాటునుగదా! యామునా

చార్యులు భావించుటలో విశిష్టత యేమి? సర్వాంతర్యామియగు వైష్ణవశక్తికి ప్రపత్తి చూపుటలోనే సంఘసేవా భావము అంకురించునని యామునాచార్యుని ఆలోచనాక్రమము. వైష్ణవభావము లోకకల్యాణార్థము మానవుల మనస్సులలో అభివృద్ధి జెందవలసి యున్నది. ముక్కుమూసికొని తపస్సు చేయడం విశిష్టాద్వైత సిద్ధాంతము సమ్మతింపదు. "ధ్యానాత్కర్మ ఫలత్యాగః" అని గీత పల్కుచున్నది గదా! గీతోపన్యాసములు చేస్తూనే కర్మసన్న్యాసమును ప్రబోధించినవారు సంఘమును వక్రమార్గమును పట్టించినారు. వైష్ణవ సంశ్లేషభావమున విశ్వసంశ్లేషమున పరమానంద స్థితి ననుభవించుచు లోకకల్యాణము నకు జీవితము నంకితము జేయవలయునని ఆళవందారు ప్రవచించి యున్నారు. ఇదియే రామానుజమతము లేక రామానుజుని మార్గమయినది.

పంచముడనబడు మారనేర్నంబి శ్రీరంగమునకు వెలుపలనున్న హరిజనవాడలో నివసింపవలసినదే కదా! మరియు వార్ధక్యమున నున్నవాడు. ఇంతకుమించి అతడిప్పుడు దీర్ఘవ్యాధిగ్రస్తుడుగా నున్నవాడు. బాగుగా తిరుగలేడు. భగవన్నామస్మరణతో ఇంటివద్దనే యేకాకిగా కాలము గడపువాడు. పెరియనంబి వృద్ధుడయినను ప్రతిదినము చీకటిపడిన తరువాత ఆహారమును పదిలముగా మూటగట్టుకొని పోయి మారనేర్నంబికిచ్చువాడు. ఇది యామునా చార్యుని యాజ్ఞ. అందువల్ల యామునాచార్యుని మరణానంతరము పెరియనంబి యీ కార్యమునకు భంగము కలిగింపలేదు. చీకటి, గాలి, వర్షము, చలి మొదలగు యిబ్బందులను పెరియనంబి యీ కార్యనిర్వహణలో లెక్కచేసినవాడుగాడు.

రామానుజుడు ఆచార్యుడుగా నెలకొనియున్న మొదటి దినములలో వారికి మారనేర్నంబి వృత్తాంతము తెలియదు. ఒకనాటి సాయంకాలమున వృద్ధుడయిన పెరియనంబి ఆహారపుమూటను చేతబూని ఒంటరిగా చీకటిలో నడచిపోవుచుండెను. ఇది రామానుజుడు చూచెను. పెరియనంబికి తెలియకుండా కొంత

దూరము రామానుజుడు అతనిని వెంబడించి నడచుచుండెను. నంబిగా రెచ్చటికి పోవుచున్నారో కనుగొనవలయునని రామానుజునకు కుతూహలము జనించెను. పెరియనంబి హరిజనవాడను ప్రవేశించి, ఒక గుడిసెను చేరి, వృద్ధుడును, రోగపీడితుడును, బలహీనుడును అగు మారనేర్‌నంబికి ప్రేమతో సాపాటు కూర్చెను. ఇది చూచిన రామానుజుడు భక్తిపరవశమున పెరియనంబికిని, మారనేర్‌నంబికిని ప్రణమిల్లెను. రహస్యమును రామానుజుడెరిగినందులకు పెరియనంబి ఆశ్చర్య ఆనందముల పొందెను. ఆశీర్వదించుచూ, "రామానుజా, యిది యామునాచార్యుల ఆజ్ఞానుసారము నేజరుపు నిత్యకృత్యము", అని పెరియనంబి అనెను. పెరియనంబి యొక్క వైష్ణవాదర్శమునకు రామానుజుడు అద్భుతపడెను; ఎంతయో ప్రభావితుడయ్యెను.

పెరియనంబి యీ జీవకారుణ్యకార్యమును తరువాత తెలిసికొన్న మూఢవిశ్వాసముల మునిగియున్న బ్రాహ్మణ వైష్ణవులు, దేవాలయార్చకులు పెరియనంబిని ఆక్షేపించిరి. పెరియనంబి అకార్యము చేయరాదని పట్టుబడిరి. నంబియింటికి కాపుదల పెట్టిరి. ఆయన హరిజనవాడకు పోయిన ఇక దేవాలయ నిత్యప్రసాదములు ఆయనకు రావు అని బెదరించిరి. పెరియనంబి చేయునదిలేక, యిల్లు వదలిపోలేని పరిస్థితిలో రామానుజుడు ఆకార్యభారమును బూనెను. రామానుజుడు ఈ మూఢులజూచి భయపడువాడుకాడు. బహిరంగము గానే మఠవాసులై శిష్యుల కొందరిని తోడ్కొని రాత్రివేళ మారనేర్‌నంబికి ఆహారమును చేర్చుచుండెను. వానితో ప్రొద్దుపోయినదాకా ఆధ్యాత్మిక వైష్ణవవిషయముల చర్చించుచుండెడివాడు. శిష్యులెంతో ఆనందించి, ప్రభావితులయ్యెడివారు. రామానుజుల వైష్ణవాదర్శము అట్టిది.

**దాశరథిని (ముదలియాండాన్) పెరియనంబి కుమార్తె అత్తులాయికి తోడుగా అత్తగారింటికి పాచకునిగా రామానుజుడు పంపిన విషయము మనము తెలిసికొని యున్నాముగదా! సేవచేయుటయే నమ్రతకు మార్గమనియు, శ్రీవైష్ణవుడు తోటిభక్తుల కాషాయ వస్త్రము లను ఉతికి శుభ్రపరచుటకు సంసిద్ధుడుగా నుండవలయు ననియు**

రామానుజుడు బోధించువాడు. ఇది శిష్యులకును, భక్తులకును ఎంతటి ఆదర్శప్రాయమో గమనింపుడు. విశిష్టాద్వైత సిద్ధాంతాచరణ యొక్క గొప్పతనము, సత్యము ఇది. మఠవాసులైన వారెల్లరు ఈ వైష్ణవాదర్శముల పాటింపువారు.

శ్రీవైష్ణవుడు ఎంతటి ఉత్సాహముతో గీతోపన్యాసముచేయునో, ఎంతటి ఉత్సాహముతో గీతోపన్యాసమును వినునో అంతటి ఉత్సాహముతో ఇతరులకు సేవచేయుటకు సంసిద్ధుడుగా నుండును.

కులశేఖరాళ్వారు ముకుందమాలయందు సెలవిచ్చిన ఈ శ్లోకార్థము గమనింపుడు:

శ్లో॥ మజ్జన్మనః ఫలమిదం మధుకైటభారే ।
మత్ప్రార్థనీయ మదనుగ్రహ ఏష ఏవ ।
త్వద్భృత్య భృత్య పరిచారక భృత్య భృత్య ।
భృత్యస్యభృత్య ఇతిమాం స్మరలోకనాథ ॥

ఇదియే శ్రీవైష్ణవాదర్శము. దాసానుదాసుడను (దాసులకు దాసుడను) అను సమాసము యిట్టి వైష్ణవాదర్శమున వచ్చినది.

అడియేన్ (దాసుడను) అని యితురల జూచినపుడు పలుక వలయును అని యామునాచార్యులు బోధించి యున్నారు గదా!

శ్రీరామానుజ మఠమున శిష్యులు అన్ని కులముల వారుండిరి. కులము, అంతస్తు, పాండిత్యము అను భేదములు లేక శిష్యులు భక్తులు ఎల్లరు మఠకార్యక్రమములకు నియోగింపబడువారు. కిడాంబియాచ్చాన్ అను భక్తుడు వంటచేయువాడు, ఉరంగావిల్లి ఆర్థిక విషయముల జూచువాడు, దాశరథి ఆచార్యుల దైనిక కార్యక్రమమును జూచువాడు, కూరేశుడు ఆచార్యులకు నీడగా నుండువాడు, శిష్యులెల్లరు మఠసిద్ధాంతముల నేర్చుకొనుటయేగాక, ఆ సిద్ధాంతములను వారి దైనిక చర్యలలో పాటించి, మంచి ఆదర్శముల నెలకొల్పువారు.

"అడియేన్" అని యితరులకు వందనమాచరించుటయను వైష్ణవాదర్శమును మరికొంత విపులము జేయుటయుక్తము. శ్రీరామానుజ మతమున నున్న శిష్యులెల్లరు సమప్రతిపత్తి, ప్రేమ, భక్తిగౌరవముతో మెలగువారు. ఎవరు ముందుగా ఎవరిని జూచినను, "అడియేన్" అని పలుకుచూ నమస్కరింప వలయునను ఆచారము నెలకొల్పబడినది. "అడియేన్" అనగా "నీకు నేను దాసుడను" - "నీకు నేను చేయగల కార్యమేమైననున్నదా? శిరసావహించి చేయుటకు సంసిద్ధుడను" - అని భావము. ఈ సదాచారము శ్రీవైష్ణవులెల్లరికిని ఆదర్శప్రాయము. భగవచ్ఛక్తి ముందు సర్వులు బిడ్డలతో సమానముగావున, భక్తిప్రేమ భావమున సేవాకైంకర్యమునకు సంసిద్ధులైయున్న వారికి వయస్సు భేదముకూడాలేదు. యామునాచార్యులే తన శిష్యులను జూచినపుడు ముందుగనే "అడియేన్" అని వచించువాడు, రామానుజుడు వారి ఆదర్శమును పాటించుచు ఇతరుల జూచినపుడు అధికోత్సాహముతో, "అడియేన్" అని పలుకుచూ హెచ్చరించువాడు.

శ్రీరామానుజాచార్యులవారి యొక్క ఓర్పు, సానుభూతి, అనసూయా భావము, శాంతము, క్షమించు తత్త్వము వర్ణనాతీతము. ఇందులకు కారణములు వారి తత్త్వత్రయ జ్ఞానము, వారి వైష్ణవ భావము, వారి సంస్కరణాతత్త్వము.

పంచవర్ణముల వారును, స్త్రీలును రామానుజుని ఆశ్రయించి తిరుమంత్రోపదేశమును పొందుచున్నారు. వారి దయార్ద్ర హృదయమును గూర్చి శ్రీరంగవాసులేగాక, చుట్టు ప్రక్కప్రాంతముల వారెల్లరు ప్రశంసించుచుండిరి. రామానుజుని యశోవృక్షము ఎంతత్వరగా ఎంత యేపుగా పెరుగుచుండునో అంతకు హెచ్చుగనే వారిపై ఒక వర్గమువారికి అసూయ పెరుగుచుండెను. ఆ వర్గమేది? మూఢ విశ్వాసములకు, మూఢాభారములకు ఎరయైయున్న దేవాలయార్చకులే. ఎవరోకాదు. రామానుజునకు అతి సన్నిహితముగా నటించువారే!

రామానుజుడు పంచములయెడ సోదరభావమును జూపుటను బ్రాహ్మణ వైష్ణవులు ద్వేషించిరి. వారి తత్త్వమును ఇతర కులజుల వారును, నిజమైన భక్తులును గమనింప గలిగిరేగాని, దేవాలయ అర్చకులలో కొందరు అయనను అమితముగా ద్వేషించుచుండిరి. కాని రామానుజుని పలుకుబడికి వారు నోరు కదల్పక యుండిరి.

సంఘములోని హెచ్చుతగ్గులు మానవకల్పితములు, సర్వులు మోక్షమున కర్హులు అని చెప్పు రామానుజ సూత్రములు అర్చకులకు నచ్చలేదు.

శ్రీరామానుజాచార్యులు శ్రీరంగనాథునకు గావించు అర్చన విధానము కొందరు అర్చకులకు గిట్టలేదు. గతంలో శ్రీరంగ దేవాలయమున కేవలము వైఖానస ఆగమ విధానమునననుసరించి అర్చనలు జరుగుచుండినవి. కాని రామానుజుడు పాంచరాత్ర ఆగమ విధానము ననుసరించి అర్చనచేయ నారంభించెను. దీనికి ప్రథానాచార్యుడగు భృంగాచారి వ్యతిరేకించెను.

యామునాచార్యులు వైష్ణవలోకమునకు కులపతియనియు, పాంచరాత్రాగమ విధానమును యామునాచార్యుడు తెల్పిన విధానమని యు, అందులకేల కొందరు అర్చకులు అనుమతించుటలేదు అని రామానుజుడు ప్రశ్నించెను. యామునాచార్యుల గురుత్వమును గాదనలేరు గాని, వారు ప్రవేశింపజేసిన పాంచరాత్రాగమ అర్చనా విధానమును మాత్రం సమ్మతించుటలేదు. వారికి బ్రాహ్మణ ప్రాధాన్యమవసరము. ఇతర కులస్థులను దూరముగా నుంచుట వారి అభీష్టము. దేవాలయమున రామానుజుని పూజా విధానమును ప్రధానార్చకుడు అంగీకరింపనందున, తాను ప్రత్యేకముగా, సాధారణ దేవాలయార్చనలు జరిగిపోయిన తరువాత, అర్చన జరుపువాడు. చాతుర్వర్ణముల వారు తండోపతండములుగా రామానుజుని అర్చనా విధానమును తిలకించి, ఆనందించుచుండెడివారు. చాతుర్వర్ణముల వారికి సమాన ప్రాధాన్యమును ప్రకటించు ఈ రామానుజుడు క్రమక్రమముగా పంచముల వారిని గూడా దేవాలయమునకు

ఆహ్వానింపగలడను భయము కూడా దేవాలయార్చకులకు కలుగక పోలేదు.

ఈ పరిస్థితులలో దేవాలయార్చకులలో కొందరు రామానుజుని రహస్యముగా తుదముట్టించుటయే యుచితమని భావించిరి. ప్రధానార్చకుడయిన భృంగాచార్యుడు కడకు ఈ పనికి మరియొక అర్చకుడయిన శేషాచార్యుని నియోగించెను. ఆ పనిని తాను రహస్యముగా మరునాడే గావించెదనని శేషాచార్యులు కంకణము కట్టుకొనెను.

ఆ రాత్రి శేషాచార్యులు భార్య తిరుక్కొచ్చితో తన సంకల్పమును దెల్పెను. ఆ పనిని తిరుక్కొచ్చియే చేయవలయునని ఆజ్ఞాపించెను. సుబుద్ధియు, రామానుజుని దైవముగా భావించునదియు, అయిన తిరుక్కొచ్చి, అదివిని నిర్ఘాంత పోయినది.

"జాగ్రత్త! నీ ఆలోచనలకు తావులేదు! రేవు మధ్యాహ్నమున రామానుజుడు భిక్షకు వచ్చినపుడు విషము కలిపిన అన్నమును ఆయనకు నీవే యివ్వవలయును. అన్నములో విషమును నేనే కలపెదను. ఈ పని చేయుటకు నీవు మారాడిన - జాగ్రత్త మునుపు జరిగిన సంఘటనను జ్ఞప్తికి దెచ్చుకొ! ఈ యింటికి నీకు తెగత్రెంపులే!" అని శేషాచార్యులు గర్జించెను.

శేషాచార్యు డతిమూర్ఖుడు. కోపశాలి, శారీరక బలముగల మధ్య వయస్కుడు. పూర్వమొకసారి భార్య తనమాటను వినలేదను నెపమున ఆమెను చావమోది యింటి వెలుపలకు గెంటివేసెను. వారికి సంతానము లేదు, ఇంక ఇంటిలో మరెవ్వరును లేరు. తరువాత ఆమె యెంత ప్రయత్నించినను శేషాచార్యులు ఆమె నింటిలోనికి రానివ్వలేదు. పరువుకు సిగ్గుపడి వీధిలో నుండజాలక, తల్లిగారి యిల్లు జేరినది. మూడు దీర్ఘ సంవత్సరములు పుట్టినింటనే గడపినది. శేషాచార్యుల నుండి మాట - జాబు లేదు. అతడంతటి మూర్ఖుడు. పగబట్టిన త్రాచువంటివాడు.

కడకు తిరుక్కొచ్చి తలిదండ్రులు, అమె సోదరుడు శేషాచార్యుల బ్రతిమాలి స్త్రీ మగనిని వదలి పుట్టినింట నుండుట భార్యాభర్త లిరువురకు గౌరవప్రదము కాదని వేయిమాటల చెప్పగా, చెప్పగా, కడకు యితర కులస్థులుగానున్నవారు, అర్చకులు ఇచ్చిన సలహాల మేరకు కట్టకడకు శేషాచార్యులు తిరుక్కొచ్చిని ఇంటిలోనికి రానిచ్చినాడు. అందువలన తిరుక్కొచ్చి అదిమొదలు శేషాచార్యులను ఏ మాటకు కూడా వ్యతిరేకించెడిది కాదు. అతని మూర్ఖ స్వభావమున ఇడుమలు పడిన వ్యక్తిగావున.

తిరుక్కొచ్చికి ఇప్పుడు పెద్దసందిగ్ధావస్థ యేర్పడినది. భర్తను వ్యతిరేకిస్తే భర్తృ వియోగము తప్పదు. బ్రతికియున్న భర్తృ వియోగము, వైధవ్యమున కంటే బాధాకరము స్త్రీలకు. కాని భగవానుడగు రామానుజాచార్యుల వారికి విషాన్న మిచ్చుట యెట్లు? ఈ భయముతో ఈ దుఃఖముతో తిరుక్కొచ్చి రాత్రియంతయు దైవస్మరణ జేసికొనుచూ, కాలము గడపెను. "స్వామీ, నారాయణా - అబలను, నాచే ఇవ్వబడు విషాన్నము వలన శ్రీరామానజునకేలాటి అపాయము సంభవింపనట్లు అను గ్రహింపుము - స్వామీ!", అని కడకు తిరుక్కొచ్చి నిర్ణయమునకు వచ్చెను. ఈ ప్రార్థనము తోటి మరునాడు ఉదయమునుండి కాలము గడుపుచుండెను.

మరునాడు మధ్యాహ్నమయినది. శ్రీరామానుజాచార్యులు వీధిని భిక్షకై వచ్చుచున్నాడు. కాచుకొనియున్న శేషాచార్యులు రామానుజుని కొంత దూరమున నుండగనే చూచెను. రామానుజుని ఆహ్వానింపుమని భార్యతో జెప్పెను. ఆమె మరలా లోనికి వచ్చులోపల శేషాచార్యుడు విస్తరాకులో ప్రత్యేకముగా నుంచబడిన అన్నమునందు విషమును గలిపెను. రామానుజుడు ద్రావిడ ప్రబంధము గానము చేయుచూ, పరమానందమున నిలువబడి యున్నాడు. తిరుక్కొచ్చి చేయునది లేక, గగుర్పాటుతో విషాన్నమున్న విస్తరాకును చేతబూని, రామానుజనకెట్టి అపాయము కలుగకుండుటకు దైవమును ప్రార్థించుచూ, రామానుజుని సమీపించి, విషాన్నహార విస్తరిని వారికొసగి, మామూలు

ప్రకారము ఆచార్యుల పాదద్వయమును స్పృశించుచూ, సాష్టాంగ నమస్కారమాచరించుతరి, ఆమె తన కుడిచేత చూపుడు వ్రేలుతో ఆచార్యుల పాదములపై "సాపడవద్దు - సాపడవద్దు - సాపడవద్దు" - అని వ్రాసెను. ఆచార్యుల వారు సులభముగా గ్రహించుటకై ఒకేమాటను మూడుసార్లు వ్రాసినది. తరువాత ఇంటిలోనికి పోయినది. తన కుట్ర నెరవేరినదని సంభ్రమాశ్చర్యములతో శేషాచార్యులు కనబడినాడు - తన సూచనను ఆచార్యుల వారు గమనించిరో, లేదో, యెట్టియాపదవాటిల్లునో అని మనమున దుఃఖించుచూ, తిరుక్కొచ్చి మౌనముగా, నిద్రించు నెపమున ఇంటిముందు పంచలో పరుండెను.

ఇక శ్రీమద్రామానుజుని వృత్తాంత మేమి? వారు తిరుకావేరిని చేరి, అన్నపు విస్తరిను పదిలముగా నీటిదరినపెట్టి, దేహ ప్రక్షాళనము నకు జలముల దిగెను. "సాపడవద్దు" అని తిరుక్కొచ్చి వ్రాసిన అక్షరములనప్పుడు గ్రహించెనేగాని, రామానుజుడు మరుక్షణమున తన భక్తి పరవశద్రావిడ ప్రబంధపాశుర గానమున తాత్కాలికముగా మరచెను. దేహప్రక్షాళనముగావించి, మరలా అన్నపు విస్తరకడకు వచ్చినపుడు బహుశా తిరుక్కొచ్చి వ్రాసిన సూచనను మనస్సునకు దెచ్చుకొని యుండెడివాడు. కాని, యీ లోపలననే ఒక విచిత్ర సంఘటన జరిగిపోయినది.

తలవని తలంపుగా అనుకూలముగా జరిగిన సంఘటను దైవ సంఘటనగా భావిస్తాము. అందులో భక్తులు ఎల్లప్పుడు ప్రతిదానికి దైవకటాక్షమునాపాదిస్తూ ఉంటారు. ఆతలవని తలంపుగా జరిగిన సంఘటన యేది? ఆకలిగొన్న శునకము మొకటివచ్చి, ఆచార్యుడు స్నానమాచరించుచుండగా, తటాలున అన్నపు విస్తరకడకు వచ్చి, అన్నమునంతటిని తినివేసెను. స్నానము చేయుచుండిన రామానుజా చార్యుడు కన్ను తెరచిచూచునప్పటికి శునకము అన్నమును పూర్తిగా తినివైచెను. తన ఆహారము క్షుద్బాధతోనున్న శునకమును సంతృప్తి పరచుట తనకును ఆనందదాయకమే కదా అని తలంచు భగవానుడయిన రామానుజుడు దరికివచ్చెను. క్షణములో గిజగిజ

తన్నుకొనుచూ, శునకము నేలబడి పంచత్వము నందెను. రామానుజుడు ఆశ్చర్యమున శునక కళేబరమువద్ద, కూర్చొని, ఆలోచింప సాగెను - "ఆహా - తిరుక్కొచ్చి నా కాలిపై వ్రాసిన మాట యిప్పుడు మనస్సునకు వచ్చినది. అది విషాన్నమన్నమాట! తిరుక్కొచ్చికి వ్యతిరేకముగా జరిగిన విషయమిది! శేషాచార్యులు ఇంటిలోనే యుండెను. అతడే విషమును కలిపియుంటాడు. భర్తవలని భయమున విధిలేక తిరుక్కొచ్చి విషాన్నవిస్తరను నాకిచ్చినది. నన్ను రక్షించుటకు నాకాలిపై ఆ దివ్యపదమును వ్రాసినది. అపాయ నివారణ పదమది! నరే, యీ వృత్తాంతమును గూర్చి తరువాత సావధానముగా నాలోచించెదగాక! అయ్యో, యీ శునకము నాయాహారమును తిని మరణించెగదా! ఎంతటి అపచారము జరిగినది! ఇందు నా అజాగ్రత్తయు నున్నది కదా! మతిమరపున తిరుక్కొచ్చి చేసిన సన్నను పరీక్షింపనైతిని! ఈ శునకమునకు పరమపదప్రాప్తి చేకూరునుగాక, అని ప్రార్థించుచూ, శునకకళేబరమును, నిద్రించుపాపను తల్లి స్పృశించు విధమున, అట్లా అట్లా తాకి, తట్టి, దువ్వి, కంటతడి బెట్టుకొని, రామానుజుడు లేచి, అవనతవదనుడై ఆలోచించుచు, మెల్లగా మఠమునైపు నడచుచుండెను.

కుక్క ఆహారమును తినడము, అది మరణించడము, అచ్చట సమీపమున నున్న కొందరు చూచిరి. ఆచార్యులవారిని ప్రశ్నించు ధైర్యమెవరికున్నది? కాని వారెంతో బాధపడ్డారు. దయామయులయిన రామానుజునకు విషాన్నమెవరు పెట్టియుంటారా అని వారు విస్మయమున జెందిరి. క్షణములో శ్రీరంగమంతయు ఈ వార్త ప్రచారమయెను. ప్రజలెల్లరు గడగడ వణకిరి. గృహములవదలి వీధులలోనికి వచ్చిరి. ఆచార్యులవారు మెల్లగా, నిత్యపరమా నందముగా, విష్ణు సంశ్లేషభావమున

శ్లో॥ హేగోపాలక! హేకృపా జలనిధే! హేసింధుకన్యాపతే!
హేకంసాంతక! హేగజేంద్ర కరుణాపారీణ! హేమాధవా!

హే రామానుజ! హేజగత్రయ గురో! హేపుండరీకాక్ష! మాం
హేగోపీజననాథ! పాలయపరం జానామి నత్వాంవినా ॥

శ్లో॥ భక్తాపాయ భుజంగగారుడమణి స్త్రైలోక్యరక్షామణిః!
గోపీలోచన చాతకామ్బుదమణి స్సౌందర్యముద్రామణిః ॥
యఃకాంతామణి రుక్మిణీ ఘనకుచద్వంద్వైక భూషామణి
శ్రేయో దేవ శిఖామణిర్దిశ తునో గోపాల చూడామణిః ॥

శ్లో॥ శత్రుచ్ఛేదైకమంత్రం సకలముపనిషద్వాక్య సంపూజ్యమంత్రం
సంసారోత్తారమంత్రం సముపచిత తమస్సంఘ నిర్యాణమంత్రం॥
సర్వైశ్వర్యైక మంత్రం వ్యసనభుజగ సందష్ట సంత్రాణమంత్రం
జిహ్వే శ్రీకృష్ణ మంత్రం జపజపసతతం జన్మసాఫల్య మంత్రమ్॥

శ్లో॥ వ్యామోహ ప్రశమౌషధం ముని మనోవృత్తి ప్రవృత్త్యౌషధం ।
దైత్యేంద్రార్తికరౌషదం త్రిభువనీ సంజీవనైకౌషధం ।
భక్తాత్యంత హితౌషధం భవభయ ప్రధ్వంసనైకౌషధం ।
శ్రేయః ప్రాప్తికరౌషధం పిబమన శ్రీకృష్ణ దివ్యౌషధమ్ ॥

ఇట్లు ముకుందమాల శ్లోకముల గానము జేయుచూ, నడచి మఠమును జేరెను. విషాన్న సంఘటన మఠమువారికి దెలియగావారు గడగడలాడిరి. కాని ఆచార్యులను ప్రశ్నించు ధైర్యమెవరికున్నది? ఏదైనను ఆచార్యులవారే చెప్పాలి. ఆచార్యులవారు ఆపద నుండి తప్పించుకున్నారు. అంతవరకే - అందరు విస్మయమున ఊరకుండిరి. రామానుజుని అసువుల రక్షించిన ఈశ్వరశక్తికి అందరు కృతజ్ఞత తెల్పుకున్నారు! రామానుజుడు రక్షింపబడుటకు తిరుక్కొచ్చి యెంత ఆనందము జెందినదో వర్ణింపతరమా! తాను పన్నిన కుట్ర విఫలమయినదే! తన విషయం బయటపడునేమో అని భయపడు శేషాచార్యుల స్థితియు వర్ణింప తరమా? ఇక భృంగాచార్యుని మనస్సు ఎట్లున్నదో? వీరిరువురును దొంగకు తేలుకుట్టినట్లున్నారు.

"అది యెవరుజేసిన పని? అని రామానుజునకు తెలిసి యుండును కదా? అతడేల బయట పెట్టలేదు?" అని భృంగా

చార్యులు, శేషాచార్యులు వితర్కించుకొనిరి. శేషాచార్యుని తత్త్వములో ఒకశాతమైనను పశ్చాత్తాపము కనబడ్డది. భృంగాచార్యుడు మరి కరుడుగట్టిన మూఢఛాందసుడు. "శేషా! మిన్నకుండుము. రామానుజునకు తెలిసియుండును కదా! యిక మనము క్షమాపణకు పోతే సరిపోతుందని భావిస్తావేమో! నిన్ను నీకు సలహాయిచ్చిన నన్ను ప్రజలు ముక్కలుముక్కలు చేయుదురు. ఊరకుండుము. ఏమియు తెలియనట్లు," అని భృంగాచారి సలహా ఇచ్చెను.

రామానుజుడా సాయంకాలమున మఠమున ఆలోచనా సమాధిలో కూర్చొనెను. మఠవాసులెవ్వరుగాని పరస్పర భాషణంబు లుడిగి, జరిగిన దుస్సంఘటనను గూర్చి ఆలోచించువారుగ కన్పట్టిరి. మఠము, మఠప్రాంగణము నిశ్శబ్దముగా నుండెను.

రామానుజుని ఆలోచన గతియిట్లున్నది : "సోదర వైష్ణవ మతావలంబి, బ్రాహ్మణ వైష్ణవకులజుడు, అయిన శేషాచార్యులు నన్ను తుదముట్టింప ప్రయత్నించుటకు కారణమేమై యుండనోవు? నేనాతనికెన్నడైనను ఎట్టి అపకారమును తలపెట్టలేదే! ఏదైనను ఒక పరుసని వాక్కును ఆతనియెడ అని యెరుగనే! అట్టి శేషాచార్యుడు నాపై ఇట్టి క్రౌర్యమును బూనుట విపరీతముగా గన్పడెడిని. నేను బోధించు విశ్వమానవ సౌభ్రాత్రసూత్రము శేషాచార్యులకు, తన్ను బహుశా ప్రోత్సహించి యుండినట్టి దేవాలయార్చకులయిన ఛాందసు లకు గిట్టలేదేమో! మానవ సోదరత్వమును చాటునాకు వారు విరోధులుగానున్నారు! మూఢవిశ్వాసములు ఎట్టి దుర్మార్గమునైనను చేయించును! మతము పేరిట ఇట్టి అకృత్యమునకు దిగినవారు మతమంటే యేమని భావించెదరో? సరే, యేదో జరిగిపోయినది! నేనిక ప్రత్యేకముగా జాగ్రత పడవలసినది లేదు. సర్వము ఆవైష్ణవశక్తియే చూచుకొనగలదు. నాసువార్తను నేను ప్రచారము చేయవలసినదె! ఆ కృషి నా శిష్యులును చేయగలరు. మానవ సోదరత్వమును, మానవ సేవను నా విశిష్టాద్వైత సిద్ధాంతము ద్వారా ప్రచారము చేయవలసినదే!

ఒక విషయం. శేషాచార్యులు గావించిన దుష్కార్యమును నేను బయటపెట్టరాదు. అందువలన వానికిని, వానిని ప్రోత్సహించిన వారికిని నా శిష్యకోటివలన ప్రాణాపాయము జరుగవచ్చును. సత్యమును కాలక్రమమున శేషాచార్యులు, వారి ముఠావారు గమనింపలేకపోదురా?" అని రామానుజుడు పరిపరి విధముల వితర్కించుకొని, మిన్నకుండెను. తనమఠవాసులను, శిష్యులను ఆ సంఘటన విషయమై మరచిపొమ్మని రామానుజుడు సలహాయిచ్చెను.

శ్రీమద్రామానుజుని సహనము, దయ, అపకారికినుపకారము చేయుతత్త్వము శ్రీవైష్ణవాదర్శములు.

(వాడుకగా ప్రచారములోనున్న) విషయముల ప్రకారము, ఈ సంఘటన జరిగిన చాలకాలము తరువాత, శ్రీమద్రామానుజ విశిష్టాద్వైత వటవృక్షము వ్రేళ్లు ఊడలు నాటుకొని సుస్థిరముగా నెలకొని, యే తుపానులకు జంకక, స్థిరముగా విశాలముగా వృద్ధి చెందిన కాలమున, శేషాచార్యుడొకనాడు తన వార్ధక్యమున రామానుజునకు పాదాక్రాంతుడై పశ్చాత్తాపమును వెల్లడించుకొన్నాడట. రామానుజుడు వానిని ఆలింగనము చేసికొని, "తప్పుచేయుట సహజము. పశ్చాత్తాపపడుట సంస్కారము, సంస్కరణ భావము. ఈ ఉన్నత భావము నిన్ను పవిత్రుని జేసినది. ఇక నీవు తరింతువుగాక. అగ్నియందు మేలిమి బంగారము అపరంజిగా మారినట్లు, నీవును ఈ అనుభవమున, ఈ పశ్చాత్తాపతత్త్వమున పవిత్రుడవయితివి!" అని రామానుజుడు శేషాచార్యుని ఆశీర్వదించెనట.

అప్పటికే భృంగాచార్యుడు, వాని యనుచరులైన యితర అర్చకులు దివంగతులైయుండిరి.

తిరుక్కొచ్చియు, శేషాచార్యుడును వారి శేషజీవితములను రామానుజ మఠమునందే గడపిరి.

ఇట్లు రామానుజ మఠజీవితము ఎన్నియో వైష్ణవా దర్శములను జూపెను.

## 25. తిరుపతి యాత్ర

### (మరికొన్ని వైష్ణవాదర్శములు)

శ్రీరంగక్షేత్రమందలి శ్రీరంగనాథ దేవాలయ కార్యక్రమములు నిరాఘాటముగా నిర్విఘ్నముగా వైభవోపేతముగా శ్రీరామానుజుని పర్యవేక్షణలో జరుగుచుండినవి. శ్రీరామానుజుని వైష్ణవ విశిష్టాద్వైత మత కార్యక్రమములును, విశిష్టాద్వైత సిద్ధాంత గోష్ఠులు, అతి సక్రమముగా జరుగు చుండినవి. తన శిష్యుల కొందరిని వెంటబెట్టుకొని రామానుజుడు తిరుమల తిరుపతిని దర్శింప నిశ్చయించుకొనెను.

తన మేనమామయు, భాగవతోత్తముడును అయిన పెరియ తిరుమలనంబి యొద్ద (శ్రీశైలపూర్ణునొద్ద) శ్రీమద్వాల్మీకి రామాయణ మును విశిష్టాద్వైత సిద్ధాంత పరముగా పఠించి, పరిశీలింప వలయునని రామానుజుని దివ్య సంకల్పము. శ్రీమద్రామాయణ గ్రంథ రాజవిషయ వివరణ మందు తిరుమలనంబి మేటి యని వైష్ణవ భక్తుల కెల్లరకును సర్వవిదితము. వారు తన శేష జీవితమును తిరుమలపై శిష్యులకు శ్రీమద్రామాయణ బోధన యందు గడపవలయునని నిర్ణయించు కొనెనని యింతకుపూర్వము తెలిసికొని యున్నాము.

కొలది మంది ముఖ్య శిష్యుల వెంటబెట్టుకొని రామానుజుడు తిరుపతి యాత్రకు బయలుదేరెను. మార్గమధ్యమున అష్టసహస్ర గ్రామమను చోట శ్రీరామానుజుడు కొలది విశ్రాంతికై నిలిచెను. అచ్చట వారికి యజ్ఞేశ, వరదార్య అను ఇరువురు శిష్యులుండిరి. వారిలో యజ్ఞేశుడు ధనవంతుడయిన వ్యాపారి, వరదార్యుడు బీద బ్రాహ్మణుడు.

రామానుజుడు శిష్యులతో గూడి గ్రామసమీపముననున్న తటాకమున స్నానమాచరించి, తదుపరి వరదార్యుని యింటికి వచ్చెను. శ్రీవైష్ణవ భక్తుడయిన వరదార్యుడింటలేడు. భిక్షాటనకై పోయి యుండెను. ఇంటిలో నుండిన వరదార్యుని భార్య తన యింటికి అరుగుదెంచుచున్న రామానుజుని చూచి, ఆనందపరవశయయ్యెను.

ఓరవాకిలి ప్రక్కనలో నిలువబడియున్న ఆమె వెంటనే వెలుపలికి వచ్చుటకు జంకు చుండెను. తన బీదతనమున ఆమె రమారమి అర్థదిగంబరిగా నుండెను. అప్పుడే ఆమె స్నానమాచరించి చీరను దొడ్లో ఆరవేసి యుండినది. చిన్నమడి వస్త్రమును చాలిచాలని విధమున శరీరమును గప్పు కొనియుండినది. భగవానుడయిన రామానుజుడు ఆ విషయమును గ్రహించినవాడై, తనమేనిపైనున్న కాషాయ అంగవస్త్రమును లోనికి విసిరివేయగా, ఆమె దానిని ధరించి, వెలుపలికి వచ్చి, రామానుజునకు సాష్టాంగ నమస్కారము గావించి, ముకుళిత హస్తయై రామానుజునకు నిండు స్వాగతమును పల్కెను. రామానుజుడు ఆమెను ఆశీర్వదించి, వరదార్యుని క్షేమమరసి, లోనికి ప్రవేశించి, శిష్యులతో గూడి సంభాషించుచూ విశ్రాంతి తీసికొనుచుండెను.

ఇక జరుగవలసిన అతిథి సత్కారమునకు ఉపక్రమింపవలసిన బాధ్యత వరదార్యుని భార్యది. ఇంటిలో గింజలేదు; ఆహారమునకు కావలసిన యే ద్రవ్యమును లేదు; భర్త యిల్లు జేరునప్పటికి మధ్యాహ్న కాలమగును; ఆ లోపల ఆచార్యులు వారి శిష్యులకు సాపాటు ఏర్పాట్లు జేయుట యుక్తముగ నుండునని ఆమె తలంచెను. భర్త కొరకు వేచియున్న సాపాటు తయారుజేయుట అకాలమగునని ఆమె గ్రహించెను. కావున వేవేగ వంట ప్రయత్నము చేయదలచెను.

వరదార్యుని వృత్తి భిక్షాటనము, సాయంకాలము గ్రామములోని గుడిలో దీపారాధన జరుపుట. ఏ పూటకాపూట సంపాదించు కొనుచూ, నిరాడంబర సంతృప్తికర జీవితము ఆ దంపతులది. విశిష్టాద్వైత సిద్ధాంతవు వాసన రవయేని యున్నయెడల సంతృప్తి అనేది మానవునకు కలుగును.

వరదార్యుని భార్య కొలది నిముసములు ఆలోచించెను. అక్షయపాత్రను నింపుమని ద్రౌపది శ్రీకృష్ణుని ప్రార్థించిన సంఘటన ఆమెకు జ్ఞప్తికి వచ్చెను. దైవకృపయున్న ఆహార వస్తుసేకరణ జేయలేక పోదునా? ఆచార్యుల వారికి సకాలమునకు సాపాటును సమకూర్చ లేకపోదునా?" అని తలచెను.

సాపాటుకు కావలసిన ఆహారద్రవ్యమును దుకాణమున అరువుగా తేవలయును. ఆమెకు పరపతి యెక్కడిది? తనగృహమునకు సమీపముననే యజ్ఞేశుని దుకాణమున్నది. యజ్ఞేశుడు ధనవంతుడు, ధనగర్వి; కొంతకాలము నుండి కామోద్రేకమున అతడు వరదార్యుని భార్యపై కన్నువేసియున్నాడు. సాధ్వియయిన వరదార్యుని భార్య యితని తప్పిదమును గ్రహించియు, భర్తకు తెలుపక, యెట్లో తొలగ దోసుకొని యుండెను. మహాసాధ్వియయిన ఆమె తత్త్వమును గమనింపక కొంతకాలము జరిగినను, యజ్ఞేశుడు ఆమె విముఖత్వమును తరువాత గమనించియు తన విషపువలను విసరుచునే యుండెను. వీధిన ఆమె ఒంటరిగా నీరు తెచ్చుకొనువేళ అతడామెపై కన్ను వేయుచునే యుండెను; ధనమదాంధుడు, వానికి వితరణ గుణమెక్కడిది? మూర్ఖుడు!

ఆచార్యునకును వారి శిష్యులకును భోజనముల నేర్పాటు జేయుటకు కావలసిన ఆహార ద్రవ్యములకు యజ్ఞేశుని వద్దకుపోవుటకే కడకు ఆమె సంకల్పించుకొనెను. మరియొక దగ్గర ఆమె పొందజాలదు. తనభర్తకును ఎక్కువ పరిచయము స్నేహము గలవాడితడే. ఇది ఆమె గుర్తెరిగిన సత్యము. యజ్ఞేశుడు తన్ను చూచినవెంటనే అరువునకు ఆహార ద్రవ్యముల నివ్వగలడని ఆమె విశ్వసించెను. ప్రధానముగా ఆచార్యుల వారికి ఆతిధ్యమును ఏర్పాటు చేయుటయే ఆమె ప్రథమ కార్యముగా నెంచెను. తరువాత విషయములు తరువాత; వానిని గూర్చి యిప్పుడు వితర్కించుకొనుట తగదని ఆ సాధ్వి నిశ్చయించుకొనెను!

ఆ వైష్ణవసాధ్వి యజ్ఞేశుని దుకాణమునకు బోయినది. అతడా సమయమున దుకాణమున ఒంటరిగా నుండెను. తటాలున తన్ను సమీపించుచున్న సాధ్విని జూచెను. సూర్యకిరణ స్పర్శతోవలె వాని ముఖకమలము విచ్చెను. మందహాసమున, "రమ్ము, రమ్ము, ఎంత కాలమునకు నీ సందర్శనము! లేడి చూపులతో తొలగి పరుగిడుచు పోతున్న నీవు ఎంత ధైర్యముగా, ఎంత శాంతముగా వచ్చినావు! నా భాగ్యము! మనయిరువురి భాగ్యము! కొంతకాలము వృథా జేసికొన్నను

కడకు దారినపడ్డావు. భిక్షాటనముపై జీవించు వరదయ్య నీకు నాల్గు మెతుకులు వేయగలడే గాని, నీకు కావలసిన కనీస వస్త్రములనైనను సమకూర్చగలడా? నీవేల ఈ దరిద్రపు జీవితము గడపవలయును? నిన్ను సుఖపెట్టెదను. ఇది మొదలు నీకే వస్తువుకైనను కరువులేదు. సరే నా మాటలతోనే ఎంత ఆలస్యమైంది. సుందరీ, వచ్చినపని దెల్పుము - ఇక నా మటుకు త్వరయేమియున్నది. వంటయింట కుందేలిది! ఎందుబోగలదు! నేటికి నేమి?", అనుచూ వాని దీర్ఘోపన్యాస కామాంధ కారమును అలా అలా వెదజల్లెను.

సాధ్వి యీ కొలది కాలము అవనతవదనమై నిలువబడి యుండెను. వాని మాటలు ఆమె చెవులబడలేదు. చమురు తగిలిన రాతికి నీరంటునా? వానికూతలు నిలిచిన తరువాత మాటాడదలచి చెవులను అంతర్గతముగా మూసుకొని యుండెను ఆ సాధ్వి! "యజ్ఞేశయ్యగారూ, నాకు చుట్టములు వచ్చినారు - నా భర్త యింట లేడు - ఆలస్యముగా వచ్చును. అప్పుగా ఆహారద్రవ్యముల నిచ్చెదరా? త్వరలో మీ అప్పును తీర్చగలను?" అని ఆమె పలికెను.

"అబ్బో యెంత మాట! ఎట్టి షరత్తు! అవి యన్నియు అక్కరలేదు. నీకు కావలసిన సరుకుల దీసికొని పొమ్ము ఇప్పుడే. అప్పుదీర్చు విషయం తదుపరి మాటాడుకొందములే! అని యజ్ఞేశుడనెను.

వరదార్యుని సాధ్వి కావలసిన ఆహార ద్రవ్యములను దీసికొని పోయెను. కనుచూపు మేరవరకు కామాంధుడైన ఆ వర్తకుడు ఆసాధ్విపై కన్ను వేయుచునే యుండెను.

వరదార్యుని భార్య వంటజేసి, ఆచార్యులకు వారి శిష్యులకు భోజనములు వడ్డించెను. భోజనానంతరము శ్రీరామానుజుడు ఆమెను ఆశీర్వదించి, "అమ్మా, నేను పోయివచ్చెదను. తిరుపతి ప్రయాణమున పోవుచున్నాము. నీ భర్త వరదార్యుడు ఎప్పుడు వచ్చునో! ఆలస్య మగును. నేను వచ్చిపోయినానని వానితో జెప్పుము. నేను తిరుగు ప్రయాణమున ఇచటికి తప్పకవచ్చి మీ యిరువురచూచి వెళ్లెదనుగాక!" అని చెప్పి వెడలిపోయెను.

వరదార్యుని భార్య పరమానంద భరితయయ్యెను. ఆమె నోము ఫలించినట్లు భావించినది. తన గృహము కొలది కాలమైనను శ్రీమద్రామానుజునకు ఆశ్రయము కావడము, తనగృహమున రామానుజుడు శిష్యులతో దివ్య విషయములు చర్చించడం, తన భాగ్యమని యెంచినది ఆ సాధ్వి. ఆచార్యులవారి ఆగమనమును గూర్చి భర్తకుదెల్పి, ఆనందించుటకు భర్త ఆగమనమునకు ఎదురు చూచుచుండెను.

వరదార్యుడు సూర్యాస్తమయమునకు ఒక ఘడియ ముందుగా ఇల్లు జేరెను. పరమానంద భరితగా మందహాసముననున్న భార్యను జూచి, "యేమి - సంతోషవార్త" అని అడుగగా, ఆమె జరిగిన విషయముల నెల్లను సూదిగ్రుచ్చినట్లు భర్తకెరింగించెను. "సాధ్వీ! నీ వైష్ణవ భక్తి అనన్యము. అర్ధాంగివైన నీవు నేను గృహమున లేనపుడు వచ్చిన భగవద్రామానుజుల వారికి ఆతిథ్యము నేర్పాటు జేయుట నాకెంతయెూ ఆనందమును గూర్చినది. మన గృహము పవిత్రమయినది. ఆచార్యుల ఆగమనము వలన వారి ఆశీర్వాదమున మన జీవితములు ఫలప్రదమయినవి. సరే, వర్తకుడు యజ్ఞేశున కివ్వవలసిన అప్పునుగూడా యిప్పుడే తీర్చెదము గాక. రమ్ము నావెంట", అని భార్యను వెంటిడుకొని, వరదార్యుడు యజ్ఞేశుని దుకాణమునకు బోయెను.

"అయ్యా, యజ్ఞేశయ్యా, మీరు అప్పుగా సరకులునిచ్చి మాకు సహాయమొనరించినారు. మీ కనేక వందనములు. పుణ్య అతిథులకు ఆతిథ్యమివ్వగలగితిమి. నీకు కృతజ్ఞులము. నీ యప్పును ఇప్పుడే తీర్చెదము గాక! నీవు ఆకాంక్షించిన విధముననే తీర్చెదము గాక - రొక్కముగా మావద్ద లేదుగదా! త్వరలో చేకూరదుకూడా! ఇదిగో నాభార్య. ఆమె శరీరమునే కదా నీవు కోరునది; దానిని అప్పగించుటకు వచ్చినాను! మానసికముగా మేమిద్దరము అవిభక్తము. మేము అన్యోన్యముగా పరస్పరము ఒక అవగాహనకు వచ్చినాము. మాకు ఎడబాటు అనునది లేదు", అని వరదార్యుడనెను.

యజ్ఞేశుడు నిర్ఘాంతపోయెను. వరదార్యుడు భార్యాసమేతముగా వచ్చుట చూచినపుడే వర్తకుడు భయపడెను. ఇపుడితని మనస్సు భయముతో, సిగ్గుతో పశ్చాత్తాపముతో కలవరపడినది. వరదార్యుని దంపతులపాదములపై బడెను. ఆతని కనులునుండి అశ్రువులు రాలుచుండెను. "అజ్ఞానిని! ధనమదాంధమున కన్నుమిన్ను గానక ప్రవర్తించితిని. భగవానుడు రామానుజుని శిష్యుడనైయుండి, నీతోడి సహ శిష్యుడనైయుండి, నీతో స్నేహితమును గరపుచూ, పావనియైన నీయర్ధాంగిపై గౌరవమును అభినయించుచూ నేనిట్టి ఘోరాలోచనకు దిగితిని. నేను మహా పాపిని! మీరు నాకు ఋణపడలేదు. నాకు జ్ఞానోదయము గావించిన మీకే, మీ భార్యకే, ఏను ఋణపడి యున్నాను. నా అనర్హతను నేను బాపుకొనజాలను. వరదార్యా! మన్నింపుము! అమ్మా! మహాసాధ్వీ! మాతృస్వరూపిణీ! నన్ను క్షమింపుము", అని పలుకుచూ, యజ్ఞేశుడు వైష్ణవ దంపతులకు పాదాక్రాంతుడాయెను.

మిన్నకున్న వరదార్యుని భార్య ఆశీర్వాదము పలికెను.

వరదార్యుడు, "సోదరా! యజ్ఞేశా! అపరాధమొనరించుట మానవ నైజము. కాని తప్పుల దెలిసికొని, పశ్చాత్తాపపడుట విశిష్ట గుణము. గతించిన దానికి వగవనేల? మన శేషజీవితముల మన ఆచార్యులవారు బోధించిన విధమున లోకకల్యాణార్థము వినియోగింతముగాక! మనసోదర భావమునకేలాటి కళంకము గలుగలేదు", అని పలుకుచూ, మందహాసమున నిష్కల్మష హృదయముతో, క్షమాగుణ ప్రక్షాళిత మనస్సుతో యజ్ఞేశుని ఆలింగనముజేసికొనెను. పశ్చాత్తాపగుణ ప్రక్షాళిత హృదయుడయిన యజ్ఞేశుడు స్వస్థత నందెను.

"వరదార్యా, యీనాడు మీ గృహమున కరుదెంచిన చుట్టపక్కము లెవరు? మాట సామెత కడుగుచున్నాను", అని యజ్ఞేశుడనెను.

"ఎవరైతేనేమి? ఈ సంఘటన మనమువ్వురలోనే జీర్ణించి పోవుగాక! మనము పూర్వమును దీనిని మరచిపోవుదము", అని

వరదార్యుడు పలుకుచూ, తన భార్యవైపు మందహాసమున జూచెను. వచ్చిన అతిథి భగవద్రామానుజాచార్యులవారని తెలిసిన యజ్ఞేశుడు అపరిమితంగా, భరింపరాని, పరితాపమును జెందవచ్చును. కావున ఆ విషయమును బహిర్గతము చేయకుండుట యుక్తమని వరదార్యుడు తలంచెను.

వరదార్యుని ముఖము జూచిన యజ్ఞేశునకేదియో అనుమానము జనించినది. తటాలున వరదార్యుని పాదములపైబడి, "సోదరా - అతిథి యెవరో నాకు తెల్పవా? నన్ను నీవు పూర్తిగా క్షమించినట్లులేదు! నేను క్షమార్హుడను గాను", అనెను యజ్ఞేశుడు.

"ఎవరోగాదు యజ్ఞేశా! మన ఆచార్యులవారే! శ్రీమద్రామానుజా చార్యులు! అని వరదార్యుడు పలుకగా, యజ్ఞేశుడు పడినమనఃక్లేశము వర్ణనాతీతము. అతడు బిగ్గరగా అర్భకునివలె ఏడ్చెను. "గ్రామమునకు ఆచార్యులవారు వచ్చినను, వారి దర్శనము నా కబ్బలేదు. వారి కాతిథ్య మివ్వదలచిన పుణ్యవతి సాధ్వీ నీ భార్యను అవమానించిన పాపినే నేను! రామానుజ శిష్యరికమునకు నే ననర్హుడను", అనెను. అతని మనస్సున ఉత్పన్నమయిన పెనుతుపాను అనిర్వచనీయము. "యజ్ఞేశా! అట్లు భావింపకుము. జరిగిన దానిని మనస్సునకు దెచ్చుకొనకుము - ఏదియో పొరపాటు జరిగిపోయినది. ఇంద్రియ చాపల్య మట్టిది. సంస్కార దృఢ మనస్తత్త్వము ఇంద్రియాశ్వముల పగ్గముల గట్టిగా పట్టగలదు; ఇందులకు విష్ణు సంశ్లేషభావము అవసరమని భగవద్రామానుజుడు మనకు బోధించియున్నాడు గదా! ఊరడింపుము! ఆచార్యుడు మా గృహమునకేతెంచినను, వారిని దర్శించు భాగ్యము నాకు లేకపోయెగదా! అట్లే నీకును వారి దర్శనము లభ్యపడలేదని యూరడింపుము. వారు కొలది నెలలలో తిరుపతి నుండి తిరుగు శ్రీరంగప్రయాణము జేయు సందర్భమున ఇచటికి వచ్చెదనని సెలవిచ్చిపోయినారట. మనమప్పుడు వారిని దర్శించెదము గాక, ప్రస్తుతమునకు శాంతింపుము. ఊరట నందుము", అని పల్కినాడు వరదార్యుడు.

"వరదార్యా! నీకును నాకును పోటిపెట్టుచున్నావే! అమృతము నకు విషమునకున్న తారతమ్యము నీకును నాకును ఉండునది. నీవు గృహమున లేకున్నను నీభార్య ఆచార్యులవారికి అతిథ్య మొసగి నీ గృహమును పవిత్రముజేసినది. నీకర్థాంగియని కీర్తినందినదామె. ఆచార్యుల ఆశీర్వాదములు నీకు పరోక్షముననైనను సంపాదించినది. గృహిణి అనగా నీఅర్థాంగికే చెల్లును. నా పరిస్థితి వేరు, అతినీచ మయినది. భగవానుడయిన ఆళ్వారులు మన గ్రామములోనున్న కాలమున,పొరుగింటిలో ఆతిథ్యమునొందువేళ, అట్టి పవిత్ర కాలమున నా మనస్సు విషపువలలో తగుల్కొనియుండినది గదా! ఎంతటి పాపిని" అని యజ్ఞేశుడు పరితపించుచునే యుండెను.

(కొలది మాసముల తరువాత శ్రీమద్రామానుజుడు శ్రీరంగము నకు తిరుగు ప్రయాణము చేయు సందర్భమున ఆచార్యులు వరదార్యుని గృహమునకు వచ్చెను. శ్రీరామానుజుని ఆగమనము కొరకు అనుదినము నిరీక్షించుచుండిన యజ్ఞేశునకు తెలిసి, అతడు రామానుజుని యొద్దకు పరుగిడుతూవచ్చి, పాదాక్రాంతుడై బిగ్గరగా నేడ్చెను. యజ్ఞేశుడే తన దుష్కార్య విషయమై రామానుజునకు వెల్లడించి పరితాపము నందెను. శిక్షించమని అర్థించెను - "యజ్ఞేశా, జరిగిన తప్పిదమునకు ఇంతకుపూర్వమే పశ్చాత్తాప పడినావు. ఇప్పటివరకూ పశ్చాత్తాపాగ్నిలో మండుచుండినట్లు గానున్నావు చేసిన తప్పును మనస్సునకు తెచ్చుకొని మానసికముగా పశ్చాత్తాపమును పొందుట ఒక యెత్తు; దానిని మించి నీవు నీవు చేసిన తప్పిదమును నేరుగా వచించుచున్నావు; పాపినైతినని పరితపించు చున్నావు. కావున నీవు త్రికరణశుద్ధిగా పాపప్రక్షాళనము జెందితివి. "ఉద్ధరేదాత్మ నాత్మానమ్" అను గీతావాక్యము. మానవుడు తన్నుతానే ఉద్ధరించుకొన వలయును. ఆచార్యుడు మార్గమునే చూపుతాడు. గుఱ్ఱమును నీటి దగ్గరకు తీసికొని పోగలమేగాని, నీటిని త్రాగ వలసినది అదియే. యజ్ఞేశా నీవు నీచేతనే సంస్కరింపబడినావు. మంచిది. కొందరు మానవులు తప్పుచేస్తారు - తప్పు అని తెలిసియు, తప్పును ఒప్పుకొనక,

స్వాభిమానమున వారిది సరియైనదనియే సమర్థించుకుంటారు. వీరు ఆత్మవంచకులు, పరమమూఢులు; వారికి వెలుగుబాటలేదు; ఎందువలననగా చీకటిని వారే మనస్ఫూర్తిగా కలుగజేసికొనుచున్నారు. అట్లుగాక త్రికరణశుద్ధిగా చేసిన తప్పిదమును సవరించు కొన్నవాడు సంస్కారి. ఇట్టివారి పైననే మతము గాని, ఆచార్య ప్రబోధముగాని ప్రభావము కలిగియుండును. నీవు రెండవ కోవకు సంబంధించిన వాడివి; ముక్తుడవు. మొదటి తరగతి వారు శాశ్వతబద్ధులు. యజ్ఞేశా, నీవు త్రికరణశుద్ధిగా పశ్చాత్తాపమును పొందితివి గాన, ఇక మీదట నిన్ను పాపములు సమీపింపవు. పాపమేఘములను పశ్చాత్తాప పర్జన్యము చేరనీయదు; అదృశ్యము గావించును. సర్వులు మోక్షమున కర్హులు; స్వార్థరాహిత్యము, నమ్రత మోక్ష సాధనములు", అని రామానుజుడు పల్కెను.

యజ్ఞేశుని రామానుజుడు శిష్యునిగా పునఃస్వీకరించెను. సంతానము లేని యజ్ఞేశుడు తన భార్యతోగూడి శ్రీరంగముజేరి తన ఆస్తిపాస్తులను రామానుజమఠమునకును, శ్రీరంగనాథస్వామి ఆలయమునకును సమర్పించి, భార్యా సమేతముగా శ్రీరామానుజ మఠవాసుడై శేషజీవితమును మఠముననే గడపెను).

ఈ సంఘటన యందు వైష్ణవాదర్శములు ఎంతటి విశిష్టతగా నగపడుచున్నవో గమనింపవలసియున్నది.

ఇక రామానుజుని తిరుపతి యాత్రా విషయమును తెలిసికొందము. అష్టసహస్ర గ్రామమును వదలి రామానుజుడు పయనించి, క్రమముగా తిరుపతి కొండలను జేరెను. ఇక సప్తగిరులను దాటి సప్తగిరివాసుని దర్శింపవలసి యున్నది.

రామానుజుడు తిరుమల పాదమున నిల్చొని శిష్యులనుద్దేశించి, "వత్సలారా! చూడుడు సప్తగిరుల విలాసవైభవమును. భూలోక భక్తుల పుణ్యరాసులు ఈ శ్రీశైల (తిరుమల) రూపమున వెలిసినవి. తిరుమలకు మ్రొక్కి ముదమును బొందుడు", అనెను.

భక్తి పారవశ్యమున శిష్యులతో, "కొండ ఎక్కకుడు. ఈ పవిత్ర తిరుమల సానువులను మనపాదములతో ముట్టుటెట్లు? శ్రీనివాసుని పాదములచే స్పృశింపబడిన బాటయిది! అసంఖ్యాక దివ్యభక్తి జనులచే స్పృశింపబడిన మార్గమిది! ఆళ్వారాది ఆచార్యులు, ఋషిపుంగవులు, మునులు, సాధువులు నడచిన త్రోవ యిది! మనము ఈ బాటను మనపాదములతో ముట్టుటెట్లు? మనమిచ్చటనే నిల్చి, శ్రీనివాసుని సాక్షాత్కారమునకై యేల ప్రార్థింపరాదు?" అని భక్త్యావేశమున గద్గద స్వరమున పలుకుచూ, అట్లనే భూమిపై సాష్టాంగ నమస్కృతుడై యెంతో కాలముండెను.

సాయంసమయమైనందున ఆ రాత్రి వారు తిరుమల పాదమూలముననే విశ్రమించి, మరునాడు ఉదయమున కొండనెక్క సంకల్పించిరి.

తిరుమలపై వాసము చేయుచున్న రామానుజుని మేనమామ పెరియతిరుమలనంబికి రామానుజుని రాక విషయము తెలిసెను. స్వామి ప్రసాదమును తీసికొని కొండదిగి వచ్చెను. అప్పటికి రాత్రి చాల ప్రొద్దుపోయినది.

రామానుజుడు తిరుమలనంబికి ప్రణమిల్లి, "స్వామీ! వార్థక మునయున్న మీరు ఎంత శ్రమ దీసికున్నారు. స్వామి ప్రసాదమును ఎవరి చేతనైనను మీకంటె చిన్నవారిచేత పంపించి యుండవచ్చునే!" అనెను.

"యతిరాజా! రామానుజా! అట్లే చేసియుండవలసినది. కాని నాకంటె తక్కువవాడును, నాచే ఆదేశింపబడగలవాడును, నాకు లభ్యము కానందున, నేనే స్వయముగా వచ్చితిన'.ని చిరునగవున ననెను. రామానుజుడును, వారి శిష్యులును తిరుమలనంబిగారి నమ్రతకు, వైష్ణవాదర్శమునకు ఎంతయో విస్మయమునంది, వారికి సాష్టాంగపడిరి.

ప్రసాద స్వీకారాంతమున, తెల్లని వెన్నెల వెలుగులో, తిరుమల పాదమూలమున విశాల శిలలపై నాసీనులై అందరును కుశల

ప్రశ్నోత్తరముల కొంత తడవు గడపిరి. తరువాత ప్రేమాదరములతో తిరుమల నంబి రామానుజుని వైపు తిరిగి సంభాషింపనుపక్రమించిన వాడై, "యామునాచార్యా! ఓ శ్రీనివాసా! ఆదిశేషా!" అని రామానుజుని సంబోధింప దొడగెను. రామానుజుని శిష్యులు ఇదివిని కలవరబడి, "రామానుజా, యతిరాజా, ఉడైయవర్, అని సంబోధించుటకు బదులు మీరేదేదో నామధేయముల నుచ్చరించుచున్నారే! ఇదేమి?" అని అచ్చెరువున నడిగిరి.

తిరుమలనంబి, "ఓహో! తెల్పెదను. మీ సందేహములు, మీ విస్మయమలు కారణయుక్తములే. సావధానముగా నాకర్ణింపుడు: ఈ యతిరాజయిన రామానుజుడు పూర్వాశ్రమమున నాకు మేనల్లుడే! కాని యితడు మా వైష్ణవాచార్యుడగు యామునాచార్యునకు ఆధ్యాత్మిక వారసుడుగా వైష్ణవ పీఠమునలంకరించినది మొదలు, నాకితడు యామునాచార్యులవలెనే గోచరించును! జ్ఞాన సంపన్నుడయిన యితడు చేతనులకు జ్ఞానదానము జేసి, చేతనులు జ్ఞానసంపదతో ఆనంద శ్రీతో జీవించునట్లు చేయగల శ్రీనివాసుడేయితడు! సేవాతత్పరతతో లోకుల నుద్ధరించుటకవతరించిన ఆదిశేషుని అంశ మితడు"! అనుచూ తిరుమలనంబి పరమావేశమున రామానుజుని వైభవమును తెల్పెను.

రామానుజుడు తిరుమలనంబిని సగౌరవముగా ఆలింగనము జేసికొని, తన్నాశీర్వదింపమని కోరుచూ, శ్రీనివాస నిత్య దివ్యవైభవమును గూర్చి ప్రశ్నించెను.

"భక్తవత్సలుడగు శ్రీనివాసుడు నీకొరకై నిరీక్షించుచున్నాడు, రామానుజా! నీవు తిరుమల నెక్కక యిచ్చటనే నిలిచితివా, స్వామియే క్రిందికరుగుదెంచును సుమా", అని తిరుమలనంబి మందహాసమున బల్కెను.

"సప్తగిరీశుడు కొండ శిఖరము నుండి సప్తవ్యసనముల నుండి పతితులైన చేతనుల కడతేర్చుగాక! వారేల దిగిరావలయును!"

అనుచూ, రాత్రి చల్లనివెన్నెల జల్లులో రామానుజుడు కొండనెక్క నుపక్రమించెను. తిరుమలనంబియు, శిష్యులును తోడనడచిరి.

భక్తపాదరజోభిషిక్తమైన కొండబాటపై, మెట్లపై కేవలము రెండు పాదములపై నడువ నిష్టపడని రామానుజుడు పలుమారు తన హస్తములతో పావనమైన సోపానములను స్పృశించుచూ, రామానుజుడు రెండు మోకాళ్లు రెండు చేతులతో నడచుచున్నట్లగ పడెను.

బ్రహ్మముహూర్తమునకే సప్తగిరీశుని నిలయమును జేరిన రామానుజుడు స్వామి పుష్కరిణి స్నానమాచరించి, వేవేగ అత్యాతురతతో శ్రీనివాసు గర్భగుడిచేరి, దివ్యవిగ్రహము ముందు నిలువబడి, వైష్ణవ సంశ్లేష భావమున - ఆనాడు శ్రీరంగనాథుని యెదుట యోగి వాహనుడైన తిరుప్పాణి ఆళ్వారు నిల్చున్న విధమున - ధ్యాన నిమగ్నుడై బాహ్యస్మృతిని బాసెను. కొంతకాలమట్లే ముకుళిత హస్తుడై యుండి, పరమానంద భరితుడై, స్వామికి సాష్టాంగ నమస్కారమును గావించి, తరువాత లేచి స్వామి గర్భగుడి, స్వామికి సాష్టాంగ నమస్కారమును గావించి, తరువాత లేచి స్వామిగర్భగుడి, దేవాలయ ప్రాంగణములను, వనములను, సృష్టి సౌందర్యములను తిలకించుచూ కొంతకాలము గడపెను, ఆనందామృతమును గ్రోలి సంతుష్టుడాయెను.

ఆనాటి పగటి కాలమంతయు తిరుమల సానువులపై కాలము గడపి, రాత్రిపడు వేళకు శిష్యులతోగూడి రామానుజుడు శ్రీశైలపూర్ణుని ఆశ్రమమును జేరెను. అత్తరి గోవిందుడు (రామానుజుని పిన్నమ్మ కొమరుడు) గురువు తిరుమలనంబికి శయనింప పడకను ఏర్పాటు జేయుచుండెను. ఆ గురుసేవా కార్యమున నిమగ్నుడైయుండటం జేసి, గోవిందుడు తన అన్న రామానుజుని రాకనుసైతము గమనించలేదు, శయ్య నమర్చిన తరువాత, గోవిందుడు శయ్యపై శయనించి, అటునిట్లు పొర్లి, సేద దీర్చుకున్న వానివలె లేచి, అటునడచి, తటాలున రామానుజుని గాంచి, నమస్కరించెను.

రామానుజుడు శ్రీశైలపూర్ణుని వైపు తిరిగి, "ఆర్యా! గోవిందుని చక్కగా తయారుచేయుచున్నారే! మేనల్లుడను మమత మిమ్ము

వీడినట్లు లేదే! మీకు శయ్యను పరచి, తానేదానిపై కొలది నిముసముల పాటు శయనించి, లేచివచ్చియున్నవాడు! ఇది యేమి పద్ధతి! ఇది యేమి శిష్యరికము?" అని పల్కెను.

"నాయనా! గోవిందా! గురుని పాన్పుపైపరున్న శిష్యునకు పాప ఫలము సంభవించునని నీవెరుగవా? తెలియక చేసిన తప్పునకును ఫలితము ననుభవింపవలసినదే! పసిపాప నిప్పును తాకిన, కాలకుండునా? గోవిందా! అట్లేల పొరపడితివి?" అని తిరుమలనంబి విస్మయమున ప్రశ్నించెను.

గోవిందుడు నవియనమున ముకుళిత హస్తుడై, "శయ్య సరిగానున్నదో లేదోనని పరీక్షించుటకట్లు జేసితిని. సరిగాలేనిచో మీకు నిద్రాభంగము జరుగును గదా! అట్టియెడ ఆ పాపము నాకు ప్రాప్తించును గదా! మీకు నిద్రాభంగము కలుగరాదను ధ్యేయమే నాది? నాకు ప్రాప్తించు నరకమును గూర్చి నేనాలోచింపను?" అనెను.

రామానుజుడు పరమానంద భరితుడై గోవిందుని కౌగిలించుకొని, "గోవిందా! నీభక్తి నిష్కళంకము; స్వార్థరహితప్రేరకము; శబరి రామునిపై జూపిన భక్తిని బోలియున్నది నీ యనుపమ భక్తి. గురునాజ్ఞను మీరి, లోకకల్యాణార్థమై నేను తిరుమంత్రమును సర్వులకును వెల్లడించిన విధముననున్నది నీ తత్త్వము; నీ ఆలోచనక్రమము. మన దృక్పథముల యందు సామ్యమున్నది. నీవు నాకు తగిన తమ్ముడవు. నీసహకారమును నేనొకమహద్భాగ్యముగా పరిగణింపగలను..... ఇది యంతయు సరేగాని, గోవిందా, దీనికేమి జెప్పెదవు? - ఎంతో దూరము నుండి వచ్చిననన్ను నీవు ఆతురతతో జూడరావైతి వేల?" అని ప్రశ్నించెను.

గోవిందుడు, "అన్నయ్యా, యతిరాజా, మన్నింపుడు. గురునకు వలసిన సదుపాయముల నన్నింటిని సమకూర్చి, తరువాత విశ్రాంతిగా నిన్ను దర్శింపదలచితిని", అని చెప్పగా రామానుజుడు సంతోషించెను - తనపై అంధ్రపూర్ణుడు జూపిన భక్తిభావము మననుకువచ్చినది.

గోవిందుడు, ఆంధ్రపూర్ణుడు, దాశరథి, కూరేశుడు, ఉరంగావిల్లి యిత్యాదులు ఒక దివ్యకోవకు జెందినవారని తలచుచు రామానుజుడెంతో ఆనందించెను. వారి ఆదర్శ జీవితములు చేతనుల నెల్లప్పుడును ఉజ్జీవింపజేయుగాక అని మనమున మంగళా శాసనమును పల్కెను.

రామానుజుడు కొంతకాలముపాటు శిష్యులతోగూడి తిరుమలపై దివ్యవాసము సలిపెను. స్వామిదర్శనము, అరాధనము, భజన మున్నగు దివ్యకైంకర్యములందు మధ్యాహ్నమువరకు కాలము గడిపి, తక్కిన కాలమును అనుదినమును శ్రీశైలపూర్ణుని యొద్ద శ్రీమద్వాల్మీకి రామాయణమును విశిష్టాద్వైత సిద్ధాంతపరముగా పఠించి కృతకృత్యు డాయెను.

రామానుజుని శిష్యులలోనొకడు అనంతసూరి తిరుమలపై తిరుమలనంబిని ఆశ్రయించియుండి, దేవాలయ ఉద్యానవనమును శ్రద్ధగా పెంచుచుండెడివాడు. అనంతసూరి అభివృద్ధిగావించిన పుష్పవనమును రామానుజుడు దర్శించి, ఆప్రకృతి శోభకు తన్మయుడాయెను - "అనంతా! నేను పూర్వము నిన్నాదరముతో జూచుచు, శ్రీశైలపూర్ణునకు సహకరింపుమని వారికితోడుగా నిన్ను నేను తిరుమలకు పంపినదానికి నీచే పెంచబడిన యీ పుష్పవన సౌందర్యమే నాకు నీవు సమర్పించు కానుకయగుగాక! నీవు పెంచిన యీ వనరాజము, స్వామికి పుష్పముల సమర్పించుచున్నది. నీవు ధన్యుడవు", అని పల్కుచుచూ, రామానుజుడు అనంతుని గాఢాలింగనము గావించుకొని ఆశీర్వదించెను.

అనంతుడు బెంచిన పుష్పవనము కన్నుల పండువుగా నుండెను. సప్తవర్ణ శోభిత సుమరాజములు వెదజల్లు పరిమళములతో, తుమ్మెదల ఝుంకార ధ్వనులగానములతో, శుకపిక పక్ష్యాదుల కిలకిల నాదములతో ఆవనము మనోజ్ఞముగా నుండినది. సలిలపూరితములైన కోనేరులు, కమల కలువల శోభతో కనులకింపుగూర్చుచుండెను. భావసౌందర్యమును, పదసౌందర్యము నెరిగిన రామానుజుడు ఆ

ప్రకృతి సౌందర్యమును వర్ణించుచు, ఈశ్వరశక్తిని దలంచుచు, "త్రిభువన సుందరమును అయిన ఈశ్వరశక్తి యొక్క ఔన్నత్య ఉత్తేజ ప్రభావిత శక్తులనేమని ప్రశంసింపగలను? చిత్, అచిత్‌లు రెండునూ ఈశ్వరశక్తి ప్రేరేపణమున నిండుదనమును చూచువారి నయనాంబుజముల వికసింప జేయ ప్రకాశసౌందర్యముల నలరారు చున్నవి! ఆహా! తత్త్వత్రయ జ్ఞానమును వెదజల్లు తిరుమల పార్శ్వముల సౌందర్యము నేమందును? పట్టరాని ఆనందమున త్రిభువన సుందరునకు ప్రపన్నుడనగుచున్నాను", అనుచూ అట్లే నిలువబడి యుండెను. భగవచ్ఛక్తి త్రిభువన సుందరమని చెప్పియున్నాడు గదా రామానుజుడు!

ఒకనాటి సాయంకాలమున సూర్యాస్తమయమునకు పూర్వము ఆకాశ పశ్చిమ దిశ అరుణకాంతులు ప్రపంచమును ప్రభావితము జేయుతరి, రామానుజుడొంటరిగా అనంతుని వనమునుండి నడచుచు తిరుమలనంబి నివాసమువైపు పోవుచుండెను. మార్గమధ్యమున నొక అద్భుత సంఘటనను తిలకించునవకాశము గలిగినది రామానుజునకు. దారికి సమీపమున గుట్టచెట్లమధ్య నొకవ్యక్తి ఒంటరిగా కూర్చొని యున్నాడు. అతని చేతిలో నాగసర్పమున్నది. అతడు తనవ్రేళ్లను సర్పము యొక్కనోటిలో మెల్లగా ప్రవేశపెట్టుచు, తడవుచు నుండెను. ఆశ్చర్యమున రామానుజుడా వ్యక్తిని మెల్లగా సమీపించెను. అతడెవరోకాదు! తన పిన్నమ్మ కుమారుడు గోవిందుడే! "గోవిందా! యేమిచేయున్నావ"ని రామానుజుడు మెల్లగా ననెను. "పాపము, ఈ పామునోట సన్నని ముల్లుగ్రుచ్చుకొని యుండినది. బాధకు ఈ సర్పము నోరుమూయలేక ఎల్లప్పుడు నోరు తెరచుకొని తిరుగుచూ మేత స్వీకరింపలేక యున్నది. నేను మెల్లగా ముల్లును తీయుచున్నాను", అని పలుకుచూ, గోవిందుడు సర్పపు నోటనున్న ముల్లును జాగ్రత్తగా తీసివైచి, ఆశీర్వాద పూర్వకముగాదాని మూర్ధమును స్పర్శించి, వదలిపెట్టెను. రామానుజుడు గోవిందుని ఆలింగనము జేసికొని, "గోవిందా! నీవు నిజమైన వైష్ణవుడవు. వైష్ణవుడు ఆత్మవత్ సర్వభూతాని

అని తలచి సర్వులయెడ సానుభూతి గలిగియుండును. గోవిందా నీవు శుకమహర్షికి సముడవు. నీ నడవడి గొప్ప వైష్ణవాదర్శము", అని ప్రశంసించెను. "యతిరాజా! సర్వము మీ కృపయే! మీదాసుడనైన నేను నిజమైన వైష్ణవుడనని తెలిసికొనుట నా భాగ్యము. ధన్యుడను", అని గోవిందుడు పల్కుచూ రామానుజునకు సాష్టాంగ నమస్కారము గావించెను.

రామానుజుడు తిరుమలను వదలి శ్రీరంగమునకు బయలు దేరునపుడు, పెరియతిరుమలనంబి యాజ్ఞను బడసి, గోవిందుని వెంబెట్టుకొని తిరుగుప్రయాణమున కాంచీపురి జేరి, పిన్నమ్మ దీప్తిమతి యింటికి పోయెను. దీప్తిమతి గోవిందుని మాతృమూర్తియేగదా! గోవిందుని జూచి తల్లియు, గోవిందుని భార్యను సంతోషించిరి. గోవిందుడు సన్న్యసించుట వారిరువురకును ఇష్టములేదు. వివాహమయినది మొదలు భర్తవియోగమునే అనుభవించుచుండిన యువతి, గోవిందుని భార్య, అత్త దీప్తిమమతినే కాచుకొని యుండినది.

దీప్తిమతి రామానుజుని సమీపించి, "నాయనా, నీవెరుగని దేమున్నది? కాని చెప్పెద వినుము. నాకొకకోరిక గలదు. గోవిందుడు కొంత కాలమయినను భార్యాసమేతుడుగా నుండవలయునని. వాని కుచితహితమును గూర్చి, యిచ్చట వదలిపొమ్ము నాయనా! కొంత కాలమయిన తరువాత సన్న్యసింపవచ్చును; తన జీవితమును వైష్ణవ మతవ్యాప్తికే వినియోగింపవచ్చును; అట్టి సంకల్పమునకు నేను వ్యతిరేకించను. వివాహము చేసికొన్నందులకు కొంత కాలమయినను గృహస్థాశ్రమమున నుండుట ధర్మముకదా?" అని ప్రాధేయపడెను.

రామానుజుడు గోవిందుని చేరబిలిచి, వివాహము జేసికొన్నందులకు కొంతకాలమైనను గృహస్థుగా నుండుట యుక్తము అని బోధించెను - మరియు సద్గుణవతియగు అర్ధాంగి అమాయికముగా, గాఢానురాగముతో భర్తయొక్క ఆగమనమునే యెదురు జూచుచున్నపుడు, అట్టి సాధ్విని సంతృప్తిపరచుట వివాహమాడిన భర్తయొక్క విధి.

ఆరాత్రి గోవిందుడును, తన భార్యయు, ఏకాంత గృహమున కాలము గడపిరి? ఎట్లు? దంపతులవలెగాదు! ఆచార్య శిష్యులవలె! రాత్రియంతయు దైవవిషయమును గూర్చి గోవిందుడు భార్యకు ఇట్లు బోధించెను. "అర్ధాంగీ, అని నిన్నొక్కసారి సంబోధించి, నిన్నానంద పరచెదగాక" అని గోవిందుడనగా, భార్య ముకుళితనేత్రయై మందహాసమున చేదోయితో సంతోషపూర్ణహృదయమును హత్తుకొన్నది. "అర్ధాంగీ వినుము - నిన్నువదలి, సన్యసించి, దూరదేశమున ఏకాకిగానున్నను, ఏదో ఒక సమయమున నీవునామన్ననకు తగులుదానవు. నా అర్ధాంగికి నాయైశ్వర్యమును అర్ధభాగమును నేను అందజేయవలయును గదా అని తలంచెడివాడను. నా సంపద నేనార్జించిన ఆధ్యాత్మిక జ్ఞానము! సంసారమున సారము లేకుండా పోలేదు. అంతకంటే సారవంతమయిన స్థానము లభ్యమయినపుడు రెండవదానినే స్వీకరింపవలయును గదా! శాశ్వతమయిన పరోపకారార్థ జీవితము సంభవించినపుడు తుచ్ఛమయిన సాంసారిక జీవితమును పట్టుకొని యూగులాడుట యుక్తమా? అనేది ప్రశ్న.

"కుర్యాద్విద్వాంస్తథా సక్తశ్చికీర్షు ర్లోక సంగ్రహమ్" - అని గీతాచార్యుడు వక్కాణించి యున్నాడు. వైష్ణవశక్తిని ఆధారముగా జేసికొని మనఘటములు మనుచున్నవి. సకల భూతములు నేదేని యొక అగోచరపదార్థము నుండి పుట్టి నడుమనిట్లు కనుపించి, తుదకు అయగోచర పదార్థమునందే అవియన్నియు లయించును.

ఇంద్రియము లెవ్వని వశమునందుండునో వాని ప్రజ్ఞయే సుప్రసిద్ధమయినది. మమకార, అహంకార వర్జితుడే శాంతినిబొందును. "ఉద్ధరేదాత్మనాత్మానమ్" అని ప్రోత్సాహిస్తాడు గీతాచార్యుడు. దారము నందు మణిగణమువలె ఈశ్వరశక్తి యందు జగత్తంతయు కూర్చబడి యున్నది. అతి సూక్ష్మమును నాశనరహితమును అయిన ఈశ్వరశక్తి తత్వమునెరిగినవాడు పరమపదమును జేరును. ఆదిశక్తియయిన ఈశ్వరశక్తి యొక్క జన్మహేతువునెవరెరుంగరు. "నా నిమిత్తము కర్మలు చేయువాడును, నాకు భక్తుడును, సంగవర్జితుడును, సర్వభూతముల ప్రేమించువాడును అయిన సజ్జనుడు నన్నుజేరును" అని గీతాచార్యుని

ప్రవచనము. తపస్సుకంటె కర్మఫలత్యాగము శ్రేష్ఠము. ఇట్లు అనేక ధర్మములను అష్టాదశయోగములలో గూడిన గీతాశాస్త్రము ఉపదేశించునట్టి తిరుమంత్రమును అన్వేషించి, కనుగొని, లోకహితము కొరకు శ్రీమద్రామానుజుడు బహిర్గతము జేసినాడు, చరమ శ్లోకమున శరణాగతి ప్రపత్తిమార్గములు జూపబడినవి.

అర్థాంగివయిన నీకు నేనార్జించిన జ్ఞానమును పంచియిస్తున్నాను - పలుకుము - "ఓం నమో నారాయణాయ" - గోవిందుని భార్య భక్తి యుక్తముగా తిరుమంత్రమును మూడు మార్లు పలికెను. ఆమె దివ్యజ్ఞానమున ప్రకాశించెను. ఆమె వినమ్రతతో సర్వ విషయములను గ్రహించినది. గురు శిష్యులలాగున వారిరువురును రాత్రియంతయు గడిపిరి. గోవిందుని భార్యయును సత్యమునెరిగి, ప్రాపంచిక సుఖమును సన్న్యసింపనిశ్చయించుకొనెను. ఈ విషయమును తెల్లవారి తెలిసికొన్న గోవిందుని తల్లి కాదనగలదా? కుమారుని వైష్ణవ తత్త్వమునకు ఆనందించినది. కుమారుని మార్గమును అంగీకరించినది కోడలును సంతుష్టురాలుగా కన్పడినది.

రామానుజుని వెంబడించి, గోవిందుడు శ్రీరంగ ప్రయాణమునకు సంసిద్ధుడు కాగా, తల్లియు, భార్యయు అతనికి వీడ్కోలు పలికిరి. లోక కల్యాణార్థమై కృషి నలుప నుపక్రమించు తేజోరాశిని ఏల గృహమున బంధింప వలయునని వారనుకొనిరి! దీప్తిమతి, ఆమె కోడలు యొక్క సంస్కారము ప్రగతి దృక్పథమునేమని వర్ణింపగలము!

కాలక్రమమున దీప్తిమతి మరణింపగా గోవిందుని భార్య వైష్ణవ భక్తురాలుగా శేషజీవితమును కంచిలోనే శ్రీరామానుజ మఠమున గడిపినదని గాథ.

గోవిందుడు గొప్పవేదాంతి, పండితుడు. పరమభక్తుడు. రామానుజూడాతనిని "ఎంబార్" అని పిలుచువాడు.

రామానుజుడు ఇట్లు తిరుపతి యాత్రను జయప్రదముగా పూర్తిజేసికొని, శిష్యులతో శ్రీరంగము జేరెను.

## 26. తిల్య

ఒకనాటి ఉదయమున శ్రీమద్రామానుజాచార్యులవారు ధ్యాన సమాధిలో నాసీనుడైయున్నాడు. సమీపమున దాశరథి, కూరేశుడు, గోవిందుడు ఏవో రచనల గావించుకొనుచూ నిశ్శబ్దముగా నాసీనులై యున్నారు.

అప్పుడే యజ్ఞమూర్తి (అరుళాళప్పెరుమాళెంబెరుమానార్లు) కూరేశునితో సంభాషించి వెళ్లుచున్నాడు; తన రచనల సందర్భమును ఏమైనను సందేహములున్న యెడల కూరేశునిగాని, రామానుజునిగాని అడిగి తెలిసికొనువాడతడు. కూరేశుడు పాండిత్యమున రామానుజు నంతటివాడు. ఎవ్వరికేని ఏదేని సందియమున్న మొదట వారు కూరేశునితో సంప్రదించెడివారు. ఒక్కొక్కపుడు రామానుజుడు సైతము అడుగవచ్చినవారిని కూరేశునికడకే పంపువాడు.

కూరేశుడటు మఠము ద్వారమువైపు కన్నువేసినాడు. అందమున అప్సరసవలెను, జ్ఞాన ముఖవర్చస్సున అపరసరస్వతివోలె కన్పట్టు నొక యువతి ద్వారముకడ నిల్చొనియున్నది. కూరేశుడు లేచివచ్చి, "అమ్మా నీవెవ్వరవు? నీవిటకు వచ్చినకారణమేమి?" అని పలుకరించెను.

"స్వామీ, నాది చిదంబరము. నా పేరు తిల్య," అని ప్రత్యుత్తర మిచ్చెను - "శ్రీమద్రామానుజుని దర్శనార్థ మరగదెంచిన దానను", అని మరియు భక్తివినయము ముకుళితహస్తయై వచించెను.

కూరేశుడటులోనికి జూచి, "అమ్మా ఆచార్యులవారు ధ్యాన నిమగ్నులైయున్నవారు. కొంత తడవాలసింపుడు. కూర్చొనుడు. సమయము జూచి వారికి నిన్నెరుకపరచెదను", అని పల్కి మరలా లోనికేగి కూర్చొనియుండెను.

తిల్య ముకుళితహస్తయై, కూర్చొనక, అట్లనే నిలువబడి యుండెను. తిల్య జన్మస్థలము చిదంబరము. ఆమె దేవదాసీ కుటుంబమున జన్మించినది. ఆమె జవ్వనపుటందమునకు మేర లేదు.

ఆమె యౌవనదశ జేరగనే గోవిందరాజస్వామి ఆలయమున నర్తకిగా ప్రవేశించెను. ఇది వారి కుటుంబ సంప్రదాయము, వృత్తి. ఆమె వారాంగన కులమునబుట్టినను, ఆకులజులగు స్త్రీలకున్న అలవాట్లు ఆమెకు లేవు. అమెపిన్నతనములోనే త్రికరణశుద్ధిగా తన్నుస్వామికి అంకితము జేసికొన్నది. రాధ, ఆండాళ్‌కోవకు జెందిన పవిత్రజ్యోతి తిల్య. ఆండాళ్‌వలె తిల్య భగవత్ సంశ్లేషభావమున గానము జేయుచూ, స్వామిముందు నాట్యము చేయునది. పండితులు, అర్చకులు, భక్తులు ఆమె భక్తిభావము నెరిగి, ఆమె నెంతో గౌరవ భావమున జూచువారు. ధనవంతులయిన ఉభయకర్తలును, ఆమెను భక్తిమార్గమున జూచువారు. స్వామిని ఆనందింప జేయుటకై, అలంకరింపబడిన స్వామి ఉత్సవవిగ్రహము ముందునిల్చి, గానము చేసెడిది; నృత్యము చేసెడిది. తన్ను రాధగాను, గోవిందరాజస్వామిని శ్రీకృష్ణునిగా భావించుకొని సంశ్లేషపడునట్టిది తిల్య. రాధ శ్రీకృష్ణుని గానక తహతహపడుచూ, విరహమున బృందావనమంతయు కలియ వెదకిన విధమున, తిల్య నాట్యముచేయుచూ ఆలయ ప్రాంగణ మంతయు సంచరించునట్టిది. స్వామి చిక్కలేదని అశ్రువులు రాల్చును. తిల్యకు గోవిందరాజస్వామి దప్ప మరియేమియు నవసరము లేదు; ఆమె సంశ్లేషభావ మట్టిది.

ఒకనాడు దేవాలయార్చకులు, వైష్ణవభక్తులు దేవాలయమున గూర్చొని యిష్టాగోష్ఠి సలుపుచున్నపుడు వారు శ్రీమద్రామానుజుని గూర్చి, ముచ్చటించుచుండిరి. తిల్యయు సమీపమున గూర్చొని వారి మాటల శ్రద్ధగా వినుచుండెను; ప్రధానార్చకుడు సైతము తిల్యను గొప్ప భక్తురాలుగా పరిగణించెడివాడు.

తిల్య రామానుజుని గూర్చి అనేక దివ్య విషయములు విన్నది. శ్రీరామానుజుడు దైవాంశసంభూతుడనియు, పిన్ననాటనే విద్యాభ్యాస సమయమున యాదవప్రకాశుడను అద్వితీయ అద్వైత మతగురువునే ఓడించినాడనియు, ఆయన అన్ని వర్ణముల వారిని సమానముగా నాదరించువాడనియు, సర్వవర్ణముల వారికిని, స్త్రీలకును వేద

రహస్యములు తిరుమంత్రార్థములను దెల్పువారనియు, వైష్ణవుడను బడువానికి వర్ణభేదములు లేవనియు, రామానుజుని యశస్సు దినదిన ప్రవర్ధమానమగుచున్నదనియు, వారికీర్తిని జూచి అద్వైతులే గాక వైష్ణవులలో కొందరు గూడ నసూయపడుచున్నారనియు, వారికి విషాన్నములు బెట్టి అంతమొందింప ప్రయత్నములు జరిగెననియు, ఉద్దండులయిన అనేక అద్వైత పండితుల నోడించిరనియు, యజ్ఞమూర్తి సైతము వారికి దాసుడయినాడనియు, భగవచ్ఛక్తి సర్వాంతర్యామి అని భావించిన వారందరు వైష్ణవులని రామానుజుడు నిర్వచించెననియు ఇంకను అనేక దివ్య విషయముల గూర్చి తిల్య వినియుండినది. అట్టి మహనీయుడయిన శ్రీ రామానుజుని దర్శింప వలయునని తిల్య సంకల్పించినది. అందువలన నామె చిదంబరము నుండి శ్రీరంగమునకు యాత్ర సాగించినది. శ్రీరామానుజ మఠము చేరినది. ద్వారమున శ్రీరామానుజుల దర్శనార్థము భక్తితో వేచియున్నది.

శ్రీరామానుజుడు ధ్యానము నుండి లేచినారు. కూరేశుడది గమనించి, తిల్యను దీసికొనిపోయి ఆచార్యులవారికి ఎరుక పరచెను - "స్వామీ, తిల్యయను ఈ యువతి తమ దర్శనార్థమై చిదంబరము నుండి వచ్చినది", అని యెరింగించెను.

తిల్య రామానుజునకు సాష్టాంగ నమస్కారము గావించినది. ఆచార్యులవారు ఆశీర్వదించిరి. ఒకరినొకరు ఎదురుగా ఉపవిష్టులయిరి. వారి సంభాషణ యిట్లు నడచినది:-

"ఏమమ్మా, చాలదూరము వచ్చితివి?"

"స్వామీ, మీ దర్శన భాగ్యమునకు"

యౌవనవతియగు తిల్య పలుకులు గంభీరముగాను, ఉన్నతముగాను, భక్తియుక్తముగాను ఉన్నందున, రామానుజుడు ఆమె వైపు వాత్సల్యమున జూచెను.

"శ్రీరంగములో ఏమైనపనియున్నదా నీకు! చెప్పుమా!"

"లేదు స్వామీ! తమ దర్శనమునకే వచ్చినాను, ధన్యురాలనైతిని"

"అమ్మా, నీకీ పురమున బంధువులుగాని పరిచితులుగాని వున్నారా?"

"ఎవ్వరు లేరు స్వామీ".

"రంగనాథస్వామి దర్శనమయినదా - అమ్మా"

"అయినది స్వామీ!"

ఇక రామానుజుడు మాట్లాడవలసినదేమున్నది? ఇరువురి మధ్య ఒక నిమిషకాలము నిశ్శబ్దము వెలిసినది".

"స్వామీ! మీరు నాకుపదేశమివ్వాలి", అనుచూ తిల్య నమస్కరించింది.

"నీకా, తల్లీ, ఉపదేశము! పసికందువే! నీకేల యిపుడు ఆధ్యాత్మికోపదేశములు? "సన్యాసినివి అవుతావా?", అనుచూ రామానుజుడు మందహాసము జేసెను.

అమాయకురాలును, పిన్నయు అయిన తిల్యయు రామానుజుని వైపుచూచుచు మందహాసమున పెదవి విప్పెను.

"చిదంబరములో గోవిందరాజస్వామి ఆలయమున్నదిగదా! ఆ స్వామిని పూజింపుము. అది చాలు నీకు", అని రామానుజుడు ఆశీర్వాద పూర్వకముగా ననెను.

"స్వామీ, ఆపని బాల్యమునుండి యిప్పటికిని ఎడతెరిపిలేక చేయుచునే యున్నాను. నేను అనుదినము స్వామిముందు నిలిచి, గానము జేసి, నృత్యము చేయుదును".

"నృత్యమా!" అని రామానుజుడు ఆశ్చర్యమున జూచెను.

"అవును స్వామీ, నేను వేశ్యకులస్థురాలను. దేవుని యెదుట గాననృత్యములు జేయుట మా కుటుంబము వారి వృత్తి".

"కులవృత్తి గావునను, కుటుంబవృత్తిగావునను నృత్యము చేయుచున్నావా? వేరు విశేషమున్నదా?"

"స్వామీ అట్లుగాదు - నేను నా భక్తిని వెల్లడించుటకే నృత్య గానములు జేయుదును. నేను వారాంగననుగాను, కుల్వృత్తిని కేవలము పాటించుదానను గాను, ఆ స్వామి యెదుట నృత్యము గావించి, ఆనందించుదాననే. స్వామీ, ఆండాళ్ నా ఆరాధ్యదైవము. ఆమెవలె నా జీవితమును మలచుకొనవలయునని నా ఆకాంక్ష. గోదాదేవి కటాక్షమున గోవిందరాజస్వామిపై నాకు చిన్ననాటనే భక్తి కుదిరినది. గోవిందరాజస్వామియే నా సర్వస్వము, స్వామీ".

ఆమె పలుకులు రామానుజున కెంతో ముదమును చేకూర్చినది. "చాలమంచి పనిజేయుచున్నావు తల్లీ! పిన్ననాటనే నీకింతటి భక్తి యలవడుట నీయదృష్టము తల్లీ! మనతల్లియయిన ఆండాళ్ ఆశీర్వచనములు నీకెల్లప్పుడు నుండుగాక! సోదరీ! తిల్యా! నీ జీవితమును ఫలప్రదము జేసికొనుచున్నావమ్మా! నీవిట్లే నీభక్తి కార్యక్రమమును జరుపుకొనుము. భగవంతుడు నిన్ను కరుణించుగాక! నీవు మోక్షమార్గమున మనెదవుగాక!" అని రామానుజుడు ఆశీర్వదించెను.

"స్వామీ, మీరొకసారి చిదంబరము వేంచేయరాదా? అచ్చటి వైష్ణవభక్తులెల్లరు తమ్ము దర్శించి యానందింతురే".

"గోవిందరాజస్వామీ పిలిస్తే వస్తానమ్మా" అన్నారు యతిరాజు.

ఇక యేమి మాటాడవలయునో ఆమెకు తోచలేదు. పరమానంద మున ప్రశాంతమున ఉడైయవరుల సన్నిధిని కూర్చొని యున్నది.

కొంత తడవు ఆలోచనా నిమగ్నుడుగానున్న రామానుజుడు కన్నులు విశాలముగా విప్పి తిల్యపై కరుణావర్షము చూడ్కుల ప్రసరింపజేయుచూ, "అమ్మా, తిల్యా, నీ జీవితము ధన్యము. చిన్ననాటనే నీకిట్టి వైష్ణవసంశ్లేష భావము కలిగినది. ఎంతో ప్రజ్ఞానులకు కూడా నీకున్న భక్తి అలవడదు. ఇది నీ సంస్కారము. చిదంబరము

చేరిన తరువాత నీవు నీ భక్తిగాన నాట్యమును సాగించుకొనుచునే యుండుము. వైష్ణవులకు సేవజేయుము. విశిష్టాద్వైత మతసిద్ధాంత వ్యాప్తికి తోడ్పడుము. నీకు శుభమగుగాక!" అని రామానుజుడు ఆశీర్వాద పూర్వకముగా తనసందేశము నొసగెను.

ఈ మాటలు విన్న తిల్ల్య యొక్క ఆనందము అనిర్వచనీయము. శ్రీరామానుజాచార్యులవారి దర్శన మబ్బినది. వారి యుపదేశము ప్రాప్తించినది. ఆశీర్వాదము లభించినది. ఇక తిల్ల్యకేమి గావలయును?

దిగ్విజయ యాత్రయందు జయప్రదుడైన రాజకుమారునివలె అధికోత్సాహమున చిదంబరము చేరినది తిల్ల్య.

చిదంబరములోని వైష్ణవభక్తులకు, అర్చకులకు తానుగావించిన శ్రీమద్రామానుజదర్శన విశేషముల దెల్పి, తిల్ల్య ఆనందించినది. రామానుజుడేనాడైనను చిదంబరమును రాగలడని వారికి దెల్పెను. కాని శ్రీరామానుజులు వచ్చుటకు తగిన అవకాశముండవలయును గదా! ఈ విషయమును గూడా చిదంబరవాసులు గ్రహింపలేకపోలేదు.

చిదంబరములోని భక్తులు తిల్ల్య నుడివిన విశేషముల విని ఆమెను ప్రశంసించిరి. యువతియైనను దూరప్రయాణము గావించుటయు, భగవద్రామానుజుడు శరణాగతి కావడము, వారి యాశీర్వాదముల పొందగలగడము, ఆమె జన్మ ఫలమని పొగడిరి.

శ్రీమద్రామానుజు డేనాడైనను చిదంబరము రావచ్చునని ఉవ్విళ్ళూరుచున్న తిల్ల్య వారియుపదేశానుసారము ప్రవర్తించుచుండి నది. భక్తితో గోవిందరాజస్వామిని పూజించి, సంకీర్తించి, నృత్యముజేసి, భక్తుల నానందింప జేయుచుండెను. వైష్ణవ భక్తులయెడ ఆదరాభి మానముల జూపుచుండెడిది. వైష్ణవ మతవ్యాప్తికి తానెట్టి త్యాగము నయినను జేయ సంసిద్ధురాలుగా నుండినది. అట్టి సదవకాశములకే తహతహలాడు చుండెడిది. తిల్ల్య వాస్తవముగా ధన్యజీవి. వైష్ణవా దర్శనమును జూపిన పుణ్యజీవి. ఈమెను గూర్చి యింకను అనేక విషయములను రాబోవు అధ్యాయములందు చదువగలము.

# 27. శ్రీభాష్య రచనము

ఇప్పటికే శ్రీరామానుజాచార్యులవారు దేశమున తగిన ఆధ్యాత్మిక వాతావరణమును వ్యాపింపజేసియున్నారు. ఆయన కీర్తిచంద్రికలు నలుమూలల ప్రసరించినవి. కొంతకాలము విశ్రాంతిగా శ్రీరంగనాథాలయ, శ్రీవిశిష్టాద్వైత మత పరిపాలనా విషయములను చూడనెంచెను. తాను శ్రీయామునాచార్యులవారికి గావించిన వాగ్దానత్రయమును గూర్చి ఆలోచించుచుండెను.

ఇట్లుండ నొకనాడు కూరేశుడు రామానుజుని మ్రోలకూర్చొని, సావధానముగా, "స్వామీ, తమరిదివరలో ఆళవందారు అవసాన కాలమున గావించిన వాగ్దానత్రయమును గూర్చి వినియుంటిని. ఆ ప్రతిజ్ఞాత్రయ నిర్వహణ విషయమై తమరు ఎట్టి ప్రయత్నములు చేయుచున్నారో దాసుడు వినకుతూహలపడుచున్నాడు", అని నుడివెను.

"ఔను కూరేశా - ఈశ్వరుడు, జీవుడు, ప్రకృతియనునీ తత్త్వత్రయ సంబంధముల విష్ణుపురాణమున విపులముగా నిర్వచించిన పరాశరుని యొక్కయు, వేదముల విమర్శించి బ్రహ్మ సూత్రముల నేర్పరచిన యీ పరాశరవ్యాస భట్టారకుని యొక్కయు కీర్తిసంపదను చిరస్థాయి జేయ ప్రతిజ్ఞబూనియుంటిని. రెండవదిగా శ్రీనమ్మాళ్వార్ల సారస్వతమునకు వ్యాప్తిని కలుగజేసి, తద్వారా చేతనులకు సత్యమార్గమును జూపి, తత్ఫలితముగా మానవులకు సర్వాంతర్యామి యగు ఈశ్వరశక్తి యెడ అచంచల విశ్వాసము, భక్తి, ప్రపత్తుల గూర్పవలసి యున్నది. మూడవదిగా బ్రహ్మసూత్రములకు భాష్యమును రచింప ప్రతిజ్ఞ జేసియున్నాను.

"ఈ వాగ్దాన త్రయమున ద్వితీయ విషయము ఇప్పటివరకు కొంత భాగము నెరవేర్చబడియున్నది.

"మూడవది యగు బ్రహ్మసూత్ర భాష్యము అతి ముఖ్యమయినది. అద్వైత సిద్ధాంత మాయావాదమును ఖండించుచూ,

తత్త్వత్రయ జ్ఞానసూత్రమును ప్రతిపాదించుచూ, విశిష్టాద్వైత సిద్ధాంతమును బలపరచుచూ, బ్రహ్మసూత్రములకు భాష్యమును రచింపవలసియున్నది. ఇందులకు గావలసిన ఆధార గ్రంథము లన్నియు సేకరింపబడియున్నవి. కాని, "బోధాయనవృత్తి" అను గ్రంథము చాల అవసరమైయున్నది. ఇది ప్రస్తుతము కాశ్మీర దేశమున శారదాపీఠ మందలి గ్రంథాలయమున నున్నది. మనము దేశయాత్రపై బయలుదేరి, దేశములోని పుణ్యక్షేత్రముల దర్శించి, మత పండితులతో చర్చించి, తరువాత కాశ్మీరము జేరి, ఆ గ్రంథ రాజమును సంపాదించుకొని రావలసియున్నది, కూరేశా. ఇక ప్రయాణమునకు సంసిద్ధుడవు కమ్ము", అని శ్రీమద్రామానుజు డాదేశించెను.

శ్రీరామానుజాచార్యులవారు మఠ విషయ నిర్వహణమును కొంతమంది శిష్యుల కప్పగించి, శ్రీరంగనాథ దేవాలయ కార్యక్రమ నిర్వహణమునకు సంబంధించి యుచితసలహాల నొసంగి, సుమూర్తమున కూరేశుని తోడ్కొని ఉత్తరదేశయాత్రకు బయలుదేరెను. అనేక పుణ్యక్షేత్రముల యందు, మఠములందు, ఆరామములందును అద్వైతులను, శాక్తేయులను, కాపాలికులకు, పాషండులను, బౌద్ధులను, జైనులను, అర్థరహిత మూఢాచారములలో మ్రగ్గుచున్న ఆస్తికులను, సర్వమును ఒక్కుమ్మడిగా నిరసించుచున్న నాస్తికులను అనేక తర్కవాదముల నోడించియు, నచ్చజెప్పియు, మెప్పించియు, వైష్ణవ జీవితాదర్శముల దెల్పియు అనేకులను సత్యమార్గమునకు మరలించి, వారికి విశిష్టాద్వైత సిద్ధాంతములను కారణయుక్తముగా శాస్త్రీయముగా బోధించుచు రామానుజుడు దిగ్విజయ యాత్ర సాగించుచుండెను.

భారతదేశ ఉత్తర, వాయవ్యముల గల రాజ్యముల దర్శించుచు రామానుజుడు కాశ్మీరముచేరునప్పటికి మూడు మాసములు నిండెను.

"పండితులు మత్సర గ్రస్థులు. తర్కవాదములయందు జయించి కీర్తి ప్రఖ్యాతులు పొందవలయుననెడి యుద్దేశమేగాని, వారికి

సత్యాన్వేషణ దృక్పథము లేదు. మూఢ విశ్వాసములలో బడి, వారి మార్గముల మార్చుకొనరు; శుద్ధఛాందసులు. ఈ పరిస్థితులలో ఈ నూతన ప్రాంతమున నా శాస్త్రజ్ఞానముతో నిచటి పండితుల నోడింపగల నేమోకాని, వారి యంగీకారముతో, "బోధాయనవృత్తి" గ్రంథమును పొందుట దుస్సాధ్యము కాగలదు. అందువలన ఈ గ్రంథప్రాప్తికి కాశ్మీర ప్రభువునే యర్థించుట యుక్తమని తలచెదను", అని రామానుజుడు ఆలోచించుచుండెను.

అప్పటి కాశ్మీరరాజు మతసహనము గలవాడు; దయార్ద్ర హృదయుడని పేరు. ఆయన వంశపూర్వికులు మహాయాన బౌద్ధులట; ఆయన హిందూమతమన్నను, వైదిక మతమన్నను మోజు జూపెడివాడట. ఆతని ఆస్థాన పండితుల లెల్లరు అద్వైతులు. ఈ వివరములు తెలిసికొన్న రామానుజుడు ఇట్టి పరిస్థితులలో కాశ్మీర ప్రభువును ఆశ్రయించుటయే శ్రేయస్కరమని రామానుజుడు నిర్ణయించుకొనెను.

శ్రీమద్రామానుజాచార్యులవారు కాశ్మీరరాజ దర్బారు నందు ఆధ్యాత్మిక పండితులు, శాస్త్రజ్ఞులు, తార్కికుల సమక్షమున విశిష్టాద్వైత సిద్ధాంతమును గూర్చికొన్ని దినము లుపన్యసించెను. శ్రీరామానుజుని దివ్యశరీర సౌందర్య తేజమునకును, వారి విజ్ఞానమునకును, వాక్పటిమకును, ఉపన్యాస వైఖరికిని కాశ్మీర ప్రభువు ముగ్ధుడయ్యెను. పండితు లెల్లరు నివ్వెరపోయిరి. ఎదురు వాదించలేకపోయిరేగాని, యెవరి భావములు వారివి! వాగ్వాదమున నోడిమిన్నకున్నవాడును, భయపడి ఊరకున్నవాడును మనస్సు మార్చుకున్నాడని యెట్లు చెప్పగలము? ఒక్కొక్కప్పుడు మాత్సర్యమే లోన ఇనుమడించి యుండవచ్చును.

వాస్తవముగా కాశ్మీరపండితులెల్లరును రామానుజునిపై ఈర్ష్యాసూయలనే పెంపొందించుకొనిరి! సన్మార్గుల యెడ మానవావళి జూపిన దెరగు ఇట్టిదే - తరతరాలనుండి, యే జాతిలోగాని, అసూయా

పరులైన కాశ్మీర పండితులు నోరు మెదల్చి మాటాడలేక నివ్వెరపోయిరి. రామానుజ సిద్ధాంతమునకు ప్రభువు అంగీకరించుట అద్వైత పండితులకు మింగుడు పడలేదు - గోరుచుట్టపై రోకటిపోటు చందమయినది; మండుచున్న అగ్నిహోత్రమున ఘృతము జల్లినట్లయినది. కాని ఒల్లని వరుడు తలంబ్రాలు బోసిన చందమున, వారెల్లరు రాజుగారినికాదనలేక "తథాస్తు" పల్కిరి.

శ్రీరామానుజుడు పరమానందమున రాజుతో, "ఓరాజశిఖామణీ! నేను బ్రహ్మసూత్రములకు విశిష్టాద్వైత సిద్ధాంత పరముగా సత్య భాష్యమును రచింప సంకల్పించియున్నాను. ఈ సిద్ధాంతమును పూర్వకాలమున బోధాయనుడను మహర్షి "వృత్తి"యను గ్రంథమున బేర్కొని యున్నాడని వినియున్నాను. ఆ గ్రంథరత్నమిచట శారదాపీఠ గ్రంథాలయమున నున్నదనియు వినియున్నాను. దానిని నాకందజేసి నాకు సాయము గావింపుడు", అని అర్థించెను.

కాశ్మీరప్రభువు మారుపలకక, వల్లెయనెను.

కాని, కాశ్మీరపండితులు లోలోన కినుకబూనిరి. వారికుపయోగ కరముగాకున్నను, వారి సిద్ధాంతములకు "బోధాయనవృత్తి" గ్రంథ ముపకరింపకున్నను, వారాగ్రంథమును అన్యహస్తగతము జేయ నిష్టపడరైరి. ఆ గ్రంథరాజ సహాయమున రామానుజుడు తన సిద్ధాంతమును బలపరచుకొని, అద్వైతమునకు ముప్పుదెచ్చునని వారి భయము, వారి అసూయ.

అద్వైతులగు కాశ్మీరపండితులకు, విశిష్టాద్వైత సిద్ధాంతి శ్రీరామానుజునకు గల ఆలోచనాక్రమ భేదమును మరల నొకసారి జ్ఞప్తికి దెచ్చుకొనుట యుక్తము:

అద్వైతులయిన కాశ్మీరపండితులు "తత్త్వమసి" (నీవే ఆ పరబ్రహ్మవు) "అహంబ్రహ్మాస్మి" (నేనే బ్రహ్మము) అను ఉపనిష ద్వాక్యముల పాటించి, యజ్ఞదాన, తపస్సు, కర్మలజేయ వలయునని

నమ్మినవారు. ఇందువలన మోక్షము లభించునని వారి విశ్వాసము - రామానుజుని సిద్ధాంతము ప్రకారము "ఏకమేవాద్వితీయం" అను సూత్రము ప్రకారము తత్త్వత్రయ జ్ఞానమున తెల్పబడిన ఈశ్వరశక్తి యొక్కటే సర్వాంతర్యామి - అది అద్వితీయమయినది. ఆ శక్తి స్వరూపమును తెలిసికొనుటకు ధ్యానము, ఉపాసన, భక్తి అనునవి మార్గములు. ఈ మార్గముల వలన భక్తుడు విష్ణు సంశ్లేషభావమును పొంది, పరమానంద స్థితియందు అనగా మోక్షభావమున నుండును. పూర్వము బోధాయన మహర్షియు తన "వృత్తి" అను గ్రంథమున ఈ అభిప్రాయమునే వెల్లడించి, అందులకు వేద, ఉపనిషత్, బ్రహ్మసూత్రముల నుండి ప్రమాణముల జూపియున్నాడు.

మత్సరగ్రస్థులయిన కాశ్మీరపండితులు రాజు సమక్షముననే రామానుజునితో "ఆచార్యవర్యా! బోధాయనవృత్తి అను గ్రంథము ఇప్పుడు శారదాపీఠ గ్రంథాలయమున లేదు. ఇటీవలనే అది చెదలుబట్టి నాశనమయినది", అని చెప్పిరి.

కాశ్మీర ప్రభువు వారిమాటల నమ్మలేదు; వారి అసూయా భావమును రాజు పసిగట్టెను. అందువలన రాజుదగ్గర నిల్చుండి, కొంతమంది సద్భావములుగల చదువరులు నేర్పరచి, బోధాయనవృత్తి గ్రంథవ్రాతప్రతులను వెదకితీయవలసినదని ఆజ్ఞాపించెను. కాశ్మీర పండితులు వ్రాతప్రతులను అప్పటికీ కుపితులై చిందరవందరలు జేసియుండిరి. కడకు రాజుగారి పట్టుదలతో వ్రాతప్రతులన్నియు సేకరింపబడినవి. కూరేశుడు ప్రశాంతముగా కూర్చొని, రెండుమూడు దినములలో వ్రాతప్రతుల పత్రముల నన్నింటిని వరుసగా నేర్పరచి, బోధాయనవృత్తి గ్రంథము సంపూర్ణముగా లబ్ధమైనందులకు సంతోషించెను.

శ్రీరామానుజుడు కాశ్మీర ప్రభువునకు మంగళాశాసనము బల్కి, పండితు లెల్లరకు కృతజ్ఞతను వెల్లడించి, కూరేశునితో గలిసి తిరుగు ప్రయాణమును ప్రారంభించెను. మార్గమధ్యమున విశ్రమించు

సమయములందు కూరేశుడు బోధాయనవృత్తి గ్రంథమును పఠించు చుండెడివాడు. ఆయన ఏకసంథాగ్రాహి యని తెలిసిన విషయమే కదా!

రాజు నాజ్ఞను కాదనలేక బోధాయన వృత్తి గ్రంథమును రామానుజునకు వశముజేసిరేగాని, కాశ్మీరపండితులు మరలా ఆ గ్రంథమును రామానుజుని వద్దనుండి తస్కరింపవలయుననియే సంకల్పించియుండిరి. వారిలో కొందరు రహస్యముగా రామానుజ కూరేశులను వెంబడించి వచ్చుచుండిరి. ఏడవదిన ఉదయమున ఒక సత్రపు అరుగుపై వస్త్రములను గ్రంథప్రతులను పదిలముగా నుంచి, రామానుజ కూరేశులు స్నానార్థము నది కేగిరి. అదునెరిగిన యా పండిత తస్కరులు తటాలున గ్రంథప్రతులను తీసికొనిపోయిరి. స్నానానంతరము వచ్చిచూడగా, గ్రంథములేదు. జరిగినదంతయు శ్రీరామానుజు డూహించెను. చేయునదేమున్నది? చింతాక్రాంతుడై కూలబెడను. "కూరేశా, మన ప్రయత్నమంతయు వమ్మైపోయినదే! తిరిగి పయనించి యీ యుదంతమును కాశ్మీర రాజునకు మనము దెలిపిన, జరుగపోవునది గ్రంథప్రాప్తి గాదు, రాజు వారిని శిక్షించుటయే! ఈ పాపకార్యమేల?" అని రామానుజుడనెను.

కూరేశుడు మందహాసమున, "ఆచార్యా, మనకు కలిగిన నష్టమేమియు లేదు. ఆ గ్రంథము సర్వమును నాకు కంఠస్థ మయియున్నది. ఈయపాయమును నేను ముందే పసికట్టియుండి, మీరు విశ్రమించు కాలమున నేను కొలది కొలదిగా గ్రంథమును వల్లె వేయుచుంటిని. ఈ నాటికినేను దాని పఠనమును పూర్తి గావించితిని. ఏక సంథాగ్రాహినైన నాకు ఒక్కసారి విన్నను, పఠించినను శాశ్వతముగా మవస్సున జ్ఞప్తియుండును స్వామీ", అని పల్కెను.

శ్రీరామానుజుడమితానందపూరితుడై, "కూరేశా, నీయుపకార మునకు నేనును, వైష్ణవలోకమును ఋణపడి యుండును", అనుచూ వానిని గాఢాలింగనము గావించుకొని ఆశీర్వదించెను.

గురుశిష్యులు ఉత్తరదేశయాత్ర పూర్తిజేసికొని, శ్రీరంగము జేరిరి. అనతికాలములోనే శ్రీమద్రామానుజుడు బ్రహ్మసూత్ర భాష్య రచనమునకు పూనుకొనెను. వ్యాస భగవానునకు విఘ్నేశ్వరుడు లేఖకుడైన తెరగున శ్రీమద్రామానుజులవారికి కూరేశుడు లేఖకుడై భాష్యరచనకు సాయపడెను. ఏకసంథాగ్రాహియు, మహాపండితుడును, సంస్కారియు, నిశిత విమర్శనాజ్ఞానశీలియునయిన యతిరాజు యొక్క మేధ అప్పటికి దేశములో నున్న ప్రామాణిక సంస్కృత, తమిళ రచనలలోని ఆధ్యాత్మిక సారస్వత సర్వస్వము పీఠాసనము వేసికొని ఆశీనురాలైయున్నది గదా! శ్రీమద్రామానుజుడు అనర్గళముగా బ్రహ్మసూత్రముల వల్లించుచు, వానికి వ్యాఖ్యానము వచించుచుండగా కూరేశుడు గంటమును చేబూని, తాళపత్రములపై తగువేగమున వ్రాయుచుండెడివాడు.

లిఖించుటలో కూరేశుడు కేవలము సూటిగా అక్షరములు వ్రాయుటయేగాదు. తాను లిఖించు ప్రతి విషయమును అవగాహన జేసికొనుచుండువాడు. ఒక దగ్గర జీవుని గూర్చి నిర్వచించుచూ రామానుజుడిట్లు పలికెను - "జీవుడు నిత్యుడు, జ్ఞాత (సర్వము తెలిసినవాడు)".

కూరేశుని వ్రాత గంటము అట్లనే ఆగిపోయినది. వ్రాయకున్నా వేమని రామానుజుడు హెచ్చరించెను. కూరేశుడు మౌనము దాల్చియుండెను.

రామానుజుడాలోచనలో బడెను. తాను వచించిన విషయమును పునఃపరిశీలించుకొనెను. తన పొరపాటును గమనించుకొనెను. కూరేశుని మౌనమునకు కారణము నూహించెను. అతని వినయమునకు, ఎరుకకు, క్రమశిక్షణకు, విమర్శనాజ్ఞానమునకు రామానుజుడు సంతసించెను.

"కూరేశా, యిక వ్రాయుము", అని ఆదేశించుచు రామానుజుడు జీవుని గూర్చియిట్లు నిర్వచించెను - "శాశ్వతములైనట్టియు, నిత్యములయినట్టియు, తత్త్వత్రయమున జీవుడు తనకు ఆత్మయగు

ఈశ్వరశక్తిపై ఆధారపడియుండును. జీవుడు అనంతమయిన ఈశ్వరశక్తి యొక్క అంశమగుటచే ఈశ్వరునకును జీవునకును గల సంబంధము ప్రభువునకును దాసునకును గల సంబంధము వంటిది. యజమానునకును, తనకున్న ఆస్తికిని గల సంబంధమువంటిది. సంపద (ఆస్తి) యజమానునకుపయోగపడునట్లు, జీవుడు తన్నుతాను ఈశ్వరునకు అర్పించుకొని వినియోగింప బడవలయును".

కూరేశుడు వెంటనే దానిని వ్రాసెను.

ఈ విధమున కూరేశుడు శ్రోత, విమర్శకుడు, లేఖకుడుగా ప్రవర్తించువాడు. బ్రహ్మసూత్ర భాష్యమిట్లు త్వరలోనే పూర్తి చేయబడెను. దీనిని శ్రీభాష్యమందురు.

కూరేశుని భార్య ఆండాళ్ గొప్ప పండితురాలు. అమె ఆధ్యాత్మిక చర్చలయందు పాల్గొనుచుండెడిది. ఆమె విశాల జ్ఞానమునకు, ఆమె వెల్లడించు అభిప్రాయములకును రామానుజుడు తగు గౌరవమును నొసంగువాడు.

శ్రీమద్రామానుజుని శ్రీ భాష్యము విశిష్టాద్వైత తత్వ విధానమును దెల్పునది. భగవత్శక్తియగు సర్వాంతర్యామి ఈశ్వరశక్తికి మూర్తి భావము నేర్పరచి, అమూర్తి త్రిభువన సుందరుడని రామానుజుడు దెల్పెను. అనంతకల్యాణగుణ సహితుడగు ఈ త్రిభువన సుందరునితో సంశ్లేషింప గలుగుటయే పరమపదము, మోక్షము, వైకుంఠ ప్రాప్తి అనబడును. ఇది మరణానంతర స్థితికాదు - జీవించియుండగనే జీవితమును పరమానందముగా జేసికొనుట - ఈ అనంత కల్యాణగుణ సహితునితో సంశ్లేషించుటయే విశ్వసౌభ్రాత్రము, విశ్వప్రేమ, సానుభూతి, సేవాతత్పరత, స్వార్థరాహిత్యము అగును. స్వార్థరాహిత్య భావమే శరణాగతి తత్వము. ఇది విశ్వశాంతికి తోడ్పడును. తన సౌఖ్యము, తన మోక్షభావము, ఇతరుల సౌఖ్యము అనందములపై నాధారపడియుండును. కావున మానవుడు త్యాగశీలియై విశ్వశాంతిని కాంక్షించవలయును.

మాయావాదముతో గూడిన అద్వైతసిద్ధాంతము చేతనునికి, శాంతి, తృప్తి, ఆనందముల నెట్లు గూర్చగలదు? తత్త్వత్రయముల యొక్క సత్యభావము, ఈశ్వరశక్తి యొక్క అనంత కల్యాణగుణ సంపదయు (విశిష్టాద్వైతస్థితి) వానితో సంశ్లేషించి జీవించుటయే పరమానందమును చేకూర్చును. ఇందులకు తార్కాణము యాదవ ప్రకాశుడు తన సిద్ధాంతమున శాంతిని బొందజాలక, రామానుజునకు దాసుడగుటయే.

శ్రీభాష్య రచనానంతరము శ్రీరామానుజుని కీర్తి మరియు హెచ్చెను. శ్రీభాష్యమును రచించిన వారుగాన రామానుజునకు "భాష్యకారులు" అను నామధేయము వచ్చెను.

ఒకనాడు పగటి కాలమంతయు గంటము విడువక వ్రాయు చుండుటచే కూరేశుని వ్రేళ్ల కొయ్యబారెను. విరామములేక అట్లే కూర్చొని వ్రాయుటచే నడుమున నొప్పిగల్గెను. అది వర్షాకాలము. కూరేశుడు సూర్యాస్తమయము తరువాత వర్షములో తడచుచూ నిజసదనము జేరెను. అతడు అగర్భశ్రీమంతుడయ్యును సర్వసంపదల త్యజించి, రామానుజుని శిష్యుడై, తక్కిన శిష్యులవలెనే, అనుదినము భిక్షాటనము గావించి, బియ్యమును తెచ్చియిచ్చిన, భార్య ఆండాళ్ వంట చేయుచుండెడిది. ఆనాడు భిక్షాటనమునకు అతడు పోలేదు. ఇక ఆనాటి రాత్రి దంపతు లిరువరును పస్తుండవలసినదేగదా! కాని యిట్టి స్థితికి వారిరువురిలో నెవరేని జంకెడివారు కారు.

ఏదో చిత్తచాంచల్యముగా, నిర్ణీత ఉద్దేశపూర్వకముగా గాక, యేదో యొక ధ్యానమున ఆండాళ్ తిన్నగా తనలో తానిట్లనుకొనుచుండెను - "శ్రీరంగనాథా! నీదాసులు ఈ రాత్రి పస్తుండవలసినదేనా? సర్వ సంపదలకాలవాలమైన ప్రభువులవారి దాసులును పస్తుండవలసిన దేనా? నీచిత్తము స్వామీ".

కుంభవృష్టి పడుచునే యుండెను. దానికితోడు కటికచీకటి, ప్రచండ శీతలవాయువులు బోరున వీచుచుండెను. తలుపు తట్టినట్లుండెను. తిరుమణి శ్రీచూర్ణధారియగు వైష్ణవుడొకడు సాపాటు

పొట్లముల మూడింటిని ఆండాళ్‌కు అందజేసి, ఒక్కమాటయును జెప్పక, వేవేగ చీకటిలోనికి పోయెను. ఆండాళ్ ఆపొట్లముల విప్పిచూచెను. దేవాలయ ప్రసాదములవి చక్కెర పొంగలి, పులిహోర, దధ్యోదనము.

ఆండాళ్ భర్తను సాపాటుకు పిలిచెను. దేవాలయ ప్రసాద త్రయమును వడ్డించెను. "ఎక్కడి వివి" అని కూరేశుడు ప్రశ్నించెను. "ఎక్కడివో కావు. శ్రీరంగనాథాలయ ప్రసాదములే. వైష్ణవుడొకడు ఇప్పుడే అందజేసి వెళ్లినాడు", అని చెప్పెను. "స్వామీ, రామానుజా!, ఒక్క పూట పస్తుండిన దానున కేమి కొరత? దేవాలయమునకు బోయి, యీ ప్రసాదములు నాకు చేరునట్లు జేసితిరా? స్వామీ యీ చీకటిలో, ఈ గాలివర్షములో తమరెంత శ్రమదీసికున్నారు? ఆ వైష్ణవుడును శ్రమపడినాడే!", అనుచూ, భగవద్రామానుజుల గూర్చి తలంచుచు, కూరేశుడు స్వామి ప్రసాదము స్వీకరించెను. "శిష్యవత్సలుడు రామానుజుడు! ఈ రుచ్యములయిన ప్రసాదములదిని, స్వామిని విస్మరించుటకా!" అని కూరేశుడు భార్యతో చలోక్తులాడెను. ఆండాళ్ కంటతడిబెట్టుకొనుచూ, "నాథా, ఈ ప్రసాదములు చేరులోపలనే, మనము పస్తుండవలసినదేనా అని నేను వాపోయితిని. అజ్ఞానిని, ఇక నిట్లెన్నడు తలంపను. ఈనాటికి ప్రసాదముల గ్రహింపుడు", అని భర్తతో ననెను. కూరేశుడు ప్రసాదమును పుచ్చుకొని, మిగిలినదానిని ఆండాళ్‌కు ఇవ్వగా నామెయు దానిని భక్తితో నారగించెను.

శ్రీభాష్య రచనానంతరము రామానుజుడు క్రమక్రమముగా త్వరితగతిని తక్కిన యీ రచనల గావించెను - వేదార్థ సంగ్రహము, గీతా భాష్యము, వేదాంతదీపము, వేదాంతసారము, గద్యత్రయము, నిత్య గ్రంథము - అనునవి. శరణాగతి గద్య, శ్రీరంగ గద్య, వైకుంఠ గద్య అనునవి గద్యత్రయమనబడును.

☆

# 28. దిగ్విజయ యాత్రలోని వివిధ సంఘటనలు

గత ప్రకరణమున శ్రీరామానుజాచార్యులవారు కూరేశునితో గలిసి కాశ్మీరయాత్రగావించి, "బోధాయనవృత్తి" అను గ్రంథమును సేకరించి నాడని తెలిసికొంటిమి.

ఈ కాశ్మీరయాత్ర సందర్భమున శ్రీమద్రామానుజుడు దర్శించిన యితర పుణ్యక్షేత్రములు, అందందు జరిగిన సంఘటనలను ఇపుడు తెలిసికొందము. ఇందు వారి ప్రతిభావిశేషములు కొన్ని బయల్పడును.

యామునాచార్యులు అద్వైతమతమందలి మాయావాదమును నిరసించినాడని తెలిసికొనియున్నాము. వారు దానిలోపముల నెత్తిచూప గలిగిరే గాని, దానికి ప్రత్యామ్నాయమైన తత్త్వము ప్రతిపాదించి ప్రచారము చేసి స్థిరీకరించుటకు వారికి వార్థక్యమువలన వ్యవధిలేక పోయెను. అందువలననే తన విశిష్టాద్వైత సిద్ధాంత స్థాపన, ప్రచారములకు తగిన వ్యక్తి అవసరమని తన అవసానకాలమున వాపోయెను. యువకుడును, ప్రతిభాశాలియునగు రామానుజుడే తనకు ఆధ్యాత్మిక వారసుడు గావలయునని కోరెను. అట్లే రామానుజుడు ఆళవందారుకు వారసుడయినాడని తెలిసికొనియుంటిమి. రామానుజుడీ మార్గమున గావించినదేమి? మాయావాదమును ఖండించినాడు. తత్త్వత్రయ సత్యమును వెల్లడించినాడు. విశిష్టాద్వైత సిద్ధాంతమూలమున చేతనుడు ఈశ్వరశక్తి యొక్క అనంత కల్యాణ గుణముల సేవించి, స్వార్థరహితుడై, సేవాభావమున మోక్షపదమున జీవింప వలసినదని ప్రబోధించినాడు. ఈ సిద్ధాంతమును దేశ వ్యాపితముజేయ సంకల్పించినాడు. కడకు కృతకృత్యుడయినాడని తరువాతి అధ్యాయముల గమనింపగలము. లోకకల్యాణము కొరకే రామానుజుడు విశిష్టాద్వైత సిద్ధాంతమును ప్రచారము జేసినాడు. ఇది విశ్వశ్రేయస్సుకు ఏకైక మార్గము. ఈ ప్రచారము కాశ్మీర యాత్ర సందర్భమున చాల గొప్పగా జరిగినది.

కాశ్మీరయాత్రకై బయలుదేరిన రామానుజుడు శ్రీరంగమును వదలిన తరువాత మొదట కుంభకోణము చేరినారు. అచ్చట అనేక శైవపండితుల నోడించినాడు. ప్రస్థానత్రయములోని ప్రమాణములను జూపి తనసిద్ధాంతమును వారికి నచ్చజెప్పినాడు. అనేకులు శైవులు వైష్ణవ మతమును స్వీకరించిరి.

రామానుజుడు కుంభకోణము నుండి కాంచీపురమునకు వెళ్ల ప్రయత్నపడినాడు. కాంచీపురము తన మొదటి విద్యాభ్యాస స్థానము కదా? తనకు వరదుడయిన వరదరాజస్వామి ఆలయ స్థానము కదా? తాను యతిరాజై ప్రథమ రామానుజమఠము గల ప్రదేశము కదా? తనకు దాశరథి కూరేశులను ప్రథమ శిష్యులు సంక్రమించిన స్థలము గదా? అట్టి ప్రాధాన్యమయిన కాంచీపురికి రామానుజుడు ప్రస్తుతమునకు పోలేకపోయెను. కారణమేమి? అప్పుడచట రాజేంద్ర చోళుడను చోళవంశపురాజు కంచిపై దండెత్తి కాంచీపుర రాజును చంపి, పట్టణమును ఆక్రమించినాడని తెలిసినది. కాంచీపురమప్పుడు అల్లకల్లోలముగా నున్నట్లు రామానుజుడు తెలిసికొనెను. అందువలన ప్రస్తుతమునకు కాంచీపురమునకు పోక, రామానుజుడు కేరళ దేశమునకు పోయినాడు. అచ్చట అనంతశయనమను పుణ్యక్షేత్రమున విశిష్టాద్వైత మఠమును ఒకదానిని రామానుజుడు స్థాపించెను. ఈనాటికిని అది "రామానుజ మఠము" అను తిరునామమున వెలసియున్నది. కేరళలో అనేక పండితులు, సామాన్య ప్రజలు రామానుజుని ఆచార్యునిగా స్వీకరించిరి.

ప్రకృతి సుందరమైన కేరళయందు రామానుజుడు కొలది దినములు సంతోషముగా గడపినాడు. పర్వతసానువులు, వృక్ష సంపదతో గూడిన కేరళ ప్రకృతి రామణీయకత రామానుజుని మురిపింప జేసినది. భగవంతుడు త్రిభువన సుందరుడని విశేషించి భావించు రామానుజునకు కేరళదేశము ఎంతయో ఆకర్షణీయము.

కేరళము నుండి రామానుజుడు ఉత్తరముగా పయనించినాడు. కడకు ఉత్తరభారతము నందలి ద్వారకా నగరమును, మధురా

నగరమును, దర్శించినాడు. తానును, కూరేశుడును శ్రీకృష్ణ సంశ్లేష భావమున అతావుల వినోదముగా సంచరించుటయేగాక, అచ్చటి అద్వైత శైవపండితులను సమావేశపరచి, తనసిద్ధాంతమును వారికి నచ్చజెప్పినాడు.

తరువాత రామానుజుడు సాలగ్రామమును, సాకేతనగరమును, బదరికాశ్రమమును, నైమిశారణ్యమును, పుష్కరక్షేత్రమును, అయోధ్యను, బృందావనమును వరుసగా సందర్శించినాడు. ఎక్కడ బట్టినను భిన్నత్వముల వారెల్లరును రామానుజునకు లోబడిరి, వైష్ణవులయిరి, వైష్ణవ మఠముల, దేవాలయముల, మందిరముల నేర్పాటు జేసికొనిరి.

తరువాత రామానుజుడు కాశ్మీరము జేరుట, బోధాయనవృత్తి గ్రంథమును బడయుట జరిగినది. కాశ్మీరమందలి శాక్తేయులను రామానుజు డోడించెను. అచ్చటి శాక్తేయు లసాధ్యులు. వారు ఆది శంకరులకు కూడాయెన్నో ముప్పతిప్పలు పెట్టియున్నారు. వారి తత్త్వము ఎంతటి పాషండమయినను, తర్కమున రామానుజునకు ఢీకొనలేక, ఓటమిని అంగీకరించిరి.

కాశ్మీరము నుండి పయనించుచూ, క్రమక్రమముగా రామానుజుడు కురుక్షేత్రము, ప్రయాగ మొదలగు తావుల సేవించి, వారణాసి జేరెను. ఆనాడు ఉత్తరదేశమున కాశీపట్టణము గొప్ప అద్వైత మత కేంద్రము. అచ్చటి అద్వైతులు రామానుజునితో తర్కమున నిలువలేక పోయిరి. అచ్చటి దేవాలయమున రామానుజుడు పాంచరాత్రాగమ పూజావిధానమును ప్రవేశపెట్టలేక పోయెను. శ్రీరామానుజుడచ్చటనున్న సమయమందు మాత్రము వారా పూజావిధానము నంగీకరించినట్లగపడిరి. కాని రామానుజుడచటి నుండి వచ్చిన వెంటనే వారావిధానమునకు స్వస్తి జెప్పిరి.

శ్రీరామానుజుడు కాశీక్షేత్రము నుండి శ్రీకూర్మమునకు వచ్చెను. అచ్చట దేవాలయము శైవుల అధీనమున నుండినది.

శ్రీరామానుజునకు అక్కడి శైవులకు తర్కము జరిగెను. ఓడినవారు గెలిచిన వారి మతము నంగీకరించునట్లు షరత్తు నేర్పరచుకొనిరి. మూడు దినములు దీర్ఘతర్కము జరిగినది. ఇభయూధ మొక్కసారి మృగరాజునెదుర్కొనినట్లయినది. జయించునది సింహమే గదా ఒక్కటైనను. శైవులు ఓడిరి. విశిష్టాద్వైత సిద్ధాంతము వారికి నచ్చినది. శ్రీకూర్మము నందున్న స్వామి విగ్రహమును విష్ణుమూర్తి విగ్రహముగా మార్చిరి. విగ్రహమునట్లు మార్చుటలో గుర్తునకు ఆ విగ్రహమును ముందున్న స్థలము నుండి కొలదిగా రామానుజుడు తర్కమునకు ఆసీనుడయిన స్థలమువైపునకు త్రిప్పిరి. అట్లు విగ్రహమును త్రిప్పుటచే అప్పుడున్న ధ్వజస్తంభము మార్చుట మంచిదిగాదని భావించిరి. అందువల స్వామి విగ్రహమునకు నేరుగా రామానుజుని సలహా ప్రకారము మరియొక నూతన ధ్వజస్తంభమును నిర్మించిరి. ఈ కారణమున ఈనాడును శ్రీకూర్మములోని ఆలయమున రెండు ధ్వజ స్తంభములున్నవి.

శ్రీకూర్మము నుండి రామానుజుడు సింహాచలమునకు వచ్చెను. సింహాచలము ఒక రమ్యమయిన చిరుపర్వతము. ఈ పర్వత సానువులు ఇరువది, ముప్పది అడుగులు వెడల్పుగల సమతల ప్రదేశములను పైకిపోనుపోను అచ్చటచ్చట కలిగియున్నవి. ఈ ప్రదేశములు బాగుగా ఎదిగిన ముంతమామిడి వృక్షములతో, కదళీఫల వృక్షరాజములతో, అనారసచెట్లతో రమణీయముగా నుండినవి. కొండనెక్కువారు ఇరువైపుల ఈ శృంగార దృశ్యముల తిలకించుచూ పరిమళముల నాస్వాదించుచు, భగవన్నామ సంకీర్తనలు గావించు కొనుచూ, నృత్యగానములతో నడచి, యెక్కుచుందురు. అట్లనే పర్వతావరోహణమును గావింతురు - స్వామి దర్శనమయినదను తృప్తితో, ఈశ్వరశక్తిని త్రిభువన సుందరమని భావించి, సంశ్లేషపడు రామానుజుడు ఈ సుందర పర్వతముపై పొందిన ఆనందము అగణితము.

సింహాచలముపై వేంచేసియున్న నారసింహుని రామానుజుడు సేవించినాడు. రామానుజుని కీర్తి సంపదను ఇప్పటికే వినియున్న

అచ్చటి అర్చకులు, వైష్ణవభక్తులు, వారిరాక కెంతయో సంతోషించిరి. విశిష్టాద్వైత సిద్ధాంతి, ఉభయ వేదాంతప్రవక్తయయిన ఉడైయవర్లు దేవాలయమును దర్శించి, స్వామిని సేవించుట ఆ దేవాలయ స్థల పురాణమునకొక గొప్ప సంఘటన గదా!

సింహాచల దేవాలయ మంటపమున కృష్ణమాచార్యుడను నామాంకితుడు గొప్ప సంగీత విద్వాంసుడు గానము చేయువాడు. భక్తియుక్త సంగీతగానము సన్మార్గ సూచకముగాన రామానుజున కెంతో యిష్టము. ఆ గాన మాధుర్యమును గ్రోలు రామానుజుడు బాహ్యస్మృతిని గోల్పోయి దైవసన్నిధిలో నున్నట్లు భావించి కూర్చొని యుండువాడు.

ఇట్టి మహా విద్వాంసుడును, గాయకుడును అయిన కృష్ణమాచార్యునకొక లోపముండినది - గర్వము. అది స్వగర్వమో, సగర్వమో, కాని తనకంటె విద్వాంసులిక ప్రపంచమున లేరని ఆయనగారి భావము. అతని అహంభావమునకు మేరలేదు. అతడెవరిని సరకుచేయడు. ఎవరివైపును చూడడు. దైవము తన వశముననున్నాడనియు, గానమున నాహ్వానించిన స్వామియే తనకడకు ఏతెంచుననియు, నతడు ప్రగల్భములాడువాడు. ఈతని గర్వము అన్యులకపకారికాదు. కాని అతని పరిపక్వమునకే భంగకరము. ఆ సత్యము నతడు గమనింపలేకపోయినాడు.

మహామేధావియయిన రామానుజుడు అతని తత్త్వమును గ్రహించినాడు. అతని గర్వమును క్షమింపలేకపోయినాడు; అనగా అతడు తన గర్వమున ప్రుగ్గరాదని రామానుజుడుద్దేశించెను; ధనర్దాసును సంస్కరించిన విధమున నీతనని ఉద్ధరింపదలచినాడు; కరుణామయుడు గదా రామానుజుడు!

ఒకనాటి సాయంకాలమున కృష్ణమాచార్యుడు స్వామి మంటపమున కూర్చొని మధురగానమును సాగించుచున్నాడు. కిన్నర, కింపురుష, గంధర్వాదులుసైతము విని సమ్మోహనపడవలసినదే ఆగాన

మాధుర్యమునకు! శ్రీరామానుజుడు శాంతముగాను, సొంతముగాను కృష్ణమాచార్యున కెదురుగా కూర్చొని గానము నాకర్ణించుచున్నాడు. వయస్సున కృష్ణమాచారి రామానుజునికంటె పెద్దవాడు. శ్రీరామానుజుని విషయమున వయస్సునకు ప్రాధాన్యము లేదుగదా! తేజోనిధికి వయసు కారణమగునే? రామానుజుని గురువులే ఆయనకు శరణాగతులై యెంబెరుమానార్ (మాప్రభువా) అని సంబోధించి యున్నారుకదా! కృష్ణమాచార్యుడాదిలో రామానుజుని నరకు చేయలేదు; ఒక ఆచార్యుడు తన మ్రోల ఆసీనుడైయున్నాడని గమనించినట్లే కనబడలేదు; సంగీతమునకు జ్ఞాన, ధ్యాన భక్తితత్త్వములు సాటిగావని అతని భావము, అతని వాదన. సంగీత జ్ఞానమున భక్తివినా సన్మార్గము గలదే, మనసా - అని ఆలోచించినవాడు గాదు కృష్ణమాచార్యుడు.

కృష్ణమాచార్యుడు తన గానప్రదర్శనమును పూర్తిగావించిన తరువాత, రామానుజుడాతని సంగీత కౌశలమునకు అభినందించి, ఆశీర్వదించి, కడపట ఆతనికి శరణాగతి భావవిశిష్టతను గూర్చి బోధించినాడు - స్వార్థరాహిత్య భావము ఎట్లు చేతనుని మోక్ష పథమునకు చేర్చునను రహస్యమును దెల్పినాడు. తిరుమంత్రము (ద్వయమంత్రము) ఎట్లు చేతనుని స్వార్థరాహిత్యుని జేయునో తెల్పినాడు, స్వార్థరాహిత్యునకు గర్వము లేదనియు, తాను దాసానుదాసునిగా ప్రవర్తించుననియు దెల్పినాడు రామానుజుడు. కృష్ణమాచార్యుని యహంభావమను అంధకారమేఘము పటాపంచల యినది; వాస్తవమును గమనింపగలిగినాడు; రామానుజునకు వశమైనాడు. నిజమైన వైష్ణవ భావమును పొందినాడు. కృష్ణమాచార్యుడు ఇట్లు శ్రీరామానుజునకు శరణాగతి కావడము సింహాచలవాసు లందరికిని ఆశ్చర్యమును గలిగించినది.

శ్రీరామానుజాచార్యులవారు సింహాచల దేవాలయమున పాంచరాత్రాగమ పూజావిధానమును ప్రవేశపెట్టినాడు.

ఒకనాడు ఒక వైష్ణవభక్తుడు తిరుపతి నుండి యరుగుదెంచి శ్రీరామానుజున కొక యుత్తరము నందజేసెను. అది తిరుమలనంబి చేత పంపబడినట్టిది.

కూరేశుడు లేఖను పఠించెను. అది శ్రీరామానుజునకు పంపబడిన యొక ఆహ్వానము. తిరుపతిలోని అశేష వైష్ణవభక్తులు కోరికపై పెరియ తిరుమలనంబి రామానుజునకు బంపిన శ్రీముఖమది.

శ్రీరామానుజుడు ఉత్తరదేశయాత్ర పరిసమాప్తి గావించుకొని, తిరుగు పయనమును జేయుచున్నాడను వార్త తిరుపతిలో వైష్ణవభక్తుల కందినది. రామానుజుడిక శ్రీరంగము పయనింప వలసియున్నదికదా? ఈ తరుణమున వారు తిరుపతిని దర్శించుట సులభము. శ్రీరామానుజుని దర్శించుట, వారి బోధనామృతము గ్రోలుట యను కోరికలేగాక తిరుపతి వైష్ణవభక్త కోటికి మరియొక అవసరముండినది. ఆయక్కర తీర్చగలగినవాడు శ్రీరామానుజుడే. ఆహ్వానమును గురుతుల్యులయిన తిరుమలనంబి ద్వారా పంపిన, రామానుజుడు ఆహ్వానమును తోచిపుచ్చక తప్పక తిరుపతికి వేంచేయునని వారు విశ్వసించిరి.

తిరుమల చాలగొప్ప పుణ్యక్షేత్రము. అది ఆళ్వార్లకాలము నాటికే ప్రసిద్ధిలోనుండెను కదా!

ఆకాలమున తిరుమల దేవాలయము శైవదేవాలయమని శైవులును, వైష్ణవదేవాలయమని వైష్ణవులును తర్కించుకొనుచుండిరి. అప్పట్లో శైవుల ప్రాబల్యము అధికముగా నున్నందున, శైవమతావలంబకులయిన రాజులు కంచీపురిని ముఖ్యపట్టణముగా జేసికొని పాలించుచున్నందు వలనను, తిరుమలేశ దేవాలయమును శైవులాక్రమించుకొని, అర్చనల జరుపుచుండిరి. ఇది తిరుమలలోని వైష్ణవభక్తులకు భరింపరానిదై యుండెను. శ్రీరామానుజుని ప్రతిభవలన తిరుమల దేవాలయమును వైష్ణవదేవాలయముగా నిర్ణయింప జేయవలయునని వారు తలంచిరి. తిరుమల దేవాలయము

శైవదేవాలయమా వైష్ణవదేవాలయమా, అను విషయముపై పలుమారు ఇరువర్గములవారు కలహించుచుండిరి. ఒక్కొక్కప్పుడు కొట్లాటలు గూడ జరుగుచుండినవి. ఈ కలహముల నంతమొందింప జేసికొన వలయుననియు, శైవులు వారివితండవాదనలను మానునట్లు జేయవలయుననియు, వైష్ణవులు ప్రయత్నించిరి. ఇందులకు తగినవాడు శ్రీరామానుజుడే యని అందరు తలచిరి.

తిరుమల వైష్ణవాలయమును గూర్చి స్థలపురాణమేమని తెల్పుచున్నది? తిరుమల ప్రారంభమున వైష్ణవక్షేత్రమట. తిరుపతికి సమీపముననున్న నారాయణ వనమును ప్రదేశమును ఆకాశరాజు అను ప్రభువు పాలించుచుండెనట. అతనిరాజ సౌధము చుట్టును ఎత్తైనకోటయు, లోతైన అగడ్తయు నుండెడివట. అతని కుమార్తెయయిన పద్మావతీదేవి తిరుమల స్వామి యయిన శ్రీనివాసుని వరించి కల్యాణమాడినదట. ఆకాశరాజున కొక సోదరుడుండెనట. అతని నామధేయము తొండమానట. ఈ తొండమానుడే మొట్టమొదట తిరుమలపై వేంకటరమణుని ఆలయమును నిర్మింపజేసెనట. ఆకాశరాజు మరణానంతరము రాజ్యము కొరకు అతని కుమారుడును, తమ్ముడు తొండమాను యుద్ధమునకు తలపడిరట. ఆ యుద్ధమున జయము నర్థించిన భక్తుడయిన తొండమాను వేంకటరమణుని ప్రార్థించెనట. శ్రీనివాసుడు తనపాంచజన్య సుదర్శనములను తొండమానుకు సహాయముగా పంపెనట. అప్పటి నుండి తిరుమల క్షేత్రముననున్న స్వామి వేంకటరమణుని విగ్రహహస్తముల యందున్న శంఖచక్రములు లేవట. ఇది పురాణగాథ. (ఈ పురాణగాథను పామరులు, భక్తులు, తత్త్వవేత్తలు అందరు గౌరవింతురుగాని, వారి వారి దృక్పథములు వేరు. గ్రంథవిస్తరణ వలన ఇట్టి వన్నిటిని విశదీకరింపసాధ్యముకాదు. కాని తత్త్వవేత్త సత్యమును పాటించు చుండునని గమనింపదగును. భక్తుడు సర్వమును ప్రేమమయముగా భావించును. పామరుడు మూఢ విశ్వాసము వలనైనను సజ్జనత్వమును పొందుచునే యుండును).

శంఖచక్రములు లేనందున దానిని శైవవిగ్రహ మని శైవులు వాదించిరి.

దేవాలయ స్థాపన విషయమట్లుండనిమ్ము. ఇక దేవాలయ పూజా విషయముగా నున్న కథను పరిశీలింతము. తిరుమల దేవాలయము యొక్క ప్రథమార్చకుడు గోపినాథుడనువాడట. అతడు వైష్ణవభక్తుడట. తరువాత కాలమున నొకప్పుడొక పూజారి స్వామివిగ్రహముపై నున్న నగలను తస్కరించినాడట. అప్పట్లో దేవాలయము నారాయణవనము నేలుచుండిన రాజుయొక్క అధీనమున నుండెనట. రాజు పూజారిని దండించి, మరియొక అర్చకుని నియమించెనట. తరువాత కాలమున సంభవించిన ఘటన లెవరికిని తెలియవు. ఇటీవల కాంచీపుర రాజులు శైవులగుటంజేసి, వీరి ప్రాబల్యము తిరుపతినిదాటి ఉత్తరదేశము కొంతవరకు వ్యాపించియుండుటంజేసి, శైవులు రాజాదరణను పొంది, తిరుమల దేవాలయమును స్వాధీనము జేసికొని, పూజలు జరుపు చుండిరి. ఇది ప్రస్తుతపు కథావిశేషము - పరిణామము.

తిరుపతి, తిరుమలకు జెందిన వైష్ణవభక్తులు సమావేశపడి, అన్ని విషయముల చర్చించుకొని, కడకు సత్యమును వెల్లడించుటకు తిరుమల దేవాలయమును వైష్ణవాలయముగా మార్చవలయునని కుతూహలపడిరి.

వైష్ణవులయొక్క యీ నిర్ణయము శైవుల చెవుల పడ్డది. శైవులును సమావేశమై తిరుమల దేవాలయమును తన అధీనముననే యుంచుకొన వలయునని దృఢసంకల్పులయిరి.

ఇత్తెరంగున శైవులు, వైష్ణవులు ప్రయత్నించు ఫలితముగా వారిమధ్య ద్వేషము దినదినాభివృద్ధి నందినది. వాగ్వాదములు మెండాయెను. పలుమారు కొట్లాటలకు గూడా తలబడు చుండిరి. సామాన్య ప్రజలు ఒక విధముగా విసుగెత్తుచుండిరి. ఏదో ఒక నిర్ణయము జరుగుట సంఘమునకు శుభప్రదమనియు, శాంతిదాయక మనియు తలంచిరి.

వైష్ణవుల మూకబలము తక్కువగా నుండెను. అందువలన ఉపాయము వలననే వారి యాశయము నెరవేరవలసి యుండెను.

అప్పట్లో నారాయణవనమున యాదవరాయలను ప్రభువు పాలించుచుండెను. అతడు పలుమారు తిరుమలేశుని దర్శనమునకు వచ్చువాడు. ఆయన సాధువు, ఉన్నత మనస్కుడు, న్యాయబుద్ధిశాలి, వీరిని మధ్యవర్తిగా నేర్పాటు జేసికొని తమకోరికను నెరవేర్చుకొనుట ఉచితమని వైష్ణవులు భావించిరి. వారు యాదవరాయల సన్నిధికేగి వారికోరికను దెల్పిరి.

యాదవరాయలు విశాలహృదయుడు. అతడు ఆధ్యాత్మిక చింత గలవాడు. గొప్ప కర్మయోగి. బ్రహ్మ విష్ణుమహేశ్వరులను త్రిమూర్తి రూపములు అనంత పరబ్రహ్మయేనని అతని విశ్వాసము. అతనికి శైవమన్నను, వైష్ణవమన్నను సమానములే. అందువలన శైవులు, వైష్ణవులు అనవసరముగా కలహించుట ఆయన కిష్టములేదు. మధ్యవర్తిత్వము వహించి, వారిమధ్య సామరస్య మేర్పరచుటకు రాజు నమ్మతించెను.

యాదవరాయలు తిరుమల నుండి శైవుల పెద్దయయిన శివజ్ఞాని రప్పించినాడు; ఆయనతో తర్కించినాడు; శివజ్ఞానుడు సైతము యాదవరాయల మధ్యవర్తిత్వమునే కోరినాడు. విషయ పరిష్కారము మంచిదన్నాడు. శీఘ్ర విషయ పరిష్కారమును ఇరువర్గముల వారు బలపరచిరి. కారణమేమనగా ప్రతియొక్కరు వారే జయప్రదులమగుదుమని భావించిరి. వారి విశ్వాసములు అంతటి దృఢముగా నుండినవి. కావున యాదవరాయలు యిరువర్గముల వారికి తాను మధ్యవర్తిగా నుందునని తెల్పెను.

తిరుమల తిరుపతిలలో శైవులకు శివజ్ఞానుడు నాయకుడుగా నుండెను; అతడు గొప్పజ్ఞాని, పండితుడు, శాస్త్రవేత్త, తార్కికుడు. కాని వైష్ణవులకు తగిన నాయకుడు లేకుండెను. వైష్ణవ గురువులయిన శ్రీశైలపూర్ణుడు చాల వృద్ధుడు; ఆ వయసున్న నాతడు

తర్కవాదములలో ప్రవేశింపలేరు. వారి సహాయమున, సహకారమున, శ్రీరామానుజుని పిలిపించిన, ఆయన వైష్ణవ పక్షమున నాయకత్వమును వహించగలడని వైష్ణవులు తలంచిరి.

అందువలన శ్రీశైలపూర్ణుడు రామానుజునకు ఆహ్వానము నంపెను. ఈయాహ్వానము శ్రీరామానుజునకు ముదావహ మయినది. వయోవృద్ధుడు, జ్ఞాన వృద్ధుడు, మేధావి, మహాభక్తుడు, సాధువు, గురువు, పితృసముడును అయిన తనమేనమామ గారయిన పెరియ తిరుమలనంబి తన్నాహ్వానించుట యనునది రామానుజున కెంతో ఆనందోత్సాహముల చేకూర్చినది. తిరుమలకు పోవలయునని రామానుజుడు ముందుగనే తలంచి యుండెను. దానికి తోడు, తన కోరికను మన్నించు విధమున ఈయాహ్వానము కుదిరినది. ఇది యంతయు భగవత్సంకల్పమని రామానుజుడు తలంచెను. తిరుమలనంబినుండి వచ్చిన శ్రీముఖమును కూరేశుడు చదువగా అందరు సంతోషించిరి. లేఖ దెచ్చిన భక్తులద్వారా రామానుజుడు తన నిశ్చయమును తిరుమలనంబికి తెల్పెను. ఈ విషయమునే కూరేశుడు క్లుప్తముగా ఒక లేఖను వ్రాసెను. తిరుపతి నుండి వచ్చిన భక్తులు పెన్నిధినిగన్న పేదలవలె మహదానందమున రామానుజునకు నమస్కరించి వెడలిరి.

తరువాత శ్రీరామానుజుడు ఏకాంతముగా నాసీనుడై ధ్యానించుచు, పూర్వము తాను తిరుపతి తిరుమలలో జూచి ఆనందించిన ప్రకృతి సౌందర్య దృశ్యముల మనస్సునకు దెచ్చుకొని పరమానంద భరితుడాయెను. పునర్దర్శన భాగ్యమునకు ఎదురుజూచు వాడాయెను.

శ్రీవైష్ణవులు పక్షమున వాదించుటకు విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవక్త రామానుజుడు వచ్చుచున్నాడను వార్త తిరుపతి, తిరుమల యింకను చుట్టుప్రక్కల ప్రదేశములందు ప్రసరించెను. వివాద పరిష్కార వ్యాజమున తాను రామానుజుని దర్శింపగలనుగదా అని యాదవరాయలు పరమోత్సాహియై రామానుజాగమనము కొరకు నిరీక్షించుచుండెను.

శ్రీమద్రామానుజాచార్యుల వారు శిష్యగణ సహితముగా తిరుపతి చేరినారు. మార్గమున ఎన్నోచోట్ల గ్రామవాసులు వారిని దర్శించుకొని ఆశీర్వాదముల బొందిరి. తిరుపతి వైష్ణవ భక్తబృందము వారు వారికెదురేగి స్వాగతము పలికిరి. వృద్ధుడయిన శ్రీశైలపూర్ణుడు కూడా ఆ వైష్ణవ బృందమున నుండెను. శ్రీశైలపూర్ణుని గాంచగనే రామానుజుడు సాష్టాంగపడినాడు. శ్రీశైలపూర్ణుడు రామానుజుని వాత్సల్య గౌరవభావముల లేవనెత్తి ఆశీర్వదించి అలింగనము గావించు కొనెను. అందరు తిరుమలకు వెళ్లినారు. సప్తగిరులావల స్వామి ఆలయ సమీపమున నిరీక్షించుచున్న యాదవరాయలు రామానుజునకు నమస్కరించి, వారియాశీర్వచనముల బడసిరి.

శ్రీరామానుజుడు వెంటనే శ్రీనివాసుని దర్శించి సేవించినాడు. వైష్ణవ భక్తులను, వైష్ణవ పండితులను కలుసుకొని సంభాషించినాడు. మరునాడు జరుగవలసిన తర్కవాదమునకు తగిన యేర్పాట్లను గావింపవలసినదిగా ఆజ్ఞాపించినాడు.

మధ్యవర్తిత్వ న్యాయస్థానమును యాదవరాయలు ఆక్రమించి నాడు. ఒకవైపున శైవులందరు శివజ్ఞానుని నాయకత్వమున ఆశీనులై యున్నారు. వారికెదురు పక్షమున భగవద్రామానుజాచార్యుల నాయకత్వమున వైష్ణవులు కూర్చొని యున్నారు. తానోడిన పక్షమున, తిరుమలేశుడు విష్ణుదేవుడని సమరస భావమున తానంగీకరింతునని శివజ్ఞానుడు వాగ్దానము జేసెను.

తర్కము ప్రారంభమయినది. ప్రశాంతముగా ఇరుపక్షములవారిచే స్థలపురాణములు పరిశీలింపబడినవి. యాదవరాయల అధ్యక్షతన ఘర్షణలు లేక తర్కవాదములు ప్రశాంతముగా జరిగినవి. ఇరు పార్శ్వపు వారును సావధానముగా చర్చల వినుచుండిరి.

కడపట తిరుమలేశుడు విష్ణుదేవుడని నిర్ణయించుటకు రామానుజుడు చారిత్రక, గ్రంథ ఆధారముల జూప దొడగెను - దేవాలయమును మొదట నిర్మించిన తొండమానుడు వైష్ణవుడని

రామానుజుడు నిరూపించెను. దీనికి శివజ్ఞానుడు సమ్మతించెను. ఆ దేవాలయమున మొదటి అర్చకుడు గోపినాథుడు వైష్ణవుడని రామానుజుడు నిరూపించెను. ఇందులకుగూడ శివజ్ఞానుడు సమ్మతింపవలసి వచ్చెను. మరియు అనేక తమిళ గ్రంథముల నుండి రామానుజుడు ప్రమాణముల జూపదొడగెను. ప్రాచీనకాలమున వెలసిన ఆళ్వారులు వైష్ణవభక్తులు గదా! వారిలో తొమ్మిదిమంది స్తుతించినట్లు వారి రచనలు వెల్లడించుచున్నవి గదా! కావున ఇది వైష్ణవ దేవాలయమని కాదని యెవరనగలరని రామానుజుడు హెచ్చరించెను. ఈ విధముగా రామానుజడు చరిత్రాధారములను, గ్రంథాధారముల జూపుచూ, ఆదిలో తిరుమలేశుని దేవాలయము వైష్ణవాలయమని నిరూపింప గల్గెను. అందువలన దానిని శైవాలయముగా జూపుటకు వాదించుటకును శివజ్ఞానునికి వలనుపడలేదు. శైవులు చూపుచుండిన ఆధారములు మధ్యకాలమున సంభవించి నట్టివి.

చర్చలు ఈ విధముగా సుదీర్ఘముగా వారము దినములు జరిగినవి. కడపట యాదవరాయలు తన తీర్మానమును వచింపవలసి యుండెను. అతడు చాకచక్యముగా నొకపద్ధతిని అవలంబించెను. శివజ్ఞానుని స్వయముగా తన అభిప్రాయమును వెల్లడింపుమని కోరెను. జ్ఞానియు, సమరస భావనగలవాడును, వివేకియునయిన శివజ్ఞానుడు మారాడక రామానుజుని సమంజసముగా నున్నదని సమ్మతించెను. అనగా ప్రథమమున తిరుమలేశుని దేవాలయము వైష్ణవాలయముగా నుండెననియు, తరువాత కాలములో శైవుల ప్రాబల్యముననను, వారికున్న రాజాదరణము వలనను దానిని శైవాలయముగా పరిగణించుట జరిగినదనియు, తేలినది. ప్రస్తుతము ఈ చర్చ జరుగు నప్పటికి శైవులు ఆ దేవాలయముపై అధికారము గలిగియుండిరి

ఇట్లు సంతోషముగా, పరస్పర సహనముతో, అందరును సత్యమును గ్రహించిరి. ఆనాడు మొదలు మరలా తిరుమలేశుని విష్ణుదేవునిగా భావించడము, సక్రమముగా వైష్ణవాగమ పద్ధతిగా

అర్చనలు జరగడము ప్రారంభమయినది. మధ్యకాలములో నైనను కొంతకాలము శైవులు ఆదేవాలయముపై అధికారమును గలిగి యుండిరిగాన, శైవపద్ధతిలో గూడా అచ్చట అర్చనలు గావించుటకు వైష్ణవు లంగీకరించిరి. వైష్ణవులకు సమానముగా శైవులకు గూడ అర్చన, ప్రార్థన దర్శనాదికారములుండు నట్లు అంగీకరింపబడినది. అందువలన హిందువులెల్లరుకును తిరుమల యీనాడు పుణ్యక్షేత్ర ముగా వెలయుచున్నది.

శ్రీరామానుజుడు శివజ్ఞానుని అభినందించి ప్రశంసించినాడు. అతడు ప్రదర్శించిన విశాల హృదయము నిజముగా ప్రశంసనీయము గదా! నిజమైన విజ్ఞాని లక్షణమంటే.

వైష్ణవులకును, శైవులుకును ఘర్షణ లేకుండా, వారు సామరస్యమున బొందుట సామరస, సహనశీలుడయిన యాదవ రాయలకు మహాదానందమును చేకూర్చినది.

తరువాత నొక శుభలగ్నమందు వైష్ణవ విగ్రహముగా తిరుమలేశ విగ్రహమును శాశ్వతముగా రూపొందించు సందర్భమున రామానుజుడు విగ్రహమునకు శంఖ చక్రముల నమర్చినాడు. విష్ణుమూర్తి పంచాయుధములలో సుదర్శనము, పాంచజన్యములు ప్రాధాన్యములుగా! భగవచ్ఛక్తి (సర్వవ్యాపితమైన ఈశ్వరశక్తి) స్వరరూపి. ఇందుకు సాంకేతికము పాంచజన్యమను శంఖము. భగవత్శక్తి కాలాతీతము. కాలమునకు చిహ్నము సుదర్శనమను చక్రము.

శ్రీరామానుజుడు తరువాత తిరుమలేశ విగ్రహ ముఖమును ఊర్ధ్వ పుండ్రములతో నలంకరించెను. ఊర్ధ్వపుండ్రముల సాంకేతిక భావమేమి? సహజముగా తమోగుణ ప్రధానుడయిన చేతనుడు సత్త్వగుణ ప్రధానమయిన రజోగుణుడు కావలయునని భావము. తాను లోక కల్యాణార్థమై కార్యదీక్ష వహించెదనని చేతనుడు ఊర్ధ్వపుండ్ర సాంకేతికము ద్వారా ప్రకటించుకొనుచున్నాడన్నమాట. ఇదియే గాయత్రీమంత్ర ప్రభావము.

తరువాత తిరుమలేశ విగ్రహమునకు ఉపాయ అభయ హస్తములను గూర్చి వివరించినారు రామానుజుడు. ఒక హస్తము దైవమునకు శరణాగతివిగమ్మని సూచింపగా, రెండవహస్తము శరణాగతుడయిన భక్తునకు అభయమును అనగా రక్షణను సూచించుచున్నది. భగవద్గీతలోని చరమశ్లోకమును తిరుమంత్రార్థ మును అయిన

"సర్వధర్మా౯ పరిత్యజ్య। మామేకం శరణంవ్రజ ।
అహంత్వా సర్వపాపేభ్యో। మోక్షయిష్యామి మాశుచః" ॥

అను శ్లోకార్థమును ఈ రెండు హస్తములు సూచించుచున్నవి.

శ్రీరామానుజుడు తిరుమలేశ విగ్రహమున కీమార్పులు, చేర్పులు గావించి, పాంచరాత్రాగమ విధానముగా పూజ, అర్చనలు, ప్రార్థనలు జరుగనట్లేర్పాట్లు గావించెను. శైవులును వైష్ణవులును రామానుజుని అధ్వర్యమున శ్రీనివాసునకభిషేకము గావించి, తమతమ పద్ధతులలో అర్చనలు గావించుకొన్నారు. ఉభయవేదపారాయణము గావింప బడెను. ఈ దృశ్యమును తిలకించిన అశేషప్రజానీకము మతభేదముల మరచి, శ్రీనివాసుని దర్శించి ఆనందించిరి. ఉపాయ అభయ హస్తములతో శ్రీనివాసుడు శ్రీవేంకటేశ్వరుడాయెను. (వేం=పాపమును, కటః = నాశనము జేయునట్టి, ఈశ్వరుడు = ప్రభువు అయెను)

శ్రీరామానుజమతసిద్ధాంత ఫలితముగా శ్రీతిరుమలేశ దేవాలయము క్రమక్రమముగా యావద్భారతావనికి యాత్రాస్థల మయినది. తిరుమలేశుడు సంపదలనొసంగు శ్రీనివాసుడేగాక, పాపముల హరింపజేయువేంకటేశ్వరుడును అయినాడుగాన భక్తులకు ఎనలేని ప్రముఖ స్థానమయినది తిరుమల.

శ్లో॥ శ్రీవేంకటేశ్వర శ్రియ మనుపద్రవా మనుదినం సంవర్థయ ।
శ్రీవేంకటేశ్వర శ్రియ మనుపద్రవా మనుదినం సంవర్థయ॥"

అని రామానుజులు స్వామికి మంగళాశాసనము గావించినాడు. ఆచార్యుల వారి మంగళాశాసనము సత్యమయినది, ఫలప్రద మయినది గదా!!

తిరుమలదేవాలయ సుస్థిరతకు రామానుజుడిట్లు శ్రమపడినారు. మన దేశములోని అశేష వైష్ణవాలయములో అత్యున్నత కీర్తిని బొందియున్న శ్రీరంగములోని రంగనాథాలయమును, తిరుమలపై వెలసిన శ్రీవేంకటేశ్వరాలయమును ఈ విధముగా రామానుజుని జీవితమునకును, ధ్యేయమునకును విశిష్టాద్వైత సిద్ధాంత సత్యము నకును (అనగా రామానుజ మతమునకును) ముడిబడి యున్నవి.

దేవాలయ సుస్థిరతను ఈ విధము గావించిన రామానుజుడు మూడు దినముల సమావేశములందు అశేష భక్తులనుద్దేశించి, విశిష్టాద్వైత సిద్ధాంతమును గూర్చి ప్రచారోపన్యాసముల గావించెను.

"భక్తజనులారా! ఆధ్యాత్మిక చింతనులారా! జీవిత సత్యమును కనుగొని, సంతోషముగా తృప్తితో జీవితమును గడుపుకొనుడు. విశ్వమానవ సౌభ్రాత్ర భావమున లోకకల్యాణార్థమై జీవించుటయే జీవిత పరమావధి. అట్టి జీవితము చేతనునికి శాంతి నొసంగును; సంఘమునకు క్షేమకరమగును. మానవుడు అజ్ఞానాంధకారమున మూఢ విశ్వాసములతో నుండరాదు; ఇది సతతము భయ సందేహముల గలిగించుచుండును; దురాలోచనలకు, దుష్కార్య ములకు మానవుని ప్రేరేపించును. స్వార్థరాహిత్యము, విశ్వమానవ సోదరభావము, సేవాతత్పరత అనునవి చేతనుని సదాలోచనముకును, సత్కార్యములకును ప్రేరేపించును. ఇదియే గాయత్రీ మంత్ర భావము.

ఈ సత్యమునకు మతము ఎట్లు తోడ్పడవలయును, తోడ్పడు చున్నయది? అనునది ప్రశ్న.

నేను ప్రబోధించు విశిష్టాద్వైత సిద్ధాంతము శాస్త్రీయమయినది; సత్యమైనది. అచిత్, చిత్, ఈశ్వర అనునవి తత్త్వత్రయములు. విశ్వమంతయు ఈ మూడు తత్త్వములుగా విభజింపబడియున్నది. తత్త్వత్రయముగాక పరముగా నేదియునులేదు. విశ్వములోని జడపదార్థమంతయు అచిత్. ఇది ఘన, ద్రవ, వాయుపదార్థ సమ్మేళనముగాగాని, వేర్వేరుగాగాని, ఉన్నవి. ఈ అచిత్ పదార్థము

ప్రాణశక్తితోగూడి చిత్ (ప్రాణులు లేక జీవులు) అనబడుచున్నది. ఉదాహరణమునకు, రాయి అచిత్. జంతువు ప్రాణమున్నంతవరకు చిత్‌రాశికి చెందినది; ప్రాణము పోయిన తరువాత మిగిలియున్న కళేబరము అచిత్. ఇక ఈశ్వరశక్తియుననదేమిటి? ఇది అవాఙ్మానస గోచరమయిన అవ్యక్తశక్తి. ఈ శక్తి జడపదార్థములో నుండుటచేతనే ఆ జడపదార్థములోని అణువులు ఒండొంటితో నతుకుకొని, సమన్వయపడి, ఒక వస్తురూపమున కన్పట్టుచున్నది. ఈ శక్తి చిత్‌నందు అనగా జీవులయందు కూడా వ్యాపించి యున్నది. జీవులందు "నేను" అను భావమును కలిగించు శక్తి ఈశ్వరశక్తి. కావున ఈశ్వరశక్తి చేతనుల యందును అచేతనుల యందును సర్వత్ర వ్యాపించియున్నది. కావున ఇదియే వైష్ణవశక్తి యనబడుచున్నది. ఇది సత్యము; అచిత్ కూడా సత్యమే; చిత్ కూడా సత్యమే. ఈ తత్త్వత్రయములు నిత్యములు; ఆది మధ్యాంతరహితములు. ఇందులో చిత్ అచిత్‌లకు మధ్య కాలమున రూపభేదము, స్థితిభేదము సంభవించుచుండును. ఇట్లు విశ్వము నావరించియున్న యీ విశ్వశక్తి వైష్ణవశక్తి; ఈ సత్యము నెరిగి జీవించువాడే వైష్ణవుడు; విశిష్టాద్వైతి.

మహాజ్ఞానియయిన విశిష్టాద్వైతికి ప్రత్యేకించిన దైవమూర్తి లేడు. ప్రత్యేకించిన కట్టు. జుట్టు, బొట్టులేవు. విశిష్టాద్వైత భావము కట్టు, జుట్టు, బొట్టు, బువ్వ, అలవాటు, ఆచారములయందు వ్యక్తముగాదు. మానసిక తత్త్వజ్ఞానమునను, దీనిచే ప్రేరేపింపబడు స్వార్థరాహిత్య సేవాకార్యములందును ఈ విశిష్టాద్వైత భావము బహిర్గతము కావలసి యున్నది.

వాస్తవముగా తత్త్వత్రయ జ్ఞానము కలిగినపుడు మానవుడు ఈశ్వర శక్తిని నిర్గుణముగాను నిరాకారముగాను ఊహించి, ధ్యానించు చుండుట మాత్రము చాలదు, తగదు. మరియు ఈశ్వరశక్తి తప్ప సర్వమును మిథ్యయని తలంచుటయు తగదు.

చిత్, అచిత్ భాగములు పరిణామము జెందుచుండును. ఆయా పరిణామములు ఆయాసమయములయందు సత్యమే. ఈ

పరిణామము కూడా వైష్ణవశక్తియొక్క ప్రభావము. ఈ వైష్ణవశక్తిని అనంతకల్యాణ గుణమూర్తిగా నూహించుకొనుట తగియున్నది. ఈ మూర్తిని పరశక్తిగా భావించి, ధ్యానించుటయా, లేక ఈ అనంత కల్యాణ గుణమూర్తితో సంశ్లేషించి జీవించుటయా అనునది గమనింపవలసిన విషయము. ఈ రెండవమార్గము సరియయినది. ఇది మానవుని పరమానందస్థితిలో నుంచును.

ఉపనిషత్సూచకమగు నీ యీశ్వరశక్తిని విశ్వమూర్తిగా, సహస్రనామ గుణమూర్తిగా ఊహించుకొనుటెట్లు? ఈసారస్వతమునే శిల్పి శేషశాయియగు మూర్తిని శ్రీరంగనాథ విగ్రహమున దెల్పి యున్నాడు.శ్రీరంగనాథ విగ్రహమును సేవించుట యనగా విశ్వశక్తిని అర్థము చేసికొనుటయే యగును.

అట్టి ఈశ్వరశక్తిని గ్రహించిన మీదట మానవుడు స్వార్థరహితుడై శరణాగతి తత్త్వము నవలంబింపవలయును. పరమపదస్థానమునకు ఇది ఉపాయమగును. అందువలన శ్రీవేంకటేశ్వరస్వామి హస్త ద్వయము ఉపాయ అభయముల సూచించునుగాక-ఇది గీతా చరమ శ్లోకార్థమగుచున్నది (శ్లో॥ సర్వధర్మాన్ పరిత్యజ్య - మామేకం శరణం వ్రజ - అహంత్వా సర్వపాపేభ్యో - మోక్షయిష్యామి మాశుచః)

ఈ ఉపాయ, అభయములతో గూడిన యీ శ్లోకార్థము నుపాసించుటయే తిరుమంత్ర మగుచున్నది - అది "ఓం నమోనారాయణాయ" - అనునది.

మానవుడు తత్త్వత్రయ జ్ఞాన సత్యమును బొంది, తత్ఫలితముగా స్వార్థరాహిత్య భావము నలవరచుకొని, ఈశ్వరశక్తికి శరణాగతి కావలయును; స్వార్థరాహిత్య భావమున సర్వారంభ పరిత్యాగియై కర్మఫలసన్న్యాసియై లోకకల్యాణార్థము దయార్ద్ర హృదయుడై కార్యముల చేయుచుండవలయును. అట్లు ప్రవర్తించిన మానవుడు పాపకార్యములకు దూరముగా నుండును; మోక్ష భావమున పరమానందముగా జీవించును - అని భావము.

భక్తులారా! ఈ సత్యమును తెలిసికొనుడు. ఇందు కృత్రిమము లేదు; ఏ మతమునకును విరోధ భావము లేదు.

ఆచారమును మతమని భ్రమపడకుడు.

విశిష్టాద్వైతమనున దొక దర్శనము. ఇచ్చట నీవు పలాని దేవతను ప్రార్థింపమని, అర్చించమని లేదు. సర్వవ్యాపితమయిన వైష్ణవశక్తి యొక్క అనంతకల్యాణ గుణమూర్తితో సంశ్లేషించి జీవింపమని యీ దర్శనము సూచించుచున్నది.

విశిష్టాద్వైత సిద్ధాంత ప్రచారమునకు పూర్వమే వైష్ణవమతము, శైవమతములనునవి యుండినవికదా! ఇప్పుడు నేను విశిష్టాద్వైత సిద్ధాంతమును ప్రచారము చేయునపుడు ఇది వైష్ణవమతమని, శైవమునకు విరోధమని యనుట తప్పగును.

వైష్ణవమతము చాలకాలమునుండి యుండినది. వారు దైవమునకు ఒకమూర్తిని అపాదించుకున్నారు. పురాణములలో తెల్పబడిన త్రిమూర్తిలలో విష్ణుమూర్తిని వారుదేవునిగా నిర్ణయించుకున్నారు. అటులనే శైవులు శివుని దైవరూపముగా నిర్ణయించుకున్నారు.

వాస్తవార్థముల గమనించిన, భగవత్శక్తి సర్వవ్యాపితమయినది అని విశ్వసించువాడు వైష్ణవుడు. ఈసందర్భమున, ఈ భావమున వైష్ణవుడు కానివాడెవడు?

భగవచ్ఛక్తి శుభమును చేయునది యని తలచి, ఆ శక్తిని శుభస్కరుడు శంకరుడు, శివుడు అని భావించువారియెడ తప్పేమి యున్నది? అందువలననే కదా యిచట శైవులు వైష్ణవులు సమానముగా శ్రీవేంకటేశ్వరుని అర్చించుకొనుచున్నారు? కావున విశిష్టాద్వైత మతమునకును వైష్ణవుల శైవులకలహములకును ఏలాటి సంబంధము లేదు.

తత్త్వత్రయ జ్ఞానముతో ఈశ్వరశక్తి శివమైనది, శుభస్కరమైనది అని చెప్పువారి సిద్ధాంతము శివవిశిష్టాద్వైతమగును. తత్త్వత్రయ

జ్ఞానముతో ఈశ్వరశక్తి సర్వవ్యాపితమయినదనియు, అది శివమును, రుద్రమును అయియున్నదనియు భావించువారి సిద్ధాంతము వైష్ణవ విశిష్టాద్వైత మగును. ఇందు సామ్యత యున్నదేగాని, భేదము లేదు. ఈశ్వరశక్తి కేవలము శివము అని చెప్పుటకంటే అది శివమును, రుద్రమును అయిన వైష్ణవశక్తియని చెప్పుటయే సరియగును.

శైవులు శివుడను ఆకారమున భగవచ్ఛక్తిని ఆరాధించు చుండగా, వైష్ణవులనువారు విష్ణుమూర్తి ఆకారమున భగవచ్ఛక్తిని ఆరాధించు చున్నారు. ఈ రెండు రూపములు పురాణములందు కల్పింపబడినవి.

ప్రత్యేకముగా విశిష్టాద్వైత సిద్ధాంతమును తెల్పునది పూజలు, ప్రార్థనలు గావు; తత్త్వత్రయ జ్ఞానముతో ఈశ్వరశక్తియందు సంశ్లేషించి జీవించుట యగును. ఇదియే మోక్ష పథము.

ఆళ్వారాదులు వైష్ణవ సంశ్లేషభావమున జీవించి తరించినవారు. పురాణాదులయందు పేర్కొనబడిన ప్రహ్లాదుడు, భీష్ముడు విశిష్టాద్వైతు లని చెప్పనగును. రామునకు శరణాగతియయిన విభీషణుడు ఈ కోవకు జెందినవాడు.

ఉపనిషత్తులు, ఆగమములు, ద్రావిడ వేదము అను ఈ మూడును ఈ తత్త్వమునే వెల్లడించుచున్నవి. సంస్కృతముననున్న వేదాంతమును, తమిళముననున్న ఆళ్వారాదుల రచనలలోని వేదాంతముతో సమన్వయ పరచుటచేత విశిష్టాద్వైతము ఉభయ వేదాంతమై యొప్పుచున్నది. అతి ప్రాచీనులయిన ఋషుల అనుభవములును, ఆళ్వారుల అనుభవములును ఈ ఘన సిద్ధాంతమునే వెల్లడించుచున్నవి.

తత్త్వత్రయములు ఏకీభావము కలిగియున్నవి. ఈశ్వరశక్తి జీవులకును, ప్రకృతికిని ఆత్మయై యున్నది. కావున ప్రకృతియు, జీవుడును రెండును ఈశ్వరశక్తికి శరీరములగుచున్నవి. ఈశ్వరశక్తికి చిత్ అచిత్‌లు ఆధారములై యున్నవి. చిత్, అచిత్‌లకు ఈశ్వరశక్తి ఆధారముగానున్నది. ఇదియే విశిష్టాద్వైతమునకుగల ప్రధాన ప్రతితంత్రము. మరి యే దర్శనమునకుగాని లేని విశేషమిది.

చిత్, అచిత్ అను రెండును స్థూలముగా పరిణమించుటయే సృష్టినైర్గుణ్యము (నిర్గుణము) సగుణమునకు వ్యతిరేకము కాదు.

ప్రాకృతగుణములను సత్త్వ, రజః, తమోగుణములు ఈశ్వర స్థమగు శరీరమున గాన్పించును. జీవుని పరిస్థితికి జీవుడే, వాని పరిసరములే కారణములు

ఈశ్వరశక్తియందు అనంతకల్యాణ గుణములున్నవి. ఈశ్వరశక్తి లోపించుటచే అల్పగుణములు చేతనుని యందుకన్పడును. ఈశ్వరశక్తి సంపూర్ణముగా నొక అంశమున నున్న శరీరము. తేజోమయమై, సర్వమంగళ గుణసంపన్నముగా నుండును. అది కొరత బడిన కొలది శరీరమున అవయవ దోషములుండును; మనస్సు యొక్కయు శరీరము యొక్కయు అసమర్థతలు కనబడును. అవగుణము లగబడును. కావున శరీరము యొక్క భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక దోషములకు ఈశ్వరశక్తి కారణము కాదు. ఈశ్వరశక్తి లోపించినందు వలననే అవలక్షణములు గోచరించును.

వెలుతురు లేనపుడు చీకటి; చీకటి యనగా వెలుతురు లేమి. అంతేగాని, చీకటి యనునది వెలుతురు యొక్క గుణము కాదు. నీటిలో చెట్టు పెరుగును; నీరు లేక చెట్టు ఎండును. ఎండుట నీటి యొక్క గుణము కాదు. అట్లే మనదోషములకు ఈశ్వరశక్తి కారణము కాదు; కాని మన ఔన్నత్యమునకు ఈశ్వరశక్తి కారణమగుచున్నది. అందువలన యామునాచార్యులు మున్నగు వైష్ణవభక్తులు ఈశ్వరుడు అనంత కల్యాణ గుణాకరుడని తెల్పి, సర్వసుగుణ సంపన్నమయిన త్రిభువన సుందరాకారముగా విష్ణుమూర్తి రూపమును సృష్టించుకున్నారు. ఇచట మూఢవిశ్వాసములకు తావులేదు.

ఈశ్వరశక్తి ప్రకృతియందు ప్రకృతి సమ్మేళనమున అనేక విధములయిన శక్తులుగా కన్పట్టుచున్నది - ప్రాణశక్తి, జ్ఞానశక్తి, ఆకర్షణశక్తి, ధర్మశక్తి మొదలగు అనేక శక్తులు. ఇదియే ధర్మభూత జ్ఞానము. అందువలన భక్తులు ఈశ్వరశక్తిని అలంకారయుక్తముగా

విభుడు, వాసుదేవుడు, విష్ణువు, నారాయణుడు, పరంజ్యోతి, పరాత్పరుడు మొదలుగాగల నామములతో పిలుతురు.

విశ్వరూపమై, విశ్వవ్యాపితమై, విశ్వాత్మకమయిన ఈశ్వరశక్తికి జీవాత్మ సమానమగుట యెట్లు? కానేరదు. అందువలన ఈశ్వరశక్తి యెడ ప్రపత్తి భావమే సత్యమయిన భావము. ఈశ్వరశక్తి మనకొక మాయగానున్నది. ఏలనగా అది అవాఙ్మానస గోచరము గదా! అదియే వైష్ణవమాయ. కావున శరీరస్థమయిన జీవాత్మ ఈశ్వరశక్తి నెట్లు గ్రహింప గలదు? కొంతవరకు నూహింపగలదేమో! ఎట్టి కొలతపాత్రతో మహాసముద్రపు జలమును కొలిచి లెక్కింపగలవు? శూన్యము నేకొలత బద్ధతో కొలిచి విస్తీర్ణమును కనుగొనగలవు? కావున ఈశ్వరశక్తి సర్వలోకముల భ్రమింపజేయు శక్తి; త్రిజగన్మోహనము. మన అల్పత్వమునే మనము గ్రహింపవలసియున్నది.

ఈశ్వరశక్తి మానవుని ఊహ, ధ్యానము, అనుభవములకు కొంతవరకు గ్రహింపబడగలదేమో! వీనిద్వారా సత్యము నూహింప గలమేమో? అంతేగాని ఈశ్వరమూర్తిని దర్శించుటగాదు. గ్రహింప ప్రయత్నించవలసినదేగాని పంచేంద్రియముల కతీతము. ఆ శక్తితో సంశ్లేషించి, ఆనందిస్తాడు భక్తుడు.

ఈశ్వరునకు పంచమూర్తిత్వమున్నదని పాంచరాత్రాగమమున చెప్పబడియున్నది. ఈ పాంచరాత్రాగమమును యామునాచార్యులు స్థిరీకరించి యున్నాడు. ఈశ్వరునకు గల పంచమూర్తిత్వము పరము, వ్యూహము, విభవము, హార్దము, అర్చ" అని చెప్పబడుచున్నది. ఈశ్వర మాయాశక్తిని మనము ఈ పంచవిధ జ్ఞానముల వలన గ్రహింప ప్రయత్నింపవలసినదే. అంతేగాని ఈశ్వరశక్తి యీ అవతారముల పొందుచున్నదనికాదు. ఈ పాంచరాత్రాగమము ప్రకారము మనము దైవసేవ చేయవలయునని యామునాచార్యులు బోధించియున్నారు. దైవసేవయే సేవాతత్పరత అనబడుచున్నది.

జీవులు (మానవులు) త్రివిధములు - నిత్యులు, ముక్తులు, బద్ధులు - అని, నిత్యులు స్వసిద్ధముగా ఎల్లప్పుడు, జ్ఞానవికాసులు; వీరికి బద్ధదశలేదు. బద్ధదశ అనగా ధర్మభూత జ్ఞాన సంకోశమే యగును. ఈ బద్ధకములేక యెల్లప్పుడు జ్ఞానజనిత ఆనందమున నున్నవారు నిత్యులు. బద్ధులనగా ఆవరింపబడిన ధర్మ భూత జ్ఞానము కలవారు - ఇట్టి బద్ధదశ నుండి ఉద్ధరింపబడి జ్ఞానులయినవారు ముక్తులు. నిత్యులు స్వాచార్యులు; ప్రహ్లాదుడు, ఆళ్వారాదులు ఈ కోవకు జెందినవారు. మానవుడు బద్ధదశ నుండి దాటి ముక్తుడగుటకు ఆచార్యుడు, విద్యాభ్యాసము, ధ్యానము ఉపకరించును. జీవితాంతము అజ్ఞానమున నున్నవాడు కేవలము బద్ధుడు. ఈతని జీవితము నిష్ప్రయోజనము, శోచనీయము.

'నేను ఈశ్వరునకు శరీర భూతముగా నుండువాడను' - అను జ్ఞానము లేకయుండుటయే అవిద్య. 'నేను స్వతంత్రుడను' - అను అభిమానము గలవానిని కర్మబంధించును. శరణాగతి తత్వము, నిష్కామ కర్మబంధము నుండి తప్పించును. ఇది విశిష్టాద్వైత సిద్ధాంత మొసంగు జ్ఞానము, పరమోత్కృష్టమయినది.

పరమేశ్వరుడు శేషి; ఆత్మలు శేషములు. ఇది శరీర, శరీరి భావమునకు సమము. ఈ భావమువలన జీవుని యందు భక్తి, ఈశ్వర ప్రేమ, వృద్ధిజెందును. ఈశ్వరప్రేమ అనగా విశ్వప్రాణి సౌభ్రాత్రము. భక్తి అనగా అనంతశక్తిని అవగాహన జేసికొని, ప్రపత్తి భావమున స్వార్థరాహిత్యముగా జీవితమును గడపుట యగును.

ప్రకృతి త్రిగుణి అనబడుచున్నది. సత్వము, రజస్సు, తమస్సు అను మూడు గుణముల గలవాడు చేతనుడు. ప్రకృతి యీ త్రిగుణములను సర్వావస్థల యందును కలిగియుండును. ప్రకృతి క్షరము; అనగా ఎల్లప్పుడు మార్పు చెందుచుండును - స్థితి మార్పు, గుణమార్పు, వృద్ధి క్షీణములు మొదలగునవి. ప్రకృతి యొక్క యీ మార్పుజెందెడి స్థితి "మాయ" అనబడుచున్నది. "మాయ" అనగా, కొందరు భావించినట్లు, లేనిది - అసత్యమయినది అని భావము కాదు.

ఈశ్వరశక్తి ప్రభావమున సృష్టికాలమున చేతనుని యందు త్రిగుణములలో హెచ్చుతగ్గు లేర్పడును. మానవుడు ఈశ్వర, జీవ, ప్రకృతి పదార్థముల యొక్క మేలుకలయికగా నున్నాడు. లయకాలమున యీ మూడును విభిన్నమైపోవును. ప్రకృతి భాగము స్థితి రూపమార్పులను పొందును. అంతేగాని అదృశ్యమగుట లేదు.

అద్వైతసిద్ధాంతము మాయావాదమును జేసినది. ఈశ్వరశక్తి తప్ప తక్కిన దంతయు మిధ్య అని చెప్పినది. విశిష్టాద్వైత సిద్ధాంతము దాని నొప్పుకొనదు. ప్రకృతియందు స్థితి, రూప, గుణముల యందు ఎల్లప్పుడు అసత్యము కాదు. ప్రకృతిలోని నిరంతర మార్పు అనేది ప్రకృతి సత్యము. అన్ని ప్రత్యేక విషయములు సత్యములు. సర్ప రజ్జున్యాయమున సర్పము సత్యమే; రజ్జువును సత్యమే. మన యింద్రియముల గ్రహించు విషయము లెల్లను సత్యములు. జ్ఞానము సత్యమునే దెల్పును. భ్రమలకు కారణము పదార్థముకాదు. భ్రమలకు కారణము జీవుని యొక్క ఆశ, భయము, త్వర, చిత్తవృత్తులు. త్రాటిని జూచి భ్రమపడి పాముగా భావించినాడు. ఇది భ్రమ. ఇందు పాము అసత్యము కాదు. పాము అనేది ఉన్నది కదా, త్రాడువున్నట్లు? పామునే జూచి త్రాడు అనుకున్నాడనుకొనుము. ఇచట త్రాడు అసత్యము కాదు. త్రాడు అనేది ఉన్నది కదా? నీవు భ్రమపడి ప్రకృతిని అసత్యమనరాదు. ప్రకృతి సత్యము, శాశ్వతము; కాని అందున్న వస్తువులు నిరంతరము స్థితి, రూప, గుణమార్పులను జెందుచున్నవి.

ప్రత్యయములన్నియు సత్యమునే వెల్లడించుటను, స్వప్నావస్థ యందుగన్పడిన విషయములన్నియు సత్యములే. ఈ స్వప్న విషయములు గూడా ఈశ్వరశక్తిచేత పొందబడిన నిజానుభవములు. ఈ అనుభవములు కర్మానుసారములు.

జీవుడు ప్రపత్తియోగమున ముక్తిదశను పొందును. జీవుడనగా జీవించియున్న మానవుడు అని గ్రహింపవలసినది. జీవుడు ముక్తి

దశయందు కూడా ప్రపత్తియోగముననే యుండును. ముక్తి దశ యందు మానవుడు పరిపూర్ణ బ్రహ్మానుభవము గలిగి పరమ సామ్యమును పొందును.

మానవుడు తత్త్వత్రయ జ్ఞానమును సాధించిన తరువాత, హితమును పొందవలయును. హితము అనగా ఆత్మజ్ఞానము; ఈశ్వర సాయుజ్య మన్నమాట.

ఈశ్వరసాయుజ్యమునకు అర్థపంచక జ్ఞానమవసరము. అర్థపంచకమనగా - పరస్వరూప, స్వస్వరూప, పురుషార్థ స్వరూప, ఉపాయస్వరూప, విరోధి స్వరూప జ్ఞానములు:

పరస్వరూప జ్ఞానమనగా పరమాత్మ స్వరూపము. స్వస్వరూప మనగా తనయొక్క అనగా జీవాత్మ యొక్క శక్తినెరుగుట. ఈ రెంటి యందును ఈశ్వరశక్తి మిళితమై అనన్యమైయున్నది. పురుషార్థ స్వరూపమనగా - ధర్మ, అర్థ, కామ, మోక్షముల ప్రాప్తి. మోక్షప్రాప్తి వలన భగవత్ప్రాప్తి కలుగును. భగవత్ప్రాప్తి పరిపూర్ణానందము నొసంగును. ఉపాయ స్వరూపమనగా కర్మ, జ్ఞాన, భక్తి, ప్రపత్తులనెడి చతుర్విధ యోగములచే బ్రహ్మ జ్ఞానమనగా కర్మ, జ్ఞాన, భక్తి, ప్రపత్తులనెడి చతుర్విధ యోగములచే బ్రహ్మ జ్ఞానమును (ఆత్మ జ్ఞానమును) పొందుట, కర్మలు నిష్కామము గాను, స్వార్థరహితము గాను చేయబడినపుడు చేతనుడు మోక్ష పథమున నుండును.

కర్మయోగమును, జ్ఞాన యోగమును రెండును మోక్షదాయ కములే. జ్ఞానము వృద్ధిజెందుటచేత భక్తిగా పరిణమించును. గీతాచార్యుడు శ్రీకృష్ణుడు భక్తియోగమున భక్తుడనువాని గుణములను, మనఃప్రవృత్తిని, కార్యక్రమమును ఈవిధముగా వర్ణించి యున్నారు గదా!

శ్లో॥ అద్వేష్టా సర్వభూతానాం - మైత్రః కరుణ ఏవచ
నిర్మమో నిరహంకార స్సమ దుఃఖ సుఖః క్షమీ

సంతుష్టస్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః
మయ్యర్పిత మనోబుద్ధిః యోమద్భక్తస్సమే ప్రియంః ॥

భక్తిగా పరిణమింపని జ్ఞానము జ్ఞానమే గాదు. జ్ఞానము భక్తిగా మారినపుడు మానవుడు స్వార్థరహితుడై లోకకల్యాణార్థము జీవిస్తాడు. ఈ భక్తితత్త్వమున నున్నపుడు విష్ణు సంశ్లేషభావమున పరమానంద స్థితి యందుండును. విశిష్టాద్వైత సిద్ధాంతము భూతదయ, మానవ సేవలను ప్రేరేపించును. ఈ సిద్ధాంతమును తేటతెల్లముగా యామునాచార్యులు సూచించియున్నారు. మతము ఆత్మజ్ఞానము కొరకు, దాని ద్వారా లోకకల్యాణము కొరకు; వ్యక్తి ఔన్నత్యము కొరకు గాదు. మోక్ష సన్న్యాస యోగమున గీతాచార్యుడు తెల్పిన మార్గమిది. మానవుడు కులభేదముల పాటించి అన్యుల కించపరచరాదు. సోదర భావమున దయార్ద్ర హృదయుడుగా నుండవలయును. సానుభూతియే విష్ణుసంశ్లేష భావమును కలుగజేయును.

కర్మ, జ్ఞాన, భక్తి యోగములకు మానవులందరికిని సమానాధి కారమున్నది; ఉండవలయును కూడా, వేదశాస్త్రములందు బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు మాత్రము అష్టాంగయోగము అన్వయించునని చెప్పబడియున్నది. తక్కినవారికి అనగా శూద్ర, పంచమ కులజుల వారికి, స్త్రీలకు అవి అన్వయించవని చెప్పబడినను, వానిని అంగీకరింప జాలము. ఆనాటి సంఘ వ్యవస్థకు లోబడినవారు వ్రాసిన విషయములు ఎల్లకాలము మారుతున్న సంఘమునకు అన్వయింపవు. యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధులను ఎనిమిది యోగములకు సర్వులును అధికారము గలిగియున్నారు. ఇతర వర్ణముల వారికి లేదని ఒక వర్ణమువారు నిర్ణయించుటకు వీరికధికారమెక్కడిది? ఇది క్రూర నియంతృత్వమగును. సోదర భావమను వాసనలేదు గదా యీ పద్ధతికి?

వర్ణభేదముల విషయమట్లుండనిండు. ఏ భక్తుడయినను ఈ అష్టాంగ యోగముల నొక్కదానినైనను పాటింపలేని స్థితియందుండిన, వానికి మోక్షోపాయము లేనట్లేనా? కాదు, ఉన్నది. భగవచ్ఛక్తి లీలలను

అనుభవించి, సర్వాంతర్యామి శక్తి, దయనుచాటునట్టి ప్రపత్తియను శరణాగతి యోగము సర్వజీవ కోటికి ఉపయుక్త యోగమని విశిష్టాద్వైత సిద్ధాంతము చాటుచున్నది. అందువలననే ఉపాయ, అభయముల చాటునట్టియు, ప్రపత్తిని బోధించునట్టియు, తిరుమంత్రార్థమైనట్టియు గీతాచరమ శ్లోకము "సర్వధర్మాన్ పరిత్యజ్య - మామేకం శరణం వ్రజ - అహంత్వా సర్వపాపేభ్యో - మోక్షయిష్యామి మాశుచః" అని యామునాచార్యుడు నిర్ణయించి యున్నాడు. ఆ శ్లోకార్థమును ప్రచారము చేయుటకే నేను విశిష్టాద్వైత సిద్ధాంతమును ప్రతిపాదించు చున్నాను. ఈ చరమశ్లోకార్థమే తిరుమంత్రము; ఇదియే ద్వయ మంత్రము. దీని భావమునే "ఓం నమో నారాయణాయ" అను అష్టాక్షరీ మంత్రమున ఋషులు ఇమిడ్చియున్నారు. ఈ తిరుమంత్రార్థమునే, యీ చరమ శ్లోకార్థమునే అర్చావతారమయిన శ్రీ తిరుమల వేంకటేశ్వర విగ్రహము నందు సూచింపబడుతున్నది. వామహస్తము ప్రపత్తి (శరణాగతి) యోగమును సూచింపగా, దక్షిణహస్తము శరణాగతుడైన భక్తునకు అభయమునిచ్చునట్లు సూచించుచున్నది. ఇటీవల తిరుమల దేవాలయమును నేను గావించిన మార్పు ఇదియే. దీని అర్థజ్ఞానమును మీరెల్లరు గమనింతురు గాక!

భక్తియు, ప్రపత్తియు జీవుని ధర్మభూత జ్ఞానము యొక్క అవస్థా విశేషములు. అది జీవుడు పొందు మానసిక ఔన్నత్యము.

ప్రపన్నుడయిన చేతుననకు మోక్షము సంప్రాప్తమగును. ఇది ఈశ్వరుని కృపచే కలుగును. అనగా, సర్వాంతర్యామి భావముచే ప్రపత్తి భావమును పొందినవాడు. బంధవిముక్తుడగును. పరమానందమున నుండును; ఏ భయమును లేదు; ఏ పాపము అంటదు.

ప్రపత్తిభావము ఇతర యోగములకు అంగ భూతముగా నుపయోగపడును. కర్మయోగమందు ప్రతిబంధకములు అపచారములు కలిగిన విపరీత ఫలితములు ఉత్పన్నము కావచ్చును. అట్టియెడ ప్రాయశ్చిత్తముగా సర్వాంతర్యామి శరణాగతియే మార్గము.

గమ్యము. జ్ఞానయోగ భక్తియోగములలో సిద్ధి కలుగనపుడు శరణాగతి తత్త్వమే శరణ్యము.

శరణాగతి తత్త్వము ఆత్మసమర్పణ యోగమునకు జీవుని ప్రోత్సహించును. అందువలన అది బ్రహ్మానుభవమునకు పునాది యగును.

ఈ విధమున హితమును, పురుషార్థమును బ్రహ్మమేనని విశిష్టాద్వైత సిద్ధాంతము స్థాపించుచున్నది. మానవుడు తత్త్వజ్ఞానమును పొంది, ప్రపత్తి భావమున లోకకల్యాణార్థమై జీవితమును గడుపవలయునని నా సిద్ధాంతము.

సర్వ జీవులు మోక్షకాములు. ఈ మోక్షభావమును, దీనికంటెను అత్యంత కల్యాణ ప్రదమయిన ఈశ్వరకైంకర్యమును పరమ పురుషార్థమని స్థాపించుటచే, విశిష్టాద్వైతము జీవునకు ఈశ్వరుని యందు లయమగుటకంటే ఉన్నతస్థితిని జూపుచున్నది. ఈశ్వరుడు స్వయముగా జీవుని మోక్షమునకు గొనిపోవుచున్నాడు - అని చెప్పుటలో భావమును గుర్తింపుడు - ఈశ్వర భావము అనగా వైష్ణవ సంశ్లేష భావము మానసిక ఔన్నత్యమును కలుగజేయునన్న మాట. నాయీ సిద్ధాంతము శ్రుతి, స్మృతి, అగమ, పురాణ ఇతిహాసముల దృష్ట్యా పరతత్త్వ, హిత, పురుషార్థములను సమన్వయ పరచి, ప్రత్యక్ష అనుమానములకు అవిరోధమును నిరూపించుచున్నది. నేను దేనిని కూడా వ్యతిరేకించుట లేదు; సమన్వయమున సత్యమార్గమును జూపుచున్నాను.

ఆళ్వారుల జీవిత విధానము మనకు ఆదర్శప్రాయము. ఆళ్వారుల రచనల సంచయము నాలాయిర ప్రబంధమను పేర వెలసియున్నది. శ్రీనాథమునులు ఈ సంచయము గావించిరి. శ్రీనాథమునులు యామునాచార్యుల పితామహుడు. నాథముని నాలాయిర ప్రబంధమును "సహస్రశాఖోపనిషత్సమాగమం ద్రావిడ వేద సాగరం" అని వర్ణించినారు. భక్తులగుమీరు ద్రావిడ వేదమును పఠింపుడు.

ఆళ్వారులు పంద్రెండుమందియని మీరెరుగుదురు గదా! వారిలో అన్ని జాతులకు సంబంధించినవారున్నారు. తిరుప్పావ్ ఆళ్వారు పంచమ కులజుడు; ఆళ్వారులందరు విష్ణ్వాలయమున పూజనీయు లుగా విగ్రహ రూపముల నెలకొల్పబడుదురు. దైవారాధనకు వర్ణభేదములు లేవని ఆళ్వారుల జీవితముల నుండి గ్రహింపుడు. సోదర భావమును పెంపొందించుకొనుడు.

యామునాచార్యులవారు ఆగమ ప్రామాణ్యమును రచించి యున్నారు గదా! ఇది పాంచరాత్ర సత్రము అను పేర వేదము నందు గలదు. పంచ భూతముల అభివృద్ధికి నారాయణుడు జరిపిన యజ్ఞప్రకారమని వేదమున తెల్పబడియున్నది. దీని నాధారముగా గొని శరణాగతి రూపమగు భగవత్ప్రాప్తిమార్గమొకటి పాంచరాత్ర సంహిత యందు వివరింపబడియున్నది. పంచమ వేదమనబడు మహాభారతమున శాంతిపర్వమున నారాయణీయోపాఖ్యానమున వర్ణింపబడినదియును పాంచరాత్ర ధర్మమే. పాంచరాత్రము సర్వవేదోపనిషత్సారమని సారాంశము.

మరలా చెప్పుచున్నాను - గ్రహింపుడు. చేతన, అచేతనములచే విశిష్టమయినది ఈశ్వరశక్తి, పరబ్రహ్మశక్తి. దాని అద్వైతమే విశిష్టాద్వైతము. సమస్తములోని, సర్వాత్మలయందును ఈశ్వరశక్తి అంతర్యామిగా నున్నదని తెల్పు శ్రుతి వాక్యములు నాసిద్ధాంతమునకు మూలమైనవి. "ఏకమే వాద్వితీయం" అను బ్రహ్మసూత్రము నా విశిష్టాద్వైత సిద్ధాంతమును సూచించును.

నా సిద్ధాంతము ఒక్క భేదమునో, అభేదమునో, రెంటినో గూర్చి ప్రత్యేకముగా జెప్పదు. ఈ మూడును వేదవేద్యములు; ఈ మూటిని నేను సమర్థింతును. నేను దేనినిగాని వ్యతిరేకించను.

సర్వము శరీరముగా, సర్వమందును ప్రకారముగా పరబ్రహ్మ శక్తియున్నందున "అభేదము" - ఒక్క బ్రహ్మశక్తియే నానాభూత ద్విష్ఠ ప్రకారమగు నానాత్వముగా నున్నందున "భేదాభేదములు" - అచిత్,

చిత్, ఈశ్వర అనుమూటియొక్క స్వరూప స్వభావ వైలక్షణముల వలన వీటికెన్నడును సంకరము కలుగదు కాబట్టి "భేదము". కావున ఈ విధమున భేద, అభేద, భేదాభేద అను మూడింటిని గూడా నా సిద్ధాంతము సమర్థించుచున్నది.

ఈ జ్ఞానము యొక్క సారాంశము ఏమి? ప్రపత్తియోగమున లోకకల్యాణార్థమయిన కార్యములు జేయుట - ఇది సృష్టిని అభివృద్ధి జేయును, శాంతిని చేకూర్చును. సర్వులకు ఆనందకరము, శివము నైయుండును. భక్తులు ఈ సత్యమును గ్రహింతురు గాక!

వేదసమ్మతమును, ప్రస్థానత్రయ సూచకమును, సత్యమును, ఆనందదాయకమును, లోకకల్యాణ ప్రదమును అయిన యీ విశిష్టాద్వైత సిద్ధాంతమును మీరెల్లరు పాటించి, తరింతురుగాక! అని పలుకుచూ భగవద్రామానుజాచార్యుల వారు తన విశిష్టాద్వైత సిద్ధాంతోపన్యాసమును క్లుప్తముగా అప్పటికి ముగించెను.

అశేష భక్తులును, యాదవరాయలును, ప్రజానీకమును ఈ దివ్య విషయోపన్యాసమును ఆకర్ణించి, తరించితిమని భావించి ఆనందించిరి.

శ్రీరామానుజుని తిరుమల తిరుపతుల సందర్శనము అతి ముఖ్యఘట్టము. తరువాత, తిరుమలనంబి వద్దనుండి సెలవుపొంది, అందరికి ఆశీర్వచనములు పల్కి, కూరేశ దాశరథి మొదలగు శిష్యవర్గముతోగూడి రామానుజుడు శ్రీరంగక్షేత్రమునకు పోయెను.

శ్రీమద్రామానుజాచార్యులు స్వామికి గావించిన మంగళాశాసన ఫలితమోయనునట్లు తిరుమల వేంకటేశ్వర దివ్యక్షేత్రము దినదినాభివృద్ధి కీర్తి సంపదలకు నెలవై వెలయుచున్నది.

## 29. పరాశర వ్యాసుల జననము

ఆనాడు కూరేశుడు ఆండాళ్ ఇరువురు స్వామి ప్రసాదమును భుజించిరిగదా! ఆండాళ్ గర్భవతియగుటయు, తొమ్మిది మాసములు నిండుటయు జరిగినది. ఆండాళ్‌కు ఇద్దరు కుమారులు కవలలుగా జన్మించిరి. వారినామకరణ మహోత్సవ సందర్భమున శ్రీమద్రామానుజుడు ఆకవలకుమారులకు పరాశరుడు, వ్యాసుడు అను తిరునామముల నుంచి, ఆశీర్వదించెను. రామానుజ శిష్యులెల్లరు కవలకుమారులకు మంగళాశాసనములు పల్కిరి.

రామానుజుడు, "కూరేశా! వత్సా! బ్రహ్మసూత్రములకు శ్రీభాష్యమును రచించితిని. అందుమూలమున ఆళవందారుకు నేను గావించిన వాగ్దానత్రయములో నొకటి తీరినది - పరాశరమునీంద్రుడు విష్ణుపురాణమున తత్త్వత్రయ సంబంధముల వెల్లడించి యున్నాడు. ఈ జ్ఞానమే విశిష్టాద్వైత సిద్ధాంత సౌధమునకు మూలస్తంభమయినది. పరాశరుని కుమారుడు వేదవ్యాసుడు వేదముల విభజించి, ఉపనిషత్తులగూర్చి, బ్రహ్మసూత్రముల రచించి, కడకు పంచమ వేదమయిన భారతమధ్యమమున గీతాశాస్త్రమును దెల్పియున్నాడు. ఈ మహాత్మ ద్వయమునకు వైష్ణవలోకము ఋణపడియున్నది. నీ పుత్రులకు ఆ మహానుభావుల పేర్లనిడి వారికి కృతజ్ఞతను దెల్పుకొందము. ఈ కవలలు పెరిగిపెద్దవారైన తరువాత విశిష్టాద్వైత మతాధిపతులై కీర్తివంతులగుదురుగాక! పరాశరవ్యాసుల జ్ఞానసంపద వృక్షమును పెంపొందించెదరు గాక! అని మంగళాశాసనమును పల్కెను. అందరు ఆనందించిరి. యామునాచార్యునకు రామానుజుడు గావించిన వాగ్దాన త్రయమున రెండవది నెరవేరినట్లయినది.

ఇక మిగిలియుండు ప్రతిజ్ఞయేమనగా - నమ్మాళ్వార్ల దివ్య తమిళ ప్రబంధమును ప్రచారముజేసి చేతనులకు సత్యమార్గమును దెల్పి, తిరుమంత్రార్థమును ప్రచారముజేసి, వారిని వాస్తవ వైష్ణవ భావమునకు మరల్చుట యనునది. ఈ ప్రతిజ్ఞను రామానుజుడు భవిష్యత్తులో

నెరవేర్చును. రాబోవు ప్రకరణములయందు ఈ విషయము సవిస్తరముగా తెల్పబడియున్నది.

కూరేశుని కవలకుమారులు పరాశర, వ్యాసులు దినదిన ప్రవర్ధమానులైరి. పసితనముననే వీరికి కుశాగ్రబుద్ధి, నీతిప్రవర్తనములు అలవడినవి. అయిదవయేట తండ్రి కూరేశుడే శ్రీరామానుజుని సమక్షమున విద్యాభ్యాస ప్రారంభోత్సవమును జరిపెను. విద్యాభ్యాసమున బాలురతి చురుకుగా నుండిరి. శ్రద్ధాభక్తులతో తలిదండ్రుల యొద్ద విద్యాభ్యాసమును పొందుచుండిరి. ఇరువురును ఏకసంథాగ్రాహులు. తొమ్మిదవ సంవత్సరకాలముననే శాస్త్ర పరిజ్ఞానము కలిగినది.

ఒకనాడు బాలురిద్దరు వీధియందు ఆడుకొనుచుండిరి. దారిన నొక చాటింపు వినవచ్చినది. ఏమని? "ఓహో! బహుపరాక్! సర్వజ్ఞ భట్టులవారు వచ్చుచున్నారు. పండితులెవరైన ఉన్నచో తర్కమునకు రండు! తర్కమునందోడి. వారికి శిష్యులై సేవజేయరండి, ఒహో! బహుపరాక్" అని.

బాలురిరువురు ఆటమాని, అటువీధినవచ్చుచున్న పల్లకి, ఉత్సవమును తిలకించిరి. ఊగినలాడు రత్నపల్లకిని పదిమంది బోయలు మోయుచుండిరి. అందు లోపల సింహతలాటములతో సువర్ణరత్న కర్ణకుండలములతో ఉద్దీపించు సర్వజ్ఞభట్టు అను పండితుడు ఆశీనుడైయున్నవాడు.

వ్యాసుడు పరాశరునితో, "అగ్రజా! సర్వజ్ఞుడనగా సర్వమును తెలిసిన వాడని కదా భావము! సర్వజ్ఞనామధేయము శర్వునకేగాక యితనికెట్లబ్బును?" అని ప్రశ్నించెను. "ఔను సోదరా! ఆ పల్లకినాపి విషయమును తేల్చుకొందముగాక!" అన్నాడు పరాశరుడు.

సోదరద్వయము పరుగిడి వీధిమధ్యమున నిలుచుండి పల్లకి నాపిరి. పల్లకిని మోయువారు నిలువగా, సర్వజ్ఞభట్టు కోపగించి, అటు

క్రిందచూడగా, ఇద్దరు బాలురు వారికడ్డముగా నిలువబడి యుండిరి. పిల్లచేష్టలని యెంచిన సర్వజ్ఞభట్టు బాలురవైపుజూచి, "తొలగిపొండు" అని గర్జించెను.

పరాశరుడు, "తాతగారు! ఏల ఆగ్రహమునందెదరు? దిగిరండు! తమరిని పరీక్షింప దలచితిమి! ఇదిగో చూడుడు, నాచేతిపిడికిలిలో నేమున్నదో చెప్పి, తరువాత పొండు, తమరు సర్వజ్ఞనామధేయులు గదా!" అని పలుకుచూ చేతిపిడికిలిని చాచెను.

"ఓరీ పిల్లబడవా! నీచేతిలో నేమున్నదో చెప్పుటకు నేనాగ వలయునా? ఇంతకంటే నాకేమియు పనిలేదా? కొంటెకుఙ్ఞా! అని కసరెను.

పరాశరుడు నవ్వుచూ, "తాతయ్యా, ఆగ్రహమెందులకు? మీరు సర్వజ్ఞ బిరుదాకింతులు! నాగుప్పిటిలో నేమున్నదో చెప్పవలసినదే! లేనిచో ఒటమికి అంగీకరింపుము. అప్పుడు మేము తొలగెదము. మీరు పోవచ్చును", అనెను.

అందరు నివ్వెరపోయి చూచుచుండిరి. బాలుని పిడికిలిలో నేమున్నదో తెలియక సర్వజ్ఞభట్టు తికమక పడుచుండెను. బాలుడు పకపక నగుచూ, పిడికిలి విప్పియినుకను జూపుచూ, "తాతగారు! సర్వజ్ఞడవటనే. ఇదియేనా మీ సర్వజ్ఞత్వము?" అనెను.

సర్వజ్ఞభట్టు బెంగతో పరాశరునివైపు చూచుచుండెను. ఈలోపల పరాశరుడు మరలా పిడికిలి బిగబట్టి, "యిప్పుడు నాపిడికిలిలో నేమున్నదో చెప్పుము"ని ప్రశ్నించెను. సర్వజ్ఞభట్టుకు నోటినుండి పలుకురాలేదు. "ఏలమౌనము వహించియున్నారే తాతగారు! మీరు చెప్పలేరా! ఇదిగో వినుడు! చూడుము", అనుచూ పిడికిలితీసి, "చూడుము, ఈ పిడికిలి యందు శూన్యమున్నది. ఈ శూన్యమును ఈశ్వరశక్తి ఆవరించియున్నది. ఈశ్వరుడు సర్వాంతర్యామికదా! శూన్యమనునది లేదు. తెలియదా?" అని పరాశరుడు ప్రశ్నించెను.

సర్వజ్ఞభట్టు పల్లకిదిగివచ్చి, బాలునెత్తుకొని, ముద్దాడి, "నాయనా, ఆనాడు వామనుడు బలిచక్రవర్తి నణచినట్లు నీవు ఈనాడు నా అహంభావమును పారద్రోలితివి. నేను సర్వజ్ఞుడనుకాను. నీ చేతిననున్న యిసుక రేణువునకన్నను అల్పుడనని తెలిసికున్నాను. నీవు దెల్పిన శూన్యతనుబట్టి శరణాగతి తత్త్వమునుపొందితిని. నాయనా, జ్ఞానోదయమును కల్గించితిని. నీకు ఆయురారోగ్య కీర్తి సంపదలు చేకూరుగాక", అని పలికి వెళ్లెను.

శ్రీమద్రామానుజుడు ఈ సంఘటనను విన్నవాడై పరమానందమున, "కూరేశా! చూచితివా, పరాశరుని మేధ! శ్రీరంగేశుని వరప్రసాదమున జన్మించిన యీ పరాశరుడు నాతరువాత యామునాచార్యు పీఠమునకు తగినవాడు అగుగాక! నీవు నాకు సర్వవిధముల సహకరించుచున్నట్లు, వ్యాసుడు అన్నకు కుడిభుజమై యొప్పారుగాక!" అనుచూ తాను నామకరణోత్సవ దినమున గావించిన మంగళాశాసనమును మరలా బలపరచెను.

## 30. దక్షిణదేశ యాత్ర

శ్రీమద్రామానుజుడు దక్షిణదేశయాత్రకై బయలుదేరెను. దక్షిణాది దేవాలయములను దర్శింపవలయుననియు, అందులో ప్రత్యేకముగా ఆళ్వారులచే వారిపాశురములందు నుతింపబడిన దైవసన్నిధులను దర్శించి, సేవించి, అచ్చటమనిన వైష్ణవభక్తుల జీవిత విశేషముల తెలిసికొనవలయునని వారిపరమోద్దేశము. ఆళ్వారుల జన్మ స్థలములను, వారుచరించిన ప్రదేశములను, వారు దర్శించిన దేవాలయములను చూడవలయునని రామానుజుని కోరిక. ఆళ్వార్లు ఎచ్చట జనించినను, ఎచ్చట సంచరించినను, కడపట ఎక్కువమంది శ్రీరంగమున పరమపదించియున్నారు. అట్టి శ్రీరంగమే విశిష్టాద్వైత సిద్ధాంత మతమునకు కేంద్రమగుట రామానుజునకు ముదమును చేకూర్చినది. ఆళ్వారులలో కడపటివాడైన నమ్మాళ్వారువారికి ముందవతరించిన ఆళ్వార్లు దర్శించిన దేవాలయములనన్నిటిని చూచి, కోయిల్ తిరువాయ్మొళి అను ప్రబంధమున వానిని వర్ణించి యున్నాడు గదా? అట్టి నమ్మాళ్వార్ల కీర్తిసంపదను ఆచంద్రతారార్కము చేయవలయుననియు, నమ్మాళ్వార్ల ప్రబంధములను భక్తులయందు ప్రచారము జేసి, సత్యమార్గమును చేతనులకు తెల్పవలయునని రామానుజుడు సంకల్పించి యున్నాడుగదా!

శ్రీరామానుజాచార్యులు ఏ దేవాలయమును దర్శించినను, అచ్చటి అర్చకులు, దేవాలయాధికారుల వారినెంతగానో ఆహ్వానించి, గౌరవించి, పాదాక్రాంతులగువారు. శ్రీరామానుజుడాయా దేవాలయ సాంప్రదాయముల గమనించి, విమర్శించి, కొన్ని సంస్కరణముల గావించి యున్నాడు. దేవతార్చనమునందును, దేవాలయ పరిపాలనము నందును పెక్కు మార్పుల సూచించి, వానిని పాటింపజేసెను.

త్రిభువన సౌందర్యము యొక్క సూచకమూర్తి విగ్రహమనియు, విగ్రహము నర్చించుట అనగా భక్తుడు త్రిభువన సుందరమును

సేవించుట అనియు గమనింప వలయునని రామానుజుని సిద్ధాంతము. మతము యొక్క పరమావధి మానవులు సౌభ్రాత్రమున జీవింపగలుగుట అనియు, మానవులు సేవాతత్పరత నవలంబింప వలయుననియు, రామానుజుని సందేశము. ఇట్టి ఉత్కృష్టమత సిద్ధాంతము, ఆచారములు సర్వులకును సమానములనియు, అందరును కులభేదములతో అసూయలను పెంపొందించు కొనకుండా, ఈ సిద్ధాంతముల పాటింపవలయునని బోధించెడువాడు రామానుజుడు. దేవాలయ కార్యక్రమములు ఏవో కొన్ని కులముల వారికి సంబంధించినవికావు. దైవకైంకర్య కార్యకలాపముల నుండి యేజాతివారికిని బహిష్కరణ యుండరాదని రామానుజుని సంస్కరణ భావము. విశిష్టాద్వైత సిద్ధాంతమును దీనిని బలపరచును. సంస్కరణ కర్త యెల్లప్పుడును మూఢప్రజల అజ్ఞాన క్రూరత్వమునకు ఆహుతియగుచుండును. శ్రీరామానుజుడును ఇట్టి యెడ పెక్కు యిక్కట్లకు పాలైనాడని యింతకుపూర్వము గమనించి యున్నాము. శేషచరిత్రయందు గూడా మరికొన్నింటిని గమనింప గలము. శ్రీమద్రామానుజుడు ధీరుడు, దక్షుడు, వివేకిగాన, విఘ్ననిహన్యమాను డగుచూ, అత్యున్నతోత్సాహముతో తన సిద్ధాంత మును ప్రచారముజేసి, దానికి ఆచంద్రార్క స్థితిని చేకూర్చినాడు కదా!

ఒకనాడు పాండ్యరాజ్యమున తిరుమంగైఆళ్వార్ల జన్మ స్థలమయిన తిరుప్పులింగుడి యను గ్రామవీధియందు రామానుజుడు శిష్యగణముతో నడచిపోవుచుండెను. సమీపమున నెదురుగా పంచమ జాతి స్త్రీ యొకటె వచ్చుచుండగా, ఆమె అస్పృశ్యురాలని తలచిన శిష్యుడొకడు ఆమెను తొలగి దూరముగా పొమ్మని సూచించెను.

“మిమ్ముల నేను మైలు పరచకుండా యుండగలందులకు నేను ఏ వైపునకు పోవలయునో మీరే సెలవిండు, స్వామీ! సర్వవ్యాపకమైన వైష్ణవశక్తి ఆక్రమింపని ప్రదేశము లేదుగదా? భగవచ్ఛక్తిచే ఆవృతమయిన ప్రదేశమంతయు (శూన్యముతో సహా) పవిత్రమైనదే

గదా! నేనెట్లు తొలగవలయునో సెలవిండు, స్వామి!" అని ఆ పంచమ స్త్రీ వినయమున ననెను.

రామానుజుడు శిష్యులవైపు జూచి, "చూచితిరా! ఈమె వైష్ణవ భావముననున్న సాధ్వి! నివురుగప్పిన నిప్పువలెనున్న జ్ఞాని యీమె. సత్యమును గమనింపుడు; మూఢాచారములకు దాసులుకాకుడు", అని పలుకుచూ, రామానుజడామెను తిలకించి, మందహాసమున దండము సమర్పించి, నడువసాగెను. ఆ స్త్రీ ఆచార్యుని పాదములపై బడివారిమన్ననను, ఆశీర్వాదమును పొందెను.

రామానుజుడు శిష్యులతో, "తిరుప్పాణ్ అళ్వార్ల చరిత్రమును మీరు తెలిసికొనియున్నారు గదా! ఈశ్వరశక్తి సర్వవ్యాపితమని నమ్మిన భక్తుడే వైష్ణవుడు. నామధారులై, నామస్మరణ జేయుచున్నంత మాత్రమున వైష్ణవుడగునా?" అని బోధించెను.

శ్రీరామానుజుడు క్రమముగా తిరుకుడందాయ్, తిరుమాలిరుం శోలై, తిరుపుల్లని, తిరుక్కురుంగుడి అను దివ్యక్షేత్రముల దర్శించెను.

శ్రీనమ్మాళ్వార్ల జన్మస్థానమయిన ఆళ్వార్ తిరునగరిని దర్శించి నపుడు, అళ్వార్ల దివ్యవిగ్రహమును దర్శించి, వారు తపస్సు జేసిన తింత్రిణీవృక్షమును దర్శించి, నమ్మాళ్వార్ల ప్రతిభను మనస్సునకు దెచ్చుకొని, రామానుజుడు ధ్యానమున, పరమానందమున కొంత తడవు బాహ్యస్మృతిని గోల్పోయి, అట్లనే కొంతకాలము పద్మాననస్థుడుగా నుండెను.

తిరుక్కురుంగుడి యనునొక దివ్యక్షేత్రమున నొక ఘటన జరిగినది. తేజోమయుడును, పండితుడును అయిన ఒక శ్రీ వైష్ణవుడు రామానుజుని సమీపించి, "స్వామీ, కులభేధములు లేక సోదర భావమున మానవుల జీవింపమని మీరు బోధించి, ప్రయత్నించు చున్నారే, యిందు మీరు కృతకృత్యులు కాగలరని మీకు విశ్వాసము, ధైర్యములున్నవా! అవతార పురుషులనదగిన శ్రీరాముడు, శ్రీకృష్ణుడు ఈ కార్యమును చేయగలిగిరా? శ్రీరాముని ఆదర్శము, శ్రీకృష్ణుని

గీతోపదేశములు ప్రజలను మూఢవిశ్వాసముల నుండి యెంతవరకు వెలుపలకీడ్వ గలిగినవి? అలోచింపుడు! మీ సంస్కరణ ప్రయత్నమునకు మీ సాధనమేది? తెల్పుడు స్వామీ", అని వినయమున ప్రశ్నించెను.

శ్రీ రామానుజుడు మందహాసమున, "ఓ శ్రీవైష్ణవా! నీ మనస్సును గమనించినాను. నీప్రశ్నను సంతోషముగా స్వీకరించినాను. నీవు నా ప్రయత్నమును శంకించి అడిగిన ప్రశ్నగాదది. నా ప్రయత్నము సఫలీకృతము కావలయుననియే నీవును వాంఛించి, నన్నొక విధముగా ఉత్సాహపరచుటకు ఆ ప్రశ్న నడిగితివని గ్రహించినాను. సంతోషము. నిన్నభినందించుచున్నాను. నాయీ కార్యసిద్ధికి నీకున్న ఆశ, ఆతురతలనే నీవు వెల్లడించినావు! వత్సా! నాసాధనమును తెల్పెద ఆకర్ణింపుము. నా సాధనము జయప్రదము; అందులకు సందియము వలదు. నాసాధనము నాతరువాత కూడా ఆచంద్రతారార్కముగా ప్రకాశించి, చేతనుల నుజ్జీవింప జేయగలదు! ఆసాధనము "తిరుమంత్రము" - తిరుమంత్రమున నిమిడియున్న సత్యార్థము - ఉపాయ, అభయముల సూచించు చరమ శ్లోకార్థము నెల్లరు పాటింతురు గాక! మొదటిది ఉపాయము; సాధనము; స్వార్థరాహిత్య భావమున సర్వవ్యాప్తమయిన ఈశ్వరశక్తికి శరణాగతియగుట - రెండవది అభయము - స్వార్థరహితుడైన శరణాగతికి భవ, భయములు లేవు - చింతింప నవసరము లేదు - ఉపాయ, అభయ సూచకమయిన తిరుమంత్రము చేతనులలో సోదర భావమును రేకెత్తించును. ఇది సత్యము. విశ్వసింపుము", అని పల్కెను.

శ్రీవైష్ణవు డీపలుకులను పరమానందముతో వినెను. సంతుష్టు డాయెను. రామానుజుని శిష్యులీ సంభాషణను విని ఆనందించిరి.

శ్రీవైష్ణవుడు, "ఆచార్య! రామానుజా! తమరి యుద్దేశము సత్య మయినది. తమరి సాధనము శ్రేష్ఠమయినది. మానవ సంఘము ధన్యమయినది. తిరుమంత్రార్థమును విశ్వసించినవాడు మోక్షపథము ననేయుండును. అట్టివాడు శాంతికాముడు. మీ సాధనము

ప్రపంచమునకు తారకమగుగాక!" అని మంగళాశాసనము పల్కి వెడలిపోయెను. ఆ శ్రీవైష్ణవుడు తన్ను ప్రోత్సహింపవచ్చిన అపర విష్ణుమూర్తియనియే రామానుజుడు సంశ్లేషణ భావమున కొంత తడవు ధ్యానమున ఆసీనుడైయుండెను.

తరువాత శ్రీరామానుజుడు తిరువణ్‌పరిశారమ్ అను ప్రదేశమును జేరెను. అచ్చట వివిధ వేదాంత తత్త్వముల బోధించు పలువురు పండితులు, శాస్త్రజ్ఞులుండిరి. వారితో శ్రీరామానుజునకు తర్కవాదములు తప్పలేదు. దేవాలయమున అనేక భక్తుల సమక్షమున, స్థానిక ప్రభువు సమక్షముననుౣ, రామానుజుడు ఆ పండితులనెల్లరను వారి మూఢవిశ్వాసముల నుండి ఉద్ధరించి, వారికి సత్యమార్గమును నచ్చజెప్పెను. శ్రీరామానుజుడు రచించిన శ్రీభాష్యము వారికి నచ్చినది. అందరు రామానుజునకు శిష్యులయిరి.

శ్రీరామానుజుడు వారినందరిని ఉద్దేశించి యిట్లు చెప్పెను - "సోదరులారా! వాదమున నోడినామని తలంపకుడు. ఇందు మీతక్కువ తనము ఎంతమాత్రము లేదు. ఉన్నతమనస్కులయిన మీరు నా సిద్ధాంతము యొక్క అర్థమును గ్రహింపగలిగి, మీ పూర్వభావముల విడనాడ గలిగినారని నేను మిమ్ముకలసోదర భావముతో అభినందించు చున్నాను. మీరు గ్రహించిన సత్యమును సర్వులకును ప్రచారము జేయుడు అని భక్తి వినయములతో మిమ్ముల నేను అభ్యర్థించు చున్నాను', అని అనుచూ రామానుజుడు వారికి నమస్కరించెను. శ్రీరామానుజ ప్రతిభకు, వారి వినయ సంపత్తికి అచ్చెరువందిన వారెల్లరు మారుమాటాడలేక, రామానుజుని పాదాక్రాంతులై విశిష్టాద్వైతులయిరి. వారెల్లరును శ్రీరామానుజుని "శ్రీభాష్యకార" అని వేనోళ్ల ప్రశంసించిరి. రామానుజుని శ్రీభాష్యమునకు సర్వజనామోదముద్ర పడినట్లయినది.

దక్షిణదేశ దిగ్విజయము నీరీతిగావించి, అచార్యులవారు తిరిగి శ్రీరంగము జేరిరి. శ్రీరామానుజుడు దేశమునకు ప్రధానాచార్యుడుగా పరిగణింపబడెను.

రామానుజుని కీర్తి సంపదకు శైవులకు కన్నెర్ర అయ్యెను. ఆనాటి కంచి ముఖ్యపట్టణముగా పరిపాలించుచున్న చోళరాజులు శైవులు. వీరిని అద్వైతులని యనుటకు వీలులేదు. శివలింగార్చకులు శైవులనబడుచుండిరి. విశిష్టాద్వైతులు వైష్ణవులని పిలువబడు చుండిరిగాన శివారాధకులు అయిన శైవులు వైష్ణవులపై ద్వేష భావమును బూనిరి. శ్రీరామానుజుని వైష్ణవ మతమును శైవులయిన చోళరాజులు నిరసింపదొడగిరి. క్రమక్రమముగా శైవుల ప్రోద్బలమున చోళరాజులు విశిష్టాద్వైతమునకే విరోధులయిరి. శ్రీరామానుజుని జీవితమున అతి విషమ ఘట్టమునకు ఇది కారణమయినది.

శ్రీరామానుజుని జీవితకాలము క్రీ. శ. 1017 నుండి 1137 వరకు. ఈ కాలమున రాజేంద్ర చోళుడు మొదలు విక్రమచోళుడు వరకు ఐదుగురు చోళరాజులు పరిపాలనజేసిరి. వీరి అధికారము కావేరి నదివరకు కంచి ముఖ్యపట్టణముగా అవిచ్ఛిన్నముగా నుండెడిది. మరియు, దక్షిణ దేశము నాక్రమించు ప్రయత్నములుండినవి. దక్షిణదేశపు వివిధ రాజవంశపు పరిపాలకులు చోళరాజునకు కప్పములు గట్టుచుండిరి. ఈ కాలమున చోళరాజుల కీర్తి గగనమున కంటినదని కవులు కొనియాడుతూ కవనములుగావించుయున్నారు. రాజరాజచోళుడు గొప్ప సామ్రాజ్య విస్తరణనుగావింపగా, అతని తరువాత పాలించిన రాజులు ఉన్న రాజ్యమును, దాని పరిపాలనను కట్టుదిట్టముగావించిరి. దక్షిణ దేశమున పూర్వకాలమున వెలసిన వైష్ణవభక్తులు ఆళ్వార్లు, శైవభక్తులు నాయనార్లు రచించిన భక్తి గీతములు దక్షిణదేశ ప్రజల మతములకు మూలాధారములయినవి. మొత్తము మీద అనేక శివాలయములు, అనేక వైష్ణవాలయములు ఆకాలమున నిర్మింపపబడినవి. ఆళ్వార్లు, నాయనార్లు నిర్మల భక్తి తత్పరులయినను, కాలక్రమమున వారిననుసరించిన ప్రజలలో గాఢమయిన భేదము లేర్పడినవి. శైవులు, వైష్ణవులని తీరని భేదములు ప్రబలినవి. హిందూదేశమును ఆవరించియున్న మూఢవిశ్వాసములు దెచ్చిన ఫలితమిది. ఋషితుల్యుడైన యేమహాత్ముడు ఏ సత్యమును

వెల్లడించినను, కాలక్రమమున దాని ననుసరించువారు భేదముల సృష్టించుకొనుచుండిరి. ఇందువలన ఐకమత్యము, సోదరభావములు లోపించుటయేగాక, అసూయ, విరోధములు ప్రబలి ఒకరినొకరు అంతమొందించు ప్రయత్నముల వరకు సాగుచుండిరి.

ఉత్తరదేశమున ప్రబలినట్టియు, వేదవిరోధమతములని వచింపబడుచున్న బౌద్ధజైన మతములకు వ్యతిరేకముగా వేదసమ్మతములయిన శైవసిద్ధాంత, వైష్ణవసిద్ధాంత, అద్వైత విశిష్టాద్వైత సిద్ధాంతమతములు తలయెత్తినవి. కాని వీరిలో మరలా అనేక పరస్పర విరోధము లేర్పడుట శోచనీయము. శ్రీరామానుజునకు పరమత ద్వేషము లేదు. మానవులు సత్యమార్గమును తెలిసికొని దాని నవలంబింప వలయుననియే వారి కోరిక.

కడకు దక్షిణదేశమున మత సంబంధముగా శైవులు వైష్ణవులని ప్రజలలోసైతము రెండు వర్గములేర్పడినవి. వీరిమధ్య పరస్పర కలహములు చెలరేగుచుండెడివి. ఇది రాజులవరకు వ్యాపించినది. వైష్ణవులనబడువారు విష్ణుమూర్తిని పరమదైవముగా భావించిరి; శైవులు శివుని పరమదైవముగా భావించి, శివలింగార్చనలు జేయుచుండిరి. వైష్ణవులు దినమున ఇరువది నాలుగు ఘంటలు ముఖమున తిరుమణి శ్రీచూర్ణముల ధరించియుండ, శైవులు అట్లే విబూదిని ముఖమున ధరించి, మెడయందు రుద్రాక్ష హారములను, శివలింగ పేటికలను మోయుచుండిరి.

ఈ భేదములు అజ్ఞానులయిన ప్రజలలో ఆచారరీత్యా వచ్చినవి. పండితులనబడువారు కూడా ఈ యజ్ఞానమునకు ఆహుతులయిరి. విశ్వవ్యాపితమయిన ఈశ్వరశక్తి శివమైనది; రౌద్రమయినది కూడా. శివమును జేయునదిగాన (శుభస్కరముగావున) ఆ సర్వవ్యాపిత వైష్ణవ శక్తి శివమయినది. నాశనకరమగుటచే అశక్తి రౌద్రమయినదియు నగును. ఈ శివగుణముగాని, ఈ రౌద్ర గుణముగాని సర్వవ్యాపిత మయిన వైష్ణవశక్తి యొక్కగుణములే. ఒకే శక్తికున్న రెండు గుణములని,

సృష్టిలయములు. ఈ సత్యమును విడనాడి శివుడు, విష్ణువు అను వేర్వేరు 'దేవతలను మానవులు సృష్టించుకొని, అజ్ఞానమున బడియుండిరి.

శ్రీరామానుజుని కాలమును చోళరాజులు శైవులుగా నున్నందున, శైవముర్రాజమతమాయెను. శైవము, శైవసంస్థలు, శైవులు రాజాదరణమును బొందుచుండిరి. శ్రీరామానుజ సిద్ధాంత కీర్తిసంపదకు భయపడిన శైవులు రాజులకు కుమార్గముల జూపి, వారిని వైష్ణవ మతద్వేషులనుగా మార్చిరి.

క్రీ. శ. 1100 సంవత్సర ప్రాంతమున పాలించిన కులోత్తుంగ చోళుడు తనశైవమంత్రులు, శైవపండితులు ప్రోత్సహింపగా వైష్ణవ ద్వేషి అయినాడు. పరోక్షమున శ్రీరామానుజుని (వైష్ణవచార్యుని) ద్వేషించు వాడాయెను. (అప్పటికి అచార్యులవారి వయస్సు డెబ్బది సంవత్సరములు దాటినది). ఇది అతి శోచనీయమయిన పరిస్థితి. శ్రీరంగమున నున్న శ్రీరామానుజునిపై కులోత్తుంగచోళుడు ఇట్టి కినుక వహించియున్నారని రామానుజునకు తెలియదు; శ్రీరంగములోని రామానుజ మతవాసులకు దెలియదు. కులోత్తుంగుని ఈర్ష్యయను పెనుగాలివర్షము ఏనాడు ఉప్పెనను దెచ్చిపెట్టునో యెవరూహించిరి!

*

## 31. కూరేశుని త్యాగము

కులోత్తుంగచోళునకు వైష్ణవమత ద్వేషియైనట్టియు, శైవుడయి నట్టియు నాలూరు డను పేరుగల మంత్రియుండెను. రాజు శైవుడయినను ఈ మంత్రి ప్రోద్బలమున అతనికి వైష్ణవ ద్వేషము హెచ్చెను. అపరహిరణ్యకశిపుడుగా తయారైనాడు; ఈతని తండ్రి, పితామహులు శైవులైనను ఇంతటి మతాంధకారమున వైష్ణవ ద్వేషులు కారు. వైష్ణవాలయముల శైవాలయములుగా మార్చవలయుననియు, వైష్ణవ మతములను శైవమతములుగా మార్చవలయుననియు, విష్ణుమూర్తి విగ్రహముల నాశనము జేయవలయుననియు, వైష్ణవ భక్తులకు శైవులుగ మార్చవలయుననియు, తిరుమణి శ్రీచూర్ణధారులను, విబూదిధారులుగా మార్చవలయుననియు, వైష్ణవుల చెరబట్ట వలయుననియు, శైవులకు రాజకార్యముల యందు ఉద్యోగము లందును ప్రోత్సహింపవలయుననియు, కులోత్తుంగ చోళుని నిర్ణయములు.

ఆకాలమున దేశపరిపాలనము మతమునకు ముడిబడి యుండెను. శ్రీరామానుజుడు మూఢవిశ్వాసముల నిరసించువాడు గాన, శైవులు ఆయనను ద్వేషింపసాగిరి. రామానుజుడు ప్రజలు పాటించుచున్న ఆచారముల నిరసించుచు, విశిష్టాద్వైత సిద్ధాంతమును నూతన సిద్ధాంతము నొకదానిని ప్రచారము చేయుచుండుటచే, ప్రజలలో నొక విధమైన అశాంతి ప్రబలుచున్నదని కొందరు శైవమంత్రులు రాజున కెరింగించిరి. అందువలన కులోత్తుంగుడు రామానుజుని ద్వేషింప మొదలిడెను.

అదను జూచుకొని నాలూరుడను మంత్రి, "రాజా! వైష్ణవ మతమును మనము తుడిచివేయవలయునన్న, దానిని మూల పురుషుడయిన రామానుజుని తుదముట్టించుట యుక్తము", అని సలహానిచ్చెను.

"రామానుజు డెచ్చటనున్నాడు?" అని రాజు ప్రశ్నించెను.

"అతడు శ్రీరంగమున శిష్యకోటితో నున్నాడు. అతడు ఉత్తర దేశమును, దక్షిణదేశమును పర్యటించి, మతవ్యాప్తిజేసి, ప్రస్తుతము శ్రీరంగమునున్నవాడు. ఈతని మఠమును అనుదినము నలుమూలల నుండి వేలాది భక్తులు దర్శించెదరట. ఈతనిని త్వరలో తుదముట్టించు ఆలోచన జేయుడు" అని నాలూరుడు పల్కెను.

"రామానుజుడా! నేనెప్పుడో యీతనిపేరు మా తండ్రిగారి ద్వారానే వినియున్నానులే! బాల్యమున మా అక్కకు గ్రహము పట్టియుండగా అతడు నివారించెనట, అప్పట్లో యాదవప్రకాశుడను గొప్ప అద్వైత పండితుని శిష్యుడుగా నుండెడివాడట, అతడేనా?'

"అతడే ప్రభూ!"

"అయిన అతనిని తుదముట్టించుటెట్లు? వాస్తవముగా నతడుండిన శైవమునకు ముప్పుతప్పదు! సందిగ్ధముగా నున్నదే! అతనిని రావించి, శైవమును స్వీకరించుమని అజ్ఞాపించెదను".

"రాజా! అది సులభమా! అతడంగీకరించునా?"

"అట్లయిన రాజాజ్ఞ మీరునా? మీరి మనగలడా? సుహృద్భావమున నొక అవకాశము నిచ్చెదగాక!" అని రాజు పల్కెను.

కులోత్తుంగుని రాజ్యము కావేరీనది వరకు వ్యాపించి యుండెనని తెలిసికొని యున్నాము గదా! ఉభయ కావేరుల మధ్య ద్వీపమున శ్రీరంగము కూడా చోళదేశములో చేరినదే. బహుశా అది దక్షిణపు అంచు అని చెప్పనగును. కులోత్తుంగచోళుడు సైన్యాధిపతిని రావించి, కొలది సైన్యముతో శ్రీరంగముపోయి రామానుజుని తోడ్కొని రమ్మని అజ్ఞాపించెను. సైన్యము బయలుదేరినది.

శ్రీరామానుజుని దెచ్చుటకు కులోత్తుంగుడు సైన్యమును శ్రీరంగమునకు పంపినాడను భయంకరవార్త కాంచీపుర వైష్ణవ భక్తులకు, రామానుజ మతవాసులకు, వరదరాజస్వామి దేవాలయా ర్చకులకు తెలియగా వారు కలవరపడిరి. ఇక వైష్ణవ మతము తలయెత్తి

నిలువగలదా, యిక వైష్ణవులను జీవింప నిచ్చెదరా అను ఆందోళన హెచ్చెను.

శైవుడయిన కులోత్తుంగుడు వైష్ణవమత వినాశనము కొరకు గొప్ప పన్నుగడయే పన్నియుండెను. ప్రారంభమున కంచిలోని, కంచికి సామీప్యముననున్న వైష్ణవులపై దండెత్తకూడదనియు, అట్టి చర్య రాజధాని నగరమున కలవరమును కలుగ జేయునని గ్రహించెను. ప్రజలలో ఎంతమంది వైష్ణవమతావలంబులుగానున్నారో, వారిని ఉన్నట్లుండి విరోధులుగా జేసికొనరాదని రాజకీయ తంత్రజ్ఞుడయిన కులోత్తుంగుడు ఆలోచించెను. మరియు కంచికి దక్షిణదేశమున వైష్ణవ మతము ప్రాబల్యముగానుండెననియు, శ్రీరంగము ఇందులకు కేంద్రమైయుండెననియు తెలిసికొన్న కులోత్తుంగుడు త్వరపడి శ్రీరంగ ప్రజల ముట్టడింపరాదనియు, ఎట్లనో రామానుజుని రప్పించి, వానిని శివమతావలంబకునిగా జేయుట యుక్తమని తలంచెను.

పైకారణ ద్వయమున కులోత్తుంగుడు కంచి, శ్రీరంగము తప్ప తక్కిన వైష్ణవాలయములను ధ్వంసముజేసి, బలాత్కారముగానైనను సరే వైష్ణవులను శైవులనుగా మార్చదలంచెను. ఈ క్రూరకార్యము అమలులోనికి వచ్చినది. హింసకాండ పెరిగినది. ఈ ఘాతుక చర్యలకు భయపడి అనేక వైష్ణవులు బాహ్యమునకు కట్టు, బొట్టు, జుట్టు నందు శైవులుగా వ్యవహరించు చుండిరి. శైవులుగానివారికి ప్రభుత్వమున సైన్యమున ఉద్యోగములు లేవు; ఏ ఆదరణ లేదు. మతస్వాతంత్ర్యము వచ్చిననాడే నిజమతమును బైటబెట్టుకొనవచ్చు ననితలచిన ప్రజలు శైవులుగానే పైకి వ్యవహరించుచుండిరి.

కులోత్తుంగుడు చిదంబరములోని గోవిందరాజస్వామి దేవాలయమును ధ్వంసముజేసి, మూలవిగ్రహమును నాశనము జేయ ప్రయత్నించెను. కులోత్తుంగునకు ఇక మిగిలియున్న ముఖ్య దేవాలయములు కంచి వరదరాజస్వామి ఆలయము, శ్రీరంగమునున్న శ్రీరంగనాథాలయము.

శ్రీరంగపుర వైష్ణవులకు కులోత్తుంగుని ఎత్తుగడలు రహస్యముగా తెలియుచుండెను. కంచిలోని వైష్ణవభక్తులు వార్తలను ఎట్లునో దాట వేయుచుండిరి. వైష్ణవుల జీవితములు కంచిలో దుర్భరముగా నుండినవి.

ఉన్నట్లుండి ఒకనాటి తెల్లవారు ఝామున చోళసైన్యములు శ్రీరంగములోని రామానుజ మఠమును ముట్టడించినవి. మఠవాసు లెవరును వెలుపలికి రాను వీలులేదు; సైనికులు మఠప్రాంగణము చుట్టును నిలువబడి యున్నారు. సూర్యోదయమగు చున్నది. లోనున్న మఠవాసులు భయకంపితులయిరి. పురజనులు భయమున ఇండ్ల నుండి వెలుపలకు రారైరి. సైనిక కార్యమేమో యెవరికిని తెలియక పోయెను! భయము, ఆందోళన, అనుమానములు వాతావరణమును కలుషితము జేసినవి. పురవాసులయిన వైష్ణవభక్తులు, సామాన్య ప్రజలునుసైతము రామానుజున కెట్టి ముప్పు వాటిల్లునో అని భయపడుచుండిరి. సైన్యము పట్టణవాసులజోలికి పోలేదు. రామానుజుని మాత్రమే తోడ్తెమ్మని గదా రాజాజ్ఞ! రామానుజునే శైవునిగా మార్చవలయునని గదా రాజుయొక్క ఉద్దేశము.

కూరేశుడు మఠము నుండి వృక్షముల తెరలనుండి కొలది దూరమున చెట్లవరున ప్రాకారము చుట్టును నిలువబడియున్న సైనికుల జూచెను. వెంటనే అయన సర్వమును గ్రహించిన వాడాయెను. ముఖమున, భుజముల, వక్షస్థలమున తిరుమణి శ్రీచూర్ణ ఊర్ధ్వపుండముల ధరించి, దైవనామసంకీర్తన గానము గావించుచు, మఠ గృహమును వదలి, తోట గుండానడచుచూ, వెలుపలి ప్రహరీ ద్వారము కడకు కూరేశుడు వచ్చెను.

సైన్యాధిపతి, "రామానుజాచారివి నీవేనా? ఇదిగో రాజాజ్ఞ పత్రము!" అని క్లుప్తముగా అధికారయుక్తముగా పల్కి, పత్రము నొసంగెను.

భటాధిపతి కేకలు వేస్తున్నాడు; వచ్చుచున్నాను అనుచు కూరేశుడు గబగబ నడిచివచ్చి, సైనికులను తన్ను తానే సంతోషముగా అప్పగించుకొన్నాడు. కూరేశుని గుఱ్ఱముపై కూర్చుండబెట్టినారు సైనికులు. సమీపమున ఊర్ధ్వపుండ్ర ధారియగు మహాపూర్ణుడు (పెరియనంబి) ఉండెను. "నీవెవరని "సైనికులు ప్రశ్నింపగా, "రామానుజుని ప్రథమశిష్యుడన"ని పెరియనంబి పల్కెను. "ఓహో! గురువులవారిని వదలలేక యున్నారా? సరే, నీవును రమ్ము", అని హేళనజేయుచూ సైనికులు పెరియనంబిని మరియొక గుఱ్ఱముపై కూర్చుండబెట్టిరి. కూరేశ పెరియనంబులతో చోళసైన్యములు తిరుగుదారి బట్టినవి. మతవాసులు, భక్తులు, ప్రజల యొక్క శోకము వర్ణనాతీతము. "పరమభక్తులగు కూరేశ పెరియనంబుల కెట్టి కష్టములు సంభవించెగదా! శ్రీమద్రామానుజు డెట్లెగెనోగదా", అని సర్వులు కంటనీరు బెట్టిరి.

కూరేశ మహాపూర్ణులెట్టి స్వార్థరహితులో, త్యాగశీలురో ఆలోచింపుడు. శ్రీమద్రామానుజుడు తప్పించుకొని పోయినాడను వార్త సముద్రమధ్యమున మునిగిన నావయయ్యెను. సకాలమునకు సమయోచితముగా అది బహిర్గతమగును గాక అని వైష్ణవోత్తము లెల్లరు భావించి మిన్నకుండిరి.

కులోత్తుంగచోళుడు సింహాసనాసీనుడై యున్నాడు. అమాత్యులు, సేనానులు, సామంతులు, శైవపండితులు, ప్రజలు రాజదర్బారును నిండియున్నారు. సైన్యాధిపతి కూరేశ, పెరియ నంబులను ప్రభువునెదుట నిలువబెట్టినారు. అందరును కూరేశుడు శ్రీరామానుజుడనియు, పెరియనంబి రామానుజ శిష్యుడనియు తలచిరి; రాజుసైతము అట్లనే భావించవలసినదే గదా!

కులోత్తుంగ మహారాజు, "రామానుజా! నీయెడ నాకు గౌరవ మున్నది. నీ మతమును నేను ద్వేషించినను, నిన్ను ద్వేషించను. నా బాల్యమున నా జ్యేష్ఠ సోదరికి నీవు రోగనివారణ గావించి యున్నావట; ఆ విషయము నేను బాల్యముననే మాతండ్రిగారి నుండి తెలిసికొని

యున్నాను. అందువలన త్వరపడి నేను నిన్నేమనను. నీకు తగిన వ్యవధిని కలుగజేసెదను; సావధానముగా ఆలోచించుకొనుము. నీవువైష్ణవమతమును విడచి, శైవుడవు కమ్ము. అట్టి యెడ నిన్ను నేను గురువుగా స్వీకరింపగలను. నిన్నుశైవమత సామ్రాజ్యమునకు పాలకుని జేసెదగాక! ఇచ్చట మూగిన అమాత్య, సైన్యాధిపతి, పండిత వర్యు లెల్లరు నీ శిష్యకోటిలో నుందురు గాక! నీవు అలంకరింప బోవు శైవ పీఠమునకు, మఠమునకు అగ్రహారముల నొసగెద; ధనధాన్యాదుల నిచ్చెదను. నీవు శైవమును స్వీకరించి, శైవము నుద్ధరించి, నీవు శాంతిని బొంది నాకు తృప్తిని, విజయమును కలుగజేయుము", అనెను.

కూరేశుడు మదిలో, "ఈ మూర్ఖుడు నన్ను శ్రీరామానుజునిగా భావించుచున్నాడు! జరుగనిమ్ము కొన్ని నిముషముల కాలము", అని తలంచుకొనెను:

తరువాత రాజునుద్దేశించి, కూరేశుడు, "రాజా! నా స్వమతమును నేనెట్లు వీడగలను? లంచమునకు మతము మార్చుకొనువారుందురే! అధికారమే సర్వము అని భావించు నీకు సత్యము తెలియరాదు. నీవు శైవుడవు కావచ్చును; శైవమతావలంబకులయెడ ఆదరము కలిగి యుండవచ్చును; అందు ఏలాటి దోషము లేదు. శివభక్తి పరాయణుడ వయిన యెడల నిన్ను ప్రశంసించవలసినదే. కాని నీకు శైవమతాభి మానముకంటే వైష్ణవమత దురభిమానము మెండు! నీవు పరమత ద్వేషివి! నీవు వ్యక్తి ఆలోచనా స్వాతంత్ర్యమును గూడా తీసివేయ దలచుచున్నావా? ఇది నీకును, ప్రజలకును, దేశమునకును శ్రేయస్సు గానేరదు. ప్రజలవద్ద నుండి కప్పములు, పన్నులు వసూలుజేసి కొనుచున్నావు; అనుభవించి సుఖించుము. అంతవరకే, కాని ప్రజల మతస్వాతంత్ర్యమును తీసివేయుటకు నీవెవరవో కొంత ఆలోచించు కొనుము", అని కూరేశుడు ఆలోచన ప్రేరేపకముగా పల్కెను.

అదివిని రాజు ఆగ్రహమున, "రామానుజా! రాజాజ్ఞను తిరస్కరించు చున్నావా? జాగ్రత్త! రాజాజ్ఞధిక్కారమున కెట్టి శిక్ష యుండగలదో ఆలోచించుకొనుము", అని గర్జించెను.

"రాజా! నీ అజ్ఞాన దీనస్థితికి నేనెంతయో సానుభూతిని వెల్లడించుచున్నాను. అజ్ఞానుడగువాడు అధికారియయిన ఆతని అధికారమునకు లోబడియుండు ప్రజల యిక్కట్లు బహుమెండు. నీబోటి ప్రభువు సంక్రమించడం ప్రజల యొక్క దురదృష్టము..... రాజా! నీవు శైవుడనని భావించుచున్నావే గాని, శైవమనగా నీకుయేమో తెలిసినట్లు లేదు. ఇక అద్వైత మనగా నేమో నీకు తెలియదు. ఇక నీవు వైష్ణవునేల ద్వేషించుచున్నావో నీకు తెలియదు. నీవిట్టి అజ్ఞానమున బడియుండగా, నీ మంత్రులు, సలహాదారులు, నీ మతాచార్యులు నిన్ను అజ్ఞానకూపమున మరింత లోతునకు నెట్టుచున్నారు. పాపము, నీదుస్థితికి నేవగచుచున్నాను. నీకు జ్ఞానోదయమును గల్గించి, ఋజుమార్గమును జూపి, సత్కార్యములకు ప్రేరేపింపుమని దైవమును ప్రార్థించుచున్నాను. అహంభావము నుప్పొంగ నీకు పశ్చాత్తాప భావమును. శరణాగతి భావమును గలుగజేయుమని ఈశ్వరశక్తిని ప్రార్థించుచున్నాను", అని కూరేశుడు చెప్పెను.

కులోత్తుంగుని కోపావేశము మండుచున్న అగ్నికి తైలము చేరినట్లయినది. "మరియొక కడపటి అవకాశము నిచ్చెద ఈతనికి," అని ఆతడు తలంచెను.

రాజాజ్ఞానుసారము, "శివాత్పరతరంనాస్తి", అని వ్రాయబడియున్న తాళపత్రము, ఘంటమును రాజభటుడు కూరేశుని చేతికిచ్చెను.

"ఆ పత్రములోని వాక్యమును చదువుకొని, దానిక్రింద నీ అంగీకారమును సూచించుటకుగాను నీసంతకము చేయుము", అని రాజు అధికార యక్తముగా క్లుప్తముగా ఆజ్ఞను వెల్లడించినాడు.

కూరేశుడు మందహాసము జేయుచూ, ఆ పత్రమును చేబూని, "శివాత్పర తరం నాస్తి" అని అందరూ వినునట్లు బిగ్గరగా చదివినాడు.

"ఓహో! యీతని మందహాసము, పఠనావైఖరి పరికించిన, ఈతడు దారికి వచ్చుచున్నాడని తెలియుచున్నది", అని రాజు లోలోన తలంచెను. ఇతరులు గూడా నట్లే భావించిరి.

"ఆలస్యమేల? ఇక అందులో నీ సంతకము పెట్టుము", అని రాజన్నాడు.

కూరేశుడు నగుచూ, ఘంటముతో ఏదోవ్రాసి, పత్రమును ఘంటమును రాజబంటునకిచ్చెను. భటుడు పత్రమును నాలూరుడను ప్రధానమంత్రికి అందజేసినాడు.

"అరే, కడకు రామానుజుడింతసులువుగా సంతకము జేసినాడే," అని రాజును, ఇతరులును ఆశ్చర్యమున చూచుచుండిరి.

మంత్రి తనలోతాను పత్రమును చూచినాడు. సంతకము కాదు వ్రాయబడినది! మరియేమి వ్రాయబడినది.

"ద్రోణమస్తి తతః పరం" అని వ్రాయబడియున్నది. మంత్రి రెండు మూడు మార్లు చదువుకుంటున్నట్లున్నది. తరువాత ప్రక్కననున్న ప్రధాన శైవమతాచార్యునకు చూపినాడు. ఆ పత్రమును. అతడు చూచి నివ్వెరపోయినాడు.

"ఆ నిశ్శబ్దతకు కారణమేమి? ఏమి ఆశ్చర్యమున చూచుచున్నారు మంత్రియు, ఆచార్యుడును. సంతకముగావించి యున్నాడు గదా!" అని కులోత్తుంగుడు కొంత ఆతురతతో నడిగెను.

మంత్రి, "రాజా! అతడు సంతకము చేయలేదు", అని విచారమున ఆశ్చర్యమున పలికెను.

సర్వులును ఆశ్చర్యమున చూచుచుండగా, కూరేశుడు మందహాసము జేయుచూ మిన్నగా గంభీరముగా నిలువబడి యుండెను. కూరేశుని మందహాసము రాజునకొక బాణముగా తగిలెను. వృద్ధుడయిన పెరియనంబి అట్లే నిలువబడియుండెను. వారెప్పుడు ఆహారమునుగొనిరో, ఎప్పుడు నీరు త్రాగిరో? వార్ధక్యజనిత బలహీనత నెదిర్చి శాంతముగా నిలువబడియున్నాడు.

"మంత్రీ - ఆలస్యమేల - అతడేమి వ్రాసెనో తెల్పుము", అని రాజు అనెను.

"ద్రోణమస్తి తతః పరం" అని వ్రాసియున్నది" అని మంత్రి పల్కెను.

(కులోత్తుంగుడు సంస్కృతభాషా జ్ఞానము గలవాడే. కూరేశుడు వ్రాసిన వాక్యమును అర్థముజేసికొన్నాడు. శివం= అను పదమునకున్న నానార్థములలో "ఒక కొలత పాత్ర" అను అర్థమును కూరేశుడు తన వాక్యమున ఆపాదించినాడని రాజు తెలిసికొనెను. "ద్రోణం" అనగా "శివం" కంటె పెద్దకొలతపాత్ర). "శివం" అనునది నాల్గుశేర్ల పాత్ర; "ద్రోణం" అనునది నలుబదిశేర్లపాత్ర). "శివం కంటె ద్రోణం పెద్దది" అని భావమును వ్యక్తముచేయుచున్నది కూరేశుడు వ్రాసిన వాక్యము. శ్లేషార్థవాక్యముతో కూరేశుడు తన్ను హేళనజేసినాడని రాజు మండిపడెను.)

"ఏమి వ్రాసినావు", అని రాజు మండిపడెను.

కూరేశుడు శాంతముగా గంభీరకంఠ స్వరమున ఒకలఘు ఉపన్యాసమును గావించెను - "సత్యమును వ్రాసినాను రాజా! వినుము, వివరించెద. "శివం" కంటె గొప్పది మరియొకటిలేదన్న" వాక్యమున కంగీకారముగా నా సంతకము చేయమన్నావు. "శివం" అను కొలతపాత్రకంటే "ద్రోణం" అను పెద్దకొలతపాత్ర యున్నదికదా! అందువలన "ద్రోణమస్తి ఇతః పరం" అని వ్రాసినాను. ఇందు అసత్య మేమున్నది?

మరియు వినుము. "శివం" అనగా శుభమైనది అని భావము. ఇది ఆధ్యాత్మికార్థము. సర్వాంతర్యామియయిన ఈశ్వరశక్తి శివమైనది; అంతియేకాదు, అది రౌద్రమైనది కూడా; అది సర్వశక్తి యుతము; సర్వగుణయుతము. అది అనంతము; ఆది మధ్యాంత రహితము. ఈశ్వరశక్తి కున్న సహస్ర గుణ విశేషణములలో "శివం" అనునది యొకటి. అంతవరకే.

ఈశ్వరశక్తి సర్వవ్యాపితమయినది గాన "విష్ణుం" అని అంటారు. కావున "విష్ణు" యొక్క అనేకగుణములలో "శివం" అనునదొకటి.

కావున "శివం" అను పదమునకున్న అర్థవైశాల్యమునకంటె "విష్ణుం" అను పదమునకున్న అర్థవైశాల్యము ఎంతో గొప్పదిగదా! కావున ఈశ్వరశక్తి యొక్క వైష్ణవతను తెలిసికొమ్ము. విశ్వాత్ముడవుకమ్ము. "శివం" అంటే ఒక దేవత, "విష్ణుం" అంటే ఒక దేవత అని భావించినావేమో! నీ అజ్ఞానమునకు చింతించుచున్నాను.

రాజా! నీకు శైవ మనగానేమియో తెలియదు. నీవు నిజముగా శైవుడవయిన, ప్రపంచ శుభమునే కోరువాడివిగా నుందువు. అట్లుగా లేవే నీవు! శైవతత్త్వముగాని, అద్వైతతత్త్వముగాని చాల ఉన్నతము లైనవి. మొదటిది శుభమును కాంక్షించును. రెండవది ఆత్మ జ్ఞానము నొసంగును. ఆది శంకరుడు తన అద్వైత సిద్ధాంతముతో ఆనాడు జైన బౌద్ధమతస్థులు పాటించుచున్న లోపములను జూపినాడు; వారిని సవరింపజూచినాడు. పరమత పెద్దలతో చర్చించి, వారిని సమ్మతింపజేసి అద్వైతమును ప్రచారము చేయగలిగినాడు. నీమాదిరి ఖడ్గమును జూపెనా? కత్తి చూపి భయకంపితులను జేయునీ మతము కిరాతకము. నీది శైవమెట్లగును? కారే రాజులు, రాజ్యముల్ గలుగవే, గర్వోన్న తింజెందరే, వారేరీ? నీస్థితియు అంతియేగదా! కావున నీ హింసా మార్గమును విరమింపుము. నీకు నిజముగా శైవము మీదను, అద్వైతము మీదను విశ్వాసమున్నచో వానిని పాటింపుము; ప్రచారము జేయుము; నమ్మినవారు వానిని స్వీకరింతురుగాక! నమ్మికలేనివారు వారికివచ్చిన యేదర్శనమునైనను స్వీకరింపనిమ్ము. అంతేగాని, సర్వులను, నీకే అర్థము గాని నీ మతమునకు, మర్లింప నీతరమా? శరీరమును నిర్బంధింతువుగాని మనస్సును మార్పగలవా? ఇప్పుడు నీకు పరివృతులై ఆశీనులైయున్నవారిలో ఎందరి హృదయములలో విశిష్టాద్వైతము తిష్ఠవేసికొని వెలుగుచున్నదో నీవెరుగుదువా? తదకు నీవైనను అద్వైతివిగా నుండగలవా? ఆదిశంకరుడు సైతము తన తల్లికి అవసానకాలమున ఆమె కోరికననుసరించి, అష్టాక్షరిని చెవులలో వేసినాడట. అద్వైతియయిన యాదవప్రకాశుడు కడకు విశిష్టాద్వైతి కాలేదా? ఈ కాంచీపురముననే? వారివారి యిష్టానుసారము మతమ

నునది. నీవు బలాత్కారము జేయతగదు. వైష్ణవుల నెందులకు అకారణముగా రాక్షసముగా హింసించెదవు? కన్ను దెరచుకొనుము ఈ నాటికైనను", అని కూరేశుడు ఆచార్యుడు శిష్యుని శాసించు విధమున పల్కెను.

కులోత్తుంగుడు ఆ క్షణమున నివ్వెరపోయినాడు. మరుక్షణమున కోపగర్వములు వానిమనస్సు నావరించినవి - "నీ అహంకారము హద్దు మీరినది! నీ కళ్ళు పెరికిస్తాను! సైనికులారా వాడి పులిగోళ్లను ధరించిన మీచేతివ్రేళ్లతో ఆముదుసలుల యిరువురి కనుగ్రుడ్ల నీ క్షణమున పీకి వేయుడు!" అని రాజు గర్జించెను.

కూరేశుడు బిగ్గరగా పకపక నవ్వినాడు - "నీవు నాకండ్లను దీయించ నవసరములేదు. మహాపాపివైన నిన్ను జూచిన యీ దురదృష్టకర నేత్రములతో నా ఆచార్యుడును, భగవానుడును, దయా సముద్రుడును, ఉడైయవర్లును అయిన శ్రీమద్రామానుజుల దివ్య విగ్రహమును దర్శించుటకు నాకిష్టములేదు! నేనే నానయనముల పీకివేసికుంటాను", అని గర్జనచేయుచూ, ఆ క్షణము తన వాడి గోళ్లతో తానే తన కనుగ్రుడ్లను పెళ్లగించి లాగి క్రింద పడవేసెను. పాపము! కూరేశుని నేత్రయుగ్మము నుండి పవిత్ర రుధిరము కారుచున్నది. శరీరమంతయు రక్తసిక్తమయినది. ఆ భయంకర దృశ్యమును జూచి హృదయముగలవారు నిశ్చేష్టులయినారు. ఈలోననే కఠినాత్ముడయిన ఒక సైనిక కిరాతకుడు మహావృద్ధుడయిన పెరియనంబి కండ్లను వాని పులిగోళ్ల కవచములు గల చేతివ్రేళ్ళతో పీకివేసినాడు. భగవానులైన వారిరువురు పరకాయ ప్రవేశము జేయగల ప్రవీణులు గాన, రక్తము కారుచున్నను శాంతముగా కుయ్ అనక నిలవబడియున్నారు వీరసైనికుల వలె!

క్రూరుడయిన కులోత్తుంగుడు సైతము ఒక క్షణము కాలము స్తబ్ధుడయినాడు! "నీవు రామానుజుడవు కావన్నమాట!!" అని ఉద్వేగముతో పల్కెను.

"కాను, వారి శిష్యపరమాణువును, భక్తాంఘ్రిరేణువును. కూరేశుడను నామధేయుడను", అని అనుచూ, శ్రీరామానుజుని స్తోత్రము జేయనారంభించెను! నిండు సభలో అందరును నివ్వెరపోయి చూచుచున్నారు!

శ్లో॥ యోనిత్యమచ్యుత పదాంబుజ యుగ్మరుక్మ
వ్యామోహత స్తదితరాణి తృణాయ మేనే
అస్మద్గురో ర్భగవతోస్య దయైకసింధోః
రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే

శ్లో॥ లక్ష్మీనాథ సమారంభాం నాథ యామున మధ్యమామ్
అస్మదాచార్య పర్యన్తాం, వందే గురుపరంపరామ్.

అని కూరేశుడు శ్రీరామానుజుని, గురుపరంపరను స్తోత్రము జేయగా, వినుచుండిన పెరియనంబి, "ఆహా! నేత్రముల కంటే కర్ణముల ప్రయోజనమే మిన్నగానున్నది కూరేశా! అహా, నీవు గానము జేసిన యీ శ్లోకద్వయము ఎంత రమణీయముగా నున్నది!" అనుచూ ఏకసంథాగ్రాహియయిన పెరియనంబియు ఆ శ్లోకద్వయమును పల్కెను!!

కులోత్తుంగుడు పిచ్చివానివలె దిక్కులు పిక్కటిల్లునట్లు కేకలు వేయదొడగెను - "ఎంత మోసము జరిగినది! రామానుజుడు తప్పించుకొనిపోయెనా?"

ఆ సభలో శైవవేషధారులుగా నటించుచున్న అనేక వైష్ణవులు ఉన్నారు! లోలోన రామానుజుడు తప్పించుకొనిపో గల్గినందులకు సంతసించిరి. కూరేశ పెరియనంబుల దుస్థితికి దుఃఖించినారు.

"సైనికులారా! ఈ వృద్ధులనిద్దరిని ఇక తరిమివేయుడు. రామానుజు డెందుబోయినను ఎట్లనో ఒకట్లు పట్టితెండు. వెంటనే పొండు. రాజ్యమంతయు నలుదిక్కుల గాలింపుడు", అని ఆజ్ఞాపించుచూ, ఆనాడు తనకు మానసికముగా జరిగిన అవమానమును భరింపలేక కులోత్తుంగుడు దర్బారు నుండి వెడలిపోయెను.

రామానుజుని పట్టితెచ్చుటకు సైనికులను గూఢచారులను నలువైపులకు బంపుటకు సైన్యాధిపతి ఉత్తరువుల నొసంగెను.

కొందరు భక్తులు భయముతో మెల్లమెల్లగా కండ్లుబోయిన కూరేశ పెరియనంబులను శ్రీరంగమున వైపుబోవు మార్గము నెక్కించిరి. ఆ వృద్ధుల శరీర బాధలనేమని వర్ణింపగలము? వార్ధక్యమున పెరియనంబి తనకు గలిగిన హింసను భరింపలేక మార్గమధ్యముననే మరణించెను. ఇక మిగిలిన కూరేశుడు మార్గమధ్యముననే తన్ను కలిసికొన్న ప్రజలకు తన దుస్థితిని వెల్లడించి, పెరియనంబికి అగ్ని సంస్కారముల జేసి, యెట్లనో తిన్నగా నడచి, కడకు శ్రీరంగ పట్టణ శివారుల జేరెను. సాధ్వీమణి ఆండాళ్లు భర్తకు సంభవించిన దుస్థితి కెంతయో వగచెను. బాలురైన కుమారులు పరాశరవ్యాసులు తండ్రిని జూచి యెంతయో దుఃఖించిరి. కూరేశాగమనము దెలిసికొన్న పెరియనంబి కుమార్తె, వేవేగవచ్చి, కూరేశుని దుస్థితికి తండ్రి మరణమునకు ఎంతయో బాధపడెను. అశేష, భక్తజనులు రామానుజ మతవాసులు కూరేశుని దర్శించి, వారికి, సంభవించిన దుస్థితికి సంతాపమును వెల్లడించి, కన్నీరుమున్నీరుగా నేడ్చిరి. సుఖ దుఃఖాది ద్వంద్వాతీతుడగువాడను, స్థితధీరుడను, స్థిత ప్రజ్ఞయోగియునగు కూరేశుడు, "నాయనలారా! సుజనులారా! నాకు బాహ్య విషయముల జూడక, నామనోనేత్రములతో శ్రీమన్నారాయణునొక్కనినే దర్శించెద గాక. అంతవరకు నా పవిత్రత ద్విగుణీకృతమగుచున్నది", అని భార్యా సుతులను, భక్తులు సానుభూతి పరులను ఓదార్చెను.

ఈలోపల కులోత్తుంగుని ఉత్తరువులు శ్రీరంగము జేరినవి. "రామానుజుని గురత్వమునకు త్యజించితేనే కూరేశునకు శ్రీరంగపట్టణ ప్రవేశము గలదు, లెనియెడల అతడు శ్రీరంగపట్టణం వెలుపలనే యుండవలసినదే", అను రాజాజ్ఞను భటులు కూరేశునకు దెల్పిరి.

"మంచిది. చాల సంతోషము. ఈ ఉత్తరువు నన్ను ప్రభావితుని జేసినది. శ్రీమద్రామానుజాచార్యుల వారు లేని శ్రీరంగమును

ప్రవేశింపరాదు. ఈ షరతుతో శ్రీరంగనాథుని దేవాలయముతో గూడ నాకవసరములేదు - భరతునకు రాముని లేని అయోధ్య వలె", అని కూరేశుడు ధీరునివలె పల్కెను.

శ్రీరంగపట్టణము వెలుపల పుణ్యతిరుకావేరీ తీరమున భక్తజను లేర్పాటుగావించిన పర్ణశాలయందు కూరేశుడు, ఆండాళ్లు భగవన్నామ సంకీర్తనమున కాలము గడపుచుండిరి. పరాశరుడు వ్యాసుడు బాల్యముననే రామానుజ మతవాసులయిరి. ఏనాటికైనను శ్రీరామానుజుడు పునరాగమనమును గావించునను దృఢవిశ్వాసమున కూరేశుడు జీవించుచుండెను.

# 32. సీమాంతరవాసము

అనాడు చోళసైన్యములు కూరేశ పెరియనంబులను మఠద్వారము గుండా తీసికొనిపోయిన పిదప, రామానుజుడు జరిగిన సంగతిని తెలిసి మిగుల వగచెను. పిమ్మట రామానుజుడు కొలదిమంది శిష్యులతో గలిసి మఠవనము యొక్క పెరటిత్రోవన రహస్యముగా తప్పుకొని పోయెను. దట్టమయిన అరణ్యముల గుండా పరుగిడి, పరుగిడి కొలది దినములకు నీలగిరుల జేరిరి. అనగా చోళరాజ్య సరిహద్దులను దాటి కేరళరాజ్యము, కర్నాటక రాజ్యముల సరిహద్దులను జేరిరి. కులోత్తుంగుని జీవితకాలమంతయు తాము పరరాజ్యముల నుండవలసినదేనని రామానుజుడు తలంచెను. వారికి పరరాజ్యమనున దేమున్నది? చోళరాజ్యము నుండలేరు. అంతవరకే!

నీలగిరులను దాటి సమీపారణ్య ప్రాంతముల జేరినది రామానుజ బృందము. ఇది మైసూరు (కర్ణాటక) రాజ్యభాగము. ఈ యరణ్యముల యందు ఒకజాతి బోయ ప్రజలు వాసము జేయు చుండిరి. వీరు వైష్ణవమతావలంబుకులు. వీరికి నల్లాన్ చక్రవర్తి యను నామమున నొప్పు నాయకుడొకడుండెను. ఇతడు బ్రాహ్మణ కులజుడు. అతడు మూఢాచారములకు వ్యతిరేకి; అతడు ప్రజలనందరిని వర్ణభేదములు పాటింపక ప్రేమించి, ఆదరించి, సేవించువాడు. ఒకప్పుడు అస్పృశ్యు డనబడువాడొకడు మరణింపగా, ఆతని వారెవరును అంత్యక్రియలు జరుపువారు లేనందున ఈ నల్లాన్ చక్రవర్తి ఆపంచము డనబడువాని మృత కళేబరమునకు అంత్యక్రియులు జరిపినాడట. అందుకు కులస్థులయిన బ్రాహ్మణు లాగ్రహించి, అతనిని కులము నుండి బహిష్కరించిరి. అట్టి బ్రాహ్మణ జాతివారిని, వారిని ప్రోత్సహించు ఇతర సవర్ణహిందువులనబడువారిని మన్నించి, వారితో కలిసి జీవించుటకంటె వనవాసము మేలని తలచిన నల్లాన్ చక్రవర్తి యీ నీలగిరుల ప్రాంతమునకువచ్చి, బోయలకు గురువై, నాయకుడై వారికి సంస్కారసేవల గరపు చుండెను.

బోయలును, వారి నాయకుడు నల్లాన్ చక్రవర్తియు శ్రీరామానుజుని, వారి శిష్యులను జూచి, వారి స్థితికి సానుభూతి పలికిరి, "స్వామీ! మహాత్ములగు మిమ్ముల చోళరాజు చెరపట్టెను గదా! మీరు మరల చోళరాజ్యమున నడుగుపెట్టపనిలేదు. మీరిచటనే యుండుడు. మాకు ఆచార్యులుగా నుండుడు. మేము మిమ్ముల నారాధించు కొనుచూ తరించెదము", అని పలుకుచూ, రామానుజునకు సాష్టాంగ పడిరి. శ్రీరామానుజుడు వారిప్రేమకు, భక్తిభావమునకు, అతిథి సత్కార భావమునకును, వారికి గలవైష్ణవాభిమానముకును ఎంతయో ఆనందించి, వారిని ఆశీర్వదించి, శుభలగ్నమున వారినందరిని పవిత్రుల జేసి, వారికి తిరుమంత్రోపదేశము గావించెను.

నీలగిరుల నుండి యింకను పడమరవైపు పయనించి, రామానుజుడు మైసూరు దేశమున తన విశిష్టాద్వైత సిద్ధాంతమును వ్యాపింపజేయదలచెను. నీలగిరుల వాసులు బోయలు శ్రీరామానుజ బృందమునకు మైసూరు రాజ్యముజేరుటకు తగు ప్రయాణ సహాయములు గావించిరి. ఆహార సామాగ్రిని కొన్ని దినములకు సరిపోవునంతగా సమకూర్చిరి; కొంతమంది తోడుగా నడచిరి. ఆచార్య హోదాలో శిష్యపరివృతుడై భక్తజనులు తోడురాగా శ్రీమద్రామానుజుల వారు మఠపీఠాధిపతిగానే మైసూరు రాజ్యమును ప్రవేశించిరి.

శ్రీరామానుజుడు మైసూరు రాజ్యములోని తొండనూరను గ్రామమును జేరెను. దీనిని తొన్నూరనియు నందురు. అప్పట్లో మైసూరు రాజ్యము నేలుచుండిన రాజవంశము హొయసలవంశము. ఈ వంశస్థుడయిన విఠలదేవుడు అప్పట్లో పరిపాలించుచుండెను.

విఠలదేవుడు జైనమతస్థుడు. అతడు ముస్లిములతో యుద్ధము జేయునెడ, కాలువిరిగి, కొంత చికిత్స జరిగినను, అతడు కొలది కాలికుంటితో కుంటుతూ, నడచువాడు. ఈతని కొక కుమార్తె యుండెను. ఆమె గ్రహపీడితురాలుగా నుండి ఎందరు భూతవైద్యులు చికిత్స గావించినను, ఆమె ఆరోగ్యవంతురాలు కాలేదు.

శ్రీమద్రామానుజుడు విఠలదేవుని సందర్శించెను. అప్పట్లో రాజు జైన సన్న్యాసులుపై కోపము బూనియుండెను; అంగవైకల్యము గల రాజు నింట ఆతిథ్యము స్వీకరింపమని జైన సన్న్యాసులని యుండిరట. అందులకు రాజు అవమానమున భరింపజాలకు కుపితుడైయుండెను. అంగవైకల్యము గలవాడు పరిపాలకుడుగా నుండరాదని జైనుల మతమేమోనని రాజు మరియూ ననుమానించియుండెను. తాను జైన మతావలంబకుడుగావునను, తనరాజ్య ప్రజలు యెక్కువ మంది అకారణమున జైనమతమును స్వీకరించియుండుట చేతను రాజు జైనసన్న్యాసులను వెంటనే వ్యతిరేకించలేక దీర్ఘాలోచనమున కొంత కాలము నుండి మ్రగ్గుచుండెను.

శ్రీమద్రామానుజుడు గొప్ప మతప్రవక్త యనియు, చోళరాజ్యము నుండి అరుదెంచియున్నాడనియు తెలిసికొన్న విఠలదేవ మహారాజు రామానుజుని సగౌరవముగా నాహ్వానించెను. రామానుజుడు ఒక్కసారి యేకాగ్రతతో రాజును ఆపాదమస్తకము జూచెను; ఆ క్షణమున రాజు కొలదిజంకు నభినయించినటుల నగపడెను. జైనసన్న్యాసుల వలన అగౌరవమును రాజుబొంది యున్నాడని అంతకు పూర్వమే రామానుజుని చెవునబడియుండెను. శ్రీమద్రామానుజుడు రాజు శిరస్సును తన పవిత్ర హస్తయుగళితో స్పర్శించుచూ ప్రోత్సాహకరముగా మందహాసము గావించుచూ, ఆశీర్వాదము గావించెను. "రాజా! మతస్థులనబడు వారినుండి నీవు బొందిన అనాదరమును మరచి పొమ్ము. అంగవైకల్యమునకు జంకుచున్నట్లు గనపడుచున్నావు. శారీరక కుంటితనమునకేమున్నది! మానసిక కుంటితనము గదా మానవుని దిగజార్చి హీనునిగా జేయుచున్నది! నీ మనస్సు 'ఉన్నతమయినది! పెద్దలయెడ వినయవిధేయతలు నీయెడనున్నవి. ప్రజల రంజింప జేయు సంకల్పమునకే పాలన గావింతునని వినియున్నాను. నీవు రాజోత్తముడవు!" అని రామానుజుడు పల్కగా రాజు మనస్సు ఎండిన కొమ్మ చిగిర్చినట్లాయెను. శ్రీరామానుజుడు తన మనస్సునకు వసంతమును చేకూర్చినాడని రాజు పరమానంద భరితుడై సగర్వమున ఆత్మగౌరవమున ముకుళిత హస్తుడై రామానుజునకు మ్రొక్కెను.

గ్రహపిడితురాలును, నిస్సంతోషియును అగు రాజకుమార్తెను రామానుజునకు జూపి, ఆమెను ఆశీర్వదింపమని శ్రీరామానుజుని ప్రార్థించెను. శ్రీమద్రామానుజుడు నిష్కళంకమనమున దయార్ద్ర హృదయమున రాజకుమార్తె క్షేమమును హృదయ పూర్వకముగా కాంక్షించుచు, అమె మూర్ధమును స్పర్శించి ఆశీర్వదించెను. ఆమె గ్రహము వదలిపోయెను. నిద్రనుండి లేచిన ఆరోగ్యవంతురాలుగా ఆమె కన్పడెను. సర్వులు ఆనందించిరి. రాజునకు, ఉద్యోగులకు, ప్రజలకు అది నేత్రపర్వము గావించెను. ముఖ్యపట్టణమున అదియొక పర్వదినముగా పాటింపబడెను.

రాజదర్బారునందు రాజవంశస్థులు, మంత్రులు, ప్రజలు కొలువుదీరి యుండ భగవద్రామానుజులవారు వారి నుద్దేశించి, విశిష్టాద్వైత సిద్ధాంతమును గూర్చి విపులముగా ప్రవచించెను. విఠలదేవరాజు అత్యానందమున రామానుజునకు సాష్టాంగపడి విశిష్టాద్వైత మతమును స్వీకరించెను. ఆ శుభసమయమున, యథారాజ తథా ప్రజః అన్నట్లు అమాత్యులు, ఉద్యోగులు, వర్తకులు, పండితులు, సామాన్య ప్రజలు ఎల్లరు విశిష్టాద్వైత మతమును స్వీకరించిరి. ఈ వార్త వినిన దేశములోని ప్రజలెల్లరు క్రమక్రమముగా కొలది దినముల లోనే వైష్ణవమతమును స్వీకరించిరి. శైవులుగా నున్నవారిని ఏ విధముగా బలాత్కరింపలేదు. రామానుజుడు రాజునకు మత సామరస్యమును కూడా బోధించినాడు. అత్యధిక ప్రజలు, రాజ వంశస్థులు మైసూరు రాజ్యమున వైష్ణవ మతావలంబకులయినను అల్ప సంఖ్యాకులయిన శైవులు స్వాతంత్ర్యముగా వారి యిష్టానుసారము సంతోషముగా వారి మతమును పాటించుచుండిరి. (ఈ బుద్ధి కులోత్తుంగునికి లేకపోయె!)

కాని రాజాదరణయు, ప్రజాదరణ, ప్రజామోదమును గోల్పోయిన జైన సన్న్యాసులు చల్లచల్లగా ఆదేశమును వదలి పలచబడిరి. వారి పలుకుబడి పూర్తిగా దానికై అదియే నశించినది. మిగిలిన జైన సన్న్యాసులు మత ప్రచారమును మానుకొని యేకాంతమున ఆయామూలల యందు కాలము గడుపుచుండిరి.

శ్రీమద్రామానుజుడు మైసూరు నగరమున నున్నపుడు ఆ రాజ్యములోని తిరునారాయణపుర నామాంతరము గల మేల్‌కోట యను గ్రామప్రజలు రామానుజుని సందర్శించి, నమస్కరించి, ఒక విన్నపమును జేసికొనిరి - "స్వామీ! మా గ్రామమున ప్రసిద్ధిజెందిన విష్ణ్వాలయ ముండెను. పూర్వము మహమ్మదీయులు దండెత్తి దేవాలయ నాశనముగావించిరి. తమరు మా గ్రామమునకు వేంచేసి దేవాలయ పునఃప్రతిష్ఠ గావింపుడు", అని ప్రార్థించిరి.

శ్రీరామానుజుడు గోవిందమిత్రుడు, దాశరథి మొదలగు తన శిష్య గణములతో మేల్‌కోటకు వచ్చెను. పూర్వము దేవాలయమున్న స్థలము ఇపుడొక అరణ్యముగా మారెను. రామానుజుడా ప్రదేశమునంతటి కలయ దిరిగినాడు. తులసి మొక్కలతో నిండిన ఆ ప్రదేశ పరిమళమునకు ఆయన ముగ్ధుడయినాడు. పూర్వపు దేవాలయ హద్దులను గమనించినాడు. భూమి మట్టమునకు వచ్చిన శిథిలమైన గోడలను జూచినాడు. మూలవిరాట్ విగ్రహము యేమైయుండును? ముస్లిములు వారి దండయాత్రలలో విగ్రహమును ముక్కలు ముక్కలుజేసిపోయిరో, లేక భక్తులు అర్చకులు జాగ్రత్తపడి దానినెక్కడయినను జాగ్రత్తగా భద్రపరచిరో, అని రామానుజుడు ఆలోచించుచుండెను.

ఆ గ్రామమున శతవృద్ధుడొకడుండెను. రామానుజుడాతనిని పూర్వదేవాలయ విషయమై యేమైనను తెలుసునా అని ప్రశ్నించెను. "స్వామీ, మహమ్మదీయులు ఈ ప్రాంతమును దండెత్తినపుడు నేను బాలుడను, కాని యిప్పటికిని నాకు రెండు విషయములు మాత్రము జ్ఞప్తికి యున్నవి. దండయాత్ర విషయము ముందుగా తెలిసికొన్న గ్రామస్థులు, దేవాలయములోని మూలవిరాట్ విగ్రహమును పెకలించి, సమీపమున నెచటనో భూమియందు పాతిపెట్టినారు. ఉత్సవ విగ్రహమును మహమ్మదీయ సైనికులు తీసికొనిపోయిరని వినియుంటిని. ఆ విషయము గూడా యిప్పటికిని నాకు జ్ఞప్తికి యున్నది స్వామీ", అని యా వృద్ధు డెరిగించెను.

శ్రీరామానుజుడు పరిసర ప్రాంతమును గాలించివేసెను. అచ్చటొక పెద్ద మట్టిపుట్ట కన్పడెను; అది పొదలు, గుట్టచెట్లతో నిండియుండెను. శ్రీరామానుజుడా మట్టిపుట్టను త్రవ్వించెను. భూమియందు పాతిపెట్టబడిన విష్ణుమూర్తి దివ్యమంగళ విగ్రహము బయల్పడెను. ఆ విగ్రహమును వెలుపలికి దీయించి, శ్రీమద్రామానుజుడు దానిని పూర్వస్థానమున పునఃప్రతిష్ఠ గావించెను. విఠలదేవరాయలనర్థించి, స్వామికి ఆలయమును కట్టించినాడు రామానుజుడు.

తరువాత రామానుజుడు ఉత్సవ విగ్రహమును గూడా సంపాదించ దలచెను. ఆయన ఢిల్లీ సుల్తానును దర్శించి, ఆశీర్వదించి యిట్లు నివేదించెను - "మీ తండ్రి సుల్తాను గారి కాలమున మా దేవతా విగ్రహమొకటి మీ సైనికుల వశమైనదట. అది యిపుడు మీ కుమార్తె ఆటవస్తువులలో నొకటియై యున్నదట. దానిని దయతో నాకొసంగుడు. ఇది భక్తులయొక్క కోరిక! మీరు మతసామరస్యమును నెరపు పాలకుడవని వినివచ్చితిని. మా కోరికమన్నించి కీర్తివంతుడవు గమ్ము".

ఢిల్లీసుల్తాను ఆశ్చర్యమున మందహాసము జేయుచూ, "బొమ్మ కొరకు ఇంతదూరము శ్రమపడి వచ్చినారా! నా కుమార్తె బీబీ ఆమె మేనమామ నగరమునకు పోయియున్నది. ఆమె త్వరలో నిచటకి రాదు. మీరంతవరకు వేచియుండుడు. లేదేని ఒక ఉపాయమును దెల్పెదను. ఈ రాజ సౌధములో ప్రత్యేకించిన ఒక హాలునందు నా కుమార్తె ఆట బొమ్మలన్నియు గుప్తము చేయబడియున్నవి. అందులో వెదకి, మీకు కావలసిన విగ్రహమును వెదికికొనుడు", అని పల్కెను. (ఢిల్లీ అనగా ప్రస్తుత భారత ముఖ్య పట్టణమయిన ఢిల్లీ నగర మనుటకు వీలులేదు. ఢిల్లీ అనగా సుల్తానుల పట్టణము అనదగి యున్నది. ఇచట యిది బీజపూరు సుల్తాను ముఖ్యపట్టణమయి యుండవలెను).

సేవకుడొకడు విగ్రహములనన్నింటిని తీసి బైటనుంచెను. వానిలో తిరునారాయణ పురదేవాలయమున నున్న మూలవిరాట్ విగ్రహమును బోలియున్న ఉత్సవ విగ్రహమును రామానుజుడు సులువుగా

పట్టుకొనెను. భక్తుడయినట్టియు, విష్ణుసంశ్లేషభావమున నున్నట్టియు రామానుజుడు విగ్రహమే కదలి తనచేతికి వచ్చినట్లు భావించెను. రామానుజుడు స్వామి విగ్రహముతో మేల్కొట జేరెను. భక్తులెల్లరు సంతోషించిరి. గ్రామప్రజలెల్లరు పరమానంద భరితులై పెన్నిధిని పోగొట్టుకొని మరలా పొందగలిగినట్లు భావించుకొనిరి. ఢిల్లీ నుండి మైసూరు రాజ్యమునకుజేరి, అచ్చట నుండి తిరునారాయణపురము జేరు మార్గమున జైనులు కొందరు శ్రీరామానుజుని అటకాయించి, హింసించి, విగ్రహమును తస్కరింప ప్రయత్నించినారట. కాని సకాలమునకు సమీపమున గుడిసెలలో నివసించుచున్న పంచములన బడువారు కొందరుమూగి, చోరులను తరిమివేసి, రామానుజుని సురక్షితముగా విగ్రహసహితముగా తిరునారాయణ పురము జేర్చిరట.

శ్రీమద్రామానుజుడు విశ్వసౌభ్రాత్ర భావమును ప్రచారము జేయువాడుగాన, దయ సానుభూతిని హృదయమున నింపుకొన్నవాడు గాన కృతజ్ఞతాభావముతోను వాత్సల్య ప్రేమలతోను పంచమ కులజుల నాదరించువాడు. తనను అసూయా భావమున హింసింప దలచిన జైన మహాపండితులా లేక తన్ను రక్షించిన పంచమ కులజులా ని[illegible]న సంస్కారము గలవారు? జ్ఞానరహితులై కేవలము పాండిత్యము గలవారై అమాయక ప్రజలను అన్ని విధముల అనగా ఆర్థికముగా, నైతికముగా, సాంఘికముగా దోపిడీ జేయువారు విద్యావంతులన బడుదురా? దయగలవాడే విద్యాసారము గలవాడు! మేల్‌కోట లోని చెల్వపిళ్లస్వామి నాబరగు వైష్ణవాలయమును పంచ వర్ణములవారు ప్రవేశించి, స్వామిని దర్శనము జేసికొనవచ్చుననెడి సంస్కరణను శ్రీరామానుజుడు ప్రవేశపెట్టెను. శ్రీరామానుజ బోధనామృతమునకు వశులైన సవర్ణులనబడు హిందువులెల్లరును, విఠలదేవరాయ ప్రభువును, హరిజన దేవాలయ ప్రవేశమునకు సమ్మతించిరి. మన దేశమున ఆర్యులు వేదరచన గావించునప్పటికే ఆచారయుక్తముగా అనాదినుండి పంచమ జాతివారనువారిని చండాలురని, అస్పృశ్యులని

భావించుచుండిరి. ఈ దుర్మార్గము ఏకాలము నుండి పాటింపబడెనో గాని, నాగరికులయిన ఆర్యులు సైతము వేదపురాణ యితిహాసము లందు ఈ వర్ణభేదములను ప్రోత్సహించుచునే వచ్చిరి. సవర్ణులచే అనాదరింపబడి అస్పృశ్యులుగా భావింపబడు దీనజనులకు దీనబంధువుడయిన శ్రీమద్రామానుజుడే మొట్టమొదటిసారిగా 12వ శతాబ్ద ప్రారంభమున దేవాలయ ప్రవేశము గల్పించినాడు. మేల్‌కోటను యాదవాద్రి అనియు నందురు. (శ్రీ మద్రామానుజుని అనంతరము సవర్ణులు మరలా పంచములను అనాదరించినవారై తిరునారాయణ పురమున హరిజన దేవాలయ ప్రవేశమును నిరోధించినారనియు, కాని సంవత్సరమున కొకసారి చైత్రశుద్ధ దశమినాడు రామానుజుని జన్మ దినోత్సవ సందర్భముగా హరిజన ప్రవేశమును కలుగజేయు చుండిరని చరిత్రాంశముల వెల్లడించుచున్నది. తరువాత ఈ యిరువదియవ శతాబ్ధి మధ్యమమున శ్రీ గాంధీ మహాత్ముని కృషి ఫలితముగా చట్టరీత్యా హరిజన దేవాలయ ప్రవేశము మన దేశమున జరిగిన విషయము మనకు తెలుసును గదా. ఈనాటికి గూడా మన దేశమున ముఖ్యముగా ఉత్తర హిందూస్థానమున ఇప్పటికిని కొన్ని తావులందు హరిజనులు అనాదరింపబడుచుండుట విని మనము దుఃఖింప వలసియున్నది. తోటి మానవుల ననాదరించువాడు ఎంతటి చదువరి యయినను జంతుతుల్యుడుగా భావింపబడ వలసినదే).

శ్రీరామానుజుడు స్వామి ఉత్సవ విగ్రహమును దెచ్చిన కొన్నాళ్లకు సుల్తాను కుమార్తె బీబీ యిల్లుజేరి సంపత్కుమార విగ్రహమును గానక, "అయ్యో నా స్వామియేడి?" అని విలపింపసాగెను. సుల్తాను ఆమెను జూచి ఆశ్చర్యపడెను. ఆమె విగ్రహము నావిధమున గాఢముగా ప్రేమించినదని సుల్తానుకు తెలియదు. "కుమారీ బీబీ, బొమ్మను దేముడంటావా? అదియేమి? హిందువులు విగ్రహారాధకులు. సర్వాంతర్యామియగు అల్లాను మనముగాని యెవ్వరుగాని ఆరాధించి, ప్రార్థించవలయును గానీ, బొమ్మలనా? మూఢులయిన ఆ హిందువులు దేముడనుకున్న బొమ్మ నీకెట్లు దేముడగునమ్మా? పిచ్చి

తల్లీ! నీకు ఆ బొమ్మ అంతగా నచ్చినదైన యెడల, అంతకుమించిన బొమ్మలనేకములను దెచ్చియివ్వగలను నీకు. అట్లుగాదన్న సైనికులను బంపి ఆ బొమ్మనే నీకు తెప్పించెదను, ఊరడింపుము. అదియెంతపని", అని సుల్తాను బీబీతో చెప్పి, బుజ్జగించుచు ముద్దిడుకొనెను.

తాత్కాలికముగా నూరటజెందిన సుల్తాను కుమార్తె యిట్లు ఆలోచింప దొడగెను, "నేనిచట నా స్వామిని వదలి జీవింపజాలను. నాస్వామి తిరునారాయణ గ్రామప్రజలందరకును స్వామియే కదా! తండ్రి వలన శ్రీరామానుజుని గూర్చివిన్నాను. తిరునారాయణపుర ప్రదేశము యొక్క ఉనికిని కనుగొన్నాను. స్వస్థానమును జేరిన స్వామిని నేనేల తొలగింప వలయును? నాస్వామిని, నాకు చేర్చుదని తండ్రిని నేను కోరిన పక్షమున, సైనికులు మరలా తిరునారాయణపురమును, దేవాలయమును ధ్వంసము జేయుట జరుగును. ఇది నాకును, స్వామికిని, తిరునారాయణపురవాసులైన భక్తులకును, ఆ వచ్చిన ఆచార్యుల వారికిని మేలుచేకూర్చదు. కావున మారువేషమున ఈ రాత్రి వేళనే నేను ఒంటరిగా బయలుదేరి పోయి నాస్వామిని జేరెదను గాక", అని నిర్ణయించుకొనెను.

బీబీ పదునారు సంవత్సరములు నిండిన నిండుజవ్వని. ఆరోగ్య వంతురాలు, సుందరి, తేజోవంతురాలు. అర్ధరాత్రి యెల్లరు గాఢనిద్ర యందుండగా, పురుష వేషమును ధరించి, బీబీ, గుర్రము నెక్కి బయలుదేరి, పయనించి, రాత్రింబగళ్లను భేదములేక, నిర్విరామముగా స్వారి జేయుచూ, విశ్వాసపాత్రమయిన తన హయము సాయమున కొలది దినములకు యాదవాద్రిని జేరెను. ఆ సమయమునకు సంపత్కుమారస్వామి (చెల్వపిళ్ల) ఉత్సవ విగ్రహము మేళతాళములతో గ్రామమున నూరేగుచుండెను. రామానుజుడు, గోవిందమిశ్రుడు అశేష భక్తులు స్వామి ఉత్సవమున నుండిరి.

నిండుపేరోలగమున బ్రహ్మోత్సవమున వైభవోపేతుడుగానున్న స్వామిని జూచి, బీబీ తురగమునడిగ్గి, ఉన్మాదిని వలె పరుగిడుచూ, వచ్చి, స్వామిముందు సాష్టాంగపడి, "నాస్వామీ! ప్రాణేశ్వరా! నేనేమి

యపరాధమును గావించితిని, నన్నేల విడిచివచ్చితివి? నిన్ను వదలి, నీయనుమతిబడయ కుండగనే మా తాతగారి యింటికి పోతినని నీవాగ్రహించెదవా? ప్రభూ, మన్నింపుము, నన్ను స్వీకరింపుము", అనుచూ ఏడ్వసాగెను. శ్రీరామానుజుడామె భక్తికి, సంశ్లేష భావమునకు అచ్చెరువందెను. ఆమెనాధారమున పైకిలేపి, "సోదరీ, నీప్రాణేశ్వరుడు నిన్ను ప్రేమించియు, ఎల్లప్పుడు అత్తగారియింటిలో నిల్లరికముండుట నిష్టపడక తన నిలయమునకు వచ్చిచేరినాడు. భార్య భర్తననుసరించి యుండుట యుక్తముగదా! నీవిచ్చట నిలిచిపొమ్ము. దేవాలయ ప్రవేశమునకు నీకెట్టి అభ్యంతరము లేదమ్మా!" అనెను.

పరమత తురకపిల్లను దేవాలయ ప్రవేశమేమిటి? దేవాలయ నివాసమేమిటి?" అని కొందరు భక్తులు గొణుగుకొనుట గమనించిన రామానుజుడు, "అనాడు ధనుర్దాసును గూర్చి మీరిట్లే పొరపడతిరి! నేను పంచములనబడువారిని చేరదీసి నందులకు శ్రీరంగమున కొందరు వైష్ణవులు నన్ను అనాదరించిరి! భగవద్భక్తికి కులమత భాషా భేదములు లేవు. ఈ బీబీ అండాళ్ వంటి భక్తురాలు. ఈమె యొక్క విష్ణు సంశ్లేషభావము స్తవనీయము", అని భక్తులకు జ్ఞానోదయమును కలుగజేసెను. బీబీనాచీయారు అను తిరునామమున చెల్వపిళ్లస్వామి ఆలయముననే ఆశ్రమముగా భావించి, స్వామి సంశ్లేషభావమున కాలము గడపు చుండెను. అశేషమైన భక్తులు ఆమెను దర్శించుటకు వచ్చుచుండిరి. ఆమెను లక్ష్మీ అవతారమనియు, ఆండాళ్ అవతార మనియు ఎల్లరు ప్రశంసించుచుండిరి. బీబీనాచియారు తిరు నారాయణపుర దేవాలయమున నొక విశిష్ట స్థానమును పొందెను.

ఈనాటికిని మైసూరు రాష్ట్రమున తొండనూర్ అను గ్రామ ప్రాంతమున నొకసరోవరమున్నది. దానికి "మోతితాలా" అని పేరు. ఈ సరోవరమును రామానుజుడు భక్తులచే త్రవ్వించెనని ప్రతీతి. ఈ సరోవరమునకు సమీపముననున్న చిన్నఉపనదికి అడ్డముగా వారధిని నిర్మించి, ఈ సరోవరమునకు జలముల దెచ్చు ఏర్పాటు రామానుజుడు గావించెనని స్థానిక చరిత్ర తెల్పుచున్నది. ఈ సరోరాజము అనవరతము

ఒకేలోతున నీరు గలిగియుండును; పవిత్రముగా కన్పట్టును. మేల్‌కోటలో రామానుజుడు పాంచరాత్రాగమము ప్రకారము అర్చన విధానము నేర్పాటు గావించెను.

మేల్‌కోట ప్రాంతమున రామానుజుడు ఏడువందల మఠముల నిర్మింపజేసెను. అచ్చట రామానుజునకు ఏబదియిద్దరు ముఖ్య శిష్యులేర్పడిరి. అశేష భక్తజనులు రామానుజునిసేవించి వారి బోధనామృతమును గ్రోలిరి. శ్రీరామానుజునియెడ పంచవర్ణముల వారును ప్రీతినిజూపిరి. రామానుజుని విశిష్టతయట్టిది. ఆయన పంచములనుబడువారిని సోదరభావమున జూచెను. అస్పృశ్యత అనునది ఘోరపాపమని నొక్కి వక్కాణించినారు. పంచములనబడు వారిని సైతము రామానుజుడు శ్రీవైష్ణవులని పిలచెను. శ్రామికులును, పతితులును, విధేయులును అయిన పంచములనబడువారు వాస్తవముగా తిరుకులత్తార్లు అగుదురని రామానుజుడు తెల్పెను. "తిరుకులత్తార్" అనగా ఉన్నత కులజుడు అని అర్థము.

ఈ విధముగా శ్రీరామానుజుడు తన దివ్యసిద్ధాంతమును కుల, మత, జాతి, భాష వివక్షత లేక సర్వులకును అందించెను. ఈ కారణము వలననే విశిష్టాద్వైతము ఎల్లరకు నచ్చినది; వారివారి యిష్టానుసారము దైవారాధన జేసికొనుటకు వీలు గలిగించిన సిద్ధాంతమిది.

శ్రీరామానుజుడు తన సిద్ధాంతమును వెల్లడించుచు, సంఘసేవ గావించుచు, మైసూరు రాష్ట్రమున పంద్రెండు సంవత్సరములు గడపెను.

రామానుజుడు మైసూరు రాష్ట్రమున నున్నపుడు కంచి నుండి, తిరుపతి నుండి, శ్రీరంగము నుండియు కొందరు వైష్ణవ భక్తులు రహస్యముగా వారివద్దకు వచ్చి వైష్ణవులకు, వైష్ణవదేవాలయములకు కులోత్తుంగచోళుని వలన గలుగుచున్న అపకారములను, అపచారములను ఎరిగించుచుండిరి.

కులోత్తుంగుడు రామానుజుని పట్టితెమ్మని అజ్ఞాపించినాడు గావున సైనికులు రామానుజుని కొరకు శ్రీరంగమున ప్రతి వైష్ణవ

గృహమును గాలించిరి. దాశరథి మరియు కొంతమంది రామానుజ మతవాసులు దివ్యగ్రంథముల నెత్తికొని రహస్య ప్రదేశములకు వెళ్లిరి. శ్రీరంగములోని దేవాలయ దైనిక కైంకర్య ములకు ఆటంకములు గలిగినవి. అనేక దేవాలయములు నాశనము గావింపబడెను. స్వామి విగ్రహములు ముక్కలు గావింపబడినవి.

చిదంబరమున నున్న గోవిందరాజస్వామి ఆలయమును సైనికులు ముట్టడింపగా, తిల్య కులోత్తుంగుని దేవాలయ ద్వారమున తన గాననటనాకౌశలమున మూడు గంటల కాలము ఆపెను. ఈలోపల దేవాలయములో నున్న ఉత్సవ విగ్రహములను భక్తులు రహస్యముగా దాటవేసి, కడకు తిరుపతికి జేర్చిరి. తరువాత చోళ సైనికులు మూలవిగ్రహమును ధ్వంసము జేసిరి. ఉత్సవ విగ్రహము లేనందులకు కారణము మొదట రాజుయొక్క ఊహకు అందలేదు. తరువాత అది అంతయు తిల్య యొక్క జిత్తులమారి తనమని తెలిసికొని, రాజు తిల్యను ఖైదీగా జేసి కంచికి కారాగార వాసమునకు పంపెను.

కులోత్తుంగచోళుడు శ్రీరంగము మీదికి వచ్చినాడే గాని, అచ్చట వైష్ణవ భక్తుల యొక్కయు, ప్రజల యొక్కయు ప్రతిఘటన యెక్కువగా నుండునని గ్రహించి, తాత్కాలికముగా శ్రీరంగమున ముట్టరాదని నిర్ణయించుకొనెను.

శ్రీరంగమున రామానుజుడేగాక వారి ముఖ్య శిష్యులు దాశరథి, యజ్ఞమూర్తి మొదలగువారు లేకుండుటకు కులోత్తుంగుడు ఆశ్చర్య పడినాడు. విశిష్టాద్వైత సిద్ధాంత గ్రంథములన్నిటిని వీరు ఎచ్చటికో రహస్యముగా చేర్చియుందురని రాజు తలంచెను. వీరందరిని అన్వేషించి, పట్టినంతవరకు సైన్యములు విశ్రమించరాదని కులోత్తుంగుని శాసనము.

సైనికుల నుండి రాజునకు ఈ క్రింది విధముగా వార్తలు అందుచుండినవి: "రామానుజుని శిష్యులలో నొక్కడే ఆయనను

వెంబడించినట్లున్నది. తక్కినవారందరు వారి సిద్ధాంత గ్రంథములనెడి నిక్షేపములతో రహస్య ప్రదేశములకు వెళ్లినారు. ఏనాడు ఏమి జరుగునోనని శ్రీరంగ ప్రజలు వైష్ణవభక్తులు భయపడుచుండిరి. రామానుజుడు శ్రీరంగము వదలి పరుగిడి అళగేశుడను శైవభక్తుని యిల్లుజేరినాడట; అతని భార్య కొంగుపిరాట్టి వైష్ణవమతస్థురాలు. ఆమె రామానుజునకాశ్రయమిచ్చెను. రామానుజుడచట ఉన్న రెండు మూడు దినములలో అళగేశుడు వైష్ణవుడై రంగదాసను నామమున స్వీకరించి నాడు. రామానుజుడు దారిమధ్యమున తన మతప్రచారమును గావించుచు, అనేకులను వైష్ణవులుగా మార్చెను.

వేగుల వారివలన వార్త విని సైనికులు అళగేశుని, అతని భార్యను ఖైదీలుగా కంచికి తీసికొనిపోయిరి. ఇట్లు తెలిసిన వారినందరిని బంధించినారు. వారెవ్వరును రామానుజుని పోకడకు అచూకి యివ్వలేదు. కొందరు భక్తులు చిత్రహింసకు గురైరి.

అళగేశుని యింటినుండి శ్రీరామానుజుడు వహ్నిపుష్కరిణికి వెళ్లినట్లుగా ఉన్నది. అచ్చటనుండి రామానుజుడు సాలగ్రామమును చేరినాడట. అచ్చట నున్న పాషండులు రామానుజుని ఆదరించినట్లు లేదు. అచ్చటనుండి చోళదేశపు అవలనున్న జైనదేశమును (మైసూరును) రామానుజుడు చేరినట్లు వార్తలందుచున్నవి. మైసూరు నేలుచున్న జైనరాజు విఠల్‌దేవుడు రామానుజుని మతమును స్వీకరించి, విష్ణువర్ధన రాయలను తిరునామమును స్వీకరించినాడట" - ఈ వార్తావళి క్రమమున రాజుచెవికి వచ్చెను.

కడపటి వార్త విన్న కులోత్తుంగుడు మండిపడినాడట. మైసూరు దేశప్రభువగు విఠల్‌దేవునకు సైనికుల ద్వారా కులోత్తుంగుడు వార్త బంపినాడు - ఏమని? రాజద్రోహియు, శత్రువును అయిన రామానుజునకు మైసూరురాజు ఆశ్రయమిచ్చుట తప్పనియు, తాను వెంటనే రామానుజుని చోళసైనికులకు ఒప్పగించుట ఉచితమనియు, అట్లుకాదేని చోళసైన్యములు మైసూరు రాజ్యముపై దండెత్తుననియు

కులోత్తుంగచోళుడు తనవర్తమానమును విఠల్‌దేవరాయలకు పంపినాడు.

ఈ వార్త విన్న విఠల్‌దేవరాయలు చలించలేదు. భగవానుడైన రామానుజుడు తన దేశముననున్న యెడల తనకెట్టియాపదయు రాదని అతని విశ్వాసము.

ఈ వార్త విన్న రామానుజుడు మనస్సున నెంతయో బాధపడెను. అనివార్యముగా మైసూరు ప్రభువు విఠల్‌దేవరాయలు పరసైనికుల దండయాత్రల వలన బాధలు పడవలసిన అవసర మేర్పడునేమో, అందులకు తానే కారణము కదా అని రామానుజుడు వాపోయెను. మతాంధకారము అనే అజ్ఞానము ఎన్ని దోషములకు మూలకారణ మగుచున్నదో కదా అని రామానుజుడు చింతించెను.

భక్తుల వలన రహస్యముగా అందిన అనేక వార్తలు రామానుజుని కలవరపరచినవి. కూరేశుని యొక్కయు, పెరియనంబి యొక్కయు దివ్యనయనములు పీకివేయబడుట వార్తనువిని రామానుజుడు కన్నీరు కార్చెను. మహాసాధువును, వయోవృద్ధుడును అయిన పెరియనంబి అట్టి బాధననుభవించి, మరణించుటకు రామానుజుడెంతయో దుఃఖించి, యోజించెను. తనకు ప్రియతమ శిష్యుడయిన కూరేశుని స్థితికి రామానుజుడెంతయో మన క్లేశమును పొందెను. ఎంతో ఆవేదనను బొందెను. చిదంబరము నుండి గోవిందరాజస్వామి విగ్రహమును తిరుపతికి చేర్చుటకు తిల్యజూపిన నైపుణ్యమునకు రామానుజుడు అచ్చెరువందెను. ఆమె ఖైదీయై కంచిలో చెరసాల యందు మ్రగ్గుచున్నదని వినిన రామానుజుడు కనికరమున కన్నీరు కార్చెను.

రామానుజుడప్పటికి మైసూరు రాష్ట్రముజేరి సుమారు ద్వాదశ వర్షములు నిండినవి. కులోత్తుంగచోళుడు కంఠమున పుట్టుకురుపుతో బాధపడుచూ, మంచమెక్కి యున్నాడను వార్త కడపటిదిగా రామానుజునకు అందినది.

# 33. కులోత్తుంగుని పశ్చాత్తాపము

చిదంబరమున గోవిందరాజస్వామి దేవాలయ నాశనానంతరము కులోత్తుంగచోళుడు మరలా కడపటిసారిగా నిలిచియున్న తిరుపతి దేవాలయములను, శ్రీరంగ దేవాలయములను ముట్టడించుటకు తగు ప్రయత్నములలో నుండుమని సైన్యాధిపతులకు ఉత్తరువులు జారీ చేసియుండెను. ఈ భయంకరవార్త విన్న కంచిలోని వైష్ణవులు కలవరపడ్డారు; శైవులుగూడా కొందరు ఈ కార్యమును నిరసించినారు; అందరు మతోన్మాదులుగా నుండరు; దండయాత్రలను సహింప జాలరు; శాంతిని కోరువారు ఏమతమునందైనను ఉన్నారు.

ఈలోపల కులోత్తుంగచోళునకు కంఠమున భరింపరాని నొప్పి సంభవించినది. వైద్యులు పరీక్షించి, అదెంత లెమ్మని, యేవో తాటాయి పూటాయి వైద్యములు చేసిరి. కాని నొప్పి తగ్గలేదు. రానురాను బాధ అధికమయినది. గొంతులో లోపల భాగమున నేదోయొక చిన్న వ్రణము లేస్తున్నట్లగపడెను. భిషగ్వరులు పరీక్షించి, ఔషధముల త్రాగించినారు. కాని నయముకాలేదు. శైవమతాంధులైన మంత్రి త్రిపురాంతకుడును, సైన్యాధిపతి పశుపతియు రాజునకు ధైర్యము జెప్పి, త్వరలో పుట్టుకురుపు నయమగుననియు, ఈలోపల తిరుపతి శ్రీరంగములకు సైన్యముల తరల్చుట యుక్తమనియు, సాంబశివుడు కరుణించుననియు జెప్పిరి. మరునాడు సైన్యముల తరలునట్లు నిర్ణయింపబడెను. సాంబశివుని ప్రీత్యర్థము చేయు యజ్ఞములు వంటివి యీ యుద్ధదండయాత్రలని శైవపండితులు పలికిరి.

రాజున కారాత్రి నిద్రపట్టలేదు. ఏదో భయము అతని హృదయము లోనికి తొంగిచూస్తున్నది; భయమనే నేమోయెరుగని కులోత్తుంగుడు ఇపుడు భయకంపితడగుట తనజీవితములో ఇదే మొదలు.

ప్రభువునకు కంఠమున క్రిమివ్రణము అంకురించినదను విషయమును వైద్యులు, ప్రధాని, సేనాని యెంత రహస్యముగా నుంచినను, అది వెలుపలికి పొక్కినది. చమురుబిందువు నీటిలో పడిన అదివెంటనే పైకితేలి అగపడుచందమున సత్యము ఎల్లప్పుడు

వెలుపలికి వచ్చును. జరుగబోవు సత్యము అరు నెలలకు ముందే తొంగిచూచు నను నానుడి సర్వులకు విదితము. ప్రభువు దీర్ఘవ్యాధి విషయమును విన్న శైవులు చాల చింతపడ్డారు. వైష్ణవులు ఆనందించినారు. సర్వులను రంజింపజేయువాడు కదా రాజు - అను సత్యమును ఎరుగనివాడు కులోత్తుంగుడు! పాపము!

మరునాడుదయమున రాజు మంత్రిని, సేనానిని రావించి, గత సాయంకాలమున సైన్యములకివ్వబడిన దండయాత్ర ఉత్తరువులను తాత్కాలికముగా రద్దుచేసినాడు. దీనికి కారణము రాజు మనస్సున నెలకొనిన యేదో అనిర్వచనీయమయిన భయము, సందేహము.

కొలది దినములు గడచినవి. రాజు గొంతులోని పుట్టకురుపు పెరుగుచునే యున్నది. కులోత్తుంగుడు పడుబాధ తీవ్రమయినది. భరింపరాని బాధ అది. గొంతుగుండా ద్రవాహారము పోవుట కూడా ప్రళయముగా మారినది. మంచి నీరు త్రాగుట కూడా అతి బాధాకర మయినది. కురుపులోని క్రిములు గొంతును లోలోన కొరికి వేయుచున్నవి. మట్లాడలేని స్థితికి వచ్చినాడు కులోత్తుంగుడు.ఆ బాధను అనుభవించుచూ ఊపిరిపట్టుకొని యుండుటకంటే తక్షణ మరణము సుఖకరమని రాజు తలంచినాడు. తాను గావించిన ఘోర కృత్యములు ఇవుడు తమమనమునకు తగులుచున్నవి. కండ్లు పీకివేయబడి, కండ్లనుండి రుధిరధారలు కారుచుండు కూరేశుని, పెరియనంబి విగ్రహములు తన కనులముందున్నట్లు రాజు భ్రమపడుతున్నాడు. అతని శరీరము భయముచే పశ్చాత్తాపముచే కంపించి పోవుచున్నది. తానుజేసిన ఘోర మతయుద్ధములలో హతులయిన వారు కండ్లకు కనబడుచున్నట్లు భ్రమపడుచున్నాడు రాజు. భీతావహములు వినబడుచున్నవి. తిల్యను తాను క్రూరముగా చెరసాల యందు పెట్టుటను తానే నిరసించు కొనుచున్నాడు.

తనకీ బాధ కలుగుటకు తాను వైష్ణవులకు జేసిన అపకారమని రాజు తలంచినాడు. ఎంతమందినో వైష్ణవ భక్తులను తన కండ్లముందు హతులను గావించి యుండెను కదా! ఉన్నతుడయిన తన సేనాని

సోమదేవుడు వైష్ణవుడని అనుమానించి, దుష్టమంత్రి ప్రోద్బలమున, వానిని తల యెదుటనే ఉరిదీయించినాడు కదా! ఈ ఘోర దృశ్యము లన్నియు తనమనోనేత్రముల బడి ఆతనిని కలవర పరచుచున్నవి! పశ్చాత్తాపతప్తుని జేయుచున్నవి.

"చావన్న నీకు భయము కాని, నాకేమి భయము!" అన్నాడు ఆనాడు కూరేశుడు, కన్నులు పీకివేయబడగా వృద్ధుడయిన పెరియనంబి చింతింపక, దేవుని స్తుతింపనారంభించినాడు! తన కనులను తానే పీకివేసికొని, శ్రీరామానుజుని స్తుతింప సాగినాడు కూరేశుడు! వారు నిజముగా శూరులు, ధీరులు. వారికున్న ధైర్య స్థైర్యములలో సహస్రభాగము నాకున్నదా! అధికారమదమున కన్నుగానక పిచ్చిధైర్యమున నుంటిని! ఇప్పుడేది ఆ ధైర్యము!" అని రాజు వాపోయెను. లెక్కలేనన్ని ఘోరకార్యముల జేసిన తనకు క్షమాపణ లేదని తలంచినాడు రాజు. తనపై ఎవరికిగాని సానుభూతి యుండదని భావించినాడు కులోత్తుంగుడు.

"నేనిన్ని ఘోరక్రూరకార్యములు నా స్వలాభమునకు చేయలేదే! శైవము కొరకు - శివుని ప్రీత్యర్థముగదా చేసితిని! ఆ శివునికి నాపై ఏల దయరాదు! నాకిట్టి ఘోరశిక్ష యేల? నేను పాటించిన మతతత్త్వము సరైనదేనా? నాగురువులనబడువారు నన్ను సక్రమమైన మార్గమున పెట్టలేదుగదా! ఆనాడు కూరేశుడొనంగిన ఉపన్యాసములోని సత్యమిప్పుడు కన్పట్టుచున్నది! నేను శైవుడుగాను, అద్వైతినిగాను, అజ్ఞానిని!" అని రాజు పరిపరి విధముల లోలోన విలపించుచున్నాడు.

"నిరపరాధియు, భగవానుడును, దయాసాగరుడును అయిన శ్రీమద్రామానుజుడిపుడు ఎచ్చటనున్నాడో గదా! ఆయన పాదపద్మములపై బడి క్షమాపణ గోర నుత్సాహపడువాడను. ఆ మహాభాగుని ఎన్ని ముప్పతిప్పలకెర జేసితిని నేను! శైవమునకును, అద్వైతమునకును వ్యతిరేకముగాదు విశిష్టాద్వైత సిద్ధాంతము - అని కూరేశుడన్నాడు. ఎంతటి సమరసభావమతనిది! శైవము, అద్వైతము లన్న నేమియో యెరుగని మూఢుడే విశిష్టాద్వైతమును ద్వేషిస్తాడు -

అనుచూ కూరేశుడు నాకన్ను తెరచుచున్నను గర్వముచే కన్ను మూసుకున్నాను నేను", అని వాపోయినాడు రాజు.

కులోత్తుంగుని శారీరక బాధకాని, మానసిక వేదనగాని అనిర్వచనీయములు! అతని శరీర, మనస్సులు కరిగి పశ్చాత్తాపమను ప్రవాహరూపము దాల్చినట్లయినది. అతనికి పశ్చాత్తాప భావము చాల ఆలస్యముగా వచ్చినది; రోగి మరణానంతరము చికిత్స జేయుటకు వైద్యుడరగుదెంచిన చందమయినది! పైర్లు ఎండిపోయిన తరువాత వర్షముపడిన తీరయినది! గతజలసేతు బంధనమైనది!

కులోత్తుంగుని మనస్సు మనస్సులో లేదు. చిత్ర విభ్రమసన్ని దగిలిన జ్వరపీడితునివలె కన్పట్టుచున్నాడు - "మహాభక్తురాలైన తిల్యకు ఎంతటి కఠినశిక్ష విధించితిని? దైవశక్తి యొక్కటే, అది అన్ని రూపములలో నున్నదను సత్యమును వేదములు ప్రకటించుచుండ, నాబోటి అజ్ఞాని శివుడు వేరని, విష్ణువు వేరని, బ్రహ్మ వేరని తలచి, ఆ భేదాభిప్రాయమున ఎంతోమంది ప్రాణముల దీయించితిని! అనేక దేవాలయములు భూమట్టము గావించితిని! ఇవుడు నన్ను రక్షించువారు, నన్ను సుఖపెట్టువారు ఎవరు? నా పశ్చాత్తాపమునకు ప్రత్యుత్తర మిచ్చువారెవరు? కూరేశుని పెరియనంబిని నాకు క్షమాభిక్ష పెట్టమని ప్రార్థింపగలనా? తిల్యను నన్ను మన్నింపమని వేడగలనా?" అని రాజు కంటతడిబెట్టి స్వజనుల సమక్షమున అసహాయతతో బాలునివలె బిగ్గరగా ఏడ్చెను.

ప్రధానమంత్రిని, సేనానిని రావించినాడు కులోత్తుంగుడు - "శ్రీమద్రామానుజుని ప్రతిభ నా మనస్సునకు వచ్చినది. ఇక ఆ మహాత్ముని పట్టుటకు అన్వేషణ అవసరము లేదు. వారెక్కడనున్నను వారిని ఆహ్వానింపుడు. వైష్ణవులకు మతస్వాతంత్ర్యమును ప్రకటింపుడు. రామానుజుడు యథేచ్ఛగా స్వరాష్ట్రమునకు రావచ్చునని ప్రకటింపుడు. వారిని ప్రార్థించి తోడ్తెండ్రు - వారికి శరణాగతి నగుదును! చెరసాలలో నున్న వైష్ణవులందరిని విడిపింపుడు! కారాగారమున నున్న మహాభక్తురాలు తిల్యను నావద్దకు తీసికొనిరండు! ఆమె దర్శన

భాగ్యము నాకు కొంత యూరట చేకూర్చగలదు!" అనుచూ రాజు కన్నీరు కాల్వలుగా నేడ్చెను.

మహాభక్తురాలు తిల్యాను ఆక్షణమున కులోత్తుంగుని వద్దకు తీసికొని వచ్చిరి. తిల్య ఆరోగ్యవంతురాలై ఉత్సాహముగా కన్పడెను - వైష్ణవ సంశ్లేష భావముననుండు తిల్యకు కొరత యేమున్నది? తన్మయత్వమున గోవిందరాజస్వామిని కీర్తించుచూ, గానము చేయుచూ కన్పడినది రాజుముందు. వసంత ఋతువును స్పర్శించిన మొక్కవలె కన్పట్టినాడు రాజు ఆ క్షణమున -

"తిల్యా! మహాభాగినీ! సోదరీ! నన్ను క్షమింపుమమ్మా! నీ పాదయుగళిని తాకుటకును నాకు శక్తి లేకున్నదమ్మా - యీ మంచమున పడి. గోవిందరాజస్వామిస్తవమును గావింపుమమ్మా!" అని రాజు కన్నీరు గార్చుచూ అనెను. "నీ దివ్య గానమును విని నా పాపములు బాపుకొందును సోదరీ", అనెను.

కులోత్తుంగుని దీనాలాపముల విన్న తిల్య కృపావేశమున కరగి పోయినది. గోవిందరాజస్వామిని నుతించుచూ గానముజేయు నారంభించినది. ఆగానామృతమును, కడపటి తులసి తీర్థమును వలె, గ్రోలుచూ, కులోత్తుంగుడు అసువులు బాసెను.

కంఠమున క్రిములచే ఏర్పడిన వ్రణముచే బాధపడి మరణించిన కులోత్తుంగుని క్రిమికంఠుడని చరిత్రకారులు పేరిడిరి.

వైష్ణవము ఊపిరి పీల్చుకున్నది! "వైష్ణవులు "అబ్బా" అని సేద దీర్చుకున్నారు. వైష్ణవులపై, వైష్ణవాలయములపై అఘాయిత్యములు నిలిచినవి. మతస్వేచ్ఛావాయువుల నందరు పీల్చిరి. శైవ వైష్ణవులు స్నేహ భావముగా గడుపు దినములు ఆసన్నమయినవి. మతమునకు, ఉద్యోగములకు, రాజకీయములకు ఏర్పడి యుండిన ముడులు వీడినవి. నియంతృత్వ పరిపాలనము అంతమొందినది. చరిత్ర యందొక దుష్టశకము అంతరించినది - శుభమస్తు!

# 34. పునరాగమనము

క్రిమికంఠుడు మరణించునప్పటికి శ్రీమద్రామానుజాచార్యుల వారు మైసూరు రాష్ట్రమున పంద్రెండు సంవత్సరములు గడపినాడు. కులోత్తుంగుని మరణానంతరమున తిరుపతి నుండియు, కంచి నుండియు, శ్రీరంగము నుండియు అనేక వైష్ణవ భక్తులు శ్రీరామానుజుని దర్శనమునకై మేల్కోటకు వచ్చిరి. వారివలన కులోత్తుంగుని మరణవార్తయు, మరణమునకు ముందు అయన బొందిన రోగబాధయు, ఆయన పొందిన మనఃపరివర్తనయు, పశ్చాత్తాప భావము, దేశమున ప్రకటింపబడిన మతస్వాతంత్ర్యము, మత సామరస్యము మొదలగు విషయముల గూర్చి రామానుజునకు వార్త లందినవి.

"పశ్చాత్తాపము మహాయజ్ఞమువంటిది; అన్ని యజ్ఞములలో శ్రేష్ఠమయినది. అది హృదయమును, మాలిన్యముల నుండి తొలగించి, పవిత్ర పరచును. అంత్యదశలోనైనను కులోత్తుంగ మహారాజు సత్యమును గ్రహించినందులకు నాకును సంతృప్తి ఆనందములు గలిగినవి. ఆయన ఆత్మశాంతిని పొందుగాక!" అని రామానుజుడు ఆలోచనాప్రేరకముగా శిష్యులయిన వార్తాహరులతో ననెను.

శ్రీరామానుజుడు స్వరాష్ట్రమునకు పోవునని తెలిసి మైసూరు ప్రభువు విఠలదేవరాయలు వారినచటనే యుండవలసినదిగా ప్రార్థించెను. మేల్కోట ప్రజలు కూడా వారినచట నిలువుకొనుటకు చాల ఒత్తిడిచేసిరి - అర్థించిరి, ప్రార్థించిరి, కంటనీరు బెట్టిరి....

"వత్సలారా! నేనిచటికివచ్చిన కార్యము పూర్తి అయినది. మీరందరు వైష్ణవ భక్తులయినారు. అది నాకు తృప్తి. నేను ఈ దివ్యకార్యార్థమై స్వదేశమునకు పోవలసియున్నది", అని రామానుజుడు మేల్కోట భక్తుల నందరికి నచ్చజెప్పి, వారి నాశీర్వదించి, స్వదేశమునకు మరలు ప్రయత్నమున నుండెను.

తిరుపతి నుండి వచ్చిన భక్తులు, "స్వామీ! మీరు మొదట తిరుపతికి రండు, తరువాత అచట నుండి కంచికిపోయి, తరువాత శ్రీరంగము చేరవచ్చును. తిరుపతి యందు శ్రీగోవిందరాజస్వామి విగ్రహమును ప్రతిష్ఠింపవలసియున్నది. ఇంతకుపూర్వము మీరిచ్చిన అజ్ఞానుసారము నారాయణవన పరిపాలకుడయిన యాదవరాయలు గోవిందరాజస్వామి దేవాలయమును పునర్నిర్మితము గావించి యున్నాడు. మిగిలియున్న కొరవలు, సవరణములు అతి త్వరలో పూర్తికాగలవు", అని నుడివిరి. శ్రీరామానుజుడు వారి యాహ్వానమును మన్నించెను.

శ్రీరామానుజుడు మైసూరు ప్రభువు విఠలరాయలను, మైసూరు భక్తజనులను ఆశీర్వదించి, భక్తబృందముతో కలిసి తిరుపతి జేరినాడు; దేవాలయ నిర్మాణమునకును భక్తుల ఉత్సాహమునకును తృప్తిని వెల్లడించెను.

దేవాలయమును విగ్రహ ప్రతిష్ఠ జరుపుటకు సుమూర్తము నిర్ణయింపబడినది. ఈలోపల నూతన గోవిందరాజస్వామి ఆలయ ప్రాంగణమున జేరిన అశేషభక్తుల నుద్దేశించి శ్రీరామానుజుడు విశిష్టాద్వైత సిద్ధాంత సత్యములను ఉపన్యాసముల ద్వారా ప్రచారము గావించుచుండెడివాడు.

శ్రీమద్రామానుజాగమనము నెరిగిన తుల్య మొదటిదిన సాయంసమయముననే ఉపన్యాస వేదికను సమీపించి, రామానుజుని పాదములపై బడి, "నేను తిల్యను, స్వామీ; క్రిమికంఠుడు చిదంబరములోని గోవిందరాజస్వామి ఆలయమును ముట్టడించి నపుడు, నా గానమాధుర్యముతో, నా నటనాకౌశలముతో రాజును, సైన్యమును ద్వారమువద్దనే మూడు ఘంటలపాటు నిలిపి, స్వామి ఉత్సవ విగ్రహమును అర్చకుల ద్వారా రహస్యముగా వెనుకటి ద్వారము గుండా గొంపోవు నవకాశమును కలుగజేసితిని. అది అంతయు మీ ఆశీర్వాద బలమే. ఆనాడు మిమ్ముల శ్రీరంగమున

దర్శించినపుడు, తమరు నన్ను ఆశీర్వదించి, ఆజ్ఞాపించిన రీతిని నేను ప్రవర్తించుచున్నాను. స్వామీ! కులోత్తుంగ చక్రవర్తి, నన్ను పండ్రెండు సంవత్సరములు చెరయందుంచినాడు. అతని మనస్సున మార్పు రావడము, నాచెరసాల విడుదల, అతని మరణము, మత స్వాతంత్ర్య ప్రకటన - యీ సంఘటనలన్నియు ఒకే దినమున జరిగినవి. శ్రీ గోవిందరాజస్వామి విగ్రహము గుప్తముగా తిరుపతిలో నొక వైష్ణవ భక్తునియింట్లో దాచి పెట్టబడియున్నది. స్వామీ, మీచేత ప్రతిష్ఠింప జేయుటకు తమరు తిరుపతికి విచ్చేసియున్నారని తెలిసి నేను ఇపుడు వచ్చినాను. తమరి ఆగమనము కొరకు కొలది దినముల నుండి తిరుపతి యందుండి యెదురు జూచుచున్నాను. నేను నా శేష జీవితమును తిరుపతి గోవిందరాజస్వామి సన్నిధిలో గడపెదను'', అని తిల్య శ్రీరామానుజునకు తెలియజేసెను.

శ్రీమద్రామానుజుడు తిల్యను ఆశీర్వదించి, ''తిల్యా, సోదరీ! నీవు ఆండాళ్‌తో సమానమైన దానివమ్మా! నీ వైష్ణవభక్తి అనన్యము. నీవైష్ణవ సంశ్లేష భావము అపూర్వమయినది. నీవు ధన్యజీవినివి'', అని రామానుజుడనెను.

ఒకనాటి సుముహూర్తమున తిల్య, యాదవరాయలు, అశేష వైష్ణవ భక్తులు, అర్చకులు, ప్రజలు సమక్షమున శ్రీమద్రామానుజుడు పూర్వము తిల్య సహాయమున అర్చకులచే రహస్యముగా తేబడినట్టియు, తిరుపతిలో గుప్తముగా నుంచబడినట్టియు శ్రీగోవింద రాజస్వామి విగ్రహమును తిరుపతిలో పుననిర్మితము గావింపబడిన గోవిందరాజస్వామి దేవాలయమున ప్రతిష్ఠించెను. మహాభక్తురాలు తిల్యచే రక్షింపబడిన విగ్రహముగావున, శ్రీరామానుజుడు తిరుపతి గోవిందరాజస్వామికి తిల్యగోవిందరాజస్వామి అని నామకరణము గావించెను.

తిరుపతియందు తనపనిని పూర్తిగావించుకొన్న రామానుజుడు అనేక భక్తులతో జేరి, కాంచీపురమున కేతెంచెను. కంచిలోని వైష్ణవ

భక్తులేగాక, శైవులును రామానుజు నాహ్వానించి, ఘనముగా రాజవీధుల యందు ఉత్సవమును జరిపించి, వరదరాజస్వామి ఆలయ వనమున వారికి విడిది నేర్పాటుగావించిరి.

కంచి పట్టణములోని భక్తులను అశేష ప్రజానీకమునుద్దేశించి రామానుజుడు తన బోధనామృతమును పంచిపెట్టెను - "శైవులు వైష్ణవులు సోదరులవలె నివసింపవలయును. మతము సోదరత్వమును పెంపొందింప వలయునే గాని, భేదమును విరోధమును అసూయలను కాదు. విశిష్టాద్వైతము ఏ మూఢనమ్మకమును ప్రోత్సహింపదు. అది తత్త్వత్రయ జ్ఞానముతో సత్యమునే ప్రబోధించును; సత్యాన్వేషణను ప్రేరేపించును; మానవులను సోదరులవలె కలిసి జీవించమంటుంది; లోక కల్యాణార్థమై సంఘసేవను ప్రేరేపిస్తుంది. అనిర్వచనీయమయిన సర్వవ్యాపితమయిన శక్తిని అనంత కల్యాణ గుణపరిపూర్ణునిగా ఊహించుకొనమంటుంది. ప్రజలు వారివారి విశ్వాసముల ననుసరించి జీవింపవచ్చును; కాని జీవితమున మానవ సోదరభావము, భూతదయ విష్ణు సంశ్లేష భావము అనునవి అవసరము. ఈ భావములు మానవుని సంతోషపెట్టి శాంతిని చేకూర్చును", అని శ్రీరామానుజుడు బోధించెను.

శ్రీమద్రామానుజుడు దేవాలయ వనమున తన పర్ణశాలయందు ఒకనాటి సాయంసమయమున విశ్రాంతిగొను సమయమున క్రిమికంఠుని కుమారుడును, అప్పటి చోళరాజ్యపాలకుడును అయిన విక్రమచోళ భూపతి తన ప్రధాని, సేనాని సమేతముగా శ్రీమద్రామానుజుని సందర్శనార్థ మరుగుదెంచెను. కులోత్తుంగుని మరణానంతరము ప్రభుత్వోద్యోగులందరి యందును మార్పు వచ్చినది. వారందరును పూర్వపువారి క్రూరచేష్టలకు పశ్చాత్తాపపడిరి.

విక్రమచోళుడు శ్రీరామానుజుని పాదములపైబడి సాష్టాంగదండ ప్రణామంబులాచరించినాడు. "స్వామీ, నన్ను ఆశీర్వదింపుడు. మీకును, మీ భక్తులకును, వైష్ణవులకును వైష్ణవ దేవాలయములకును తాను గావించిన ముప్పునకు మా తండ్రిగారు అవసాన కాలమున

నెంతయో పశ్చాత్తాపపడి దుఃఖించినాడు. వారు రోగపీడితులై యున్నపుడు నన్ను చేరబిలిచి, మతసామరస్యమున రాజ్యపాలనము గావింపుమని నన్నాజ్ఞాపించుచూ, తమ్ముల వెదకితెచ్చి, ఆహ్వానించి, ఆదరించి పూజింపుమని కోరినాడు. స్వామీ, మతమును రాజకీయమునకు అతికించుట తప్పని మా తండ్రిగారు ఆలస్యముగా గమనింప గలిగినాడు! మా తండ్రి ఆత్మను ఆశీర్వదింపుడు!" అని ప్రార్థించెను. శ్రీరామానుజుడు విక్రమచోళుని మాటలకు సంతసించి, ఆయనను ఆశీర్వదించెను. విక్రమచోళుడు మతపక్షపాత రహితముగా, మతసామరస్యమున రాజ్యపాలనము గావించినాడు.

కాంచీపురము నుండి శ్రీరామానుజుడు శ్రీరంగము చేరెను. శ్రీమద్రామానుజుని ఆగమనవార్త తెలియగనే కులమత భేదరహితముగా ప్రజలు, భక్తులు ఎల్లరు ఆనందముతో ఎదురేగి స్వాగతము జెప్పిరి. పట్టణవాసులు వారివారి గృహముల నలంకరించు కొని పచ్చతోరణములు గట్టిరి. పురపాలక సంఘమువారు పట్టణము నంత శుభ్రపరచి అలంకారతోరణములగట్టిరి. శ్రీరంగనాథ దేవాలయము నూతన కాంతుల వెదజల్లినది. పట్టణ వాసులెల్లరు రామానుజుని పట్టణము వెలుపలనే మంగళావాద్యములతో ఎదుర్కొనిరి. అదియొక దివ్యమయిన ఉత్సవము. మేళతాళముల కంటే మించియున్నది ప్రజల ఆనందము. దాశరథి రామానుజున కెదురేగి, ఛత్రమును బట్టినాడు. గోవింద మిత్రుడు వింజామరలు వీచినాడు. మనుమళ్లవలె కూరేశుని కుమారులు, పరాశర వ్యాసులు, శ్రీరామానుజుని అంకమున నడచిరి, ధనుర్దాను, హేమాంబ, యజ్ఞమూర్తి అనేకానేక భక్తులు వెంటనడచిరి. ఆ దివ్యోత్సవము యొక్క భక్తిసౌరభము, ఆనందకాంతులు వర్ణనాతీతములు.

ద్వాదశ వర్షకాలానంతరము తాను శ్రీరంగనాథుని దర్శింప బోవు చున్నాననెడి ఘట్టము రామానుజుని కనులకు ఆనంద బాష్పములు దెచ్చినది.

శ్రీమద్రామానుజుడు రంగనాథుని యెదుట నిలబడ్డాడు - "స్వామీ, కారణములను పరిస్థితులను బట్టి ఆనాడు నీ సన్నిధిని వదలిపెట్టి పోవునాడు నీ యాజ్ఞనైనను పొందలేకపోతిని. నీ దర్శనము చేయుటకును తడవులేక పోయెను. స్వామీ, నీ వైష్ణవశక్తి ఎరిగిన యీ దాసుడు నీ కార్యమునే జేయుచుండినాడు. ఈ దీర్ఘద్వాదశ వర్షకాలము. స్వామీ భగవద్గీతయందు తమరు ప్రవచించిన "మత్కర్మకృన్మత్పరమో మద్భక్తః సంగవర్జితః నిర్వైర స్సర్వభూతేషు" అను సూచనలను పాటించితిని. స్వామీ, నీ నిత్య వైభవము ఏలాటి ఆటంకము లేకుండా జరుగుచుండినది గదా! స్వామీ, నా కోరికయును అదియే!

శ్లో॥ శ్రీమన్ శ్రీరంగ శ్రియ మనుప్రదవా మనుదినం సంవర్ధయ।
శ్రీమన్ శ్రీరంగ శ్రియ మనుప్రదవా మనుదినం సంవర్ధయ।

అనుచూ, శ్రీరామానుజుడు స్వామికి మంగళా శాసనమును పలికెను.

తదుపరి శ్రీరామానుజుడు వెనుదిరిగి చూచినాడు. కూరేశుడు తడములాడుతూ తన్ను వెదుక్కుంటూ ప్రక్కనే స్వామిద్వారము సమీపమున నున్నాడు. అయన కండ్లు గుంటలు పడియుండినవి. కాని రామానుజ ఆగమన వార్త విని కాబోలు అయన వదనము చిరునగవుతో భాసిల్లుచుండినది. ఈ పండ్రెండు సంవత్సరముల కాలము రంగనాథాలయమునకు రాకుండా పురము వెలుపల సుందర పర్వతముపై వాసము జేయుచుండినవాడు కూరేశుడు. శ్రీరామానుజ ఆగమన వార్తవిని తిన్నగా ఆండాళ్ సహాయమున దేవాలయము చేరినాడు. కాని జనసమూహములో గ్రుడ్డివాడైన కూరేశుడు రామానుజునెట్లు సమీపింపగలడు? ఏలాగో ముందుగనే స్వామి ఆలయమును చేరియుంటే, రామానుజుని కంట బడగలనని ఆయన యూహించి యుండెను.

శ్రీరామానుజుడట్లే కూరేశుని జూచినాడు. రామానుజుడు కరుణ, దుఃఖరసములతో తడసిపోయినాడు. కూరేశుడు తనకు ప్రాణదాత;

తన శిష్యరత్నము, తన లేఖకుడు, తన చేతికఱ్ఱ. శ్రీరామానుజుడు మహా ఆప్యాయతతో కూరేశుని ఆలింగనము జేసికున్నాడు. ఆ ప్రేమ, వాత్సల్యము, కృతజ్ఞతాభావములు అనిర్వచనీయములు. కూరేశుడు రామానుజుని తిలకించిన వారందరును ఆనందాశ్రువులు రాల్చిరి. సర్వులు రంగనాథుని ఆశీర్వాదవచనా వృష్టిలో తడసినట్లు భావించిరి.

శ్రీరామానుజ మఠము, మఠవనము, ప్రాంగణములు భక్తజనులతో శిష్యులతో కళకళలాడుచుండినవి. దాశరథి, గోవిందుడు, కూరేశుడు ఆండాళ్, ఉరంగావిల్లి, హేమాంబ, పరాశరుడు, వ్యాసుడు, యజ్ఞమూర్తి మొదలగు శిష్యరత్నములతో మఠము శోభాయ మానముగా నుండినది. శ్రీమద్రామానుజుని దర్శనార్థము పట్టణ వాసులను, చుట్టుప్రక్కల గ్రామవాసులును అనుదినము తండోప తండములుగా వచ్చుచుండిరి. రాముడు లేని అయోధ్య వలె కళావిహీనముగా నున్న శ్రీరంగము రామానుజుని రాకతో స్వామి ఆలయ ప్రాంగణములు మరలా భక్తకోటితో యాత్రిక జనులతో మంగళవాద్యములతో, ఉత్సవములతో, రమణీయముగా కన్పట్టినవి.

ఒకనాడు రామానుజుడు కూరేశునితో, "వత్సా, మనము కాంచీపురి కేగి శ్రీవరదరాజస్వామిని సేవించి వచ్చెదము. ఆ వరదుడు నీకు దృష్టి లోపమును పోగొట్టును", అనెను. కూరేశుడు మనమున నిట్లు తలంచుకొనెను, "ఆళ్వారుల వారికి వరదరాజస్వామిపై ప్రత్యేక ప్రేమ యున్నది. వారిసేవలో నుండి, వారి యెదుట సన్న్యసించి యతిరాజయినాడు గదా! వారి సమక్షముననే నన్ను శిష్యునిగా స్వీకరించియున్నాడు. వారియానతి గైకొనియే శ్రీరంగము చేరినాము. కావుననే యీ సీమాంతర వాసము తరువాత, ఈ పునరాగమనము తరువాత, విశ్రాంతిగా ఆ వరదుని దర్శింపదలచినాడు నా ఆచార్యులవారు. ఆచార్యునితో కలిసి వరదుని సేవించు భాగ్యమును నేనును అభిలషింపవలసినదే గదా", అని తలంచెను.

కూరేశుడు కాంచీపుర ప్రయాణమునకు సంసిద్ధుడాయెను. వారి ప్రయాణ సంసిద్ధతయెట్టిది? "వరదరాజస్తవము" అను నొక దీర్ఘ స్తోత్ర

కావ్యమును రచించెను. అంధుడయిన కూరేశుడు ఈ కార్యమునెట్లు నెరవేర్చెను? తాను వచించుచుండగా తన యువకుడైన కుమారుడు పరాశరుడు లిఖించెను; ద్వితీయకుమారుడు వ్యాసుడు సహకార సహాయముల నొనగూర్చెను.

శ్రీమద్రామానుజుడు కూరేశుని వెంటగొని, కాంచీపురమునకేగి, శ్రీవరదరాజస్వామి యెదుట జేరెను. అనేక భక్తుల సమక్షమున కూరేశుడు తన మధుర కంఠస్వరమున "వరదరాజ స్తవమును" గానము జేసెను. ఆ శ్లోకార్థములకు ఆ గానమాధుర్యమునకు సర్వులు ముగ్ధులయిరి. శ్రీమద్రామానుజుడు బాహ్య స్మృతిని గోల్పోయినవాని వలె ధ్యాననిమగ్నుడాయెను. ఒక అర్చక మహాభక్తుడు తన విష్ణు సంశ్లేష భావమున తన్మయత్వమున, "ఓ కూరేశా - కుమారా - నీ కోరికయేమి? కోరుకొనుము - పొందెదవుగాక!" అని బిగ్గరగా ననెను.

కూరేశుడును బిగ్గరగా, "స్వామీ, క్రిమికంఠుని ఆత్మకు శాంతి నిమ్ము. ఆతని మంత్రి సేనానులకు మోక్షమార్గమును జూపుము", అనెను.

కూరేశుని మోక్ష సన్న్యాస యోగమునకు అందరును అచ్చెరు వందిరి. శ్రీరామానుజుడు కూరేశుని భుజముల స్పర్శించుచూ, "కుమారా, నీకు దీటైన వైష్ణవు డిలలో లేడు! నీ దృష్టి సంపదను కోరక, నిన్ను చెరపట్టిన వారియోగక్షేమములనే గోరితివి! ఇది వైష్ణవులకు ఆదర్శము - ఆనంద ఘట్టము. ఇది వైష్ణవ చరిత్రయందు సువర్ణాక్షరములలో లిఖింపబడుగాక!" అనెను.

కూరేశుడు, "స్వామీ, నాకు బాహ్య దృష్టియేల? నా మనోనేత్రములతో ఆచార్యుడవయిన నిన్నును, స్వామియయిన వరదుని అనుక్షణము జూచుచున్నాను గదా! భగవత్కటాక్షమున నేనొక ఉన్నతస్థితికి బోయితిని. నేను దేవునే చూడగలుగుతున్నాను. దేవునకు అన్యమయిన యే యితర వస్తువును చూడను" అని కూరేశుడు ఆనందమున హసించుచు భాషించెను.

శ్రీరామానుజుడు కూరేశుని కౌగిలించుకున్నాడు; దగ్గరనున్న వైష్ణవభక్తుల నుద్దేశించి, "కూరేశుడు వైష్ణవుడుగా నుండుట మనకు, మనమతమునకు ఒక విజయము. కూరేశుని త్యాగబుద్ధి వైష్ణవ భావమును వెల్లడించుచున్నది. అగర్భ శ్రీమంతుడయిన కూరేశుడు తన సర్వస్వమును విష్ణుభక్తులకు, దీనులకు యిచ్చి, మిగిలినదానిని మన వైష్ణవమతమునకు సమర్పించినాడు. మతప్రచారమున, శ్రీ భాష్యరచన యందు నాకు దక్షిణహస్తముగా నుండినాడు. నాకు ప్రాణదానము జేయునెడ తన నయనములనే గోల్పోయినాడు. ఇప్పుడు తనను హింసించిన వారి శ్రేయస్సునే కోరుచున్నాడు. బాహ్యదృష్టి రాహిత్యము తనకొక పుణ్యహేతువని అనుచున్నాడు. అంతర్దృష్టితో స్వామినే చూతుననియు, ఇతరమూ చూడననియు ఆనందమును వ్యక్తముచేయుచున్నవాడు. వత్సలారా! మనందరకు కూరేశుని పవిత్ర జీవితము ఆదర్శప్రాయము. ఈతని ఆదర్శమును పాటించి మనమందరమును మోక్షమార్గమున తరింపవలయును", అని ఉద్బోధించెను ఆచార్యులవారు.

## 35. గోదాగ్రజుడు

శ్రీరంగమునకు తిరిగివచ్చిన శ్రీమద్రామానుజాచార్యులవారు సర్వము స్వస్థతపడుట గాంచి, ఆనందమున యధాస్థితిగా మఠ కార్యక్రమములను, శ్రీరంగనాథాలయ కార్యక్రమములను పర్యవేక్షించువాడు.

మరియొకసారి దక్షిణదేశములోని పుణ్యక్షేత్రములనెల్ల దర్శింప వలయుననెడి కుతూహలము గలిగెను. తాను శ్రీరంగమున లేని యీ పండ్రెండు సంవత్సరములలో చోళరాజుల నిరంకుశత్వమున నాశన మందిన వైష్ణవదేవాలయ, వైష్ణవ మఠములను పునరుద్ధరించుటకు సంకల్పించుకొన్నాడు శ్రీరామానుజుడు. అందువలన ఆయన పుణ్య క్షేత్రముల దర్శించుచూ, అంతవరకు నెరవేరిన పునర్నిర్మాణములకు సంతసించుచూ, ఇక జరుగవలసిన కార్యభాగములకు వలసిన వస్తుసంపత్తి ప్రోత్సాహములను తీర్చుచూ, దాతలను, ఉభయకర్తలను, అర్చకులను, భక్తులను, మఠవాసులను ఉత్తేజపరచుచూ నూట యెనిమిది దివ్య తిరుపతులను దర్శించెను. రామానుజ మఠము లన్నియు స్థిరపడినవి. విశిష్టాద్వైతం పుష్పించి, పరిమళముల వెదజల్లు చున్నది. ఈ ద్వితీయ దక్షిణదేశయాత్ర నుండి శ్రీరంగము చేరునపుడు శ్రీరామానుజుడు శ్రీవిల్లిపుత్తూరునకు వచ్చెను. ఇది ఆండాళ్ (గోదాదేవి) జన్మస్థానము. పెరియాళ్వారు తన తిరుమొళి యందును, ఆండాళ్ తన తిరుప్పావై గ్రంథమునందును శ్రీవిల్లిపుత్తూరును తిరువాయిప్పాడుతో సమానముగా భావించియున్నారు. తిరువాయి ప్పాడు అనగా శ్రేష్ఠమయిన గోకులము అని భావము. (ఈ గ్రంథరచయిత ఇంటిపేరు "తిరువాయిప్పాడు" అగుటచే, ఈతనికి శ్రీవిల్లిపుత్తూరు, పెరియాళ్వారు, ఆండాళ్, తిరుప్పావై ఆదిగాగల విషయములతో నొక విధమైన ఆత్మీయత ఉన్నది).

శ్రీవిల్లిపుత్తూరున శ్రీకృష్ణమూర్తి విగ్రహమును దర్శించినపుడు శ్రీమద్రామానుజునకొక వృత్తాంతము జ్ఞప్తికి వచ్చెను. గోదాదేవి "స్వామీ!

నీవు నన్ను పాణిగ్రహణము చేసికొన్నచో నీకు నూరుగిన్నెల చక్కెర పొంగలిని, నూరు వెన్నముద్దలను కట్నముగా సమర్పింతు", నని మ్రొక్కిడెను. శ్రీరంగనాథుని యందు ఆండాళ్ ఐక్యమయినందునను, పిమ్మట ఆ మ్రొక్కును చెల్లించువారెవరును లేనందునను, ఆ బాధ్యతను శ్రీరామానుజుడే స్వీకరింపదలచెను. ఆండాళ్‌తో శ్రీరంగనాథునితో వారి సంశ్లేషభావమట్టిది. శ్రీరామానుజుడు ధనవంతు లైన కొంతమంది తనవైష్ణవ శిష్యుల సహాయమున గొప్పపండుగ జేయించి, ఆండాళ్ మ్రొక్కు అను పండుగ నూరు గంగాళముల చక్కెర పొంగలిని, నూరుగిన్నెల వెన్నముద్దలను స్వామికి ఆరగింపు జేయించి, ఆ ప్రసాదమును అశేష భక్తజనకోటికి పంచిపెట్టెను. ఆనాటి నుండి శ్రీరామానుజునకు గోదాగ్రజుడు (గోదాదేవి అన్నగారు) అను బిరుదము సంక్రమించినది.

శ్రీరామానుజునకప్పటికి డెబ్బదియేండ్లు నిండినవి. ఇక శేషజీవితమును స్థావరముగా శ్రీరంగముననే శాంతముగా గడప వలయునని నిశ్చయించుకొనెను.

# 36. శ్రీరామానుజుని జీవిత చరమాధ్యాయము

శ్రీరామానుజుడు చోళరాజ నిరంకుశత్వము నుండి తప్పించుకొనుటకు సీమాంతరవాసము జేయు సందర్భమున, ఏనాడైనను తన జీవితమున శ్రీరామానుజునొకసారి కలియగల ననెడిది కూరేశుని ఆశ. ఆ కోరిక తీరినది. ఇక తాను భౌతిక దేహమును వదలుటకు సంసిద్ధుడై యున్నాడు; తన జీవితము పూర్ణమైనట్టిదియు, ఫలప్రదమైనట్టియు ఘట్టమని ఆయన భావించినాడు. ఇక ఏ కొరతయు లేదు కూరేశునకు.

కొలది దినములలో బలహీనతతో కూరేశుడు మంచమెక్కినాడు. ఆతడు త్వరలో శ్రీమన్నారాయణుని పాదపద్మముల జేరునని శ్రీరామానుజుడు గమనించెను. చెంతనున్న శిష్యులను రామానుజుడీ విధమున నోదార్చెను - "కూరేశుడు మనందరికంటె ముందుగా జీవిత పందెమున విజయుడై వైకుంఠ గమ్యస్థానమును జేరనున్నాడు. అంతవరకు ఆయన మనందరిని మించినవాడే; ఈశ్వరానుగ్రహముచే నభిషిక్తుడయినవాడు. మిగిలియున్న మనకందరకును ఇంకను జేయవలసిన కార్యములున్నవని మనము భావింపవలసియున్నది. మనము భగవదిచ్ఛను నెరవేర్పవలసియున్నది. లోకకల్యాణమే భగవదిచ్ఛ. కూరేశుని కుమారుడు పరాశరుడు జ్ఞానమున, సమర్థతను తండ్రిని బోలినవాడు. పసితనముననే ఆతని దక్షత, శరణాగతి భావము, వైష్ణవ సంశ్లేషబావము వెల్లడయినవి. ఈ విశిష్ట వైశాల్య విశిష్టాద్వైత సిద్ధాంత సామ్రాజ్యాధిపత్యమును ఒకనాడు పరాశరుడు స్వీకరింపవలసియుండును, తన తమ్ముడు వ్యాసుడు, నాకు కూరేశునివలె, తనకు కుడిభుజముగా నుండగలడు", అనుచూ ఆ బాలకుల శిరములపై పుష్పముల జల్లి శ్రీరామానుజుడు వారల నాశీర్వదించెను.

ఈ దృశ్యమును తిలకించుచుండిన కూరేశుని ముఖపద్మము వికసించెను. శ్రీరామానుజుని పాదద్వయమును స్పర్శించుచూ, కూరేశుడు ఈశ్వరశక్తిలో ఐక్యము జెందెను.

కూరేశుని భౌతిక కాయమునకు శ్రీరామానుజుని ఆధ్వర్యమున అంత్యక్రియలు తిరుకావేరీ గట్టున జరిగినవి. ఈయంత్యక్రియలలో అనేక భక్తులు, ప్రజలు పాల్గొనిరి; ఉభయవేదాంతములు పఠింప బడినవి. ధనవంతులైన రామానుజుని భక్తులు, శ్రీరంగవాసులు. ఈ సందర్భమున అన్నదానము వస్త్రదానములు మెండుగా జేసిరి.

కూరేశుని యోగము రామానుజుని మనస్సున కెంతో లోటును, క్లేశమును గలిగించినవి. కాని తన కొరతను, దుఃఖమును రామానుజుడు గుప్తముగా నుంచుకున్నాడు. కూరేశుని మరణా నంతరము శ్రీరామానుజుడు శ్రీరంగమును వదలలేదు.

శ్రీమద్రామానుజుడు తన శిష్యకోటికి క్రమశిక్షణ, అడకువ, సేవాతత్పరతలయందు ఎనలేని ఆదర్శములను జూపి, వారిని తన్మార్గములకు ప్రోత్సహించెను.

శ్రీరామానుజుని శిష్యులలో నొకరగు అనంతాళ్వార్ ఒక సాదృశ్యమును తెల్పువాడు: "నిజమైన వైష్ణవుడు కొంగవలె, కోడిపుంజు వలె, లవణమువలె వ్యవహరించును", అని కొంగనీటిగట్టున నిలబడి, చిన్న చిన్న చేపలను పురుగుల నెన్నిటినో యెంతో కాలము చూచుచుండి, కడపట నొక పెద్దచేప పిల్లనే పట్టుకొనును. అట్లే శ్రీవైష్ణవుడు జీవితము నందలి అనేక అల్ప విషయములను లెక్కసేయక, నిజమైన జీవిత విలువలనే పాటించును. కోడిపుంజు చెత్తకుప్పను కాళ్లతో చెరగుచూ తన ఆహారమును స్వీకరించును. అట్లే వైష్ణవుడు శాస్త్రముల నన్నింటిని వల్లెవేయుచూ, సారమైన చరమ విషయమునే స్వీకరించును. ఉప్పులేని తిండి నిష్ప్రయోజనము కదా! అట్లే శ్రీవైష్ణవుని సేవాతత్పరతవలన సంఘము ఉజ్జీవించును.

భాగవతులెల్లరు సమానులు. భగవచ్ఛక్తి ముందు అందరు బిడ్డలే కదా! ఈ అఖిల మానవ సోదరభావమును వైష్ణవము బోధించుచున్నది. ఒకనాడు శ్రీరామానుజుడు కావేరియందు స్నానమాచరించి, మఠమునకు వచ్చుచుండిరి. శిష్యులు వెంటరాగా, ఆచార్యుడు ఒక

శిష్యుని భుజముపై తన కరమునిడి నడుచుచుండెను. దారిన శూద్రకులజుడగు శ్రీవైష్ణవుడొకడు కూర్చొనియుండెను. శిష్యుడాతనితో, "ఆచార్యులు వచ్చున దగపడుటలేదా నీకు? అటు జరుగుము", అని కోపముతో ననెను. ఈ మాటలు విన్న రామానుజుడు శిష్యుని భుజముపై వేసుకొని యున్న తనకరమును లాగుకొని ఒంటరిగా నడువసాగెను. శిష్యున కర్థముకాలేదు. పరుగెత్తుతూ ఆచార్యుని జేరి, "స్వామీ, నేనేమైన అపరాధమును గావించితినా? తెలియక చేసియున్న మన్నింపుడు", అనెను.

"సోదర మానవునకు జరిగిన అగౌరవము నాకును అగౌరవమే! ఈశ్వరసృష్టిలో ఎల్లరు సమానులు. ఇదియే తత్త్వత్రయ జ్ఞానము. నీవు నీచముగా జూచిన ఆ శ్రీవైష్ణవునికంటే నేను లేశమైనను గొప్పవాడను గాను. నీకింకను శ్రీవైష్ణవతత్త్వమలవడలేదు", అని రామానుజు డనెను. ఆదర్శమే జ్ఞానముకంటె గొప్పదని శిష్యులు గ్రహించిరి.

ఒకనాడు శ్రీరామానుజుడు మఠమునందుండెను. వారికొక వార్త చెవినబడినది. ఎవరో ఒక ముసల్మాను ఫకీరు, దూరదేశస్థుడు, రంగనాథుని దర్శనమునకు వచ్చెను. అర్చకులు అభ్యంతర పెట్టివానిని రానివ్వలేదనియు, ఆతడు తిండిలేక దేవాలయ ద్వారసమీపమున పస్తుగా పడియుండెననియు, రామానుజునకు తెలిసినది. రామానుజుడు వెంటనే లేచిపోయి, ఆ ఫకీరును మఠమునకు తీసికొని వచ్చెను. వానిముందు విస్తరపరచి, కొన్ని కుడుముల వడ్డించి, ప్రక్కన ఒక చిన్నగిన్నెలో ఘృతము నుంచెను. పెట్టినది తడవుగా నొక శునకము కుడుమును నోటబట్టకొని పరుగిడుచుండెను. ఫకీరు వెంటనే పైకిలేచి, "స్వామీ, రంగనాథా, ఆగుము! కుడుముపై నేయి వేసెదను", అనుచూ ఘృతపుగిన్నెను చేతబూని శునకము వైపు ననుసరించి పరుగిడు చుండెను. శిష్యులు దేవాలయార్చకులు ఆశ్చర్యమున జూచుచుండిరి. "మీజ్ఞాన నేత్రమును తెరుచుటకే శ్రీమన్నారాయణమూర్తి ఈ శునకము నిచటికి రప్పించినాడు", అని రామానుజుడనెను.

శ్రీమద్రామానుజునకనేకులు స్త్రీ శిష్యులుండిరి. శ్రీదేవీ కృప ముక్తికి మార్గమని తెల్పు వైష్ణవ సంఘమున స్త్రీలకు గౌరవస్థాన ముండవలయునని రామానుజుడనువాడు. కొందరు స్త్రీ శిష్యురాండ్రు ఆధ్యాత్మిక చర్చలయందును పాల్గొనువారు.

కూరేశుని భార్య ఆండాళ్ గొప్ప పండితురాలు. రామానుజ మఠమున నామెకు ప్రముఖ స్థానముండెడిది. ఈమెను రామానుజు డెంతగానో గౌరవించువాడు, కూరేశుడు చెరగొనబడగా, గ్రుడ్డివాడు కాగా, ఆమె ఓర్పుతో దుఃఖమును మ్రింగి బిడ్డలకు ధైర్యమును గొల్పిన మనిషి. తమ భర్త ఆదేశానుసారము సర్వ సంపదలను వదలి, భర్తతో గూడి రామానుజ మఠమును జేరిన త్యాగశీలిని ఆండాళ్.

ఉరంగావిల్లి పొన్నాచ్చి వృత్తాంతమును ఇంతకముందు తెలిసికొని యున్నాముకదా! (ధనుర్దాసు హేమాంబుల వృత్తాంతము). పొన్నాచ్చి యొక్క వైష్ణవభక్తి, పాతివ్రత్యము సర్వుల ప్రశంసల నందుకొన్నవి. శూద్రకులజులయిన వీరియెడ రామానుజున కత్యంత ప్రేమ, వాత్సల్య, గౌరవభావము లుండెడివి. ఇందుకు నిదర్శనమైన సంఘటనను గూడా యిది వరలో మనము తెలిసికొని యున్నాము.

కొంగుదేశము నుండి (ప్రస్తుత కోయంబత్తూరు) కొంగుపిరాట్టి యను నొక భక్తురాలు శ్రీరంగయాత్రకు వచ్చెను. శ్రీరంగనాథుడే సేవించుటకు వచ్చినను, ఆమెకు శ్రీరామానుజ దర్శన భాగ్యము కలిగిన తరువాత ఆమె కొంతకాలము రామానుజ మఠమున నుండదలచెను. అచ్చటి దివ్య నిర్మల వాతావరణము ఆమె ఆధ్యాత్మిక చింతనమునకెంతయో అనుగుణముగా నుండెను. కడకు తనశేష జీవితమునంతటిని ఆమె అచ్చటనే గడపెను. ఇట్లు శ్రీరామానుజ మఠవాసులుగానున్న స్త్రీలు తిరువనంతపురత్తు అమ్మాళ్, తిరువాట్టారు అమ్మాళ్, తిరువన్ పరిశారమ్ అమ్మాళ్ మొదలగువారు. పురుషులకును స్త్రీలకును సమాన ప్రతిపత్తి నిచ్చిన మొదటి మతాచార్యుడు రామానుజుడు.

శ్రీరామానుజుడు అహంభావ మనునది యెరుగడు; దాసాను దాసుడుగా తన్ను తాననుభవించుకొనువాడు, తనకు లోపమాపా దించదు అని భావించువాడుకాడు; తనలోపమును తెలిసికొని సవరించుకొనుటకు ఎట్టి ఆత్మాభిమానమును జూపువాడు కాడు; శ్రీ భాష్యరచనా సందర్భమున కూరేశుడు తనతో భేదించినపుడు, రామానుజుడు సుహృద్భావముతో కూరేశుని భావమును గ్రహించి, తన భావమును సవరించుకొనెను గదా!

తిరుప్పులింగుడి యను గ్రామము నుండి ఒక భక్తురాలు రామానుజుని దర్శింపవచ్చెను. రామానుజుడు ఆమె యోగక్షేమముల విచారించు సందర్భమున, "మీ స్వగ్రామమయిన తిరుప్పులింగుడి తిరుకురుగూరుకు నామె "స్వామీ, మీరు నమ్మాళ్వారుల పాశురముల చదివియున్నారు గదా!" అని ప్రశ్నించెను. వెంటనే ఈ పేర్లు గల ఆళ్వార్ల పాశురము తనకు జ్ఞప్తికి రాగా, ఆరెండు ప్రదేశములు చాలదగ్గరలో నుండునవనియు, ఎలుగెత్తి కేకవేసిన వినపడు మధ్యదూరమును గలిగియున్న వనియు రామానుజుడు గుర్తించెను. శ్రీరామానుజుడామె సంభాషణ నెంతయో మెచ్చుకొని, శిష్యులతో, "చూచితిరా, యీమె సారస్వత జ్ఞానము! ఈ పాండ్యదేశపు స్త్రీ పాండిత్యమును నాకంటె తక్కువ గాదు", అనెను.

"భగవచ్ఛక్తి అన్ని తావులయందును సమానముగా వ్యాపించి యున్నది; భక్తుడు స్థలభేదమును పాటింపడు - సేవాతత్పరతయే అతని ధ్యేయము" అని శ్రీరామానుజుడు పలుమారు భక్తులను హెచ్చరించువాడు. "నాకు శిష్యుడనబడువాడు తానొకరికి కృపజూపు తున్నాని భావింపడు; మరియు తాను ఇతరుల కృపను అర్థించడు. ఏది జరుగుతున్నను, శుభాశుభముల, సమానముగా గ్రహించు చుండును. వాడుకలోనున్న ఒక చిన్నకథను చెప్పెదను, వినుడు. ఒకనాడు గరుడుడు దూరదేశమేగి అతిథ్యము కొరకొక గృహమును సమీపించెను. ఆ గృహిణి శ్రీవైష్ణవ స్త్రీ; గరుడునికి అతిథ్యమిచ్చి సంతృప్తిని గలుగజేసెను. తృప్తినందిన గరుడుడామెతో, "అమ్మా నీవు

శ్రీవైష్ణవ స్త్రీవి. ఈ శైవదేశమున నేల కాపురమున్నావు?" అని ప్రశ్నించెను. ఆ క్షణమున గరుడుడు తన పక్షద్వయమును గోల్పోయెను; ఎగురలేక బలహీనస్థితిలో బడ్డాడు. ఇది యేమని భయకంపితుడయిన గరుడనితో అమె, "అయ్యా, విష్ణువు లేనిగ్రామమిది యెట్లగును? సర్వాంతర్యామి యగు విష్ణువు ఎల్లయెడల ఎంతమోతాదులో నున్నాడో మా గ్రామమున సైతము అంతగానున్నాడు గదా!" అనెను. ఈ విచక్షణ జ్ఞానము గరుడునికి తెలియగానే అతడు తన రెక్కలను తిరుగా పొందెను; అనగా తనకున్న శక్తిని మరలాపొందెను. ఈ కథ భగవచ్ఛక్తి సర్వాంతర్యామి యని చెప్పుటకెట్టి మంచి యుదాహరణమో చూడుడు. ఈ కథను నేను పూర్వము పాండ్యదేశ పర్యటనగావించునపుడు ఒక సామాన్యుని వద్దనుండి వినియున్నాను", అని రామానుజుడు చెప్పుచూ శిష్యుల నుత్సాహపరచువాడు.

మైసూరు రాష్ట్రము నుండి శ్రీరంగమునకు తిరిగివచ్చిన తరువాత శ్రీరామానుజుడు శ్రీరంగనాథ దేవాలయ పరిపాలనా విషయము లందును, దేవస్థాన అర్చన కార్యక్రమములందును ఎన్నో సంస్కరణముల ప్రవేశపెట్టవలయునని సంకల్పించెను. కాని అనుకున్నవన్నియు నెరవేరలేదు. మేల్‌కోటలో అతిసులువుగా తన యుద్దేశముల నమలు జరుపగలిగెనేగాని, శ్రీరంగమున కరుడుగట్టిన అర్చకుల వలన పెక్కు అడ్డంకులేర్పడినవి. పూర్వమీ యర్చకులలో కొందరు రామానుజు నెంత ద్వేషించినదియు, తుదకు ఆచార్యుల వారిని వారెట్లు తుదముట్టింప ప్రయత్నించినదియు, దైవానుగ్రహమున శ్రీరామానుజుడెట్లు ఆపదల నుండి తప్పుకొన్నదియు పాఠకులకు విదితమే గదా! హరిజన దేవాలయ ప్రవేశమును మేలకోటలో జయప్రదము చేయగలిగిన రామానుజుడు శ్రీరంగమున నా ప్రయత్నమే చేయలేకపోయెను. శ్రీరంగమున నెలకొనియున్న మూఢ పూర్వాచారముల బలమట్టిదని తెలియుచున్నది. శ్రీరామానుజుడు మహామేధావి; కుశాగ్రబుద్ధిశాలి; తనచుట్టు నున్న మానవుల మనస్తత్వము నెరిగి వర్తించువాడు; ఎరుకగలవాడు; సామాన్య జ్ఞానము

మెండు వారికి; ఎవరితోను విరోధపడక, సామోపాయముననే సంఘమును సంస్కరింపగోరువాడు. ఈ పద్ధతియే వారికి కీర్తి దెచ్చినది. పూర్వాచార పరాయణమయిన మూఢ విశ్వాసముల నుండి ప్రజలను ఉద్ధరించుటకును, కులభేదముల అవాస్తకత్వమును నిర్మూలించుటకును, మానవులలో సోదరభావము పెంపొందించుటకును, రామానుజుడు శాస్త్రీయమైనట్టియు, సత్యమైనట్టియు, సర్వజనామోద మైనట్టియు తన విశిష్టాద్వైత సిద్ధాంతమునుపయోగించెను.

శ్రీరామానుజుడు వార్ధక్యముననున్నవాడు; శతవృద్ధుడగు చున్నవాడు. తన శతవత్సర జీవితమున గావించిన సంస్కరణములను, సేవలను తన తరువాత కూడా చిరస్థాయి జేయుటకు ఒక సిద్ధాంతపరమైన సింహావలోకనము ఆయనకు అవసరమాయెను.

శ్రీరామానుజునికంటె వయస్సున పెద్దవారును, ఆయనకంటె చిన్నవారును, అయిన మఠవానులెందరో ఒకరి వెంటనొకరు కాలానుగుణ్యముగా వైకుంఠప్రాప్తిని పొందుతూ వచ్చినారు. కూరేశుని మరణము ఆచార్యుల జీవితమున మరువరానిదెబ్బ. కాని మరణము భౌతికకాయముననేగాని, ఆయన ఆత్మ వైకుంఠమున, భక్తుల నిర్మల హృదయములయందు ఎల్లప్పుడు జ్యోతివలె ప్రకాశించుచుండునని శ్రీరామానుజు డెరుగును. కూరేశుని భార్య ఆండాళ్‌ను శ్రీరామానుజు డెంతయో ఓదార్చెను; కాని ఆమె భర్త మరణానంతరము ఎక్కువ కాలము జీవింపలేదు. ఆండాళ్‌కు కూడా రామానుజుని ఆధ్వర్యముననే అంత్యసంస్కారములు జరిగినవి.

శ్రీరామానుజ సిద్ధాంతము సర్వజనామోదముగా నుండెను. వారి కీర్తిచంద్రికలు దేశము నలుమూలల ప్రసరించినవి. అనుదినము వేలకొలది ప్రజలు మఠమును దర్శించి, విశిష్టాద్వైతులై తిరిగిపోవువారు. ఏదోకొలది మందిచే పూర్వముననుసరింపబడిన వైష్ణవమతము ఈనాడు దేశవ్యాప్తమయినది. స్థూలముగా జూచిన, ఎవ్వడేని భగవచ్ఛక్తికి శరణాగతి యగుచున్నాడో, భగవచ్ఛక్తి సర్వాంతర్యామి

అని భావించుచున్నాడో, అచ్చట విశిష్టాద్వైత సిద్ధాంతబీజము అంకురించినట్లగును. దక్షిణ హిందూదేశమున వైష్ణవమే ప్రధానమత మయిపోయినది. వైష్ణవాలయముల సంఖ్య పెరుగుటయే గాక నిత్య కైంకర్యములు విస్తృతముగా జరుగజొచ్చినవి. సామాన్యముగా కుగ్రామమున సైతము ఒకగొప్ప వైష్ణవాలయము లేకున్నను, ఏదో ఒక చిన్న రామందిరమో, కృష్ణమందిరమో వెలసినది. రామభజనలు, కృష్ణ భజనలు కొనసాగినవి.

క్రమముగా విశిష్టాద్వైత సిద్ధాంతము ఉత్తరభారతమున ప్రజామోదమును బొందుతూ వచ్చినది. ఉత్తరదేశవాసులు తిరుమలను, శ్రీరంగమును దర్శించుట అధికమయినది. ఇందులకు కారణము రామానుజుని ప్రచార ప్రభావమే. ఈ పుణ్యక్షేత్ర ప్రభావము నకు ఆళ్వార్లు కారణమని రామానుజుడు చెప్పచూ, ఆళ్వారుల వైష్ణవ భావమును, విష్ణు సంశ్లేష భావములను ప్రజలకు నచ్చునట్లు రామానుజుడు ప్రచారము గావించినాడు.

ఉరంగావిల్లి (ధనుర్దాసు) కాలక్రమమున మఠకార్యక్రమముల నుండి విశ్రమించి, తనస్నేహితుడు కూరేశుని వైకుంఠ మార్గమును బట్టెను. ఉరంగావిల్లి మరణమును జూచిన పొన్నాచ్చి (హేమాంబ) భగ్నహృదయురాలై వైకుంఠమును జేరెను. వారిరువురి కళేబరములను పుష్పక విమానముపై నుంచి, రామానుజుడు భక్తులు, మఠవాసులు వానిని శ్మశానమునకు మోసుకొనిపోయిరి. పుణ్య దంపతుల కళేబరముల నొక్క చితిపై బెట్టి, అగ్ని సంస్కారముల గావించిరి. ఉరంగావిల్లి పొన్నాచ్చిలకు జరిగిన అంత్యక్రియల విధానమును బట్టి శ్రీరామానుజుని తత్త్వము, వారిబోధనా విధాన ఫలితము వెల్లడి యగును. ప్రతివారును ఆశ్చర్యపడి, ఆమోదించి, అనుసరింప దగిన విషయము గదా అది!

# 37. సర్వసంగ పరిత్యాగము

శ్రీమద్రామానుజాచార్యుల వారికి నూరుసంవత్సరములు నిండినవి. తనకంటె చిన్నవారును, తనశిష్యులయినవారును ఎందరో తనముందు పరమపదించిరి. సానుకూలముగా, శాంతియుతముగా, విజయవంతముగా తాను ప్రతిపాదించిన వైష్ణవ విశిష్టాద్వైత సిద్ధాంతము స్థిరపడినదను ఆనందమును, తృప్తిని శ్రీరామానుజుడు పొందెను. తాను తన జీవిత ధ్యేయమును ఫలప్రదము జేసికొన్నాడు. ఇక వారు కాంక్షించున దేమియు లేదు. నూతన శిష్యులను స్వీకరించు బాధ్యత నుండి తొలగదలచినాడు. మఠవిషయములనుండి సన్న్యసించి, తన శేషజీవితమును శాంతియుతముగా భగవద్ధ్యానమున గడుపదలచినాడు.

ఒకనాడు భగవానుడయిన శ్రీరామానుజుడు శుభముహూర్తమున పరివ్రాజక శిష్య శిఖామణులను, గార్హస్థ్యశిష్యరత్నములను సమావేశ పరచి, వారందరికి నిట్లు నివేదించెను:

"వత్సలారా, శిష్యులారా పరాశరుడు శ్రీరంగనాథుని వరప్రసాదమున ఆండాళ్ కూరేశులకు పుత్రుడై జన్మించెను. సకల వేదోపనిషత్తులను ద్రావిడ ప్రబంధమును, బ్రహ్మసూత్రములను, భగవద్గీతయు, భాష్యములును యితని వశమైనవి. నా సమక్షమున, మన యీ మఠమున దాశరథియు, గోవిందమిశ్రుడును, వీనికి తగిన ఆధ్యాత్మిక జ్ఞానమును, అనుభవమును కలుగజేసినారు. పిన్నతనము ననే ఉభయవేదాంత సారమును ఆకళింపు జేసికొన్న మేధావి, ఈ పరాశరుడు. ఈ మేధావిని, ఈ దక్షుని, ఈ యువకుని మన విశిష్టాద్వైత మఠమున కధిపతిగా జేయుచున్నాను. ఇది మొదలు మీకు ఆచార్యుడును, గురువును పరాశరుడే. ఈతడు ఇకమీద వైష్ణవ లోకమునకు మార్గదర్శకుడై విశిష్టాద్వైత సిద్ధాంతమునకు ప్రచారము గావించుగాక! ఇది నా నిశ్చయము".

ఈ పలుకులు చెవులబడగానే శిష్యులు కన్నీరు కార్చుచూ, గద్గద కంఠమున, "ఆచార్యవర్యా, భగవానుడా, మీరు మమ్ముల వీడి పోనెంచితిరా?" అనిరి.

"వత్సలారా, నేను ఇచటనే ఆశ్రమవాసిగా నుందును. నేను పరివ్రాజకుడనై సుమారు ఎదుబది సంవత్సరములు ఇప్పటికి గడిపితిని. శత సంవత్సరముల వయస్సు నిండుచున్నది. ఇపుడు నాకు ఈ మఠము, ఈ శిష్యులు అను క్రొత్త సంసారము ఏర్పడియున్నది. ఇదియును ఒక బంధమైనది. ఈ బంధము నుండి నేను విముక్తుడనగు చున్నాను", అని శ్రీరామానుజుడు శిష్యులకును నచ్చజెప్పెను.

శ్రీపరాశరుడు మఠాధిపత్యమును వహించెను. అనుజుడు వ్యాసుడు వానిని దక్షిణహస్తమువలె సహకరించుచుండెను. పరాశరుని అధిపత్యమున శిష్యకోటి, అర్చకబృందము యొక్క సహకారమున విశిష్టాద్వైత మతప్రచారముగాని, రంగనాథాలయ నిర్వహణము గాని, యథావిధిగా జరుగుచుండెను.

శ్రీరామానుజుడు సర్వసంగ పరిత్యాగియై, బాహ్య ప్రపంచముతో ఏలాటి బంధములేక నిశ్శబ్దమున, ధ్యానమున, మఠము పెరటియందు ఏకాంతమున కాలము గడపుచుండెను. వారికి ఇతరులతో సంభాషణలు లేవు; తన ఉపన్యాసములు లేవు; ఎవ్వరేని మఠమునకు వచ్చిన, వారిని దర్శించుకొనిపోవుచుండువారు. శ్రీరామానుజుడేమి ఆలోచించుచుండిరో ఎవరికి తెలియును? వారెట్టి దివ్యజ్ఞానమున నుండిరో ఎవరికి యెరుక? ఇది మొదలు తన అవసానకాలము వరకు, అనగా ఇక ఇరువది సంవత్సరముల కాలము, రామానుజుడు నిశ్శబ్ద మహాసముద్రమున మునిగియుండెను. ఏ కార్యక్రమమునుగాని, మఠ సంబంధమయినవి గాని లేక దేవాలయ సంబంధమయినవిగాని, తిలకించువాడుకాడు; చేయువాడును కాడు. ఉదయమున నొంటరిగా కావేరినదికి స్నానమునకు బోయి తిరుగా మఠమును జేరువాడు. మఠమున నొకమూలనో, మఠము యొక్క వనమున నొకమూలనో ఒంటరిగా కూర్చొనియుండువాడు. ఎల్లప్పుడు ఏకాంతమున ధ్యానసమాధిలో నుండువాడు. వారి ముఖము చిరునగవున, ఉత్సాహమున ప్రకాశించెడిది. పరాశరవ్యాసులకుగాని, ఇతర శిష్యకోటికిగాని, యాత్రికులకుగాని ఆచార్యులవారి దర్శన

భాగ్యము మాత్రము ముండెడిది. ఈ భాగ్యము వారికి సర్వస్వము. సర్వసంగ పరిత్యాగమున శ్రీరామానుజుడిట్లున్నను విశిష్టాద్వైత మతమను శరీరమునకు వారు ఆత్మగానే భావింప బడుచుండిరి.

శ్రీరామానుజు డీ యిరువది సంవత్సరముల కాలమున ఏ విషయమును ధ్యానించుచుండిరో వారు వచింపలేదు; నిజమైన వైష్ణవ భక్తులే యీనాటికిని దీనిని యూహించుకొనగలరు!

శ్రీరామానుజుడు యామునాచార్యుల నిర్యాణసమయమున గావించిన వాగ్దానత్రయమును నెరవేర్చు కొన్నాడు గదా! పరాశరవ్యాసుల కీర్తిని చిరస్థాయిజేసినాడు. (పరాశరవ్యాసులు విష్ణు పురాణమున తత్త్వత్రయ జ్ఞానమును ప్రతిపాదించి యున్నారు గదా) - బ్రహ్మసూత్రములకు శ్రీభాష్యమను పేర వ్యాఖ్యానమును రచించిరి - నమ్మాళ్వార్ల ద్రావిడ వేదమును ప్రచారముజేసి, ఉభయ వేదాంత ప్రచారకుడై చేతనులకు సత్యమార్గమును జూపినాడు..... ఇక శ్రీరామానుజునకు కావలసినదేమున్నది? కావుననే సర్వసంగపరిత్యాగి అయినాడు.

తిరుక్కురుకైప్పిరాన్ పిళ్లాన్‌ను (కురుకేశులను) ఆళ్వార్ల రచనలకు వ్యాఖ్యానమును రచింపమని శ్రీరామానుజుడు ఆదేశించియుండెను. ఈ వ్యాఖ్యానము రామానుజుని ఆమోదమును బొందియుండెను. దానిని "భగవత్ విషయము" అని రామానుజుడు అన్నాడు. అది తన విరచితమగు శ్రీభాష్యముతో సమానమయినదని రామానుజుడు ప్రశంసించి యున్నాడు.

ఆళ్వార్ల రచనలకు వ్యాఖ్యానములు రచించుట కురుకేశులతో ప్రారంభమాయెను. అనేక భాగవతులు ఆళ్వార్ల రచనలకు వ్యాఖ్యానముల గావించియున్నారు. ఇది యొక గొప్ప ఆధ్యాత్మిక సారస్వతము. (ఈగ్రంథ కర్తయును తనశక్తికొలది నలుగురాళ్వారులు, పెరియాళ్వారు, కులశేఖరాళ్వారు, తిరుమంగైఆళ్వారు, నమ్మాళ్వారు,

శ్రీ తిరుమలేశుని స్తుతించిన విధమునకు "శ్రీ తిరుమల తిరుపతి వేంకటేశ్వర దివ్య వైభవము" అను పేర వివరణమును రచించినాడు)

శ్రీరామానుజుడు సర్వసంగ పరిత్యాగి అయినప్పటికి డెబ్బది నల్వుర సింహాసనస్థులగు ఆచార్య పురుషుల నియమించి, వారిని విశిష్టాద్వైత సిద్ధాంత ప్రచారమునకు నియమించెను. తన తదనంతరము తన సిద్ధాంతము నిర్విఘ్నముగా ప్రబలుటకు సర్వ విధములైన యేర్పాట్లను రామానుజుడు గావించియుండెను. నాదదూర్ అల్వాన్, కిడాంబియాచ్చాన్, ముదలియాండాన్ అను శిష్యత్రయము శ్రీభాష్యమును ప్రచారము జేయుటకు నియమింపబడిరి, తిరుకురుగైపిళ్లాన్ ఆళ్వార్ల సాహిత్య వ్యాఖ్యానమును ప్రచారము చేయుటకు నియమింపబడెను.

సర్వసంగ పరిత్యాగియయిన రామానుజుడు నిత్యమును పుణ్యకావారీజలమున స్నానమాచరించి, మఠమున ధ్యానము నందేయుండి, శ్రీరంగమును వదలినవాడు కాడు. ఇట్లుండ నొకనాడు ఒక వృద్ధబ్రాహ్మణ భక్తుడు శ్రీరామానుజుని కడకరుదెంచి, రామానుజునకు సాష్టాంగ నమస్కారముగావించి, "మహాత్మా! నన్ను శిష్యునిగా స్వీకరించి, తరింపజేయుడ"ని ప్రార్థించెను. అందులకు రామానుజుడు, "అయ్యా, పరాశరునకు మఠాధిపత్యము జరిపినది మొదలు నేను గురువన్న భావమును వీడితిని. నేను ఇపుడు గురువును గాను; ఆచార్యుడనుగాను. నేను దాసానుదాసుడనే; మరియు సర్వసంగ పరిత్యాగినయితిని గనుక ఇక నేనెందును జోక్యము కలిగించుకొనను; ఏకాంతమున ధ్యాననిమగ్నుడ నైయుండదలచితిని. కావున నీవు పరాశరుని వద్దకేగుము", అని రామానుజుడు పల్కెను.

అంతటితో ఆ వృద్ధ బ్రాహ్మణోత్తముడు సమ్మతింపక, తృప్తిపడక, ఊరుకొనక, "ఆచార్య, నన్ను మాత్రము శిష్యునిగా స్వీకరింప వలసినదే - తప్పదు", అనుచూ ఆచార్యుని పాదములు పట్టుకొని వదలలేదు.

రామానుజుడు, "భాగవతోత్తమా! నాకిపుడు గురువు, శిష్యుడు అను భేదభావము లేదు. భాగవతులెల్లరు సమానులు; భాగవతులు

దైవ సమానులు నీవు పట్టిన పట్టు వదలక నాకు శిష్యుడవు కావలయునని అంటివి. సరే, అట్లే శిష్యుడవగుము. కాని నేను మాత్రము నిన్ను భగవంతునిగా తలచి నిన్ను పూజింతును. అనుదినము మన మిరువురము తిరుకావేరి వద్ద కలియుదము. స్నానానంతరము నీకు మంగళాశాసనము పలికెదను - తరువాత నీ పాదతీర్థమును నా శిరముపై జల్లుకొని తరువాత భగవన్నామ సంకీర్తనము గావించు కొనెదనుగాక", అనెను.

వృద్ధ బ్రాహ్మణుడు అదియే గురునాజ్ఞగా భావించి, కావేరీనదికి అనుదినము ప్రాతఃకాలమున స్నానమునకు బోయి శ్రీరామానుజుని దర్శించుచుండెను.

ఒకనాటి ఉదయమున శ్రీరామానుజాచార్యులు జ్వరపీడితుడుగా నున్నందున స్నానార్థియై తిరుకావేరికి పోలేదు. దినమంతయు గడచినది. రాత్రి అయినది. శ్రీరామానుజుడు హరినామస్మరణ గావించుకొని, యిక నిద్రింప బోవుచున్నాడు. అప్పుడు ఒక వృద్ధ బ్రాహ్మణ గృహిణి మఠమునకు వచ్చి, "స్వామీ, యీనాటి ఉదయమున మీ దర్శనార్థము కావేటికిబోయిన నా భర్త యింతవరకు ఇల్లు చేరలేదు. కారణ మెరుగక యిటు వచ్చితిని, స్వామీ", అని యెరింగించెను. వెంటనే మఠవాసుల నిద్దరిని తీసికొని, రామానుజుడు వేవేగ కావేరీ తీరము జేరెను. అచ్చట నీటిగట్టున దైవనామ సంకీర్తన జేసికొనుచుండిన వృద్ధ బ్రాహ్మణుని జూచి, "మహాత్మా ఉదయము నుండియు ఉపవసించుచూ యిచ్చటనే యున్నారా?" అని రామానుజు డడిగెను. "ఆచార్యా, గురునాజ్ఞనుల్లంఘించుట యెట్లు? మీ కొరకు ఎదురుజూచుచున్నాను", అన్నాడు వృద్ధ బ్రాహ్మణుడు. "మహాత్మా మీరు దాస్యభక్తి శిఖరము నందుకున్నారు. మీరు భగవచ్ఛక్తిని వశము జేసికున్నారు", అనుచూ బ్రాహ్మణుని పాదతీర్థమును శిరమున జల్లుకొని, ఆ పరమ భాగవతోత్తముని గూడి పురమును ప్రవేశించెను. ఆచార్యుల వారి సర్వసంగ పరిత్యాగ జీవితము అతి విచిత్రమైనది; జ్ఞానదాయకము.

## 38. నిర్యాణము

శ్రీమద్రామానుజాచార్యునకు నూటయిరువది దివ్య వసంతములు నిండినవి. అది క్రీ.శ. 1137వ సంవత్సరము - శక సంవత్సరము 1059 మాఘశుద్ధ దశమి దినము - ఆచార్యులు అవతారమును చాలించిన దినమది. మఠవాసులైన శిష్యుల నెల్లర రావించి, అందరిని పరికించి, చూచి, వారినందరిని ఆశీర్వదించి, యిట్లు పలికెను.

"వత్సలారా, నే నీ పాంచభౌతిక శరీరమును చాలించి, మిమ్ములను వీడిపోవు సమయ మాసన్నమగుచున్నది. ఈ ప్రపంచమున జన్మించిన దేదియైనను గతింపవలసినదే గదా! కాని యిచట జన్మించి, జీవించినందులకు మనజీవితమును మనము సఫలము జేసికొన్నామా లేదా అని తెలిసికొనవలయును. లోకకల్యాణార్థము జీవించినపుడు జన్మ సఫలమయినదని భావము".

ఇట్లు రామానుజుడు పలుకగానే ఎంబారు, వడుగనంబి, పరాశరుడు, వ్యాసుడు, ఇతర శిష్యులెల్లరు ఆచార్యుని చుట్టు ముకుళితహస్తులై నిలువబడి, కన్నీరు కార్చదొడగిరి.

ఆచార్యుల వారి శిరము ఎంబారు (గోవింద మిత్రుడు) ఒడిలో నున్నది. దివ్యపాదద్వయము వడగనంబి (ఆంధ్రపూర్ణుడు) యొడిలో నున్నవి. తక్కిన శిష్యులెల్లరు అశ్రువుల రాల్చుచూ ఆచార్యుని మ్రోలనిలువబడియున్నారు. ఆచార్యుడు సంపూర్ణారోగ్యమున నున్నారు. ముఖవర్చస్సు యథాస్థితిగా ప్రకాశించుచున్నది. వాక్పటిమ తగ్గలేదు. మరణము అనునది వారిని సమీపించినట్లు కనబడదు. వారికై వారే పాంచభౌతిక శరీరమును వదలి ఈశ్వర సంయోగమునకు పోవ సమకట్టినట్టివారుగా నున్నారు.

కన్నీరుకార్చుచున్న శిష్యుల నుద్దేశించి శ్రీమద్రామానుజుడు తన కడపటి దివ్య సందేశమును శిష్యులకు దెల్పెను:

"వత్సలారా, నా వియోగమునకు మీరు దుఃఖింపవలదు. ఈ భౌతిక శరీరము నేనాడైనను వదలిపోవలసినదే గదా! నా కర్తవ్యము పూర్తి అయినది. నా శిష్యులు నేనొరించిన కార్యమును స్థిరపరచి, వృద్ధిచేయగలరు. ఆ విశ్వాసముతో, తృప్తితో ఈ పాంచభౌతిక ప్రపంచమును వదలెదను. నా నిర్యాణమునకు మీ రెవరును చింతింపరాదు. తత్త్వత్రయ జ్ఞానమెరిగినవాడు మరణమునకు చింతింపడు. ఇదిగో, నా చరమోపదేశము, వినుడు - పాటింపుడు - ఇతరులచే పాటింపజేయుడు -

"సర్వేశ్వరుని, విష్ణువును, పూజించు విధమున భాగవతులను (శ్రీ వైష్ణవులను) పూజింపుడు. ఆళ్వారాచార్యుల బోధనలను విశ్వసింపుడు, ఇంద్రియలోలురు కావలదు. ఆళ్వారాచార్యులు జూపిన దివ్యమార్గమును బొందుడు; ఈ ఋజుమార్గము వలన ఇంద్రియముల జయింపనగును. నిజమైన భక్తుడు భగన్నామ సంకీర్తనాదుల కోరిన విధమున భాగవతుల దివ్యచరిత్రములను చదువకోరిక గలిగియుందురు. దైవభక్తులను సేవించినవారు దైవమును బొందుదురు. నిజమైన వైష్ణవుడు లోకకల్యాణము కొరకే జీవించును; అట్టివాడు అనుదినము అనుక్షణము దైవవిషయము మనమున నుంచుకొని, ఆళ్వారాచార్యుల రచనలను దినమున కొంత కాలము పఠింపవలయును. భగవచ్ఛక్తికి ప్రపన్నుడవయి, స్వార్థ రాహిత్యమున, పరోపకారిగా నుండుము. వర్ణమత రహితముగా సోదర మానవుల ప్రేమింపుము. సత్యమార్గ మెరిగిన వారి సహవాసమున నుండుము. మూఢవిశ్వాసముల గలిగి, మూఢాచారముల పాటింపువారిని సోదరభావమున ఉద్ధరింప ప్రయత్నింపుము. అసూయకూడదు. స్వార్థరహితుని అసూయ సమీపింప జాలదు. ఇంద్రియలోలురుగానున్న వారిని చేరకుడు.

భగవద్రూపము తనముందున్న రాతివిగ్రహమేననియు, గురువును సామాన్య మానవుడేననియు, భగవత్సన్నిధి తీర్థమును సామాన్య జలమేననియు భావించుటయు, దివ్యమంత్రములను ఏదో

పదజాలమేయనియు, ఈశ్వరశక్తిని అనేక దేవతలలో నొకటియనియు తలచువాడు అజ్ఞానుడు.

ప్రపత్తి మార్గమున నుండువానికి సందేహము లేదు; భయము లేదు; నీ స్థితి నీ త్రికరణశుద్ధిపై నాధారపడియున్నది. జరిగిన దానికి చింతించి ప్రయోజనము లేదు. జీవితాశయము ప్రాపంచిక సౌఖ్యము కాదు; దైవారాధనము నీ జీవితాశయమై నుండవలయును. దైవారాధన మనగా దైవస్థమయిన సర్వభూతముల ప్రేమించి, సేవజేయుట. తత్త్వత్రయ జ్ఞానము ప్రకారము ఈశ్వరశక్తి చేతనులలోనున్నదిగాన చేతనుల రూపముననున్న ఈశ్వరశక్తిని ప్రేమింపుము.

శ్రీభాష్యమును పఠించి, అవగాహనకు దెచ్చుకొనుడు. ఇది సాధ్యము కాదేని, నమ్మాళ్వారు తదితర ఆళ్వార్లు గావించిన రచనలను పఠించి, భావము దెలిసికొని, భక్తులకు బోధింపుడు. ఇవి చేయలేని వారు పరోపకార జీవితముల గడుపవలయును. కాదేని యాదవగిరి యందొక చిన్నపర్ణశాలను భక్తుల కొరకు నిర్మింపుడు. ఇదియును నీకు సాధ్యముకాదేని, నీవున్న దగ్గరనే యుండి, ప్రపత్తి మార్గమున ద్వయమంత్రమును గూర్చి (తిరుమంత్రమును గూర్చి) ధ్యానింపుము. ఇవియన్నియును నీకు సాధ్యము కావేని, ఒక వైష్ణవుని సహవాసమున నుండి, నీ యహంభావమును తొలగించుకొనుము.

వైష్ణవులను స్నేహితులుగా జేసికొని జీవింపుము. వైష్ణవుడనగా ఏదోకులమున వైష్ణవుడని భ్రమపడకుము; వైష్ణవుడనగా ఈశ్వరశక్తి సర్వాంతర్యామి అని భావించువాడని నేను ఆదిలో చెప్పియున్నాను గదా! వైష్ణవ భావరహితులను చేరకుము. కేవలము ప్రాపంచిక సుఖములలో బడియుండువారు కనికరింపదగిన వారు మాత్రమే యగుదురు. అట్టి వారు నీకు స్నేహితులు కారు. విరోధులు కారు.

తాంబూలాది పుష్పపరిమళాది ద్రవ్యముల వంటిది భాగవతుల సాంగత్యము. విరోధులను చూచినపుడు ఏ సర్పమునో శార్దూలమునో చూచినట్లుండును కదా! కాని సామాన్య ప్రాపంచిక సుఖములలో పడి

యుండువాడు ఒకరాతితో సమానము. ఆతనిని జూచి నీవు ఆనందించునదియు లేదు; భయపడునదియు లేదు. నీవు కోరదగిన సాంగత్యము భాగవతులదే. వారికృపవలన నీవు ప్రభావితుడ వగుదువు.

నీమనస్సు పవిత్రముగా నున్నయెడల, నీ వాక్యము సత్యముగా నుండును; నీకార్యము పరోపకారార్థముగా పవిత్రముగా నుండును. ఇతరుల లోపముల నెన్నకుము .... తప్పులు లేనివారెవరు? ఇతరుల తప్పుల నెన్నుటకు నీకేమి అర్హత యున్నది?

మంచి తనమనునది యితరులకు సేవజేయుటయే; కావున సత్త్వ గుణమున రజోగుణవంతుడవుగా నుండుము; కర్మఫల సన్న్యాసమును పాటింపుము. లోకకల్యాణార్థము జీవింపవలయునని తెలిసికొన్నవాడే నిజమైన పండితుడు, జ్ఞాని. కర్మసన్న్యాసము కూడదని మరల జ్ఞాపకము జేయుచున్నాను. కర్మఫల సన్న్యాసమున కార్యదీక్ష యందు ఎల్లప్పుడును నిమగ్నుడవుగా నుండుము".

ఈ మాటలు వచించుచు శ్రీరామానుజాచార్యులవారు కన్ను మూసెను; అవతారమును చాలించినాడు; పరమపదమును జేరినాడు. ఈనాటికిని ఇంకెల్లప్పటికిన్నీ భాగవతోత్తముల మనసుల నున్నాడు; మృతజీవుడు; నిత్యుడు.

శ్రీరామానుజుని పాంచభౌతిక శరీరమును శ్రీరంగములోనున్న ఆబాలగోపాలము వచ్చి దర్శించిరి. సర్వకులముల వారు ఒక తండ్రిని పోగొట్టుకున్నట్లయినది. ప్రత్యేకముగా బ్రాహ్మణేతర కులజులు, పంచములనబడువారు పొందిన విచారము వర్ణనాతీతము. బ్రాహ్మణ కులజులు కొందరు, కేవలము ఛాందసులుగా నున్నవారు, పూర్వాచార పరాయణులుగాన, మార్పులను స్వీకరింపనివారై మూఢాచారముల బడి అజ్ఞానమున శ్రీరామానుజుని దివ్యతత్త్వమును అర్థముజేసికొన లేకపోయి యుండవచ్చునుగాని, కులభేదములతో కుములుచూ, కమిలి పోవుచున్న హిందూసంఘము రామానుజుని సేవలను, బోధలను ఎంతయో ప్రశంసిచినది; ఆరాధించినది.

శ్రీరామానుజుడు అంత్యక్రియలు విచిత్రముగా ఉచితరీతిని జరిగినవి. ప్రజలు రామానుజుని దైవముగానే భావించిరి, శ్రీరాముని వలె శ్రీకృష్ణునివలె. దివ్యాలంకృతమైన రంగనాథాలయ స్వామి రథము నందే శ్రీరామానుజుల పాంచభౌతిక కాయమునుంచి, మేళతాళ ములతో, భజనబృందములతో, ఉభయవేదాంత విషయ పఠనముతో, శ్రీరంగపురమున ఏడు ప్రాకారముల మధ్యనున్న యేడు గంభీర రాజమార్గములందు బ్రహ్మోత్సవమును గావించి, కడపట వారి కళేబరమును శ్రీరంగదేవస్థాన ప్రాంగణమున నొకమూల భూగర్భమున శిలాపేటిక యందు శయనింపజేసి, తదుపరి ఆ స్థానమున ఆలయమును నిర్మింపజేసి, మూలవిగ్రహమును ఉత్సవ విగ్రహమును నెలకొల్పిరి. ఈ గౌరవము ఏ దేశమునందుగాని, ఏ మతప్రచారకునకు గాని జరిగియుండ లేదు.

క్రమముగా తరువాత కాలమున రామానుజ విగ్రహ ప్రతిష్ఠాపనము తిరుపతిలోను, కంచివరదుని ఆలయ ప్రాంగణము నను, శ్రీపెరుంబూదూరులోను జరిగెను. దివ్య గోపురములతో గొప్ప దేవాలయము శ్రీపెరంబూదురున వెలసియున్నది; ఇచ్చట విగ్రహ ప్రతిష్ఠ శ్రీరామానుజుల వారు జీవించియున్నపుడే జరిగినదని కొందరందురు.

శ్రీరామానుజుని సిద్ధాంత ప్రభావము వలననే తరువాత మనదేశమున, ముఖ్యముగా ఉత్తరహిందూస్థానమున, అనేక భక్తి ఉద్యమములు వెలసినవి. భక్తిభావమును వెల్లడించుచూ వచ్చిన రామానందుడు, చైతన్యుడు, రామదాసు మొదలగువారు నడపిన ఉద్యమము లన్నియు శ్రీరామానుజుని సిద్ధాంతమయిన భక్తిభావ సోదరత్వమునే చాటినవి. విశిష్టాద్వైత సిద్ధాంతమును శ్రీరామానుజుడు మనోరంజకముగా భక్తులకు నచ్చు విధమున బోధించుట చేత విశిష్టాద్వైత సిద్ధాంతమును రామానుజ మతమనుట జరిగినది.

☆

# 39. రామానుజుని దివ్యసౌరభము

శ్రీరామానుజాచార్యులవారు నూటయిరువది వసంతముల దివ్య పూర్ణజీవితమును గడపినారు. విశిష్టాద్వైత దర్శనమును దేశమంతట ప్రచారము జేసినారు. భక్తితత్వమును ప్రజలకు నచ్చజెప్పినారు. మతము యొక్క పరమార్థము లోకకల్యాణార్థము జీవింప గలుగుటయేనని బోధించి, కృతకృత్యుడయినాడు. రామానుజ మత దివ్యసౌరభము శాశ్వతముగా మనదేశమున నిలిచియున్నది.

శ్రీరామానుజుని వ్యక్తిత్వము అపూర్వమయిన; మత ప్రచారకులలో అద్వితీయమయినది. శ్రీరామానుజుడు ఎత్తైనవాడు, అజానుబాహుడు, సుందర ఆకర్షణీయ శరీర శోభగలట్టివాడు; ఆరోగ్యవంతుడు, వీర్యవంతుడు, బలశాలి; ఎఱ్ఱటియెండలో ఆరుగంటల సేపు పయనించినను, వసంతకాలపు కానుగ చిగురు వలె శోభించెడిది ఆయన ముఖవర్చస్సు. ఆయన అగర్వ ప్రజానాయకుడు; సంఘసంస్కర్త; శాస్త్రీయ దృక్పథముగలట్టివాడు. మానవుడు కర్మఫలత్యాగిగా నుండవలయునని బోధించి, తన ఆదర్శమును జూపిన మహానుభావుడు; మహాత్ముడు.

మహామేధావియైన యామునాచార్యులు, తనకెందరో శిష్యులున్నను, తనకు ఆధ్యాత్మిక వారసుడుగా శ్రీరామానుజుడే విశిష్టాద్వైత మతాధిపతి కావలయునని కోరినాడంటే, అది రామానుజుని యొక్క భౌతిక మానసిక శక్తుల యొక్క అద్వితీయత అని చెప్పవలసినదే. ఆళవందారు కోరికలను ఫలప్రదము జేసినాడు రామానుజుడు. తన విశిష్టాద్వైత దర్శనము ద్వారా మన దేశమత బోధకులకు ఒకజ్యోతిని కలుగజేసినాడు రామానుజుడు.

శ్రీరామానుజుడు గొప్ప చదువరి, పండితుడు, ఆలోచనా కౌశలముగలవాడు. మొదట దేశమునందున్న దర్శనములన్నింటిని తెలిసికున్నాడు. వానికి మూలమైన సంస్కృత గ్రంథములనన్నిటిని చదివినాడు. అద్వైతమత విజ్ఞానఖని అనదగు యాదవప్రకాశుడే

రామానుజుని మేధకు, తర్కశాస్త్ర కౌశలమునకు అచ్చెరువందినాడు. శ్రీరామానుజునకు సర్వశాస్త్రముల యందు అద్వితీయ జ్ఞానమున్నదని చెప్పుటకు వారు రచించిన శ్రీభాష్యమే ప్రత్యక్ష నిదర్శనము. వారు గావించిన ప్రస్థానత్రయ వ్యాఖ్యానములు సుప్రసిద్ధములయినవి.

శ్రీరామానుజుడు విశిష్టాద్వైత సిద్ధాంతము యొక్క ఆధ్యాత్మిక, శాస్త్రీయ, నైతిక, సాంఘిక, భక్తితత్వములను పద్ధతిగా నిర్వచించి, ప్రభోదించినాడు. శ్రీరామానుజుడు అద్వైతమందలి మాయా వాదమును, యాదవప్రకాశుని బ్రహ్మపరిణామ వాదమును, బౌద్ధజైనులు కాలక్రమమున లేవదీసిన ఒక విధమైన నిరీశ్వర వాదమును సమ్మతింపక పోయినను, ఆయన దేనిని కూడా ద్వేషించిన వాడు కాడు. కడపటి దినములలో యాదవప్రకాశుడు తన్ను జేరినపుడు రామానుజుడు అయనను ఎంతో ప్రేమ గౌరవములతో స్వీకరించినాడు గదా!

అన్యమత పండితులను శ్రీరామానుజుడు ఓడించినాడంటే, అందులకు వారి మానసిక విద్యాప్రగతియే కారణము కాదు; వారి అడకువ, ప్రేమతత్త్వము, వారి సహనము ముఖ్య కారణములు. శ్రీరామానుజుని తర్కమున నోడింపదలచిన యజ్ఞమూర్తి, తర్కమునకు దిగకనే రామానుజునకు శిష్యుడైనాడు కదా!

సదుద్దేశములు కార్యరూపము పొందవలయును - అనెడిదే రామానుజుని ప్రబోధము. శ్రీరామానుజునకు ముందు వైష్ణవులున్నను, వారు వేర్వేరు మఠములకు జెంది, వేర్వేరు విధములగా ఆచారముల గలిగియుండిరి. రామానుజుడు వైష్ణవులనందరిని ఏకము జేయగలిగి నాడు; అందరికి భక్తిప్రపత్తులను బోధించినాడు. శ్రీరామానుజుడు వైష్ణవమును ఒక ఉద్యమముగా జేసినాడు; ఇది కులభేద జనిత అసూయలను ద్వేషములను చాలవరకు మాన్పినది. శ్రీరామానుజుని ఉద్యమము సోమరిసన్న్యాసమును నిరసించినది; త్యాగశీలురైన

కర్మయోగులనుగా మారినది భక్తులనబడేవారిని. అన్ని కులములకు సంబంధించిన తన శిష్యులు సోదరభావమున జీవింప నేర్చిరి. పంచమజాతికి జెందిన భక్తుడొకడు భగవన్నామకీర్తనల గానము చేయు చుండుట విని, రామానుజుడు హరిజనవాడలోని వానిసదనమునకు బోయి వానిగానమును ఎంతో భక్తితో విన్నాడు; ఇయ్యది శిష్యులకు ఎంతటి మార్గదర్శకమో ఊహింపదగియున్నది. శ్రీమద్రామానుజుడు శూద్రకులజుడగు ఉరంగావల్లిని ప్రేమతో జూచుటయేగాక, అతనికి అంత్యక్రియలను గూడా జేసినాడు గదా! శ్రీరామానుజుడు కుల భేదముల నిరసించుటకు వారి పైక్రియారూప చర్యలే నిదర్శనములు గదా! శ్రీరామానుజుడు ఇతరుల మనోభావముల నూహింపగల సమర్థుడు. ఎవరిని ఏ విధముగా సంస్కరింపవలయునో తెలిసిన మేధావి, బోధకుడు, దక్షుడు.

తత్త్వత్రయ జ్ఞానమును ప్రతిపాదించిన రామానుజుడు భక్తి భావమును పెంపొందిచుటకై భగవచ్ఛక్తిని త్రిభువన సుందరుడుగా వర్ణించినాడు. ఈ త్రిభువన సుందరుని గుణవిశేషములు సత్య, సుగుణ, సౌందర్యములు.

భగవత్సంశ్లేషమున జీవించుచూ, ఆనంద సముద్రమున నోలలాడు ఆళ్వారుల జీవిత విధానమును, ధ్యేయమును భక్తులకు తెలియజెప్పినాడు రామానుజుడు, తన విశిష్టాద్వైత సిద్ధాంత ప్రచారమునకు రామానుజుడు ఉభయవేదాంతమును తీసికున్నాడు.

పురుషోత్తముడుగానున్న మానవుని దైవము యొక్క అవతారమని విశ్వసించువారు హైందవులు. అందువలన శ్రీరాముని, శ్రీకృష్ణుని భగవదవతారములుగా పరిగణించుట అంగీకరింపబడినది. కాని ఆ పురుషోత్తముల సుగుణ సంపత్తిని ప్రశంసించుచూ, వారితో సంశ్లేషపడి జీవించుట ఆళ్వారుల తత్త్వము. ఇది పరమానంద స్థితిగా వర్ణింప బడినది. ఇందు మూఢభావము లేదు. ఆండాళ్ శ్రీకృష్ణుని ప్రేమించుట యనునది యీ దివ్యానుభూతియే.

శ్రీరామానుజుడెల్లప్పుడు అళ్వారుల రచనలను గానము చేయువాడు. ఈ ద్రావిడ ప్రబంధమును వైష్ణవులెల్లరు పఠించి, అవగాహన జేసికొని, జీవితమున పాటింపవలయునని శ్రీరామానుజుడు బోధించి యున్నాడు.

కులభేదములు హిందూసంఘమును క్షీణపరచినవి. పంచమ కులజుడనబడు తిరుప్పాణ్ అళ్వార్ల (యోగివాహన్) చరిత్రమును తార్కాణముగా జేసికొని వైష్ణవులకు కులభేదములు లేవని శ్రీరామానుజుడు బోధించినాడు. ఇట్టి సంస్కరణమును మనదేశమున మతముద్వారా ప్రచారము జేసినవారిలో శ్రీమద్రామానుజుడు ప్రప్రథముడు. రామానుజుని భక్తి సౌరభమట్టిది. అఖిలమానవ సోదర భావమును ప్రచారము చేయని మతము వాసనలేని పుష్పమువంటిది. సోదరభావము, లోకకల్యాణార్థము సేవ, స్వార్థరాహిత్య భావము, విష్ణు సంశ్లేషభావము (అనగా సుగుణ సంశ్లేషభావము) అనునవి యేకమై శ్రీరామానుజ సిద్ధాంత సౌరభము అయినది.

శ్రీరామానుజ దివ్య సౌరభమును శాశ్వతము జేయుటకు వారి తరువాత వారిశిష్య పరంపర వారియాజ్ఞానుసారముగా, వారేర్పరచిన కార్యక్రమ ప్రకారముగా కృషిజేసిరి.

శ్రీరామానుజుడు పరమపదించిన నాటికే వీరికి శరణాగతులై వీరి విశిష్టాద్వైత సిద్ధాంత సౌరభమును వ్యాప్తిజేయుటకు సంసిద్ధులై, కార్యాచరణులై యున్నట్టివారు ఏకాంగులు పండ్రెండు వేలమంది, సింహాసనస్థులగు ఆచార్య పురుషులు డెబ్బది నలుగురు, జీయ్యంగార్లు ఏడువందలమంది, చాత్తినచాత్తాద శ్రీ వైష్ణవులును, చాత్తిన చాత్తాద స్త్రీలును, చాత్తిన చాత్తాద కొత్తియమ్మంగార్లనువారును, తిరునామ ధారులును అసంఖ్యాకములుగా ఉండిరి.

వీరిలో అంతరంగిక శిష్యులైనవారు, వారి రచనాసేవలచే దిగ్దంతులైనవారు చరిత్రకెక్కి యున్నారు - కూరత్తాళ్వాన్, ముదలియాండాన్, అనంతాళ్వాన్, కందాడైయణ్ణాన్, ఎంబార్, వడుగనంబి, తిరువరంగత్త

ముదనార్, తిరుక్కురుగైప్పిరాన్ పిళ్ళాన్, అరుళాళప్పెరుమాళెంబెరు మానార్, తిరుమలై నల్లాన్, పిళ్లైత్తిరునర యూర్దైయర్, పల్లెకొఱుత్తి అమ్మాళ్, పిళ్లైయురంగావిల్లి దాసర్, అత్తుళాయమ్మ మొదలగువారు. ఇట్లు సకలమైనట్టివారికిని స్వరూపోపాయ పురషార్థములను కృపజేసి నియమించుచు, శ్రీరామానుజుడు ఉడైయవరలై శ్రీరంగక్షేత్రమున నూటయిరువది తిరునక్షత్రములు (ఏండ్లు) వేంచేసియుండిరి.

శ్రీరామానుజ దివ్యసౌరభము వారికిగల వివిధ తిరునామములలో వెలసియున్నది. పరోపకార జీవియయి, సేవాతత్పరుడయి లక్ష్మణ మునియని పిలువబడెను. లక్ష్మణుడు రామానుజుడు గావున (శ్రీరామునను నరించి పుట్టినవాడు) శ్రీరామానుజుడు సార్థక నామధేయుడైనాడు. అనంత సరోవరతీరమున కంచివరదరాజస్వామి సన్నిధిన సన్న్యాసాశ్రమమును పరిగ్రహించి, యతిరాజ (యతీంద్ర) తిరునామమును బొందిరి. ఇహపర మోక్షమును గల్పించువారగుటచే ఉడైయవర్ బిరుదాంకితులైరి. శ్రీరామానుజుని మోక్షసన్న్యాస యోగము నకు ఆశ్చర్య సంభ్రమముల వెలువరించుచూ, తిరుక్కోట్టియూర్ నంబి రామానుజుని ఎంబెరుమానార్ అని పిలిచెను. శ్రీ భాష్యరచయితగావున భాష్యకార్లు అను తిరునామమును బొందిరి. కడకు వీరి ప్రతిభచే విశిష్టాద్వైత సిద్ధాంతమునకు రామానుజ మతము, రామానుజ సిద్ధాంతము అను నామములు సంక్రమించినవి. రామానుజమత మనుపేర ఎక్కువ ప్రజామోదమును బొందినది.

విశిష్టాద్వైత సిద్ధాంత పీఠమునకు శ్రీరామానుజుని వారసుడుగా వచ్చిన పరాశరభట్టార్ విశిష్టాద్వైత సిద్ధాంత రచనలకు, శ్రీభాష్యమునకు ఎక్కువ ప్రచారమును కల్పించెను. వీరి శిష్యులు పిళ్ళన్, విష్ణుచిత్తుడను వారలు ఈ మతసిద్ధాంత వ్యాఖ్యానములకు బహుళ ప్రచారమును గావించిరి. పరాశరుని శిష్యుడు నంజీయరు తిరువాయ్మొళికి తొమ్మిదివేల గ్రంథ పరిమితిలో భాష్యమును రచించెను. నంజీయరు శిష్యుడయిన పెరియవాకన్ పిళ్లై ద్రావిడ దివ్యప్రబంధమునకు ఇరువది

నాల్గు వేల గ్రంథముల వ్యాఖ్యానమును రచించెను. వడక్కు తిరువీది పిళ్లై తిరువాయ్‌మొళికి "ఈడు" అను వ్యాఖ్యను రచించెను. తరువాత పిళ్లైలోకాచార్యుడు వైష్ణవములోని ఉభయవేదాంతములలో తెంగలై శాఖకు ఎక్కువ ప్రచారమిచ్చెను. రామానుజుని తరువాత వచ్చిన ఆచార్యులలో, అనగా పిళ్లైలోకాచార్యుని తరువాత, వెలసిన ఆచార్యులలో వేదాంతదేశికులు చాలగొప్పవాడు. వీరు ఉభయవేదాంత సారముల గ్రహించిన వారయ్యు వడగలైశాఖకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చిరి. అనగా పిళ్లైలోకాచార్యుడు ద్రావిడ వేదమునకు ఎక్కువ ప్రాధాన్యమివ్వగా, వేదాంత దేశికుడు సంస్కృతమునకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చెను. శ్రీరామానుజుని ఆశీర్వాద బలమున వారి తరువాత అనేక మేధావు లవతరించి, వారి దివ్యజ్ఞానమును వారిదివ్యాజ్ఞ ప్రకారము ప్రచారము గావించుటే రామానుజు మతసౌరభము శాశ్వతముగా నిలిచియున్నది.

☆

# 40. సింహావలోకనము

మతము అనునది సత్యమార్గము. మతప్రవక్త చేతనులకు సత్యమార్గమును జూపి ప్రపంచమునుండి నిష్క్రమించును.

మతము విశ్వశాంతికి, విశ్వసౌభాగ్యమునకు, విశ్వానందమునకు సోపానము. మతము చేతనుని యొక్క ప్రాపంచిక అశాశ్వతమును దెల్పుచూ, విశ్వశాంతికి స్వార్థరాహిత్య భావము సేవాభావము తోడ్పడునని తెల్పును.

కాలక్రమమున ఈ దివ్య మార్గ మడుగంటి ఆచారములకు సంబంధించిన అనేకాల్ప విషయములు ప్రాముఖ్యము జెంది, కడకు మానవసంఘమున మూఢత్వము, మూఢాచారములు, అనైక్యము, స్వార్థ అసూయ భావములు ఏపుగా నెదిగి సంఘము కలుషిత మగుచున్నది.

ఈ కారణముననే కాలగతిని అప్పుడప్పుడు అక్కడక్కడ ప్రవక్తలు అవతరించి, మానవులకు ఋజుమార్గములను జూపుచుందురు.

మతము లన్నియు ఆది స్వరూపమున ఒక్క సత్యమార్గమునే సూచించును. భిన్నమతస్థులు కాలక్రమమున భిన్నాభిప్రాయముల వెల్లడించుట వలననే తరువాత కాలమున మతములకు పరస్పర విరోధ భావముల నంటగట్టుట తటస్థించుచున్నది.

స్వార్థరాహిత్య జీవితమునకు, సేవాభావ జీవితమునకు ప్రతిమతము ప్రారంభమున ప్రాధాన్యమునివ్వగా, కాలక్రమమున మతాధిపతులు సైతము ఈ ముఖ్యాంశమును విస్మరించియో, మరుగు పరచియో, అల్పమయిన అన్య విషయములను వారి పాండిత్య మూలమున ప్రాముఖ్యమున దెచ్చుచున్నారు.

స్వార్థరాహిత్య భావము, సేవాతత్పరత అనునవి జీవిత వృక్షమునకు ఎరువు నీరు వంటివి. ఇతరములైన జాతి, మత, ఆచార విషయము లెట్లున్నను మానవుడు స్వార్థరాహిత్యుడై లోకకల్యాణార్థము

జీవింపవలయుననెడి ప్రబోధము ప్రాముఖ్యముగా పైకి రావలయును. కాని దురదృష్టవశాత్తు ఈ సత్యమార్గము క్రిందబడి పోవుచున్నది. దీనికి కారణము మానవుని సహజస్వార్థతత్త్వము.

భారతదేశమున నాగరికతా ప్రారంభమున క్రోడీకరింపబడిన వేదాంత విషయములన్నియు (ఉపనిషత్తులు) సత్యమార్గమునే జూపెను. కాలక్రమమున స్వార్థపరులు వేదోపనిషత్ విషయములను వారి రచనలచే వ్యాఖ్యానములచే విస్తరింపజేసి, వేదవిహితమగు లోక కల్యాణ కర్మకాండను పెడమార్గము పట్టించి, హింసకాండగా మార్చి, మూఢులగు ప్రజలను మూఢమార్గములకు నడపుటచే అనాగరికులు, అడవి జాతివారు, పల్లెప్రజలు, తక్కువ కులములవారు చేయు జాతరలు, నైవేద్యములు మొదలు బ్రాహ్మణ యాజ్ఞికుల ఆధిపత్యమున రాజులచే గావింపబడు యజ్ఞయాగాదులు మానవ హింసతో జంతుహింసతో కూడినవాయెను. మానవబలులను తగ్గించు ప్రయత్నమున ఇంకను జంతుబలులు జాస్తిఅయెను. ప్రసాదముల క్రింద మాంసాహారముల జాస్తి అయ్యెను. అందువలన బుద్ధదేవుడు అహింసయే పరమధర్మమని బోధించి, సత్యమార్గమును జూపెను. మానవుడు తనకర్మ ఫలమును అనుభవించునుగాన, అతడు మంచి కార్యముల జేయుటయే తనవిధిగా బెట్టుకొనవలయునని బుద్ధుడు బోధించెను. ఇతరులకు హింసను గల్గింపని స్వధర్మ నిర్వహణమును గావించుచూ, మానవుడు జీవకారుణ్యముతో జీవితయాత్ర సాగింప వలయునని బుద్ధుడు బోధించెను.

కాలక్రమమున బుద్ధుడు జూపిన ఋజుమార్గము మరగున బడినది. మూఢనాస్తికులు (అనగా శాస్త్రీయముగా నాస్తికవాదము) ప్రబలినది; విగ్రహారాధన, మూఢాచారములు యజ్ఞయాగాదులను నిరసించుచూ ప్రబలిన చార్వాకమతము రానురాను అతినాస్తికముగా తయారై సృష్టి స్థితి లయముల కారణ విశేషముల విచారమును వెనుకకు నెట్టివేసినది. ఆదిలో చార్వాకము అట్టిదిగాదు - దాని శాస్త్రీయ దృక్పథమే మారిపోయినది.

ఇట్టి పరిస్థితులలో శంకరాచార్యుల వారు "తత్త్వమసి" అను బ్రహ్మసూత్రమును స్వీకరించి, అద్వైతమత ప్రబోధమును గావించెను. **తత్** = ఆ పరబ్రహ్మవు, త్వమ్ + అసి =నీవే అని భావము. ఆ పరబ్రహ్మవే నీవు. నీవు అనగా కేవలము శరీరమని భావింపకుము. నీ శరీరస్థమగు శక్తిని, ఆత్మను, తెలిసికొని నీ పశుత్వమును వదలుము - అని అద్వైతమతము చేతనులను హెచ్చరించుచున్నది.

కాని యిట్టి మహనీయుని సిద్ధాంతమునకు గూడా రెండు శతాబ్దుల కాలములోనే అపార్థములు సృష్టింపబడినవి; ఇట్టి దుర్మార్గములకు కారణములు రెండు - మానవుని అజ్ఞానము, తజ్జనిత స్వార్థభావము.

"అహం బ్రహ్మాస్మి" - నేను బ్రహ్మమను - అని అనుకొనుచూ, అపార్థములను దీయు గర్వితమతులైన పండితులు, చదువరులు, శాస్త్రజ్ఞులమని చెప్పుకొనువారు. అగ్రకులజులమని భావించు కొనువారు, అహంకార గర్వపీడితులై, సామాన్య ప్రజల అజ్ఞానమును దోపిడీ జేయుటకై బయలుదేరిరి. వీరిని జూచి యితరులు కొందరు "మనమే పరమ బ్రహ్మలము గావున మనమేమి జేసినను మనకు పాప మంటదు" అను మూఢభావమున ప్రవర్తించుటచే కుల, వర్ణ, జ్ఞానాగ్రజులమని భావించువారును పశుత్వమున ప్రవర్తింప సాగిరి.

ఇట్టి దుస్థితి నుండి మానవుల నుద్ధరించుటకు శ్రీరామానుజా చార్యులవారు (క్రీ.శ. 1017-1137) ఎంతయో కృషిచేసిరి.

శ్రీమద్రామానుజునకు పూర్వము పెక్కు శతాబ్దాలకు పూర్వము తమిళదేశమున ద్వాదశాళ్వారులు అవతరించి, వేదాంత సారమును తమిళ పాశురములు, కీర్తనల ద్వారా గానముచేసి, భక్తిప్రపత్తి మార్గముల మానవావళికి జూపిరి. పదియవ శతాబ్దిలో శ్రీనాథమునుల వారును, యామునాచార్యులవారును ఆళ్వారుల రచనలను క్రోడీకరించి, భక్తి ప్రపత్తి మార్గముల పునరుద్ధరించుటకు బూనుకొనిరి. ఈ వైష్ణవ సాంప్రదాయమునకు (అనగా సర్వాంతర్యామి యగు వైష్ణవశక్తి

శరీరమునందును, శరీరస్థమగు జీవుని యందును ఉన్నదనియు అను జ్ఞానమున చేతనుడు వైష్ణవశక్తికి శరణాగతియై వైష్ణవ సంశ్లేషమున ఆనందమయుడై లోకకల్యాణార్థమై జీవించుట అను సాంప్రదాయము, సద్భావము) శాశ్వత రూపము నొసంగిన శ్రీరామానుజుడు మునిత్రయ మనబడు వారిలో మూడవవాడు; ముందువారు యామునాచార్యుడు, వారి పితామహుడు నాథముని.

శంకరాచార్యులవారి అద్వైతసిద్ధాంతము మఠాధిపతులను, పండితులను, శాస్త్రజ్ఞులమనుకొను అగ్రవర్ణములవారిని అహంకార గర్వాంధులుగా తయారుజేయగా, క్రమక్రమముగా సామాన్య ప్రజలు వారి దివ్య సిద్ధాంతమును అనగా అద్వైత సిద్ధాంతమును అవగాహన జేసికొనలేకపోయిరి. ఆ పరబ్రహ్మాన్వేషణమున "నేతి - నేతి" (న+ఇతి= నేతి - ఇదికాదు, ఇది కాదు) అని నిర్వచింపబడుటచే ఆ నిర్గుణ పరబ్రహ్మను (అనగా అనిర్వచనీయ ఈశ్వరశక్తిని) ఊహించుకొనుట దురూహ్యమయ్యెను.

శ్రీరామానుజుడు తన తత్త్వత్రయ జ్ఞాన ప్రతిపాదన ద్వారా, బోధించిన విశిష్టాద్వైత సిద్ధాంతము "ఏక మే వాద్వితీయం" అను బ్రహ్మ సూత్రము ననుసరించియున్నది. ఏకమేవ+అద్వితీయమ్ - అని చెప్పబడు ఆ పరబ్రహ్మము యొక్క సహస్రగుణ విశేషములను శ్రీమన్నారాయణమూర్తి యందు సంకేత పరుపబడియుండుటచే, భగవచ్ఛక్తి యొక్క అనంతకల్యాణ గుణపరంపరలో భక్తుడు సంశ్లేషపడి, ఆనందించుటకు వలనుపడుచున్నది. ఇట్టి తత్వమున చేతనుడు వైష్ణవ శక్తికి శరణాగతియై, ప్రపన్నుడై, ఆనందమున, స్వార్థరాహిత్య భావమున లోకకల్యాణార్థమై తన జీవితమును అంకితము గావించును.

విశిష్టాద్వైత సిద్ధాంతము తత్త్వత్రయ జ్ఞానమును సూచించును గాన శాస్త్రీయమైనది; భక్తుని యొక్క సంశ్లేష భావమును వృద్ధిజేసి ఆనందమయుని జేయును గాన ఈ సిద్ధాంతము మానసిక ఆనందోద్రేకమును ప్రోత్సహించునదియై యున్నది; ఈ సిద్ధాంతము

పరశక్తి యొక్క అనంత కల్యాణగుణ విశేషముల జూపునుగాన చేతనుడు వైష్ణవశక్తికి శరణాగతియై, తోటిమానవుల యెడ సోదర భావమును జూపగలుగును గాన ఈ సిద్ధాంతము నైరాశ్యమును సన్న్యాసమును ప్రబోధింపక, ఆస్తికత్వమును, నైతికమును, తృప్తిని, ఆనందమును, గార్హస్థ్యమును, పరోపకార అధితి సత్కార భావములను ప్రబోధించును. (క్లుప్తముగా నొక మాటలో చెప్పవలెనన్న నైతిక జీవితమును పెంపొందించును) - ఈ సిద్ధాంతము మానవుని సంఘమున ఉపయుక్తమైన అంగముగా తయారు జేయును. ఈ సిద్ధాంతము ఈ ఆధ్యాత్మిక, మానసిక, నైతిక, సాంఘిక విలువలను బట్టి ప్రాముఖ్యమును బడసినది.

శ్రీరామానుజుడు ప్రత్యేకించి యీ సిద్ధాంతమును ప్రచారము చేయుటలో మానవుడు కుల, వర్ణ భాషాభేదముల పాటింపక విశ్వమానవ సోదరత్వమును బోధించెను గాన, ఈ సిద్ధాంతము విశ్వసిద్ధాంతము; దేశ కాలకులాతీతామైనది.

ఇదియే రామానుజ మత దివ్యసౌరభము.

## 41. పరిసమాప్తి

పరిసమాప్తిగా శ్రీమద్రామానుజాచార్యుల వారి ఘనత, వారి విశిష్టాద్వైత సిద్ధాంత సౌరభముల గూర్చి భాగవతోత్తములు రచించిన దివ్య విషయములను, మంగళాశాసనములను ఒకసారి స్మరింతము గాక!

శ్లో॥ యథావతారా న్మథురా మురారే ।
రామస్య సాకేత పురీ చ యద్వత్ ।
తథా యతీంద్రస్య కృపాశ్రయస్య ।
పుణ్యోత్తరా భూతపురీ బభూవ ॥

**తాత్పర్యము:**

శ్రీరామ, శ్రీకృష్ణ అవతారములచే అయోధ్య, మధుర పట్టణములు పుణ్యవంతములైనట్లు, యతిరాజయిన శ్రీమద్రామానుజాచార్యులవారు జన్మించుటచే శ్రీపెరుంబూదూరు పుణ్యతమమైనది.

శ్రీరామానుజుని తిరునక్షత్ర తనియలుగా చెప్పబడిన రెండు శ్లోకములు ఇవి :

శ్లో॥ మేషార్ద్రా సంభవం విష్ణోర్దర్శనస్థాపనోత్సుకమ్ ।
తుండీర మండలే శేషమూర్తిం రామానుజం భజే ॥

శ్లో॥ కల్యబ్దే దివ్యకుంభే బుధజన విదితే వత్సరే పింగళాఖ్యే ।
చైత్రేమాసే గతే చిత్రియుత దశదినే దీప్యమానే హిమాంశౌ ।
పంచమ్యార్ద్రాత సమేతే సురగురు దివసే కర్కటాఖ్యేచ లగ్నే।
శ్రీమద్రామానుజార్య స్సమజని నిగమాన్తార్థ సంరక్షణార్థం॥

ఈ తిరునక్షత్రములను బట్టి శ్రీరామానుజుని జన్మదినోత్సవమును ప్రతి సంవత్సరము దేశమంతటను, ప్రత్యేకముగా వైష్ణవ దేవాలయము లందు, వైష్ణవ విశిష్టాద్వైత మఠములందు, రామానుజ మఠములందు,

రామానుజ కూటములందు, వైభవోపేతముగా జరుపుకొనుచున్నారు. వారి సిద్ధాంతమును, సేవలను స్మరించుకొని జీవితముల ప్రభావితము జేసికొనుట మనకు యుక్తమైనట్టిది.

శ్రీరామానుజుడు సర్వులహితము గోరినవాడు, దయాళువు:

శ్లో॥ ఏకైక పూరుష సురక్షిత వంశరీత్యా ।
గుప్తా ప్రపత్తిపదవీ పురుషైః పురాణైః ।
రామానుజస్తు పరయా దయయా దయాళుః ।
సీమా మిమా మతియయౌ జగతాం హితాయ ॥

తాత్పర్యము:

పూర్వులచే గూఢముగా నుండబడిన యీ ప్రపత్తి యోగమును, సర్వులయొక్క హితమును గోరి, దయాళువయిన శ్రీరామానుజుడు, సర్వులకును తేటతెల్లమగునట్లు ప్రబోధించినాడు.

శ్రీరామానుజుని యొక్క విశిష్టతను కూరత్తాళ్వాన్‌చే రచింపబడిన యీ క్రింది శ్లోకద్వయము వెల్లడించును :

శ్లో॥ యోనిత్యమచ్యుత పదాంబుజ యుగ్మరుక్మ ।
వ్యామోహత స్తదితరాణి తృణాయ మేనే ।
అస్మద్గురో ర్భగవతోస్య దయైకసింధో ।
రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే ॥

తాత్పర్యము :

ఏ శ్రీరామానుజుడు, ఎల్లవేళలయందును 'అచ్యుతుడైన సర్వేశ్వరుని పాదపద్మములనెడి సువర్ణమునందే అత్యధిక మోహము చేత, ఇతర సర్వవిషయములను తృణప్రాయముగా దలంచెనో, అట్టి మన ఆచార్యుడును, భగవానుడును, దయాసముద్రుడును అయిన రామానుజుని యొక్క పాదములను రక్షకముగా నాశ్రయించుచున్నాను

శ్లో ॥ లక్ష్మీనాథ సమారంభాం - నాథయామున మధ్యమామ్ ।
అస్మదాచార్య పర్యంతాం - వందే గురుపరంపరామ్ ॥

**తాత్పర్యము :**

తిరుమంత్ర ద్వయమును సాధించిన ప్రథమాచార్యుడైన గీతాచార్యుడు శ్రీకృష్ణుని ప్రథమముననను, శ్రీనాథముని యామునాచార్యులు మధ్యమమున గలిగి, యిప్పటి మన ఆచార్యులయిన శ్రీరామానుజుని వరకును వ్యాపించియున్న గురుపరంపరకు ప్రణమిల్లుచున్నాను.

పెరియజీయరు అనబడు మణవాళమామునులు శ్రీరామానుజునకు, వారి యాజ్ఞకును గావించిన మంగళాశాసనమును గమనింపుడు:

శ్లో॥ సర్వదేశ దశాకాలే ష్వవ్యాహత పరాక్రమ ।
రామానుజార్య దివ్యాజ్ఞా వర్ధతామభివర్ధతామ్ ॥

**తాత్పర్యము :**

శ్రీమద్రామానుజాచార్యుల వారి దివ్యాజ్ఞ ఆటంకములేని పరాక్రమము గలదై సర్వదేశములందును, సర్వకాలములందును అత్యంతము అభివృద్ధిని జెందుగాక!

పరమభాగవతోత్తముడును, మణవాళమామునుల సమకాలికుడును అయిన కందాడైయణ్ణన్ ఇట్లు శ్రీరామానుజార్య దివ్యాజ్ఞకు మంగళాశాసనము పలికియున్నాడు.

శ్లో॥ రామానుజార్య దివ్యాజ్ఞా ప్రతివాసర ముజ్వలా ।
దిగంత వ్యాపినీ భూయాత్ సా హి లోక హితైషిణీ ॥

**తాత్పర్యము :**

ఈ లోకము యొక్క క్షేమమును గోరునట్టి శ్రీరామానుజాచార్యుల వారి యొక్క దివ్యాజ్ఞ అనుదినమును ప్రకాశించునదియై, లోకమంతటను తప్పక వ్యాపించుగాక !!

శ్రీరామానుజ దివ్య వైభవము సమాప్తము.

ఓం

**శాంతిః శాంతిః శాంతిః**